విషయసూచిక

	పుట.
ప్రథమ స్కంధము	
తిరుపతిశాస్త్రి వంశము ...	2
వేంకటశాస్త్రి వంశము ...	3
గ్రంథావతారిక	11
పురాణ సంఖ్యానిరూపణము ...	15
పురాణ సంఖ్యాకథనము ...	17
వ్యాసుండు తపంబొనర్చుట ...	22
విష్ణువు దేవీమహత్త్వంబు చెప్పుట	26
హయగ్రీవావతారకథనము ...	28
మధుకైటభోత్పత్తి ...	37
బ్రహ్మ యోగనిద్రను స్తుతించుట	41
శక్తిస్వరూప కథనము ...	43
మధుకైటభ యుద్ధము ...	47
వ్యాసునకు [illegible]	54
శుకోత్పత్తి	57
పురూరవశ్చరిత్ర	68
బుధోత్పత్తి	80
శుకుండు సంసారమును నిందించుట	88
దేవీభాగవతావతరణము ...	94
శుకుండు మిథిలానగరమ్మున కరుగుట	100
శుకజనక సంవాదము ...	107
ధృతరాష్ట్రాద్యుత్పత్తి ...	121
ద్వితీయ స్కంధము	
వ్యాసోత్పత్తి	133
శంతనూపాఖ్యానము ...	141
భీష్మోదయము	149
శంతనుండు సత్యవతిం బెండ్లియాడుట	156
[illegible]రాదుల జననము ...	166
పరీక్షిత్తు పుట్టుట	172
ధృతరాష్ట్రాదుల మరణము	179
ప్రమద్వరా వివాహము ...	182
జనమేజయునకు రాజ్యప్రాప్తి	193
తృతీయ స్కంధము	
బ్రహ్మాదిదేవతలు భువనేశ్వరిం గాంచుట	212
హరిహరబ్రహ్మలు భువనేశ్వరిని నుతించుట	219
బ్రహ్మాదులకు దేవి తత్త్వరూపం బుపదేశించుట ...	228
బ్రహ్మాండోత్పత్తి... ...	234
సత్త్వాది గుణస్వరూపము ...	237
సత్యవ్రతోపాఖ్యానము ...	245
దేవీయజ్ఞవిధానము ...	255
ధ్రువసంధ్యుపాఖ్యానము ...	264
యుధాజిద్వీరసేనుల యుద్ధము	268
యుధాజిత్తు భరద్వాజునికడ కేగుట	275
సుదర్శనునకు కామబీజప్రాప్తి	283
సుదర్శనుండు స్వయంవరమున కేగుట	297
సుబాహుండు చింతించుట ...	304
శశికళా వివాహము ...	309
సుదర్శన యుధాజిత్తుల యుద్ధము	314
సుదర్శనుం డయోధ్య కరుగుట	322
నవరాత్రిపూజా విధానము ...	326
నవరాత్రి మహాత్మ్యము ...	334
శ్రీరామచరిత్ర	338
చతుర్థ స్కంధము	
వ్యాసుండు కర్మనిధము తెలుపుట	368
సంసార విముక్త్యుపాయము	372
నరనారాయణులు తపంబొనర్చుట	376

	పుట.
వసంత ప్రవేశము	380
తత్త్వవిచారము	387
ప్రహ్లాద నరనారాయణ యుద్ధము	394
భృగువు హరిని శపించుట ...	403
శుక్రుండు దైత్యులకడకు వచ్చుట	411
సురలు దేవిని స్తుతించుట ...	417
విష్ణుని యవతారములు ...	421
కృష్ణావతారకారణము ...	427
దేవీస్తుతి	433
దేవకిసుతకథ	445
శ్రీకృష్ణోదయము	453
శ్రీకృష్ణలీలలు	458
శ్రీరామాదులు కించిన్నష్టులనుట	464
పంచమ స్కంధము	
శివకేశవ తారతమ్యము ...	473
మహిషాసురోత్పత్తి ...	479
ఇంద్రుండు విమర్శించుట ...	487
దేవదానవయుద్ధము ...	494
దేవతలు పాఱిపోవుట ...	499
దేవీప్రాదుర్భావము ...	505
దేవీమహిషదూత సంవాదము ...	512
మహిషుండు దేవికడకుఁ దామ్రుని బంపుట	517
తామ్రుండు దేవితో సంభాషించుట	521
బాష్కల దుర్ముఖులు దేవితోఁ బోరుట	526
చిక్షురతామ్రుల యుద్ధము ...	530
అసిలోమబిడాలాదు లనికి వెడలుట	535
దేవీమహిష సంవాదము ...	539
మందోదరీ వృత్తాంతము ...	544
దేవీమహిషాసుర యుద్ధము ...	552
ఇంద్రాదులు దేవిని నుతించుట ...	556
దేవ్యంతర్ధానోత్తర వృత్తాంతము ...	562

	పుట.
ఇంద్రాదులు హిమాలయమున [illegible]	569
దేవి శుంభనిశుంభుల [illegible]	576
కాళిక [illegible] యుద్ధము [illegible] ...	583
చండముండాసురుల యుద్ధము...	590
రక్తబీజ యుద్ధము	600
నిశుంభ యుద్ధము... ...	611
సురథోపాఖ్యానము ...	621
భువనసుందరీ మాహాత్మ్యము ...	627
షష్ఠ స్కంధము	
విశ్వరూపుడు [illegible] సల్పుట	634
వృత్రాసురోత్పత్తి ...	644
వృత్రుండు ఇంద్రుని [illegible] ...	652
మునులు వృత్రేంద్రులకు సంధి గొల్పుట	660
వృత్రుండు చచ్చుట ...	664
నహుషుండు స్వర్గము నేలుట...	669
శచి యింద్రుని [illegible] ...	676
ఇంద్రుడు స్వర్గము [illegible]	681
కర్మగతి భేదములు	682
యుగధర్మములు	688
తీర్థభేదములు	691
ఆడీబక యుద్ధము	694
వసిష్ఠునికి [illegible]ప్రాప్తి ...	701
నిమికి దేహాంతరప్రాప్తి ...	707
హైహయకృత [illegible]కథ ...	712
ఔర్వోత్పత్తి	717
హైహయ వంశము ...	720
ఏకవీర జననము	729
ఏకావళీ వృత్తాంతము ...	736
వ్యాసుని పశ్చాత్తాపము ...	749
నారదవివాహము ...	757
నారదుండు స్త్రీయై సంతతిం గనుట	768

శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ

దేవీ భాగవతము

శా. శ్రీయు౯ బార్వతియు౯ సరస్వతియు స్వశ్రీలేశసంజాత లా
[illegible]గాత్రల్ హరిరుద్రనీరజభవాద్యాదిత్యసంఘమ్ము లే
మాయాతీతకు నే జగజ్జనని కే మాతృస్వరూపాఢ్య కే
శ్రేయఃప్రాభవ కట్టి శక్తి సతి భక్తిన్ గొల్తు మిష్టాప్తికి౯. ౧

వ. ఇ[illegible], ౨

ఉ. అంబకు మ్రొక్కి మీఁద జలజాంబకుల౯ గొనియాడి యంత హే
రంబుని సన్నుతించి గుణరాసుల మూర్తుల భార్యల౯ గృపా
లంబితచిత్తుల౯ దగఁదలఁచి యిహమ్ముఁ బరమ్ము నెంచి వం
శంబు తరింపఁజేయ ననిశంబు మనంబునఁ గాంచి యంతట౯. ౩

వ. అష్టాదశమహాపురాణమ్ముల యందుఁ బంచమం బగు దేవీ భాగవతంబు దెనిఁగింప నారంభించి శిష్టాచారంబగు కతన మామా వంశమ్ము లొక్కింత చెప్పుచు నాబాల్యప్రవర్తమానం బగు నస్మదీయోదంతంబు గొండొక విస్తరించెదము. ౪

తిరుపతిశాస్త్రి వంశము

సీ. సతతాగ్నిహోత్రదీక్షాశాలి ధన్యుఁ డా
తర్వేది యెవని ముత్తాతతాత
యెవని తాతకుఁ దాత యీశేషు విద్యలఁ
బాటవమ్మున మించు పానకాలు
చదువుమైఁ దండ్రితో సముఁడు వేంకటజోగి
తతకీర్తి యెవ్వాని తాతతండ్రి
సాంగవేదాధ్యేత యనఘచర్యుండు సుం
దరరాముఁ డెవ్వాని తండ్రి తండ్రి

గీ. సర్వకర్మస్వతంత్రుండు శాస్త్రవేత్త
యనఘుఁడు త్రియామయుఁడు వేంకటావధాని
యెవనిజనకుండు శేషమ యెవని తల్లి
మూగు రన్న లెవనికిఁ దమ్ముఁ డొకండు. ౫

సీ. హరితసగోత్రంబు యాజుషశాఖ ది
వాకరవంశ మెవ్వాని కలరు
నుప్పులూర్యన్వవాయుఁడు రామజోగి సి
ద్ధాంతివర్యుండు మాతామహుండు
జనకుండు శంకరశాస్త్రి సుబ్బమ తల్లి
సూర్యప్రకాశుండు సోదరుండు

గాఁ గలసాధ్వి వేంకటలక్ష్మి యనఘ చా
వలివంశజాత యెవ్వానితరుణి

గీ. గౌతమీమండలాంతరకలిత మెండ
గండియను గ్రామ మెవ్వాని కాఁపురమ్ము
నతఁడ వెలనాఁటివాఁడను వితతయశుఁడఁ
బేరు తిరుపతి పండితులార ! నాకు * ౬

వేంకటశాస్త్రి వంశము

శా. భూమిన్ బ్రాహ్మణశాఖలం దొకటియై పొల్పొందు నెంతేని నా
రామ ద్రావిడశాఖ, దానఁ గవితారంభప్రియంభావుకం
బై మా వంశము వొల్చు యాజుషసుశాఖాంతర్గతంబై సదా
రామంబై తెగబెంపులేక తగు భారద్వాజగోత్రమ్మునన్. ౭

గీ. అందుఁ బెక్కు మహామహు లవతరించి
పేరు గాంచిరి గుణరత్నపేటులనఁగఁ
దనరి రవ్వారిలోన ముత్తాత లగుచుఁ
గామయాన్నయనరసయ ఘనులు నాకు. ౮

---

*పాఠాంతరము.

సీ. హరిదశ్వపూజాపరాయణత్వప్రసం ♦ గము వాఁడు తండ్రి వేంకటవధాని
అన్న మెన్నం డేరికైన లేదనని యు ♦ త్తమురాలు తల్లి శేషమ సుసాధ్వి
ఆజన్మధర్మవిద్యధ్యాపకత్వ నిం ♦ పగువాఁడు గురువు బ్రహ్మయ్యశాస్త్రి
గోచి పెట్టకమున్న కోమలకవిత చె ♦ ప్పినవాఁడు సహపాఠి వేంకటకవి

తే. గీ. లలితగుణనిధి వేంకటలక్ష్మిపత్ని
కలితకవితావిలాసిని వలపుసాని
యుండు గ్రామంబు జల్లిలో నెండగండి
పేరు తిరుపతి పండితులాగ! నాకు ॥

వ. గౌతమీమండలమ్మునం దుల్యాతటమునం దనరు కడియ మ్మను గ్రామమ్మున వసించు మూర్తిత్రయమ్మునుం బోని య మ్మువ్వ రందు, ౯

సీ. పెద్దకవీంద్రుఁడై పేరుచెందినవాఁడు
పిన్నముత్తాత నరస్నన్నగారు
ప్రీతి లేని సంపత్తిఁ బరిఢవిల్లినవాఁడు
తాత వెంకన్న విఖ్యాతికరుఁడు
కామయమనుమఁడు రామాంబకొమరుండు
తండ్రి కామయ్య సత్య నిరతుండు
తదనుగుణప్రవర్తన గల్గి వర్తించు
సాధ్వి చంద్రమ్మ మజ్జనని యేను

గీ. వేంకటేశుండ లక్ష్మి నా వెలఁది కులవి
ధమ్ములెల్లను బిన్నముత్తాత తనదు
గ్రంథముల విస్తరించె నాకన్న నింటి
పే రెఱుఁగఁ జెప్పెదను జెళ్ళపిళ్ళవారు. ౧౦

మ. అనఘుండై మదనాభిరామనృపకన్యాచిత్రచారిత్రమున్
జనసుత్యంబగు వేంకటేశ్వరవిలాసంబుఁ దగఁ జెప్పి రా
మున కర్పించి పరంబు గన్నమహితుఁ మ్మమ్మాటికిం గొల్తు నా
పినముత్తాత నగణ్యపుణ్యవిభవాబ్ధి న్నారసింహాఖ్యునిఁ. ౧౧

వ. తిరుపతివేంకటేశ్వరుల మైన యీ మేము బాల్యమ్మునన పరదేవతా నిరుపాధికకరుణాభరణకారణంబగు కవితావైభవమ్మునం బ్రబలి చిటిపొటి పద్యమ్ముల నల్లికొనుచు వేర్వేఱ ననేకగ్రామమ్ముల ననేక గురుసాన్నిధ్యమ్మున సాహితీసంపాదనం బొనర్చికొని, ౧౨

గీ. తెలివియును దేటయును బిక్కబలిమి కలిగి
చెలఁగియును నిష్ఫలుండగు చీకుపగిది
డంబు మీఱియు హాస్యాస్పదంబ కాదె
శబ్దశాస్త్రవిహీనుని సరసకవిత. ౧౩

వ. అని మెచ్చికొని తచ్ఛాస్త్రాభ్యాససమాదృతాంతరులమై కడియెద్ద యనునొక చిఱుతగ్రామమ్మున వసియించు పతంజలింబోని వాని ననఘచరిత్రు నాపస్తంబసూత్రు లోహితసగోత్రుఁ బాపమాంబాగర్భశుక్తిముక్తాయమాను వీరనపుత్రు పుల్లయార్య వేంకటార్య దుర్గయార్య భ్రాతృత్రితయానుజన్ము నన్నపూర్ణాసతిచిత్తజన్ము, ౧౪

శా. స్వర్స్త్రీలారమణీమణీవినుతదివ్యద్గానధన్యుండు ప్రా
తస్సత్కీర్తిసదనాభిరామహృదయాంతస్స్తంభితశ్రీశుఁ డం
తర్గ్రస్తైకకృతవేదశాస్త్రవివిధార్థజ్ఞానసంధానుఁ డా
చర్లబ్రహ్మసుధీశ్వరుల్ విని మదిన్ సంతోషమొందేదగన్, ౧౫

వ. ప్రత్యేకంబ దైవవశమ్మునఁ దత్సన్నిధిం గలసి గురుకులవాసంబు సేయుచు సవయస్కత్వమ్మును సమానబుద్ధిమత్తయుం గలుగు కతన నిద్దఱమయ్యు నొక్కనిపగిది సహాధ్యాయిత్వమ్మునం బొదలుచు నైదువత్సరమ్ముల కా భాష్యంబుఁబఠించి, తన్మధ్యకాలంబునన కాళీసహస్రధాతురత్నాకరవీథీనాటకశుకరంభాసంవాదాదికమ్ములగు సంస్కృత గ్రంథమ్ములు రచియించియుఁ, దత్తద్దూరదేశమ్ముల కరిగి శతావధానాష్టావధానాదికంబు లొనర్చి తత్తన్నృపమణులచేఁ గనత్కనకభూషణనాగమంటపారోహణాది సమ్మానమ్ములును జయపత్రమ్ములును తత్సూచకంబులగు బంగరు బిరుదమ్ములును నంది, పదంపడి గురుసాన్నిధ్యమ్ము విడిచి, యాంధ్ర

కవితాకుతూహలం బుప్పతిలఁ దత్సాధకమ్ములగు భారతాదుల
నరసి శ్రవణానందం బను నొకకల్పితప్రబంధమ్ము రచియించి,
యంతం దనివి సనక యెద్దియేని యొక మహాపురాణా౦ ఖాంధ్రీక
రింప నుంకించు మాకు, ౧౬

క. యోగము మంచిదనుచు వే
తే గొణఁగఁగ నేల వ్యాసఋషిరచితంబై
యోగమ మనఁదగు దేవీ
భాగవతము తెలుఁగుసేయు భాగ్యము గలిగెన్. ౧౭

క. ఎన్ని పురాణమ్ములఁ దా
మన్నియు నాంధ్రీకరించి, యనుకంపను గా
కున్నన్ దీనిన్ విడుతురె ?
నన్నయభట్టాదికవిజనమ్ములు మాకున్. ౧౮

వ. “ ఇది వ్యాసుం డొనరింపలే దనియు శ్రీకృష్ణున్ బ్రశంసించు న
య్యదియేతత్కృత”మం(డ్రు)గొంద; ఱెటులేనొఁగాక మాకేమి? భా
గ్యదమున్ ముక్తిద మంచు దీనిఁదెలుఁగుం గావింతు ముద్యద్దయా
స్పదుల న్నాకుజబాదరాయణుల'విశ్వస్తుత్యులన్ గొల్చుచున్.

ఉ. వ్యాసుఁ డొనర్చినట్టి యల భారత మన్యపురాణజాలమున్
రోసినమీఁద దీనిఁ దగ రోసితిరేనిఁ గవిత్వశైలి యొం
డై సరివచ్చు వేఱొకటి యన్యకృతం బని తోఁచుఁ గాని యా
వ్యాసునిశైలిగా దిది మహాకవివేద్యము గాక యుండునే. ౨౦

వ. అని యేతత్పురాణరత్నం బాంధ్రీకరించుచు నధునాతనభవిష్య
న్మహాకవులం గూర్చి, ౨౧

గీ. ఎచ్చటేనియుఁ దప్పొందు టెట్టిదైన,
ధర్మమే ; భ్రాంతి పురుషుల ధర్మమగుటఁ
బుటకు నెబ్బదిపదొకొండు తొటుకు లుండు
వారు పేరును నొకతీరువారు గారు. ౨౨

గీ. భారతాదులలో యతిభ్రంశమాది
యైనదోషమ్ములును గల ; వంతమాత్ర
వారిపాండిత్యమునకు లోపమ్ము రాదు;
భ్రాంతి గడవంగ శక్యమే ? బ్రహ్మకైన. ౨౩

క. కోవిదులమంచుఁ గొందఱు
దేవానాంప్రియులు దమకుఁ దెలియక గుణముల్
గావింతురు దోషముగా
భావించి కనంగ రాదె ! భారతమెల్లన్. ౨౪

గీ. కేవలగ్రామ్యపదముల నేవగించి
జనులు వాడెడిపదములు సమ్మతములు,
"కలవు లే" వని పెనఁగ శక్యంబె? భార
తాదులను లేని పదములు నవనిఁ గలవె? ౨౫

క. వ్యాకరణ మొక్కతోవ, మ
హాకవు లొకతోవ, కోశ మఖిల మ్మొక తో
వై కనుపట్టెడి, నీ భా
షాకావ్యమ్ములను దఱచు చదివిన కొలఁదిన్. ౨౬

క. కేవలసంస్కృతమార్యా
ద్రావిడులును గేవలాంధ్రతత్పరులును గా

కేవార లుభయభాషా
కోవిదు లవ్వారు దీనిగురువులు జగతిన్. ౨౭

ఉ. భారత సారవేదు లగు పండితు లిందలి దోషముల్ గణిం
బారసి నిశ్చయింపఁ గల; రన్యుల కిందలి సుప్రయోగవా
గ్ధోరణు లన్యథాగతినిఁ దోఁపకమానవు; వేయునేల! సా
ధారణు లీకృతిం దప్పిమునఁ దప్పులు పట్టక యుండు టొప్పగున్. ౨౮

ఉ. భారత మాంధ్రసత్కవులపాలిఁటి వేదము దాన నుండు వా
గ్ధోరణులెట్టివైన నవి తోఁపియుఁగ రానివి "తప్పు" లంచు సా
ధారణరీతిగాఁ గుకవితండము లాడు ప్రయోగజాల మా
భారతమందుఁ గన్పడెడిఁ బండితు లయ్యవి స్వీకరింపరే? ౨౯

ఉ. తా నొకకట్టు చేసి యది దాఁటెను నన్నయ కొన్నిచోట్ల; నా
పైని స్వతంత్రుఁడై తనదుపాండితి చూపెను దిక్కయజ్వ; యా
పై నొకకొంతసాహసము పన్ని రచించెను నెఱ్ఱనార్యుఁ; డే
మైనను భారతమ్మునకు నంజలి సేయక తీర దేరికిన్. ౩౦

ఉ. మూఁగురియందు నన్నయ సమున్నతుఁడై కడు లక్షణంపు బ్రో
వై గుదిగూర్చునేర్పుగలఁడై తగు; నించుక కేమి యజ్వయున్
లోఁగక యాతనిం జెనయు; న్యూనుఁ డనం దగఁ డెఱ్ఱనార్యుఁ డా
తే గడుసుందనమ్ము గలఁ డిర్వురకున్ సరివచ్చు నన్నిఁటన్. ౩౧

మ. "అసిధారావ్రత మూని తిక్కన కవిత్వారంభముం జేసె" నం
చు సడిన్ వింటిమ కాని, నన్నయకు యాస్తోత్రమ్ము చెల్లున్ గదన్
రసవంతమ్మగుఁగాక శబ్దములచంద మ్మెన్నియో దోసముల్
పొసఁగున్ నన్నయకన్న దిక్కనకు; నల్పుండౌనె? తన్మాత్రలోన్.

గీ. నన్నయకుఁ దక్క నేఁటిదన్కను గవీంద్రు
లకట! శకటరేఫము యతులందుఁ బ్రాస
ములను రేఫమ్ముతోడను గలుపుచుండు
రెవని శక్యము? తిక్కనయే భ్రమించె. ౩౩

ఉ. అప్పకవీంద్రుఁడున్ మఱియు నంతకుఁ బూర్వులు నవ్యులున్ గృతుల్
సెప్పిరి భారతమ్మున విశేషములం దిలకించి; వారి క
గ్గప్పి విశేషముల్ శతము గన్పడుచున్నవి భారతమ్మునం
దిప్పటికిన్; సముద్రమున కెవ్వఁడు పారము నిర్ణయించెడిన్? ౩౪

చ. తెలుఁగున కున్న వ్యాకరణదీపము చిన్నది గ్రాహ్యమంచుఁ బె
ద్దలు కొనియాడు భారతము తప్పన శక్యము గాదు; దానిలోఁ
గలిగిన లక్ష్యభేదములు కాదన కాదృతి సంగ్రహించి ని
శ్చలగతి నిదెఁ గూర్చెదరు చక్కఁగఁ బర్వతివేంకటేశ్వరుల్. ౩౫

చ. ఒకటికి నొండుగ్రంథమున కుండు విరోధము దానికేమి? వ్యా
సకృతములైన పొత్తములె సైఁప నొకం డొకఁడున్; మఱెంత యే
టికి నొకపొత్తమేనియుఁ బఠించిన దానికి దానికే లగిం
పక పెఱరీతి గల్గు నది బ్రహ్మకునైన లగింప శక్యమే? ౩౬

వ. అని నొక్కి వక్కాణించి. ౩౭

క. నన్నయకుఁ దిక్కనకు నె
ఱ్ఱన్నకుఁ బోతన్నకున్ మహాకవులని మా
కన్న నుతిగన్న యితరుల
కున్నతుల న్నించి వేడుకొందుము పేర్మిన్. ౩౮

క. మును పోతన భాగవత
మ్మును దెనుఁ గొనరించి రాజముఖ్యుల కిడి త

ద్ధనమును గొనకే శ్రీరా
మున కిడి తత్కృపను భుక్తిముక్తులు గొనియెన్. ౩౯

వ. కావున, ౪౦

కం. గురువే బ్రహ్మయు విష్ణువు
గురువే దైవంబు శివుఁడు గురువె పరుండన్
పరమామ్నాయము దొప్పున
గురువునకే దీని నిచ్చికొందుము కృతిగా. ౪౧

వ. అదియునుంగాక, ౪౨

సీ. అ ఇ ఉణ్ మొదలు గాఁగ నాభాష్యపర్యంత
మే మహామహుఁడు మాకిచ్చె విద్య
కన్నసంతానమ్ముకన్న నెక్కుడుగాఁగ
నే దయాళుండు మ మ్మాదరించె
పెండ్లి పేరంటముల్ ప్రియ మెలర్పఁగఁ జేసి
యే గుణనిధి మమ్ము బాగు చేసె
తిండికై యిల్లిల్లు దిరుగ నీయక యన్న
మే యన్నదాత మా కింట నిడియె

గీ. సకలదిగ్దేశరాజన్య సభలయందు
డంబు మీఱ శతావధానం బొనర్చి
నిర్వహింపఁగ నెవ్వఁ డాశీర్వదించె
నట్టిగురునకుఁ గృతి యిచ్చు టర్హమ కద! ౪౩

వ. అని యమ్మహానుభావునకు నభ్యుదయపరంపరాభివృద్ధిగా మే
మాంధ్రీకరింపం బోవు దేవీభాగవతంబునకుఁ గథాక్రమంబు :—

గ్రంథారంభము.

తే. గీ. సర్వచైతన్యరూపయు సర్వమునకు
నాదిభూతయు నగు విద్య యస్మదీయ
హృదయమున నిల్చి తను జపియించుపొంటె
బుద్ధి ననయముఁ బ్రేరేపి ప్రోచుఁగాక. ౧

శా. సూతుం గన్గొని శౌనకుం డను; మునీశుం డైనవ్యాసుండు ప్ర
ఖ్యాతిం జెందఁ బురాణముల్ మును రహస్యమ్ముల్ వెలింజేసి యెం
తో తాత్పర్యముతోడ నిన్ను మతిమంతుం గా విచారించి యా
యా తంత్రమ్ములు నూఱిపోసె భవదీయాదృష్ట మింతింతయే? ౨

క. ఈవఁట చెప్పెడివాఁడవు;
పావను లీమునులు వినెడివారఁట; క్షేత్రం
బీ విధికిఁదగిన దగునఁట;
కేవల మిదియెల్ల మా సుకృత మనఁ దగదే? 3

ఉ. కావునఁ బుణ్యదం బగు నొకానొక మంచి పురాణసంహితన్
నీ వలనన్ గ్రహింపఁగ మునిప్రకరం బిది గోరుచున్న దీ
భూవలయమ్మునన్ దగినపుట్టువు పుట్టియు నిట్టిగోష్ఠికిన్
భావముఁ జొన్ప నేరని యభాగ్యులజన్మ మదేల కాల్పనే? ౪

గీ. జిహ్వ కెలమి షడ్రసములచేతఁ దృప్తి
యగునటులు, గర్ణములకు దివ్యప్రభావ
భాగవతవాక్యపరిపాటివలనఁ గాక
కల్గునే ? తృప్తి వేరొండు కతలవలన. ౫

ఆ. వె. చెవులు లేనియట్టి చిలువలు సయితము
సౌఖ్య మనుచు శబ్దసరణి వినఁగఁ
జెవులు గలిగి వినని చెనఁటుల కర్ణరం
ధ్రముల కేమి ఫలము ? విమలచరిత ! ౬

క. కాన నొకానొక పుణ్యక
థానిగమము వినఁ గడంగెదము ; సజ్జను లే
దేని యుపాయాంతరముఁ
బూని కదా ? కాలనియతిఁ బుచ్చుట యొందుఁ ? ౭

వ. మఱియు మూర్ఖులు దుర్వ్యసనమ్ములం దవులుదురు ; పండితులు శాస్త్రచింతనమ్ములఁ బ్రవర్తింతురు; రట్టిశాస్త్రములు సత్త్వరజస్తమోరూపమ్ములును వాదప్రధానమ్ములును నర్థవాదమ్ములును నగాధంబులును నై యున్నవి. అందు వేదాంతంబు సాత్త్వికంబు, మీమాంస రాజసంబు, న్యాయంబు తామసంబు. ౮

క॥ మున్ను ప్రసంగవశమ్మున
నెన్నియొ సత్కథలు సెప్పునెడ భాగవతం
బున్నది యటంచుఁ జెప్పితి
వన్నా ! యద్దాని మాకు నానతి యీవే. ౯

క. విన్నారము మును నీవల
న న్నానాసంగతుల ననంతముగా నో

యన్నా! తృప్తిం జెందక
యున్నారము; దీనఁ దృప్తి నొనరింపఁగదే. ౧౦

గీ॥ అమృతపానమ్ముచేఁ దృప్తి నందనట్టి
యమరులునుబోలె నున్నార; మమృతపాన
మునఁ దటస్థముగాని యా ముక్తిపదము,
భాగవతకథామృతమునఁ బడయ వచ్చు. ౧౧

ఉ. జన్మము లెన్నియో నమృతసార నిమిత్త మొనర్చియుంటి; మా
జన్మము లిచ్చునట్టి ఫలసంపద స్వర్గము; యద్ది నిత్యమై
యున్నది కాదు; నిత్యమయి యొప్పెడిముక్తి నొసంగఁ జాలు న
త్యున్నత మైన భాగవతయుక్తులచేఁ దనియింపవే మముల్. ౧౨

క. వినిపింపుమయ్య మాకుల్
మునులకు నిర్వ్యాజముగఁ బ్రమోదమునై నో
యనఘా! దీర్ఘాయుష్మం
తను గొని వర్ధిల్లుమయ్య తద్జ్ఞుల కరుణల్. ౧౩

వ. అని వినయమ్మునం బల్కు శౌనకుంగని సూతుండిట్లనియె. ౧౪

ఉ. నేనె మహాత్ముఁడన్, మఱియు నేనె కృతార్థుఁడ, నేనెపూజ్యుఁడన్,
నేనె మునీంద్రసమ్మతుఁడ, నేనె బుధేంద్రుఁడ, నుత్తమోత్తముం
డైన మహామునీశ్వరుఁడు వ్యాసుఁ డొనర్చిన యట్టి దీని మీ
కేను వచించువాఁడనఁట! యేమనుకొందును నాయదృష్టముల్.

శా. శ్రీవాణీధవముఖ్యనిర్జరశిరస్సేవ్యంబు మానీంద్రచి
త్తావాసంబు ముముక్షుయోగిజనకామ్యంబైన తత్పాదరా

జీవం బాత్మను బామఁగొల్పి, రసపుంజీభూతమై యొప్పు నీ
దేవీభాగవతంబు నా యెఱుఁగు రీతి న్నీకు వాక్రుచ్చెదన్. ౧౩

సీ. ఏదేవి విద్యయం చెల్ల వేదమ్ములు
తేప తేపకు సన్నుతించుచుండు
నేయమ్మ తన్నాశ్రయించు వారల సంసృ
తిక్లేశపాశంబుఁ దెరలఁ జేయు
నేతల్లి తనకునై చేతులొగ్గినవారి
చిత్తాంబుజములందుఁ జెలఁగియుండు
నేమాత సర్వమానీంద్రసంభావనా
పాత్రీకృతాంఘ్రియై ప్రబలుచుండు

గీ. నే జనని జగములనెల్ల సృష్టిఁ జేసి
ప్రోచి సమయించుచుండు నా పుణ్యరాశి
యైన పరశక్తి కరుణాకటాక్షములను
జిలికి నను బుద్ధిమంతునిఁ జేయుఁగాత. ౧౪

చ. ప్రళయమునన్ విధాతృనకుఁ బంకజనాభునినాభి, వానికిన్
జిలువలఱేఁడు, నాతనికి నీరధియున్ శరణంబు; లట్టిచో
జలనిధి కాస్పదంబు పరశక్తియ కా యని నిశ్చయించి, యం
జలి ఘటియింతు సర్వమయశక్తిసమేతకు లోకమాతకున్. ౧౫

ఉ. యోగపునిద్ర నొప్పు పురుషోత్తము నాభిసరోజమందుఁ బెం
పౌ గతి నుండి ధాత పరమాతురుఁడై "జగదంబ! దేవి! నీ
వే గతి" యంచు నే జగదధీశ్వరికిం బ్రణమిల్లె నీ మహా
భాగవతమ్ము నా జననిపట్టునఁ దెల్పెద నాలకింపుఁడీ. ౧౬

స్కంధ సంఖ్యా వివరము

క. ఈ దేవీభాగవతం,
బాదిపురాణములకెల్ల నత్యుత్తమ; మ
ష్టాదశసహాస్రపద్యము
లాదియు నంతమ్ము దీప నారసి చూడన్. ౨౦

మఱియును బండ్రెండు స్కంధమ్ములును మూడువందల పదు నెన్మిది యధ్యాయమ్ములును గలిగి యొప్పుచుండు; నందు బ్రథమ స్కంధమ్మునం దిరువదియు, ద్వితీయమ్మునం బండ్రెండును, దృతీయమ్మున ముప్పదియు, జతుర్థమ్మునం బంచవింశతియు, బంచమమ్మున ముప్పదియైదును, షష్ఠమ్మున ముప్పదియొకటియు, సప్తమమ్మున నలువదియు, నష్టమమ్మున నిరువదినాల్గును, నవమమ్మున నేబదియు, దశమమ్మునం బదుమూడును, నేకాదశమ్మున నిరువది నాల్గును ద్వాదశమ్మునం బదునాల్గును, నధ్యాయమ్ములు గలవు. సర్గ ప్రతిసర్గ వంశ మన్వంతర వంశానుచరితమ్ములను నీపంచలక్షణ మ్ములుం గలయది పురాణంబు నాంబరగు, నిందు సత్త్వరజస్తమ స్స్వరూపిణు లగు మహాలక్ష్మి సరస్వతీ కాళికల జన్మప్రకారంబు సర్గమ్ము నాం బడు. పాలనోత్పత్తి నాశమ్ములకై హరి విరించి రుద్రుల సముత్పత్తి ప్రతిసర్గమ్ము నాంబడు. సూర్యచంద్రవంశోద్భవు లగు రాజులచరిత్రమ్ములును, హిరణ్యకశిప్వాదిరాక్షసుల జన్మ ప్రకారమ్మును వంశమ్ము నాంబడు. స్వాయంభువాదిమనుకథా వర్ణనమ్మును వారల కాలనియమమ్మును మన్వంతరమ్ము నాంబడు. వారల వంశానుక్రమణిక వంశానుచరితంబు నాంబడు. సపాద లక్షగ్రంథయుక్తమ్మును వేదసమ్మితమ్మును నగు భారతం బితి హాసమ్ముగాని పురాణమ్ము గాదని చెప్ప సూతుం గాంచి శౌన

కుండు తత్తత్పురాణమ్ములును బద్యసంఖ్యయుఁ గర్తృవివేచన
మ్మును దెలుపు మని మఱియును, ౨౧

సీ. కలికాలభయసమాకలితులమై యున్న
మమ్ముఁ గాంచి విరించి మానస మగు
చక్రమొం డిచ్చి "యీచక్రనేమికిని శై
థిల్య మెచ్చోట నాదేశ మతిప
విత్ర మచ్చోటఁ గలిభీతి లే" దని చెప్పి
చనియె నంతట నేము చక్రముఁ గొని
సకలదేశమ్ములు సంచార మొనరింప
నిచ్చోట నా నేమి విచ్చి పోయె

గీ. నది నిమిత్తమ్ముగా నైమిశాఖ్య మయ్యె
నయ్య! యీక్షేత్రరాజ మత్యంతపావ
నంబు యోగ్యతరంబు దివ్యంబు దానఁ
జేసికాదె? మే మిచట వసించుటయును. ౨౨

గీ. చేసినారము కలిభీతిఁ జేసి మేము
జన్నములు పెక్కు పశుహింస సలుపకుండఁ
గృతయుగము వచ్చుదనుక నీ క్షేత్రమందు
పుణ్యగోష్ఠినిఁ గాలంబుఁ బుచ్చ వలయు. ౨౩

శా. వ్యాపారమ్ములు లేవు మాకు; వినఁగా నాసక్తియున్ మెండు; నీ
వా? పాండిత్యము గల్గుపుణ్యుఁడ; వగణ్యం బైన మాపుణ్యరే
ఖాపారీణత లభ్యమైతివి; జగద్ధన్యంబు పుణ్యంబు సం
తాపధ్వాంతహరంబు భాగవతముం మాకుం గటాక్షింపవే!

ఆ. వె. వ్యాసమునికృతంబు సతిపవిత్రంబు మ
నోరమంబు పాపనోదనంబు
కామదంబు నైన కథ యెంత వినినను
జెవికిఁ దృప్తి గలుగు చెనఁటి కలఁడె! ౨౭

క. సకలగుణములకుఁ బాత్రం
బకలంకం బఘవినాశ మఖిలజగన్మా
తృకచిత్రచరిత్రం బో
పికఁ గొలఁదిగ సూత! మాకు వినిపింపఁ గదే! ౨౮

క. అనిన విని సూతుఁడిట్లను
మునులారా! వినుఁడు వ్యాసమునిచంద్రుఁడు నా
కు నెఱిఁగించిన విధమున
వినిపించెద నా యెఱుంగు విధమున మీకున్. ౨౯

పురాణసంఖ్యాకథనము

వ. మాదిద్వయ మును భాదిద్వయమ్మును బ్రాదిత్రయమ్మును వాది చతుష్టయమ్మును ననాపలింగకూర్మస్కాందములును గలసి పురాణమ్ములు పదునెన్మిది. అందు మాత్స్యమ్మునఁ బదునాల్గువేలును, మార్కండేయమ్మునఁ దొమ్మిదివేలును, భవిష్యమ్మునఁ బదునాల్గువేల నైదువందలును, భాగవతమ్మునఁ బదునెన్మిది వేలును, బ్రహ్మపురాణమ్మునఁ బదివేలును, బ్రహ్మాండమ్మునఁ బండ్రెండువేలును, బ్రహ్మకైవర్తమ్మునఁ బదునెన్మిది వేలును, వామనంబునఁ బదివేలును, వాయవ్యమ్మునఁ బదునాల్గువేల యాఱువందలును, వైష్ణవంబునఁ బదుమూఁడువేలును, నారదమ్మున నిరువదియైదువేలును, వారాహ

నిరువదినాల్గువేలును, నగ్నిపురాణమ్మునఁ బదియూఱు ను, బాద్మమ్మున నేఁబదియైదువేలును, లింగమ్మునఁ బదు డువేలును, గారుడమ్మున నేకోనవింశతిసహస్రమ్ములును, మ్మున సప్తదశసహస్రమ్ములును, స్కాందమ్మున నేకాశీతి స్రమ్ములును గలవు. సనత్కుమారమును నారసింహమ్మును యమ్మును శైవంబును దౌర్వాసనంబునుఁ గాపిలంబును వంబును నౌశనసంబును వారుణంబును గాలికంబును సాంబ సౌరంబును నాదిత్యంబును మాహేశ్వరంబును మారీచం భార్గవంబును భాగవతంబును వాసిష్ఠంబు నను నివి యుప ణంబులు. సాత్యవతేయుం డష్టాదశమహాపురాణమ్ముల ుంచి పిదపఁ దదుపబృంహితం బగు భారతంబు రచియిం చె. మన్వంతరమ్మునఁ బ్రతిద్వాపరయుగమ్మున నారాయణుండు నస్వరూపమ్ముచే నల్పాయుష్కులును నల్పబుద్ధులు నగు పురులకొఱకు వేదంబులు విభజించి స్త్రీశూద్రద్విజబంధువు వేదమ్ములు శ్రవణార్హమ్ములుగామిం జేసి యీపురాణ ములు రచియించుచుండు నని చెప్పి మఱియును, ౭౨

గీ. ఆఱు మన్వంతరములు మున్న రిగె నేడ
వది జరుగుచుండె నిదియ నైవస్వతంబు
ఇరువదియు నేడు జరిగె ద్వాపరయుగమ్ము
లిరువదియెనిమిదవ దిది యెఱుఁగుఁడయ్య. ౭౩

కం. ఇరువదియేడ్గురు వ్యాసులు
పురాణములు సేసి రిట్లు పూర్వం బన్న

ర్గురు వగు సాత్యవతేయుం
డిరువదియెనిమిదవవ్యాసుఁ డిఁక నిటమీఁదన్. ౩౦

వ. ఇరువదితొమ్మిదవ ద్వాపరయుగమ్మున ద్రోణపుత్రుం డగు నశ్వ
త్థామ వ్యాసుండు కాఁగలఁ డని చెప్పు సూతుం గాంచి శౌనకుం
డిట్లనియె. ౩౧

చ. ఇరువదిరెండు ద్వాపరము లేగె నటంటివి ; మున్నొకొక్కద్వా
పరయుగమందు నొక్కొకఁడు వ్యాసుఁడు పుట్టెనఁటంటి; వార లె
వ్వరొ ? మఱి యేపురాణము లవారణకారుణికత్వ మొప్పఁ జె
ప్పిరొ ? వివరింపవే వినఁగ వేడుక గల్గెడి రామహర్షణీ ! ౩౨

క. అను మునుల రోమహర్షణ
తనయుఁడు గడు భక్తి యుక్తి తాత్పర్యములన్
గనుఁగొని పల్కెను వ్యాసుల
వినిపించెద వినుఁడటంచు వేడుక మెఱయన్. ౩౩

వ. ప్రథమద్వాపరమ్మున వేదములు స్వయంభువుచే వ్యస్తంబులయ్యె;
ద్వితీయద్వాపరమ్మునఁ బ్రజాపతి యా వ్యాసకార్యం బొనరించె;
నట్లు తృతీయమ్మున శుక్రుండును, చతుర్థమ్మున బృహస్పతియుఁ,
బంచమమ్మున సూర్యుండును, షష్ఠమ్మున మృత్యుదేవతయు,
సప్తమమ్మున దేవేంద్రుండును, నష్టమమ్మున వసిష్ఠుండును నవ
మమ్మున సారస్వతుండును, దశమమ్మునఁ ద్రిధాముండును, నేకా
దశమ్మునఁ ద్రివృషుండును, ద్వాదశమ్మున భరద్వాజుండును,
త్రయోదశమ్మున నాకాశమ్మును, చతుర్దశమ్మున ధర్మమ్మును,
బంచదశమ్మునఁ ద్రయ్యారుణియు, షోడశమ్మున ధనంజయుం

మ్మున నిరువదినాల్గువేలును, నగ్నిపురాణమ్మునఁ బదియాఱు వేలును, బాద్మమ్మున నేఁబదియైదువేలును, లింగమ్మునఁ బదునొకండువేలును, గారుడమ్మున నేకోనవింశతిసహస్రమ్ములును, కూర్మమ్మున సప్తదశసహస్రమ్ములును, స్కాందమ్మున నేకాశీతిసహస్రమ్ములును గలవు. సనత్కుమారమును నారసింహమ్మును నారదీయమ్మును శైవంబును దౌర్వాసనంబునుఁ గాపిలంబును మానవంబును నౌశనసంబును వారుణంబును గాలికంబును సాంబంబును సౌరంబును నాదిత్యంబును మాహేశ్వరంబును మారీచంబును భార్గవంబును భాగవతంబును వాసిష్ఠంబు నను నివి యుపపురాణంబులు. సాత్యవతేయుం డష్టాదశమహాపురాణమ్ముల రచియించి పిదపఁ దదుపబృంహితం బగు భారతంబు రచియించె. ప్రతిమన్వంతరమ్మునఁ బ్రతిద్వాపరయుగమ్మున నారాయణుండు వ్యాసస్వరూపమ్ముచే నల్పాయుష్కులును నల్పబుద్ధులు నగు భూసురులకొఱకు వేదంబులు విభజించి స్త్రీశూద్రద్విజబంధువులకు వేదమ్ములు శ్రవణార్హమ్ములుగాఁ జేసి యీపురాణమ్ములు రచియించుచుండు నని చెప్పి మఱియును, ౨౮

గీ. ఆఱు మన్వంతరములు మున్నరిగె నేడ
వది జరుగుచుండె నిదియ వైవస్వతంబు
ఇరువదియు నేడు జరిగె ద్వాపరయుగమ్ము
లిరువదియెనిమిదవ దిది యెఱుఁగుఁడయ్య. ౨౯

క. ఇరువదియేడ్గురు వ్యాసులు
పురాణములు సేసి రిట్లు పూర్వం బస్మ

గ్గును వగు సాత్యవతేయుం
డిరువదియెన్మిదవవ్యాసుఁ డీక నిటమీఁదన్. 30

వ. ఇరువదితొమ్మిదవ ద్వాపరయుగమ్మున ద్రోణపుత్త్రుం డగు నశ్వత్థామ వ్యాసుఁడు కాఁగలఁడని చెప్పు సూతుం గాంచి శౌనకుం డిట్లనియె. 31

చ. ఇరువదియేడు ద్వాపరము లేగె నటంటివి ; మున్నొకొక్కద్వా
పరయుగమందు నొకొక్కఁడు వ్యాసుఁడు పుట్టెనఁటంటివి; వార లె
వ్వరో ? మఱి యేపురాణము లవారణకారుణికత్వ మొప్పఁ జె
ప్పిరో ? వివరింపవే వినఁగ వేడుక గల్గెడి రోమహర్షణీ ! 32

క. అను మునుల రోమహర్షణ
తనయుఁడు గడు భక్తియుక్తి తాత్పర్యములన్
గనుఁగొని పల్కెను వ్యాసుల
వినిపించెద వినుఁడటంచు వేడుక మెఱయన్. 33

వ. ప్రథమద్వాపరమ్మున వేదములు స్వాయంభువుచే వ్యస్తంబులయ్యె; ద్వితీయద్వాపరమ్మునఁ బ్రజాపతి యా వ్యాసకార్యం బొనరించె; నట్లు తృతీయమ్మున శుక్రుండును, జతుర్థమ్మున బృహస్పతియుఁ, బంచమమ్మున సూర్యుండును, షష్ఠమ్మున మృత్యుదేవతయు, సప్తమమ్మున దేవేంద్రుండును, నష్టమమ్మున వసిష్ఠుండును నవమమ్మున సారస్వతుండును, దశమమ్మునఁ ద్రిధాముండును, నేకాదశమ్మునఁ ద్రివృషుండును, ద్వాదశమ్మున భరద్వాజుండును, త్రయోదశమ్మున నాకాశమ్మును, జతుర్దశమ్మున ధర్మమ్మును, బంచదశమ్మునఁ ద్రయ్యారుణియు, షోడశమ్మున ధనంజయుం

డును, సప్తదశమ్మున మేధాతిథియు, నష్టాదశమ్మున వ్రతియు, నేకోనవింశమ్మున నత్రియు, వింశమ్మున గౌతముండును, నేక వింశమ్మున హర్యాత్మయు, ద్వావింశమ్మున వేనుండును, త్రయో వింశమ్మున వాజశ్రవుండును, జతుర్వింశమ్మున నాముష్యాయణుం డగు సోముండునుఁ, బంచవింశమ్మునఁ దృణబిందువును, షడ్వింశమ్మున భార్గవుండును, సప్తవింశమ్మున జాతుకర్ణుండును, నష్టా వింశద్వాపరమ్మున నస్మద్గురుండగు సాత్యవతేయుండును, వేదం బులు విభజించి పురాణంబులు రచియించి రని చెప్పి మఱియు నిట్లనియె. 34

క. పారాశర్యమునీందుఁడ
పారకృపారసము జనులపైఁ గల్గినవాఁ
డై రచియించెఁ బురాణము
లారయ నవి యన్నియును ఏసాంబుధు లాహా, 35

సీ. జగదధీశ్వరిరూపు సారెసారెకుఁ జూపు
పరమాంజనము దేవిభాగవతము
ముక్తికాంతను దార్చు మూలమంత్రము నేర్చు
ప్రౌఢదూతిక దేవిభాగవతము
కామితమ్ము లొసంగఁ గల్పద్రుమ మనంగఁ
బ్రథితమైనది దేవిభాగవతము
దోషమ్ములను దుంపతోఁ గూడఁ దెగఁద్రెంప
వాఁడిగుద్దలి దేవిభాగవతము

గీ. పఠనపాఠన యోగ్యంబు భాగవతము
పరమమునులకు సేవ్యంబు భాగవతము

ఆగమాఖిలసారంబు భాగవతము
భారతికిఁ బ్రాణతుల్యంబు భాగవతము. ౩౬

చ. అరణి జనించినాఁడు, తనయంతన విద్యల నేర్చినాఁడు, సం
సరణము రోసినాఁడు, మునిసమ్మతుఁ డంచు శుకుం గుమారు దు
స్తరనియమాధికుండయిన సాత్యవతేయుఁడు బుద్ధి నెంచి య
ప్పరమునకున్ వచించె రసవంతము భాగవతప్రబంధమున్. ౩౭

క. కొడుకునకుఁ జెప్పునప్పుడు
గడు భక్తిశ్రద్ధ లలరఁగాఁ గైకొంటిన్
"గుడుచుట యల్లునిఁ గలిసియుఁ
గొడుకుఁ గలిసి చదు" వని యనుకొనుటలు వినరే ?. ౩౮

మ. శుకుఁ డీ భాగవతామరాగమఫలౌత్సుక్యంబుచేఁ దండ్రి ప్రా
పకుఁడై తా నుపదేశ మీఁగ బహుళోపాఖ్యానకర్ణాతిరం
జకమై యొప్పెడి దీని నిచ్చఁ గొని సంసారాంబుధిం దాఁటెఁ; దే
వి కథాసారముఁ గ్రోలియున్ భవభయాబ్ధిన్ మున్గువారుందురే ?

శా. పాపాత్ముండగుఁగాక, కేవల కులభ్రష్టాత్ముఁడౌఁగాక, శు
ద్ధాపాత్రుండగుఁగాక, యెట్టిఁడయినన్ వ్యాజమ్ముచేనైనఁ దా
నీ పౌరాణకథాసుధం గొని యిహాదృష్టమ్ములన్ గాంచి దు
ష్ప్రాపంబై తనరారు నా భగవతీసాయుజ్యముం జెందెడిన్. ౪౦

చ. పలుకులు వేయునేల ? యొకపల్కు వచించెద ; నెవ్వఁడేని స
త్ఫలగతి నొప్పు నీ పరమభాగవతంబు వినంగలాఁడో, వాఁ
డలఘుఁడు ; వానిచిత్తనిలయమ్మునఁ గాఁపురముండుఁ బేర్మితో
జలజభవాదులున్ గనఁగఁజాలని యా జగదంబ నిచ్చలున్.

చ. తెలివియుఁ దేటయున్ గలుగు దేహముగల్గియు, నెక్కుడైన స
త్ఫలములొసంగు నిప్పరమభాగవతంబు లభించియున్, వృథా
కలనలఁ గాలమున్ గడపు కష్టపుజన్మము గల్గునట్టి మూ
ఢులు విధివంచితుల్ గడుఁగఠోరులు కష్టులు దుష్టులిమ్మహిన్. ౪౨

చ. కటకట! పాపపుంగతలు కర్ణములొగ్గి గ్రహించు రాగలం
పటు లిటువంటి సత్కథల భావముఁ జొన్పుట కిచ్చగింప; రు
త్కట మగు పంకమున్ గని ముదంబు మదిన్ గను గ్రామసూకరం
బెటువలె నిచ్చగించు? సుఖహేతుకమై తగు మంచిగందమున్. ౪౩

వ్యాసుండు బిసంబోనప్పుట

క. అని పల్కు పల్కులన్ విని
మును లిట్లని; ధరణియందుఁ బుట్టెను శుకుఁ డెం
చునుఁ జెప్పితి వాతఁడు వ్యా
సున కెట్లు తనూజుఁడాయె సూతా! చెప్పుమా. ౪౪

గీ. శుకుఁ డయోనిజుఁ డంటివి వకట! గర్భ
యోగి గా మేము మును వింటి మో మహాత్మ!
గర్భగతున కయోని సందర్భ మెట్లు
తెలిపి యీ సందియము మాకుఁ దీర్పవలదె? ౪౫

సీ. అని పల్కు మాటలఁ గని సూతుఁ డిట్లను
మునులార! వినుఁడు శుకునిచరితము
రమణ వ్యాసుండు సరస్వతీతటమునం
దుగ్రతపంబున నుండి యచటఁ

గలవింకదంపతుల్ గలిసి పిల్లలనోటి
కాహారమందిచ్చి యవి భుజించు
చందమ్మునకు మోదమందుట వీక్షించి
మనమునఁ గామంబు పెనఁగొనంగ

గీ. బళిర ! సంతానమందుఁ బక్షులకుఁ గూడ
నింత ప్రేమాతిశయ మున్న దింక మనుజు
లైన వారల కుండుట యబ్బురంబె !
యనుచు సంతానచింతాకులాత్ముఁడగుచు. ౨౬

ఉ. సుందరి చేయునట్టి గడుసుందనపుం బలు ముద్దుసుద్దు లం
దంద ముదంబు నింపఁగ రసాంబుధి నోలల నాడవచ్చు ; నా
నంద మొసంగఁజాలు, తగునందనులన్ బడయంగ వచ్చు ; ను
ర్విం దలపోసి చూచినను బెండిలికిన్ సమ మొండు గల్గునే ? ౨౭

ఆ. వె. కొడుకు గల్గెనేనిఁ గొడుకునకును బెండ్లిఁ
జేసి కాఁపురమ్ముఁ జేయుచున్న
ముగుదయైన యట్టి ముద్దులకోడలి
మొగముఁ గనుటకన్న ముదము కలదె ? ౨౮

సీ. వార్ధకావస్థ సంప్రాప్తమైనను సతి
శ్రద్ధాళుఁడై పరిచర్య సేయు
ధనము సంపాదించి తగువస్తువులు తెచ్చి
తనకిచ్చి మిగుల సంతసమొనర్చు
మృతిఁజెందినను బరగతికి సాధనమైన
ప్రేతకార్యమొనర్చి ప్రీతి నించు

గయకును నేగి పితృసద్గతికినై విష్ణుపా
దంబుపైఁ బిండదానంబు సలుపు

గీ. సుతులఁ గనకున్నఁ బరలోకగతులు సున్న
పుత్రిగాత్రి పరిష్వంగమున జనించు
సుఖముకన్నను వేఱొండు సుఖములేదు
కానఁ దగునట్టి బుత్త్రులఁ గాంచవలదె? ౭౯

చ. కొడుకులు లేనివాఁడు తనకుఁ మృతికాలము సంభవించిన
ప్పుడు తనద్రవ్యముఁ గృహము భూమియు నేమయి పోవునో కదా యె
వ్వఁ డపహరించునో యనెడిభ్రాంతి వహించి తనంతఁ దాన పె
క్కిడుమలఁ జెందుఁ గానఁ గొడు కేర్పడి యుండుట ముఖ్య మెరికిన్.

క. అని బహువిధములఁ జింతిలి
తనయునకై తపము సేయుతలఁపున ద్వైపా
యనమునిచంద్రుఁడు సనె హే
మనగాగ్రప్రథితసానుమండలమునకున్. ౮౧

శా. ఏ దేవుం గొనియాడుదుఁ మఱియు నే నే దేవుఁ బ్రార్థింతు నా
కే దేవుండు ప్రసన్నుఁ డౌనొకొ మనోభీష్టంబు నే దేవుఁ డా
పాదింపం గలఁడో! యటంచు మది సంభావించు చున్నంతలో
నా దివ్యాత్మునిఁ జూడ నారదుఁడు నిర్వ్యాజస్థితిన్ వచ్చినన్ ౮౨

ఉ. వచ్చినవానిఁ గాంచి మునివల్లభుఁ డల్లన లేచి మ్రొక్కి యో
సచ్చరితా! మనమ్మున విచార మొకం డొనరించుచుంటి; నీ
విచ్చటి కేగుదెంచుట త దీప్సితసిద్ధికి ముఖ్యకారణం
బిచ్చఁ జరించు సన్మును లహేతుకజాతదయానుయుల్ గదా! ౮౩

క. అను పలుకులు విని నారదుఁ
డను, సకలము నెఱుఁగునట్టి యనఘుండవు నీ
కు నసాధ్యం బొం డుండునె ?
యనుమానం బేల తెల్పుమన నతఁడనియెన్. ౧౪

చ. "కొడుకులు లేక యున్నఁ దనకుం బరలోకము సున్న" యంచుఁజె
ప్పెడి వచనంబులన్ జెవిని బెట్టిన దాదిగ నాకు లోనఁ దుం
దుడుకు జనించెఁ గావున సుతుం గన నెవ్వని వేఁడుకొందు నె
వ్వఁడొసఁగువాఁడు తెల్పు మటువంటి మహాత్ముని నాకు నారదా !

వ. అని తనకు శరణాగతుం డగుసాత్యవతేయుం గాంచి నారదుండిట్ల
ను; నీ యడిగిన యర్థమ్ము దెలిసికొనువాఁడై మున్ను మజ్జనకుం
డగు విరించి విష్ణులోకమ్మునకుం జని, ౧౬

సీ. కోటిసూర్యులకాంతి గోటమీటఁగఁ జాలు
డాబు జిమ్మెడి కౌస్తుభంబువాని
శంఖచక్రగదాది సాధనమ్ములు దాల్చి
హావణించు నాల్గు బాహువులవాని
నీలనీరదసమ శ్రీలీలఁ దగుమేని
పై నొప్పు బంగారు వలువవాని
నింద్రనీలవిలాస మినుమడింపఁగఁ జాలు
హెచ్చుగల్గిన పుట్టుమచ్చవాని

గీ. కలుము లీనెడి కందోయి గలుగువాని
నెల్ల లోకమ్ములును లోన నిముడువాని
ధ్యాననిశ్చల మైన హృదయమువాని
విష్ణుఁ బొడఁగాంచి తా నిట్లు విన్నవించె. ౧౭

—* విష్ణువు బ్రహ్మకు దేవీ మహాత్త్వంబు చెప్పుట *—

సీ. నీ యాజ్ఞ చేఁగదా ! నే సృజింతు జగమ్ము
హరియించుఁ బ్రళయమ్మునందు శివుఁడు
నీ యాజ్ఞ చేఁగదా ! నీరేజబాంధవుం
డుదయాస్తమయముల నొందుచుండు
నీ యాజ్ఞ చేఁగదా ! వాయుదేవుఁడు సుఖా
సుఖరీతిఁ దనశక్తిఁ జూపుచుండు
నీ యాజ్ఞ చేఁగదా ! యా యగ్ని వెల్గుఁ బ
ర్జన్యదేవుండు వర్షంబు గురియు

గీ. నీవె సర్వోత్తముఁడవు సర్వేశ్వరుఁడవు
సర్వభూతమయుండవు సర్వశక్తి
వట్టి నీ విట్టి ధ్యానసమాధి నుంటి
వెవఁడు సంసేవ్యుఁడో తెల్పవే మహాత్మ ! ౫౮

గీ. నీకు బరుఁడున్న వాఁడని నే నెఱుఁగ
నీకు శరణాగతుఁడ నైతి నీ కృపార
సమ్ము నాపయిఁ జిలికి యీ సందియమ్ముఁ
బాపవే ! భక్తులకును గోప్యములు గలవె ! ౫౯

క. అని పలుకు సరసిజాసనుఁ
గని విష్ణుం డను మనమ్ముఁ గడు నిశ్చలతన్
గనఁజేసి సావధానత
వినుమా ! నా పల్కుపల్కు విధము కుమారా ! ౬౦

ఉ. ఈవు సృజింతువంచు, మఱి యేఁ గరుణించి భరింతునంచు గౌ
రీవిభుఁ డాగ్రహమ్మున హరించునటంచు, జనుల్ వచింతు ; రీ

త్రోవలు తప్పుత్రోవలు ; బుధుల్ "మనలన్ సృజియించె నొక్క తే
జోవతి యాదిశక్తి" యనుచున్ వచియింతురు కాదె పుత్రికా !

క. మృడునకుఁ దామసి తాఁ దో
డ్పడె ; రాజసి నీకుఁ దోడుపడె ; సాత్త్వికి తో
డ్పడె నా ; కటుగాకుండినఁ
గొడుకా ! యొకగవ్వకైనఁ గొఱగాము సుమీ ! ౬౨

సీ. పరతంత్రతను జెంది ఫణిరాజశయ్యపై
శయనింతు శక్తి ప్రసాదముననె
ఆరామముల విహారార్థంబు లక్ష్మితోఁ
జరియింతు శక్తి ప్రసాదముననె
సతతంబును దపంబు వితతంబు గాఁగఁ బొ
సంగింతు శక్తి ప్రసాదముననె
పొగరుపట్టిన రాక్షసగణమ్ములనుఁ బట్టి
చంపుదు శక్తి ప్రసాదముననె

గీ. నాఁడు మధుకైటభులను దానవులతోడ
నైదు వేలేండ్లు సంగ్రామ మాచరించి
జయము గైకొంటి శక్తిప్రసాదముననె
యెఱిఁగి యెఱిఁగి నన్నడుగఁగ నేల ! పుత్ర ౬3

మ. సిరిసాంగత్యముఁ గోలుపోయి, సుఖముల్ చేసేఁత వర్జించి, సూ
కరకూర్మాంబుచరాదితుచ్ఛకలుషాకారమ్ములన్ దాల్చి, సం
గరముల్ సల్పుచు బాముల౯ బడుచు నజ్ఞానాబ్ధి నోలాడఁగాఁ,
బరతంత్రుండను గాకయున్న నది నాప్రారబ్ధమా ? పుత్రికా !

చ. మును పొకనాఁడు నాదుశిరముల్ హరియించె ధనుర్గుణంబు దా
నినిఁ గని నీవ యప్డు తగునేరుపు గల్గిన దేవశిల్పివ
ర్యునిఁ బిలిపించి యొక్క తురగోత్తముశీర్షముఁ గూరిపించి తి
య్యనువున నే హయాననుఁడ నైతి నెఱుంగవె ? పద్మసంభవా !

గీ. కాన నేను స్వతంత్రుఁడఁ గాను శక్త్య
ధీనుఁడను శక్తి సేవనాధీనమతిని
శక్తికన్నను వేఱొండు జగములందుఁ
బరము గలదని పలుక నా తరము గాదు. ౬౬

చ. అనుచు విరించికిన్ సరసిజాక్షుఁడు దెల్పెను ; దాని నాకు న
య్యనఘుఁడు దెల్పినాఁడు ; జగదంబికయై పరతంత్రి గాక యుం
డిన పరదేవతన్ హృదయ నీరజమందు వసింపఁజేసి, పే
ర్కొనఁ గదవయ్య ! కోర్కె సమకూడు నదెట్టిది యైన సన్మునీ !

క. అను నారదువచనము విని
యనుమానం బుడిగి శక్తి యగుఁ బరదైవం
బని తపము చేసె వ్యాసుఁ డ
నిన సూతుంగాంచి యిట్లనిరి మును లెల్లన్. ౬౭

—* హయగ్రీవతార ఘట్టము *—

ఉ. ఆగమవేద్యుఁ డైన పరమాత్ముశిరమ్మున కేల గల్గె నీ
యోగము దాని కెట్లతికిరో తురగానన మీకథావిధం
బేగతి నమ్మువార మిది యెల్ల నసంశయరీతిఁ దెల్ప నీ
వే గతి, దెల్పవే యనుమునీంద్రులఁ గన్గొని సూతుఁ డిట్లనున్.

సీ. మును రక్కసులతోడ దనుజారి పదివేల
సంవత్సరమ్ములు సంయుగమ్ము

చేసి పరిశ్రాంతిఁ జెంది సజ్యంబగు
ధనురగ్రము నవలంబనముఁ జేసి
కొని తానొకచోట నిద్రింగొనియున్న తఱి దేవ
తలు యజ్ఞమొనరింపఁ దలఁచి విష్ణు
లోకమ్ములోఁ బద్మలోచనుఁ గానక
యోగమ్ముచే నున్న యునికి నెఱిఁగి

గీ. వచ్చి నిద్రావశుం డైన వానిఁగాంచి
చేయునది లేక యూరక చింత సేయ
వారిఁ గరుణించి వాగీశు వలను చూచి
పార్వతీపతి దెల్పె నుపాయ మొకటి. 20

శా. కీటంబుల్ సృజియింపు మీ వొకఁడు పంకేజాసనా! యీధను
ష్కోటిన్ భిన్నముఁ జేయఁజాలు నది; తత్కోట్యగ్ర ముచ్ఛిన్నమై
మీటున్ మీఁదికి; దాన నీతఁడును దా మేల్కాంచు; దాన న్నిరా
ఘాటంబౌ మఖ, మన్న మంచిదని వేడ్కన్ ధాత సృష్టించినన్.

క. పుట్టించిన ధాతన్ గని
నెట్టన నా కీట మిట్లనియె నో దేవా!
యెట్టు లొనరింతు నీపని
కట్టా! కడుఁ బాతకంబు గాదే నాకున్. 21

శా. తల్లిన్ బిడ్డలఁ బాయఁజేయుటయు, నిద్రాభంగమున్, భర్తతో
నిల్లాలిన్ విడఁదీయఁ బూనుటయు, దుష్కృత్యప్రవృత్తిన్ గథా
సల్లాపమ్ముల కంతరాయకృతులన్ సంధించుటల్, తుల్యమై
చెల్లున్ నిక్కము బ్రహ్మహత్య; కిది నాచేఁ జేయఁగాఁ జేతురే?

క. ఇటు లొనరించిన నాకుం
గటకట ! పాతకము తక్కఁ గలదే ఫలమొ
క్కటి, దెల్పెద లాభము లే
కిటువంటి పనుల నొనర్తురే? యెందైనన్. ౭౪

క. అని కటకటఁ బడు పురుషున్
గని యిట్లనె ధాతయున్ మఖంబున నీ క
ప్పనఁ జేసెన మిది మొదలుగ
ననలహుతము కాని యప్పదార్థంబెల్లన్. ౭౫

క. నావుడు వమ్రియు సంతో
షావిర్భావంబు వొదల నావింటికొనన్
వేవేగఁ గొఱికె. ధనలో
భావిష్టు లొనర్పరాని యఘములు కలవే ! ౭౬

శా. దాసన్ నాద మొకండు పిక్కటిలెఁ, బాతాళంబు ఘూర్ణిల్లె ; నా
శానాగమ్ములు సంచలించె ; ధరణీచక్రంబు కంపించె ; గో
త్రానీకంబు వడంకె ; నుష్ణకిరణుం డస్తంగతించె ; న్నభ
స్థానం బల్లల నాడె ; దిక్కులు ప్రతిధ్వానమ్ములన్ గర్జిలెన్.

గీ. వింటికొన తాఁకుచేత న విష్ణుదేవు
శిర మెగిరిపోయె దాన నిర్జరులు భీతి
చెంది యుత్సాహములు దక్కి చేవవీడి
చేయునది లేక మదిఁ జింత చేసిరిట్లు. ౭౭

గీ. ఈవె సర్వోత్తరుఁడవు సర్వేశ్వరుండ
వీ వభేద్యుండ వఖిలలోకైకకర్త

నీవె భర్తవు సంహర్త నీవె కావె
నీకు నింతటి గతి గల్గెనే మహాత్మ! ౨౯

గీ. యక్షరాక్షస దైత్యుల యందు నీకు
నిట్టి యపకార మొనరింప నెవ్వఁ డోపు?
దిక్కుమాలిన యట్టి యీ దేవసంచ
యం బొనర్చిన పాపకర్మంబు కాక. ౩౦

గీ. మాయకుఁ బరుండ వైన నీ మస్తకంబు
మాయ హరియించె నన్న నమ్మఁ దగునయ్య?
యంచు నేమేమొ విలపించు నమరవరుల
కిట్టులనియె బృహస్పతి యెసకమెసగ. ౩౧

గీ. తగు నుపాయమ్ము యోజింపఁ దగును గాక
వ్యర్థముగఁ జింతఁ జేసిన ఫలముకలదె?
మన మొనర్చు నుపాయంబు మంచి దగును
దైవతంత్రమ్ము దానికిఁ దవిలెనేని. ౩౨

వ. అనిన నింద్రుం డిట్లనియె. ౩౩

గీ. దేవతలు సూచు చుండఁగా దేవదేవు
శిరము నిష్కారణమ్ముగాఁ జెదరిపోయె
పౌరుషమ్మున సిద్ధించు పనులు కలవె?
దైవబలము బలమ్ముగాఁ దలఁప వలయు. ౩౪

వ. అనిన విరించి యిట్లనియె. ౩౫

చ. శివునకు లింగపాతము, శచీపతికిన్ భగలబ్ధి, యేను నా
భవుని కతమ్మునన్ దలకుఁ బాయుటయుం, దలపోసి చూడఁ, గా

లవశము కాక వేఱొక బలమ్ముఁ గిలమ్మును గల్గునే ? సమ
స్తవిధములన్ సుఖమ్ముఁ గొనసాఁగునె సంసృతి నీదువారికిన్ ? ౨౬

ఉ. ఈ సకలంబు తాన యయి యే జగదీశ్వరి వెల్గుచుండుఁ దా
నే సృజియించి తాన భరియించియుఁ దాన హరించు నే కృపా
భాసురశీల యాపరమపావని నా జగదంబ నా భవ
త్రాసహరన్ భజించిన ముదమ్ము లొసంగక మిన్నకుండునే ? ౨౭

వ. అని మఱియును. ౨౮

క. ఆ జగదంబ నుతింపం
గాఁజాలము మన మటంచుఁ గడువేగముగా
రాజీవభవుం డాగమ
రాజిం బిలిపించి వేడ్క రాజిల్లంగన్. ౨౯

క. నుతియింపుఁ డాదిశక్తిని
శ్రుతులారా ! మీర తెలమి చొప్పడ నని యా
నతి యిచ్చిన నది గైకొని
శ్రుతిసతు లిట్లని నుతింపఁ జొచ్చిరి కడఁకన్. ౩౦

ఉ. తల్లి! జగత్త్రయీభరణదక్షకటాక్షకలావిలాస ! యు
త్ఫుల్లసముల్లసత్కమలతుల్యముఖీ ! ప్రకృతిస్వరూపిణీ !
పల్లవపాణి ! నిత్యశివభాగ్యవిధాయిని ! సర్వరూపసం
వేల్లితదేహ ! దివ్యపదవీపరిభాసిని ! మత్తకాశినీ ! ౩౧

గీ. భూతములకెల్ల నాధార భూమివైతి
ప్రాణవంతులకెల్లను బ్రాణమైతి
ధీముఖాకారములచేత దీప్తిఁగంటి
వంబ ! గాయత్రికిని వాచ్య మైతి వీవ. ౩౨

ఉ. పాపహరంబు సర్వపరిపాలనశౌండ మకాండసత్కృపా
దీపిత ముత్తమోత్తమము దివ్య మఖండ మజాండనిర్మితి
ప్రాపక మాద్య మాగమనివాస మనంతవిలాస మైన నీ
రూపు పితామహాదులు నిరూపణఁ జేయఁగ లేరు శాంకరీ. ౯౩

చ. సకలముఁ జేయు నిచ్చఁ గొని సారససంభవముఖ్యదేవతా
నికరము మున్నుగాఁ దగ జనింపగఁ జేసి తటస్థవై సమ
స్తకృతులు వీరిచేతఁ గొనసాఁగఁగఁ జేయుచునుందు; వంతె కా
క, కలవె నీకు సంసరణ కష్టసుఖమ్ము లొకించుకేనియున్ ? ౯౪

శా. నీ నామమ్ములు లెక్కపెట్టుటకుఁ గానీ నీదు రూపం బొకిం
తేనిన్ వర్ణనఁ జేయఁ బూనుటకుఁ గానీ లేఁ డొకండేని; యొం
దేనిన్ ద్వచ్చరితంబు దెల్పుటకునై యెవ్వాఁ డగుం దేవి ? కు
ల్యానీరమ్మును దాఁట భీతి పడువాఁ డంభోనిధిం దాఁటునే ? ౯౫

గీ. నీదు విభవంబు దేవతానికరమందు
నొక్కఁడేనియు నెఱుఁగమి నిక్క మంబ !
నీవ సకలంబునకు నియంత్రి వను పట్ల
నేమ సాక్ష్యమొసంగి జయింపఁ గలము. ౯౬

ఆ. వె. ఆస్థ లేనిదాన వయ్యును సకలంబుఁ
జేయుచుందు వనెడి చిత్రచరిత
మంబ ! నీక తెలియ దన్నచో మాబోటి
జడమతుల కెఱుంగఁ బడుట యెట్లు ? ౯౭

ఉ. ఈ దురవస్థ మాధవున కీ గతి నబ్బుట కేమి హేతు వం
బా ! దయ మాలి నీవు పరిపాలన సేయ కుపేక్షఁ జేసితో ?

నీదెస నెద్దియేని యవినీతి యొనర్చెనొ ? లేక పూర్వసం
పాదితపాపకర్మపరిపాకమొ ? శక్తి పరీక్ష సేయుటో ? ౯౮

ఉ. లేక దురాగ్రహమ్మున నిలింపు లొనర్చెడి పాతకమ్ము లీ
పీకమలాక్షునం దిడితొ ? యీతని గర్వ మడంపఁబూనితో ?
కాక సురారు లిట్టి వరకాంక్షఁ దపం బొనరించి యుండిరో ?
కా కితఁ డీగతిన్ బొగులఁగాఁ గను నిచ్చ జనించెనో మదిన్ ? ౯౯

ఉ. "ఐదువ లందు నాకు సమమైన యదృష్టవిశేష మెచ్చటన్
లే" దని విఱ్ఱవీఁగు నల నీరధిపుత్రికి నమ్రభావ మా
పాదనఁ జేయఁ బూనితివొ ? భక్తుల యం దిటువంటి నిర్దయా
హ్లాదము పూన మంచి దగునా ? తగునా మగనాలివంచనల్ ?

గీ. ఇతని శిర మేడ కేగెనో యెఱుఁగ రాదు
ప్రాణము లొసంగుటకు నుపాయమ్ముఁ గాన
మంబ ! యీతని బ్రతికించి యమరవరులఁ
గరుణ నీక్షించి వచ్చుసంకటము తీర్పు. ౧౦౧

గీ. అనుచు నుతియించు వేదమ్ము లందుఁ గరుణ
కలిగి జగదంబ పలికె నాకాశకలన
వినుఁడు సురలార ! వేదముల్ విన్నవించు
విన్నపం బాదరించి ప్రసన్ననైతి. ౧౦౨

క. ఈ నిగమస్తవ మెవ్వం
డేని వినిన వాని కేన యిచ్చెదఁ దగు వి
జ్ఞానమ్మును దీర్ఘాయువు
నానంద మఖండ మైన యైశ్వర్యంబున్. ౧౦౩

గీ. ఇతనిశిర మూడిపోవుట కేమిహేతు
వన్న సురలార ! చెప్పెద నాలకింపుఁ
డహహా ! కారణహీన కార్యములు గలవె ?
సారవేత్తల కెందు సంసారమందు. ౧౦౪

మ. ఒకనాఁ డీతఁడు కేళికాసదనమం దున్నట్టి వారాశి పు
త్రికమోమున్ గని నవ్వె; నవ్వుటయు నారీరత్న మా లక్ష్మి "యే
మి కతంబో యితఁ డిట్లొనర్చుటకు, నేమీ ! నా మొగం బంతఁగా
వికృతాకారము చెందెనే" యనుచుఁదా వేమాఱు, జింతించుచున్,

శా. నాకన్నన్ మఱియొక్క చక్కనగు కన్యన్ జూచి మోహించెనో?
కాకున్నన్ నినుఁ జూడకున్న దినముల్ కల్పమ్ములౌఁ జుమ్మి నా
కో కల్యాణి ! యటంచుఁబల్కు నితఁ డోహో ! యింతయెగ్గించునే !
సీ ! కాంతుం డఁట ! యొగ్గొసర్చె నఁట ! తత్క్షేమంబు గామింతునే?

క. అని తామసమునఁ దనకాం
తుని శీర్షం బబ్ధిఁ బడఁగఁ దుడుకుమెయి శపిం
చెను ; సవతిపోరుకన్నను
దనపతి మృతి కొంత సౌఖ్యదము మానినికిన్. ౧౦౭

సీ. దయమాలి ప్రియుతోడఁ దప్పుఁ జేసియు నబ
ద్ధమ్ము లాడుట యాఁడుదానిసొమ్ము
ప్రాణమ్మునకు గడ్డిపరకంత వెలయైనఁ
దలఁపకుండుట యాఁడుదానిసొమ్ము
అత్యంతలోభమ్ము నంది యూరక మౌర్ఖ్య
మూని యుండుట యాఁడుదానిసొమ్ము

అవమానమునకు లోనై దురాచార ప
ద్ధతి వహించుట యూఁడుదానిసొమ్ము

గీ. కష్టసంసారమునకు లోఁగా నోనర్చి
దాఁట నీకుండు టది యూఁడుదానిసొమ్ము
లేనిపోని విలాసమ్ములూని మోక్ష
దశను జెడఁగొట్టు టది యూఁడుదానిసొమ్ము. ౧౦౮

సీ. ఆ శాపవశమునఁ గేశవు శిరమున
కిట్టి దుర్దశ మూఁడె నిదియుఁగాక
మును హయగ్రీవుఁడన్ దనుజుండు గడు నిష్ఠ
చే సరస్వతియొడ్డఁ జేరి తపము
నాచరించె మదర్థమై వేయిసంవత్స
రములు సమస్తభోగములు వీడి
యతని కేఁ దామస మగు రూపము ధరించి
ప్రత్యక్ష మగుటయు బహువిధముల

గీ. సన్నుతించి ప్రసన్ననై యున్న నన్నుఁ
గాంచి " యెవ్వారిచేనైనఁ గానిచావు
బొరయ కుండెడి రీతిని వర మొసంగు "
మనుడు నవ్వానితోడ నిట్లంటి నేను. ౧౦౯

గీ. పుట్టు జంతువు లెల్లను గిట్టుటయును
గిట్టు జంతువు లెల్లను బుట్టుటయును
పరమధర్మంబు వేఱొండు వరముఁ గోరు
మిచ్చెద నటన్న రక్కసుం డిట్టు లనియె. ౧౧౦

క. ఏను హయగ్రీవుండను
గాన హయగ్రీవుచేతఁగాని యొరులచేఁ
బ్రాణములు వీడ కుండం
గా నిమ్మని నట్టివరము కరుణ నొసఁగితిర్. ౧౧౧

వాఁడిపు డెల్లలోకము లవారణ రీతిని బీడఁ బెట్టుచు
న్నాఁ డీక వానిఁ జంపుటకు నాథుఁ డొకండయినన్ జగత్త్రియిన్
లేఁ డటుగాన మీరు తగునేర్పున వాజిశిరమ్ముఁ దెచ్చి మా
ఱాడక యీ రఘూధవు హయాననుఁగా నొనరింపఁగాఁదగున్.

క అటుచేసిన నీతం డ
క్కుటిలుని హరియించు మీకుఁ గోర్కెఫలించున్
దటుకున నొనరుపుఁడని యా
తట నంతర్ధానమొందెఁ దజ్జనని వెసన్. ౧౧౩

గీ. పిదప సురలెల్ల దేవశిల్పివరుఁగోర
నతఁ డరుగుదెంచి యసికృత్తమైన వాజి
శిరము గైకొని నేర్పున హరికి నతికె
నీ విధమ్మున హరి హయగ్రీవుఁ డయ్యె. ౧౧౪

గీ. ఈ హయగ్రీవుఁ డా రాక్షసేంద్రుఁ జంపె
దానిచే లోకములు ప్రమోదమ్ముఁగాంచె
నిట్టి శుభచరితము వినునట్టివారి
కతులితైశ్వర్యములు గల్గు నఘము లడఁగు. ౧౧౫

—♦ మధుకైటభోత్పత్తి ♦—

క. అన విని మధుకైటభులను
దనుజులు గల రంటి వట్టి దనుజుల జన్మం

బును మరణంబును వినియెద
మనఘా ! నీవంటియోగ్యుఁ డబ్బునె మాకున్ ? ౧౧౬

గీ. విషము దుర్జనుఁడును నొక విధమువారు
సుధయుఁ బండితుఁడును నొకవిధము వారు
బుధులు దొరకినయప్డు సత్కథలు వినని
వార లెల్లరుఁ బశువుల వంటివారు. ౧౧౭

క. అశనమ్మును నిధువనమును
బశువులకును మనుజులకు స్వభావ గుణమ్ముల్
పశువులకన్నను మనుజులు
ప్రశస్తతను గనుట తెలివిఁ బడయుటఁగాదే ? ౧౧౮

గీ. వేదశాస్త్రాదిగోష్ఠి సాత్త్వికి యనఁబడు
సరససాహిత్యగోష్ఠి రాజసి యనఁబడు
నసమయుద్ధాదిగోష్ఠి తామసియనఁబడు
నందుఁ బుణ్యులు సాత్త్వికి యందు నుందు్రి. ౧౧౯

వ. అట్టి సత్త్వగోష్ఠియు నుత్తమమధ్యమాధమ భేదమ్మున మూఁడు విధమ్ము, లం దుత్తమంబు ముక్తిసాధనంబును, మధ్యమంబు స్వర్గ ప్రాప్తి సాధనంబును, నధమంబు భోగసాధనంబు నై తనరు. అట్ల పాణిగృహీతియం దుపచరించునది యుత్తమ రజోగోష్ఠియుఁ బాణిగృహీతయం దుపచరించునది మధ్యమంబును బరోఢ యందుపచరించునది యధమంబు నాఁ బరఁగు ; దుష్టశిక్షానిమిత్తం బగు యుద్ధం బుత్తమ తమోగోష్ఠియు దాయాదభాగనిమిత్తం బగునది మధ్యమంబును నిర్నిమిత్తం బగునది యధమంబును నగుం గావున మోక్షప్రదంబులగు పురాణగాథలు వినుటకన్న నొండు శుభంబుండునే ? యను మునివరులంగాంచి సూతుం డిట్లనియె.

సీ. పాలమున్నీటి లోపల శేషశయ్యపై
వెన్నుండు నిద్రించుచున్న కాల
మునఁ గర్ణమలమువలన నిద్ద అన్నద
మ్ములరీతిగా రక్కసులు జనించి
జలధి లోపలఁ గ్రీడ సల్పుచు నచట న
ల్గడల ఘూర్ణిల్లు న క్కడలిఁజూచి
ఆధార మొుఁడు లే కాధేయ ముండునే ?
యనిమిత్తమైన కార్యములు గలవె ?
గీ. యనుచుఁ దమ జన్మమునకు శంకాకులత్వ
మంది చింతిల్లి య్యాశ్చర్య మంది మోద
మంది యేమియుఁ దోఁచని యట్టియెడల
గైటభుఁడు సెప్పె మధువుతోఁ గారణంబు. ౧౨౧

క. వననిధిగాని మనముగా
ని నిమిత్తము లేక యుండనేర్తుమె ? మనకున్
వననిధికిని నాధారం
బనఘా ! యొకశక్తి యున్నదని యెఱుఁగవొకో ? ౧౨౨

వ. అను నవసరమున నాకసంబు నుండి యొక్క వాగ్బీజం బుద్భవింప నయ్యది గైకొని వారిరువురు దృఢమ్ముగ జపించుచుండ గగనంబున నొక మెఱుపు మెఱసినట్లయ్యె. దైత్యు లద్దానిం గాంచి విధిగా నియ్యది దేవీతేజం బని నిశ్చయించి య మ్మంత్రంబు మహామంత్రంబుగా భావించి జితేంద్రియులై యాహారంబు వర్జించి యొక వేయి వత్సరంబులు తపంబు సల్పుటయు, ౧౨౩

క. వారల ఘోరతపం బెద
నారసి కరుణించి యంబ యశరీరిణియై

"కోరుకొనుఁడు వర" మన న
వ్వారును స్వేచ్ఛామరణము వాంఛించుటయుఁ, ౧౨౮

క. మెచ్చితి నెద మీ తపమున
కిచ్చితి భవదీప్సితంబు నిటమీఁదఁ మీ
రెచ్చోఁ బోయినఁ బోవుఁడు
హెచ్చు గలుగుఁ గాని దైన్య మెనయదు మిమ్మున్.

క. అని చెప్పి యా పరాంబిక
చనిన పిదప జలమునందఁ జరియించుచు బ్ర
హ్మను గని యొకప్డు యుద్ధం
బునకుఁ రా రమ్మటనిరి పొగరు మిగులఁగన్. ౧౨౯.

గీ. యుద్ధ మొనరింపఁ జాలక యున్న వీర
భోగ్యమగు నీరజాసనమునకుఁ దగవు
కాన నాసనము డిగి యొందేనిఁ బొమ్ము
లేక యున్న యుద్ధమునకు లేచిరమ్ము. ౧౩౦

క. అని దనుజులు వలుకుటయును
వనజాసనుఁడంత భీతివడి యోగసమా
ధినిఁ జెంది యున్న విష్ణుని
గని యిట్లని మొఱ్ఱవెట్టె గద్గదగళుఁడై. ౧౩౧

సీ. రాకాసులకునై యనేకావతారముల్
మేల్మిఁ దాల్చినతండ్రి! మేలుకొనుము
సృష్టిస్థితిలయ ప్రసిద్ధి చేఁ దనరారు
లీల గల్గినతండ్రి ! మేలుకొనుము

ఆర్తులైనట్టి భక్తాగ్రగణ్యులఁ బ్రోవ
జాలి బూనినతండ్రి! మేలుకొనుము
సాత్త్వికంబైన తేజంబుచేతనె దుర్జ
నాళిఁ దునిమెడి తండ్రి! మేలుకొనుము

గీ. శంఖచక్రగదా ముఖ సాధనములు
కేలదాల్చిన నా తండ్రి! మేలుకొనుము
దుర్గమంబగు నిక్కట్టు దొలఁచునేర్పు
చాలఁగల్గిన నా తండ్రి! మేలుకొనుము. ౧౨౯

క. చంపెద మంచు నిరువురు ని
లింపారులు మీఁదఁ బడిరి; లే లెమ్ము; కటా
క్షింపుము కాపితునను, నను
కంపాకంపిత రసానుగతహృదయుఁడవై. ౧౩౦

—* బ్రహ్మ యోగనిద్రను స్తుతించుట *—

క. అనుచు నుతియించినను మే
ల్కని జనకుపాటుఁ జూచి కార్యము లేదం
చును యోగనిద్ర నిట్లని
కొనియాడఁ దొడంగె మేలుకొలుపు మటంచున్. ౧౩౧

ఉ. అంబ! జగత్త్రయమ్మునకు నాదివి నీ వని నాకు వేదవా
క్యంబులు సెప్పె నిక్క; మటుగాని యెడన్, సచరాచరస్వరూ
పంబగు నెల్లలోకమును బాలనఁ జేయు మహామహుండు ప
ద్మాంబకుఁడిట్లు నీకు వశుఁడై సుఖసుప్తి మునింగిపోవునే? ౧౩౨

ఉ. దాసవు లిత్తఱిన్ మిగులఁ దత్తరపాటొనరించుచున్నవా
రే నిఁక వారిబాధల సహింపఁగ లే నటుగాన నాకు నీ

దానవవైరిచే నభయదాన మొసంగఁగఁ జేయుమమ్మ; లే
దా, నను బాధలం జొనుపు దానవయుగ్మము నడ్డగింపుమా. ౧౩౩

ఉ. నీ వశమై తనర్చు నితనిం గని డగ్గఱి మేలుకొల్ప సౌ
ఖ్యావహమైన లచ్చియు ననర్హ గదా! జగదంబ! నీదు లీ
లా విభవంబు లెల్లెడ నలంఘ్యము లేరికిఁగాని యన్నచోఁ,
గేవల మస్మదాదుల నకించనులం గణియింప నేటికిన్. ౧౩౪

ఉ. వారు మహాప్రసిద్ధి గలవారు జగద్గణనీయవైభవుల్
వారు పురాకృతంబు గలవారలవా రిల వేల్పులుంగ కే
వ్వారు భవద్వరాంఘ్రియుగవారిరుహాభ్రమరాయమాణు లె
వ్వారు భవామయాపహభవద్భవితవ్యకటాక్షవీక్షితుల్. ౧౩౫

ఉ. ఎక్కడడాఁగె నా తెలివి? యేమయిపోయె శుభప్రవృత్తి? యిం
కెక్కడఁజొచ్చె నా గుణము? లీ హరి యీ గతి నిద్రనొంటె న
మ్మక్క! భవద్విలాసకల లక్కజముల్ జననీ! జగమ్ములో
నొక్కతె వీవు దక్క మఱి యొండొరు లిట్టిసమర్థులుండిరే? ౧౩౬

ఉ. మొట్టమొదల్ జగమ్ముల సముద్ధతిఁ బ్రోవుమటంచు నితనిన్
బుట్టఁగఁజేసి యప్పనినిఁ బూని చరించుచు నున్న వానిఁ జేఁ
గట్టిఁడివైన కదమ్మ కడకంటను జూడఁగ నియ్యకొంటి; నీ
కెట్టిలు దోఁచునో యటుల యేర్పడఁజేసెద; వష్టువార మే? ౧౩౭

గీ. పుట్టఁ జేసిన యట్టి నన్ గిట్టఁజేయ
నిచ్ఛయే నీకు లేకున్న నిట్టి రక్క
సుల సృజింపఁగ నేల? భీతిలెడి నన్నుఁ
గని హసించుటకై యేమొ జనని చెప్పుమ. ౧౩౮

నీ చరితంబు నే నెఱుఁగనే? జగమెల్ల సృజించి పెంచి సం
కోచము లేక చంపఁ దొరకొందువు; నీ కెటు నన్ను మాత్రముం
గాచుట కిచ్చవుట్టు? మృతి గల్గఁగఁ జేసిన నీవ చేయు, వి
నీచులు చంపిరేనిఁ గడు నిందకుఁ బాత్రుఁడనౌదుఁదల్లిరో! ౧౩౯

అమ్మరో! లెమ్ము వేగమె మహాద్భుతమై తనరారు నీ స్వరూ
పమ్ము ధరించి నన్నయిపుఁ బట్టి వధింపుము; లేకయున్న న
న్నిమ్మెయి బాధలం జొనుపు నిక్కటిలాత్ములనైనఁ జంపు; క
ష్టమ్మునకోర్వఁజాల; నకటా! హరినైన ననుమేలుకొల్పుమా.

క. అని నుతియించెడి వనజా
సనుపైఁ గరుణించి, నిద్ర చనె సరసీజా
క్షుని విడిచి; సరసిజవిలో
చనుఁడును మేల్కాంచె, ధాత సంతసపడఁగన్. ౧౪౧

—* శక్తిస్వరూప కథనము *—

క. అన విని మును లిట్లని రో
యనఘా! మా కొక్క సందియము కల్గెను; దా
నిని వినిపించెద; మది నీ
వినినంత యెఱుంగఁ జెప్పవే దయమీఱన్. ౧౪౨

గీ. హరిహరబ్రహ్మ లనఁగ మూఁగురు మహాత్ము
లం దొకఁడు పెంచు నొకఁడు లయం బొనర్చు
నొకఁడు సృజియించుఁ గాని యందుత్తముండు
హరి సమర్థుండు సర్వకార్యములయందు. ౧౪౩

గీ. అట్టి హరి యోగనిద్రచేఁ గట్టువడిన
యప్పు డాతని శక్తియు నతని తేజ

మెచటి కేగెను? శక్తికి నితనికన్న
నెక్కుడగు శక్తి గల్గుటయేల? చెపుము. ౧౪౪

గీ. నారదాది మహాత్ము లందఱును మాకు
హరియె కారణకారణం బనుచుఁ జెప్పి
రీవు మాత్రము శక్తియ చెలుఁగఁ జెప్పి
తెద్దియో నిక్కువంబు మాకెఱుఁగ రాదు. ౧౪౫

వ. అనిన విని సూతుండిట్లనును. మునీంద్రులారా! మీ యడిగిన
యర్థంబు సావధానమనస్కులరై యాలకింపుఁడు. మహామతి
గోచరంబగు నీవిషయంబున బ్రహ్మపుత్రులగు నారదాదులును
మోహమ్మునం జేసి దురవగాహంబగు శక్తిప్రభావం బెఱుఁగలేక
జనార్దనుండు పరుండనియు సర్వకర్త యనియు సకలాగమవేద్యుం
డనియు భ్రమించుచున్నవారు. ౧౪౬

ఉ. అంగజవైరి సర్వహృదయంగమచిత్రచరిత్రుఁ డద్రిజా
లింగితమూర్తి మూర్తపరిలిప్తవిభూతి విభూతిదాత త్రి
య్యంగనకుం బ్రియుండు రజతాచలవాసుఁడు శంకరుండు మా
కుం గులదైవ మంచు మఱికొందఱు సేవ యొనర్తు రెంతయున్.

ఉ. కొందఱు సూర్యుఁ డంచు మఱికొందఱు పావకుఁ డంచుఁ గొందఱా
యిందుఁ డటంచుఁ గొందఱు సురేంద్రుఁ డటంచు నబింద్రుఁ డంచుఁ బే
రొక్కొందరు; కొంద 'ఱెయ్యదియొకో' యని సందియమందుచుండు నీ
చందమునన్ జగంబు పలుచాయల మాయలలోన మున్గెడిన్.

గీ. "ఎవఁ డెవనిఁగాని సేవించు నేమి కొదవ?
సకల నదులును జలధికిఁ జను తెఱఁగున

సర్వదేవనమస్కృతుల్ సరసిజాక్షు
నంద పర్యాప్తము లటంచు " గొంద ఱందు్రి. ౧౪౯

వ. కొందఱు ప్రత్యక్షానుమానోపమానంబులనియుఁ గొందఱు ప్రత్యక్షానుమానోపమానశబ్దంబులనియుఁ గొందఱు ప్రత్యక్షానుమానోపమానశబ్దార్థాపత్తులనియుఁ బ్రమాణంబులు సెప్పుదురు. పౌరాణికులు మాత్రము సాక్షియు నైతిహ్యమ్మునుంగలియఁ బ్రమాణంబు లేడని యొప్పుదురు. తత్తత్ప్రమాణాగోచరంబై యొప్పునది పరశక్తియ కాని వేఱొండు కాదు. అమ్మహాశక్తి యంతు సృష్టిరూపమ్మునను విష్ణునందుఁ బాలనరూపమ్మునను శివునియందు సంహారరూపమ్మునను సూర్యునియందు దీప్తిస్వరూపమ్మును వాయువునందుఁ బ్రేరణస్వరూపమ్మునను వహ్నియందు దాహకతారూపమ్మునను వెలుంగుచుండు. ౧౫౦

ఉ. శక్తివిహీనుఁ డేపనికిఁ జాలఁడు ; శక్తియ సర్వభూతసం
సక్తతఁ జెంది సర్వకృతిసాధనమై తనరారుచుండు ; నా
శక్తియ ముక్తికారణము ; శక్తియ సర్వము ; శక్తిలేనిచో
శక్తులు గారు రుద్రహరిసారససంభవముఖ్యనిర్జరుల్ ౧౫౧

గీ. అమ్మహాశక్తి సగుణయు నగుణయునన
రెండుదెఱఁగులఁ దనరారుచుండు ; నందు
రాగులకు సగుణ సేవ్య ; విరాగులకును
నిర్గుణాత్మిక సేవ్య ; మునివరులార ! ౧౫౨

క. ఈ కలికాలమునందు న
నేకు లనేకులను గొల్చి యిహాముం బరముఁ

బోకడఁ బెట్టుదు, రల దే
వీకారుణ్యమ్ముఁ గాంచువిధము నెఱుఁగమిన్. ౧౫౩

ఉ. వేయి కదుక్తు లేల? యిఁక విష్ణువు గిష్ణు వటంచుఁ జెప్పుబల్
మాయలమారిపండితుల మాటలు నమ్మక, సర్వశక్తియై,
మాయకు లోను గాక, పరమప్రణుత ప్రథితప్రభావను
శ్రీయుత యైన యజ్జననిసేవయె పావన మంచు నెంచుఁడీ. ౧౫౪

క. హరికతన విరించియు న
వ్విరించి కడ నారదుఁడును, విని రియ్యది; మ
ద్గురుఁకు న మ్మునిచెప్పెన్
గురుఁడిది యెఱిఁగించె నాకుఁ గోవిదులారా. ౧౫౫

క. ఆ శక్తి యనుగ్రహమునఁ
గేశవుఁ డటు మేలు గాంచి కెలనఁ సభయుఁడౌ
నాశుఁడై తగువిధిఁ గని
పేశలఫణితి నిటు పల్కెఁ బ్రేమదలిర్పన్. ౧౫౬

క. తపమును మాని యిచటి కే
నెపమున వచ్చితివి వత్స! నీ మనమిట్టుల్
దపియింప నేమి హేతువు
సెపుమా యన ధాత యిట్లు చెప్పఁ దొడంగెన్. ౧౫౭

క. భవదీయకర్ణమల సం
భవులై మధుకైటభు లనఁ బరఁగెడి రక్షః
ప్రవరులు ననుఁ జంపెద మని
బవరమునకుఁ బిల్చి రిఁకఁ దపం బెటు తండ్రీ! ౧౫౮

—* మధుకైటభ యుద్ధము *—

వ. ఇవ్విధంబునఁ గుయి వెట్టుటయు జలజలోచనుండు, ౧౫౯

క. భయపడఁగ నేల? కడు దు
ర్జయు లగు దానవులనెల్లఁ జంపెడి నాచే
వ యెఱుఁగవె? యను నాలోఁ
బయిఁ బడి ర ద్దనుజవరులు పద్మజు నొంపన్. ౧౬౦

ఉ. వచ్చి విరించిఁ గాంచి "నినుఁ బట్టఁగ లేమని పాఱి వచ్చి తీ
వెచ్చట డాఁగినన్ విడుతుమే? నినుఁ గావఁగ నీతఁ డోపునే?
చచ్చెడివాఁడ వొక్కఁడవె చావక యీతనిఁ గూడఁ జంపఁగా
వచ్చినవాఁడ; వింతగుణవంతులు లోకమునందుఁ గల్గిరే; ౧౬౧

ఉ. చేసితిఁ బాఱిపోక యని సేయుము వీరుఁడవేని; లేక మీ
దాసుఁడ నంచుఁ బల్కుము; వృథావచనంబుల లాభమేమి? "యం
చా సురవైరు లిర్వురు రయమ్మునఁ బైఁ బడినంతఁ, గేశవుం
డోసరిలంగ నెంచు కమలోద్భవు వెన్కకుఁ జేర్చి యిట్లనున్.

ఉ. క్రిందను మీఁదనుం గనక పేలెద రింత మదంబు హెచ్చెనే?
తొందర మానుఁ డిప్పుడ కుతూహలము న్నెఱవేర్తు రం డటం
చుం దలపడ్డ దానికి సహాయమెయుం గని యమ్మధుండు గో
విందుని మాఱ్కొనెన్ సమరభీకర బాహుబలాభిశోభియై. ౧౬౩

గీ. అంబ యాకసమందుండి యరయుచుండ
నంచ రౌ తంబునిధినుండి కాంచుచుండ
హరియు న య్యమరారియు నఱిమిఱెగఁ బె
నంగ సాఁగిరి సంమ్రదంబు పొంగి పొరల. ౧౬౪

గీ. బాహుయుద్ధంబుచేఁ గొంత బడలి యున్న
యన్న వారించి కైటభుం డసమభుజబ
లంబు దీపింప మల్లయుద్ధం బొనర్ప
దలపడియె ధాతమది కొంత తల్లడిలఁగ. ౧౬౫

ఉ. అన్నయుఁదమ్ముడుం గలసి యా హరి నాహవలీల బాహుగ
ర్వోన్నతి మార్కొనన్, జలధు లూరక తల్లడిలంగ సాగఁగ; ని
ట్లెన్నఁగ రాని విక్రమము నేఁబదివందల యేండ్లు సూప నా
పన్నగశాయికిన్ మిగుల భారముదోఁచెఁ గ్రమక్రమమ్మునన్. ౧౬౬

క. ఏదియుఁదోఁచక కడుఁ జెం
పేది ముదముఁ దక్కి యెట్టు లీ రక్కసులన్
బాధింతు నిచట నిఁక ది
క్కేది! యనుచుఁ జింతసేయునెడ నాతనితోన్. ౧౬౭

వ. ఉక్కు మిగిలి రక్కసు లిట్లనిరి. ౧౬౮

చ. బవరము సేయఁ బూనుటకు బాహుబలంబుడివోయెనేనిఁ జొ
ప్పు విడిచి 'మీకు దాసుఁడను బ్రోవు' మటంచును బల్కు; మట్టుఁ ప
లుక విధికి నొప్పవేని, నినుఁగూల్చి, యనంతరమున్ నుఁ బాక
ద్భవుఁ గడతేర్తు మన్న బెడిదంబునకున్ హరి సామమొప్పగన్. ౧౬౯

క. అలసినవారల మిక్కిలి
సొలసినవారలను భీతిఁ జొక్కినవారిన్
దలఁకి యిలఁ బడినవారిన్
దలపడ రిది వీరవరులధర్మము యెంచన్. ౧౭౦

చ. అదియును గాక మీ రిరువురొంటను నేనొకరుండనైతి మీ
రదనుఁ బరిశ్రమాపహరణార్థముగా దొరకొంటి నేనునున్

గదన మొనర్తు నొక్క త్రుటికాలము దన్కను విశ్రమించి ; యం
తదనుక నోపుఁడీ ! కదనధర్మము మర్మము మీ రెఱుంగరే ?

చ. అనుదనుజారిపల్కు విని యద్దనుజుల్ తగ విశ్రమింపు మం
చును సమరంబు మాని యొకచోటను దాము విశ్రమించి ; 'ర
ద్దనుజులు శక్తిదత్తవరదర్పితు' లం చొగి దివ్యదృష్టిచే
త నతఁ డెఱింగి " చేసితి వృథారణ మేమి యుపాయమియ్యెడన్,

క. వీరలు స్వేచ్ఛామరణము
గోరి వరంబంది యున్న కుమతులు ప్రాణం
బేరికి నైనను జేదే ?
వీరికి మృతి యెట్లు " లనుచు విహ్వలమతియై. ౧౭౩

ఆ. వె. ఎట్టి రోగియేని యెట్టి యాపన్నుండు
నేని యెట్టి రిక్తుఁడేని బ్రదుకు
నాస సేయుఁగాని, యాసింపఁడెంతటి
మందుఁడేని తాను మ్రందు తెఱవు. ౧౭౪

వ. ఇట్లు, ౧౭౫

క. సారెకుఁ జింతిలి " దేవీ
కారుణ్యము లేక వీరిఁ గడతేర్పఁగ రా
దేరికి " నంచును సద్దను
జారి నుతింపం దొడంగె నజ్జగదంబన్. ౧౭౬

చ. జనని ! జగద్విరోధిజనసంహరణప్రవణ ప్రభావ ! మో
హిని ! పరతత్త్వరూపిణి ! మహేశ్వరి ! కామితదాయినీ ! జగ
జ్జననవిధాయినీ ! సతతజాగరిణీ ! కరుణానుసారిణీ !
నిను నుతియింప నేరఁ గరుణింపుము నింపుము కూర్మి నాపయిన్

క. నీ విచ్చిన వరమునఁ గడుఁ
గావరముం జెంది యనికిఁ గాల్ద్రవ్వెరి త
ల్లీ! పీ రిరువు రొకరుఁడను
నే వాఁడిమి చూప నేర్తునే? వీరలపై. ౧౭౮

క. ఈయెడ వీరల జంపు ను
పాయము వేఱొండు నీ సహాయము దక్కన్
నా యెఱిఁగినంతలో లే
దో యమ్మా! యూరకుంట యుక్తమె? సెకున్. ౧౭౯

గీ. ఈ వృషేశు యొనర్చిన నిపుడు నన్నుఁ
బట్టి చంపెదరమ్మ! యీ పాపకర్ము
లనుచు విలపించుహరిఁ గాంచి యంబ పలికెఁ
జిఱునగవు నెమ్మొగమ్మునఁ జెంగలింప. ౧౮౦

క. "నా మాయచేతఁ గప్పెద
నీ మానవ భక్షకుల జయింపు" మనుడు సం
గ్రామమున కభిముఖుండగు
దామోదరుఁ గాంచి మిగుల దర్పమెలర్పన్. ౧౮౧

'జయముఁ బరాజయమ్ము సహజమ్ములు శూరులకున్ బరాజయో
దయమునకున్ గృశింపకుము; దానవులెందఱినేని మున్ బరా
జయమున ముంపవే! జయము శాశ్వతమే?' యనిపల్కు దానవ
ద్వయిఁ గని మాధవుం డనుగతప్రణతప్రథితప్రతాపుఁడై. ౧౮౨

క. కడుఁ గర్కశ మగుగతి నె
క్కుడు కోపము గదుర నెదురుకొని ధీరత్వం

బెదరంగ దనుజులం బిడికిటం
బొడిచిన సన్నాహమున నడియుం బొగరుమిగులంగన్. ౧౮౩

క. ఒక్కుమ్మడి నా యిరువురు
రక్కసు లార్పులు సెలంగ రక్తము తోడ్తోం
గ్రక్కుచు నుక్కఱంగ నెక్కొని
యక్కమలాక్షుని యురంబు నదరన్ బొడువన్. ౧౮౪

వ. హరియును మరలన్ బొడిచె నిట్లు పరస్పరజయేచ్ఛం గొంతవడి
సంకులంబగు సంగరంబు ప్రవర్తిల్లుటయు. ౧౮౫

క. భామిని నెత్తురు గ్రమ్మంగ
సొమ్మసిలి రమానాథుండు చూడ్కుల దీన
త్వమ్ము గదురంగాం దన కూ
ర్ధ్వమ్మునం గనుపట్టుదేవి భావనిం గాంచెన్. ౧౮౬

ఉ. చూచినయంత నా త్రిపురసుందరి లో దయమీఱ, మారనా
రాచములో యనందగు సరాళకటాక్షపరంపరన్ దమి
స్రాచరయుగ్మమున్ బొదువ రక్తిమెయిన్ దనుజన్ములా యమం
జూచుచుం గామబాణముల సొక్కిరి తక్కిరి యుద్ధపద్ధతిన్. ౧౮౭

శా. ఆ మందస్మిత మా కటాక్షవిభవం బా భావ మాహావ మా
గోమున్నోమును బ్రేమ మీఱం గని సంకోచించుచున్ గామసం
గ్రామార్థంబు ప్రయత్నమున్ సలుపు రక్షస్సైన్యములన్ మాధవుం
డామోదమ్మునం జేరి యిట్లనియె ధైర్యస్థైర్యసంపన్నుండై. ౧౮౮

ఉ. ఎందఱినేని మున్ను దనుజేంద్రులం జూచితిం గాని మిమ్ము బో
లం దగువార లే రణకలావిభవమ్మున ? మీ రణంబు నా

డెందమునందు మోదము ఘటింపఁగఁ జేసె; భవన్మనోరథం
బుం దెలియంగఁజేయుఁడది పూర్తి యొనర్తునటన్న రక్కసుల్,

తే. గీ. అమ్మహామాయచే మోహితాత్ములైన
కారణంబున నభిమాన శూరులగుచుఁ
గల్లఁ గపటంబు నెఱుఁగక కంజనేత్రు
నీసడించుచు దరహాస మినుమడింప, ౧౯౦

గీ. నిన్నడుగువారమే మేము? నీవు మాకు
దాతవే? చాలు నింత యాతురము లేదె?
వలసె నేనియుఁ గోరుకొ మ్మొలమి మేమ
వరము నీకిచ్చెదము నాఁగ హరియు నెఱిఁగి, ౧౯౧

క. ఏఁ గోరినవర మొసఁగెద
రాఁగా? నాయుద్ధ మాత్ర యానందము మీ
కీఁగలిగెనేని వధ్యులు
గాఁగోరెద ననుచు వాండ్రు కళవళపడుచున్, ౧౯౨

వ. కొండొక చింతించి, ౧౯౩

గీ. సత్యపరిపాలనమ్మును సలిపెదేని
మాకు వర మిచ్చెద నటన్న మాటదలఁచి
జలము లేని విశాలదేశమున మమ్ము
నొంపు మట్లైన నీకు వధ్యులమ మేము. ౧౯౪

క. అని దనుజులు పల్కిన న
వ్వనజాక్షుం డట్లు సేయువాఁడై నగి య

మ్మనుజాశనుల వధింపఁగఁ
దన యూరులు పెంచి " రండు దానవు " లనుచున్,

వ. వారును దదధికంబుగ శరీరమ్ము పెనిచిన, ౧౯౬

క. అసురారి యూరువులు ర
క్కసు లంగము లిట్లు పెనుపఁగాఁ దుదకా రా
క్షసుల శరీరమునకు వె
క్కస మయ్యెఁ దదూరువు లధికము లగుకతనన్. ౧౯౭

వ. అంత, ౧౯౮

క. తన యూరుభాగమును జెం
దిన హరియును వారలన్ వధింపఁగఁ జక్రం
బును దలఁచిన నది వైళమ
దనుజన్ములఁ బ్రాణములకుఁ దక్కన్ జేసెన్. ౧౯౯

ఆ. వె. వారిమెదడు జలధివారిలోఁ బడి పెద్ద
తిప్ప యయ్యె వసుమతికిని నాఁడు
మొదలు 'మేదిని' యనుపదము తటస్థించెఁ
దాన మన్ను తినఁగ రానిదయ్యె. ౨౦౦

గీ. నాయెఱింగినంత మీకు విన్నపము చేసి
కొంటి సగుణయొ లేక నిర్గుణయొ సేవ
నీయ పరశక్తియే యింత నిజము నిజము
వేదశాస్త్రంబు లియ్యెడ విశ్రుతములు. ౨౦౧

—* వ్యాసునకు సూరుఁడు ప్రత్యక్షమగుట. *—

క. అని చెప్పిన సూతుం గని
మును లిట్లని రట్లు వ్యాసమునిచంద్రుఁడు హే
మనగమునకుఁ దపమునకై
చనె నని చెప్పియును దత్ప్రసంగవశమునన్. ౨౦౨

గీ. ఇతరకథ లెన్నియో చెప్పి తీవు మాకు
మొదటివృత్తాంత మది తుదముట్టదయ్యె
నదియ మా కెఱిఁగింపవే యనెడి మునుల
కిట్లనియె సూతుఁ డాదరం బెసక మెసఁగ. ౨౦3

సీ. అట్లు హేమనగమ్ము నందలి కర్ణికా
ర వనమ్మునందు నారదుఁడు మున్ను
తనకుఁ జెప్పిన మంత్రమును జపించుచుఁ "పంచ
భూత వీర్యుండగు పుత్త్రుఁ డబ్బ
వింపఁగావలె" నంచు వేదాంతవేద్యయై
తనరుశక్తిని జిత్తమునఁ దలంచి
శతవత్సరమ్ము లశనము వర్జించి త
పం బొనర్చుచునున్న వ్యాసమునికి

గీ. కెంజడలు గట్టె శిరము, శుష్కీభవించెఁ
దనువు, కంపించె భూనభోంతరము లెల్ల
దాన నింద్రుఁడు భయమంది తాను సురలు
శివునిపాలికిఁ జని యిట్లు చెప్పికొనిరి. ౨౦౪

గీ. దేవ! దేవేశ! సత్యవతీ సుతుండు
తప మొనర్చుచు నుండె వత్సరములొక్క

నూఱు గతియించె దానఁ దుందుడుకు పుట్టెఁ
బ్రోవవే! యన నమ్మహాదేవుఁ డనియె. ౨౦౫

గీ. తాపసుల కపచారముల్ దలఁప రాదు
వార లొరులను భాధించువారు కారు
ఇమ్మని సుతార్థియై నన్ను నెడఁద శక్తి
సంయుతుని నిల్పి జపియించు జంభభేది! ౨౦౬

వ. అని చెప్పి యద్దేవుండు సశక్తికుం డగుచు మునికిఁ బ్రత్యక్షమై యతని మనోరథంబు సఫలంబుగా వరం బొసంగినఁ గృష్ణద్వైపాయనుం డయ్యనఘునకు నమస్కరించి తదాజ్ఞ వడసి స్వాశ్రమంబున కరిగి, ౨౦౭

మ. అరణిం దెచ్చి మథించి యగ్నికయి యం దావిర్భవం బందున
గ్నిరుచిం గాంచి యెసంగు తేజమున వీనిం బోలు పుత్రుఁ యశ
స్కరు నే నేగతిఁ గాంచువాఁడ? సుతసంస్కారమ్ము గావించున
య్యరణుల్ యోగ్యత గల్గుకామినులు నా కాభాగ్య మిప్పున్నదే!

వ. అని మఱియును, ౨౦౮

సీ. తనయిచ్చుఁ బోవుజంత్రపుముద్దుకీల్బొమ్మ
విందుగాఁ దగు చేఁదు వేముచెట్టు
అనుమానములకుఁ గట్టనికొంప ప్రక్కలో
నోఱపు నించెడి వాఁడికఱకుటమ్ము
పొల్లుగాఁ బున్నెముల్ జల్లించుజల్లెడ
భ్రాంతి పుట్టించు నబ్రంపుమందు
పెనుదోసములకుఁ బెట్టినపేరు దుఃఖంబు
సౌఖ్యమ్ముగాఁ జూపఁజాలువిద్య

గీ. కాలిసంకెల బొంకులకాలయంబు
మచ్చికఘటించుపాము కామములదీము
కోపములప్రాపు మిత్తిఁ గైకొన్నరూపు
గాదె కామిని ; యిట్టిసంగాత మేల ? ౨౧౦

గీ. అనుచుఁ జింతించుచున్న యావ్యాసమునికిఁ
గన్పడె ఘృతాచి గగనభాగమ్మునందు ;
దానిఁ గనుఁగొన్నమాత్రన గాననయ్యె
మదనుఁడును గోపఘూర్ణితవదనుఁడగుచు, ౨౧౧

క. కనుఁగొని యయ్యది తనువం
చనఁ జేయఁగ వచ్చినదని సందియపడి కా
మునిబారిఁ బడియుఁ గసుగం
దని తెలివికతమున నిట్లు తలపోసె మదిన్. ౨౧౨

ఆ. వె. ధర్మచింత సేయుతఱి నేలవచ్చె నీ
కలికిమిన్న ? వచ్చుఁగాక దీనిఁ
గొని సుఖింపరాదె ? కొనిసుఖించిన మునుల్
నవ్వకుందురెట్లు నన్నుఁ జూచి ? ౨౧౩

గీ. నగిన నేమగు ? నీకాంత నా కనంత
సుఖ మొసఁగి మది నాపయిఁ జొనుపునొక్కొ ?
మును పురూరవు నూర్వశీవనితవిధము
చేసి వలవంతలకుఁ బాలు సేయునొక్కొ ? ౨౧౪

క. అని వ్యాసుఁడు చింతాకుల
మనస్కుఁడయ్యె నన మౌనిమణులెల్లరు సూ
తునిఁగాంచి యప్పురూరవుఁ
డననెవ్వఁడు తెల్పుమనిన నతఁ డిట్లనియెన్. ౨౧౫

—* ఋధ్యోత్పత్తి *—

ఆ. వె. కలదు తార యనెడికామిని యలబృహ
స్పతికి దార గుణవిచారదూర
విజితమారదార విపులకటీభార
కడునుదార చారుకాంతిపూర. ౨౧౬

క. ఆరామ యొక్కదినమునఁ
దారాపతియింటి కరుగ దానియొయ్యారం
బారసి యారసికాగ్రణి
మారశిలీముఖవిదార్యమాణుం డయ్యెన్. ౨౧౭

క. ఆకాంత తమీకాంతుని
యాకారముఁ గాంచి విస్మితాంతరయై యు
ద్రేకంబుఁ గొని యూఁకొన
నా కాముని బారిఁ బడియెనఁట యేమందున్ ! ౨౧౮

మ. ఇటు లన్యోన్యమనోనురాగములపెం పేపార నాతారయున్
గుటిలాత్ముండగుచంద్రుఁడున్ గలిసి కోర్కుల్ మిన్నుముట్టంగ లం
పటులై సౌఖ్యము సోలుచుండి రఁట! చెప్పన్ శక్యమే దైవసం
ఘటనానైపుణి,యాతఁడయ్యదియొ! యకంజాక్షియేయాతఁడో!

గీ. ఇటు లనేకదినమ్ము లయ్యెందునింట
నుండి రాకున్న గురుఁడు నయ్యువిదకొఱకు
శిష్యు నొక్కని నంపె దేశికునియాజ్ఞ
వాఁడు దెల్పిన వినదయ్యె వారిజాక్షి. ౨౨౦

వ. పిదప నయ్యంతేవాసి గురుసమీపమ్మునకుం జని సకల వృత్తాం
తమ్ము నెఱింగించుటయు బృహస్పతి చింతాకులుండై మఱియొకరు
నింకొకరు వేఱొకరు నంపియుంపి విసివివిసివి తుదకు రోషాయత్త
తాత్ముండగుచుఁ జంద్రుపాలికిం జని తన్నుం గాంచి మదమ్మున నగు
నతని కిట్లనియె. -౧.౨౧

శా. ఔరా! చంద్రి! వివేకహీన! గురుభార్యన్ గైకొనన్ జెల్లునే?
యీరామన్ మరుకేళి కాసపడి గాకింకెట్లు నీవుంచితో
రీ! రాత్రించర! యూరకే గృహమునం దీయింతిఁ బోషింతువే?
మేరన్ మీఱితి నీకు నేఁడె యమునిం జూపింతు, శాస్త్రజ్ఞులుండ్రా!

గీ. బ్రాహ్మణునిఁ జంపువాఁడును కల్లుద్రావువాఁడు
కనకహారియు గురుకాంతఁ గవయువాఁడు
వీరలును వీరితోఁ జెల్మిఁ గోరువాఁడు
గలసి పంచమహాపాతకులు దలంప. -౧.౨౩

ఉ. కావున నిట్టిపాతకికిఁ గల్గునె స్వర్గనివాస, మోరిచంం
ద్రా! విడు మీవెలంది, గురుదారయుఁ దల్లియు నొక్క-టే కా
దే! వివరించి చూడుము మదిన్, మతిమంతుఁడ వీ వెఱుంగనే?
దేవతలెల్ల నవ్వరె? విధింపఁడె శిక్ష నిలింపభర్తయున్? -౧.౨౪

వ. అని కోపోద్రేకంబునం బల్కు-దేవమంత్రిం గని చంద్రుం డల్లన
నిట్లనియె. -౧.౨౫

ఉ. కోపము బ్రాహ్మణోత్తములకుం దగునే? యిదె తాపమా యిఁక తా
నే పయనంబు సేయఁగల దిప్పుడ యంచొక ధర్మశాస్త్రమా?
కాఁపురముండునే! యిచటఁ, గాఁపుర మున్నను లోపమా! మన
స్తాపము చెందనేటికి? బుధప్రవరత్వ మదెల్లఁ బోల్పుగన్. -౧.౨౬

క. వనిత పరపురుషుఁ గలిసియు
ననఘ యగు రజఃప్రసక్తి; నగ్రజుఁ డఘముం
బొనరించి వైదికకర్మం
బున శుద్ధుండగు; నటంచు మును నీ వనవే? ౨౨౭

వ. అని సయుక్తికమ్ముగాఁ బల్కు-శిష్యునికి మాఱాడం జాలమి మనమ్మున విషాదంబు పెనంగొనంగ నిజగృహమ్మునకుం జని కొన్ని దినమ్ములు ప్రతీక్షించి భార్య రాకుంటకుఁ జింతాక్రాంతుండై మదనపీడితుండై మరల శిష్యునిపాలికిం జనునెడ ద్వారికునిచే నివారింపం బడి కన్నుల విన్నదనంబు వొడమఁ గోపాటోపంబు దీపింప నెలుఁగెత్తి యిట్లనియె. ౨౨౮

ఉ. ఓరి! దురాత్మ! యెంతటి దురాచరణం బొడిగట్టినావురా!
దారను చూడనేగు నను ద్వారమునం దొకఁ డాఁగువాఁడె? నా
నీరజనేత్ర నా యతివ నీకు స్వతంత్రమె? నాకు దూరమే?
ధీరవినింద్యు నిన్నుఁ గడతేర్చెద శాపమొసంగి నావుడున్. ౨౨౯

చ. వెలఁది వెలంది యంచుఁ బలవించెదవేల! సమస్త లక్షణం
బులు గల యీనెలంత నినుబోటి దరిద్రునియింట నుండ రా
వలయునె? యింతి కావలసివచ్చిన నీ కెనయైన బోటితోఁ
గలిసి సుఖింపు, మీ జలజగంధినిఁ గూడి సుఖింప నేర్తువే? ౨౩౦

క. చదివితివి సకలవిద్యలు
మదనాగమ మీవొకింత మదినెఱుఁగవయో!
ముదిత తగువానిఁబొందున్
వదలున్ దూరమునఁ దగనివాఁడగు నేనిన్ ౨౩౧

ఉ. ఇంత విచార మేల ? విను మే బహుభాషలవాఁడఁ గాను ; నీ
యింతి నొసంగ ; నీవిఁక యథేచ్ఛఁ జనం దగుఁ ; గామబాధిత
స్వాంతుఁడవైన నీ వొసఁగుశాపము నన్ దగులంగఁ బోదు కా
సంతయు ; నీకుఁ జేయఁదగునంతయుఁ జేయుము పొమ్ము నావుడున్ ;

వ. గురుండు చేయునది లేక యిందుప్రాలికిన్ జనుటయు, ౨౩౩

ఉ. వచ్చిన దేవమంత్రిముఖు వైఖరి వేఱొకరీతిఁ దోఁపఁగా
నెచ్చట నే యుపద్రవము నెవ్వరిచే నితఁడొందె నొక్కొ ? యా
చచ్చపు భక్తిమై నతని నర్చితుఁ జేసి మహాత్మ ! యెంతయున్
సచ్చరితుండ వీ విటు విచారము నొందఁగ నేల చెప్పుమా.

గీ. నాకు గురువైన నీకు బన్నం బొనర్పఁ
గా నెవఁడు సాహసించె ! సవ్వాని దెల్పు ;
మీక్షణమ సంహరించెద ; నిందు నాకు
హరిహరబ్రహ్మలును బాస టగుట ధ్రువము. ౨౩౪

క. అన గురుఁడిట్లను నా భా
ర్యను జంద్రుం డపహరించె నకటా ! బలిమా
లిన 'నీను పొమ్ము పొ' మ్మని
యెను నా గృహిణీలలామ నిప్పింపఁగదే. ౨౩౫

సీ. అంగనామణిలేని యాశ్రమంబు శ్రమంబు
భార్య లేకున్న సంపత్తి మిత్తి
అర్థాంగి పెట్టని యన్నంబు సున్నంబు
సహధర్మిణికిఁ గాని శయ్య కొయ్య
గృహిణిపొందిక లేని కేలిక తేలిక
యిల్లాలు లేకున్న యిల్లు ముల్లు

సహచారిణికిఁగాని సంగంబు భంగంబు
సతిచేతఁ బెఱుఁగని సుతులు మృతులు

గీ. శిష్యుఁడవు గాన నీతోడఁ జెప్పికొంటి
నా తలోదరి నిప్పించి నా మనోర
థమ్ము నీడఁగూర్పు; మీరీతిఁ దలఁపవేని
సన్న్యసించెదఁగాని సంసార మొల్ల. ౧౩౮

చ. అని పలుకన్ మునుంగు గురు "నాతురతం గననేటికయ్య? యా
పెను శోకయింతలోన విడిపించెదఁ, గాదని చంద్రుఁ డెంతయున్
వినక బలాత్కరించినఁ బలిం జవిఁజూపి మదం బడంతు దు
ర్గ్గనుఁ [illegible]మస్మృతము సల్పెనహా" యని చింతనొందుచున్;

వ. వస్తువ్యాసం బుపదేశించి దూరం బుచ్చుటయు వాఁడు శశిపాలికిం
జని, ౧౩౯

సీ. కన్నసంతానంబుకన్న నెక్కుడుగార
వించి పెంచుటయైన నెంచవైతి
గురుభార్య తల్లి కెక్కు డటంచు వచియించు
ధర్మశాస్త్రంబైనఁ దలఁపవైతి
మునుల కెల్లను శిరోభూషణంబగు తండ్రి
పరువొకింతైనఁ గాపాడవైతి
సరిగాఁ జదువుకొన్న సహపాఠు లగు మాదృ
శుల ప్రతిష్ఠలనైనఁ జూడవైతి

గీ. ధర్మవిదుఁడవు నీతిశాస్త్రజ్ఞమతివి
రాజవు కలానిధివి ద్విజరాజటన్న

యశము గైకొన్న మేటి వయ్యయ్యో ! చంద్ర !
గురుకళత్రంబుతోఁ బొందుఁ గోరఁదగునె ? ౨౮౦

క. ఇరువది యెనమండ్రు తలో
దరులుండఁగ మేనకాది ధనకామిను లు
ద్ధుర యౌవనవతు లుండఁగ
దొరకెనె గురుకాంత నీకుఁ ? దోయజవైరీ ! ౨౮౧

క. నీవంటి తెలివి గలిగిన
కోవిదుఁ డిటువంటి పనులకుం జొరఁబడఁగా
నేవాఁడు సంశయించును ?
నీ వెఱుఁగవె, ధర్మనియతి నిలుచునె యింకన్ ? ౨౮౨

క. పలుమాట లేల దేశికు
కళత్రమును విడిచి పెట్టఁగాఁ దగు, మనకున్
గలహమ్ము పాడియగునే ?
కలహమునకుఁ గాంత ముఖ్యకారణమకటా ! ౨౮ 3

క. తనపడఁతి నొకరుఁడంటన్
దనకున్ మన మెట్లు పొగులుఁ దా నన్యసతిన్
గొన వాని మనము నట్లే
యనుకొనఁదగు భార్య గోప్యయగు నెల్లరికిన్. ౨౮౪

క. అని పలుకు మనిమె నీతోఁ
దన పలుకులుగా బలారి తగ ననఁ జంద్రుం
డనుమానింపక దూతం
గని యిట్లనెఁ గనుల నగ్ని కణములు రాలన్. ౨౮౫

పరులకు బుద్ధులం గఱపవచ్చునుగాక, మఱేమి? కోడివైై
పరమ పతివ్రతగా దపసి భార్యను బట్టినవాఁడు బుద్ధిఁ జె
ప్పిరె తన కెవ్వరేనిఁ? దన వెఱ్ఱి తనుగా మఱపించుఁగాక, యొం
డొరు మఱపింప నేర్చునె; యహో! బలవైరియుఁ జెప్పునంపనే!

క. గురుభార్య తల్లి యనెడి ప్ర
కరణమ్మున భ్రాతృభార్యఁ గవయుట వేశ్యా
తరుణిం గూడుట యని తన
గురువునకుం జెప్పె నేమొకో! ధర్మమ్ముల్. ౨౪౭

గీ. ఔఁగదా! యెల్లవారు బృహస్పతి ప్ర
ణీతమా ధర్మశాస్త్రమ్ము నూఁతఁ గొనుట
అతఁడ చెప్పఁడె "తనకుఁ దానయి వలచిన
తరుణి గవఁ గూడకున్నఁ బాతకమటంచు. ౨౪౮

గీ. బలవిహీనుని కన్యని భార్య యంచుఁ
దన కళత్రం బటంచు భేదంబు గాని
సొగసు గలదెల్లఁ దనచేతి సొమ్ము కాక
బలము గలిగిన వాని కేర్పాటు కలదె? ౨౪౯

క. ఈ గుబ్బెత నాయం దను
రాగాతిశయమ్ము మై భరంబిడె నిఁక నే
నేగతి విడిచెద ధర్మం
బేగతి నొప్పికొను న్యాయ మేగతిఁ జెల్లుం? ౨౫౦

క. న్యాయంబు విడిచి యీ యొల
ప్రాయంపుం గుబ్బలాఁడి వదలిన నన్నుం

బాయుటయ తక్కఁ దన్నుం
జీ యని రోయక సుఖింపఁజేయునె చెపుమా ? ౨౫౧

గీ. సోదరుని భార్యఁ దాఁ గూడు టిది గాఁగ
సీతలోదరి కెంతయు నేవ మొదవె
నేమి లాభమ్ము గురునియం దీవెలంది
మనము రమియింప దెందు కీ మమత తనకు ? ౨౫౨

గీ. పలుపలుకు లాడ నేల ? యీ పలుకు వినుము
దీనికై ప్రాణములకైనఁ దెగుదుఁగాని
యొండుఁ దలఁప నటంచుఁ జంద్రుఁడు సెప్పె
ననుచు నీరాజుతోఁ జెప్పికొనుము పొమ్ము. ౨౫౩

చ. అనుటయు దేవదూత చని యంతయు నింద్రునకున్ వచించె దా
నిని విని " చంద్రుఁ డింతటి పనిన్ బొనరించియు నింత సాహసం
బొసరుప నెంచినాఁడె " యని యుద్ధురకోపవిఘూర్ణమానలో
చనుఁడయి చంద్రునిం బొదువ సన్నహనం బొనరించె సైన్యమున్.

క. శీతాంశునకును నింద్రున
కీ తీరుగఁ బోరుగలుగ నిజ్యాహితుఁ డా
దై తేయగురుఁడు శిష్య
వ్రాతముతోఁ దోడుపడెఁ గువలయ హితునకున్.

క. గురువైరి శుక్రుఁ డింద్రుని
బురికొల్పెఁగదా ! యటంచుఁ బురవైరి కృపా
కరమతి గురుపక్షమునం
దురమున్ బొనరింపవచ్చె దుస్సహశక్తిన్. ౨౫౬

గీ. వారలకును వీరలకుఁ బోరు ఘోరమయ్యె;
సంచలించెను సర్వ ప్రపంచములును
హంస వాహనారూఢుఁడై యజుఁడు వచ్చి
పోరు వారించి కార్యంబు పొసఁగఁ జేయ. ౨౫౭

క. పదఁపడి చంద్రుని గనుఁగొని
"వదలుము గురుభార్య, నట్లు వదలవ యేనిన్
మద మడఁగించెదఁ జుమ్మీ
గదాధరునితోడఁ జెప్పి కమలారాతీ!" ౨౫౮

అని శుక్రుని బిలిచి, ౨౫౯

క. తగునె బృహస్పతిపైఁ గల
పగచేఁ జంద్రునకుఁ దోడుపడి యిప్పట్లన్
బగదీర్చుట? యిది విని రో
మగనిన్ విడనాడదే రమణి వ్యాజమునన్? ౨౬౦

క. అని చెప్పిన శుక్రుఁడు "నీ
జనకుఁడు నన్ గోరె గురుని జాయన్ వదలన్
జనుఁ, దాత కూడఁ జెప్పెడి"
నని విడిచెన్ గురుని పత్ని సంతర్వత్నిన్. ౨౬౧

ఆ. వె. చంద్రముక్త యైన సతిఁ గొని యా బృహ
స్పతి గృహమ్ముఁ జేరి సంతసించె
శంకరాది సురలు చనిరి యథేచ్ఛను;
గొమరుఁ గనియె నంత గురుని భార్య. ౨౬౨

ఆ. వె. గురుఁడు మోదమంది కొమరునకును జాత
కర్మ మాచరింపఁ గడఁగుటయును

నా యుదంత మంత నాలించి కీలెంచి
శీతకిరణుఁ డొక్కదూత నంపె. ౨౬౩

వ. దూతయు బృహస్పతి పాలికిం జని చంద్రు వచనమ్ములుగా
నిట్లనియె. ౨౬౪

గీ. వీఁడు నీదుకుమారుండు గాఁడు మామ
కీన తేజోభవుం డట్టి వీని కెట్లు
జాతకర్మాదికంబును సల్పితీ వ
టంచుఁ బల్కెనఁ దా నిట్టులనియె గురుఁడు. ౨౬౫

గీ. నా తనూజుండు వీఁడు చిహ్నముల చేత
గాని రూపమ్ముచేఁ గాని వానిఁబోలు
వాఁడుగాఁడు ; మత్సదృశుఁడే, వా స్తవమిది
యనుడు ; సకలమ్ము దెల్పెఁ జంద్రునకు దూత. ౨౬౬

క. తెలిపిన సరసిజవైరియుఁ
గలహమునకు వచ్చె దైత్యగణములు గొలువన్
గలహం బీగతి బునరు
త్కలితంబై యెసఁగె దేవదానవతతికిన్. ౨౬౭

వ. అంత, ౨౬౮

గీ. సరసిజాసనుఁడే తెంచి సంయుగమ్ము
వలదనుచు వారి వారించి కలహమునకుఁ
గారణంబగు గురుదారఁ గాంచి పలికెఁ
గోపమును బెద్దటికమును గొంత యెసఁగ. ౨౬౯

క. పడుచుఁదనపుఁబనిచే నీ
గొడవం గొని తెచ్చి తీవు కోమలి ! నీ కీ

కొడుకు కెవనివలనఁ గలిగెనో
తడయంగా నేల చెప్పఁ దగదే మాకుఁ ? ౨౭౦

ఆ. వె. సిగ్గు చిన్ననాఁడ చెడిపోయెఁ బో ! కొంత
కొంతపోయెఁ జంద్రుఁ గూడునాఁడు
కొడుకుఁ గంటిగాదె కోమలి ? యిఁకనున్న
దియును లేనిదియును బయలఁ బడియె. ౨౭౧

గీ. నీవలనఁగాని వీరి సందియము తీఱ
దతివ ! గురుతేజమో ? లేక యబ్జవైరి
తేజమో ? తెల్పరాదె ; యీ తీరు నీదు
తలన పుట్టెనె ? తప్పునే దైవకృతము. ౨౭౨

క. అను కమలాసను మొగముఁ
గనలేక శిరమ్ము వంచి కడుసిగ్గున మె
ల్లన నిట్లనెఁ దారయుఁ "జం
ద్రునకే చంద్రునకె చందురునకే" యంచుఁ. ౨౭౩

ఆ. వె. పద్మసూతి యంత బాలు నిశ్శంకఁగాఁ
దొగలఱేని కిచ్చి తగవు దీర్చె
మిగుల సంతసించి మేలెంచి బుధుఁడంచుఁ
బేరుఁ బెట్టికొనెఁ దుషారకరుఁడు. ౨౭౪

ఆ. వె. గురుకళత్రమందుఁ గువలయహితునకు
బుధుఁడు పుట్టె నిట్లు బుధుని వలన
నల పురూరవుండు కలిగిన చందంబు
నెఱుఁగఁ జేసెదను మునీంద్రులార ! ౨౭౫

—* పురూరవశ్చరిత్ర *—

క. ఖద్యోతతేజుఁ డతి సం
పద్యుతుఁ డుద్యద్యశః ప్రభావుఁ డపర
ప్రద్యుమ్నుఁడు సుద్యుమ్నుఁ డ
భేద్యాభిద్యోతమాన వీర్యుఁడలరున్. ౨౭౬

వ. ఆతం డొక్కనాఁడు కతిపయామాత్య సహితుండై సైన్యసమేతం
బుగా సైంధవం బెక్కి ధనుర్బాణమ్ములు ధరియించి మృగయా
వినోదమ్మున నానావిధ మృగమ్ముల నుక్కడంచుచుఁ గుమ్రారు
వాఁడు ముందట, ౨౭౭

చ. చని చని కాంచె నొక్కెడఁ బ్రశస్తతర స్తబకాభిశోభి సూ
తనకనదాగమాగమసదాగతి చాలిత మాలతీ లతాం
త నిబిడకుంజపుంజ సుఖితప్రమదప్రమదావిపంచికా
స్వనమిళితాళికోకిలరవంబు కుమారవనంబు డాంబుగన్. ౨౭౮

క. కని యవ్వనముఁ బ్రవేశిం
చిన తత్క్షణమంద వింత చెలువుగ వనితా
జనతాఘనతారుణ్యం
బెనసిన యొక కన్నెరూప మెలమిన్ గాంచెన్. ౨౭౯

గీ. తోడవచ్చిన సేనయు నాఁడురూపు
గాంచె, నశ్వంబు బడబయై కానిపించె
నిట్లగుట కాత్మ నాశ్చర్య మినుమడింపఁ
గారణంబించు కేనియుఁ గానలేక, ౨౮౦

సీ. సామంతరాజన్య సంఘంబుతోఁ గొల్వు
కూటమ్ములో నెట్లు గూరుచుండు

నంతఃపురీవసత్కాంతామణుల కోర్కె
లెఱిఁగి వారల చిత్త మెట్లు గొందు
గర్వించు శత్రువర్గంబు పైఁబడి రాఁగ
వారలతో నెట్లు పోరొనర్తు
పురుషయోగ్యంబైన భూపాలకత్వంబు
సిగ్గు లే కే రీతిఁ జేసికొందు

గీ. కటకటా! పూర్వకృత పాతకంబు గాక
పనికిమాలిన యీ యాఁడుతనముకన్నఁ
గలదె దురవస్థ? దైవంబు కరుణ దప్పె
నంచు యోజించుఁ గడు విలపించు నృపుఁడు. ౨౪౧

వ. అను సూతుం గాంచి మునీంద్రు "లోమహాత్మా! యివ్విభుం డ
వ్వనంబున నేమికతంబున స్త్రీత్వంబునందె నని యడుగుటయు
నతండిట్లనియె. ౨౪౨

చ. సనకసనందనాదిముని సత్తము లొక్కెడ దేవదేవునిం
గనఁ జన, దేవదేవి తనకాంతుని డాతొడ వస్త్రహీనయై
మనసిజకేళి నుండి, యట మౌనిసమాజము గాంచి, సిగ్గు మే
కొన వసనంబు దాల్చెఁ గడుఁ గొం కెసఁగన్, ధరియించునంతలో

గీ. కాముకులసౌఖ్యమునకు విఘ్నం బొనర్పఁ
దగ దెవరి కేని యని మునుల్ త్వర మెలర్ప
నరిగి రటనుండి నారాయణాశ్రమంబు
పార్వతియు సిగ్గుచేఁ దలవంచి యుండె. ౨౪౪

గీ. సిగ్గుచే మ్రగ్గు సతిఁ గాంచి శ్రీగళుండు
పలికె "నెవ్వఁడు గాని యివ్వనముఁ జొచ్చు

నంతనే స్త్రీ స్వరూపంబు నందు " నంచు ;
నధికతమ్ముగ స్త్రీత్వంబు నందె నితఁడు. ౨౮౫

క. అన విని ముని లవ్వలికత
వినుపింపు మటన్న నట్లు వెలఁదియయి యతం
డనుఁగుం జెలికత్తెలతో
వనమున నిళ యనెడి పేర వర్తించు నెడన్. ౨౮౬

క. వనమునఁ దిరుగుచు బుధుఁ డ
వ్వనితామణి పసిఁడిబొమ్మ వడువునఁ దనలో
చనములకు ముదం బొసఁగుడు
వనజాతాంబకుని బారిఁబడి వగఁజెందెన్. ౨౮౭

క. ఇళయును బుధునిం గని మేల్ !
బళి ! యని తగ మెచ్చి తనకుఁ బతిగా నతనిన్
వలచె ; నిరువురకు సుతుఁడై
వెలసెఁ బురూరవుఁ డనూనవిభవోజ్జ్వలుఁడై. ౨౮౮

క. ఇళ కొమరుఁ గాంచి తనకుం
గుల గురుని వసిష్ఠుఁ దలఁచికొనె వగపునఁ గొం
దల మందెడి సుద్యుమ్నుని
కల తెఱఁగు నెఱింగి యతఁడు కరుణార్ద్రుండై. ౨౮౯

వ. భగవంతుండగు నమ్మహాదేవుం గుఱించి తపం బొనరింప నతండు
ప్రసన్నుండై వరప్రదాత యయ్యె. నంత సుద్యుమ్నునకుఁ
బుంస్త్వం బనుగ్రహింపు మని ప్రార్థించుటయు శంకరుండు,

క. తనవాక్యము వ్యర్థంబై
చనకుండ వసిష్ఠమానిసత్తమునకుఁ గో

రిన వర మిడె నొకమాసము
వనితయు మాసంబు బురుషవరుడుం గాఁగన్. ౨౯౧

క. ఈసరణి వసిష్ఠునిదయ,
నా సుద్యుమ్నుండు పుంస్త్వమంది పురికి వి
చ్చేసి యథాగతి రాజ్యము
శాసించెం గాని ప్రజకు సరిపడదయ్యెన్. ౨౯౨

గీ. మగతన మ్మూనువేళల జగతి నేలు
నాఁడుతన మూనునెడల హర్మ్యముల నొదుఁగు
తనుజునకు నీడు వచ్చెడిదనుక నిట్టు
లవని పాలించి యతఁ డరణ్యమున కరిగె. ౨౯3

వ. అట్లు చని నారదోపదిష్టంబగు నవాక్షర మంత్రరాజంబును జపిం
చుచుఁ దపం బొనరించుసంత, ౨౯౪

క. సింగముపై నెక్కి కడుఁన్
సింగారం బడర వారుణీమదపూర్ణా
పాంగయగు సర్వమంగళ
మంగలఁ గన్పట్టె నతనిపుణ్యముకలిమిన్. ౨౯౫

క. కనుపట్టిన జగదంబం
గని మ్రొక్కెడి ప్రేమమీఱంగా నానందా
శ్రునయనుఁడయి మన మలరన్
వినుతింపఁ దొడంగె భక్తి వివశత్వమునన్. ౨౯౬

గీ. దివ్యమననోపు నీ రూపు తేట తెల్ల
ముగఁ గనుంగొంటి నా పూర్వపుణ్య రేఖ

భక్త కల్పద్రుమంబు నీ పాదపద్మ
యుగమునకు మ్రొక్కెదం బ్రోవుమో మదంబ! ౨౯౮

ఉ. అంబ! సురాసురాదులు మనస్ములు తావకదివ్యభవ్య తే
జంబు గనుంగొనంగ, మనుజన్ములనంగ నింకెంతవారు? నా
కుం బొడకట్టి తీ వనుటకున్ మది విస్మయ మందకున్నె? నీ
చుం బరమానురాగమునఁ జూచుట చోద్యము గాదె? శాంకరీ!

క. శంభుండును విధియును వి
శ్వంభరుఁడును సూర్యచంద్రవరుణాదులు నా
జంభారియు నినుఁ గనుఁగొను
దంభం బెఱుఁగ రన నాదు తరమే? జననీ! ౨౯౯

గీ. జలధిజాపతి నీ సత్త్వశక్తి నెఱుఁగు
శారదాపతి నీరజశ్శక్తి నెఱుఁగు
చండికాపతి నీ తమశ్శక్తి నెఱుఁగుఁ
గాని నీ నిర్గుణత వారు గాంచువారె? ౩౦౦

గీ. మూఢుఁ డైనట్టి యే నెడ! పూర్ణమైన
యీకటాక్షప్రసార మదేడ! నీకు
భక్తజనులందుఁ గల్గిన పక్షపాత
మింత యని చెప్పఁ గలనె? లోకైకజనని! ౩౦౧

సీ. ఒకవేళఁ బ్రణయకోపోద్రేకమున శిరో
భాగమ్ముపై వామపాద ముంచి
ఒకవేళ ననురాగవికలీభవత్క్రోధ
వై యురఃపీఠమ్ము నధిగమించి
ఒకవేళఁ గడుఁ జాకచక్కి నొప్పుమెఱుపు నా

జఘనప్రదేశమ్ము సంశ్రయించి
ఒకవేళ సింగార మొల్క ముద్దులుగుల్క
నంకభాగమ్ముపై నధివసించి

గీ. వాహనము నాఁగఁ దగు మధువైరి కీవ
లక్ష్మివై మోద మిడెదు విలాసగతుల
నీ కటాక్షమ్ము లేకున్న నీరజాక్షుఁ
డంబ ! యొక గవ్వయైనఁ జేయఁడు నిజంబు. ౩౦౨

చ. జనని ! భవత్పదంబు లనిశంబును గొల్చి విరించిముఖ్యు లం
గన లెటుకారు ? స్త్రీత్వమును గైకొనియుంబురుషస్వరూపముం
మును భవదీయసత్కరుణఁ బొందిరి కాదె ? యెవం డెఱుంగు నీ
యనుపమశక్తి దీనిఁ గొనియాడఁ దరంబె ? పరాంబ మాదృశుల్. ౩౦౩

క. స్త్రీపుంసభేదశూన్యం
బై పరతత్త్వస్వరూపమై దుర్జ్ఞేయం
బై పూర్ణంబై యొనఁగెడి
రూపము నెవ్వఁడు నేర్చి రూపింపంగన్ ? ౩౦౪

గీ. నిను నిరూపింప నే నేర ; నేర్చుకొలఁది
నీపదాంబుజభజనంబు నిర్వహింతుఁ
గానఁ బ్రాణాంతమందు ననూనమైన
భక్తి నొసఁగుము నీపదద్వయమునందు. ౩౦౫

గీ. ఇట్లు నుతియించి సుద్యుమ్ననృపతివరుఁడు
శాంకరీకరుణాకటాక్షంబు కలిమి
మునిజనశ్లాఘనీయమహా ముక్తిఁ గాంచె
నంబికాభక్తులకు నసాధ్యంబు కలదె ? ౩౦౬

క. సుద్యుమ్నసుతుఁడు ఘనసం
పద్యుతుఁడు పురూరవుండు పరిపాలించెన్
హృద్యనిరవద్యగురు కీ
ర్త్యుద్యోతితమై తనరుప్రతిష్ఠానపురిన్. 302

వ. అప్పురూరవుండు రాజ్యంబొనర్చునెడ సామాదిచతురుపాయ
ములును ప్రభుమంత్రోత్సాహశక్తులును సర్వవర్ణాశ్రమ ధర్మం
బులును నిరుపప్లవంబు లయ్యె. 303

క. జన్మము లొసఁగె నాతం
డెన్నియొ నిద్ధమతుల కిడె విప్రుల క
త్యున్నత మగుదానంబుల
నన్నన్నా! నుతింపఁ దరమె? యాతని గుణముల్. 304

ఉ. ఆతనిరూపసంపదయు నానృపుతేజము నానృపాలు వి
ఖ్యాతియు నా ధరాపతియుదారత యావిభుశీల మాజగ
న్నేత కృపాధికత్వమును నేర్పును నీతియు భూతియున్ యశ
స్ఫీతియు నెంచి యూర్వశి వశీకృతయై వగఁ జెందు సంతతన్. 305

గీ. పంకజోద్భవుశాపంబువలనఁ బుడమి
కరుగుట తటస్థ మగుడు నయ్యమరవేశ్య
చిరమనఃకాంతుఁడైన యన్నరవరేణ్యు
నెంచి వరియించి యతనితో నిట్టులనియె. 306

చ. గొఱియలు రెండు నాకుఁ గడుఁ గూరుచు బిడ్డలకన్న నెక్కు; డీ
గొఱియలఁ బ్రోచుటొక్కటియుఁ, గూటమివేళలఁ దక్క నీవు సి
గ్గఱి వసనంబు లేని తఱిఁ గన్పడకున్కియు, నేయిభుక్తికై
తఱుచుగ నిచ్చుచున్కియును దప్పవు; తప్పినయప్డ పోయెదన్.

గీ. దీని కంగీకరించితివేని నన్నుఁ
గైకొని రమింపు మనెడి యక్కలికిమిన్న
ప్రతిన కెదురాడ వెఱచి చేపట్టి దాని
వలచి క్రీడించె నొకకొన్ని వత్సరములు. 313

తత్కటిస్థలమందుఁ దవిలి చిత్తము ధరా
వలయమ్ముపై నాసఁ గొలుపదయ్యె
దానినూగారుపైఁ దవిలి చిత్తము కత్తి
చేతఁ బూనుటకు వాంఛింపదయ్యె
తద్వచస్సంసక్తిఁ దవిలి చిత్తము కావ్య
కలనా వినోదంబు దలఁపదయ్యె
దాని కౌఁగిటియందుఁ దవిలి చిత్తము పరా
ద్వైతభావంబుపైఁ బాఱదయ్యె

గీ. అవుర ! యేమందు నప్పురూరవునిచరిత
మఖిల మూర్వశియే యని యలరుఁగాని
ధర్మ మర్థంబు మోక్షంబు దలఁప డయ్యెఁ
గాముకుల కన్యసంగతుల్ గానఁ బడునె ? 314

క. దుర్గముఁ డీన్నృపుఁ డంచు న
నర్గళరాగాతిశయమునన్ మరగి పున
ర్నిర్గమ మెఱుఁగక యూర్వశి
స్వర్గమ్మును మఱచెఁ బాకశాసను మఱచెన్. 315

గీ. వార లిరువురు నీతీరు వార లగుచు
నున్న యంతటఁ బాకారి యూర్వశీ త
లోదరీమణి రప్పింప నూహఁజేసి
పలికె గంధర్వులను జూచి ప్రాభవమున. 316

గీ. రంభ మొదలుగ నప్సరోరమణు లున్న
వార లైనను, నూర్వశీ వనిత లేక
యున్న కారణమున, స్వర్గమున్న దిపుడు
చంద్రికళ లేని యంబరస్థలము పగిది. ౩౧౭

వ. కావున నేదేని యొక నెపమ్మునఁ బురూరవు వంచించి గొఱియల
నపహరించినఁ గార్యమ్ము పొసఁగునని చెప్పి పంచిన, ౩౧౮

క. గంధర్వులు రతికేళీ
బంధురుఁడగు నృపతి కెఱుఁగఁబడకుండఁగ ధా
రంధర్యపటిమ గొఱియల
నంధతమసమందుఁ జోరులై హరియింపన్, ౩౧౯

క. ఆయురణమ్ములు మే మే
మే యని రొదసేయఁ దన్నిమిత్త వెఱఁగి సీ!
సీ! యని రోయుచు నృపుతో
నా యూర్వశి శోకతప్తయై యిట్లనియెన్. ౩౨౦

ఆ. వె. కొడుకులవలెఁ బెంచుకొనుచున్న నా గొఱి
యలను జోరులిట్టు లపహరింప
నాఁడుదానికన్న నధముండవై యూర
కుంట యుక్తమగునె? కువలయేశ. ౩౨౧

క. రక్షించెద వీవంచు న
పేక్ష, యొనర్చితిని గాని యెఱుఁగనయితి నీ
దక్షత యిట్టిది యని యో
కుక్షింభర! నిన్నుఁ గూడి కుత్సిత నైతిన్. ౩౨౨

క. ఇటు కటకటఁ బడి తన్నుం
బెటిలి పడం దిట్టుచున్న ప్రియురాలికి న
క్కటికము చూపుటకై ని
ష్పటుఁడై తస్కరుల వెంటఁబడి పరుగిడియెన్. ౩౨౩

గీ. నగ్నుఁడై వచ్చు నృపతిచందమ్ము నూర్వ
శీ వనిత కెఱుఁగఁ బడఁగఁ జేయు నిచ్చఁ
జంచలాకాంతులను మెఱపించి రపుడు
ధరణిపతి గేహమందు గంధర్వపతులు. ౩౨౪

వ. అంత, ౩౨౫

క. ఉరణమ్ములఁగొంచు దిగం
బరుఁడై తోతెంచు నృపతిఁ బరికించి వియ
చ్చర వారవనిత యాతని
చరణములకు మ్రొక్కి పలికె సాధ్వస మెసఁగన్. ౩౨౬

ఉ. చెప్పితిఁగాదె? మున్ను నృపశేఖర! నాదు ప్రతిజ్ఞ; దానికిం
దప్పిన యట్టి నీదు దరిదాపునఁ గాఁపుర మెట్లొనర్తు? నే
నిప్పుడ పోవలెన్ గరుణ యుంచుక నాపయినుంచు; మయ్యయో
తప్పక తీరునే! విధివిధానము తప్పినపట్లఁ గూరుముల్? ౩౨౭

వ. అని యూరడించి, ౩౨౮

గీ. పార్థివోత్తము వలవంతపాలుఁజేసి
యరిగె నూర్వశి నిశ్చింతమై తనంత
స్వర్గముననుండి వచ్చినవచ్చుగాక
యమ్మరో! చెల్లి! లంజెల నమ్మఁదగునె? ౩౨౯

చ. తను విడనాడి యూర్వశి యథాగతి నేఁగఁ, బురూరవుండు చిం
తను గొని, వెఱ్ఱిఁ బూని, మతిఁ దప్పి, తదీయవిలాసవైఖరుల్
మనమున నెంచుచున్ విషయమగ్నతఁ జెందుచు లోనఁగుందుచుం
జని చని కాంచె నచ్చటులచారుకటాక్షగతిన్ గురుక్షితిన్. 330

గీ. చూచినంతన యాతని లోచనమ్ము
లతులితంబైన సంతోషగతి నెసంగెఁ
జిరవిరహసంగతులకు నెచ్చెలిని గనుట
కన్న వేఱొండు భాగ్యంబు గలదె తలఁప ? 331

వ. అట్లు కని డగ్గఱి కరుణరసంబుట్టిపడ గద్గదగళుండై యిట్లనియె.

చ. కినిసి యెఱుంగ నెన్నఁడును ; గీడొనరించి యెఱుంగ ; నీకు దా
సునిగతి నుంటిఁగాని యొకచోనయినన్ బ్రతిఁ జెప్పలేదు ; నీ
పనిచిన కార్యమెప్పుడు నెపంబిడి చేయక యుండలేదు ; హా !
ననువిడనాడి పోతివిదినాయమె ? నీకుఁగురంగలోచనా ! 333

గీ. ఓసి ! దుర్మార్గురాల ! నన్నిసడించి
తేని యీ మేను నే భరియింపఁజాల
నా మన మెఱింగియును గఠినత్వమూనఁ
దలఁపుఁ బూనెద వెంతటిదాన వయయొ ! 334

క. వలచి ననుఁ గలయ నేటికిఁ ?
గలసి యిటుల్ విడిచి పెట్టఁగా నేటికి ? నీ
వలపు సతమంచు నమ్మితిఁ
గలికీ ! ననుఁ జింతపాలుగాఁ జేయుదువే ? 335

సీ. రమణి ! నీ యాలింగనము చొప్పడమి నాకు
రాత్రి లెల్లను శివరాత్రులాయె

పూబోఁడి ! నీదు తాంబూల మబ్బమి నాకు
దినము లెల్లను హరి దినము లాయె
తెఱవ ! నీ కెమ్మోవి తేనెలబ్బమి నాకు
ఋతువు లెల్లను గ్రీష్మ ఋతువులాయె
కలికి ! నీతోఁ బొత్తు గలిగి యుండమి నాకు
క్షణము లెల్లను గతక్షణము లాయె.

గీ. లలన ! నీ నెన్నగవు వెన్నెలలకుఁ జొక్కు-
భాగ్య మబ్బమి నా కెల్ల పక్షములును
కృష్ణపక్షమ్ము లాయె, నీరీతి నొప్పు
కాల మేగతి వేగింతునే ? లతాంగి ! 33౭

క. అని బహువిధముల విలపిం
చు నృపాలోత్తమునిఁ గాంచి సూనృత గతి న
వ్వనితామణి యతని విర
క్తునిఁ జేసి మరల్చు తలఁపుతో నిట్లనియెన్. 33౮

మ. వెలయాండ్రెక్కడ ! గూర్మెలెక్కడ ! దయావిశ్వాసభావమ్ము లె
క్కడ ! లోలోఁ దలపోయ నేరకిటు మార్గభ్రంశంబూనఁగా జెల్లునే ?
కలలోనైనను వారకామినుల సాంగత్యంబు వాంఛింతురే ?
కలదే సూత్రము గట్టినట్టి మగఁడొక్కండంచు మాజాతికిన్.

క. వనితల మొదఁ జోరుల మొద,
జనపాలురు విశ్వసింపఁ జనదటుగానన్
ననుఁ దలఁచి విచారింపక
చని రాజ్యం బేలుకొనుము జననాథమణీ. 33౯

ఆ. వె. అనుచు నొప్పఁజెప్పి యరిగె నా యూర్వశి
మనుజవిభుఁడు దాని మఱవ లేక
వంతఁ జెందె, నెంతవాఁడైన వారకాం
తలను జేరఁదీయ వలదు వలదు. ౩౪౦

గీ. వేద విస్తృత మీ కథావిధము దీని
జెప్పినాఁడను మీకు సంక్షేపగతిని
ఇట్టి వలవంత తన కబ్బునేమొ? యంచు
వ్యాసుఁడు ఘృతాచిఁ గని సందియమ్ముఁ జెందె. ౩౪౧

—* శుకోత్పత్తి *—

క. ఈ రీతి సంశయించెడి
పారాశర్యుఁ గని శాపభయ విహ్వలయై
చేర వెఱఁగంది శుక వని
తా రూపముఁ దాల్చి చనె ఘృతాచి యథేచ్ఛన్.

వ. అట్లు చనుటయు, ౩౪౩

గీ. హరిహరబ్రహ్మ లెవని దాసానుదాసు
లెవని యావేశ మెట్టి జితేంద్రియులకుఁ
గనులు పొరఁగప్పఁ జేయు నక్క-మలశరుఁడు
పట్టి పాలార్చఁదొడఁగె నా వ్యాసమునిని. ౩౪౪

ఆ. వె. తపము లెన్నియేనిఁ దగ నొనర్పఁగనిమ్ము
జపము లెన్నియేని సలుపనిమ్ము
కనుల కింపు గల్గుకాంతఁ గన్గొనినంత
మారుబారిఁ బడనివారు లేరు. ౩౪౫

వ. ఇట్లు ఘృతాచీగతం బగు మనమ్ము మరల్చియు భవితవ్యతా నిమిత్తమున మరల్ప నేరక చింతించుచు నరణి మథించు చున్నంత, 386

క. అలపంచశరుని తాఁకునఁ
గలకలముం జెంది యున్న కతమున వీర్య
స్ఖలనము గల్గి యరణిలోఁ
పలఁ బడె నది యెఱుఁగ కతఁడు పట్టి మథించెన్. 387

గీ. అరణి జనియించె నంతట వ్యాస సదృశుఁ
డై యనలకాంతి భాసురుండై శుకుండు
గాంచి "యిది యేమి వింతయో" యంచు "శివుని
వర మహిమ," యంచు మది నెంచి వ్యాసుఁ డంత,

క. గంగానదికిం దన తన
యుం గొని చని యచటఁ బావనోదకములఁ బూ
తుం గావించి ముదం బెసఁ
గంగా నాతనికి జాతకర్మ మొనర్చెన్. 388

గీ. నభమునం దంత దేవదుందుభులు మ్రోసెఁ
బుష్పవర్షోదయమ్మునఁ బుడమి నిండె
నారదాది మునీంద్రు లందఱును గూడి
పాడి, రాడిరి రంభాది వారసతులు. 390

ఆ. వె. చిలుకరూపుఁ గనిన చెలువ కారణమునఁ
బుట్టె నీతఁ డంచుఁ బెట్టెఁ బేరు
శుకుఁ డటంచు మౌని సుతునకుఁ; గ్రమముగా
వృద్ధిఁ జెందె నతఁ డభేద్యగరిమ. 391

గీ. అంబర స్థలినుండి కృష్ణాజినంబు
దండము కమండలువు తదర్థముగఁ బడమిఁ
బడియె నొకనాఁడు మునులార ! వ్యాసుఁడంతఁ
గొమరున కొనర్చె నుపనయనముఁ గ్రమముగ. 3-౫౨

గీ. జనకునికిఁ బోలె నితనికి జన్మకాల
మంద వేద వేదాంగాదులవ్యె వశము
లైనను బృహస్పతిం గొల్చి యాగమ వ్ర
తమ్ము సల్పుచు నవి యెల్లఁ దవిలి చదివె. 3-౫౩

వ. ఇట్లు సంపూర్ణుండై గురుదక్షిణ నొసంగి తదాజ్ఞ వడసి తండ్రి
పాలికిం జనుటయు, 3-౫౪

ఉ. వ్యాసుఁడు కౌఁగిలించుకొని "వచ్చితివా ! తనయా" యటంచుఁ జే
రాసఁ బ్రియమ్ము వల్కుచు "బృహస్పతియొద్ద సమస్త విద్య ల
భ్యాసమొనర్చితే ?-" యనుచు నాదరముం బచరించి పుత్రు భా
ర్యాసము పేతుఁ జేయుటకునై మనమందుఁ బ్రయత్న మంచుచున్,

వ. పుత్రుండు విరక్తుండగు నని యెఱింగిన వాఁడు బోలె సత్వరం
బుగ నొక్కెడ కరిగి సత్కుల ప్రసూతయు మనోహారిణియు నగు
నొక మునితనయన్ వివాహార్థంబు నిశ్చయించి యాశ్రమమ్మున
కేతెంచి శుకుం గాంచి యిట్లనియె. 3-౫౫

చ. చదివితి వెల్ల వేదములు ; శాస్త్రములున్ బరికించినాఁడ ; వి
ద్యదను వివాహయోగ్య మగునట్టిది గానఁ, గళత్రమున్ వరిం
పఁదగు; మఖక్రియల్ పొసగుపందగుఁ; బుత్రులఁగాంచఁగాఁదగున్
ఋషుదములర్ మమున్ ఋణవిము క్తులఁ జేయఁ దగుం గుమారకా!

సీ. పుత్రసంతానంబు పొరయనినరునకు
సద్గతి లేదు యశంబు లేదు
గావున నొకకన్యఁ గైకొని తనయులఁ
గాంచి నన్నానందకలితుఁ జేసి
పితృదేవతలకు సంప్రీతి యొనర్పుము
మాఱాడకుము నాదుమాట వినుము
నీనిమిత్తము తపం బేనొనర్చితిఁ బెక్కు-
వత్సరమ్ములు తపఃఫలమ వీవు

గీ. నీవలనఁ గీర్తిఁ గనవలె నీవలనన
సద్గతిని బొందఁగా వలె సౌఖ్య మందఁ
గావలెను నీవలన నంచుఁ గాచియుంటి
ననుడు జనకునితోడ నిట్లనియె శుకుఁడు. ౩౫౮

క. పరిణయమొల్లను నన్నుం
గరుణింపుము తత్త్వబోధఁ గావింపుము దు
స్తరసంసారాంభోనిధి
నరసి యరసి నన్నుఁ ద్రోయుట న్యాయమె ? తండ్రీ ! ౩౫౯

వ. అను పుత్త్రుం గాంచి వ్యాసుం డిట్లను, ౩౬౦

మ. నినుఁ గంటిన్ శతవత్సరమ్ములు తపోనిష్ఠన్ బ్రవర్తించి ; నా
కనుకూలుండవు గమ్ము ; యౌవనము నీ కావిర్భవం బందె ; భా
ర్యను గైకొమ్ము ; సుఖమ్ములం బడయుము; మేరాజేంద్రునో చూచెదన్
ధనమున్ దెచ్చెద ; నీ కొసంగెదను ; నాఁ దత్త్వజ్ఞుఁ డాతం డనున్

చ. వనితను జేరి తద్వశత వర్తిలి దుఃఖము సౌఖ్య మంచు భ్రాం
తిని గొని సంసృతిం బడి గతిం గన లేక కృశించువారలం

గనుఁగొనియుఁ వివాహము సుఖంబనియే నెటు సమ్మతింతు ? దుః
ఖనియతమైన సౌఖ్యము సుఖం బనఁ గూడునె ? మానిసత్తమా !

గీ. శృంఖలాబద్ధులు విముక్తిఁ జెందఁ గలరు
గాని కాంతాకటాక్షపాశానుగతుల
కబ్బునే ముక్తి యెన్నఁటికైన నిట్టి
విట్సుఖం బేమనుచుఁ బైని వేసికొందు ? ౩౬౩

గీ. మలమయంబైన కామినీమణులదేహ
మందు బుధుఁడైనవాని కెట్లాసపుట్టు ?
యోనిసందర్భ మొక్కటెంతయును నెఱుంగ
నట్టి నా కేల యీహేయ మైనగొడవ ? ౩౬౪

క. కర్మములను నెపమున దు
ష్కర్మంబగు హింస సలుపఁగాఁ జేయుచు నం
తర్మదము పెంచునాగమ
మర్మంబుల నామనంబు మసలదు తండ్రీ ! ౩౬౫

గీ. వేదవేదాంగములకల్మి విస్తరించెఁ
గాని వాక్పతి తత్త్వంబు గఱపఁడాయె
పుత్రదారానురక్తిమైఁ బొరలుగురుని
గొలిచి తరియించు వెట్టులు గలరె ? యెందు. ౩౬౬

గీ. అట్టి గురునకు నొక్క మ్రొక్కాచరించి
తత్త్వవేత్త వటంచు నీదరికిఁ జేర
దుష్టసంసారమునఁ బడఁద్రోయ నగునె
భవ మెవరికైనఁ గాలసర్పంబ కాదె ? ౩౬౭

క. పురుషులు హేయంబగు వి
ట్సరణిం జరియించుపగిది జడమతులును సం
సరణమునఁ బడెద రకటా !
పరికించిన భవము సౌఖ్యభాజన మగునే ? 3౬౮

గీ. వేదశాస్త్రాదికంబెల్ల వెదకి తెలిసి
కొనియు సంసారవార్నిధి మునిఁగి తేలు
బుధునికన్నను మూఢుండు పుడమిఁ గలఁడె ?
యతఁడపో ! సూకరాదుల యట్టివాఁడు. 3౬౯

గీ. పుత్రదారానుషక్తుని బుధుఁడటంచు
గారవించుటకన్న నజ్ఞానమున్నె ?
వాఁడపో బుద్ధిమంతుఁడు వాఁడ బుధుఁడు
వాఁడ శాస్త్రజ్ఞుఁ డవ్వాఁడె వంచితుండు. 3౭౦

క. భవబంధకరం బయిన చ
దువు చదు వగునే ? సమస్త దుఃఖధ్వంస
ప్రవణం బగునద్దానిఁ జ
దు వనం దగు ; దాన ముక్తి దొరకును దండ్రీ ! 3౭౧

క. ఎందుం జన నీయక తన
యందుం బంధించుటన్ గృహం బయ్యెన్ దా
నిం దవులుట బంధనగృహ
మందుంటయు భేద మించుకైనం గలదే ? 3౭౨

క. మందులు విధి ప్రేరితు
లుం దగులఁగనిమ్ము గృహములోపల వారిన్

నిందింపనేల మనుజత
నందియుఁ జదువుకొని యుండు నడుగంటుదునే ? 323

వ. అను కుమారునకు వ్యాసుండిట్లనియె. 324

క. మన మతినిర్మల మైనం
దనకు గృహం బెట్లు బాధనం బగు మనముం
దనయిచ్చఁబోవనీయక
యునికి గృహస్థునకు ముక్తి నొసఁగుఁగుమారా. 325

గీ. న్యాయ్యముగ ధనసంపాదనం బొనర్చి
యనృతమాడమి యశుచిత్వమాచరింప
మియును విధిచోదితంబుగా మెలఁగుటయును
గలిగి వర్తించు గృహి ముక్తిఁ గాంచుఁ బుత్ర. 326

సీ. వేదవ్రతముల నాపాదించి చరియించు
బ్రహ్మచారుల కెల్లఁ బట్టుఁ గొమ్మ
అతిథులై యేతెంచునట్టి గృహస్థుల
నాదరింపంగఁ గల్పాగమంబు
భార్యైకయుక్తులై వనమునఁ దిరుగు వా
నప్రస్థులకు రక్షణ ప్రసక్తి
సంసారహింసావిరంసావిరక్తులౌ
సన్న్యాసులకును విశ్రాంతిభూమి

గీ. యైనగార్హస్థ్యమున నుండి యఖిలధర్మ
ముల నొనర్చి తుదకు ముక్తిఁ బొంద వచ్చు
నట్లు కాదేని యవ్వసిష్ఠాదిమునుల
కేల గార్హస్థ్యమున నుండు టెఱుఁగఁ జెపుమ. 327

గీ. ఆగమోక్తకర్మంబుల నాచరింపఁ
దలఁచి వర్తించుగృహి కెల్లధర్మములును
కరతలామలకమ్ములు గాన లాఁతి
యాశ్రమమ్ములు సరియె గార్హస్థ్యమునకు ? ౩౭౮

ఆదిని బ్రహ్మచర్యము ననంతరమందు గృహస్థధర్మ మా
మీఁదవనప్రవాస మటుమీఁద యతిత్వ మటంచు బ్రహ్మవి
ద్యాదరు లండ్రు గాదె తనయా ! వినయమ్ముగలాఁడ వాగమా
పాదిత మైనధర్మము నెపమ్మున వమ్మొనరింపఁ బాడియే ? ౩౭౯

గీ. కాన గార్హస్థ్యధర్మమ్ముఁ బూని పుత్ర
వంతుఁడవుగమ్ము పితృదేవవర్గములకుఁ
బ్రీతి సేయుము నామాట వినుము సన్న్య
సించు టిప్పుడుగాదు యోజించుకొనుము. ౩౮౦

క. మనమును బంచేంద్రియములు
తనయా ! కడుఁ జంచలములు దారవిహీనుం
జెనకి యధోలోకమునకుఁ
బనుచున్ వాఁ డెంత పెద్ద పండితుఁ డైనన్. ౩౮౧

గీ. ఇంద్రియజయమ్ముకొఱకునై యింతి నెంతఁ
వాఁడయినఁగాని వరియింపవలయు వార్ధ
కమ్ము సంప్రాప్తమైనఁ దపమ్ము సేయ
వలయుఁ గాని వేఱొకగతి వలదు తనయ. ౩౮౨

మేనకాతరుణిసమ్మేళనమ్మునఁ గాదె ?
గాధిపుత్రుతపమ్ము గంగఁ గలిసె
దాశపుత్రికతోడఁ దగులు చెందుటచేతఁ

గాదె ? సీతాత భంగమ్ము గనియె
నలఘుకృతాచిని జూచి యాసించుటను గాదె ?
నాకుఁ దేజస్ఖలనంబు గలిగె,
తనపుత్రికను మోహమున వరించుటచేతఁ
గాదె విరించి ప్రమాద మందె

గీ. గాన నొకకన్నె వరియించి దాన నింద్రి
యముల నిర్జించి మీఁద నియమము గాంచి
తపము సేయఁగఁ బూను టుత్తమము గాని
యుభయతోభ్రష్టతను గాంచు టుచితమగునె ? 3౮3

—* శుకుఁడు సంసారమును నిందించుట *—

క. అని యుపదేశము నొనరుచు
జనకుం గని శుకుఁడు వల్కు సౌఖ్య విహీనం
బును వాగురాసమానం
బును నగు గృహమందు బుద్ధిపుట్టదు తండ్రీ ! 3౮౪

క. ధనహీనులు స్వజనులచే
ననయము బాధింపఁ బడుదు రది గాక ధనా
ర్జనచింతావ్యాకులు లగు
జనులకు నెచ్చోటనైన సౌఖ్యము కలదే ? 3౮౫

సీ. ఈజగత్త్రియమేలు నింద్రునకైన స
న్న్యాసి కున్నంత సౌఖ్యమ్ము లేదు
సాక్షాన్మహాలక్ష్మి వక్షమందున్న వి
ష్ణునకైన యతి కున్నసుఖము లేదు
త్రిజగత్కుటుంబియగా నజునికైనను విర

క్తుల కున్న యంత నిశ్చలత లేదు
అణిమాదియుక్తుఁడౌ హరుని కైనను గోఁచి
పాఁతరాయని కున్న భాతి లేదు

గీ. తపములకు విఘ్నము లొనర్పఁ దలచుటయును
దైత్యుల హరింపఁ దలఁచి ఖేదంబు గొనుట
యునుగదా వీర లొనరించుపనులు ; నే నె
ఱింగియును సంగమునఁ బడి బ్రుంగనేల ? ౩౮౬

క. ధనవంతున కే సౌఖ్యం,
బనిశ్చితప్రియ మన్నయప్పుడు ధనహీ
నునకు సుఖమెట్లు చేకుఱు ?,
జనకా ! సంసారమందు సౌఖ్యము కలదే ? ౩౮౭

ఆ. వె. నన్న యోనిజన్మ నయ మొకింతయు లేక
ఘోరదారరూప కూపమునను
బట్టి త్రోయ నగునె ? భవ మేడ ! సుఖమేడ !
రక్తి యేడ బంధముక్తి యేడ ! ౩౮౮

ఆ. వె. మొదల జన్మదుఃఖమును మీఁద ముదిమిచే
నైనదుఃఖమును ననంతరంబు
మరణకాలదుఃఖ మరయ నాపైఁ బున
ర్జననదుఃఖ మిందు సౌఖ్యమేది ? ౩౮౯

శా. ఆశాపాశముచేతఁ జిక్కువడి ప్రాణాచారము బూని యా
చ్ఛాశంకన్ విడనాడి బుద్ధిబలవై శద్యంబు వోనాడి వి
త్తేశద్వారనివాసఖిన్నమతియై యేతెంచుసంసారికిన్
లేశంబైనను సౌఖ్య మున్నయదియో లేదో విచారింపుమా !

క. కొడుకులుఁ గూఁతులు మొదలగు
గొడవ పెరిఁగెనేని వారి కుడుపునకై యె
క్కుడు కష్టము పడవలె, నొక
కడుపుకుడుపు దెచ్చుకొనుట కష్టమె? తండ్రీ! ౩౯౧

వ. కావున యోగశాస్త్రంబును సుఖకరం బగు జ్ఞానశాస్త్రంబును
నా కుపదేశింపు మని మఱియును, ౩౯౨

క. దయ గలిగి నాకుఁ గర్మ
క్షయ మగు పద్ధతి వచించి సంసారము నా
పయిఁ బెట్టక విజ్ఞానా
శ్రయ మగు మార్గమ్ముఁ జూపఁ జనదే తండ్రీ! ౩౯౩

చ. జలగ శరీరముం బొదివి చయ్యన నెత్తురు గ్రోలుభంగిఁ, గాం
తలు తమ వీర్యముం దమ ధనంబు ఘనంబు హరింతురంచు మూ
ఢు లెఱుఁగ రక్కటా! మిగుల రోఁతలపాఁతలునైన యీ వెలం
దులు సుఖమీఁగఁజాలుదురె దుఃఖము దక్క మనస్సు కేటికిన్ ?

క. వే యేటికి నిద్రాసా
ఖ్యాయతి చెడఁగొట్టుకొనుట కంగన [illegible]
బో! యెఱుకలేని మనుజుఁడు
నాయన! యిది యెల్లగతుల నరకంబుకదా? ౩౯౫

వ. అని సంసారంబు రోయు కుమారుఁ గాంచి వ్యాసుండు దుఃఖా
క్రాంతుం డగుటయు, ౩౯౬

సీ. వేదమ్ములెల్ల దుర్భేదంబులై యున్న
విభజనఁ జేసిన విశ్రుతుండు

జనులకు విజ్ఞానమును దేటపఱుప వే
దాంతశాస్త్ర మొనర్చినట్టి ఘనుఁడు
అలమహాభారతం బష్టాదశపురాణ
ములు రచించిన మహాబుద్ధిశాలి
మునులలోపలఁ బెద్దతనము గల్గిన యశః
ప్రతిభ నొప్పినగొప్పపండితుండు

గీ. దివ్యవిజ్ఞాని సత్యవతీసుతుండు
మాయవలలోనఁ బడి పెడమార్గములకుఁ
గాలు వెట్టుచునుండె నౌఁ గలరె! యింక
నొరులనుచు నెంతయును వింత నొందె శుకుఁడు. ౩౯౭

గీ. హరిహరబ్రహ్మలకును దురాప మగుచు
జగములన్నియుఁ దనమాయఁ దగులఁ జేయు
నేమహాదేవి సకలలోకైకజనని
యమ్మహాదేవి నర్చింతు నాశ్రయింతు. ౩౯౮

గీ. విష్ణునంశమ్ముచే భువి వెలసి సకల
ధర్మము లెఱింగి వ్యాసునంతటి మహాత్ముఁ
డిట్టిప్రాకృతచింత పైఁ బెట్టుకొనియె
నకట! చిత్రంబ కాదె మాయాబలంబు. ౩౯౯

ఆ. వె. నేను నీవు నాది నీయది నాతండ్రి
నాతనూజుఁ డని యనారతంబు
ప్రీతి గొందురు పంచభూతమయంబు దే
హం బటం చెఱుంగ రకట! జడులు. ౪౦౦

క. వ్యాసుఁడట వేదాంత
వ్యాసంగ మొనర్చినట్టి యనఘుఁడఁట తా
నీసరణిఁ జింతఁ గొనునఁట
సీ ! సీ ! మాయాబలం బజేయము కాదే ?   ౪౦౧

క. అనుచుఁ మాయాబలవిల
సనమున కచ్చెరువుచెంది జనకుఁ గని తా
త్రనిదానమ్ముగ శుకుఁ డి
ట్లనెఁ దన విజ్ఞాన మహిమ యతనికిఁ దెలియన్.   ౪౦౨

గీ. సకలము నెఱుంగునట్టి బోధకుఁడ వీవు
దివ్య విజ్ఞాన, సత్యవతీ తనూజ !
వీఁడు నావాఁ డనెడి భ్రాంతి వీడలేక
ప్రాకృతునిఁబోలె శోకాబ్ధిఁ బడుదురయ్య.   ౪౦౩

ఉ. ఎందఱి కీవు తండ్రివొ నుతోందఱి కేఁ దనుజుండనో మదిన్
గొందల మందనేల ? కనుఁగొమ్ము విచారణసేయు మయ్య యో
తుందుడు కింతచెల్లునె ? బుధుండవు కావె ? యెఱుంగవే ? ధృతిం
జెందక చిత్తవృత్తి నిటు చిందఱ వందఱఁ జేయ న్యాయమే ?

సీ. ఆఁకలి దీర్పంగ నన్నమ్ము కలదు పి
పాసఁ దీర్చుటకునై వారి కలదు
ఘ్రాణతృప్తికినై సుగంధమ్ము గలదు క
ర్ణములఁ దన్పంగ శాస్త్రములు గలవు
కామ నివృత్తికై కాంతలు గలరు ద్ర
వ్యమ్ము నార్జింప భూపతులు గలరు
విజ్ఞానమునకుఁ దత్వజ్ఞులుగలరు మో
క్షమ్ము పొందుటకుఁ దపమ్ము గలదు

గీ. గాని కొమరునిచేఁ బొందఁగలుగునట్టి
దొక్క సుఖమైన లేకున్కి నిక్కమరయ
నట్టి కొమరులకై మది నాసఁజేయు
వానికన్నను వెఱ్ఱు లెందేనిఁ గలరె ? ౪౦౫

గీ. ఎంచి వలసిన విత్త మార్జించికొనుము
సుతునికన్నను విత్తంబు సుఖకరంబు
మున్న జీగర్తుఁ డనుముని కన్నసుతుని
యజ్ఞపశువుగ నమ్మివేయఁడె ? మహాత్మ ! ౪౦౬

క. నను సంసారాంబుధిలోఁ
ద్రోనుపక తత్త్వమ్ము గఱపి సూనృతరీతిన్
మనుపుము నే నింకఁ బున
ర్జనన భయంబనుభవింపఁ జాలను దండ్రీ. ౪౦౭

గీ. జన్మములలోన మానవజన్మ మధిక
కష్టసాధ్యం బదియుఁగాక కర్మభూమి
యందు ద్విజుఁడై జనించు టత్యధిక కష్ట
సాధ్య మది గాంచి సంసార సరణి యేల ? ౪౦౮

క. అని తిరుగని వైరాగ్యం
బును గొని సన్న్యాసమందు బుద్ధిఁ జొనుపు పు
త్త్రునిఁ గని సత్యవతీసుతుఁ
డనుమానం బుడిగి యిట్లు లానతియిచ్చెన్. ౪౦౯

తనయా ! మున్నొనరించినాఁడను మునీంద్రస్తుత్యమై సత్యమై
ఘనపాపౌఘవినాశమై సకల దుఃఖధ్వంసమై యొప్పి ము

క్తి నొసంగ దగుసత్త్రిభాగవత పురాణశ్రేష్ఠ మిదియౌగ నీ
విని నిత్యమ్ము పఠింపు మియ్యదియు పొందించుఁగా మనోభీష్టముల్.

ఆ. వె. అతిశుభప్రదంబు నాతివిస్తీర్ణంబు
బ్రహ్మసమ్మితంబు భాగవతము
వినిన యంతమాత్రె విజ్ఞాన మబ్బు న
ద్దానిఁ జదువుకొనుము జ్ఞానివగుము. ౪౧౧

—* దేవీభాగవతారంభము *—

గీ. ద్వాదశస్కంధయుక్తమై పావనతకు
నాయుతమై పుణ్యమై పురాణముల కెల్ల
భూషణం బయి యొప్పునప్పుస్తకంబు
పఠన సేయుము సంసారబాధ లడఁగ. ౪౧౨

సీ. వటపత్రమున బాలవైఖరి నుండి తా
నిప్రపంచస్థితి నెఱుఁగ లేక
యే నిటు బాలుండ నేకతమ్మున నైతి
నేవిధమ్మున దీని నెఱుఁగువాఁడ
నిటు నన్ను నిర్మించె నెవ్వఁడో యని చింత
నొందుచు నున్న ముకుందునందుఁ
గరుణించి భగవతి పరమరహస్యంబు
గాఁగ శ్లోకార్ధంబు గాఁగ దీని

గీ. దెలిపి "యియ్యది సకలంబు దీని దెలిసి
కొనుటయే నన్నెఱుంగుట" యనియె నంత
విష్ణుఁడయ్యది విని దానివిధము దెలియ
నేర కిట్లని చింతించె నెమ్మనమున. ౪౧౩

శా. శాంతంబై యకలంకమై సహజమై సత్యంబునై నిత్యమై
యొంతే మోదమొసంగఁ జాలునిది దా నేమూర్తి నార్యుర్ గృపా
స్వాంతంబై యిడెనో? పదార్థమది పుంస్త్వాలంబియో? షండమో?
కాంతాకారమొ? యెట్టిదో యని తదాకారమ్ము నూహించుచుర్.

వ. శ్లోకార్థ రూపమ్మగు సద్భాగవతంబు పఠించుచున్నంత, ౪౧౫

సీ. శంఖచక్ర గదాది సాధనమ్ములు దాల్చి
పావనించు నాల్గు బాహువులతోడ
క్రొక్కాఱు మెఱుఁగునాఁ గొమరారు పదియాఱు
వన్నె బంగారు దువ్వలువతోడ
మకరాలనత్తు పెన్నికనిగల్ నగఁజాలు
సొగసు గల్గిన చిన్ని నగవుతోడ
తనతోడఁ దులఁదూఁగఁ దగు నోయారము గల్గి
యలరారు నెయ్యంపుఁ జెలులతోడ

గీ. తొగలవగకానిఁ బెగడు నెమ్మొగముతోడ
నునుమెఱుంగు వెడందకందోయితోడ
డంబుచెన్నారు సత్త్వరూపంబుతోడ
నాతనికి శక్తి మ్రోలఁ బ్రత్యక్షమయ్యె. ౪౧౬

వ. మఱియు రతియు భూతియు బుద్ధియు మతియుఁ గీర్తియు స్మృతి
యు ధృతియు శ్రద్ధయు మేధయు స్వాహయు క్షుధయు నిద్రయు
గతియు దృష్టియుఁ బుష్టియు క్షమయు లజ్జయు జృంభయుఁ దం
ద్రియు ననుశక్తులతోడ నెదుటం బొడకట్టినమహాలక్ష్మీస్వరూ
పిణి యగు శక్తిం గాంచి విస్మయావిష్టచిత్తుండై, ౪౧౭

మ. సలిలం బెక్కడ! మట్టి యెక్కడ! వినిస్తంద్రుండనై తచ్ఛుచి
స్థలమం దేను వసించు టెక్కడ! మహాశక్తిస్వరూపంబు ముం
గలఁ గన్పట్టు టిదేడ? నాకు నెదుటం గన్పట్టు నీసర్వముం
గలయో? మాయయొ? లేక మజ్జనని వేష్టిన్నాకుఁ జూపట్టెటో?

వ. అని నానాప్రకారంబుల శంకించుచు మౌనంబూని యున్నంత జగజ్జననియు మందహాసకందళిత ముఖారవిందయై యాతని కిట్లనియె.

గీ. మఱచితివి నన్నుఁ బరశక్తిమాయకతనఁ
బ్రళయమునయందు నిర్గుణప్రతిభ నొప్పు
సమ్మహాశక్తి; సగుణుండవై యొసంగ
నీవు నను సర్వశక్తిగా నెఱిఁగికొనుము. ౮౨౦

క. నీనాభికమలమునఁ జతు
రాననుఁ డుదయించు నతఁడె యఖిలజగమ్ముల్
బూనియొనర్చు రజోగుణ
మూనినవాఁడైనకతన నుజ్జ్వలలీలన్. ౮౨౧

గీ. అతఁడు సృజించినట్టి బ్రహ్మాండమునకు
నీవు పరిపాలకుండవయి నెగడఁ గలవు
అన్నఖిలగర్భభ్రూమధ్యమంబునఁ గ్రోధ
వశముచే రుద్రుఁడును నుద్భవంబునందు. ౮౨౨

గీ. అతఁడును ఘోరమగుతపం బాచరించి
దానఁ దామసియగుశక్తి నూని ప్రలయ
కాలమునయందు సంహర్త గాఁగలాఁడు
బ్రహ్మనిర్మితమైనప్రపంచమునకు. ౮౨౩

వ. ప్రపంచ రక్షణంబునకు నాసాహాయ్యకం బావశ్యకంబు గాన సత్త్వశక్తి నగుననన్నుం గైకొమ్ము. భవద్వక్షస్థలంబున నెల్లప్పుడును వసింతు నన నతం డిట్లనియె. ౪౨౪

క. ప్రకటవర్ణయుతంబగు
శ్లోకార్థం బాకడుపు వింటి సుందరి! యది నా
కేకతమున వినఁబడియెనొ
నీకతమునఁదెలియవలయు నిక్కమనవృషున్, ౪౨౫

వ. మహాలక్ష్మియు నెలనగ వలర నిట్లనియె. ౪౨౬

ఉ. నాపలుకాలకింపుమ యనంత గుణాలయ నైనయట్టినా
రూపముమాత్రి మెప్పుగ నిరూపణఁ జేయగ నేర్తు వీవు దు
ష్ప్రాపము నీకు నిర్గుణత భాసిలు నప్పరదేవతామహా
రూపము తెల్పె నాపె యిది రూఢిగ భాగవతాఖ్యమంత్ర మా,

ఆ. వె. వేదసార మైనవిద్యయై సుభగమై
పుణ్యమై సమస్తగణ్య మగుచు
నొప్పుభాగవతము నొసఁగెఁ బరాంబిక
నీయదృష్ట మేమొ నేనెఱుంగ. ౪౨౮

క. నీయందుఁ గృపామతియై
యాయంబిక నీకుఁ జెప్పె ననఘా! నిత్య
ధ్యేయంబు నమేయం బన
పాయంబు నటంచు దీని నరయుము మదిలోన్. ౪౨౯

గీ. దీని మఱువక పఠియించితేని శుభము
లబ్బు ననులచ్చిపలుకుల నాలకించి

హరియుఁ బరమోత్తమం బగునట్టిమంత్ర
మంచు నద్దాని జపియించు ననవరతము. ౪౩౦

వ. ఇట్లమ్మహామంత్రంబు జపించుచుఁ గొంతకాలమ్మునకు మధు
కైటభ భయమ్మునఁ దనకుశరణాగతుం డగువిరించి ననుగ్రహించి
యద్దనుజుల వధించి విష్ణుఁ డదభ్యర్హితుండై యాతని కుపదేశించె
నతఁడు నారదునకు నతండు నాకును నుపదేశించెను దాని నేను
యేనసష్టాదశ సహస్రసంహితాసూక్తమ్ముగా నిర్మించితిని. ౪౩౧

సీ. పంచలక్షణయుక్త మై చిత్తగతద
బజ్ఞానతిమిరమార్తాండమై
మాగమాఖిలసార మనుపమ మఖిల ధ
ర్మప్రతిపాదక మప్రతిమాన
ముక్తిసాధనము ముముక్షుసేవ్యము దివ్య
మాఖ్యానబహుళమై వ్యాప్తిమహాను
మాయుష్యవర్ధనం బతిశాంతిదంబు ధ
న్యంబు పుణ్యంబు గణ్యంబు వినను

గీ. సంశయచ్ఛేదకంబు సంసారతారి
కం బయిన భాగవతపురాణంబు నేను
హర్షణాత్మజతోఁ గూడ హర్షమున
జదువుకొనుమయ్య దాన మోక్షంబు గాంచ. ౪౩౨

క. అని తనయునకుం జెప్పెడి
యనువునఁ గైకొంటి నేను నాతఁడు దాని
గొని పఠియించుచు నాశ్రమ
మున నుండెన్ సకలసౌఖ్యముల్ దనరఁగన్. ౪౩౩

వ. ఇట్లు బుణగ్రస్తునిపగిది నిర్ధనునిచందంబున వైకల్యంబున శూన్య హృదయుండై శోకభంగిం జింతావిష్టుండగుకుమారుం గాంచి సాత్యవతేయుండు సంశయగ్రస్తుండై యిట్లనియె. ౪౩౪

క. జ్ఞానాభ్యాస మొనర్చుట
మాని వృథాచింతఁ జేసి మన మజ్ఞానా
ధీనముగఁ జేయ నేల? సు
ఖానుభవము గాంచి ముదము నందఁగరాదే? ౪౩౫

గీ. నాకుఁ గొమరుడవయ్యు విజ్ఞానమునకు
నింతగాఁ జింత సేయ నీకేల? నాదు
వచనములు నీమనమ్మునఁ బట్టవేని
శోక యుపాయ మొకఁగొంతు వినుము పుత్ర! ౪౩౬

వ. మిథిలానగరమ్మున జనకుం డనునొక్క పృథివీపతి గలఁడు, ౪౩౭

గీ. ఆతఁ డతిశాంతుఁ డతిదాంతు డమలహృదయుఁ
డుత్తమజ్ఞానసంపన్నుఁ డూర్జితుండు
అతని దర్శించి నీసందియముల నెల్లఁ
దీర్చుకొనుమయ్య సత్యము దెలుపఁ గలఁడు. ౪౩౮

వ. అనిన శుకుం డిట్లనియె. ౪౩౯

గీ. రాజ్య మదమత్తు లైనట్టి రాజు లేడ
సకలముని దుర్లభంబగు జ్ఞానమేడ
దంభ మగుగాక నిజ మని తలఁప నగునె?
కలఁడె? వంధ్యాసుతుండు లోకమున నెందు. ౪౪౦

—* శుకుండు మిథిలానగరంబునకుఁ బోవుట *—

క. పాపములకు మూలంబు ప్ర
తాపాలస వృత్తి దాన రక్తుం డగు నీ
భూపాలుఁడు విజ్ఞాన
ప్రాపకుఁ డని చెప్పి దిది యసంబద్ధము గాదే ? ౨౨౧

గీ. పద్మపత్రము జలమునఁ బరిఢవిల్లు
చందమున నీతఁ డెట్లు సంసారమందు
నంటి యంటని విధమున నమరి యున్న
వాఁడొ ? యాతనిఁ గనుఁగొన వలచె నాకు ? ౨౨౨

వ. సంసార చక్రమ్మునఁ బరిభ్రమించు వానికి నిది మాత యనియు నయ్యది భార్య యనియు వీఁడు పుత్రుఁడనియు నది సోదరి యనియు నిది కులట యనియు నది చేఁదనియు నది మధురం బనియు నది క్షారంబనియు నిది శీత మనియు నది యుష్ణ మనియు నానాభేదంబులు చొప్పడక తప్ప దట్టి భేదజ్ఞానంబు కలవాఁడు ముక్తుం డెట్లగు ? సంతతియగాక రాజ్యభార నిర్వాహకుఁ డగు నరపాలునకు శత్రుమిత్రాది పరిశీలనం బావశ్యకం బిన్నిటిం దవిలియు జీవన్ముక్తుండగు పురుషుం డదృష్టచరుం డగుటం జేసి యాతని దర్శింపఁ గుతూహలంబు పొడమెఁ గావున వచ్చెద నాజ్ఞ యిమ్మనుటయు వ్యాసుండు, ౨౨౩

చ. అరిగెదవే కుమార ! శుభ మబ్బెడుఁ గాత నీకు నెల్లెడన్
దిరిగియు వైళమే యరుగు దేఁగదవయ్య ! భవన్ముఖంబు నే
నరయక తాళఁజాల విపులాయువు నీ కగుఁగాక యొండుచో
నరిగెదుసుమ్ము బాసయిడు మాపయి యిచ్చొటుపీడు మిమ్మెయిన్.

క. జనక నృపుఁగాంచి సంశయ
వినివృత్తింబొరసి మరల వేగమ యిటకుఁ
జనుదెమ్మా, ప్రాణము నీ
వని నమ్మిన నన్ను నంగలార్పింపకుమీ. ౨౨౫

వ. అని మాటి మాటికి ననునయించు తండ్రికి నమస్కరించి యనుజ్ఞాతుండై ధనుర్ముక్తంబగు శరంబు వడువున నతిశీఘ్రగమనుండై యరుగుచుఁ ద్రోవ నక్కడక్కడ ననేక విధమ్ములగు దేశమ్ములను వనములను బర్వతమ్ములను క్షేత్రమ్ములను నానా ప్రకారులగు మునులను శైవ వైష్ణవ శాక్తాదులను గాంచుచు ననేక ప్రకారంబు లగు వారి వారి ధర్మంబుల కత్యాశ్చర్య పర్యాప్తుండగుచు రెండు వత్సరంబులకు మేరువును నొక వత్సరమునకు హిమనగంబును నతిక్రమించి మిథిలానగరంబు సొచ్చి యచ్చటి విశేషంబు లాలోకించు చున్నంత ద్వారికుండు వారించి "నీ వెవ్వండ వేమి కార్యంబున నరిగెద" వనుడు నవ్వాని కేమియుం జెప్పక మరలి నగరద్వార బహిఃప్రదేశమ్మున స్థాణువుంబోలె నచలుండై కూర్చుండుడు వెండియు ద్వారికుం డిట్లనియె. ౨౨౬

క. మూకునివలె లోనికిఁ జన
నీ కెవ్వఁ డానతిచ్చె నృపు దర్శింప
న్నీ కేమి కార్య మచ్చెనో ? నీ
కులధర్మ స్వభావ నియతులు సెపుమా. ౨౨౭

గీ. బ్రాహ్మణుండవు నాగమ పారగుండ
వంచుఁ దోఁచెడి నినుఁ జూచినంత నాకు

నైన గులమును గార్యంబు నరయఁ జెప్పి
యేగవలె న్యాయ్య మియ్యది యిట మునీంద్ర. ౪౪౮

వ. అనిన శుకుం డిట్లనియె. ౪౪౯

క. ఏ కార్యమ్మునకేఁ బృ
థ్వీకాంతునిఁ జూడ నరుగుదెంచితినో నా
కా కార్యము నీకతమున
వాఁకిటనే యెదురు పడియె వగపింకనేలా? ౪౫౦

మ. హిమవన్మేరు నగమ్ములన్ గడచి నే నీరాజ్య దర్శనాకాం
క్షమున నొక్కింతయు లెక్క సేయక దురాశన్ జిక్కి వాక్యార్థము ని
క్కముగా నెమ్మది నిమ్మ నచ్చుటది నాకర్మమ్ము గాదా యనో
సము వేషమ్మును గల్గ నేర్చునె? మహత్సంబంధ మీ సర్వమున్.

క. విను దేశ పరిభ్రమణం
బునకు ధనాశయ ప్రధాన మూలము మానున్
ధనలోభము పోకుండియుఁ
జనుదెంచితిఁ గర్మగతి యసాధ్యము కాదే? ౪౫౨

ఆ. వె. ఆస లేనివాని కధికంబు సౌఖ్యంబు
మోహవార్ధియందు మునుఁగఁడేని
యాస లేనివాఁడ నయ్యును మోహంబు
చాయఁ దవిలి వెడలఁ జాలకుంటి. ౪౫౩

గీ. మేరుపర్వత మది యేడ? మిథిల యేడ?
కాలినడలన యిటకు రాఁ గలుగు టేడ?
అహహా! యిది యెల్లఁ బ్రారబ్ధ మహిమ కాక
యెంచి చూచిన ఫల మెుకింతేనిఁ గలదె? ౪౫౪

క. వేదము శాస్త్రము పుణ్య
పాదక మగుతీర్థమో నృపాలునిఁజూడన్
రాఁ దగునె ? యిటకుఁ బ్రా
ర్థాదేశముఁ దప్పఁద్రోయనగునే యొందున్ ? ౨౫౫

క. పరిశీలింపక యే నిట
కరుదెంచినపనికి లాభ మబ్బెను బురిలోఁ
జొరఁబోకుము పొమ్మంచున్
బరిచారకుఁ డడ్డపెట్టుపాటియె తలఁపన్ ? ౨౫౬

క. ప్రారబ్ధకర్మవశమునఁ
దారసిలు శుభాశుభములు దప్పికొసంగా
నేరికిఁ దరమా సని శుకుఁ
డూరక మౌనంబు నూని యుండెఁ దనంతన్. ౨౫౭

వ. ప్రతిహారియు నీతండు మహానుభావుం డని నిశ్చయించి విన
యమ్మున డగ్గఱం జని సామపూర్వకంబుగా నిట్లనియె. ౨౫౮

క. సీయిచ్చ కష్టపెట్టిన
నాయపచారంబు సైంచి నావచనంబుల్
రోయక పురిలోనికిఁ జను
మా ! యేరికినైన నిన్ను నడ్డఁదరమే ? ౨౫౯

క. అన శుకుఁ డిట్లను నీదగు
పని నీవొనరింప దీనఁ బాతక మగునే ?
విను పరతంత్రుఁడ వగు ని
న్నను టనుచిత మధిపునాజ్ఞ యట్టిద కాదే ? ౨౬౦

క. నరపతియునుదూష్యుఁడు గాఁ
డరయక యిట కేగుదెంచు టది నాతప్పే
పరిశీలించిన నెంతుం
బు గేహాగమసము గౌరవప్రదమగునే ? 3౬౧

క. అన ద్వారపాలకుం డి
ట్లను సుఖ మన నెద్ది ? దుఃఖ మన నెయ్యది ? శో
భన మిచ్ఛగించునరుఁ డె
వ్వని సేయఁగ వలయు హితుఁడెవం డెవఁడగు నహా ?

వ. నాృపుడు శుకుం డిట్లను లోకమ్మున జనుఁడు రాగి యనియు విరాగి
యనియుఁ దగు నందు విరాగి జ్ఞాతాజ్ఞాత మధ్యమభేదంబులు
గలవాఁడు రాగియును మూర్ఖుండుఁ జతురుండునా ద్వివిధుండు
శాస్త్రప్రయుక్తమ్మును మతిప్రయుక్తంబును నని చాతుర్యం
బును ద్వివిధంబు, మఱియును యుక్తాయుక్తభేదంబున ద్వైవిధ్యంబు
గలయది యన విని ప్రతిహారి మహాత్మా ! నీ చెప్పిన వచనంబుల
యందలి యర్థంబు నా కబోధ్యంబై యున్నయది. నన్ను
గ్రహించి తెల్లంబుగాఁ జెప్పుమని వేఁడుటయు, ౨౬౩

గీ. ఎవఁడు సంసారమునయందు నిచ్ఛగలఁడొ
వాఁడెపో రాగినాఁబడు వాని కిలల
సౌఖ్యములు దుఃఖములుగూడ ననుభవించు
నందు మగ్నుండు పరగతి చెందఁబోఁడు ౨౬౪

క. ధనదారమానవిజయము
లను గోని సుఖ మందునట్టిలాభము లేకు
న్నను దుఃఖము గనుఁ గావున
నొనరుచు యత్నము నతఁడు సుఖోదయమునకుఁ. ౨౬౫

గీ. వానికి సుఖమ్ము నొడఁగూర్చువాఁడ హితుఁడు;
విఘ్నము నొనర్చువాఁడ పో! విద్విషుండు
చతురుఁ డెల్లెడ మోహసంగతుఁడు గాఁడు
మూర్ఖుఁ డన నెల్లెడల మోహమును వహించు. ౨౬౬

గీ. ఇఁక విరక్తున కగు సుఖ మెట్టిదనిన
తత్త్వబోధయు నాత్మవిత్త్వమును, దుఃఖ
మనఁగ వానికి సంసార మనుగమించు
వారి చరితంబు విని వలవంతఁ గొనుట. ౨౬౭

క. పరతత్త్వాదరుఁ డగున
ప్పురుషునకున్ గ్రోధలోభములు మోహంబున్
బరికింప శత్రువు లగుం
బరమానందంబ వానిబంధువు దలఁపన్. ౨౬౮

వ. ఇట్లు బోధించుశుకుని విజ్ఞానమ్మున కచ్చెరు వంది ద్వారపాలకుండు యథేచ్ఛాగమనంబునకు నంగీకరించుటయు నతండు ద్వారమ్ము నతిక్రమించి రాగద్వేషాదిసంకులమ్మును క్రియావిక్రియోపలక్షితంబును విపణిద్రవ్యమనోహరంబును వివదమానజనసంకులంబును వసుపూర్ణంబును నగు నప్పురంబు నల్గడల నాలోకించుచుఁ జనువాఁడు రాజమందిరద్వారమ్మున దౌవారికుచే నివారింపంబడి శీతోష్ణాదికంబుల సమదర్శనుండై మోక్షోపాయంబుఁ జింతించుచు నచలుండై స్థాణువుం బోలి నిలిచి యున్నంత నమాత్యుం డొక్కఁడేతెంచి బద్ధాంజలిపుటుండై లోనికిం దోడ్కొని పోయి దివ్యపాదపలతాశోభితం బగు నొక్క రాజోద్యానమ్మున నతిథిసత్కారమ్ము నెఱవేర్చి, ౨౬౯

సీ. సంగీతసాహిత్యసరసవిద్యలయందు
నేర్పు గల్గి చరించునిపుణసతుల
వాత్స్యాయనాది దివ్యశాస్త్రకలలందు
బ్రజ్ఞ గల్గినసుహాసిప్రకృతుల
రంభాముఖాప్సరోరమణీసమానులకన్న
నందంబు గల్గిన యతులగతుల
రాజసేవాసమారాధన క్రియలందుఁ
బోధితలై వర్తించుభాగవతుల

గీ. వారసతులను రావించి ధీరుఁడైన
శుకమునీంద్రుని సేవ కుంపకలఁ జేసె
సుగతిని స్త్రీముఁ జేగ నమ్మనిపుత్రుఁ
డట యతఁడిత్రుఁడై తనదారి తానుండె. ౪౬౦

క. ఆనెలఁత లమ్మునీంద్రుని
నానావిధ భక్ష్యభోజనములఁ దగ స
మ్మానించిరి యాతండు
త్యాగంబము చేసె వారి యారాధనలన్. ౪౬౧

శా. నానారంగ సరసశిల్ప ఫలితతులన్ [illegible]
మాన్యనిర్వాత్మజుఁ జూచి కామినులు కామగ్రస్తలై పుష్పతో
ద్యానమ్మందుఁ జరింపఁజేసి తమమోహంబస్త్ర సూచింపఁగా
లోనూహించె నతండు తల్లులని యోగిలోకేక్షణాల్ సగ్గలన్. ౪౬౨

గీ. కామినులలోనమ్మునసట్టి వికారములకుఁ
గాముకుల మానసమ్ములు కరఁగుఁగాక
పుట్టుకయమున్న సంసారమునకు భీతి
పడెడి మునిసుతుమది మెత్తఁబడునె యెందు ? ౪౬౩

వ. అకాంతలును నాతని జితేంద్రియుండని నిశ్చయించి భక్తితాత్ప
ర్యమ్ము లగుచుం దత్తదుపచార కల్పనమ్ముల సేవించుచుండిరి.
శుకుండును నిర్వికారచిత్తుండై యాత్మారాముండై యథావిధిగ
సాయం సంధ్యోపాసనం బొనర్చికొని యామమాత్రంబు ధ్యాన
నిశ్చలుండై పదంపడి తదంగనాదర్శితంబగు నొక మనోహరతల్పం
బున శయనించి వేగుజామున మేల్కాంచి యుషఃకాలంబు దనుక
ధ్యాననిష్ఠుండై పిదపం గాల్యకృత్యమ్ములు నెఱవేర్చికొని మరల
సమాధియుక్తుండై యున్నంత, ౪౭౪

—* శుకజనక సంవాదము *—

క. శుకముని యాగమనమ్ము జ
నకుం డెఱింగి పురోహితుం దనకు ముందుగం జే
సికొని శుకునిం దగ నర్ఘ్యా
దికముల నర్పించి కడు విధేయుం డగుచున్, ౪౭౫

వ. కుశలం బడిగి యొక గోవును సమర్పించి వినయవినమితుండై
యున్నంత శుకుండును జనకునిం దగు గౌరవ భాషణంబుల గౌర
వించె నంత జనకుండు, ౪౭౬

ఆ. వె. నిస్పృహుండవైన నీ వేమికతమున
నిటకు వచ్చినాడ వెఱుంగం జెప్పుమ !
యనుడు నన్నరేంద్రు నాదరమ్మునం జూచి
యారణేయుం డిట్టులనియెం గడంగి. ౪౭౭

వ. రాజేంద్రా! మా తండ్రి యగు వ్యాసుండు నాకుపనయనాది
కం బొనరించి సమాప్తవ్రతుండనైన నన్నుం దారపరిగ్రహం
బొనరింపుమనుడు సంసారబంధమ్మునకు భీతిల్లి యే నొల్లనైతి

నాయనయు గృహస్థాశ్రమం బుత్తమం బనియు వనప్రస్థాశ్రమం బనియు ధర్మార్థకామమోక్షసాధనం బనియు నుపదేశించి యాగీ కరింపని నన్నుం గాంచి మిథిలానగరమ్మున కేగిపేని నీ సంశయంబు నిర్గతంబగు నని చెప్పినకతమ్మున నిన్నుంగనవచ్చితి. మోక్షకాముఁడనగు నాకుం గర్తవ్యం బెయ్యదియో యానతీవలయు ననిన నతని కాతం డిట్లనియె. ४८७

గీ. వినుము విప్రేంద్ర! మోక్షంబుఁ గోరఁగ నిచ్ఛ
గలుగువారలు వర్తించు క్రమము మొదట
నుపనయన మంది వేదంబు నొంది దేశి
కునకు దక్షిణ నొసఁగి మీఁదను దదాజ్ఞ, ४८८

క. దారం బైకొని విధులా
చారుండై న్యాయరీతి జవదాఁటక క
ర్మారంభ మ్మొనరించు మ
పారగతిఁ మెలఁగుటొప్పు సంసారమునన్. ४७०

సీ. పుత్త్రులఁ బౌత్త్రులఁ బొడఁగాంచి మీఁద వా
నప్రస్థుఁ డగుచు వనమ్మునందుఁ
దప మాచరించి షడ్రిపుజయం బొనరించి
యగ్నుల నాత్మ యం దావహింపఁ
జేసి భార్యను వీడి చిత్తము వైరాగ్య
మనుగమింపఁగఁ దుర్యాశ్రమంబు
నంగీకరించి శుద్ధాంతరంగుఁడయి
చరియించుటిది వేదసమ్మతంబు

గీ. గాని మొదలనె సన్న్యాసమూనుటది వి
రుద్ధము విరక్తికలన సంశుద్ధుఁడైన

యనఘుఁడే కాని సన్న్యాస మధిగమింపఁ
దగఁడు తగఁ డియ్యదియ నా మతము మునీంద్ర. ౪౫౧

క. నలువది యెనిమిది సంస్కృతు
లిల వేదాపాదితమ్ము లిందు గృహి కగుఁ
నలువది తుర్యాశ్రమవం
తుల కెన్మిదియగు ననుచు శ్రుతులువచియించుఁ. ౪౫౨

క. అనిన శుకుఁ డిట్టులను నో
జనపాలవరేణ్య! మానసమ్ము విరాగం
బున కెనసినంత సన్న్యా
సనియతి గొనుటొప్పకున్నె సారజ్ఞునకుఁ? ౪౫౩

వ. అనిన జనకుం డిట్లనియె. ౪౫౪

గీ. ఇంద్రియమ్ము లజేయమ్ము లెంత పెద్ద
పండితునకైనఁ గాని లోఁబడకయుండు
నాటి తేటనివారల కడుగవలెనె?
ప్రతిపదమ్మును మదివికారమ్ము గ్రమ్ము. ౪౫౫

గీ. భోజనాసక్తి శయనేచ్ఛ భోగరక్తి
పుత్ర సంసక్తియును మదిఁ బొడమెనేని
యతియయినమీఁదఁ దన కెటు లనుభవింప
వచ్చుఁ? గోరిక లనఁగ నవారితములు. ౪౫౬

గీ. కానఁ గ్రమమున సర్వ భోగములు ననుభ
వించి త్యజియించి గ్రహియించి మించవలయుఁ
గాని యువ్వెత్తుగా పీడఁగాఁ దరంబె?
యూర్ధ్వసుప్తుండు పతనమ్ము నొందకున్నె? ౪౫౭

క. ఏవఁడు యతియయ్యు వైరా
గ్య వివేకంబు వెడలి భోగముల నాసక్తిం
దవులునొ భ్రష్టుండై వాఁ
డవల నిరంతరము నరకమందఁ గృశించున్. ౯౮౮

గీ. చీమ మెలమెల్లఁగాఁ జని చెట్టు తుదకు
నేగు కరణిఁ గ్రమమ్ముగా నెఱుక గలిగి
సన్న్యసింపఁగవలెఁ గాని సన్న్యసించి
కొంటెకిం జెప్ప రేవడ రీతి చనునె ? ౯౮౯

గీ. వడివడిగఁ బోవు పక్షుల వడువు గనక
మందగతి నంది యరుగు చీమల వడువునఁ
గ్రమముగా నుత్తమ పదంబు గాంచినప్పుఁ
గాని తత్పదప్రాప్తియు సుఖప్రదంబె ? ౯౯౦

గీ. మన మడంచియు బుద్ధిఁ గ్రమక్రమమున
యుక్తమార్గమ్ములకుఁ జొన్పి యుపశమించి
ననుభూతేంద్రియసుఖాత్ములైనవారి
కింద్రియమ్ములు శత్రులై యేగఁగలవె ? ౯౯౧

మ. గృహమందుండియు శాంతిగల్గి తగుభంగిం బోవుచున్ లాభసం
గ్రహసంతృప్తుఁడు లాభ మబ్బమిని దుఃఖగ్రస్తుఁడుం గాక స
ద్విహితంబుల్ పొనరించుచున్ సతత మావిర్భూతమోదోదయుం
డహితత్యాగియునై చరించుపురుషుం డందుం గాదే మోక్షమున్.

చ. ననుఁ గనుఁగొమ్ము భోగము లనంతముగాఁ గొనుచున్ జనానురం
జన మగురీతి రాజ్యమును సల్పుచు నిచ్చఁ జరించుచుండియున్

మన మతినిర్మలంబుగ నొనర్చి చెలంగుటచే విదేహాము
క్తిని గొనువాఁడ నీ వనుమతింపగ రాదె ? సుఖమ్ము లిమ్మొయిన్.

గీ. ఆత్మవస్తు వెవ్వరికైన నక్షిగోచ
రంబుగా దనుమేయ మరంజనంబు
నిర్వికారంబు దానికి నెగడు టెట్లు
బంధనం బింత దెలియంగఁ బడదె మౌని ! ౪౯౪

ఆ. వె. సలుపనిమ్ము తపము జప మొనర్పఁగ నిమ్ము
తిరుగనిమ్ము సర్వ తీర్థములును
చిత్తశుద్ధి లేని చెనఁటులు చేయు ప
నులు దలంప వ్యర్థములు మునీంద్ర. ౪౯౫

ఆ. వె. నేను నీవు నాది నీయది యనెడి సం
బంధ కారణంబు మనము వినుము
మనము శాంతమైన మునినాథ బంధమ్ము
కలుగు నెట్లు ? ముక్తి గలుగ దెట్లు ? ౪౯౬

గీ. శత్రు మిత్రాదిభేదమ్ము సకలమును మ
నోగతమ్ము నవిద్యా వినోదమును ప
టంచుఁ దెలియుము విద్యోదయంబు వొడమె
నేని యివి యన్నియును నశియింప కున్నె ? ౪౯౭

క. విద్యన్ దెలియుట కొఱకు న
విద్యా కార్యముల ననుభవింపన్ వలె సూ
ర్యద్యుతిఁ బడలని వానికి
హృద్యంబై చెట్టునీడ యొసకం బిడునే ? ౪౯౮

గీ. భూతములు భూతములయందుఁ బొరలెనేని
గుణములు గుణమ్ములను గూడికొనియెనేని
ఇంద్రియము లింద్రియార్థమ్ము లెసఁగెనని
యాత్మ కరయఁగ దోష మింతైనఁ గలదె? ౯౯

క. వేదము లోకములకు మ
ర్యాదాపాదకము దాని నవమానిని ధ
రా దవమానించిన ధ
ర్మాదులు నశియించు సౌగతాదులకు బలెన్. ౧౦౦

గీ. ధర్మ మడఁగినయంత నధర్మ మెసఁగుఁ
దాన వర్ణాశ్రమాదివ్యవస్థ లడంగుఁ
గాన వేదోదితము లగుకర్మములను
దగ ననుష్ఠించుటయు సమ్మతము మునీంద్ర. ౧౦౧

క. అని జనకుం డుపదేశిం
చిన విని శుకుఁడనియె నీవు చెప్పినవిధముం
మనమలరన్ వింటిని నా
యనుమానము తీఱదయ్యె ననఘవిచారా. ౧౦౨

గీ. వేదధర్మంబు లన హింసవిధము గలుగు
తలఁపు గలయవి హింస యధర్మమకద
అట్టి ధర్మేతరము చెప్పునట్టి యాగ
మమ్ము లవియును ముక్తిప్రదమ్ములగునె? ౧౦౩

గీ. పశులఁ జంపించుటయు మాంసభక్షణంబు
సోమపానమ్ము ప్రత్యక్షసురతవిధి యొ
నర్పఁజేయుట మొదలు జన్నములయందు
సలుపు దుర్వృత్తు లివియు మోక్షప్రదములె? ౧౦౪

సీ. ధర్మరతుండు వదాన్యుండు శిష్ట సం
రక్షకుండును దుష్టశిక్షకుండు
ననఁ దగు శశిబిందు వసురాజు మును దా నొ
నర్చిన మేటిజన్నమ్ములందుఁ
జంపిన పశువుల చర్మంబు లవి వింధ్య
పర్వత సదృశభావంబునందె
రక్త మంతయును జర్మణ్వతి యను నొక
నది యయ్యె నట్టి మానవపతికిని

గీ. గతి దివంబాయెఁ గాని మోక్షంబు దొరక
దాయె; నాతని యశము సాక్ష్యమ్ము సంగు
నాగమోక్త కర్మంబుల నాచరించు
వారలకు మోక్షపదము దుష్ప్రాప మనుచు. ౫౦౫

గీ. కాన నీదృశధర్మముల్ గలుపు నాగ
మముల నాకించుకయు బుద్ధి మసల దనఘ
సంసృతికిఁ గారణంబు స్త్రీ సంగమంబు
దానిఁ గనువాఁడు ముక్తుఁ డెట్లౌను? చెప్పుమ. ౫౦౬

ఉ. ఆగమధర్మ మూనఁగ గృహావ్రతిదే యధికారి వానికిన్
సాఁగదు దారతోడ సుఖసంగతిమై వసియింపకున్న నా
భోగము చేకుఱన్ మనము పొంగును జేకుఱకున్న ఖిన్నుఁడై
తాఁగృశియించు నిట్టిపరతంత్రుఁడు మోక్షముఁ జెంద నేర్చునే?

వ. అనిన జనకుం డిట్లను; మునీంద్రా! యజ్ఞాదికంబుల వేదోదితంబగు
హింస యుపాధిభేదమ్మున నహింసయ యగు నది యెట్లంటేని?

మ. ఫలముం గోరి యొనర్చుహింస తనకుం బాపమ్ము సంధించుఁ గా
ని లవమ్మైన ఫలమ్ము గోరని యెడన్ లేదట్టి పాపమ్ము ని

ర్మలమై యొప్పెడివహ్ని కింధనపు సంబంధమ్ముచేఁ గాక తాఁ
గలుగ న్నేర్చునె ధూమ మూరకయ, నిక్కంబింత యూహింపుమా.

గీ. రాగి కాక యొనర్చు కర్మమ్ములవి కృ
తమ్ములయ్యును విను మకృతమ్ము లగును
గాన మోక్షేచ్ఛ నొనరించు సుకర్మములకుఁ
బాతకము లేదటంచు విద్వాంసు లండ్రు. ౧౧౦

వ. అనిన శుకుం డిట్లనియె. ౧౧౧

గీ. సంశయం బొక్కఁడు మనమ్మునఁ దోఁచు
చున్నయది మాయలో మున్గి యున్నవాఁడు
నిస్పృహుం డెట్లు లగు? మోహనియుతులకును
కేవలము శాస్త్ర మగునె ముక్తిప్రదంబు? ౧౧౨

ఆ. వె. దీపవార్త చేతఁ దిమిరంబు వాయుని
యట్లు శాస్త్ర మబ్బినంతమాత్రి
లోననున్నతమము లోకొని యడఁగునే?
యనుభవమునఁ గాక జనకభూప! ౧౧౩

క. పరహింస సలుపకుండుట
పరమహితంబ కద! మోక్షపదగామికి సం
సరణమున మునిఁగి తేలెడి
నరులకు నది యెట్లు జరుగు నరనాథమణీ. ౧౧౪

క. ధనవాంఛయు సుతవాంఛయు
వనితావాంఛయును రాజ్యవాంఛయు నీ నె
మ్మనమున వదలవు నీకుఁ ద
గునె జీవన్ముక్తపదము? కువలయనాథా! ౧౧౫

గీ. శిష్టరక్షణమును దుష్టశిక్షణమ్ము
నవనిపతివైన నీ కవశ్యములు కావె
యిట్టి భేదమ్ము చొప్పడునట్టి నీ వి
దేహముక్తికి నే సమ్మతించుటెట్లు ? ౧౧౬

మ. కటుతిక్తామ్ల కషాయభేదము లెఱుంగన్ లేవొ ? యిష్టార్థలం
పటభావమ్మును బొందవో ? కడు నరమ్యంబైన వస్తుక్రియా
ఘటనన్ హేయతఁగాంచకుంటివొకొ ? జాగ్రత్స్వప్నసుప్త్యాదులం
దటు లే మగ్నతనొందకుందువొ ? తురీయావస్థ నీకొప్పునే ? ౧౧౭

మ. ఇది నా సేన, మదీయరాజ్య మిది, నాయేణాక్షి యీనాతి, యి
య్యది నాపుత్రిక, వీఁడు నాసుతుఁడు, నా కాహ్లాదకం బిద్ది, యి
య్యది నాకుం బ్రతికూల మంచు మది నూహల్ సేయు నీవెట్లు ము
క్తదశం జెందెదు ? నీకు లోష్టమును బంగారమ్మునుం దుల్యమే ?

సీ. సేవింప గతి లేదు చేయంగఁ బని లేదు
నిలిచి వసింపంగ నీడ లేదు
కామింప సతి లేదు గణియింప మతి లేదు
దుఃఖించుటకు లోనదుడుకు లేదు
తిట్ట శత్రుఁడు లేఁడు దీవింప హితుఁడు లేఁ
డేలంగ నొకపల్లెయేని లేదు
మానమ్ము లే దవమానమ్ము లేదు క
ష్టమ్మును లేదు సుఖమ్ము లేదు

గీ. పుష్పఫలమూలములఁ బొట్టఁ బోసికొంచు
నరయ నాయంతవాఁడనై యడవిమృగము
వడువునఁ జరింతు నావంటిబడుగు చెందు
వాఁడు కాఁడె ? జీవన్ముక్తపదము నధిప ! ౧౧౮

ర్మలమై యొప్పెడివహ్ని కింధనపుసంబంధమ్ముచేఁ గాక తాఁ
గలుగన్నేర్చునె ధూమ మూరకయ, నిక్కంబింత యూహింపుమా.

గీ. రాగి కాక యొనర్చు కర్మమ్ము లవి కృ
తమ్ములయ్యును విను మకృతమ్ము లగును
గాన మోక్షేచ్ఛ నొనరించుకర్మములకుఁ
బాతకము లేదటంచు విద్వాంసు లండ్రు. ౧౦

వ. అనిన శుకుం డిట్లనియె. ౧౧

గీ. సందియం బొక్కఁడు మనమ్మునందుఁ దోచు
చున్నయది మాయలో మున్గి యున్నవాఁడు
నిస్పృహుం డెట్టు లగు ? మోహానియతులకును
గేవలము శాస్త్ర మగునె ముక్తిప్రదంబు ? ౧౨

ఆ. వె. దీపవార్త చేతఁ దిమిరంబు వాయని
యట్లు శాస్త్ర మబ్బినంతమాత్ర
లోననున్నతమము లోకొని యడఁగునే ?
యనుభవమునఁ గాక జనకభూప ! ౧౩

క. పరహింస సలుపకుండుట
పరమహితంబ కద ! మోక్షపదగామికి సం
సరణమున మునిఁగి తేలెడి
నరులకు నది యెట్లు జరుగు నరనాథమణీ. ౧౪

క. ధనవాంఛయు సుతవాంఛయు
వనితావాంఛయును రాజ్యవాంఛయు నీ నె
మ్మనమున వదలవు నీకుఁ ద
గునె జీవన్ముక్తపదము ? కువలయనాథా ! ౧౫

గీ. శిష్టరక్షణమును దుష్టశిక్షణమ్ము
నవనిపతివైన నీ కవశ్యములు కావె
యిట్టి భేదమ్ము చొప్పడునట్టి నీ వి
దేహముక్తికి నే సమ్మతించు టెట్లు ? ౫౧౬

మ. కటుతిక్తామ్ల కషాయభేదము లెఱుంగన్ లేవొ ? యిష్టార్థలం
పటభావమ్మును బొందవో ? కడు నరమ్యంబైన వస్తుక్రియా
ఘటనన్ హేయతఁగాంచకుంటివొకొ ? జాగ్రత్స్వప్నసుప్త్యాదులం
దటులే మగ్నతనొందకుందువొ ? తురీయావస్థ నీకొప్పునే? ౫౧౭

మ. ఇది నాసేన, మదీయరాజ్య మిది, నాయేణాక్షి యీనాతి, యి
య్యది నాపుత్రిక, వీఁడు నాసుతుఁడు, నా కాహ్లాదకం బిద్ది, యి
య్యది నాకుంబ్రతికూల మంచు మది నూహాల్ సేయు నీవెట్లు ము
క్తదశం జెందెదు ? నీకు లోష్టమును బంగారమ్మునుం దుల్యమే ?

సీ. సేవింప గతి లేదు చేయంగఁ బని లేదు
నిలిచి వసింపంగ నీడ లేదు
కామింప సతి లేదు గణియింప మతి లేదు
దుఃఖించుటకు లోనదుడుకు లేదు
తిట్ట శత్రుఁడు లేఁడు దీవింప హితుఁడు లేఁ
డేలంగ నొకపల్లెయేని లేదు
మానమ్ము లే దవమానమ్ము లేదు క
ష్టమ్మును లేదు సుఖమ్ము లేదు

గీ. పుష్పఫలమూలములఁ బొట్టఁ బోసికొంచు
నరయ నాయంతవాఁడనై యడవిమృగము
వడువునఁ జరింతు నావంటిబడుగు చెందు
వాఁడు కాఁడె ? జీవన్ముక్తపదము నధిప ! ౫౧౮

చ. వనిత గృహమ్ము విత్తమనువాంఛలతోఁ బనిగొని నాకు నా
పని వెఱవారి కేమి? గుణవర్గము వీడి చరింతు; నీవరా
వనిత గృహమ్ము విత్తమనువాంఛ మదిన్ వదలంగ లేవు నీ
కనువగునేని ముక్తిపద మన్యులు పొందనివార లుందురే?

క. ఒకవేళ ధనము లేమి మ
ఱొకవేళను సేన లేమి నొకవేళను శ
తృకృతభయం బెడఁబాయమి
నకదా! చింతించుచుందు వవనీపాలా! గీ_౨౧

తే. గీ. అనఘులు జితవ్రతులు మితాహారులైన
యట్టి వైఖానసులు దీని నత్యసార
మంచు గుర్తించియును నడుగంటుచుండ
నీవు సంసారివై ముక్తి నెట్లు గంటి? గీ_౨౨

వ. భవదీయవంశోత్పన్నులగు రాజులకందఱకు సనూచానంబుగా
విదేహపదంబు చెల్లంబోలుఁ; గాదేని మీపూర్వుండగు నిమి జన్నం
బొనరింపఁ గులగురుం డగు వసిష్ఠుం గాంచి విన్నవించిన నతండును
"సురేంద్రుండు యజ్ఞం బొనరింప నున్నవాఁడు తదధ్వరమ్ము
సమాప్తి నొందించి నీమఖంబు నెఱవేర్చెద" ననుడు వేఱొకని
వశమ్మునఁ దనజన్నంబు నెఱవేర్చికొని కుపితుండగు వసిష్ఠుచే
"నీశరీరంబు భూపతితం బగుఁ గాక" యని శపింపంబడి "నీ
కును నియ్యదియ శాపం" బని యెదురు శపించె నని వింటి. విదే
హాముక్తు లగువా రిట్టిపను లొనర్తురే? యని మఱియును,

క. విను మీవిదేహబిరుదం
బనఘా! ఘృతకోశమట్టులయ్యె దరిద్రున్

జనునే లక్ష్మీశ్రధరుఁడన ?
ననువే విద్యాధరాహ్వయము మూర్ఖునకుఁ ? ౧౨౮

వ. నావుడు జనకుండిట్లను, ౧౨౯

మ. భవదుక్తం బనృతమ్ము గాదు విను విప్రా ! నీవు నీతండ్రియా
జ్ఞ వృథా చేసి వనాంతరమ్మునకు వేడ్కన్ బోవనుంకించె ద
య్యవనిన్ మాత్రము సంగముం గనక యేలా యున్కి నీకొప్పున
య్యా ! విలోకింపు మరణ్యమందు మృగనిత్యవ్యాప్తి లేకుండునే ?

క. దండం బేమయ్యెడినో క
మండలు వేమగునోయంచు మాటికి నెట్టుల్
గొండాడెదీవు, నే భూ
మండలభరణమును నట్లె మది సంధింతున్. ౧౨౭

గీ. నిత్యమును బొట్టకై చింత నీకుఁ దప్ప
దట్టులే రాజ్యచింత నాకభిమతంబు
సందియముఁ జెంది యీవు విచార మొందె
దేను నిస్సంశయుండనై యెసఁగువాఁడ. ౧౨౮

మ. అనుమానం బొకయింత లేక సుఖినై యాహారముం గొందు ని
ద్రను గైకొందు సుఖమ్ములంబడయుదున్ రాజ్యమ్ము శాసింతుఁ గా
ని నిబద్ధుండ నటంచు భీతిని గొనన్ శ్నివన్నియున్ వీడి ని
త్యనిబద్ధుండ నటంచుఁ జింతిలెదు నీకా ! ముక్తి సిద్ధించుటల్.

గీ. కాన నీవు నిబద్ధుండఁ గా నటంచు
సకలము నొనర్చు మదియ మోక్షమ్మునుమ్ము
బద్ధబుద్ధిని నీ వెంతపాటువడిన
ముక్తిఁ గాంచుట సున్న యోమునివరేణ్య. ౧౩౦

ఆ. వె. మమత వీడి యెట్టి కర్మము నొనర్చె
నేని వాఁడు ముక్తి కేగువాఁడు
మమత నొందువాఁడు మఱి యెట్టి కర్మముఁ
బోయె నేని ముక్తి బొరయ లేఁడు. ౨౩౧

గీ. అనఘ ! రాజ్యాదికంబు నాయది యటంచు
నిచ్చ గలిగి ప్రవర్తింప నింత నిజము
గాన నేను జీవన్ముక్తగతిని గంటి
వెత్తఁబడ నేల ? నామాట వినఁగదయ్య. ౨౩౨

క. అని జనకుం డుపదేశం
బొనరించిన శుకుఁడు మోద మొంది తపంతన్
జనె నాశ్రమమ్మునకు సుతుఁ
గని వ్యాసుండును బ్రమోదకలితుండగుచున్, ౨౩౩

క. తనయా ! జనకునివలనన్
మనమునఁ గలసందియమ్ము మానెఁగదా ! నీ
కనుడు శుకుఁడిట్టులనె న
జ్జనకునివలె నునికి నాకు సమ్మత మనఘా ! ౨౩౪

వ. అట్లు సమ్మతించిన వ్యాసుండు సంతుష్టాంతరంగుండై పీవరి యను
నొకకన్నియం దెచ్చి వివాహం బొనరించె. ౨౩౫

క. ఆ రమణియందు శుకుఁ డా
త్మారాముండయ్యుఁ గనియె ననఘుల సుతులన్
గౌరప్రభు దేవశ్రుతు
భూరిన్ గృష్ణున్ సమస్తబుధమానితులన్. ౨౩౬

గీ. నలువురకు వెనుక నొక్కకన్యకను గీర్తి
యనెడి దానినిగని దాని నణుహుఁ డనఁగ
నెసఁగు విభ్రాజపుత్త్రున కిచ్చె, నతఁడు
బ్రహ్మదత్తునిఁ గనియె నప్పుడఁతియందు. ౫౩౭

క. శుకకన్యాతనయుం డ
త్యకలంకుఁడు బ్రహ్మదత్తుఁ డవనీపతియై
సకలముఁ బరిపాలించుచు
నొకతఱి నారదుని మునికులోత్తముఁ గాంచెన్. ౫౩౮

తదుపదిష్టం బగు మాయా బీజోపదేశమ్మునకతన నిరర్గళజ్ఞాన సంపన్నుండై విరక్తిం గాంచి రాజ్యభారంబు పుత్త్రునందిడి బదరికాశ్రమమ్మునకుం జనియె. శుకుండును పితృసాన్నిధ్యంబు విడిచి కైలాస శిఖరంబున కరిగి యచ్చట నిరంతరధ్యానసంపన్నుండై కొండొకకాలమ్ము వసియించి పిమ్మటఁ దద్గిరి శిఖరమ్మునుండి యోగబలమ్మున నుత్పతనంబొనర్చి సకలయోగిజన దుష్ప్రాపంబగు సిద్ధిం బొరసి యంబరతలమ్మున రెండవ భాస్కరుం బోలె వెలుంగుచుండె. ౫౩౯

క. వ్యాసుండును సుత విరహా
యాసమ్మునఁ బెచ్చుపెరుఁగు నడలున మిగులన్
గాసిలి యట నిలుపోపమి
హా సుత! యనుచుం జనె రజతాచలమునకున్. ౫౪౦

ఆ. వె. అచట నంగలార్చు నమ్మహాభాగుని
యందుఁ గరుణ గలిగి యఖిల గతుఁడు
ప్రతి రవం బొనర్చెఁ బరముఁ డిప్పటికి న
ప్పర్వతమున నెగడుఁ బ్రతి రవంబు. ౫౪౧

చ. అటు విలపించు వ్యాసుకడ కంగజ మర్దనుఁ డేగుదెంచి "నీ
విటు దిగులొంద మంచిదగునే? భవదీయ సుతుండు యోగ దు
ర్ఘటమగు మోక్షముం గనె నఖండుఁ డతం డిఁక వాని కింత య
కటకటికము పూని దుఃఖపడఁగాఁ దగునయ్య! పరాశరాత్మజా.

క. అని యోదార్చు శివుం గని
యనియెన్ వ్యాసుండు పుత్రు నరయక యున్నన్
గనులకుఁ జల్లన గలుగదు
చినఁబోవు మనంబిఁ కేమి సేయుదు దేవా! ౫౮౩

వ. అని పునఃపునర్విషాదంబునం దిగులొందు వ్యాసుఁ గరుణించి
శంకరుండు "నీ సుతుండు ఛాయారూపమ్మున నెప్పుడును నీ
సన్నిధి నుండు" నని వరంబిచ్చి యంతర్హితుండయ్యె. ౫౮౪

క. హరుఁ డటువోయిన మీఁదన్
బరాశరాత్మజుఁడు దుఃఖభరమగ్నుండై
యరుదెంచె నాశ్రమమ్మున
కరయఁగ శుకచరిత మిది మహామహులారా! ౫౮౫

వ. అని చెప్పి సూతుం గాంచి శౌనకాదులో మహాత్మా! శుకుం
డట్లు సిద్ధిం గాంచిన పిదప వ్యాసుఁ డేవిధమ్మున వర్తించె విన
రింపుమన నతఁ డిట్లనియె. ౫౮౬

సీ. వ్యాసుని శిష్యులై వటులు దేవలుఁడు వై
శంపాయనుండును జైమినియును
నసితుండును సుమంతుఁ డంతకుమున్న యా
తని యాజ్ఞఁ గైకొని చనిరి వ్యాసుఁ
డటు శిష్యు లరుగుట కిటు పుత్రుఁ డంతరిం
చుటకును నెమ్మది శోక మంది

తానును నందేని బో నుద్యమించి యం
తటఁ దన తల్లి యా దాశరాజ

ఆ. వె. సుతను సత్యవతిని శుభగుణ సంపన్న
సంతరాత్మఁ దలఁచి యనొటు వీడి
జన్మభూమి కడకుఁ జని నిషాదులఁ గాంచి
యాపెజాడ వారి నడుగుటయును, ౧౮౭

—* ధృతరాష్ట్రాద్యుత్పత్తి *—

వ. వారు సత్యవతిని శంతనున కిడిన వార్త తెల్పిరి. పదఁపడి దాశ రాజు తగు సత్కారమ్ముల నాతని గారవించి స్వాగతం బడిగి వినయ వినమిత శిరస్కుండై బద్ధాంజలిపుటుండై, ౧౮౮

క. దేవా ప్రాప్యం బైతగు
తావక సందర్శనం బొదవు కతమున నేఁ
బావనుఁడ నైతి జన్మము
పావనమై యెసఁగెఁ గులము పావనమయ్యెన్. ౧౮౯

వ. భవదాగమనకారణంబు వినవలతు ననుడు వ్యాసుండు మఱేమి యుం జెప్పక యట కనతిదూరమ్మున నున్న సరస్వతి యొడ్డున నాశ్రమం బేర్పఱచుకొని తపం బొనరించుచుండె. బదఁపడి శంత నుండు సత్యవతి యందుఁ జిత్రాంగద విచిత్రవీర్యులను గొమరులఁ బడయుటయు నయ్యది విని వ్యాసుం డమితానందంబు నందె. ఇట్లు తనయులం గాంచి వారి కారణమునఁ దన్ను ధన్యుంగా నెంచికొనుచుఁ గొండొక కాలమ్ము రాజ్యమ్ము శాసించి కాల గతిం బొరసిన పిదపఁ బ్రథముండగు గాంగేయుండు తన తండ్రికిఁ గాలోచితంబు లొనరించి పైతృకంబగు రాజ్యంబొల్లక దేవ

ప్రీతుండై తనతమ్ములలో నగ్రజుండగు చిత్రాంగదునకుఁ బట్టంబు గట్టె. ౫౫౦

శా. ఆ చిత్రాంగదుఁ డొక్కనాఁడు మృగయావ్యాపారశీలన్ మృగ
ప్రాచుర్యంబున నొప్పు నట్టడవిలోఁ బ్రవాహాయి క్రీడించుచోఁ
నాచెంతన్ నృపు నాత్మనామధరుఁ డాయం జూచి నానావి
ద్యాచాతుర్య మెలర్పఁదాకె నొకగంధర్వుం డనాత్మజ్ఞుఁగన్.

క. ఆ యిరువురు నొక మూఁడేం
డ్లాయతగతిఁ బోరుసల్పి రా ఖచరుఁడు గాం
గేయానుజన్ము స్వర్గ
స్థాయిగ నొనరించె నిశితశరపాతములన్. ౫౫౧

వ. భీష్ముం డయ్యుదంతంబు విని తమ్మున కుత్తరక్రియ లొనర్చి విచిత్రవీర్యుని రాజ్యమ్మున కభిషిక్తుం జేసె. సత్యవతి పుత్రశోకోపహత యయ్యుఁ గనీయఃపుత్రరాజ్య లాభమ్మునకు సంతసించె. వ్యాసుం డియ్యది విని యామోదించె నంత విచిత్రవీర్యుండు క్రమమ్ముగా సంప్రాప్త యౌవనుండై రాజ్యమ్ము శాసింప గాంగేయుం డతనికిం బరిణయం బొనర్ప నూహించుచుండె. ౫౫౩

ఆ. వె. అంతఁ గాశిరాజు సంతసమ్మునఁ దన
యాత్మజాతలకు స్వయంవరమునఁ
బెండ్లి సేయునిచ్ఛఁ బిలిపించె రాజన్య
వరుల నెల్లఁ దగినవారిఁ బంచి. ౫౫౪

వ. భీష్ముం డచ్చటి కేగి నిఖిల రాజన్యుల జయించి యంబాంబాలి కాంబికలను నమ్మువ్వురఁ గన్యకలం దనరథమ్మున నిడికొని మాతృప్రీతి భావమ్మున వారిం జూచుచుఁ బురమ్మున కరుదెంచి

తల్లికిఁ గన్నియలఁజూపి దైవజ్ఞనిర్ణీతంబగు నొక్క సుముహూర్తమ్మునఁ దమ్మునకుఁ బరిణయంబొనర్ప సమకట్టియున్నంత వారిలోఁ బెద్ద యగు నంబ లజ్జావనతాననయగుచు శాంతనవున కిట్లనియె. ౧౧౧

శా. నా కుల్ సాల్వునియందు నానృపతికిన్ నాయందు నెయ్యంబు దా
నేకాకారముఁ జెంది యున్నయది, నీ వెంతే బలాఢ్యుండవై
యాకర్షించితి నీ యధీన నగు నా కారాజు ప్రాపించునే ?
నీకుం దోఁచని ధర్మముం గలదె ? మన్నింపంగదే నావుడున్,

వ. దేవవ్రతుండును వృద్ధబ్రాహ్మణజననీసచివానుమతంబున నద్దాని యభీచ్ఛాగమనమ్మున కంగీకరించిన నయ్యాదియు సాల్వ నికేతనమ్మునకుంజని యతనితో నిట్లనియె. ౧౧౭

క. నీయం దనురాగము గల
నా యాథార్థ్యమ్మెఱింగి నను విడిచెను గాం
గేయుం డో నృపమన్మథ
న్యాయముగఁ బరిగ్రహింపుమా నాకరమున్. ౧౧౮

ఉ. నావుడు సాల్వుఁ డిట్లులను నాతిరో ! నేఁ గనుచుండ నాఁడు నిన్
గేవలమంట భీష్ముఁ డెటు నే గ్రహియింతు ? నెవండు గైకొనున్
బో ! వెలఁదిన్ బరుండు గొనిపోయి త్యజించిన దానిఁ, బౌరుష
శ్రీ వెలిదొక్కి సుక్కువడదే ? చనుమీ చనుదెంచినట్లుగన్.

గీ. అట్లు త్యజియింప నయ్యంబ " యకట ! చెడితి "
ననుచు విలపించుచును వెస నరుగుదెంచి
భీష్ముఁ గని పల్కు " ధర్మజ్ఞ ! బేలనైతిఁ
జెడితి సాళ్వుండు న న్నిరసించె నురక. ౧౨౦

క. ననుఁ గైకొను మీ '' వని కడు
వినయము మైన్యాంబు దోఁప వేఁడుకొనుము శాం
తనవుం " డన్యాసక్తుఁ
నినుఁగొన రాఁ డేగు మిపుడ నీ తండ్రిఁ గనన్. గి౬౧

గీ. అనుటయుసు జేయునది లేక యాబ పుత్రి
నింటి కేగక వనమేగి యొంటి నచటఁ
దపము సేయఁగఁ బూనె శాంతనవుఁ డంతఁ
దమ్మునకుఁ బెండ్లి చేసె నత్తరిఁ బ్రీతిఁ. గి౬౨

క. ఆ యిరువురు భార్యలతో
నా యవనీపాలుఁ డుపవనాది క్రీడా
వ్యాయామ గతిఁ జరించుచు
న్యాయంబుగ భూమిపాలనం బొనరించెన్. గి౬3

గీ. అట్లు నవ వత్సరములు భార్యలను గూడి
కేళి సల్పుచు నా భూమిపాలుఁ డంత
రాజ యక్ష్మార్తుఁ డగుచు మరణము నొందె
నతినిధువనంబు మృత్యుసంగతము కాదె ? గి౬౪

వ. సత్యవతి సుతుండు మృతుం డగుటకు దుఃఖించి మంత్రుల వలనఁ గాలోచిత కృత్యమ్ము లొనర్పం జేసి గాంగేయుం బిలిచి యేకతమ్మున నిట్లనియె. గి౬౫

క. శంతను మహీపతి కీవును
సంతానమ వగుటఁ బృథివి శాసింపుము నా
వంతఁ దొలఁగించి నాకును
సంతానపుఁ గొఱఁతఁ దీర్పఁ జనదె ? కుమారా !

క. అంబాలి కాంబికల యం
దుం బడయుము పుత్రికుల, సుతుల లేమిని వం
శం బడఁగు నకట ! యిది నిం
ద్యంబని తలపోయ నగునె, ధర్మముకాదే ? ౧౬౭

వ. అను తల్లికిం గొడు కిట్లనియె. ౧౬౮

శా. తల్లీ ! నాదు ప్రతిజ్ఞ నీవు వినలేదా ? రాజ్యభారంబు నే
నొల్లన్ దారఁ బరిగ్రహించుటకు నే నొప్పన్ గులీనుం ద్విజుం
ద ల్లీలావతులందుఁ గూర్చి తగు సంతానంబు నందింపఁగాఁ
జెల్లున్ శాస్త్రము లిట్టి ధర్మమును శాసించున్ గులార్థంబుగా.

గీ. ఇట్లు మనుమనిఁ బడసి మహీతలమున
కతని నభిషిక్తుఁ గావింపు మంబ ! వాని
శాసనంబు నాకెంతయు సమ్మతంబ
యనుడు వ్యాసునిఁ దలఁచె సత్యవతి మదిని. ౧౭౦

క. స్మరియించి నంతమాత్రన
యరుదెంచి నమస్కరించి యట నిల్చిన య
ప్పరమున్ వ్యాసుని భీష్ముం
డరసి తగినరీతిఁ బూజలర్పించె వెసన్. ౧౭౧

వ. సత్యవతియు వ్యాసుం గాంచి యిట్లనియె. ౧౭౨

క. తనయా ! నాయనుమతి నీ
యనుజుని క్షేత్రమ్మునన్ నయంబుగఁ బుత్రిం
గనుమా నా శాసనమున్
వినుమా వంశంబు నిల్పి విశ్రుతి గొనుమా. ౧౭౩

క. అను తల్లిమాట లాప్తవ
చనములుగా నెంచి వ్యాససంయమి యనుజాం
గన ఋతుకాలమ్మున గను
దనుకం దా నట వసించెఁ దద్దయు నెమ్మిన్. ౧౭౪

వ. అంబికయుఁ గొండొకకాలమ్మునకు ఋతుస్నాతయై యత్త
యానతికతన వ్యాసుం గలయుట కంగీకరించిన, ౧౭౫

ఆ. వె. వ్యాసుఁ డా విలాసవతిఁ గూడి క్రీడింప
వనిత యంధు నొక్క తనయుఁ గాంచె
నతఁడు రాజ్యమునకు నర్హుండు గాకున్కి
సత్యవతియుఁ గడు విచారమంది, ౧౭౬

వ. రెండవ కోడలగు నంబాలికం బిలిచి యంగీకరింపఁజేసెను. నామె
యును యోగ్యకాలమ్మున వ్యాసుం గలిసి పాండునామకగర్భస్థుం
డగు నొక కుమారుం బడసె. ఆతండును రాజ్యమునకు నర్హుండు
గామి నంబికం బిలిచి మరల నొక్క కుమారుం గనుమనినను
నామెయు నత్తమాట కుత్తరం బీఁజాలక వల్లె యని తన దాసిం
బనిచె. ౧౭౭

క. దాసియు వ్యాసునిమది కు
ల్లాసం బొనరించి తగు విలాసములొప్పం
జేసినకతమున దానికి
వ్యాససముఁడు విదురుఁ డనెడివాఁ డుదయించెన్. ౧౭౮

వ. ఇవ్విధమున ధర్మవేదియగు వ్యాసునివలన ధృతరాష్ట్ర పాండు
రాజ విదురు లుద్భవించి భరతవంశం బుద్ధరించిరని నుడువుటయు ;

—* స్కంధాంత పద్యములు *—

శా. సారాచార విలాస ! నిస్తులయశస్సంభార ! గంభీర ! సం
సారాత్యంతవిరక్తచిత్త ! త్రిజగత్సంస్తుత్య ! షడ్దర్శనీ
పారావారనిశాకళత్ర ! కరుణాపారీణచారిత్ర ! లీ
లారాజీవభవావతార ! గురుచర్ల బ్రహ్మవిద్వన్మణీ ! గు. ౧౦

క. హృద్యానవద్యవిద్యా
విద్యోతితసకల దేశవిభుమండల సం
సద్యోషాభూషాయిత
విద్యార్థివిశేష ! బ్రహ్మవిద్వద్భూషా. గు. ౧౧

మానినీవృత్తము. ధవళగిరి నివాసా ! ధర్మరాజద్విలాసా !
శివతరసుచరిత్రా ! శీలవచ్ఛాత్రిపుత్రా !
భవపరిచితచిత్తా ! బ్రహ్మసూత్రార్థవేత్తా !
త్రివిధమతవిహారీ ! దేశిక బ్రహ్మసూరీ ! గు. ౧౨

గద్య.

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబయిన
దేవీ భాగవతంబను మహాపురాణంబునందుఁ
బ్రథమస్కంధము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మత్పర దేవతార్పణమస్తు.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ

దేవీ భాగవతము

ద్వితీయ స్కంధము.

శ్రీచర్ల కులాంబుధి రా
కాచంద్ర! సమస్తయాచకసురద్రుమ! ధీ
వాచస్పతి! దుర్మత దు
ర్వాచాకుర్వల్లిశస్త్ర! బ్రహ్మయశాస్త్రీ! ౧

గీ. అవధరింపు మనంతరం బఖిలమునులు
సూతుఁ గన్గొని హర్షసమేతులగుచు
"సత్యవతి నెట్లు కైకొనె శంతనుండు
మున్నె యామెకు వ్యాసుఁడు పుట్టుటెట్లు? ౨

వ. వ్యాసుని జన్మంబును సత్యవతి యాథార్థ్యమ్మును సవిస్తరముగా
నెఱిగింపు" మనవుడు సూతుండు, 3

ఉ. అంబ! నినుం దలంచు జనులందఱు ధర్మము నర్థకామమో
క్షంబులు గాంతు రీవకద సర్వనియంత్రివి నీవు మంత్రరా
జంబు పఠించువారలకు శాశ్వతసిద్ధి ఘటించు మత్ప్రణా
మంబును సేకరించి నను మాన్యవచోవిభవుం బొనర్పుమా. ౪

క. అని యంబకు మ్రొక్కి—డీ యో
యనఘులు వినరయ్య మును లహార్పతి తేజుం
డనఘుం డుపరిచరవసుం
డను చేదిధరాధినాథుం డలరుం ధరణిన్. ౫

గీ. అతని తపమున కెద మెచ్చి యమరనాథుం
డొక్క దివ్య విమానంబు నొసంగె దాని
నెక్కి యుప్పరవీధుల నేగుచుండు
కతన నుపరిచరాఖ్యను గాంచె నతండు. ౬

క. ఆతని సహధర్మిణి తరు
ణీ తిలకము గిరిక యనంగ నెగడు మహా ప్రా
జాతులు గల రాతనికిన్
జాతు లైదుగురు వార లధిక బలాఢ్యుల్. ౭

క. వారలం దత్తద్దేశ ధ
రారమణులంగా నొనర్చి రమణీమణి తో
న్నారాధింపంగ సుఖియై
స్వారాజుంబోలె నుపరిచరవసుం డుండెన్. ౮

వ. అంతం గొండొక కాలంబున నొక్కనాండు గిరిక ఋతుస్నాతయై
తనరాక కెదురుచూచుచుండె నయ్యవసరంబున, ౯

గీ. శ్రాద్ధ మొనరించుకొనంబడగు సమయ మిపుడు
గానం గానకు నేగి మృగములం గొట్టి
తెమ్మనుచుం బితరులు గడు నెమ్మినాయి ని
ధించుటయు లోనం గొంత చింతించి యతండు, ౧౦

క. పితృవాక్యం బొనరింతునొ
సతివాక్యం బొనరుతునొ విచారించినచోఁ
బితృవాక్యము సేఁతయ స
మ్మతమని తాఁ దుట్టతుదకు మది నూహించెన్. ౧౧

క. చిత్తరిపైఁ జిత్తము కడు
హత్తినవాఁడయ్యు మృగయ కరిగెన్ వనికిన్
జిత్తము సాంబశివునిపై
బత్తి మఱొక్క యెడ నించి పార్థివుఁడంతన్, ౧౨

వ. ఇట్లు చని కానం జరించుచున్నంత, ౧౩

క. ఆ లావణ్యవతీమణి
పై లోలుపుఁడై సకతనఁ బాచాస్త్రిఁడు పూఁ
గోలలు నాటిన రేత
స్స్ఖాలిత్యము పొడమె నుపరిచరవసువునకున్. ౧౪

క. అటువొడమిన శుక్లమ్మును
వటపత్త్రమునందుఁ బట్టి వ్యర్థముగాకుం
డుటకై ఋతుమతి యగు తన
కుటిలాలకయొద్ది కనుపఁగోరి కడంకన్, ౧౫

వ. ఎదుటం జరించు నొక డేగం బిలిచి పత్త్రపుటనిక్షిప్తంబగు వీర్యం బభిమంత్రించి యిట్లనియె. ౧౬

గీ. దీని గొనిపోయి గిరికాసతీమణికి నొ
సంగు మమ్ముద్దియకు ఋతుసమయమిప్పు
డిద్యాది యమోఘవీర్య మెందేని దీనిఁ
బాఱవైచెదవేమొ యో పక్షిరాజ! ౧౭

వ. అని యద్రానిం బనిచిన నదియు నవ్వటపత్త్రపుటంబు ముక్కునం గఱచుకొని యుప్పరమ్మున కెగసి యరుగునెడ ముందట,

గీ. దానిం గనుంగొని మఱియొక శ్యేన మామి
షభ్రమంజేసి వేవేగ సమరమునకు
డీకొనిన నయ్యదియు దానిం దాఁకి యోపి
నంతపాటిగం బోరాడు నవసరమున, ౧౯

వ. చంచూపుటనిక్షిప్తంబగు నప్పత్త్రపుటంబు యమునోదకమ్మునం జాఱి పడిన నద్రాని విప్రశాపోపహతయై మత్స్యయై పడియున్న యద్రిక యను నొక యచ్చర మ్రింగె నని చెప్ప సూతుం గాంచి తచ్ఛాపకారణం బెఱింగింపు మనవుడు నాతం డిట్లనియె.

మ. యమునాతీర్థమునం ద్విజుం డొకండు సంధ్యావందనాసక్తుం డై యములోనం దిగి వార్చుచున్న సమయంబున దద్రికాకాంత యొ యములాడం జనుదెంచి మున్గి ద్విజు డాయం బోయి తత్పాదయుగ్మము హేలాగతిం బట్టి లాగుటయుం దత్కంజాక్షిపై నాతం డుగ్రుఁడై,

క. అలిగి విసారాంగనవై
జలమునం బడియుండు మనుచు శపియించిన న
వ్వేలందియు నాతనిచరణం
బులం బడి దీనాస్య యగుచుం బురపుర పొక్కెన్. ౨౨

వ. దానిం గరుణించి కొండొకకాలమ్మునకు నీగర్భంబున నొక బాలుండును బాలికయుం బుట్టుదు రాక్షణంబ నీకు నిజస్వరూపంబు ప్రాపించు నదియ శాపాంతం బని చెప్పి యరిగె నయ్యచ్చరయుం దచ్ఛాపవశమ్మున నయ్యమునాజలమ్ముల మత్స్యయై యుండి, ౨౩

క. ఉపరిచరవసువువీర్యం
బు పరిగ్రహియించి గర్భమును దాలిచి యం
దుపచితగర్భయగుచు ను
న్నపుడు వలం బడియె దాశయంత్రిత యగుచున్, ౨౪

వ. వాఁడు నద్దానిగర్భంబు భేదించిన నొక బాలుఁడును నొక బాలి
కయుం బొడమిరి. వారిం గొని వసురాజునొద్దకుం జని సకలం
బెఱింగించిన వసువు విస్మయావిష్టుండై బాలకుం గ్రహియించి
బాలికను మత్స్యజీవి కొసంగె. అబ్బాలిక కాలికయనియు
మత్స్యోదరి యనియు మత్స్యగంధి యనియు నామత్రయమ్మున
నొప్పి తద్గృహమ్మున వర్ధిలుచుండె. బాలుండు మత్స్యుండను
నామమ్మున వసురాజగృహమ్మున సర్వవిధములఁ బిత్రుకల్పుండై
వృద్ధినందె. ౨౫

గీ. మత్స్యరూపమ్ము వదలి యమరవరాంగి
యగుచుఁ దనయిచ్చ నరిగె నయ్యద్రికయును
మత్స్యగంధియు దాశసమ్మతిని వాని
పుత్రికయుఁబోలె వృద్ధిని బొందెఁ బిదప. ౨౬

ఉ. జవ్వన మంది యొన్నదగు చక్కఁదనంబును మేల్మి చెక్కులున్
మవ్వపుఁగన్నులున్ మురువుమాటలు గుబ్బపిసాళిగుబ్బలున్
నవ్వుల తేటలున్ సొలపునం దగు మేటివిలాసపున్నడల్
నివ్వటిలంగ నక్కలికి నేరుపుకూరుపు నాఁ జెలంగుచున్, ౨౭

—* వ్యాసోత్పత్తి *—

గీ. ఉన్నయెడఁ దీర్థయాత్రార్థ మొక్కనాఁడు
యమున కేగి పరాశరయతివరుండు
దాఁటునిచ్చను నక్కన్నెతండ్రిఁ బిలువఁ
గూడుఁగుడుచుచుఁ దనచిన్నికూఁతు ననిపె. ౨౮

క. మునివరుఁ డీతఁ డీతని
ననుపు మవలియొడ్డునకు నయనంబుగ నని చె
ప్పినఁ దండ్రిమాటఁ గొని యు
వ్వనజాక్షియు వచ్చె మౌనివరు దాఁటింపన్. ౨౯

వ. వచ్చి యుడుపం బెక్కించుకొని నడుపుచున్నంత, 30

ఉ. ఆయువతీమణిం గలసి యా యమునం దరియించుచున్నయప్పుడన్
గాయజుఁ డాగ్రహించి మునికాంతునిపైఁ జిగురాకు బాకులం
గోయని యార్చి యేయఁ దనకుం గల ధైర్యముఁ దక్కి యాతఁ డ
త్తోయజనేత్రచారుకరతోయజ మల్లన మాటి ముట్టినన్,

క. సకియ యెలనగవు నగుచుం ద
నకరం బెడఁజేసికొని యనఘ ! మిను...
చుకయును సందేహింపక
యకటా ! నాకొఱకొఱకి నటు హాసము ? 3౧

ఉ. నీవు వసిష్ఠువంశ్యుఁడవు ; నేను నిషాదునికూఁతురః ; నగః
భావమునందుఁజూడు ; మిది భావ్యము గాదిటు చేసెదు గులా
బా ! వెలిఁజెందు ; మౌనివరులా ! హసియింత్రు ; తపంబు నష్టమై
పోవు ; భవాదృశుల్ వెడఁగుఁ బోకలకుం దగువారగ లాదు కే ?

క. తపమునకును నాశంబును
కుపదవము సంభవించు నూహింపక యి
ట్టిపనికిఁ జొరఁబడ నగునే
తపసుల కెందేని యిట్టి తగులము లున్నే ? 3౨

మ. అనఘా ! మానవజన్మ మెత్తుట యసాధ్యం ; బగ్రజత్వంబు గై
కొనుటన్నం గడు దుర్లభం ; బదియు నీకుం జేకుఱెన్ ; మీఁద గా

సిని లెక్కింపక మానివై తపము వాసిం జెంది పెంపొందు నీ
వనిమిత్తంబుగ మారుబారిఁబడి నన్నాసింపఁగాఁ జెల్లునే? ౩౫

వ. అదియునుం గాక, ౩౬

ఉ. చేఁపల కంపుచే నెగడి చెప్పఁగరాని యసహ్యభావముం
జూపెడి నా శరీరమును జూచి షయిం బడ నిచ్ఛగించె దీ
వోపిక మాని; దీనసుఖ మున్నదొ లేదొ గ్రహింపవయ్యయో!
పాపపు మారుబారిఁ బడి పండిత భావము రిత్తపుత్తురే? ౩౭

వ. ఇట్లు బోధించెడి తన పలుకులు వినని వానిం బోలె నటించి మరలఁ గరగ్రహణంబొనర్చుటయు నయ్యతివ తన మనంబున,

ఉ. ఈతఁడు పంచబాణశిత హేతిపరంపరచే గృహీతుఁడై
యాతురుఁ డయ్యె, నిక్క మిఁక నాఁగఁడు; కాముకులైన వారికి
న్నీతియుజాతియుం దెలియనేర్చునె? యంచుఁ దలంచి యొంతయుం
జాతురి మీఱ నచ్చటుల చారువిలోచన మాని కిట్లనున్, ౩౮

ఉ. తుంపుడు కింత చెల్లునె? బుధుండవుగావె? మనంబునన్ ధృతిం
జెందుము; చిత్తవృత్తి నిఁకఁ జిందఱవందఱఁ జేయఁబోకు; నా
యందము నీ మనమ్మునకు నందినదేని, భవన్మనోరథం
బుం దగఁ దీర్తు; నోష్ఠనకుఁ బోవఁగ నిమ్ముషపంబు నావుడున్.

క. హితమగు నమ్మాటకు స
మ్మతిఁ జెంది, పరాశరాఖ్య మానివరుఁడు నా
సతికరము వీడి, యవ్వలి
కతిరయమునఁ జేరి, మరల నాకర్షించెన్. ౪౦

మ. అటు పైపైఁ బడు సమ్మునీంద్రుఁగని యయ్యబ్జాక్షి యాకంపితో
త్కట భీత్యుద్భటదేహయై మునివరుం గామాతురుం జూచి తా
నిటు వల్కెన్ ; విను నాదు దేహమిది యెంతే మీనదుర్వాసనా
ఘటితం ; బీదృశ మైన వస్తువులు భోగ్యంబౌనె ! మీ జాతికిన్?

గీ. అదియునుం గాక సంయోగ మసమాన
రూప యౌవన వంతులకే ప్రసంగు
ననుడు సమ్మౌనివర్యుఁ డత్యాదరమునఁ
గాంచి యద్దాని యోజనగంధిఁ జేసె. ౪౩

మ. మృగనాభీఘుమఘుంఘుమార్భటుల పేర్మిన్ మించు మైతావితోఁ,
సొగసుం గుల్కెడి ముద్దు నెమ్మొగముతోఁ, సొంపారు కెమ్మోవితోఁ
దొగల న్నవ్వు మెఱుంగుఁగన్నుఁగవతోఁ, దోరంపు గారామతోఁ
దగు నత్తన్వికరంబు వట్టె ముని కందర్ప జ్వరావిష్టుఁడై. ౪౪

క. కరముం బట్టెడి యమ్ముని
వరునిం గని పల్కె ; మౌనివర విను లజ్జా
విరహితమతివై నయముం
బరికింపక పట్టపగలు పట్టం దగునే ! ౪౫

గీ. అరయుచున్నాఁడు నాతండ్రి యవలియొడ్డు
నందు ; నదిగాక మార్గస్థు లరుగుదెంచు
వారొ యేమొ ? యిటుల్ పశువైఖరిని ర
మింపుటకు నామనము సమ్మతింప దనఘ. ౪౬

గీ. కాలనియమము పశులసాంగత్యమున క
నవసరము గాని మనుజుల కట్లుగాదు
కాన నామాట విని రాత్రికాలమబ్బు
దనుకఁ దాళుము పాపకృత్యం బిదేల ? ౪౭

గీ. నీకుఁ బ్రీతి చెప్పఁగా నోప; నీ వెఱుఁగని
యట్టిధర్మంబు కలదె? కామాతురత్వ
మింతగా నీ మనము నలయించెఁగాక,
పట్టపగ లిట్టి పనిఁ జేయఁబాడి యగునె? ౪౮

గీ. దాశపుత్రికతోడఁ బరాశరుండు
పట్టపగలు నదీతటీభాగమందు
తగు లొనర్చె నటంచు వింతగ జనమ్ము
లాడుకొనుమాటలు సహింపనగునె పిదప? ౪౯

క. అని పలుకు నత్తలోదరిఁ
గని, యుక్తమ పల్కి తీవు; కల్పించెద మం
చు; నిదియ చీఁకటివలె మన
కనుకూలం బగు నటంచు నటు లొనరించెన్. ౫౦

గీ. మంచు నాలుగు దెసల వ్యాపించి తమము
గలుగఁ జేయుచు నమ్మౌనికాంతుఁ డంత
నించువిల్కాని కేళి కాసించుటయును
బలికె నత్తన్వి మధురసంభాషణముల. ౫౧

గీ. కన్నియను నేను; నాతోడఁ గలసి సుఖము
వడయ నుంటి వమోఘవీర్యుఁడవు నీవు
దేవ నీయిచ్చకొలఁది నెందేనిఁ జనెద
వయ్యయో! నాదుబ్రతు కేమియగునో పిదప. ౫౨

మ. తలిదండ్రుల్ దల లెత్త లేక కడువంతన్ మున్గి యెగ్గింతు; ర
న్నలుఁ దమ్ముల్ పెఱవారిమోములు గనన్ శంకించి లజ్జింత్రు; నె
చ్చెలు లన్నం గడు గేలి సేయుదురు; వాసిన్ బెండ్లి గాఁబోదు; క
న్నెలకున్ జారుఁ డొనర్చు వేఁకటు లవెంతేఁ జింతఁ గల్పింపవే?

గీ. గర్భవతి నౌదు నేని నీకతన నేను
నీవు నీత్రోవఁ బోవ నానేర మెట్లు
తండ్రి యెఱుఁగని విధమున దాఁచికొందు ?
ననఘ ! యోజించి చెప్పు ముపాయంబు నాకు ౧౪

వ. అని పట్టరానిభయమ్మునఁ గొంకు నద్దాని కాతం డిట్లనియె. ౧౫

గీ. నీకు నాపొందుఁ జేసి కన్నెఱికమునకు
హాని వాటిల్ల కుండెడు నదియుఁ గాక
గోరికొను మిచ్చెదను నీదు కోర్కెలెల్ల
ననుడు ముని కిట్టు లనియె నవ్వనజనయన. ౧౬

సీ. తల్లిదండ్రుల కీయుదంత మింతుకయేనిఁ
దెలియకుండఁగ సాధించు టొకటి
నిన్నుఁ బోలంగల్గు చిన్నారిపొన్నారి
చిఱుతపాపని దయసేయుటొకటి
కన్యాత్వమున కించుకయు నిందు నందు లో
పమ్ము లేకుండఁ గాపాడు టొకటి
యక్షయం బగునట్టి యౌవనం బేవేళ
మించురీతిని గటాక్షించు టొకటి

గీ. మీనగంధంబు వాపి నామేని కిప్పు
డీ వొసంగిన కస్తూరితావి చేవ
చెడక వాసించుపద్ధతి చేయుటొకటి
నాకు దయచేసి యామీఁద నన్నుఁ గొనుము. ౧౭

వ. అనున ద్దాని కతం డిట్లనియె. ౧౮

మ. నిగమమ్ముల్ విడఁదీయువాఁడు సొబగుల్ నేర్పుల్ దయాళుత్వముం
దగువాఁ డుత్తముఁ డూర్జితాత్ముఁడు పురాణంబుల్ వెలిం జేసి యీ
జగతిం బేరును గాంచువాఁడు హరితేజస్స్ఫూర్తిమన్మూర్తి నా
దు గుణంబుల్ గలవాఁడు నీ కొకసుపుత్త్రుం డుద్భవించుం జెలీ !

వ. తక్కిన నీకోర్కెలెల్ల నట్లయగునని మఱియును, ౬౦

ఉ. అచ్చరమచ్చెకంటుల యొయారము లారసి యూరకున్న నా
కిచ్చ జనించె నేఁడు కమలేక్షణ ! దైవవశంబుఁ జేసి, నీ
మచ్చెపుఁదావి యేడ ! నిను మన్నన చేసి వరించుటేడ ! నా
సచ్చరితం బదేడ ! తనశక్యమె దైవకృతంబు దాఁటఁగన్ ? ౬౧

గీ. నీకు నాకారణమున సుశ్లోకుఁ డైన
పుత్త్రుఁ డుదయింపఁగాఁగల పుణ్యముండెఁ
దప్పఁ జేయఁగ నెవ్వరితరమటంచు
దాశపుత్త్రిక నెనసెఁ బరాశరుండు. ౬౨

క. తనవశమగు నక్కన్నియ
నెనసి పరాశరమునీంద్రుఁ డెంతయు సుఖలీ
లను దేలి యమున లోపల
మునిఁగి శుచియగుచుఁ దనంతఁ బోయినపిదపన్, ౬౩

క. ఆగుణవతియును దా స
ద్యోగర్భము దాల్చి మిగుల నుజ్జ్వల తేజ
శ్శ్రీ గలిగి చెన్నుమీఱు మ
హాగుణనిధియైన యొక్క యనఘుం గనియెన్. ౬౪

గీ. పుట్టునంతన యామహాపురుషుఁ డంబ
కెఱిగి యిట్లను ; నీవు యథేచ్ఛఁ జనుము

నేను దపముస కేగెద ; నీవు నన్ను
నెప్పుడు దలంచిన నప్పుడ యేగుదెంతు. ౬౫

వ. అనవుడు సత్యవతి నిశ్చింతయై తనతండ్రి పాలికిం జని సుఖంబుండె ; నతండును ద్వీపమ్మునం బుట్టినకతమ్మున ద్వైపాయనుం డనియు వేదంబులు విభజించిన కతన వ్యాసుం డనియుం బరంగి యష్టాదశపురాణమ్ములును మహాభారతమ్మును రచియించి సుమంత జైమినిపైలవైశంపాయనాసితదేవలముఖ్యులగు శిష్యులకును సుతుండగు శుకునకును నుపదేశించె. ౬౬

గీ. సత్యవతి పుట్టె నట్లు, వ్యాసముని పుట్టె
నిట్టు లిట సందియ మొకింతయేని వలవ
దనఘులగు వారిచరితలయందు గుణము
గ్రాహ్యమగుం గాని దోషంబు గ్రాహ్య మగునె ! ౬౭

గీ. కారణం బిట్టు లుండిన కతన సత్య
వతికి మత్స్యోదరమ్మునం బడుటయును బ
రాశరునిం బొందుటయును సంప్రాప్త మయ్యె ;
నట్లు గాకున్న మునియుం గామార్తుం డగునె ? ౬౮

గీ. శంతనునృపాలుం డామీంద సత్యవతిని
దా గ్రహించి సుఖించి సంతతిని బడసెం
జిత్రముం బవిత్రి మికథ జెప్పినాండ
దీని వినువారలకు శుభస్థితులు గలుగు. ౬౯

వ. అని నుడువు సూతుం గని మహాత్మా నీ చెప్పిన సత్యవతీ జన్మంబును వ్యాసోత్పత్తియును సంతోషదాయకంబులయ్యె నింకొక సందియంబు గలదు. పురువంశజుండును ధర్మాత్ముండును మహా

భాగుండును నగు శంతనునృపాలకుండు కులహీనయగు నిషాద పుత్రిక నెట్లంగీకరించె ? నతనికిఁ బ్రథమపత్ని యెవ్వతె ? ఇతని కొమరుం డగు భీష్ముఁడు వస్వంశసంభూతుం డగు కతం బేమి ? సకలగుణసంపన్నుఁడును జ్యేష్ఠుండును నగు భీష్ముండు రాజ్యంబు సత్యవతీతనయుల కేల యిచ్చె ? సత్యవతి తన కొడండ్రియందు గోళకుల నెట్లు జనియింపం జేసె ? భీష్మునికి దారసంగ్రహంబు లేనికతం బేమి ? ఇది యిట్లుండ, 20

వేదముల్ విభజించి మీఁద వేదాంతసూ
త్రము లొనర్చినయట్టి బ్రహ్మవేత్త
పదియునెన్మిది యనంబడు పురాణమ్ములు
పచరించినట్టి సర్వజ్ఞమౌళి
అదిగాక భారతంబన నొప్పు పంచమా
గమ మొనర్చిన మహాకవివరుండు
ఇది పుణ్యకృత్య మియ్యది పాపకృత్యం బ
టం చెఱింగి చరించునట్టి తపసి
గీ. వ్యాసుఁ డాసించె భ్రాతృభార్యాసుఖం బ
టంచుఁ జెప్పితి వకట ! పరాంగనాసు
ఖంబె పాతక మన, భ్రాతృకాంతతోడఁ
గ్రీడసల్పుట కెట్లు లంగీకరించె ? 21

—* శంతనూపాఖ్యానము *—

గీ. వ్యాసశిష్యుండ వైన నీ కఖిలధర్మ
సూక్ష్మత లెఱుంగవచ్చు నో సూత ! దీని
కుత్తరము సెప్పు మాదరాయత్తమతి న
టంచుఁ బల్కెడి మునుల కిట్లనియె నతఁడు. 22

క. కలఁడు మహాభిషుఁ డను భూ
తలనాథుం ; డతఁడు సత్యతత్పరుఁడు ; ధరా
తలనాయకమకుటమణీ
విలసితచరణుండు ; బ్రహ్మవిద్యాధికుఁడున్, ౭౩

గీ॥ అశ్వమేధసహస్రమ్ము లాచరించి
దాన నిందుని సంతుష్టుఁగా నొనర్చి
స్వర్గమున కేగి యచ్చట సకలసౌఖ్య
ములను రెండవయిందుఁడై పొందుచుండి, ౭౪

వ. ఒక్కనాఁడు దేవతలతోడఁ జతురాననుఁ సేవించుటకై సత్యలోక
మ్మునకుం జనియె. ౭౫

క. గంగానదియును బరమే
ష్ఠిం గని కొనియాడ నచ్చటికి వచ్చి, విరిం
చిం గాంచి మ్రొక్కి, యొక్క మొ
డం గాలూఁది నిలువంబడం దెమ్మెరయున్, ౭౬

చ. బలువడి వీవ నాపెతోడఁ బైఁ గల చీరచెఱంగు దూఁగి యూ
వల కొకకొంత యోరసిలె ; వస్త్రము దూలుటఁ దా నెఱుంగ క
క్కలికియు మిన్నకుండె ; నటు గాంచుట తప్పని యొక్కపెట్ట నా
దలలను వంచి రిన్నృపుఁడు దక్క సభాసదులైన నిర్జరుల్. ౭౭

ఉ. తన్ను మహాభిషుం డతిముదమ్మునఁ గన్గొనుచుండ, గంగయున్
గన్నులవిల్తు బారిఁ బడి కన్గొన సాగె నృపాలుమోము ; ని
ల్లెన్నఁగరానిమోహమున నిద్దఱు గాఢతరానురాగులై
యున్నతఱిం, గనెన్ గమలజోద్భవుఁ డక్కడు తామసమ్మునన్.

క. పెద్దలు గల యీసభ పీ
రిద్ద అపత్రపఁ ద్యజించి యిటు నిర్భయులై
మొద్దులవలె నటియించెద
రిద్దాని సహించుటొప్పునే ? సుజనులకున్. ౭౯

వ. ఇట్లెంచి వారలం గాంచి "మంచిచెడ్డ లెఱుఁగక వర్తించితిరి గావున మీ రిరువురును మర్త్యలోకమ్మునం బుట్టుం" డని శపించె; నంత వారును శాపంబునకుఁ జింతిల్లుచు నచ్చోటు వీడి వెడలిరి. ౮౦

గీ. ఆ మహాభిషనరపాలుఁ డంత మర్త్య
లోకమున నెవ్వనికులమ్ములో జనింతు
ననుచు యోజించి పురువంశమునఁ బ్రతీపుఁ
డనునృపుని దండ్రిగా నెంచె నాత్మయందు. ౮౧

వ. ఇది యి ట్లుండె. ౮౨

గీ. అష్టవసువులుఁగూడ భార్యాసమేతు
లగుచు విహరించుచును వసిష్ఠాశ్రమంబు
నందుఁ జరియింప నందొక్క యతనిభార్య
నందినీధేనువును జూపి నాయకునకు, ౮౩

వ. ఇది యెవ్వరిది ? యని యడుగుడు నత్తన్వి కాంతం డిట్లనియె. ౮౪

గీ. చెలియ యిది గలవాఁడు వసిష్ఠమౌని
దీని నెల్లరు నందినీధేను వండ్రు
దీనిపా లిన్ని గ్రోలినఁ దెవులు జరయు
మృతియు దరిఁ జేర వని తనపతి వచింప, ౮౫

వ. ఆసతియు ముదం బంది "నా కుశీనరరాజకన్యక కడు నెయ్యంబు గలయది. ఆపె మర్త్యలోకనివాసిని యగుకతన జరామరణాది

కంబుఁ బూరయఁ గలదు. తన్నివృత్తికై యాధేనువు నద్దాని కొసంగి యుపకృతి నొనర్ప వలయు నిద్దాని నాకై తెమ్మ"నుడు,

గీ. ఆవసువు భార్యమాట పథ్యమ్ముఁ జేసి
తక్కుఁగలవసువులఁ గూడి దాని నపహ
రించె; రాబోవు నాపద నెంచఁడయ్యె
నంగనాసక్తు లాపత్తు లరయఁ గలరె? ౮౭

వ. పిమ్మట వసిష్ఠుండు తనధేనువుం గానక వెదకించి విసివి తన యోగబలమ్మున వసువు లపహరించుట యెఱింగి మనుష్యయోనిం బుట్టుండని వారలకు శాపం బిచ్చె. పదంపడి దాని నెఱింగి వార లతని కడ కేతెంచి శాపమోక్షం బనుగ్రహింపవే యని వేఁడుడు మునివరుండు కరుణించి యిట్లనియె. ౮౮

మ. అనుసంవత్సర మొక్కొకళ్ల కగు శాంపాంతంబు; నాధేనువుం బనిగా భార్యకునై హరించె నెవఁ డా పాపాత్ముఁ డా కష్టుఁ డమ్మనుజత్వమ్మును దీర్ఘకాలము సహింపంగాఁ గలాఁడంచు న మ్ముని శాపాంతము సెప్ప, నవ్వసువు లిమ్ముల్ చేరుచుణ్ ముందటన్,

వ. విధిశాపవశమ్మున దీనాననలై భువి కేతెంచు గంగం గాంచి తమ శాపప్రకారం బెఱింగించి "తల్లీ నీగర్భమున జనియించెదము మ మ్మనుగ్రహించి శంతనునృపాలకున కీవు పత్నివగు మదియునుం గాక, ౯౦

క. పుట్టినతోడన మమ్ముం
గిట్టింపుము నీట వైచి కీడెంచక నీ
విట్టు లొనరించుకతమున
నెట్టన మాశాప మది వినిర్ముక్త మగున్. ౯౧

క. అని వసువులు తనుఁ బ్రార్థిం
చిన నంగీకరించి చెచ్చెర గంగా
ధుని తనయిచ్చం జనియెన్ ;
జనిరి వసువులును గడంగి స్వర్గమ్మునకున్. ౨

వ. పిమ్మట ప్రతీపుఁ డొక్కనాఁడు గంగాతటమ్మునకుం జని సూర్యో
పాస్తి యొనర్చుచున్నంత, ౩

ఉ. ఆ సలిలమ్మునన్ వెడలి యంకురితప్రథమానయౌవనో
ల్లాసిని చారుహాసిని విలాసిని వే చని రాజశేఖరుం
డాసి యశంకితాత్మయయి దక్షిణపుందొడఁ గూరుచుండఁగా
నాసరసీరుహాక్షిఁ గని యాధరణీపరిణేత యిట్లనున్. ౪

ఉ. ఎవ్వతె వీవు ? నాదు కుడి వెక్కట కేమి కతంబు ? వల్కుమో
జవ్వని ! యన్న, నచ్చటుల చారువిలోచన ముద్దు లొల్కఁగా
నవ్వమొగమ్ము వంచి, నయనమ్ము లొకానొకవింత చెల్వునన్
నివ్వటిలంగఁ బల్కెఁ దగుసేరుపు తోరపుఁదీరుపుం దగన్. ౫

ఉ. ఎవ్వతెనైన నేమి పృథివీశ ! సుమాస్త్రసమానరూప ! నా
జవ్వన మంత నీకయి వశం బొనరింపఁ దలంచి వచ్చితిన్ ;
జివ్వకు వచ్చు నమ్మదనుచెయ్వుల కోరువఁ జాల నక్కటా !
నవ్వులు గాఁ దలంపకుము నావచనమ్ము లటన్న నిట్లనున్. ౬

క. కన్నరో ! యపత్యమునకుం
దన్నళినాక్షులకు యోగ్యతగల కుడి తొడన్
గ్రన్న నధిష్ఠించితి కా
న న్నిను నేఁ గోడఁగఁ దగదు నా ; కటుమీఁదన్. ౭

ఆ. వె. భార్యఁ దక్క నొండు పడఁతిఁ గూడ నటంచు
వ్రతము గలదు ; నాయపత్యమునకుఁ
బత్నివై సుఖమ్ము వడయుము ; నాకు సం
తానమొదవె నేనిఁ దలిరుఁబోఁడి. ౯౮

క. సంతానహీనుఁ డితఁ డని
వంతం గొనఁబోకుమీ ! భవత్పుణ్యమ నా
సంతానకారణం బగు
నింతయు నిక్కమన నాపె యేగెఁ దనంతన్. ౯౯

వ. అంతఁ గొండొక కాలమ్మునకు మహాభిషుండు ప్రతీపునకుఁ దన
యుండై శంతనుండు నాఁగ వర్ధిల్లుచుండెఁ బ్రతీపుఁడును, ౧౦౦

క. గంగకుఁ దనకుం జరిగిన
సంగతి కొమరునకుఁ జెప్పి చనియెం దా రా
జ్యాంగమ్ము విడిచి యడవి న
సంగుండై యుండి తపము సలుపు నెపమునన్. ౧౦౧

వ. శంతనుండు పైతృకం బగురాజ్యమ్ము నేలుచు నొక్కెడ మృగ
యార్థంబు వనమ్మునకుం జని వ్యాఘ్రాదిమృగమ్ముల నుక్కడం
చుచు గంగాతటకుంజపుంజమ్ములం జరించువాఁడు ముందట,

సీ. మృగశాబములకు నేర్పెడి నేర్పు గలచూపు
సోయగం బొలుకు కందోయిదాని
కుంభికుంభములయుక్కును ద్రొక్కి నిక్కి నీ
ల్గెడిగుబ్బ చందోయి బెడఁగుదాని
మాటమాటకు ముద్దు మూటఁగట్టఁగఁ జాలు
సొగసుచే నెగడు నెమ్మొగముదాని

ముకురమ్ములకుఁ జాకచక్కిఁ దీర్పఁగాఁజాలు
తళుక్కుఁజెక్కుల తళ త్తళలదాని

గీ. తొగలవగ కానిజిగిబిగి నగ డొనర్చు
నిగనిగలఁ దగు నగవుసోయగముదానిఁ
దావులకు దీవి యగు కావిమోవిదానిఁ
గనియె నొకకన్నెఁ గన్నులకఱవుదీఱ. ౧౦౩

క. సురకన్యావోని యయ్యం
బురుహాననఁ జూచి తండ్రి మున్ను తనకు నే
విరిబోఁణిఁ జెప్పె నీసుం
దరి యయ్యతివయొకో యంచుఁ దనమదిఁ నెంచున్. ౧౦౪

ఉ. సుందరుఁడైన యానృపతిసూనునిఁ జూచి తదంబుజాక్షి "యీ
యందపుటెక్కు నిక్కము మహాభిషుఁడే" యని రాగమగ్నయై
కంది మనోజతాపమునఁ గ్రాఁగి పునఃపునరాదరోదయా
నందమునం దదీయవదనంబునఁ జూడ్కి నిగుడ్చి యున్నెడన్,

క. శంతనుఁడు దానిరీతిం
గొంత గనుంగొని రసమ్ము గులుకఁ బలికె "నో
యింతీ! మరుదంతీ! విరి
బంతీ! నీవెవ్వతెవో? కృపం బలుకఁగదే. ౧౦౫

ఉ. ఎవ్వతెవైన నేమి కమలేక్షణ! నిం గనుఁగొన్న మాత్రన
వ్వువ్వులు కానికైన భ్రమ పుట్టక మానదటన్నఁ బ్రాకృతుం
డెవ్వఁడు నిన్నుఁ జూచి సహియించు? ననుంగరుణించి నాకు నీ
జవ్వనపుఁ వినోదము లొసంగఁగదే తగదే యలంచుటల్."

వ. అని మదనశరదళితహృదయుండై వల్కు నజ్జనపతిని మహాభిషు
నిఁగా నెఱింగినయది గావునఁ బూర్వసంఘటిత ప్రేమవశమ్మునఁ
గించిత్స్మితపూర్వకంబుగా నిట్లనియె. ౧౦౮

చ. తెలియఁగ నయ్యె నీవల ప్రతీపునిపుత్రుఁడ వత్యుదారస
త్కులుఁడవు ; నిన్ను బొందఁటినృపకోటిశిరోమణి నెట్టికామినీ
తిలకములైనఁ గోరుదురు ; దేవసమానుఁడవైన నిన్ను నే
వలచియ యుంటి ; నైన నొకపల్కు వచించెద నాలకింపుమా.

ఉ. ఏ నొనరించు కార్య మది యెట్టిది యే నగుఁ గాక, నీవు న
ద్దానికి నడ్డురాఁ జనదు ; దాని నటుండఁగ నిమ్ము ; విప్రియం
బైన విధమ్మున న్నను నొకప్పుడు గాని వచింపఁ బోల ; ది
ట్లైన నినుఁ వరించి సుఖ మందెదఁ గోర్కులు మిన్నుముట్టఁగన్.

క. ఈనియతి కెపుడు ప్రత్యా
ఖ్యానంబొనరింతు వపుడ యరిగెదఁజుమీ ధా
భూనాథ నిను విడిచి, నా
పై నేరము మోపవలదు పలికితి నిపుడే. ౧౧౧

క. అని వసువులప్రార్థన నె
మ్మనమునకుం దెచ్చుకొని క్షమానాథుని పే
ర్మి నెఱిఁగి సమయముం బొనరిం
చిన నందుల కొప్పె నెదురు చెప్పక యతఁడున్. ౧౧౨

వ. గంగయు నతనియందుఁ జిరకాలలబ్ధానురాగయైన కతమ్మునఁ
దన్నృపమందిరమ్మునకుం జని సుఖభోగమ్ము లనుభవించు చుండె.

—* భీష్మోదయము *—

సీ. నవరత్న ఖచితసుందరతరా ప్రతిమాన
వైచిత్ర్యయుత సౌధవాటులందు
కోకిలాకాకలీ కేకిలీలాకల
ధ్వని కనదుద్యాన వనములందు
హంసాది సంశోభితాసమానాంభోజ
షండ మండిత సరస్తటులయందు
గంభీరరంభా విజృంభమాణ నవీన
ఘనసారఘన కుంజగణములందు

గీ. శంతనునృపాలకుండు నకాంతయును స
దా శచీంద్రులమాడ్కిఁ బద్మాహరుల వి
ధమ్మున నఖండభోగ భాగ్యమ్ము లనుభ
వించు కాలంబు పెద్దయ్యు నించుకయ్యె. ౧౧౪

ఉ. తా నెవఁడో ప్రపంచపువిధాన మదెట్టిదో యన్యు లెవ్వరో
తా నివసించు వాసమువిధం బది యెట్టిదియో యెఱుంగ క
మ్మానవనాథుఁ డక్కలికిమక్కువలోఁ బడి యున్నయంత న
మ్మానిని దాల్చె గర్భ మసమానవసుప్రవరాంశమై తగన్. ౧౧౫

వ. గర్భంబు నవమాసపూర్ణంబై యొక్క బాలకుం డుద్భవించుడుఁ దత్క్షణంబ వానిం గొనిపోయి నీటం బడవైచె; నిట్లేటేటం బొడమిన బాలుర నేడ్వుర నేటం బడవైచిన శంతనుండు మనమ్మున నిట్లు విచారించె. ౧౧౬

మ. అకటా! యేడ్వురుపుత్రులన్ గుసుమబాణాకారులన్ నిర్దయా
త్మికయై యేటికి నప్పగించె నిఁక వృద్ధిం బెందు టెట్లోకొ? మా

మకవంశం, బిడి కూడదన్నను ననుఁ మన్నింప కీకాంత లే
చి కడు స్వేగమ పోవు; నిట్లగునె దుశ్శీలాంగనాసంగముల్!

క. అష్టమగర్భం బిది, మద
దృష్టముకతనఁ లభించె నిపుడైనను నీ
దుష్టాత్ముఁరా లొనర్చెడి
కష్టపుఁబని నాకు నాఁగఁగాఁ జెల్లదొకో ? ౧౧౮

వ. కావున నేవిధంబుననైన వంశరక్షణంబు కర్జం బని నిశ్చయించి యున్నంత,

క. అంగనకై మునివరు గో
పుం గొనిపోయినవసుఁడు పుత్రుండై పు
ట్టం గని గంగయు వైళమ
గంగం గలుపంగ నెంచఁగా నృపతి వెసఁ, ౧౨౦

వ. అడ్డమ్ము సొచ్చి వినయమ్మున నబ్బాలెంతరాలి కిట్లనియె. ౧౨౧

ఉ. దాసుఁడనైతి, నాపలుకు దబ్బఱసేయకు; కన్నపుత్త్రి వ్యా
త్యాసినివై వధింపు టిది న్యాయమె ? జాలి యొకింత లేదె ? యే
దోసము నీకొనర్పనిసుతుఁ వధియించెదిగొడ్డురాల ! నీ
బాసలకుఁ మదిం దలఁకి వంశము నాశ మొనర్ప నెంతునే ?

క. అకటా ! యేద్దురఁ జంపితి
వికనైనఁ జాలిలేదె ? యేణాక్షిరో ! యీ
యొకనిం బ్రతికింపుము తా
వకచరణయుగంబుమీఁదఁ బడి మ్రొక్కెడుదుఁ. ౧౨౩

క. సుతులం బొరయనియెడ స
ద్గతి లేదని పెద్ద లండ్రు గావున వంశ

స్థితికై యీసుతునొక్కని
బ్రతికించిన నీవ్రతంబు భగ్నంబగునే ? ౧౨౪

క. అని బహువిధములఁ బ్రార్థిం
చిన వినకా వనిత చిన్ని శిశువుం జంపం
గొనిపోవుచుండ నిట్లనె
జనపతియుఁ గనుల వహ్ని జలజల రాలన్. ౧౨౫

గీ. ఓసి పాపాత్మురాల ! నాశాసనం బ
తిక్రమించియు నరకభీతియును లేక
కన్నకొడుకుల గంగలోఁ గలుప నగునె ?
యకట ! నినుఁ గనినట్టి దుష్టాత్ముఁ డెవఁడొ. ౧౨౬

వ. ఉండువుగాక పోదువుగాక యీ శిశువుం జంప నీ నని యడ్డమ్ము
సాచ్చెడిశంతనుం గాంచి యక్కోమలి యిట్లనియె. ౧౨౭

చ. సమయము నెంచవైతి, విఁక సాగదు నీకును నాకుఁ గూట ; ము
త్తముఁడవు నీవు ; నిన్నెడు టధర్మము కాని, వచింతుఁ దన్నిమి
త్తము ; ననునొక్కకాంతఁగ నెదన్ గణియింపకు గంగఁగా నెఱుం
గుము సురకార్యముఁన్ సలుపఁగోరి నినున్ వరియించితిం జుమీ.

క. వసువులు మునిశాపమ్మున
వసుమతిఁబుట్టుటకు నన్నుఁ బ్రార్థించిన నేఁ
బ్రసు వైతి వారలకు నీ
కు సతినయి నృపాల ! తెలిసికొను మిదియెల్లన్. ౧౨౮

క. చిరకాలము మర్త్యులమై
ధరణిన్ వసియింప లేము తత్క్షణము మృతిం
గరుణింపు మన్న నే నీ
దురితం బాడిఁగట్టి నీటఁ ద్రోచితి సుతులన్. ౧౩౦

క. ఈతం డష్టమవసుకళ
చేతన్ జనియించె నధిప ! చిరకాలము నీ
చేతము గరఁగించెడి ప్ర
ఖ్యాతిం జెందం గలాఁడు కాఁగలఁడు సుమీ ! ౧3౧

గీ. ఈడువచ్చెడి దన్కను వీఁడు నా స
మీపమంద వసించు నామీఁద నీకు
నప్పఁజెప్పెద దీనికి నొప్పికొనుము
తల్లి లేకున్న బ్రతుకదు వృథా నృపాల ! ౧3౨

క. అనినుడివి గంగయును దన
తనయుం గొని చనినమీఁద ధరణీపతి య
వ్వనితావిరహమ్మునకుం
దనయ విరహమునకుఁ జాలఁ దల్లడపడుచున్, ౧33

వ. ఒకభంగి రాజ్యం బొనర్చుచుఁ గొండొకకాలమ్మున వేటఁ జని
మృగమ్ముల హింసించుచు విరహాభరమ్మునఁ జిక్కనయదియుం
బోలె నున్నగంగానదిం గాంచి, ౧3౪

శా. ఆ కల్లోలినిమధ్యరంగమున దీవ్యద్బాణబాణాసన
శ్రీకై సేయ నిరంకుశప్రతిభమైఁ గ్రీడించుచున్ జాహవి
ద్యాకౌశల్యముఁ జూపు నొక్కరుని గందర్పున్ విడంబించు ది
వ్యాకారంపు బెడంగు వానిఁగనితా నాశ్చర్యపర్యాప్తుఁడై, ౧3౫

క. తన తనయుండని యనుకొనుఁ ;
దన తనయుఁడు గాఁడటంచుఁ దలఁచున్ మరలన్
దనయాసక్తిం గను శం
తనుఁ డబ్బాలకునిఁ గాంచి తద్దయుఁ బేర్మిన్. ౧3౬

క. కరలాఘవమును దుష్కర
శరలాఘవమును సమానుషత్వముఁ దెలుపన్
నరపతి దరి కరిగి మహా
దర ముట్టిపడంగ నిట్లతనితోఁ బలికెన్. ౧౩౭

ఆ. వె. తల్లి యెవతె నీకుఁ? దండ్రి యెవ్వఁడు? నీదు
నామధేయ మెద్ది? నగర మెద్ది?
చెప్పు మనుడుఁ బల్కు-సెవిని బెట్టక తన
యంత నాడుచుండె నతఁడు పేర్మి. ౧౩౮

వ. అంతఁ గొంత తడవు గ్రీడించి యాతం డంత ర్హితుం డగుడు జన
పతి చింతాకులుండై గంగం గొనియాడి తోంటివాపునఁ బాడ
సూపిన నాపె కిట్లనియె. ౧౩౯

సీ. చిన్నారిపొన్నారి చిఱుతపాయమువాఁడు
ముద్దు లొల్కెడినవ్వు మొగమువాఁడు
కళలనీనెడి గొప్ప కనుల నొప్పెడి వాఁడు
కరికలభాకార గరిమవాఁడు
ఆజానులంబిబాహాసౌష్ఠవము వాఁడు
హరి నీసడించు మధ్యమ్మువాఁడు
శరశరాసనవిభాసురకరమ్ములవాఁడు
డంబు చెన్నారు వక్షంబువాఁడు

గీ. నాకుఁ బాడకట్టి యంతట నన్ను మొఱఁగి
చనియె నొకముద్దులాఁడు వాఁడనఁగ నెవఁడు
తెలిపి వైళమ యవ్వాని దెచ్చిచూపి
గారవింపుము నాపుడు గంగ నగుచు, ౧౪౦

క. ఎనిమిదవ వసుని యంశం
బునఁబుట్టినవాఁడు నీకుఁ బుత్త్రుఁడు గాంగే
యునిగా నెఱుఁగుమువానిఁ
గనఁజేసెదఁ గనుము కనులకఱ వెడలంగన్. ౧౪౧

వ. అని యబ్బాలకుం దెచ్చి చూపి యితండు సకలవేదమ్ములును వసిష్ఠునియొద్దఁ బఠించె. వేయేల నీబాలుండు పరశురామునికిం గూడ శిష్యుండును సర్వథా యయ్యనఘునకుఁ దుల్యుండును భవత్కులోద్ధారకుండును నని చెప్పి యంతర్ధానంబుఁ గనుడు శంతనుండు పుత్త్రుం గౌఁగిలించుకొని రథముపై నిడికొని రాజధానికిం జని మంత్రి పురోహితానుమతంబుగ సుముహూర్తమ్మున యౌవరాజ్యాభిషిక్తుం జేసి గంగావియోగజంబగు దుఃఖమ్ము మఱచి సుఖం బుండె. ౧౪౨

క. ఇయ్యది వసువులచరితం
బియ్యది శుభదంబు; దీని నెంతయు నాపై
నెయ్యమ్మున ద్వైపాయనుఁ
డయ్యరణిజతోడఁ గలిపి యానతియిచ్చెన్. ౧౪౩

వ. అనిన సూతుం గాంచి మును లవ్వలికథ చెప్పు మనసృుడు సూతుం డిట్లని చెప్పం దొడంగె. ౧౪౪

గీ. యౌవరాజ్యమ్ము గాంగేయుండు నిలిపి
శరవణోద్భవుచే మహేశ్వరుఁడువోలె
సర్వసుఖములు కైకొంచు శంతనుండు
నాలుగేడు లానందాబ్ధి నోలలాడె. ౧౪౫

వ. పదఁపడి యొకనాఁడు మృగయాసక్తుండై నిరంతరకుంజపుంజ మండితంబగు కాళిందీతటమ్మునకుఁ జని యచ్చట, ౧౪౬

మొసకమ్ము గల్గుకా
ందుల బీర మడఁచియడఁచి
పొడవుగల్గిన యేనుఁ
ముత్తముల నేలఁగూల్చికూల్చి
న సమయింపఁగాఁ జాలు
ులగుంపులతోడఁ బోరిపోరి
ర్వధమ్ము లగు సింగ
ముల గములెల్లను గలఁచికలఁచి

గీ. జవముమెయి గాలితోఁ బోలఁ జాలు లేడి
కదుపులన్ బ్రదరమ్ములఁ జదిపిచదిపి
ప్రళయకాలకిరాతుని పగిది జంతు
మండలమ్మును వేఁటాడి మగిడి యతఁడు, ౧౪౭

వ. ఒక్క-శీతలతరుచ్ఛాయాతలమ్మున నిషణ్ణుండై యున్న యెడ,

క. ఆనందోద్దీపకమై
నానాపరిమళవిశేషనవసౌరభమై
జానొప్పఁజాలు నొకగం
ధానిల మేతెంచి నరవరాగ్రణి సెనసెన్. ౧౪౮

వ. అతండును దత్పరిమళమ్మున కచ్చెరువంది, ౧౪౯

మ. మృగనాభిం బురణించి, యబ్జముల పేర్మిం గ్రిందుగాఁ జేసి, సం
పెఁగలం డీకొని, కేతకీసుమములన్ బిట్టేచి, కుందమ్ములం
దిగు లొందించియు, మాలతీసుమములం దిండ్రించి, నిర్హేతుకం
బుగ నేతెంచు పరీమళం బిది సుఖాంభోరాశిలో ముంచెడిన్.

క. దీనికిఁ గారణ మేమొకొ
కానఁగవలెనంచు వేడ్కఁ గడలుకొనంగా
నానాపుష్పాకీర్ణం
బై నెగడు వనాంతమెల్ల నరయుచుఁ జనుచున్, ౧౫౨

చ. అమరిన వేడుకం గనియె నబ్జముఖిన్ నవసౌరభోజ్జ్వల
ద్రుమఘుమ విగ్రహన్ గమలకుట్మలచారుపయోధరద్వయన్
యమితశిరోజభార మలినాంబర నాతివిభూషణాంచితా
దములపుటాకువంటి యొక తామరసప్రతిమాననలోచనన్, ౧౫౩

క. ఆకలికి నాతలోదరి
నాకలకంఠీలలామ నాకనకాంగిన్
భూకాంతుం డిటు గన్గొని
యీకన్నియ యేమనితావియే యిది యనుచున్, ౧౫౪

ఉ. దాని పిసాళిగుబ్బలును దాని యొయారపుఁ జూపుఁదీపులున్
దాని వళిత్రయీగరిమ దాని శరీరపరీమళంబు న
ద్దాని వయోవిలాసమును దాని పదక్రమసౌష్ఠవంబునున్
దేనికి నగ్గలం బనుచుఁ దీరనికూరిమిఁగౌరవంబుసన్, ౧౫౫

—* శంతనుండు సత్యవతిం బెండ్లియాడుట *—

వ. డగ్గఱి సిగ్గరితనమ్మునన్ మొగ్గు నగ్గజగమనం బుసఃపుసరాద
రోదయమ్మునం గనుఁగొనుచుఁ దన మనమ్మున, ౧౫౬

క. ఈ మగువ దేవతాకాం
తామణియో! కిన్నరాంగనామణియో! ఫణి
స్త్రీమూర్ధన్యయో! కాక
భూమిన్ గలపొలఁతి కిట్టి పొలుపుంగలదే? ౧౫౭

క. అని తలపోయుచు నా శం
తనుజనపతి తొల్లి దైవతఘుని దనువరిం
చినభంగిఁ దలఁచుకొని య
త్తనుమధ్యన్ జేర్మిఁ జూచి తగనిట్లనియెన్. ౧౫౮

ఉ. ఎవ్వతె వీవు? నీజనకుఁడెవ్వఁడు? జవ్వని! యివ్వనమ్మునం
దెవ్వని కై చరింతు? కులమెయ్యది? నీ విటు లొంటిపాటునన్
మవ్వపుమేనికాంతి కనుమాయఁ జరింపఁగ నేమి వచ్చె? నీ
కెవ్వఁడు భర్త? దెల్పఁగదవే? మదవేల్లితదంతిగామినీ. ౧౫౯

క. నీసొగసు నీవిలాసము
నీ సౌరభ్యంబుఁ జూచి నేనెంతయు నీ
కాసించి మదనభూత
గ్రాసీభూతుండ నైతిఁ గరుణింపఁగదే? ౧౬౦

వ. అన నక్కాంత చిఱునగవలర నిట్లనియె. ౧౬౧

ఉ. కన్నెనుగాని వేఱొక ప్రకారము దాననుగాను; దాశరా
జన్నయభిఖ్యగన్న సుగుణాత్ముఁడు నాజనకుండు; నన్ను "నా
వ న్నడిపించుచుండు మిదె వచ్చెద" నంచు వచించి డించి పో
యె న్నరనాథ! యింటి; కదియే యతఁడుండెడితావు నావుడున్,

చ. నరపతియిట్లు వల్కు నరనాథుఁడ నేఁ గురువంశజాతుఁడన్
దరుణి ప్రతిక్షణప్రబలితం బగుజవ్వనమున్ వృథాగతిం
బొరయఁగఁ జేయ నేల? ననుఁ బొందు మసంశయరీతిఁ బత్నివై
పరమసుఖమ్ములం గొనుము పత్నియు గిత్నియు వేఱులేదికన్.

ఉ. ఓసరసీరుహాక్షి వినుమొక్కలతాంగి ననున్ వరించి పే
రాసలు గొల్పిపోయె; నది యాదిగ నేను మఱొక్కలేమపై

క. ఎనిమిదవ వసుని యంశం
బునఁబుట్టినవాఁడు నీకుఁ బుత్త్రుఁడు గాంగే
యునిగా నెఱుఁగుమువానిఁ
గనఁజేసెదఁ గనుము కనులకఱ వెడలంగన్. ౧౪౧

వ. అని యబ్బాలకుం దెచ్చి చూపి యితండు సకలవేదమ్ములును వసిష్ఠునియొద్దఁ బఠించె. వేయేల నీబాలుఁడు పరశురామునికిం గూడ శిష్యుండును సర్వథా యయ్యానఘునకుఁ దుల్యుండును భవత్కులోద్ధారకుండును నని చెప్పి యంతర్ధానంబుఁ గనుడు శంతనుండు పుత్త్రుం గౌఁగిలించుకొని రథముపై నిడికొని రాజధానికిం జని మంత్రి పురోహితానుమతంబుగ సుముహూర్తమ్మున యౌవరాజ్యాభిషిక్తుం జేసి గంగావియోగజంబగు దుఃఖమ్ము మఱచి సుఖం బుండె. ౧౪౨

క. ఇయ్యది వసువులచరితం
బియ్యది శుభదంబు ; దీని నెంతయు నాపై
నెయ్యమ్మున ద్వైపాయనుఁ
డయ్యరణిజతోడఁ గలిపి యాంతియిచ్చెఁ. ౧౪౩

వ. అనిన సూతుం గాంచి మును లవ్వలికథ చెప్పు మనఁ బ్రుడు నతం డిట్లని చెప్పం దొడంగె. ౧౪౪

గీ. యౌవరాజ్యమ్ము గాంగేయునకు నిలిపి
శరవణోద్భవుచే మహేశ్వరుఁడువోలె
సర్వసుఖములు కైకొంచు శంతనుండు
నాలుగేడు లానందాబ్ధి నోలలాడె. ౧౪౫

వ. పదఁపడి యొకనాఁడు మృగయాసక్తుండై నిరంతరకుంజపుంజమండితంబగు కాళిందీతటమ్మునకుఁ జని యచ్చట, ౧౪౬

సీ. పన్నగున్నలవంటి యెసకమ్ము గల్గుకా
రడవిపందుల బీర మడఁచియడఁచి
భూధరమ్ములపాటి పొడవుగల్గిన యేనుఁ
గుల మొత్తముల నేలఁగూల్చికూల్చి
శమనవాహనమునైన సమయింపఁగాఁ జాలు
పులులగుంపులతోడఁ బోరిపోరి
విక్రమాటోపదుర్విధమ్ము లగు సింగ
ముల గములెల్లను గలఁచికలఁచి

గీ. జవముమెయి గాలితోఁ బోలఁ జాలు లేడి
కదుపులన్ బ్రదరమ్ములఁ జదిపిచదిపి
ప్రళయకాలకిరాతుని పగిది జంతు
మండలమ్మును వేఁటాడి మగిడి యతఁడు, ౧౪౮

వ. ఒక్కశీతలతరుచ్ఛాయాతలమ్మున నిషణ్ణుండై యున్న యెడ,

క. ఆనందోద్దీపకమై
నానాపరిమళవిశేషనవసౌరభమై
జానొప్పఁజాలు నొకగం
ధానిల మేతెంచి నరవరాగ్రణి నెనసెన్. ౧౪౯

వ. అతండును దత్పరిమళమ్మున కచ్చెరువంది, ౧౫౦

మ. మృగనాభిం బురణించి, యబ్జముల పేర్మిం గ్రిందుగాఁజేసి, సం
పెఁగలం డీకొని, కేతకీసుమములన్ బిట్టేచి, కుందమ్ములం
దిగు లొందించియు, మాలతీసుమములం దీండ్రించి, నిర్హేతుకం
బుగ నేతెంచు పరీమళం బిది సుఖాంభోరాశిలో ముంచెడిన్.

క. దీనికిఁ గారణ మేమొకో
కానఁగవలెనంచు వేడ్కఁ గడలుకొనంగా
నానాపుష్పాకీర్ణం
బై నెగడు వనాంతమెల్ల నరయుచుఁ జనుచున్, ౧౫౨

చ. అమరిన వేడుకం గనియె నబ్జముఖిన్ నవసౌరభోజ్జ్వల
ద్యుమఘుమ విగ్రహన్ గమలకుట్మలచారుపయోధరద్వయన్
యమితశిరోజభార మలినాంబర నాతివిభూషణాంచితా
దములపుటాకువంటి యొక తామరసప్రతిమానలోచనన్, ౧౫౩

క. ఆకలికి నాతలోదరి
నాకలకంఠీలలామ నాకనకాంగిన్
భూకాంతుం డిటు గన్గొని
యీకన్నియ యేమనితావియే యిది యనుచున్, ౧౫౪

ఉ. దాని పిసాళిగుబ్బలును దాని యొయారపుఁ జూపుఁదీపులున్
దాని వళిత్రయీగరిమ దాని శరీరపరీమళంబు న
ద్దాని వయోవిలాసమును దాని పదక్రమసౌష్ఠవంబునున్
దేనికి నగ్గలం బనుచుఁ దీరనికూరిమిగౌరవంబునన్, ౧౫౫

—* శంతనుండు సత్యవతిం బెండ్లియాడుట *—

వ. డగ్గఱి సిగ్గరితనమ్మునన్ మొగ్గు నగ్గజగమనం బుసఃపునరాద
రోదయమ్మునం గనుఁగొనుచుఁ దన మనమ్మున, ౧౫౬

క. ఈ మగువ దేవతాకాం
తామణియొ! కిన్నరాంగనామణియొ! ఫణి
స్త్రీమూర్ధన్యయొ! కాక
భూమిన్ గలపొలఁతి కిట్టి పొలుపుంగలదే? ౧౫౭

క. అని తలపోయుచు నా శం
తనుజనపతి తొల్లి దైవతధుని దనువరిం
చినభంగిఁ దలఁచుకొని య
త్తనుమధ్యన్ జేర్మిఁజూచి తగనిట్లనియెన్. ౧౫౮

ఉ. ఎవ్వతె వీవు ? నీజనకుఁడెవ్వఁడు ? జవ్వని ! యివ్వనమ్మునం
దెవ్వనికై చరింతు ? కులమెయ్యది ? నీ విటు లొంటిపాటునన్
మవ్వపుమేనికాంతి కనుమాయఁ జరింపఁగ నేమి వచ్చె ? నీ
కెవ్వఁడు భర్త ? దెల్పఁగదవే ? మదవేల్లితదంతిగామినీ. ౧౫౯

క. నీసొగసు నీవిలాసము
నీ సౌరభ్యంబుఁ జూచి నేనెంతయు నీ
కాసించి మదనభూత
గ్రాసీభూతుండ నైతిఁ గరుణింపఁగదే ? ౧౬౦

వ. అన నక్కాంత చిఱునగవలర నిట్లనియె. ౧౬౧

ఉ. కన్నెనుగాని వేఱొక ప్రకారము దాననుగాను ; దాశరా
జన్నయభిఖ్యగన్న సుగుణాత్ముఁడు నాజనకుండు ; నన్ను " నా
వ న్నడిపించుచుండు మిదె వచ్చెద " నంచు వచించి డించి పో
యె న్నరనాథ ! యింటి ; కదియే యతఁడుండెడితావు నావుడున్,

చ. నరపతియిట్లు వల్కె నరనాథుఁడ నేఁ గురువంశజాతుఁడన్
దరుణి ప్రతిక్షణప్రబలితం బగుజవ్వనమున్ వృథాగతిం
బొరయఁగఁ జేయ నేల ? ననుఁ బొందు మసంశయరీతిఁబత్నివై
పరమసుఖమ్ములం గొనుము పత్నియు గిత్నియు వేఱులేదిఁకన్.

ఉ. ఓసరసీరుహాక్షి విను మొక్కలతాంగి ననున్ వరించి పే
రాసలు గొల్పిపోయె ; నది యాదిగ నేను మఱొక్కలేమపై

నాస విగుడ్వనైతి; నిను నారసినంతన బుద్ధి పుట్టె; నీ
దాసుఁడనైతి; నావిధురతం బెడఁ బాపుట కిచ్ఛగింపుమా!

వ. అని సరసంబుగాఁ బల్కు సజ్జననాయకునియందు బద్ధానురాగ
యయి యత్తొయ్యాలి లజ్జించుచు నిట్లనియె. ౧౬౫

క. నిను నేఁచెడి యమ్మదనుఁడు
ననుమాత్రము విడిచిపెట్టునా? యెందేనిన్
వినుమొక్క మాట ధర్మ
మ్మునకుం గట్టువడవలదె పూవుంబోడుల్? ౧౬౬

ఉ. పెద్దలెఱింగి కన్నెలకుఁ బెండిలిసేయుట పాడిగాని తా
గద్దరియై తనంతన యొకానొక నాయకుచెట్టవట్టినన్
బెద్దఱికంబు వాయదొకొ! పెద్దలకుం దలవంపు నింపదో!
హద్దు నతిక్రమించుట కులాంగనకు న్విహితప్రచారమే? ౧౬౭

ఉ. ఈపరతంత్రురాలి నిటు లీవు వృథా మొగమోటనెట్టి సం
తాపము నొందఁజేయకుము, ధర్మముమర్మ మెఱింగి యించుకే
నోపిక చేసి మజ్జనకునొద్దకు నేగి తదాజ్ఞఁ బూని న
న్నాపయి స్వీకరింపు; మతఁ డన్నిఁట ధీవరుఁ డింత యొప్పుదే.

గీ. ఇట్టు లొప్పుగఁ జెప్పనయ్యింతి కెదురు
మాటచెప్పఁగలేమి, నమ్మనుజ విభుఁడు
దాశగృహమున కేగెఁ దత్కన్య నతని
యనుమతింగొని వరియింప నాత్మనెంచి, ౧౬౮

ఆ. వె. వచ్చుచున్న నృపతివరుని దాదవ్వుల
నరసి ధీవరుఁడు కృతాంజలి యయి
యెదురువచ్చి వినయ మెసఁగంగ నిట్లనె
గౌరవప్రపత్తి గడలుకొనఁగ. ౧౭౦

వ. ఏను భవద్దాసుండ నిచ్చోటికి మీరు విచ్చేసినకతన ధన్యుండ
నైతి నావలనికార్యం బానతిమ్మనుడు నతం డిట్లనియె. ౧౭౧

క. నీ కనుమతి యగునేనిఁ
గై కొనియెద ధర్మపత్నిగా నీతనుజన్
రాకాచంద్రనిభానన
నాకోరిక చంద మిది యనన్ మనమలరన్, ౧౭౨

చ. అనఘుడు బల్కు నాతఁ; డధిపా! కడుభాగ్యముగాదె నాతనూ
జను వరియించి నాకులము శస్తముగా నొనరింపు చెన్న; నీ
కు నొసఁగు వాఁడ, నైన నొకకోరికఁ గోరెద; మత్కుమారికా
తనయుఁడు నీ యనంతరము ధారుణికిం బతి గావలెం జుమీ!

వ. అనుదాశునివచనంబులువిని శంతనుండు గాంగేయుం దలంచు
కొని నిరుత్తరుండై చింతాక్రాంతుండై యచ్చోటు విడిచి తన
గృహమ్మున కేతెంచి దాశకన్యాగతమనస్కుండగుచు నశనాది
కంబు వర్జించి యున్నంత, ౧౭౪

క. గాంగేయుఁ డెలమిఁ దనతం
డ్రింగని యిట్లనియె, చేలరీతిని నిటు గుం
దం గతమెయ్యదియొకో! త
త్సంగతి యొక్కింతనాకు దయఁ దెల్పఁగదే. ౧౭౫

గీ. దుర్జయుండగు శత్రుండు దొడరె నొక్కొ
సలుపఁగా రానికార్యంబు గలిగె నొక్కొ
యేనుగలుఁగఁగఁ గొదవ నీకెట్లు గల్గు
నేల చింతింప? వచియింపవే మహాత్మ! ౧౭౬

క. జనకుని చింతం దీర్పని
తనయునిఁ దనయుఁడని చెప్పఁదగ దండ్రిబుధుల్
మనమున డాఁపక చెప్పుమా
యనఘా ! నీకున్న కోర్కె యది నేఁ దీర్తున్. ౧౭౭

సీ. తండ్రియాజ్ఞనుగదా ! దశరథాత్మజుఁడు భా
ర్యానుజోపేతుఁడై యటవికరిగె
నల హరిశ్చంద్రభూపాత్మజుండగు రోహి
తాస్యుండు జనకాజ్ఞ నమ్ముడువడె
యజ్ఞపశువుగాఁగ నంగీకరించె శు
నశ్శేపుఁడు దనజనకునియాజ్ఞఁ
బరశురాముఁడు తల్లిశిరము డొల్లఁగ నేసె
జనకాజ్ఞ దాఁటరాదనియకాదె
ఆ. వె. చేయఁదగని చెట్టసేఁతయైనను బూర్వు
లాచరించుచుందు రరయఁ దండ్రి
యాజ్ఞకన్న ముఖ్యమైనది వేఱొండు
గాదటంచుఁ దెల్పఁగాదె యధిప ! ౧౭౮

క. తాను సమర్థుండయ్యును
బూనికమై జనకుకోర్కెఁ బూరింపని య
వ్వానిది జన్మమె ? వాఁడును
మానిసియే ? పశువుగాక మానవనాథా ! ౧౭౯

ఆ. వె. తండ్రి కోర్కెఁదీర్చి తనియింపఁగాలేని
పుత్రకుండు జగతిఁ బుట్టనేమి ?
గిట్టనేమిఫలము ! గిట్టవా ! పుట్టవా !
స్వేదజములు మఱియు భేదమేమి ? ౧౮౦

క. అని పల్కు తనయుఁ గని, శం
తనుఁ డిట్లను లజ్జ మనముదరికొనఁ దనయా!
గనుఁగొనుము చింతగాదే ?
తనయుండొక్కరుఁడ యైనఁ దండ్రికిఁ దలఁపన్. ౧౮౧

క. ఒకకొడుకు కొడుకునుంగాఁ
డొకకన్నును గన్నుఁ గాదయో! పుత్రా! దై
వికగతి వాఁడందినఁ దం
డ్రికి వేఱొండుగతి గల్గనేర్చునె యెందుః ? ౧౮౨

వ. ఇట్లు చింతాక్రాంతుండై యున్న తండ్రి యుదంతంబు సాంతం
బుగాఁ దెలియంగోరి యమాత్యులంబనిచిన వా రున్నయునికి
నెఱిఁగి. భీష్మునకుం జెప్పిన నతండు తదమాత్యులతోడం గలసి
దాశరాజుసదనమ్మునకుం జని యతనితో నిట్లనియె. ౧౮౩

ఆ. వె. ఓయి! దాశరాజ! యొసఁగు నీపుత్రి మ
జ్జనకుఁడైన శంతనునరపతికి
మాతయైన నీదుకూఁతున కే నెల్ల
యెడల భక్తుఁడనని యెఱుఁగు మనఘ! ౧౮౪

క. అన దాశుం డిట్లను నో
యనఘా! నీ కిచ్చెదను మదాత్మజ సతిగాఁ
గొను మీవుండఁగ నేత
త్తనయుం డీనేల నేల ధర్మమె ? చెప్పుమా! ౧౮౫

క. అనుదాశరాజునకు శం
తనుతనయుం డిట్లు పల్కుఁ; దగ నీసుత మా
తను జేయుము నా కేత
త్తనయుఁడ రాజ్యమ్ము నేలఁదగుఁగా కనఘా! ౧౮౬

వ. అనుడు మహాత్మా! నీవు రాజ్యం బొల్లమియు నిశ్చయంబైనను
నీతనయుండు మద్దౌహిత్రు రాజ్యమ్మునకు సమ్మతించునే యన
భీష్ముండతని కిట్లనియె. ౧౮౭

గీ. ఏను దారపరిగ్రహం బిచ్చగింప
నిట్టి నా కేల పుత్త్రుఁడు పుట్టుఁ జెపుమ
నావలని శంక మనమునఁ బోవఁ ద్రోచి
తల్లి గాఁజేయు టొప్పు నీతనయ నాకు. ౧౮౮

వ. అనుగాంగేయుపల్కులకు సమ్మతించి దాశుండు శంతనునకు సత్య
వతి నొసంగి పరిణయం బొనరించె. ౧౮౯

ఆ. వె. సత్యవతిని ధర్మసతిగాఁ గైకొని
సంతసించెఁ గాని శంతనుండు
పెండ్లి గాకమున్నె బిడ్డఁడు వ్యాసుండు
కలిగె ననెడిమాటఁ దెలియఁ డయ్యె. ౧౯౦

వ. పిదప నతండు కొండొక కాలమ్మునకు నాసతియందుఁ జిత్రాం
గద విచిత్రవీర్యులను తనయులం గాంచె. వా రిరువురును గాలవశ
మ్మున మృతులగుడు విచిత్రవీర్యపత్నియగు నంబిక యత్తయాజ్ఞ
వ్యాసుం గలయునెడ నేత్రనిమీలనం బొనర్చుకతనఁ బుట్టంధుం
డగుధృతరాష్ట్రుం డుదయించి రాజ్యార్హుండు గాఁడయ్యెఁ బిదప
రెండవది యగు నంబాలికం బనుప నాపె వెలవెలఁ బాఱుకతనఁ
బాండురోగగ్రస్తుండగు పాండురా జుదయించె నతండును రాజ్యా
ర్హుండు గామి సత్యవతి పెద్దకోడలిఁ బిలిచి మరల వ్యాసుం
గవయు మనుడు నాపె యొల్లక కాముకలావేదినియగు తన
దాసిం బనిచిన దానికి ధర్మాంశమ్మున విదురుం డుద్భవించె.

క. ధృతరాష్ట్రుం డంధుండగు
కతనఁ విదురుండు దాసికాన్పగుటను స
మ్మతిగాక సత్యవతియా
నతి భీష్ముం డిడియెఁ బాండునకు రాజ్యంబుఁ. ౧౯౨

వ. అతండు విదురుండు మంత్రిగా రాజ్యం బేలుచుండె. ౧౯౩

క. అలధృతరాష్ట్రుండును సౌ
బలియగు గాంధారి యొకతె వైశ్య యొకతె భా
ర్యలుగా సుతశతమును సౌ
బలియందుఁ, వైశ్యయందుఁ బడసె నొకరునిఁ. ౧౯౪

ఆ. వె. శౌరసేని కుంతి సదమల మద్రభూ
పాలపుత్రి మాద్రి భార్యలుగను
బాండుభూవిభుం డఖండసౌఖ్యాంబుధి
నోలలాడి రాజ్య మేలుచుండె. ౧౯౫

క. పుట్టింట నున్నయప్పుడ
పట్టి నొకనిఁ గనియెఁ గుంతి పాండునృపతి యా
గుట్టెఱుఁగమి నాపడఁతిం
గట్టికొనియె నేమి సెప్పఁగల మునులారా! ౧౯౬

క అన విని మును లిట్లని రో
యనఘా! కన్నెతికమునన యకుంతికి నం
దనుఁ డెట్లుగలైనో? పాం
డునృపతి దానెట్లుకొనియెనో? తెల్పఁగదే. ౧౯౭

వ. అనిన సూతుం డిట్లనుఁ దొల్లి శూరసేనాత్మజయగు కుంతినిఁ
గుంతిభోజుండనువాఁడు సంతానంబు లేమిం జేసి పుత్రింగాఁ

గైకొని పెంచికొనుచు నొక్కెడ దుర్వాసుండు తన గృహం
బేగుడు నతనికిఁ బరిచర్యార్థంబుగాఁ గూఁతుఁ నియోగించె. ౧౯౮

క. కుంతియు దుర్వాసున క
త్యంతము భక్తియును బేర్మి దనరఁగ సేవల్
గొంతవడిఁ జేయ నాతం
డెంతయు సంతసము లోన నినుమడి గాఁగన్, ౧౯౯

ఆ. వె. కన్నె ! వేల్పు నెవనిఁ గామించి మనమునఁ
దలఁచి కొనెదొ వాఁడు తత్క్షణంబ
వచ్చి నీదు కోర్కె ఫలియింపగాఁ జేయు
మంద టంచు నొక్కమంత్ర మొసఁగె. ౨౦౦

క. ఇటులొసఁగి యతఁడు సనె న
క్కుటిలాలక యొక్కనాఁడు కుతుకమ్మున న
జ్జటిలుఁ డొసంగిన మంత్రపుఁ
బటిమం దిలకింప నెంచి పఠియించి వెసన్, ౨౦౧

వ. ఉదయించుచున్న సూర్యునిం బిలుచుటయు నతండు మనుష్యరూపమ్మునఁ జనుదెంచె; నంతఁ గుంతియు వేపమానయగుచు రజోదోషసంగతయై యతనిం గాంచి కృతాంజలియై యిట్లనియె. ౨౦౨

క. దేవా ! తావకదర్శన
మీవగ నొకమా టొనర్ప నే నెంచి తగన్
భావించి వేఁడితిని నా
భావము ఫలియించె నీవు వచ్చినకతనన్ ౨౦3

వ. కావున మదపచారమ్ము కతన దేవరకుఁగల్గిన పరిశ్రమంబు సైఁచి
కోపింపక భవదీయమండలమ్మునకు పయనేయుమని ప్రార్థింపుడు
నహర్పతి మదవిహ్వలుండై యత్తలోదరి కిట్లనియె. ౨౦౮

క. పిలిచితివి వచ్చియుంటిని
గలయకయే నన్నుఁ బంపఁగాఁదగునే ? యో
కలికీఁ యలరుల ములుకుల
కులుకంగాఁ జేయ నీకు నొప్పిద మగునే ? ౨౦౯

ఆ. వె. ఎవతెకైనఁగాని యేఁ దటస్థింతునే ?
మంత్రపాటవమున మగువ ! నీకుఁ
జిక్కినాఁడ నన్నుఁ జిక్కులు వెట్టక
కలయు మబల ! పేర్మి దొలకరింప. ౨౧౦

వ. అనవుడుఁ గుంతి సిగ్గున మ్రగ్గుచు నిట్లను, ౨౧౧

గీ. కన్నియను గాని వేఱొండు గాదు ; నిజము
తెలియవే ? సర్వసాక్షివి దేవదేవ !
నిన్ను నేఁ గోరుటయుఁ దప్పె ; నన్ను నీవు
గలయ నుంకించుటయుఁ దప్పె ; కను మొకింత !

చ. అనవుడు సూర్యుఁ డిట్టులను ; నంగన ! నిన్ గవఁగూడ కేను బో
యినయెడ నన్ను దేవత లిహీ ! యని గేలి యొనర్పరోటు ! కా
దని గికురింతువేని నిను నమ్ముని నిద్దఱినిన్ శపింతు ; నే
మని యిటువంటిమంత్ర మబలా ! కులబాలిక కిచ్చెఁ జూచెదన్.

వ. నన్ను మన్నింతువేని మత్సంపర్కమ్మున నీకన్యాత్వంబు వాసి చెడ
కుండఁ గాపాడుభారము నాయదియు. ౨౧౪

క. ఒరు లెవ్వ రెఱుఁగకుండఁగ
వర మొసఁగెదఁ గోర్కెఁదీర్చి వగలాఁడివో! న్
బురణించు ముద్దులొలుకు కొ
మరునిం గనరాదె? మరునిమాఱగువానిన్. ౨౧౧

క. అని పేర్మి గడలుకొనఁ బ
ల్కిన నచ్చెలి మెత్తవడియెఁ గ్రీడారతులం
దనిపి వర మొసఁగి రవియును
జనియెం దివమునకు మనము సంతస మెసయన్. ౨౧౨

—* కర్ణ యుధిష్ఠిరాదుల జననము. *—

వ. పిమ్మట నక్కుంతి చూలుదాల్చి దాదికిందక్కఁ దక్కుఁగలవారి
కిం దెలియనీక యంతఃపురమ్మున నుండునెడ సహజకర్ణకుండలకవ
చాభిరాముండును నర్కప్రతిమానుండును సర్వలక్షణోపేతుఁ
డునునగు కర్ణుం డుద్భవించిన లజ్జితాననయయి చింతించు నక్కుం
తికి ధాత్రేయి యిట్లనియె. ౨౧౩

* క. కడచినపనికిం జింతన్
గడలుకొలుపనేల? భావికార్యమ్మునకుం
బడఁతిరో! యాలోచింతము
తడఁబా టేలయనఁ గుంతి తత్తఱపడుచున్ ౨౧౪

వ. ధాత్రేయికానీతం బగుమందసమ్మునందు, ౨౧౫

---

* ఈవిషయమును ఈస్కంధమునందలి మఱికొన్ని విషయములును విపులముగాఁ జూచువారు మా పాండవజననమునఁ జూడఁదగు.

క. బాలునిడి కన్నుఁగొనలం
గాలువలై నీరు పాఱఁగాఁ గడుఁ బేర్మిన్
బాలిండ్లు స్రవింపఁగఁ జిం
తాలోలమనస్క యగుచు నడలుచుఁ బలికెన్. ౨౧౬

ఆ. వె. ఏమి సేయుదాన నే మాచరించెడి
దాన నేమి పలుకుదాన మంద
భాగ్య నైననాకు బహులక్షణయుతుండ
వీవు దక్కవాఁడవే కుమార ! ౨౧౭

మ. తనయా ! యేజగదంబ లోకము లనంతంబుల్ కృపం బ్రోచి వృ
ద్ధిని బొందించు మహానుభావ నినుఁ బ్రీతిం గాచు నాశక్తి ; నీ
కనయం బాఁకలి దీర్చు సారెకును స్తన్యం బిచ్చి యమ్మాత ; నే
జననిం గాను, కుమార ! నీ కఖలముల్ సర్వాత్మ యద్దేవియే.

గీ. మరల నీమొగ మిఁక నొక్కమాఱుఁ గాంచు
భాగ్య మబ్బని నా కిట్టి పాపజాతి
కకట ! స్వైరిణిఁబోలె ని న్నడవిఁ ద్రోచు
నంతగతి వచ్చె నే మని యందుఁ బుత్ర ! ౨౧౯

చ. కనియును నిన్నువంటి తగుకానుపు, నెన్నఁడుఁగాని సంతతిన్
గనని యనాథవోలెఁ, గొడుకా ! యుడుకారెడివంత నెంతయున్
గనవలసెన్ ; బురాభవమునన్ సుతసంపద పెట్టిపుట్టకుం
డిన ననువంటి దాని కిదునే ? జగదంబ సుతున్ భవాదృశున్.

వ. పిదప దాది యామె నోదార్చి మంజూషం గొని రహస్య ప్రకా
రమ్మునఁ జనువేడ వంధ్యయగు రాధయను సూతగృహిణి తన

కిమ్మని యడుగ నద్దాని కొసంగె. రాధయు నతనిం గన్న
కుమారుంబలెఁ బోషించుచుండె. ౨౨౧

క. ఆమీఁదఁ బాండునరపతి
యామగువం గొనియెఁ దా స్వయంవరమున న
త్తామరసాప్తవరమ్మున
నామదితయుఁ గన్నెవన్నె నతనికిఁ దోఁచెన్. ౨౨౨

క. ఒకనాఁ డాపాండునృపా
లకుఁ డడవిన్ వేఁట లాడ లాలసుఁడై యే
గి కడుం దుష్టమృగములఁ జె
నకి చెనకి యనంతరమ్మునన్ మృగరీతిన్, ౨౨3

క. క్రీడించెడి జడదారుల
జోడుం గని యందు మగని సూటిమొలర్పన్
గాడంగనేయ శరసం
తాడితుఁడై కుపితుఁ డగుచుఁ దాపసి నృపునిన్ ౨౨౪

క. కనుఁగొని యగ్నికణంబులు
కనుఁగొనలన్ రాలఁ బలికెఁ గటకట! పాపా
త్మని ని న్నేమనఁ గల! ని
ప్పని యే మని చేసి తీ వపాస్తనయుఁడవై ౨౨౫

క. క్రీడించు నన్ను శరసం
తాడితుఁ గాఁ జేసి తీ యధర్మము నిన్నుం
బీడించు మృత్యువై విరి
బోఁడుల కూటములవంకఁ బోయితివేనిన్. ౨౨౬

క. అని శపియించిన నాపాం
డునృపాలుండును మనం బనూనవిషాదం
బును జెంద నయ్యరణ్యాం
బున రాజ్యము వీడి వాసమును బొనరించెన్. ౨౨౭

ఆ. వె. అంత నతనిభార్య లైన కుంతియు మాద్రి
యును బతివ్రతాత్వ మనుగమించి
చని రరణ్యమునకు; సతులకుం బతిసేవ
కన్న భాగ్య మొండు గలదె తలఁప! ౨౨౮

గీ. గంగ యొడ్డునఁ బాండుఁ డఖండతపముఁ
జేయుచు మునీశ్వరుల సేవఁ జేసి పుణ్య
కథలు వినుచును గాలమ్ము గడపుచుండె
రాజ్యసంగతి మఱచి విరాగి యగుచు. ౨౨౯

వ. ఒక్కనాఁ డతం "డపుత్రస్య గతి ర్నాస్తి" యనుధర్మశాస్త్ర
వచనంబు విని తనకుం గతి యేమి యని వారి నడుగుడు మును
లిట్లనిరి. రాజా! యౌరసుండును దౌహిత్రుండును క్షేత్రజుం
డును గోళకుండును గుండుండును సహోఢుండును గానీనుండును
గ్రీతుండును వనప్రాప్తుండును దత్తుండును నా దశవిధపుత్రు
లుత్తరోత్తరంబు లొచ్చుగా గణియింపం బడుదు రిట్టిపుత్రులలో
నొక్కండేనిఁ గల్గినఁ బున్నామనరక ప్రాప్తి లే దని చెప్పిన విని
యొక్కెడఁ గుంతి కిట్లనియె. ౨౩౦

శా॥ సౌదాసుండు వశిష్ఠమౌనివలనన్ సంతానముం గాంచి యా
మోదం బందె నటంచు వింటెఁ దరుణీ! మోమోటమిం దక్క దా
యాదప్రాప్తికి నొక్కమౌనివరు నీ వారాధితుం జేయఁగా
రాదే? యన్వయ ముద్ధరించుట యధర్మంబౌనె నాయానతిన్.

క. పతియానతిఁ గొని సతి పర
పతివలనను బిడ్డఁ గనిన పాపము లేదీ
వితరణకు వశిష్ఠుఁ డాదిగ
శ్రుతి స్మృతివిదుల్ వచించు సూక్తులు వినవే. ౨౩౨

వ. అనవుడుఁ గుంతి మున్ను మంత్రంబొక్కండు నేర్చియుంటి
నయ్యది పఠించి యే వేల్పుఁ గోరిన నతం డేతెరకతీరడు. తద్బల
మ్మున దేవతల నారాధించి తనయులం బడయుదాన. ౨౩౩

క. అని పతియానతి ధర్ముని
మనమునఁ దలపోయ నతఁడు మంత్రబలమునం
జనుదెంచె నతనివొత్తున
జనియించెన్ ధర్మరా జనమతేజుండై. ౨౩౪

క. ఒకయెడ వాయుదేవు, మ
ఱొకయెడన్ దేవనాథు నొగి మంత్రబలం
బుకతన రప్పించి తగన్
వృకోదరార్జునుల నస్త్రవిదులం గనియెన్. ౨౩౫

గీ. ఇట్లు గుంతికి సంతాన మెసకమెసఁగఁ
గని సహింపక మాద్రి భర్తను గనుఁగొని
తనయు నొక్కని దయసేయఁ దగదె? నాక
టంచుఁ బ్రార్థింపఁ గుంతికి నాజ్ఞ యిడియె. ౨౩౬

క. పతియానతిచే మాద్రీ
సతికిన్ మంత్రం బొసంగెఁ జయ్యనఁ గుంతీ
సతి తన్మంత్రంబున నా
సతి నాసత్యులను బొంది సంతస మెసఁగన్. ౨౩౭

గీ. నకుల సహదేవు లనెడి తనయులఁ గాంచె
నిట్లు పాండున కాత్మజు లేవు రుదయ
మంది రవ్వారు పాండవులనఁగఁ బరఁగి
రంత నొకనాఁడు పాండుభూకాంతుఁ డెలమి. ౨౩౮

చ. వల దని మాటిమాటికి నివారితుఁ డయ్యును గామబాణసం
చలితమనస్కుఁడై తపసిశాపము నెంచక మద్రిరాట్సుతం
గలసి గతాసుఁడై చనియెఁ; గాముకు లాత్మతనూవినష్టికిన్
దలఁక రటన్న, వేఱొక విధంబగు హానికి జంక నేర్తురే! ౨౩౯

గీ. చెట్టువడినంతఁ జెట్టును జుట్టుకొన్న
తీవయును బోలె నపుడు మాద్రిలతాంగి
యానృపాలునిపైఁ బడి యడల సాగెఁ
గాంతలకు నింతకన్న దుఃఖంబు గలదె! ౨౪౦

గీ. కుంతియును వగం బొగల సాగెఁ; గొమరులెల్లఁ
గరముఁగుందిరి; మునివరు లరుగుదెంచి
వారి వారించి పాండుభూపతికి నుత్త
రక్రియలు దీర్చిరంత విధిక్రమమున. ౨౪౧

వ. మాద్రియుఁ దనకొడుకులం గొంతి కప్పగించి సహగమనం బొనర్చెఁ బిమ్మట మునులు సంతానసహితంబుగాఁ గుంతి నూరార్చి దంతిపురంబున కనిపిరి. ధృతరాష్ట్ర విదుర గాంగేయాదు లాయమ నోదార్చి వీరలెవ్వ రని యడుగఁ గురుకులోద్ధరణార్థంబుగా మత్పతి యానతి సురలవలనం గన్నసంతానంబని చెప్పి విశ్వాసార్థంబుగా వారల నప్పుడు రావించుటయు, ౨౪౨

క. ధృతరాష్ట్రప్రముఖులు స
న్మతి నాయమ నాదరించి మమత మెయిం ద

త్సుతుల సమస్తవిధమ్ముల
నతులగతులఁ జూచుచుండి రఖమర లేమిఁ. ౨౪3

ఆ. వె. పాండుభూమిపతికిఁ బత్నులయం దిట్లు
సుతులు సంభవించి రతులమతులు
వారిచరితఁ జెప్పువాఁడ నాకర్ణింపుఁ
డాదరం బెసంగ ననఘులార. ౨౪౪

గీ. వారి కేవురకును నొక్కవనిత ద్రుపద
పార్థివునిపుత్రి ద్రౌపది పత్నియయ్యె
నేవురకు నక్కలికియందు నేవు రుద్భ
వించిరి తనూజు లత్యంతవిమలమతులు. ౨౪౫

క. నరునకుఁ గృష్ణుని చెలియలు
పరమోదారగుణరూపభద్ర సుభద్రా
తరుణి సతియగుచుఁ దగె న
త్తరుణికి నభిమన్యుఁ డనెడితనయుఁడు పుట్టెన్. ౨౪౬

ఆ. వె. అతఁడు సమరరంగమందుఁ గాలవశంబుఁ
జెందె ; ద్రుపదపుత్రి నందనులును
నతనివోలె మడిసి రాయుద్ధమునన సౌ
భద్రుభార్య మత్స్యపతితనూజ. ౨౪౭

—* పరీక్షిత్తు పుట్టుట *—

వ. ఉత్తరయనునది యప్పటికి గర్భవతియై యుండి ద్రౌణిశరాగ్ని
దగ్ధుండగు నొక్కకుమారుం గనుటయుఁ గృష్ణుం డనుగ్రహించి
కురుకులాంకురమ్ముగా నక్కుమారుం బ్రతికించె. ౨౪౮

గీ. కులము క్షీణించునప్పుడు గలుగుకతన
నా కొమరుఁడు పరీక్షిదాఖ్యాకుఁ డయ్యె
పాండవులచేతఁ దనసుతుల్ వడినకతన
నాంబికేయుండు పుట్టంధుఁ డడలుచుండె. ౨౮౯

గీ. అతనిభార్య గాంధారియు నట్లు పుత్ర
శోకమునమ్రగ్గ నిరువుర కేక రీతి
ధర్మతనయుండు పరిచర్య తగ నొనర్చి
వారియనుమతి రాజ్యంబు వడసి యలరె ౨౯౦

క. విదురుండును ధృతరాష్ట్రుని
మదికింపగురీతి ధర్మమార్గంబులు స
మ్మదమున బోధించుచుఁ గడుఁ
బదిలముగా నతనియొద్దఁ బొల్పడియుండెన్. ౨౯౧

క. తనయులు మడిసిన దుఃఖం
బును మఱపించుచును ధర్మపుత్రుఁడు పితృసే
వన మొనరింపఁగ భీముం
డనుదినమును నతనియెదుట నను నీరీతిన్. ౨౯౨

సీ. దుర్యోధనునితొడల్ తునియలు సేసి దు
శ్శాసనునల్లఁ బేరాసఁద్రావి
తక్కినసుతుల నందఱ నుగ్గుగావించి
తినఁ దిండిలేమిఁ జేసినకతమున
మాయింటఁ బడి యభిమానవిహీనుఁడై
కాకంబువలె సిగ్గులేక భుక్తి
సలుపుచునున్నాఁడు జనుపాంధుఁ డితనికిఁ
బిండము మేమింతపెట్టకున్న

గీ. వేఱుగతి లేదటం చిటుల్ విసువుమాట
లెన్నియో భీముఁ డాయమ్మ లెత్తిపలుక
వంతఁగొనునట్టి ధృతరాష్ట్రు చింతఁ దీర్చుఁ
దమ్మునికి బుద్ధిసెప్పుచు ధర్మసుతుఁడు. ౨౧3

వ. ఇట్లష్టాదశవత్సరమ్ము లటవసించి ధృతరాష్ట్రుండు ధర్మతనయు
నానతి వనమ్మునకరుగం దలఁచి వృకోదరుని కారణమ్మున నింత
దనుకఁ దనపుత్త్రుల కౌర్ధ్వదైహికంబులు జరుగమి ననుస్మరించి
వారలకు నివాపక్రియార్థంబుగాఁ గొంతధనంబు నడుగుడు విదు
రానుమతంబున నట్లొనర్పనుంకించి తమ్ములతో యోజించు
నన్నంగని వృకోదరుం డిట్లను. ౨౧౪

సీ. నీకరణమున నే నెలఁతతో మనమెల్ల
వనవాసమున బ్రింగవలసివచ్చె
ద్రుపదపుత్రి కనేకదుఃఖము లందంద
నీ నిమిత్తముననే నెఱిఁఘటిల్లె
నల విరాటునికి దాస్యం బొనర్చుట మన
కబ్బె నీమూలాన నందఱికిని
నీవగ్రజుండవు గావేని వమ్ముగా
మన కధికార మెమ్మాడ్కిఁ బోవు

తే. గీ. పుట్టినదిగోలెఁ జేసిన చెట్టలెన్నఁ
దరముగాని సుయోధను తర్పణమున
కనఘ! ధన మీఁదలంచెద వక్కటకట!
యెంత వెట్టి వోయన్న! నిన్నే మియందు. ౨౧౫

క. మునుగంధర్వుఁడు దుర్యో
ధనునిం జెఱగొన్న నతనిఁ దప్పింపఁగఁ జే

సిన నీ వెఱ్ఱితనం బది
మనమునఁ దలపోయ మంటమండును నాకున్. ౧౫౬

క. నీవెఱుఁగకుండఁ గీచకు
లేవిధమునఁ జంపఁబడిరి నృప! యావిధి దు
ర్భావుల సుయోధనాదులఁ
గావలుల వధింపకునికిఁ గష్టము లబ్బెన్. ౧౫౭

వ. వేయేల దుర్యోధనహితార్థంబుగా నీతనికి ధనం బొసంగుటకు నేనొల్ల; నింతనిక్కంబని సానుజుండై భీముండు సనుటయు నది లెక్కింపక యుధిష్ఠిరుండు ధనం బొసంగి తత్కృత్యంబులు నెఱవేర్పించె. ౧౫౮

ఆ. వె. తర్పణములొనర్చి తనవారికుత్తమ
గతులు గలుగఁ జేసి కౌరవాధి
నాథుఁ డరిగె వనము నాతితో విదురసం
జయులతోడఁ బార్థనయులతోడ. ౧౫౯

వ. కుంతియు వారిపిఱుందన చనియెఁ బాండవు లాయమ మరలించు దలఁపునఁ దోన చని వ్యర్థప్రయత్నులై పురికేతెంచి రంత వారలు, ౧౬౦

క. పాపాపహమగు గంగా
ద్వీపవతీతీరమున యతిప్రవరగణ
ప్రాపకమై యలరెడిశత
యూపాశ్రమమందు నుండి రుటజములందున్ ౧౬౧

వ. ఇట్లాఱుసంవత్సరమ్ములటఁ దపంబున నుండినపిదప యుధిష్ఠిరుం డొక్కనాఁ డనుజుల కిట్లనియె. ౧౬౨

గీ. నాకు నిన్నటిరేయి స్వప్నమునఁ గుంతి
కడుబడలి యున్నవడువునఁ గానుపించె
నమ్మహాసాధ్వి గాంధారి ననుఁగుఁ దండ్రి
నరసి రా మనసాయె నోయన్నలార. ౨౬౩

వ. మఱియు నయవిదుత్తములగు సంజయవిదురులం గూడఁ గన మనసయ్యెడి, వలసినరండు మీరలును ననుచు నల్లెయన ద్రౌపదియు సుభద్రయు నుత్తరయుఁ దక్కంగల పౌరులును బలసి కొలువ నతండు శతయూపాశ్రమమ్మునకుం జని కుంతీగాంధారీధృతరాష్ట్రులఁ గని విదురుఁగనరామికి శంకించి తండ్రితో మహాత్మా! విదురుండెక్కడ, నని యడుగుడు నతండు విరక్తుండై యియ్యెడనే యొకచోట నేకాంతంబుగఁ దపం బొనరించుచున్నవాఁ డనిన మఱునాఁడు గంగాతట మెల్లనరసి, ౨౬౪

గీ. ఘోరతపమాచరించు నాధీరుఁ గాంచి
ధర్మజుఁడ నని చెప్పి వందన మొనర్చి
యెదుట నిల్చిన నుత్తరం బీక మిన్న
కుండె నీగతి నొకక్షణ ముండునంత, ౨౬౫

ఆ. వె. విదురు మొగమునుండి వెడలి యఖండతే
జం బొకం డజాత శత్రుముఖము
నందుఁ దగఁ బ్రవేశ మందె నాతండు ధ
ర్మాంశమున జనించినట్టిఁ డగుట. ౨౬౬

వ. ఇట్లు విదురుండు గతాసుం డగుటకుఁ జింతించి యతనికి దహనాది సంస్కారం బొనర్ప నుంకించుడు నశరీరవాణి యిట్లను. ౨౬౭

గీ. ఈతఁడు విరాగి గాన నీవితని కిట్టి
కృత్య మొనరింపుటకు మది నెంచఁబోకు
మనుడు ననుజులతో గంగ నతఁడు స్నాన
మాడి చని ధృతరాష్ట్రితో నది వచించె ౨౬౮

గీ. మీఁద నయ్యాంబికేయు సమీపమంద
పాండవులు గొంతకాల మిట్లుండ నటకు
వ్యాసనారదమునివర్యు లరుగుదెంచి
రనుగమించు మహామౌని జనులతోడ. ౨౬౯

క. వ్యాసుం గనుఁగొని తగఁ గుం
తీసతి యిట్లనియె నోమునివరేణ్యా ! నా
కాసజనియించెఁ గర్ణుని
నాసుతు నొకసారి గన్గొనం జేయఁగదే. ౨౭౦

ఆ. వె. కన్నె ప్రాయమందుఁ గంటిని గనుఁగొంటి
నంతెకాని యతని యభ్యుదయము
చూడ నోఁచ నైతి నేఁడైన నొకపరి
వేగ వానిఁ జూపవే మహాత్మ. ౨౭౧

వ. గాంధారి యిట్లనియె. ౨౭౨

ఆ. వె. కడుపు పగుల నింతకానుపుఁగంటిని
గాని యొకని చేతిలోననైన
వెడల నోఁచనైతిఁగొడుకుల నూర్వుర
నొక్కసారిచూపు మోమహాత్మ. ౨౭౩

వ. సుభద్ర యిట్లనియె. ౨౭౪

గీ. చిన్నతనమున వీరుఁడై వన్నె కెక్కి-
తుదకుఁ గడుపునఁ జిచ్చిడి తొలఁగిపోయె
నక్కటా! యభిమన్యు మదాత్మజాతుఁ
బ్రాణసముఁ జూపుమిఁక నొక్కపరి మహాత్మ. ౨౭౫

చ. అని కరుణంబు పొంపిరిగొ నయ్యమ లందఱుఁ దన్నుఁ గోర న
మ్మునివరుఁ డాత్మ నిట్లు దలపోసె జగజ్జననిన్ సనాతనిన్
సనకసనందనాదిమునిసన్నుత నున్నత దేవదేవమూ
ర్ధనిహితపాదపద్మఁ బ్రసరత్కరుణారసపూరపూరితన్. ౨౭౬

గీ. అష్టదిక్పాలకులును బ్రహ్మాది దేవ
తలు నహమ్మును బంచభూతములు నింద్రి
యాదికమ్మును లేకున్నయపుడు నొప్పు
నేజనని యామె నీవని యే నుతింతు. ౨౭౭

సీ. దేవదేవివి మణిద్వీపవాసినివి ప్ర
కృతివి బ్రహ్మాదికాకృతివి సకల
జీవలోకమ్మును జిత్తమునం దిడి
గుణములచే లింగకోశమందుఁ
జొనిపి సమాధినిష్ఠను జెంది కల్ప ప
ర్యంతమ్ము స్వాతంత్ర్యమును గనించి
యుండెడి నీశక్తి యొరు లెఱుంగఁగ లేరు
మాదృశు లెట్లు నీమాయఁ దెలియ

గీ. నేర్తు రోయమ్మ! వీర లత్యార్తు లగుచు
మృతులఁ జూపింపు మనెదరు మృతులఁ జూప
నీకటాక్షంబు లేకున్న నే సమర్థ
తం బొరయు పాటివాఁడనా? తల్లి చెప్పుమ. ౨౭౮

క. అని సంజయప్రోక్తనం దను
వినుతింపఁగ లోకజనని విస్మయగతి నా
కనివాసులైన వారలఁ
గనుపింపఁగఁ జేసె గనులకలి వెడలంగన్. ౨౭౯

వ. గాంధారీప్రముఖు లవ్వారిం గాంచి సంతసించిరి. పిదప సత్య
వతీతనూజుండును, ౨౮౦

క. వారల మరలన్ దివికిం
జేరం జేయుటయు నట్టిచెయిది మహాశ్చ
ర్యారోపకమై చూచెడి
వారలకు మహేంద్రజాలవైఖరిఁ దోఁచెన్. ౨౮౧

—* ధృతరాష్ట్రాదుల మరణము *—

వ. ధర్మజుండును వ్యాసున కెరఁగి సపరివారంబుగా హస్తిపురి కేతెంచి
సుఖంబున్న మూఁడవదినంబున గాంధారియుఁ గుంతియు ధృత
రాష్ట్రుండును దావానలంబుకతనఁ గాలధర్మంబుఁ జెందుటయు
సంజయుం డంతకు మున్న తీర్థయాత్రయందుఁ గతుండగుటయు
నారదుని వలన విని దుఃఖితుండై యుచితక్రియ లాచరించె.
కౌరవక్షయంబయిన ముప్పది యాఱు వత్సరములకుఁ బ్రభాస
తీర్థమ్మున యాదవు లందఱును విప్రశాపవశమ్ముకతన మదిరా
పానమత్తులై యన్యోన్య కలహమున మడిసిరి. బలరాముండును
దేహత్యాగం బొనరించెఁ, గృష్ణుండు శాపంబుకతనఁ గిరాతబాణ
తాడితుండై పరమపదం బలంకరించె, వసుదేవుండు బుత్రశోక
మ్మున భువనేశ్వరిన్ డెందమ్మునఁ బొందుపఱిచి పరలోకగతుం
డయ్యె. పిదప నర్జునుండరిగి దుఃఖితుండై బలరామకృష్ణులకు
సపత్నీకంబుగా సంస్కారమ్ము నిర్వర్తించి ద్వారకాపురం బుద

ధిచే నాక్రమింపంబడకయున్న యాదలి జనంబులతో హస్తిపురం బరుదెంచు నెడ మార్గమధ్యమ్మున చోరులు గోపికలం గొట్టి ధనం బంతయు నపహరింప నిస్తేజుండగుచు నతండు చేయునది లేక మిన్నక యింద్రప్రస్థమ్మున కరుదెంచి యనిరుద్ధపుత్త్రుండగు వజ్రునకు నప్పురంబు పట్టంబు గట్టి పదంపడి సాత్యవతేయునకుం గడచినవృత్తాంతమ్ము నొడివి దుఃఖించుటయు నతండు భవిష్యద్యుగమ్మున నీవును గృష్ణుండును నవతరింతు రయ్యెడ నీ తేజంబు యథాపూర్వమ్ముగ విలసిల్లునని వచించినపిమ్మట హస్తిపురమ్ముం జేరి యుధిష్ఠిరున కేతద్వృత్తాంతమ్ము జెప్పిన నతండు దుఃఖించి షట్త్రింశద్వత్సరుం డగు నభిమన్యుసుతు రాజ్యాభిషిక్తుం జేసి భార్యానుజోపేతుండై హిమాచలమ్మున కరిగి యట దేహత్యాగం బొనరించె నని చెప్పి సూతుండు మునుల కిట్లనియె.

గీ. ఔత్తరేయుండు పాండురాజ్యమును ధర్మ
మింతయును దప్పకుండంగ నేలుచుండ
నరిగె నొకరీతి షష్టివత్సరము లిట్టు
లొప్పుగతి రాజ్యమేలుచు నొక్కనాండు, ౨౮౩

వ. మృగయావ్యసనమ్మున వనమ్మున కరిగి మృగంబులం బరిమార్చుచుం గొంత తడవు గుమ్మరి విద్ధంబై పలాయితం బగు నొక మృగము వెంటం జనిచని మధ్యాహ్నం బగుటయు, ౨౮౪

క. ఆంకలియును డప్పికయును
మేకొన నిలుపోపలేక మిక్కిలి వెతచే
నాకులుండై యచటం దప
శ్శ్రీకరమగు నాశ్రమంబు చేరం జనియెన్. ౨౮౫

వ. చని తపం బాచరించు నొకమునివరుం గాంచి జలం బడు
గుడు సమాధినిష్ఠుం డగు కతన నతండు వలుకఁడయ్యె. దానఁ
గుపితుండై కలిసమావేశ వికలచిత్తుండై మృతసర్ప మొకండు
ధనుష్కోటిం దగిల్చి యతని మెడం బడవైచి పురంబున కరిగె;
మునియు యథాపూర్వమ్ముగ నిశ్చలుండై యుండె. ౨౮౬

క. ఆతని తనుజాతుఁడు గవి
జాతుఁడు నా బాలనాని జనకు నుదంతం
బాతటి మిత్రుల కతనన్
బూతాత్ముఁడు విని యమర్ష పూరితుఁడగుచున్,

వ. జలంబు కరంబున ధరియించి "మజ్జనకు గళంబున నెవ్వం
డీ మృతసర్పంబు దగిల్చె నా దుష్టుం డేడు దినమ్ములకుఁ దక్షక
దష్టుండై మృతుండయ్యెడు మని" శాపం బిచ్చినఁ దద్వృ
త్తాంతంబు ముని శిష్యుం డొక్కఁడు నరేంద్రునకు విన్నవించుడు
నతండును ననివార్యంబగు మునితనయు శాపమ్మున కులికి
మంత్రివృద్ధుఁ జూచి యిట్లనియె. ౨౮౮

ఆ. వె. మునికుమారుఁ డొకఁడు కనలుచు శపియించె
సర్ప విషముకతనఁ జచ్చునట్లు
గాన దాని దాఁటఁగాఁ గల యొక్క యు
పాయముండెనేని బ్రతుకు గలదు. ౨౮౯

గీ. మృత్యు వెన్నటికైనను నిత్యమైన
దైనఁ బౌరుషయత్నంబు మానదగద
టంచుఁ బెద్దలు వచియింతు రరసి యిప్పుడు
తగిన యత్నంబొనర్పఁగాఁ దగదె మనకు. ౨౯౦

వ. మణిమంత్రౌషధ ప్రభావమ్ము లగణ్యంబులు. ము న్నొక్క-
మునివరుభార్య సర్పదష్టయై యమ్ముని యాయుఃప్రసం దర్థమ్ము
గొని పునర్జీవితయయ్యెనని వింటి ; మిట్లు ప్రత్యక్ష దృష్టాంతమ్ము
లనేకమ్ము లుండ నౌదాసీన్యంబున మిన్నకుండుట యయుక్తంబు,
సర్వంబు దైవాధీనం బని యెవ్వండు నిరుద్యోగి యగు నతం
డలసుండు నాఁబడు. ౨౯౧

క. దైవాధీన మటంచును
కేవల మూహింపఁదగదు ; గృహి భిక్షుసకుం
దా వాత నన్నమిడుఁగా
కావల మ్రింగుటకు నతని యత్నము వలదే. ౨౯౨

వ. అనుపరీక్షిత్తుం గాంచి మంత్రులు మహాత్మా ! సర్పదష్టయైన
మునిభార్య పునర్జీవిత యయ్యెనని నుడివితి నాపె యెవ్వతె
యేకతమ్మున సర్పంబు గఱచె మా కెఱింగింపుము నావుడు రా
జిట్లనియె. ౨౯3

—* ప్రమద్వరా వివాహము *—

సీ. మంత్రులారా ! పులోమ యనెడిభృగుభార్య
కుదయించెఁ జ్యవనుఁ డత్యుగ్రమూర్తి
యతనికి శర్యాతి యనుఁగుఁగూఁతురు సుక
న్యాసతి భార్యయై యలరె ; నాపె
యందుఁ బ్రమతి యనునందనుఁ డుదయించె
నతనిభార్య ప్రతాపి ; యామె కొక్క-
రుఁడు కుమారుఁడు పుట్టె రురు ననువాఁ డతం
డత్యుగ్ర మగు తపం బాచరించె

గీ. నయ్యవసరమునందు మాన్యమతి స్థూల
కేశుఁ డనుమానియును హృషీకేశుఁ డగుచుఁ
దపము సల్పుచు నుండె నత్తఱిని మేన
కయును విశ్వావసుకతన గర్భ మంది, ౨౯౪

క. అలస్థూలకేశునాశ్రమ
తలమున కేతెంచి యొక్క తనుజన్ జగతీ
తలమునఁగల కన్నెలకున్
దలమానికమగుచుఁ దనరుదానిం గనియెన్. ౨౯౫

క. బిడ్డం గని యట నొకనది
యొడ్డున నక్కూఁతు విడిచి యుగ్మలిచనియెన్
గొడ్డుదినా ; " లంజెలకుం
బిడ్డలు తెవు " లన్నపలుకు వృథవోకుండన్. ౨౯౬

క. ఆ పసిబిడ్డంగని యా
తాపసి తా నెత్తి పెంచి దానికిఁ బేరున్
బ్రాపించెఁ బ్రమద్వర నా,
నా పాపయు వృద్ధిఁజెందియుంతఁ గ్రమమునన్ ౨౯౭

క. సుమశరుని బాణమో నాఁ
గోమరారుచు మిగుల వలపుఁగొలుపుచు దృగ్మా
ర్గమునం బడ నా రురువుం
బ్రమద్వరం గాంచి కామబాణార్దితుఁడై, ౨౯౮

క. తనయాశ్రమమునకుం జని
యనుగతచింతాభరార్తుఁడై యొక్కెడ సు
ప్తునివిధమున నున్నరురుం
గని జనకుం డడుగ నతనిఁ గని యతఁడనియెన్. ౨౯౯

గీ. స్థూల కేశుండ నెడి మునీశునివనమున
వఱలు నొక చంద్రముఖి ప్రమద్వర యనంగ
నాకు నక్కన్నెమిన్న యందంబు గనిన
యది మొదలు భార్యగాఁ గొన నాస పుట్టె. ౩౦౦

వ. అనుడుఁ బ్రమతియు నయ్యాశ్రమమ్మునకుం జని యమ్మునికి నమస్కరించి ప్రసన్నుఁగాఁజేసికొని యక్కన్నియను దనతనయున కిమ్మని ప్రార్థించుటయు, ౩౦౧

గీ. ఆతఁ డంగీకరించె ననంతరంబు
వార లిరువురుఁ గలసి వివాహమునకుఁ
దగినయత్నంబొనర్చిరి తదవసరము
నంద సర్పమ్ము గఱచె నయ్యబ్జముఖిని. ౩౦౨

గీ. అంతకంతకు విష మెక్కి యవ్వరాంగి
ప్రాణములు వీడి పరలోక మనుగమించె
నంత మునులందఱును జేరి యార్తు లగుచుఁ
జింతచేసిరి చేసెడి సేఁత లేమి. ౩౦౩

వ. రురువు నవ్వార్తవిని యట కరిగి యామృతకళేబరముం జూచి దుఃఖార్తుండై కొంచెమావలకుం జని యిట్లు విలపించె. ౩౦౪

క. నాదుసుఖమునకు విఘ్నా
పాదకుఁడై యిట్లొనర్చెఁ బాపపువిధి నా
గాదిలి నామతి నాధృతి
నాదగుజీవితము పోయెనా, యకటకటా! ౩౦౫

సీ. దౌదవ్వులన చూచి మోద మందితిఁగాని
దరిఁ జేరి మాటాడఁ దలఁపనైతి

మోము నాలోకించి మురిసి మించితిఁ గాని
కెమ్మోవిరుచు లారగించ నైతి
కులుకుగుబ్బలు గాంచి యులుకుఁ జెందితిఁ గాని
చెలినొక్కపరి యక్కుఁ జేర్ప నైతి
మేనికాంతికి మిఱుమిట్లు గొంటిని గాని
యంగన నంతగా నరయ నైతి ;

గీ. పాణిమాత్ర గ్రహణమైనఁ బడయ నైతిఁ
బరమపాపికి నా కట్టి భాగ్యమెట్టు
లక్కటా ! దైవ మెటువంటి చిక్కు దెచ్చె
జీవితం బేల ప్రియురాలి చావు గంటి. 306

క. చనుమా ! జీవనమా ! యిఁక
ననుమానం బేల ? నీకు నఖిల విధములన్
జనుమాన మొసఁగఁ దగు చెలి
కనుమాసెను దానికన్న ఘనమయ్యెద వే. 307

చ. జలమునఁ బోదువో ? యనలసంగతిఁ బోదువో ? ఘోరపాశమున్
గళమునఁ బూనిపోయెదవొ ? కా దిది తప్పు దలంచినాఁడ నా
వలపులదీవి తా విషమువల్ల మృతిం గనినప్పు డీవు న
ప్పొలఁతుక వోవుమార్గమునఁ బోఁదగు నెమ్మెయి నట్లొనర్పుమా.

వ. అని మఱియును, 308

ఆ. వె. చచ్చుమీఁద నేమిసాధింపఁదగు జీవి
తమ్ముగల్గుపై సుఖమ్ము లబ్బుఁ
దరలి పోవఁ దల్లిదండ్రులు చింతింత్రు
గాని దైవమునకుఁ గరుణ గలదె ? 309

క. ఒకవేళ నాదుమరణము
నకు నెల్లరు సమ్మతించినను నాప్రియు రా
లికి నేఁ బరలోకమున ను
పకార మే మాచరించువాఁడ మృతుఁడనై ? 300

గీ. ఆత్మహత్య నొనర్చి యే నటకు నేగఁ
బాతకుం డని యచ్చొలి పరిహరించు
" వెనుక కేగిన నూయి ముందునకుఁ జనిన
గోయి " యక్కట ! యే నేమి సేయువాఁడ. 302

వ. ఇట్లు విచారించుచు నమ్మునిబాలకుండు కృతస్నానుండై
యంజలి పుటమ్మున జలంబులు గొని, 303

ఉ. ఇంచుకయేనిఁ బుణ్యాలవ మే నొసరించితినేని గొంవా
భ్యంచితులైనవారలకు భక్తుఁడనేనిఁ దపఃప్రసక్తిఁ గా
వించితినేని వహ్నులను వేల్చితినేనిఁ ద్రియాప్రపత్తి నా
మించితినేని యిక్కలికిమిన్న దటాలున లేవ కుండునే. 304

గీ. లేవకుండిన జీవనం బేనగింతు
ననుచుఁ గృతనిశ్చయుండయి మునిసుతుండు
కరగతంబగుజలమును ధరణి విడువఁ
బోవు నాయంతలో నొక్క దేవదూత. 305

ఆ. వె. రోదనం బొనర్చురురునియొద్దకు వచ్చి
యేల చింతఁగొనెద వేలయింత
సాహసం బొనర్ప సమకట్టె దయ్యయో !
చచ్చినట్టి కాంత వచ్చు నెట్లు ? 306

క. కావలసిన మఱియింకొక
పూవుంబోఁడిం గ్రహింపఁ బోలదె? మరణం
బేవారు తప్పఁద్రోయుదు
రో వెఱ్ఱిమునీంద్ర! చింతనొందఁగఁదగునే? ౩౧౭

వ. అనుసతని కతండి ట్లనియె. ౩౧౮

ఆ. వె. బ్రతికెనేని దీనిఁ బాణిగృహీతగాఁ
జేసికొనెద, బ్రతుకుఁ జెందదేని
దీనిలోకమునక యేనును బోయెదఁ
గాని యింకనొక్కకన్నె నొల్ల. ౩౧౯

వ. అనవుడు దేవదూత యతనినిశ్చయ మ్మవంధ్యమ్మని యెంచి
మునీంద్రా! దేవకల్పితంబగు నొక్కయుపాయం బెఱింగింతు
నీయాయువునం దర్ధ మిడఁ గలవేని యిక్కన్నె పునర్జీవిత యగు
ననిన నతండు వల్లె యని యట్లు సేయ నుంకించుడు విశ్వావ
సుండును దనపుత్రి మృతయగుటఁ దెలిసి యట కేతెంచె నంత
దేవదూత యతనిం గలసి యమ్మునిపాలికిం జని యి ట్లనియె.

ఆ. వె, ధర్మరాజ! రురునితరుణి ప్రమద్వర
యితనిపుత్రి విషముకతన మృతిని
జెందె, రురుఁడు మృతిని జెందఁగ నున్నవాఁ
డతని యాయువందు నర్ధ మొసఁగి, ౩౨౧

క. బ్రతికింపు మిత్తలోదరి
నతిరయమున ననుడు ధర్ముఁ డట్టులె యాపెన్
బ్రతికించిన నక్కన్నెన్
సతిగాఁ గైకొనియె రురుఁడు సంతస మొసఁగన్. ౩౨౨

చ. ఇటు సమపాయయోగముననే కద! జీవన మావహించె న
చ్చటులమృగాక్షి కట్లగుట సాధ్యముగాఁ గనుపట్టుదక్క న
ప్పటి కనుకూలమై తగు నుపాయములన్ మణిమంత్రి ముఖ్యసం
ఘటనములన్ బొనర్చుటయ కర్జము ప్రాణమురక్షసేతకున్.

వ. అనిచెప్పి సచివానుమతమ్మున సాప్తభూమికంబగు ప్రాసాదం
బొక్కండు నిర్మించి యందు మంత్రులతో వసించె. 3-౨౪

గీ. దానిచుట్టును మణిమంత్రధరులు సూరు
లును నయినవారు కాఁపుండి జనవరేణ్యుఁ
గాచుచుండిరి నృపతి యక్కడను భోజ
నాదికంబులు నెరవేర్చునట్టియెడల. 3-౨౫

గీ. కశ్యపుండను నొకముని కాంతుఁ డర్థి
యగుచు నేతెంచె శాపోపహతు నృపాలుఁ
దనదు మంత్రబలమ్మునఁ దక్షకవిష
ముక్తుఁ గాఁ జేసి తగ ధనమ్మును గ్రహింప. 3-౨౬

వ. మార్గమధ్యమ్మున వృద్ధబ్రాహ్మణస్వరూపుండై తక్షకుం డరు
దెంచి నీ వెందుల కేకతమ్మున సరిగె దని యడుగుడుఁ దక్షకోప
హతుండగు పరీక్షిత్తు బ్రతికింపం బోయెద ననిన నతండును,

గీ. తక్షకుండను నేనె యాతనిని గఱచు
వాఁడ మద్విషనిహతుల బ్రతుకఁజేయ
మంత్రముల్ గింత్రముల్ మహిమఁ గనఁజాల
వింత నిక్కువ మీకష్ట మేల? చనుము. 3-౨౭

గీ. అనినఁ గశ్యపుఁ డిట్లను నస్మదిష్ట
దేవతాప్రాప్త మంత్రప్రభావగరిమ

బ్రతుకఁజేసెదఁ ద్వద్విషబద్ధు మునికు
మారశాపోపనిహతు నమ్మనుజవిభుని. 329

క. అనుడు భవదీయశక్తిం
గనుఁగొందుంగాక యనుచుఁ గఱచెం దంష్ట్రిల్
చొనిపి యొక మట్టిచెట్టుఁ
ముని సూచుచునుండ భస్మముగఁ దక్షకుఁడుఁ, 330

వ. కశ్యపుఁ డద్దానిం బోవ్రుచేసి మంత్రబలమ్మున యథాపూర్వమ్ముగా నొనర్చిన నక్కజంపడి యతం డతని కిట్లనియె. 331

క. మెచ్చితి నీ మంత్రమ్మున
కచ్చెరువుం జెందితిని మహాత్మ ! యిపుడు నీ
వచ్చోటి కరుగు కార్యము
పొచ్చెములేని గతిఁ జెర్మి పొసఁగం జెపుమా. 332

వ. అనుడుఁ గశ్యపుం "డస్మన్మంత్రవిద్యాపాటవమ్మున నతనిం బ్రతికించి ధనంబు సంపాదింపం బోయెద" ననిన నతండు నీవల సినధనం బే నీనోపుదు నిచ్చెదఁ బుచ్చికొని మరలు మనుడు నతండిట్లు యోజించె. 333

గీ. మును హరిశ్చంద్రుడును రఘుభూమిపతియుఁ
గర్ణుఁ డాదిగఁగల ధరాకాంతు లఖిల
ధనము యశముకై విడిచినది వినమె
యశమునకుఁగాని ద్రవ్యంబు వ్యర్థమరయ. 334

గీ. మంత్రబలమున నమ్మహీమండనునకు
జీవితంబు నొసంగినఁ జెప్పికొందు్రే
ధనమునుంగల్గుఁ ; ప్రజలకు జనవరుండు
గల్గు ; రాజ్యమ్మునకు మేలు గల్గుఁ దలఁప. 335

ఆ. వె. లోభగుణమొకండు లోన నూనితినేని
రా జడంగు, మీఁద రాష్ట్ర మడఁగుఁ
బ్రజయు నాశ మందుఁ బాపంబు ననుఁజెందు
నపయశం బవార్యమై పొసంగు. 33౬

వ. అని తనలోఁ గొంతతడవు విచారించి దివ్యదృష్టిం గాఁగల తెఱం
గెఱింగి తక్షకదశ్తం బగుధనంబు సంగ్రహించి మరలి చనియెఁ
దక్షకుండు సప్తమ దివసమ్మున హస్తిపురికింజని నృపతి దుర్గమ
ప్రదేశమ్మున నుంటయు మణిమంత్రౌషధజ్ఞులచే రక్షింపఁ బడు
చుండుటయుఁ గని యిట్లు వితర్కించె. 33౭

శా. ఏరూపమ్మున లోని కేగుదునో యే నేరీతి వంచింతునో
కౌరవ్యాన్వయమందుఁ బాతకములం గావించు నాఁడీతఁడీ
దూరాజ్ఞ క్షమియింతునే సుజన సంతోషమ్ము నాటిల్లునే ?
ప్రారంభించిన కార్యమిట్టిది యొనర్పం జెల్లునో చెల్లదో.

గీ. గర్హిత మొనర్చియును గాలగతి నెఱింగి
రక్షకులు చుట్టువాఱ హర్మ్యమ్మునందు
మృత్యువును దాఁటు నిచ్చనై మెలఁగుచూరెఁ
గాని యనివార్య మని యెఱుఁగఁ డితఁ డకట ! 33౯

గీ. కోటియత్నము లొనరించుకొనినఁ గాని
దైవ కృతమగు మృత్యువు దాఁటఁ దరమె
యంతకన్నను దాన ధర్మాదికమ్ము
చేసికొనరాదె యందైనఁ జెందు సుఖము. 3౪౦

గీ. విప్రశాపమ్ము తప్పునే ? వెఱ్ఱిబడక
యతిరయమ్మున దాన ధర్మాదికంబు

చేసికొను మని యొకఁడైనఁ జెప్పఁ డకట!
విప్రు లున్నారు సన్నిధి వేనవేలు. ౩౮౧

వ. అని తన కడనున్న సర్పమ్ములం గాంచి మీరు విప్రవేషమ్ముల ఫలమూలాదులు గ్రహించుకొని రాజదర్శనంబునకుం బొండని తా నొకకీటరూపమ్మునఁ దత్ఫలమ్ముల నొదిఁగియుండె. వారును రక్షకులంగాంచి యేము కురుకులాభరణంబగు పరీక్షిత్తు రక్షింప వచ్చితిమి గాన మీరాజునకుం దెలుపుఁడు నావుడు వా "రిది సమయంబు గాదు విప్రశాపభయమ్మున నృపాలుం డేకాంతం బగుదుర్గంబున నున్నవాఁ డట కేరికిం జన నశక్యంబు రేపకడ రం" డనుటయు, ౩౮౨

క. భారతకులమున మున్నెపు
డారయ మిటు ద్వారమందు నభ్యంతరముల్
ధీరులగు విప్రవరులకు
నీరాజన్యుని ప్రభుత్వ మిదిగల్పించెన్. ౩౮౩

క. అనవుడు నృపుతోఁ జెప్పిరి
విని నరపతి వారికేను వినయమున నను
స్నానరించి రేపు పచ్చుట
కును బ్రార్థించుట వచించి కొనుఁడు ఫలాదుల్. ౩౮౪

వ. అనుటయు ద్వారికు లట్లొనర్చిరి. రాజు తత్ఫలమ్ములు వేఱు వేఱమంత్రుల కొసంగి కాలవశమ్మునఁ దక్షకాధిష్ఠితంబగుఫలంబు దాను భక్షింపుటకుఁ జిదుముటయు, ౩౮౫

క. అరుణమును గృష్ణదృగ్భీ
కరమును నగు కీటకంబు గనుపట్టఁగ న

చ్చెరు వంది పరీక్షిన్నర
వరుండు తనమంత్రివరులవంకం గనుచున్. ౩౮౬

ఆ. వె. అరుణుఁ డస్తగిరికి నరుగుచునున్నాఁడు
తక్షకార్తి యింక దాఁటిపోయె
విప్రతనయుమాట వితథ సేయఁగా రాదు
గానఁ గీటమిదియ కఱచుఁగాత. ౩౮౭

వ. అని యప్పురువుం దనగళమ్మున నిడికొనినఁ నయ్యది భయంకరం బగు తక్షకస్వరూపమ్ము ధరియించి చుట్టికొనియె, నంతఁ బరుగిడు వారును నచ్చెరువందువారును హాహాకారమ్ము లొనర్చువారునై యెల్లరును జెల్లాచెదరైరి, మహీపతియు దుర్వారతక్షకభోగి భోగావృతగళుం డగుచు మిన్నకుండెఁ. ౩౮౮

క. తత్తక్షకవదనవిని
ర్యత్తీవ్రవిషానలంబు రాజన్యు మహో
ద్వృత్తాప మడరఁ బొరిగొనె
నత్తాపసుశాప మది యథార్థముగాఁగన్. ౩౮౯

వ. ఇట్లు పొలియం జేసి తక్షకుండు గగనమార్గంబునఁ దన యిచ్చం జనుడు మంత్రులు పురోహితపురస్కారంబుగా నతని కౌర్ధ్వదైహికంబులగు కృత్యమ్ములు నెఱవేర్చి, ౩౯౦

క. జనమేజయు శుభలగ్నం
బున రాజ్యమ్మునకుఁ బట్టముం గట్టి కన
త్కనకమణిమండితం బగు
ఘనసింహాసనము నెక్కఁగాఁ జేసి రొగిన్. ౩౯౧

—* జనమేజయునకు రాజ్యప్రాప్తి *—

గీ. రాజచిహ్నాంకితుఁడు జనమేజయుండు
క్రమముగా దాది శిక్షలు గఱపుకతన
నిపుణుఁడై వర్ధమానుఁడై నేర్చె రాజ్య
తంత్రములనెల్ల మంత్రిసత్తములు వొగడ. ౩౫౨

గీ. అంత నేకాదశాబ్దంబు లరుగు సమయ
మునఁ బురోహితుఁ డా నృపపుత్రకునకు
వేదవేదాంగములు ధనుర్వేద మాది
యగు సకలవిద్యలును నేర్పె నతిరయమున. ౩౫౩

గీ. సకలవిద్యలు నేర్చి యారాజవరుండు
క్షితిని బాలించె ధర్మరాజితుఁడనంగ
నతని కిడియె సువర్ణవర్మాఖ్యుఁ డనెడి
కాశిరాజు వపుష్టమాఖ్యకఁ దనయ. ౩౫౪

వ. ఇట్లు కాశిరాజసుతం గైకొని పులోమజం జేకొన్న యింద్రుఁడు నా
సమస్తసుఖమ్ము లనుభవించుచు రాజ్యం బొనర్చుచున్నంత,

క. తత్తక్షకపరిభూతిం
జత్తె మెఱియ బదులుసేఁత సేయింపంగా
నుత్తంకుండను నొకముని
దత్తఱమున నేగుదెంచె దంతిసగరికిన్ ౩౫౫

వ. వచ్చి జనమేజయుం గాంచి యిట్లనియె. ౩౫౬

ఉ. ఎప్పుడు చేయుఁబట్టెపను లెయ్యవియో యెఱుఁగంగ లేవు నీ
విప్పటి చిన్నిబాలకుఁడ వేమనువాఁడ ? నమాత్యు లైన నీ

కొప్పిదమైన కార్యముల నొప్పుగఁ జెప్పరు తప్పుకార్యముల్
చొప్పడుఁగాని పిన్నలకుఁ జొప్పడునే ? విహితప్రచారముల్.

వ. అనుచు వినయమ్మున నా యకృత్యంబును గర్తవ్యంబు నెఱింగింపవే యన జనపతి కిట్లనియె.

క. నీ తండ్రిం బరిమార్చిన
యాతక్షకు నెడల వైర మణుమాత్రమ్మున్
జేతోగతిఁ దలపోయవు
నీతియె యిది నీకు ధారుణీవంతిలకా ! 3౬౦

వ. ఈ యుదంతంబు నీ వెఱుంగవేని నీ యమాత్యులం బిలిచి యడుగు మనుడు వా రున్న యునికి నెఱింగించిన, 3౬౧

క. జనమేజయుఁ డిట్లను నో
మునివల్లభ ! విప్రశాపమున మృతిగనె మ
జ్జనకుఁడు, తక్షకుపై మన
మనిమిత్తంబైన వైర మందం దగునే ? 3౬౨

గీ. అనిన నుత్తంకుఁ డిట్లను నృప ! తప్పు
దలఁచుచున్నాఁడ వేమనఁ ! దక్షకుండు
ధన మొసఁగి కశ్యపుని మరల్చినకతమునఁ
జచ్చె నీతండ్రి లేకున్నఁ జచ్చువాఁడె ? 3౬3

వ. తొల్లి రురువను నొకముని తనభార్య సర్పదష్టయై మృతిం గనుడుఁ దనయాయువున నర్థం బొసంగి పునర్జీవితం జేసి ప్రతినంబూనె నది యెట్లంటేని, 3౬౪

క. కాకోదర మేదేనియు
నాకంటం బడియె నేని నాశ మొనర్తుం
గాక యని దండమొక్కటి
గైకొని దేశమ్ములు తిరుగఁగాఁ జనియె నృపా! ౩౬౫

వ. ఇట్లు దేశంబులం ద్రిమ్మరుచుఁ గనుపట్టినంతవట్టును సర్పమ్ములఁ బరిమార్చుచు నొక్క యరణ్యంబున ముదుసలి కొండచిలువం గాంచి వధింప నుంకించుడు నది మనుష్యభాషణంబుల నిట్లనియె.

క. నాచేసిన తప్పేమి! య
యో! చంపఁగ నేమివచ్చెనో? తెల్పు మటం
చాచిలువరాజు వేఁడిన
నాచతురాననకులీనుఁ డాగ్రహ మెసయన్, ౩౬౬

క. నీజాతిసర్ప మొక్కఁడు
నా జాయం గఱచు కారణంబునఁ గోపో
ద్రేజితుఁడ నగుచు సమయం
బేఁ జేసితి సర్పజాతినెల్ల హరింపన్. ౩౬౭

వ. అనుడు డుండుభమ్ము నే నెవ్వరిం గఱవఁగలఁ దానఁగాను; కఱచు భుజంగమమ్ము లవి వేఱు, దేహ సామ్యంబునం జేసి నన్నుం జంపఁబోకు మనపరాధుల దండించుట ధర్మ్మవే? నావుడు నద్దాని మనుష్యభాషణంబులకు సంతసిల్లి నీ కిజన్మం బెట్లు ఘటించె నుడువు మన నది యిట్లనుఁ దొల్లియేను బ్రాహ్మణుండ, ఖగముఁ డను నొక్క ధరణీసురుండు నాకు మిత్త్రుం డతని నొక్క నాఁడు తృణమయంబగు సర్పంబు నొనర్చి జంకించితి నతండు భయంపడి యగ్నిహోత్రగృహమ్మున డాఁగి వేపమానుండగుచు

"సర్పంబ వగు" మని నన్ను శపించె, నది నిమిత్తంబుగ నేను సర్పంబనై "నాయపరాధంబు సైఁపు" మని వేఁడినఁ "బ్రమతి పుత్త్రుండగు రురునివలన నీకు శాపమోక్షణంబగు" నని యనుగ్రహించె నాతండవునీవకా యని తలంచెద ననుగ్రహింపవే? యనుడు రురువును నట్లొనర్చిన పిదప స్వస్వరూపమ్మున నతం డిట్లనియె. 318

క. రురుమునివర! పాముల నిఁకఁ
బొరిఁగొనఁజూడకుము పరమమునులకు యజ్ఞే
తరకార్యముల "నహింసా
పరమో ధర్మ" యని ధర్మపద్ధతి కాదే. 320

వ. అనుడు నదిమొదలు రురు వకృత్యంబు విడిచె, నీవు క్షత్త్రియుండ వయ్యు బ్రాహ్మణునిపాటియైన వైరంబు సాధింపనైతి. 321

క. పితృవైరము దీర్పని నా
ర్మతులకు సద్గతులు లేవు రాజేంద్రా! య
ప్పతితుఁడు బ్రతికియుఁ జచ్చిన
గతివాఁడే తండ్రి నరకగతుఁడగుకతనన్. 322

ఉ. కావున నీదుతండ్రికి సుఖంబగు సద్గతి గల్గునట్లుగా
భూవర! సర్పయాగమును బూని యొనర్చి సమస్త సర్పవి
ద్రావము చేసి వైరము కరంబు తిరంబుగ నిర్వహింపు మ
ద్దేవికిఁ దృప్తిగా ననుమతింపుము మద్వచనంబు నావుడున్. 323

క. జనమేజయుండుఁ దనజన
కునిదుర్మరణమున కడలు గొల్పుచుఁ గనులం
గొనకొని బాష్పము లొలుకఁగ
మనమునఁ జింతించె మాటిమాటికి నిట్టుల్. 324

క. ఏ నా యనుఁగుంజనకుఁడు
ప్రాణములం గోలుపోయెఁ బాముకతన న
ద్దానికి బదు లొనరింపని
యీ నాజన్మంబు కాల్పనే ? యేమిటికిన్. 327

వ. అని సంజాతక్రోధుండై మంత్రుల రావించి యిట్లనియె. 328

ఉ. ఆగడ మూని మజ్జనకు నత్యమలున్ సుగుణాంచితున్ మహా
భాగు వధించినట్టి ఖలపన్నగజాతిని బట్టి యంబికా
యాగమిషమ్మునన్ హుతవహజ్వలదుగ్రశిఖాపరంపరం
గ్రాఁగఁగఁ జేసి ధన్యతను గాంచి పితౄణవిముక్తిఁ జెందెదన్.

ఉ. అంకితుఁడైన తక్షకుఁడు యాగపశుత్వము గాంచునంట ! యు
త్తంకుఁ డశంకితుం డగుచు దానికి హోతృతఁ గాంచునంట ! రు
ట్పంకిలచిత్తుఁడైన జనపాలకుఁ డీజనమేజయుం డనా
తంకుఁడు కర్తయౌట ! ఘనతన్ జగదంబ ముదంబుఁ జెందదే.

క. పిలువుఁడు భూసురవర్యుల
సలుపుఁడు యజ్ఞార్థమైన సంభారమ్మున్
నిలుపుఁడు గంగాతీర
స్థలమున నొకశాలయున్ శతస్తంభముగన్. 329

వ. మంత్రులును యజ్ఞసంభారమ్ములు సన్నద్ధపఱచుడు నుత్తంక
పురస్సరంబుగా వేదవేదాంగాదిపారగులగు విప్రులు ఋత్విక్కు-
లుగా సర్పయాగం బొనర్చునెడఁ దక్షకుం డిందుప్రాలికిం జని
శరణంబు వేఁడిన నిందుం డభయం బొసంగి తనయాసనమ్మునఁ
గూర్చుండఁ బెట్టికొనుడు నంత నుత్తంకుండును, 330

"సర్పంబ వగు" మని నన్ను శపించె, నది నిమిత్తంబుగ నేను సర్పంబనై "నాయపరాధంబు సైఁపు" మని వేఁడినఁ "బ్రమతి పుత్రుండగు రురునివలన నీకు శాపమోక్షణంబగు" నని యనుగ్రహించె నాతండవునీవకా యని తలంచెద ననుంగరుణింపవే? యనుడు రురువును నట్లొనర్చిన పిదప స్వస్వరూపమ్మూన నతం డిట్లనియె. 3౬౯

క. రురుమునివర! పాముల నిఁకఁ
బొరిగొనఁజూడకుము పరమమునులకు యక్షి
తరకార్యముల "నహింసా
పరమో ధర్మ" యని ధర్మపద్ధతి కాదే. 3౭౦

వ. అనుడు నది మొదలు రురు వకృత్యంబు విడిచె, నీవు క్షత్రియుండ వయ్యు బ్రాహ్మణునిపాటిమైన వైరంబు సాధింపనైతి. 3౭౧

క. పితృవైరము దీర్పని గు
ర్మతులకు సద్గతులు లేవు రాజేంద్ర! య
ప్పతితుఁడు బ్రతికియుఁ జచ్చిన
గతివాఁడే తండ్రి నరకగతుఁడగుకతనన్. 3౭౨

ఉ. కావున నీదుతండ్రికి సుఖంబగు సద్గతి గల్గునట్లుగా
భూవర! సర్పయాగమును బూని యొనర్చి సమస్త సర్పవి
ద్రావము చేసి వైరము కరంబు తిరంబుగ నిర్వహింపు మ
ద్దేవికిఁ దృప్తిగా ననుమతింపుము మద్వచనంబు నావుడున్. 3౭3

క. జనమేజయుండుఁ దనజన
కునిదుర్మరణమున కడలు గొల్పుచుఁ గనులం
గొనకొని బాష్పము లొలుకఁగ
మనమునఁ జింతించె మాటిమాటికి నిట్టుల్. 3౭౪

క. ఏ నా యనుఁగుంజనకుఁడు
ప్రాణములం గోలుపోయెఁ బాముకతన న
ద్దానికి బదు లొనరింపని
యీ నాజన్మంబు కాల్పనే? యేమిటికిన్. 324

వ. అని సంజాతక్రోధుండై మంత్రుల రావించి యిట్లనియె. 325

ఉ. ఆగడ మూని మజ్జనకు నత్యమలున్ సుగుణాంచితున్ మహా
భాగు వధించినట్టి ఖలపన్నగజాతిని బట్టి యంబికా
యాగమిషమ్మునన్ హుతవహజ్వలదుగ్రశిఖాపరంపరం
గ్రాఁగఁగఁ జేసి ధన్యతను గాంచి పితౄణవిముక్తిఁ జెందెదన్.

ఉ. అంకితుఁడైన తక్షకుఁడు యాగపశుత్వము గాంచునంట! యు
క్తాంకుఁ డశంకితుం డగుచు దానికి హోతృతఁ గాంచునంట! రు
ట్పంకిలచిత్తుఁడైన జనపాలకుఁ డీజనమేజయుం డనా
తంకుఁడు కర్తయంట! ఘనతన్ జగదంబ ముదంబుఁ జెందదే.

క. పిలువుఁడు భూసురవర్యుల
సలుపుఁడు యజ్ఞార్థమైన సంభారమ్ముల్
నిలుపుఁడు గంగాతీర
స్థలమున నొకశాలయున్ శతస్తంభముగన్. 328

వ. మంత్రులును యజ్ఞసంభారమ్ములు సన్నద్ధపఱచుడు నుత్తంక
పురస్సరంబుగా వేదవేదాంగాదిపారగులగు విప్రులు ఋత్విక్కు
లుగా సర్పయాగం బొనర్చునెడఁ దక్షకుం డిందుప్రాలికిం జని
శరణంబు వేఁడిన నిందుృం డభయం బొసంగి తనయాసనమ్మునఁ
గూర్చుండఁ బెట్టికొనుడు నంత నుత్తంకుండును, 329

క. అనుగతకోపభరమ్మునఁ
గనలుచును "సహేంద్రతక్షకాయ స్వాహా"
యని యభిమంత్రించిన భయ
మున వాఁ డాస్తీకుఁడనెడి ముని సఖుఁ దలఁచెన్ 3౮౧

క. అకలంకుండు జరత్కా
రుకుమారుఁడు మానిజనవరుఁడు యోగ్యుఁడు త
క్షకహితుఁ డాస్తీకుఁడు రా
జకుమారుని జన్మమునకుఁ జనుదెంచె వెసన్. 3౮౨

వ. జనమేజయుండమ్మునిఁ బూజించి భవద్వాంఛితం బే మని యడు
గుడుఁ దక్షకహితం బాచరించువాఁడై యియ్యాగంబు విరమిం
చుటయ మదభీష్టం బనుడు సత్యసంధుఁడగు జనమేజయుం డా జ
న్నంబు విరమించి పదఁపడి సాత్యవతేయశిష్యుండగు వైశంపా
యనునివలన మహాభారతంబు వినియె. 3౮3

క. వినియుం దృప్తిం జెందక
జనమేజయ నృపతి వ్యాససంయమి వరునిం
గనుఁగొని యిట్లను "ననఘా!
మనమునకున్ శాంతి గల్గు మార్గము సెప్పుమా! 3౮౪

గీ. క్షత్రియుం డగు వానికి సంగరమునఁ
గాని గృహమునఁ గాని యుక్తమగు రీతి
మరణ ముత్తమ మారీతి మరణ మబ్బ
దయ్యె మజ్జనకునకు సౌఖ్యంబు కలదె? 3౮౫

క. కావున మజ్జనకునకు సు
ఖావిర్భావంబు పరమునం దొదవ యశ

శ్రీ వర్ధిల్లఁగ సదుపా
యావహ మగుదాని నాకు నానతి యీవే. ౩౮౬

వ. అని ప్రార్థించు జనమేజయునకు సత్యవతీ తనుజుం డిట్లనియె.

ఉ. పాపహారంబు మోక్షదము భద్రకరంబు పురాణరత్న మ
ధ్యాపక శిష్య నిత్యసుఖదం బగు భాగవతంబు మత్సుతుం
డోపి పఠించె నయ్యది మహోత్తమ మాగమసార మాత్మసం
తాపహారంబు దాని వినినం దుదముట్టు సమస్తమున్ నృపా!

వ. జనమేజయుం డద్దాని నా కెఱింగింపు మని మఱియు నిట్లనియె.

గీ. అనఘ! యాస్తీకుఁడన నెవ్వఁ డతని నెవఁడు
గన్నవాఁడు! మహాత్ముఁ డేకారణమున
నస్మదీయాహియాగంబు నాఁగె నతఁడు
దగఁ దెలిపి మీఁద భాగవతంబుఁ జెపుమ. ౩౯౦

వ. వ్యాసుం డిట్లను జరత్కారు వను నొక ముని దారపరిగ్రహం
బొల్లక యస్ఖలితబ్రహ్మచర్యవ్రతంబు పూని యున్నంత నాతని
పితరు లొకకవనమ్మునం దొక్కెడ నొక గర్తమ్మున వ్రేలుచుం
గననై యిట్లనిరి. ౩౯౧

క. దారం బరిగ్రహింపుము
నారకబాధాపనోదు నందనుఁ గని మ
మ్మారాధింపుము స్వర్గ
ద్వారకవాటమ్ము విప్పఁదలఁపుము నాఁగన్. ౩౯౨

ఆ. వె. నా కయాచితముగ నాపేరు గలయట్టి
కాంత దొరకెనేని గారవించి
పెండ్లి చేసికొనెదఁ బెఱరీతు లేక నొల్ల
ననుచుఁ దీర్థయాత్ర కరిగె నతఁడు. ౩౯౩

ఇది యిట్లుండ నొక్కెడఁ గశ్యపుని భార్య లగు కద్రువ వినతయు ననువార లాదిత్యరథాశ్వంబుం గనుంగొని నలు పనియుఁ దెలు పనియుఁ గొంతవడి చర్చించి యిట్లు పణబంధంబు సల్పికొనిరి.

గీ. నలుపయిన నాకు దాస్యంబు నలుపు మీవు
తెలు పయిన నీకు దాసినై కొలుతు నేను
వాద మిట్లొనరించి యవ్వనిత లింటి
కరిగి యాథార్థ్యమును మఱునాఁ డరయ నెంచి. ౩౯౫

ఆనాఁటిరాత్రి కద్రువ తనయులగు సర్పమ్ములం బిలిచి రవిరథాశ్వరోమంబుల నాక్రమించి కృష్ణవర్ణంబులుగా నొనర్పుఁడని యాజ్ఞాపించిన నంగీకరింపనివారిం గొందఱి జనమేజయ యాగ హుతాశనమ్మునం బడుండని శపియించెఁ గొంద ఱా శాపమ్మునకుఁ దలఁకి శ్వేతవర్ణం బగు నవ్వారువంబును గృష్ణవర్ణంబుగా నొనర్చిరి. మఱునాఁ డా సవతు లిరువురు నట కేగి హయమ్ముం జూచుసంత నల్లనై యున్న వినత యోడి విన్ననై యప్పటు దాస్యం బొనర్చుచుండెఁ గొండొక కాలమ్మునకుఁ గద్రువ తన్నును దన కుమారులను వీఁపున నెక్కించుకొని మోయు మనవుడు శోకార్త యగుచుఁ గుందుచున్న తల్లిం జూచి గరు డుం డిట్లనియె. ౩౯౬

క. రవిసారథి యరుణాహ్వయుఁ
డవిరళ బలశాలి యగు మదగ్రజుఁడుండన్
నవయఁగ నేటికి ? నే నుం
డ వచింపుము శోకకారణము నాతల్లీ ! ౩౯౭

ఆ. వె. తనయు లున్నతల్లియును పెనుసంక్షుంబు
పొందెనేని వారు పుట్టనేల ?

శోకకారణంబు నా కెఱిఁగింపుము
వేగతీర్తు నన్ను వినత పలికె. ౩౯౮

క. ఏమని చెప్పుదుఁ దండ్రీ!
స్వామినిగద! నాకు సవతి సతతం బే నా
భామినికి దాసి నాపైఁ
దా మోయుము నన్నటంచుఁ దరుణి విధించెన్. ౩౯౯

వ. అని దుఃఖించు తల్లికిఁ గొమరుం డిట్లనియె. ౪౦౦

క. అమ్మా! నీబదులుగ నే
నమ్మానిని మోయువాఁడ నడలకు మిఁక నం
చమ్మానశాలి సుతసహి
తమ్ముగ నమ్మగువ భుజగతయయి చెలంగన్, ౪౦౧

వ. మోయువాఁడు సముద్రతీరమ్మున కరిగి పెదతల్లికి వినయమ్మున
మ్రొక్కి యిట్లనియె. ౪౦౨

క. తల్లీ! నీదాస్యము మా
తల్లికి నేరీతిఁ బాయు దయఁ దెల్పుమటం-
చల్లన మ్రొక్కుఁడు గరుడున
కల్లలన విధించె నమృత మర్పించుటకున్. ౪౦౩

క. గరుఁడుం డెంత యటంచు న
మరలోకం బరిగి బాహుమద మడర సుధా
పరిపూర్ణంబగు కుంభ మ
మరుల గెలిచి తెచ్చె గగనమార్గానుగతిన్. ౪౦౪

వ. తెచ్చి యయ్యమృతకుంభంబు పెదతల్లి కప్పగించి తల్లిదాస్యంబు
వాపె నంతఁ దద్భక్షణార్థంబు కాద్రవేయులు స్నానం బొనరింప

నేగుసీలోన నింద్రుం డయ్యమృతకుంభంబు నపహరించె. దాని కాస్తరణంబుగాఁ బఱచినకుశలయం దంటిన యమృతలేశము నాస్వాదించిన కతన వారలకు నాలుకలు చీలికలై రెండయ్యె.

గీ. జననిశాపంబు దవిలిన సర్పములు భ
యమున వాసుకి మొదలుగ నజునికడకుఁ
జని శరణుఁ జెంద నిట్లనె జలజభవుఁడు
కరుణ నెమ్మదినెంతయుఁ గడలుకొనఁగ. ౪౦౬

వ. జరత్కారుం డనుముని తనకు సనామికయగు కన్నెం దక్క నొం డు పడఁతి వరింపనని ప్రతినవట్టినవాఁ డతనికి వాసుకిచెలియ లగు జరత్కారు వనుదానిం బెండ్లిసేయుఁడు ; వా రిరువుర కాస్తీకుం డనువాఁ డుదయించి మిమ్ము రక్షింపం గలాఁ డనవుడు వాసు కియు నతని వెదకి తన చెలియలి నర్పించిన నమ్మునివరుండును వాసుకిం గని నీచెలియలు నాకెన్నం డప్రియం బాచరించు నప్పుడ వీడం గలవాఁడ నని సమయం బొనరించి పరిగ్రహించి వనాంతరమ్మునఁ బర్ణకుటీరం బేర్పఱచుకొని యందు సుఖమ్ము లనుభవించుచు నొక్కనాఁడు కృతభోజనుండై, ౪౦౭

క. నను లేప వలవ దని తన
వనితకు బోధించి యాతపస్వివరుఁడు భా
వి నియతి నయ్యెడఁ దా ని
ద్రను జెందుడు న స్తగిరికి రవియుం జేరెన్. ౪౦౮

వ. ఇట్లు సంధ్యోపాసనాసమయం బగుడు నాపె యిట్లని వితర్కించె.

గీ. నిదుర లేపిన భర్తకు నెదురుసేఁత
లేపకుండినచోఁ గర్మలోప మొదవు

కర్మలోపమ్ము సేయుటకన్న భర్త
కెదురు సేఁతయ వరమని యెంచి కడఁక ౪౧౦

ఆ. వె. అరుణుఁ డస్తగిరికి నరుగుచు నున్నాఁడు
సంధ్య వార్చికొనెడి సమయ మయ్యెఁ
గాన నిదుర లేచి కాల్యకృత్యంబులు
దీర్చికొనుఁ డటంచుఁ దెలివ లేపె. ౪౧౧

వ. లేపిన నమ్మునివరుండును గోపోద్రేకమున నాకెదురు జేసితివి గాన నీకన్నయింటికిం బొమ్ము నాయిచ్చ నే నేగెద ననవుడు భయసంభ్రమాక్రాంతహృదయ యగుచు నమ్మునిం జూచి యయ్యతివ మెల్లన నిట్లనియె. ౪౧౨

క. మాయన్న నీకిడిన సహ
పాయం బిట్లని నెట్లుఫలియించు వృథా
పాయక న్యాయమె యను నా
పాయాలికి భర్త "యస్తి పా" మ్మనిపలికెన్ ౪౧౩

వ. అయ్యతివ పుట్టినింటి కరిగి కొండొకకాలమ్మున కాస్తీకుంగనియె నాతం డికాకారణమ్మున భవన్ముఖంబున కేతెంచి సర్పపక్షపాతి యగుట నీయాగం బాఁగె నీవు నయ్యాగంబు విరమించి మంచి చేసితివని ప్రశంసించి మఱియు నిట్లనియె. ౪౧౪

గీ. భారతం బఖిలము విన్నవాఁడవు
నీయదృష్టం బారులకు వర్ణింపఁదరమె
నీజనకుఁ డొకకరుఁడ కాఁడు నీసుకృతము
వలన నన్వయమది యెల్లఁ బావనంబు. ౪౧౫

క. దేవీయజ్ఞము పేర్మిఁ
గావింపుము భాగవతపుగాథల నెల్లన్
నావలన వినుము శ్రీపర
దేవతకుఁ మించినట్టి దేవత కలదే ? ౪౧౬

క. దేవీపూజకులగు కుల
పావనులకు వృద్ధిచెందు బహుళైశ్వర్య
శ్రీవిజయాయుర్ధాయసు
ఖావిఖ్యాతులును నఖిల మగుభోగములున్ ౪౧౭

వ. కావున శ్రద్ధావంతుండవై దేవీభాగవతంబు వినుము. ౪౧౮

గీ. ఎవరు పరదేవతాపూజ నేవగింతు
వారహో దుఃఖభాక్కులు వారమూర్ఖు
లెవరు పరదేవతాపూజ కిచ్చగింతు
వారహో సౌఖ్యభాక్కులు వార కృతులు. ౪౧౯

గీ. బ్రహ్మ మొదలగు దేవతల్ భక్తి నే జ
గజ్జననిసేవ లొనరించి కాలయాప
నం బొనర్తురో యాజగదంబ పూజ
కిచ్చగింపని మానవుండెవండు జగతి ? ౪౨౦

క. మును భగవతి శ్రీనారా
యణునకు వచియించె నే మహాభాగవతా
ఖ్యానసంగు దివ్యచరిత్రము
వినుమా ! యద్దాన నీయభీష్టము లొలయున్. ౪౨౧

వ. అని సాత్యవతేయుండు జనమేజయునకుం జెప్పెనని సూతుండు శౌనకాదులకుం జెప్పిన వారును వ్యాసుం డెట్లు సెప్పె నెతెం గింపు మనుటయు. ౪౨౨

—* స్కంధాంత పద్యములు *—

క. వీరనవి ప్రేశానను
మారా! ధరారమణమౌళి మండిత పదపం
కేరుహ! గౌరవధీరను
తారామ ద్రావిడాన్వయాభరణమణీ. ౮౨౩

క. దుర్గయశాస్త్రి సహోదర!
భర్గపదాంభోజ యుగళబంభర! రిపుష
డ్వర్గ జయజనితకీర్తి ని
రర్గళ ధారామరాప గాంచితభువనా. ౮౨౮

స్రగ్విణీవృత్తము. పాపమాంబోదరప్రాజ్యపూజ్యోదయా
ప్రాపకీభూతభూపాలదివ్యద్దయా
దీపితాశాంతకీర్తిస్తుతప్రాభవా
వ్యాపృతాన్నప్రదానాన్నపూర్ణాధవా ౮౨౫

గద్య.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీశతావధాని తిరుపతివేంకటేశ్వర ప్రణీతం
బయిన దేవీభాగవతంబను మహాపురాణమునందు
ద్వితీయస్కంధము.

శ్రీపరదేవతార్పణమస్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.



శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ

దేవీభాగవతము

తృతీయస్కంధము

శ్రీకర కడియెద్ద శుభా
ఖ్యాక గ్రామాభిజనన! హారనీహార
శ్రీకలిత దివ్యకీర్తీ!
ప్రాకటగుణ చక్రవర్తి! బ్రహ్మయశాస్త్రీ.

వ. అవధరింపు మక్కథకుండు మునుల కిట్లను నట్లు భాగవత కథనాభిముఖుండగు సాత్యవతేయునకు జనమేజయుం డిట్లనియె. ౨

గీ. వ్యాస! సత్యవతీసుత! భగవతీమ
ఖంబనుచుఁ జెప్పితివి తద్భగవతి యెట్టి
దో యెవరో యెట్టి గుణములతో నెసంగు
నో తదీయ మఖం బెట్టిదో వచింపు. ౩

క. దేవీయజ్ఞము పేర్మిఁ
గావింపుము భాగవతపుగాథల నెల్లన్
నావలన వినుము శ్రీపర
దేవతకుఁ మించినట్టి దేవత కలదే ? ౪౧౬

క. దేవీపూజకులగు కుల
పావనులకు వృద్ధిచెందు బహులైశ్వర్య
శ్రీవిజయాయుర్ధాయసు
ఖావిర్భూతులును నఖిల మగుభోగములున్ ౪౧౭

వ. కావున శ్రద్ధావంతుండవై దేవీభాగవతంబు వినుము. ౪౧౮

గీ. ఎవరు పరదేవతాపూజ నేవగింతు
వారలౌ దుఃఖభాక్కులు వారమూర్ఖు
లెవరు పరదేవతాపూజ కిచ్ఛగింతు
వారలౌ సౌఖ్యభాక్కులు వార కృతులు. ౪౧౯

గీ. బ్రహ్మ మొదలగు దేవతల్ భక్తి నే జ
గజ్జననిసేవ లొనరించి కాలయాప
నం బొనర్తురో యాజగదంబ పూజ
కిచ్ఛగింపని మానవుఁడెవఁడు జగతి ? ౪౨౦

క. మును భగవతి శ్రీనారా
యణునకు వచియించె నే మహాభాగవతా
ఖ్యానసంగు దివ్యచరిత్రము
వినుమా ! యద్దాన నీయభీష్టము లొలయున్. ౪౨౧

వ. అని సాత్యవతేయుండు జనమేజయునకుం జెప్పెనని సూతుండు శౌనకాదులకుం జెప్పిన వారును వ్యాసుం డెట్లు సెప్పె నెఱింగింపు మనుటయు. ౪౨౨

—* స్కంధాంత పద్యములు *—

క. వీరనవి ప్రేశానకు
మార ! ధరారమణమౌళి మండిత షదపం
కేరుహ ! గౌరవధీరను
తారామ ద్రావిడాన్వయాభరణమణీ. ౪౨౩

క. దుర్గయశాస్త్రి సహోదర !
భర్గపదాంభోజ యుగళబంభర ! రిపుష
డ్వర్గ జయజనితకీర్తి ని
రర్గళ ధారామరాప గాంచితభువనా. ౪౨౪

స్రగ్విణీవృత్తము. పాపమాంబోదరప్రాజ్యపూజ్యోదయా
ప్రాపకీభూతభూపాలదీవ్యద్దయా
దీపితాశాంతకీర్తిస్తుతప్రాభవా
వ్యాపృతాన్నప్రదానాన్నపూర్ణాధవా ౪౨౫

గద్య.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీశతావధాని తిరుపతివేంకటేశ్వర ప్రణీతం
బయిన దేవీభాగవతంబను మహాపురాణమునందు
ద్వితీయస్కంధము.

శ్రీపరదేవతార్పణమస్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.



శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

దేవీభాగవతము

తృతీయస్కంధము

శ్రీకర కడియెద్ద శుభా
ఖ్యాక గ్రామాభిజనన! హారనీహార
శ్రీకలిత దివ్యకీర్తి!
ప్రాకటగుణ చక్రవర్తి! బ్రహ్మయశాస్త్రీ.

వ. అవధరింపు మక్కథకుండు మునుల కిట్లను నట్లు భాగవత కథనాభి
ముఖుండగు సాత్యవతేయునకు జనమేజయుం డిట్లనియె. ౧

గీ. వ్యాస! సత్యవతీసుత! భగవతీమ
ఖంబనుచుఁ జెప్పితివి తద్భగవతి యెట్టి
దో యెవరో యెట్టి గుణములతో నెసంగు
నో తదీయ మఖం బెట్టిదో వచింపు. ౨

వ. బ్రహ్మాండోత్పత్తియు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల స్వతంత్రత్వా
స్వాతంత్ర్యములును సురాసురల కాలవశగత్వా వశగత్వమ్ము
లును వారల యుత్పత్తులును వారల శరీర విచారమ్మును సవిస్త
రమ్ముగా నానతిమ్ము నావుడు సాత్యవతేయుం డిట్లనియె. ౪

గీ. కఠినమగు ప్రశ్న మొనరింపఁ గడఁగి తీవు
దీని కుత్తరమును సావధానముగ వ
చించెదను మున్ను నారదుచెంత కరిగి
యడిగితిని గంగ యొద్దున నమ్మహాత్ము. ౫

క. ఈ సకల బ్రహ్మాండము
చేసినవాఁడెవఁడు ? తెలియఁ జేయు మసత్యం
బో ? సత్యమొ ? బహుకర్తృక
మో ? సకలమ్మునకుఁ గర్త యొకఁడో మహాత్మా ! ౬

వ. కొందఱు శంకరుండనియుఁ గొందఱు నారాయణుండనియు
విరించియనియు సూర్యుండనియు వాసవుండనియు వరుణుం
డనియు యముండనియుఁ గుబేరుండనియుఁ బావకుండనియుఁ
బవనుండనియు సోముండనియు గణేశ్వరుండనియు ననేకు లనేక
ప్రకారమ్ముల జగత్కారణంబు వచియించుచుందురు. మఱికొం
దఱు వారాహియు నారసింహియు మహాలక్ష్మియు శాంకరియు
బ్రాహ్మియు వాసవియు వారుణియు నా ననేక నామంబులు
గల యదియు సనాతనియు ననాదినిధనయు సర్వ వ్యాపినియుఁ
బురుషానుగతయు నాదిమాయయుఁ ద్రిగుణాతీతరూపయు గుణ
విస్తారకారిణియు నిర్గుణయు సగుణయు నగు పరదేవతయ
సకల కారణంబని చెప్పుదురు. మఱికొందఱు నిరంజనమ్మును
నిరాకారంబును నిర్లేపమ్మును నిర్గుణంబును నగు తేజంబని

చెప్పుదురు. మఱికొందఱు వేదోపనిషత్ప్రతిపాదితుండగు తేజోమయుండని యందురు; కొందఱు సహస్రనయనుండును సహస్రశీర్షుండును సహస్రకరకర్ణుండును సహస్రపదుండును నగు పురుషోత్తముం డనియుం గొందఱు విరజంబును విరాజంబును శాంతంబునగు నాకాశంబని యందురు. మఱికొంద ఱనిశ్చిత బ్రహ్మవాదులును గొంద ఱనీశ్వరవాదులును గొందఱు స్వభావవాదులును గొందఱు ప్రకృతి కర్తృత్వ వాదులును నై యుంటంజేసి సందిగ్ధంబగు నిమ్మహావిషయమ్మున మనంబు డోలాయమానంబగుచున్నయది ధర్మాధర్మంబులు నిర్ణయింప నశక్యమ్ములు ధర్మవంతులును సత్త్వగుణోత్పన్నులు నగు దేవతలు పాపాత్ము లగు రక్కసులచేఁ బీడింపఁబడుటయు ధర్మాత్ములును సదాచారులును నగు పాండవులు కష్టముల పాలగుటయుం గనుంగొన ధర్మమ్మునకు వ్యవస్థ గానరాకున్నయది. నా సంశయచ్ఛేదం బొనరింపుమనవుడు, ౭

క. నారదుఁడు వచించిన తెఱ
గారసి వివరింతు నీకు ననఘా! చేతో
ధీరత నాకర్ణింపుము
పారంగతుఁడైన యట్టి పండితుఁ డున్నే? ౮

క. నారదుఁడు శంక మదిఁ జె
న్నారఁగ నొకనాఁడు నీరజాసను నడుగన్
గారాబ మెసఁగ నతఁడు గు
మారునకుం జెప్పినట్టి మార్గము వినుమా. ౯

వ. కుమారా! భవదీయప్రశ్నంబు దుర్బోధం, బయ్యది వివరింప నస్మదాదులకె కాక విష్ణువునకుఁ గూడ నసాధ్యంబైనను నాయెఱింగి నంతవట్టు వివరించెద విను మని యిట్లనియె. ౧౦

గీ. మున్ను సకలంబు సంద్రమైయున్న తఱిని
భూతములు పుట్టె నేను కంజాతమందుఁ
బొడమితిని బొడమియు నలుగడలు చూడ
నర్ణవము దక్క వేఱొక్కఁ డరయరాదు.

క. ననుఁ బుట్టించిన ఘనుఁ డే
యనఘుఁడొ యిప్పంకజమున కాధారం బే
మని నిశ్చయింతు నీజల
ము నిలుచుకత మేమొ! యనుచు మోహమయుఁడనై.

గీ. పుడమిపై నీరు నిల్చుట పొసఁగు నట్టి
పుడమి నల్గడలను జూడఁబడ దటంచు
వనధి నీఁదుచు నొకవేయివత్సరములు
వెదకుచున్నంత నాకాశవీధియందు. ౧౩

గీ. "తప తప" యటంచు నొకమాట దరలుటయును
వేయిసంవత్సరమ్ము లత్యాయతముగఁ
దపము సల్పితి నేం జేమి దలఁపకుండ
జలగతంబగు నల జలేజాతమందు. ౧౪

వ. పిదప "సృజ" యను నొకపలుకంబరమునుండి వెడలె దానిని విని "యే నేమి సృజింతు?" నని యాలోచించుచున్నంత మధుకైటభు లను రక్కసులు యుద్ధసన్నద్ధులై నను భయపెట్టుడుఁ బద్మనాళం బవలంబించి తజ్జలమ్మున మునిఁగి, ౧౫

సీ. కారుకమ్ముల నేలఁగల డాలు గలవాని
బంగారువల్వ మైఁ బరఁగువాని

నెల్లలోకము లేలునెసకంబు గలవానిఁ
జల్లచూపులు వెదఁజల్లువాని
పాపరాపాన్పుపైఁ బవ్వళించినవాని
వనమాల గళమునఁ దనరువాని
యోగనిద్రామహాభోగంబు గలవానిఁ
జలన మింతయులేక యలరువాని

గీ. శంఖచక్రగదాముఖసాధనములఁ
దవిలి చెలువారు నాల్గుబాహువులవాని
నద్భుతమ్మున కాస్పదం బైనవానిఁ
గంటి నొకదివ్యపూరుషుఁ గఱవు దీఱ. ౧౬

వ. కని యోగనిద్రాస్వరూపిణి యగు నద్దేవిని వినుతించిన నామెయు నతని శరీరంబు విడిచి దివ్యవిగ్రహయై నభమ్మున నిలిచె నంత నతండును మేల్కాంచి సన్నద్ధులగురక్కసులఁ దనయూరుభాగమ్మున వధించునంతలో రుద్రుండును నట కేగుదెంచుడు నేము ముగురము నప్పరదేవతం బ్రార్థించుటయు నాపె దయాంతరంగయై యిట్లనియె. ౧౭

గీ. హరిహరబ్రహ్మలార ! మీయంత మీ ప
నులను నెఱవేర్చి కొనుఁడు చనుండు మీకుఁ
దగునివాసమ్ములను జెందఁదగు నశేష
జగము సృష్టింపనగు నాల్గు తెగలు గాఁగ. ౧౮

గీ. అనెడి జగదంబ పలుకుల నాలకించి
యిట్టు లంటిమి సందియం బినుమడింప
భూమి లేదయ్యె జలము ప్రభూత మయ్యె
నంబ ! యేగతి సృజియింప నగునొ ? చెప్పుమ. ౧౯

గీ. భూతములు గుణతన్మాత్రములును నింద్రి
యమ్ములును నలవడినఁ జేయంగ నగును
గాని యూరక సృష్టింపఁగాఁ దరంబె ?
యనుడు జగదంబ చిఱునగ వినుమడించె. ౨౦

ఆ. వె. అంత నరుగుదెంచె నటకు విమానంబు
గగనతలమునుండి కడురయమున
నంబ చిత్రమొకటి యగుపడఁ జేసెద
దీని నెక్కుఁ డనుచుఁ దెలుపుటయును, ౨౧

వ. ఏము నాపె యానతింజేసి నవరత్నమండితంబును ముక్తాదామ
భూషితంబును గింకిణీసంకులితంబునగు విమానం బధిష్ఠించిన
నంబిక యద్దాని మనోవేగంబున నడునంపఁజేసె నంత సయ్యాది జలధి
భిన్నంబై మనోజ్ఞంబైన కొండొక ప్రదేశమ్మునకుం జనియె
నచ్చట, ౨౨

—* బ్రహ్మాది దేవతలు భువనేశ్వరిం గాంచుట *—

సీ. కోకిలాకాకలీవ్యాకులీకృతఫల
త్ఫలవినమోద్యానపాదపములు
సుందరీసుందరానందబంధురమంది
రప్రాంతదీపప్రసరఃప్రతతులు
ప్రాకారశోభిదివ్యాకారమణిమండి
తాకాశతలచుంబిహర్మ్యతతులు
సంగీతభంగీమృదంగరంగద్రంగ
కోటిభాసురవేశవాటికలును

గీ. యజ్ఞశాలలు మఱియు దేవాలయములు
గలుగు పురవరమును దాని కెలన వనము

నందు వేఁగాడు నొక రాజనందనుఁడును
గానఁగా వచ్చెఁ గన్నులకఱవు దీఱ. ౨౩

వ. మా మనంబున నయ్యది స్వర్గంబను ప్రత్యభిజ్ఞ యుదయించె. పదఁపడి యియ్యది యెవరిచే నిట్లు నిర్మితంబయ్యెనని యెంచు నాలో విమానంబు మఱియొక్కెడ కరుగుడు, ౨౪

క. నందనమను వనమును దా
నం దగు కల్పకముకడఁ గనందగు నందం
బొందిన నందిని తల్లియు
నందంద చరించునట్టి యైరావణముఁ. ౨౫

గీ. అచ్చరలఁ గూడి తమ యిచ్చవచ్చినట్లు
సంచరించెడి గంధర్వ సంచయంబు
సురలును పులోమజనుగూడి సొక్కి నిందుఁ
డును యమ కుబేరముఖులును గనఁగనైరి. ౨౬

వ. అత్యాశ్చర్యపర్యాకులచిత్తులమై యచ్చోటు విడిచి యరుగుటయు బ్రహ్మలోకంబు గనవయ్యె. హరకేశవులు నన్నుంజూచి యిచ్చట బ్రహ్మ యొక్కఁడు గన్పట్టు నితం డెవ్వఁ డనవుడు నిట్లంటి. ౨౭

క. ఆ వేధయు నా వేదము
లావిభవము లెట్టివియొ మహామహులారా!
యావంతయు నెఱుఁగను నే
నే వాఁడనో తెలియరా దిఁకేమనవచ్చుఁ. ౨౮

వ. పిదప విమానంబు మఱి యొక్కెడ కరుగుటయు, ౨౯

ఉ. నారద ! యేమి సెప్పుదుఁ గనంబడె నచ్చట వెండికొండ సు
శ్రీరుచిరంబుగా నచటఁ జెన్నలరారు మణీనికేతన
ద్వారమునుండి శంభుఁడు సదారసుతప్రమథుండు కృత్తివా
సోరుచిరుండు వెల్వడియె సొంపగురీతిని గోతురంగుఁడై. ౩౦

తే. గీ. మాతృకలతోడ సంశయమగ్నమాన
సుండనై యయ్యెడల నేను జూడఁబడితి
"నింతకన్నను జిత్రమెుండేమికల" ద
టంచు విస్మయపడునంత నదియు మరల. ౩౧

గీ. అరిగె నింక నొక్కెడ కట నరయనయ్యె
నిందిరా సుందరీనాథు మందిరంబు
నిరుపమానంబు వైకుంఠపురవరంబు
దానిఁగని విస్మయంబందె దానవారి. ౩౨

క. అతసీ కుసుమశరీరుఁడు
చతుర్భుజుఁడు శంఖచక్రశార్ఙ్గగదాభూ
షితుఁడు రమారమణీ సే
వితుఁడు విరాడ్వాహనుండు విష్ణువగుపడెన్. ౩౩

ఆ. వె. అతనిఁ జూచి యతులి తాశ్చర్యకలితుల
మగుచు నొక రొకళ్ల నరసి కొనుచు
నున్నయంత నదియు నున్నత వేగంబు
గడలుకొనఁగఁ బాలకడలి కరిగె. ౩౪

సీ. యాదోవిశేష దీవ్యత్తుంగ తరతరం
గావళీశీకరా సేవితంబు

నానావిచిత్ర చిత్రానూనదివ్యాస్త
రణరంగ వేదికారాజితంబు
కలితముక్తాదామ కలనాభిరామ భా
మహిత మందిరకోటి మండితంబు
పారిజాతాది విభ్రాజమాన లతాంత
దంతురానంత పాదపయుతంబు

తే. గీ. గంధలోభభ్రమన్మధుకర విరావ
భరిత మగు దీవియొండు దృక్పథము నందె
నందు సుమనోహరమును శివాకృతియును
నైన పర్యంకమును గంటి మవల నొకట. 37

గీ. మణిమయం బగు పర్యంక మధ్యమందుఁ
జెలులు చెలువారఁ గొలువున్న యలరుఁబోఁడి
ననుపమానంత దివ్య కళ్యాణ రూపఁ
గంటి మా రూపమును జెప్పఁగాఁ దరంబె. 38

సీ. అరుణాంబరమునఁ జెన్నలరారు వగలాఁడి
యెఱుపైన యధరోష్ఠ మెసఁగుబోటి
కావిపూల్ గల మాలికలు ధరించిననాతి
రక్త గంధంబూను రంగులాఁడి
శోణంబులగు నేత్రకోణముల్ గలకొమ్మ
యౌవనమధ్యస్థ యైనచాన
తొలకరిమించుతోఁ దులదూఁగునెలనాగ
యర్కబింబస్ఫూర్తి నలరుకలికి

గీ. యిందిరాకోట్ల నెదురించు మందయాన
ప్రతిపదమ్మును దయఁ జిమ్ము పద్మనయన

మందమందస్మితం బొప్ప సుందరాంగి
యెన్నఁడును జూడఁబోని దయ్యిందువదన. ౩౭

క. బిసరుహాముకుళమ్ముల పస
గసిమసఁగెడి గుబ్బదోయి గడలుకొనఁగ సొం
పెసఁగు మణిభూషణము లిం
పెసలార నెసంగె సర్వశృంగారముగన్. ౩౮

గీ. అరసి "హ్రీంల్లేఖ భువనేశి" యని జపించు
నమరకన్యక లిరుగడ నమరఁగా న
నంగకుసుమాది దేవీసనాథ యగుచుఁ
దనరె షట్కోణ యంత్రిమధ్యమ్మునందు. ౩౯

క. వదలక హ్రీంకార జపం
బెదఁ బొదల నెసంగు పక్షిబృందము చుట్టాం
గదియఁగఁ జాపాది మహా
యుధమ్ములు ధరించి యెసక మొప్పెడిదానిన్. ౪౦

చ. కనుఁగొని విస్మయం బొదవఁగా "నెవరో" యని సంశయించు నం
తన యొక వేయివేయి నయనంబులు మోములుఁ జేతులుం దగన్
గనుపడె నామహామహిమ కన్నది విన్నది గాదు దాని నే
మనియును జెప్ప గిప్పఁ దగదయ్య యొకించుక యేని నారదా!

గీ. అచ్చరయుఁ గాదు వేలుపుమచ్చెకంటి
గాదు గంధర్వియును గాదుగా! యటంచు
సంశయించెడి మముఁ గాంచి సరసిజాక్షుఁ
డిట్లనియెఁ గొంత విజ్ఞాన మెసకమెసఁగ. ౪౧

ఉ. ఈ జగదంబయే మనల నెల్ల సృజించినతల్లి, యీ మహా
తేజము యల్పబుద్ధులకుఁ దెల్లము గానిది, మాయ యన్న యీ
శ్రీజనయిత్రియే, జగమశేషము నిండిన దీ పరాంబయే
తేజుల కెల్లఁదే జొసఁగుతే జన నీజగదేకనేత్రియే. ౪౩

గీ. ఈమెయే సర్వలోకంబు సృష్టిఁజేసి
పెంచి హరియించు నీమెయే వేదగర్భ
యీమెయే సర్వబీజమయియును విశ్వ
నాయికయు నీమెయే సదానందమూర్తి. ౪౪

క. ఇరుగడలఁ బరిచర్యా
పరత మెఱయ భూషణములువఱల విభూతుల్
పరఁగెడి గోట్లకొలఁది నా
సరణిం జూడుఁడు విరించిశంకరులారా! ౪౫

క. ఎంతతపము చేసితిమో
యెంతటి ధన్యులమొ కాని యీభగవతి న
త్యంతముఁ గనుఁగొని ముదిత
స్వాంతుల మైనార మిదియు సామాన్యంబె. ౪౬

చ. తపసులు గాంచలే రతివదాన్యులు చూడఁగ లేరు భార్గవీ
చపలమృగాక్షి యాదియగు సర్వనిలింపసతుల్ శతాంశమం
దుపమకు రారు తత్సుకృతయోగము నెన్నఁ దరంబె? పూర్వపు
ణ్యపుఁబరిపాక మెట్టిదొ కదా! కన నయ్యెఁ బ్రపంచమాతృకన్.

గీ. మున్ను బొటవ్రేలుగుడిచెడి చిన్ననాఁడు
నన్ను నుయ్యెలలో నుంచి సన్నమైన
యెలుఁగలరఁ బాటలను బాడి యేడ్వకుండఁ
గాచి ప్రోచినతల్లి యీకన్నతల్లి. ౪౭

గీ. ఇంతసేపు పరీక్షించి యెనరయఁగ
వెనుకఁ గనుగొన్న సంగతి విశదమయ్యె
మాట లిఁక వేయునేల యీమాత మనలఁ
గన్న జగదంబ లే రీమెఁ గన్నవారు. ౪౯

వ. అట్లగుట మన మీ పరదేవతా సమీపమ్మునకుఁ బోయి ప్రణు
తించిన మన యభీష్టమ్ము లొసంగుఁ; గాదని దౌవారికులు వారిం
చిన ద్వారమందె నిలిచి నుతింపం గడంగుద మను పల్కులకు
సమ్మతించి విమానంబు డిగ్గి తద్ద్వారసమీపమ్మునకుం బోవుడు
మమ్ముఁ గాంచి జగదంబ చిఱునగవొనర్చుటయు మూఁగుర
మును స్త్రీలమై తత్సన్నిధికిం జని నమస్కరించి యన్యోన్య
వనితారూపమ్ము లరసికొనుచుఁ గోటి సూర్యప్రతీకాశంబును
నానా మణిస్థగితంబునునగు తత్పాదపీఠమ్ము నవలోకించు
చున్నంత, ౫౦

క. కొందఱు రక్తాంబరలును
గొందఱు నీలాంబరలును గొనకొని యాపెన్
సుందరులు గొల్చుచుండిరి
కొందఱు పీతాంబరలును గోట్లకొలఁదిగన్. ౫౧

క. ఈడును జోడునుగల విరిఁ
బోఁడులు నానావిచిత్రవిభూషణముల సొం
పీడేర నాపె ముందటఁ
బాడుదు రాడుదురు కనులపండువు గాఁగన్. ౫౨

ఉ. నారద ! యేమి సెప్పుదు వినన్ గనరాని విచిత్ర మంబికో
దార రుచిప్రసన్ననఖదర్పణమందు నినున్ సనున్ శివున్
నీరజనాభునిన్ ధరణి నీరజమిత్రుని నీరజారినిన్
వారిధిపర్వతాదుల నవారణఁ జూచితి మొక్కపెట్టుగన్. ౫౩

వ. మఱియు మహాసముద్రంబులును పర్వతంబులును సర్వాశ్రయంబగు నచ్యు
తుండును సప్తసముద్రంబులును సరిత్తులును దిక్పతులును త్రయస్త్రింశత్కోటి
దేవతలును మహర్షిగణంబులును ఋషిపుంగవులును హాహాహూహూ
ప్రముఖగంధర్వులును రంభాదులగు నప్సరలును కైలాసాది
లోకంబులును మున్నుగాఁగల యావత్ప్రపంచమును జూచి పర
మాశ్చర్యభరితులమై యీమె జగజ్జననిగా నామె నిశ్చయించు
కొంటిమి. ౯౪

గీ. అమృతమయమగు నాద్వీపమందు లోక
జననిఁ గనుఁగొని మోహాబ్ధి మునుఁగుమాకు
క్షణముగా నొకనూఱుసంవత్సరము లరిగెఁ
నత్సుఖంబును వర్ణింపఁ దరము గాదు. ౯౫

క. సమముఁ జెలికత్తెల మని యా
ప్రమదామణు లెల్లఁ బేర్మి బయలుపడఁగ శ్రీ
క మనములం దుంచక నే
ర్మిమెయిన్ గౌరవము చేసి మెలఁగిరి పిదపన్. ౯౬

—* హరిహరబ్రహ్మలు భువనేశ్వరిని నుతించుట *—

క. ఒకనాఁడు భక్తి నా యం
బిక నాలోకైకమాత విశ్వజగత్ప్రా
పకమహిమఁ గాంచి విష్ణువు
ప్రకటగతి నుతించె నిట్లు బద్ధాంజలియై. ౯౭

సీ. కామదాయిని! దేవి! కళ్యాణి! ప్రకృతి! వి
ధాత్రి! లోకేశ్వరి! దండమమ్మ
సచ్చిదానందాత్మ! సంసారకారిణి!
కలుషహారిణి! నమస్కారమమ్మ

షంచకృత్యవిధాత్రి ! పరదేవి ! యర్థమా
తార్థభూతాత్మ ! జోహారులమ్మ
హృల్లేఖ ! సంసిద్ధి ! వృద్ధి ! కూటస్థ ! నా
నాస్వరూపాత్మ ! వందనములమ్మ

తే. గీ. జగముసృష్టించి పురుషుని కగపడంగఁ
జేసి యానంద మొనగూర్తు శ్రీమహేశి !
తల్లి ! యిరువదిమూఁడుతత్త్వముల వెల్గు
దిందజాలంబు నా మాకు నింపుగూర్ప. ౫౮

గీ. స్వప్రభావమ్ముకలిమి విశ్వమ్ముఁ జూచు
వాత్మతేజమ్ముచే జగ మలరఁజేయు
దంబ ! కల్పాంతకాలమ్మునందుఁ గూడ
నుంచు వెవ్వాఁడెఱుంగు నీచందమెల్ల. ౫౯

గీ. జనని ! మధుకైటభాఖ్యరాక్షసులచేత
మడియ కుండఁగ రక్షించి మాను లోకు
మెల్లఁ గనుపడఁ జేసిన తల్లివీన
నీమదర్శనమదియు వర్ణింపఁ దరమె ? ౬౦

క. ఏనును బ్రహ్మయు రుద్రుఁడు
గానంగా లేము నీయఖండమహత్త్వం
బే నరునకు శక్యం బగుఁ
బూని కనుంగొనఁగ నీయపూర్వపుఁజరితల్. ౬౧

క. హరిహరకమలజులను హరి
హరకమలజులకును జూపి తంబరో ! నీదా
చరితం బెఱుఁగం దరమే
పరమాద్భుతసుప్రభావభావ్యము తల్లీ. ౬౨

గీ. శ్రీ[illegible] నిను సేవించుకోటిసకలను
సింహవాహనంబు నామము నిలుచు టొకటి
నోట భవానీయు నామంబు నుడువు టొకటి
అంబ ! యీరెండె తుది నిన్నుపు వరయు టొకటి. ౬౩

గీ. ఇంక నాభృత్యుఁడను బుద్ధిపెట్టి నన్నుఁ
పాలనము సేయవలెనమ్మ పరమకృపను
పామరుఁడ నేను వచియించు పలుకులందు
నేమనికి వచ్చినంత మన్నింపుమమ్మ. ౬౪

సీ. నీము సృష్ట్యాదికిం బినుచుడించుట కల్ల
ధనవిచ్ఛ మామీఁదఁ బ్రబలకున్న
ధాత్రి సమస్తంబు ధరియించు టది కల్ల
యాంధారశక్తి ప్రాపదకున్నఁ
గంతహెంతుఁడు ప్రకాశించుటయుఁ గల్ల
తానక తేజంబు దవులకున్న
సకలజంతువులును సంచరించుట కల్ల
నీశక్తిమొక్కింత నెగడకున్న

గీ. బ్రహ్మ మొదలుగ నఖిలప్రపంచములు న
నిత్యములుగాన నెల్లప్డు నెగడనేర
వఖిలమైనట్టి ప్రళయమ్ములందుఁగూడ
నిత్య వీ వొక్కతెవె భవానీ ! మదంబ ! ౬౫

గీ. విద్యగల బుధవర్యులవిద్య వీవ
కీర్తిగల పుణ్యమూర్తుల కీర్తి వీవ
శక్తిగల దివ్యశక్తుల శక్తి వీవ
యంబ ! పలుమాటలేల గాయత్రి వీవ. ౬౬

పంచకృత్యవిధాత్రి ! పరదేవి ! యర్థమా
త్రార్థభూతాత్మ ! జోహారులమ్మ
హృల్లేఖ ! సంసిద్ధి ! వృష్టి ! కూటస్థ ! నా
నాస్వరూపాత్మ ! వందనములమ్మ

తే. గీ. జగముసృష్టించి పురుషుని కనఁబడఁగఁ
జేసి యానందమొసఁగూర్తు శ్రీమహేశి !
తల్లి ! యిరువదిమూఁడుతత్త్వముల వెల్గు
దింద్రజాలంబు నా మాకు నింపుగూర్ప. ౫౮

గీ. స్వపరిభావమ్ముకలిమి విశ్వమ్ముఁ జొచ్చి
వాత్మతేజమ్ముచే జగ మలరఁజేయు
దంబ ! కల్పాంతకాలమ్మునందుఁ గూడ
నుండు వెవ్వాఁడెఱుఁగు నీచందమెల్ల. ౫౯

గీ. జనని ! మధుకైటభాఖ్యరాక్షసులచేత
మడియ కుండఁగ రక్షించి మాకు లోక
మెల్లఁ గనుపడఁ జేసిన తల్లివీవ
నీదుదర్శనమదియు వర్ణింపఁ దరమె ? ౬౦

క. ఏనును బ్రహ్మయు రుద్రుఁడు
గానంగా లేము నీయఖండమహత్త్వం
బే నరునకు శక్యం బగుఁ
బూని కనుంగొనఁగ నీయపూర్వపుఁజరితల్. ౬౧

క. హరిహరకమలజులను హరి
హరకమలజులకును జూపి తంబరో ! నీదౌ
చరితం బెఱుఁగం దరమే
పరమాద్భుతసుపరిభావభావ్యము తల్లీ. ౬౨

గీ. కోరంగాఁ బోను నేనింక నేకోరికలను
నీమహామంబు నామది నిలుచు టొకటి
నోట భవదీయ నామంబు నుడువు టొకటి
యంబ! యాచింతు నిన్నెపు డరయు టొకటి. ౬౩

గీ. నేను నాభృత్యుఁడను బుద్ధి వెట్టి నన్నుఁ
బాలనము సేయవలెనమ్మ పరమకృపను
పామరుఁడ నేను వచియించు పలుకులందు
నీమదికి నచ్చినంత మన్నింపుమమ్మ. ౬౪

సీ. ఏము సృష్ట్యాదికం బినుమడించుట కల్ల
భవదిచ్ఛ మామీఁదఁ బ్రబలకున్న
ధాత్రి సమస్తంబు ధరియించు టది కల్ల
యాధారశక్తి ప్రాపందకున్నఁ
గ[…]తహితుఁడు ప్రకాశించుటయుఁ గల్ల
తావక తేజంబు దవులకున్న
సకలజంతువులును సంచరించుట కల్ల
నీశక్తి యొక్కింత నెగడకున్న

గీ. బ్రహ్మ మొదలుగ నఖిలప్రపంచములు న
నిత్యములుగాన నెల్లప్డు నెగడనేర
వఖిలమైనట్టి ప్రళయమ్ములందుఁగూడ
నిత్య వీ వొక్కతెవె భవానీ! మదంబ! ౬౫

గీ. విద్యగల బుధవర్యుల విద్య వీవ
కీర్తిగల పుణ్యమూర్తుల కీర్తి వీవ
శక్తిగల దివ్యశక్తుల శక్తి వీవ
యంబ! పలుమాటలేల గాయత్రి వీవ. ౬౬

ఉ. ఆగమముల్ ద్విజామరహితార్థము చేసినతల్లి వీవ మో
క్షాగమమూల మీవ జగదాదివి నీవ స్వధాస్వరూప మీ
వే గతివీవ సర్వమునహించెడిదానవు నీవ స్వాహ నీ
వాగమవేద్య వీవ జగదంబ! మదంబ! కదంబవాసినీ. ౬౭

తే. గీ. అబ్ధికిఁ దరంగములయట్టు లాదిపూరు
షాంశములు జీవులగుట లోకాంబ! వారి
బంధనిర్ముక్తి కఖిలప్రపంచసృష్టి
సల్పుదువు స్వార్థమిందు లేశంబు లేదు ౬౮

గీ. జీవుఁ డెప్పుడు తెలివిని జెందు నపుడ
లేనియట్లొనరింతు వీ లీలలెల్ల
నాట్యమొనరించి యామీద నర్తకుండు
మించు తత్తత్కృతుల విరమించునట్లు. ౬౯

ఉ. ఎల్లపుడుం భవచ్చరణమే శరణం బని నమ్మినాఁడ నో
తల్లి! దురాపమైన పరితాపము తీరదు సయ్యనేని నా
నుల్లమునందు వేళాకనియోజ గణింపక యుద్ధరింపు ము
త్ఫుల్లసరోజలోచనసముల్లసదుచ్ఛదయాసుధార్ణవీ. ౭౦

క. అంబ! భవచ్చరణాబ్జయు
గంబునకుం మ్రొక్కెడుదు నఖండతరజ్ఞా
నం బొసఁగి కన్న తనుజా
తుం బలె రక్షింపుమీ కుతుక మొప్పారన్. ౭౧

వ. అని నానాప్రకారంబుల నుతించి విరమించుడు హరుం డిట్లని
నుతింపం దొడంగె. ౭౨

గీ. త్వత్ప్రభావంబున హరి తనరెనేని
బ్రహ్మయును నీదుకార్యమై పరఁగెనేని
నేను మాత్రము నీకుఁ గాదృశుఁడఁ గాక
యన్యుఁడనె చెప్పుమమ్మ లోకైకజనని. ౨౩

గీ. జనని ! భూమ్యాదిభూతపంచకము నీవ
త్వక్కు మొదలగు నింద్రియపంచకంబు
నీవ బుద్ధియుఁ జిత్తంబు నీవ మనము
నీ యహంకార మఖిలంబు నీవ కావె ? ౨౪

గీ. హరిహరాదులు జగమున కాదిభూతు
లనుచు నేవారు వచియింతు రల్లవారు
తెలియనేరని మూర్ఖులో దేవదేవి !
వారు జనియించు టెల్ల నీవలనఁ గాదె ? ౨౫

గీ. సవిషయమ్ములు సగుణమ్ము లవని మొదలు
గాఁ గలుఁగు భూతములచే జగంబు పుట్టు
నది స్ఫుటంబగుటకు భవదంశ మొక్క
యించుకేనియు లేకున్న నెట్లు పొసఁగు ? ౨౬

క. నీ వజవిష్ణుశివాకృతి
భావమునం జేసి జగము ప్రబలించియు నా
పై వెలుఁగ మతిగల్గిన
నావర్జించెదవు నీకు నడ్డముకలదే ? ౨౭

గీ. ఏము సృష్ట్యాదుల కొకింతయేని శక్తి
గనుట కూహింపఁగా ముఖ్య కారణంబు
సకలలోకాంబ ! తావకచరణనళిన
రాజమానాసమాన పరాగగరిమ. ౨౮

క. భవదీయదయావైభవ
సువిహితము తమోగుణంబు చొప్పడె నాకుఁ
శివదాయిని! సత్త్వము కే
శవునకును రజోగుణంబు జలజభవునకుఁ, ౭౯

క. ధనికు లధనికులు నృపులు త
దనుచరులు మొదలుగ నగు ననంతంబగు భే
దనియతిఁ జొప్పడు జగమిది
జననిరో! భవదీయమతి విషమ మగుటఁ గాదా? ౮౦

గీ. జనని! యెన్నంగ సత్త్వరజస్తమములు
త్వద్గుణము లు సృష్ట్యాదినిదానములగు
హరిహరవిరించుల మము సృష్ట్యాదులకు ని
మిత్తమాత్రమ్ముగా వినిర్మించితీవు. ౮౧

ఉ. అంబ! విమానసంగతులమై చనుదెంచిన మా త్రయంబులో
నంబుజనాభుఁ డీజగమునంతయుఁ జేసినవాఁడొ! లేక యీ
యంబుజసూతి చేసెనని యందునొ! నే ననుకొందునో! సమ
స్తంబు భవద్విలాసకలితంబు నవం బొకయింత యున్నదే? ౮౨

గీ. ఈవ సృజయింతు పాలింతు విచ్చపోడ(?)ను
నేని యఖిలమ్మును హరింతు వెల్లవేళ
స్వపతియగు పూరుషుని మోదసంగతునిఁగఁ
జేయుదువు నీవిలాస మజ్ఞేయ మంబ! ౮౩

ఆ. వె. ఆఁడుజన్మమైన నది యభీష్టమమాకు
నీదుసేవనంబు నెగడెనేని
గాన నెల్లవేళఁ గరుణించి యిటులుంచు
మంబ! పురుషభావ మధికమగునె? ౮౪

ఉ. తల్లి ! భవత్పదద్వయము దక్క మఱొక్కటి నొల్లఁ ద్వత్పదో
త్ఫుల్ల సరోజ సౌరభసుపూరము గ్రోలక యున్నచోఁ ద్రుటుల్
క్షణములునాఁ గల్పములుగాఁ గనుపట్టు నహర్నిశంబు ని
న్నొప్పికి యన్యుల గొలుచుయోగులు నిక్కము దైవవచింతుల్.

క. అంబ ! పృచ్ఛమాటల లా
భాషేమి ? యనుగ్రహించు భావంబది నీ
కుం బోధించెనని నీ మం
త్రంబు నవాక్షరము నాకు దయసేయఁదగున్. ౮౬

క. అను శిష్యుఁ గరుణించి జగ
జ్జనని నవాక్షర మఖండసత్త్వము మంత్రం
బును నుచ్చరించె దానిం
గొని ప్రణతిం గొలిపి ముదముగొని యతఁడుండెన్. ౮౭

వ. అంత నేనును భక్తిపరవశుండనై యిట్లు నుతించితి. ౮౮

క. నిను నిర్వచింప శ్రుతి నే
ర్చుఁ దేనిన్ జెప్పుకున్న ? శ్రీంకరి ! స్వాహా
యనుట మఖాదుల నినుఁ
గూర్చినదే సర్వజ్ఞవీవె త్రిభువనజననీ ! ౮౯

ఉ. ఏ నొనరించువాఁడ జగమెల్లను నాకుఁ బరుండు లేఁడు వి
జ్ఞాని ననంగ నేనె " యని శాంకరి ! శంక యొకింతలేక లో
నూనితి ధన్యతాగరిమ మూరక సంసృతిసాగరంబునన్
జ్ఞానవిహీనతన్ బడితిఁ గావఁగదమ్మ కదంబవాసినీ. ౯౦

ఉ. ఇంతకుమున్ను ధన్యుఁడను నే ననుకొన్న దసత్యమైన నీ
చెంతకు వచ్చి నీచరణసేవ యొనర్పఁగ గల్గెఁ గాన నా

వంతయుశంకలే దిఁకఁ గృతార్థుఁడ ధన్యుఁడ మాన్యుఁడన్ భవ
ధ్వాంత మడంచి నీపరభక్తి ధ్రువంబొనరింపు మంబరో!

క. నీవలనఁ గల్గు నొక రా
జీవమ్మునఁ బొడమితిని విశేషించి భవ
త్సేవకుఁడనైతి నజ్ఞా
నావృతిఁ దొలఁగించి ప్రోవు మఖిలాంబ! దయన్ ౯౨

ఉ. నీచరితం బెఱుంగని వినీచులు దక్కఁ బరాత్పరుం డటం
చీచతురాననుం దలఁప రీశ్వరి! స్వర్గము గోరి జన్మముల్
నోఁచెడి వారు నిట్టిరె జనుల్, నను నీవ సృజించి తిట్టి యా
లోచన నాకె తోఁచదిఁక లోకులకున్ గతియేమి? శాంకరీ.

క. పరతత్త్వంబంచును ని
న్నరయక యోగంబులంచు నన్యాశ్రయముగాఁ
బరమేశ్వరి! కొందఱు చెడు
దురు త్వద్భక్తేతరులకు దొరకునె ముక్తుల్? ౯౪

ఉ. ఎందుల కంబ! పాట్లుపడి యెన్నిటనో కృశియించు టొమహా
నందవిధాత్రి! సారెకుమనంబున "శాంకరి! యీశ్వరీ!" యటం
చుం దగుభక్తి నీజపము చూఱగొనం గలవాఁ డెవ్వఁడు వాఁ
డొందు నొకింతలోన జగదంబ! యిహంబుఁ బరంబు సర్వమున్.

తే. గీ. కావలెనె నీఁడు సృష్టికై కమలభవుఁడు?
హరియు రక్షింపవలెనె? లయంబు శివుఁడు
లేనిచో నెఱవేఱదే? లీల లివి స
మస్తమును జేయఁజాలు దోయంబ! నీవు. ౯౬

చ. హా! మధుకైటభాసురుల కందిన నేమగు? సృష్టివేళ నీ
కరుణయు కా! సముద్ధరణ కారణమయ్యె నతండు నేడు శం
కరుఁడను మమద్భవుండఁట! జగజ్జన నాశములయందు శక్తతన్
బొరయుడు మేని యెవ్వరికిఁ బొందనివారు వచింపు మంబరో!

క. ఆదటికి జన్మకారణ
ముం దెలియఁగవచ్చు సర్వమోహిని! యది నీ
కుం దెలియరాదు వినరా
దెందును నజ వనఁగ నగుదు వీవ నిజముగా. ౯౮

ఉ. ఏ సృజియింతు నీహరి వహించును రుద్రుఁడు సంపు నిక్కమే
కాసున కేనిఁ గాని మముఁ గార్యవిశారదులం బొనర్తు వం
బా! సకలేశి! నీకళయె మాకు సహాయము గానిచో వృథా
యాసమె కాని మే మొక రవంతయుఁ జేయఁగ లేము శాంకరీ.

వ. మఱియు సకర్తయు, నగుణుండును ననుపాధియు నకలుండును నగుపురుషుండు భవదీయంబగు వినోదంబు నీక్షించి సంతోషించుచుండునని తద్జ్ఞులు సెప్పుదురు. ఈతం డొక్కరుండు దక్క నీకన్న బరుండు లేఁడు. ఇదియ నిక్కంబైనచో "నేకమేవాద్వితీయం బ్రహ్మ" యను వేదవాక్యంబునకు మిథ్యాత్వంబు పొసంగుఁ గాన నన్ననుగ్రహించి యీ యన్యోన్యవిరోధ పరిహారం బొనర్చి యవ్వాక్యంబునకు వాచ్యంబు నీవో లేక యప్పురుషుండో విస్పష్టంబొనర్పుము; నీవు స్త్రీవో పురుషుండవో యెఱింగింప వలయు; మత్ప్రశ్నాయోగమ్మునం జేసి భవదీయసాన్నిధ్యంబు చేకూఱె నని ప్రార్థించునన్నుం గాంచి మృదుమధుర గంభీర సంభాషణంబుల నజ్జగదంబ యిట్లనియె. ౧౦౦

ఆ. వె. అతఁడ యేను నేన యాతఁడు భేదం బొ
కింతయేని యుండ దిరువురకును
బుద్ధిమంతులైన పురుషు లెఱుంగుదు
రెఱుఁగలేరు బుద్ధిహీనజనులు. ౧౦౧

క. మాయిరువుర యంతర మ
జ్ఞేయం బద్దాని యెఱుకఁ జెందిన పురుషుం
డే యోగియు ముక్తుఁడు నన
పాయుం డాతనికి లేవు భవబంధంబుల్. ౧౦౨

—* బ్రహ్మాదులకు దేవి తనరూపం బుపదేశించుట *—

వ. మఱియు దీపం బుపాధిభేదంబున ద్వైవిధ్యంబు గాంచునట్లును నాదర్శమ్మునం దోఁచు ప్రతిబింబమ్ము పగిదిని వ్యవహారకాలమ్మున ద్వైవిధ్యంబు కల్పితంబయ్యుఁ బరమార్థమ్మునను "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" యను వేదవాక్యంబు నిక్కంబు, బిది యునుంగాక స్త్రీరూపంబు నాకు సృష్టికాలంబునఁ గల్పితంబైనదికాని కల్పాంతమ్మున స్త్రీపుంనపుంసకభేదంబులు లేక యుండుదు. బుద్ధిశ్రీధృతికీర్తిస్మృతులును శ్రద్ధామేధాదయాలజ్జాక్షుధాతృష్ణలును కాంతిశాంతిపిపాసలును నిద్రాతంద్రాజరలును విద్యావిద్యాస్పృహావాంఛాశక్త్యశక్తులును వసామజ్జాత్వక్కులును ఋతానృతవాక్కులును పరామధ్యాపశ్యంతులును వివిధమ్ములగునాడులును నేనకాని వేరొండుకాదు. వేయేల, సంసారంబందు మద్వియుక్తంబగు పదార్థం బొక్కండు లేదు. నానాదేవతలందు గౌరీబ్రాహ్మీవారాహీరౌద్రీవైష్ణవీశివావామనీకౌబేరీనారసింహీవాసవీప్రముఖ నానాశక్తిస్వరూపమ్ములఁ బరాక్రమించుచు సర్వకార్యమ్ము లొనర్చుచుందు. జలమ్ముల

తైక్ష్ణ్యమ్మును, వహ్నియం దౌష్ణ్యంబును, దివాకరునందు దేజంబును, జలమునందు హిమంబును ననే మత్త్యక్తంబగు వస్తువిశేషంబులకేవి సమర్థంబుకాదు. మీరు మూగురును మదీయశక్తి విముఖులైనచో రాక్షసాదిహరణంబున కశక్తులకా నిశ్చయింపుము. మఱియుం బతితుండును స్ఖలితుండును శాంతుండును భీతుండును శత్రువశగతుండును నశక్తుం డనంబడునుగాని యరుద్రుండనియు నవిష్ణుండనియు వ్యవహరింపఁబడఁడు. శక్తియుక్తుండ వగుటం జేసియ యీవు జగంబు సృజియింతువు. విష్ణురుద్రులును సూర్యచంద్రులును నష్టదిక్పాలకులును శక్తియుక్తులగుటం జేసియ తమతమ కార్యంబులు నిర్వహించుచుండుదురు. భూమియు శేషుండు నాదికూర్మంబును దిగ్గజంబులును శక్తిగలుగుటంబట్టియ భారవాహకంబులగుచున్నవి. కానిచోఁ బరమాణువహనంబునకును గొఱగావు. ౧౦౩

శా. హంసాగ్రేసరవాహ ! నీరమును నాఖ్యావిశేషమా నట్లు ప్ర
ధ్వంసంబుం బొనరింతు నయ్యనలు నార్పం బూనుదుం గాలి నా
శంసామాత్రముగా నొనర్తు మది నిచ్ఛామాత్రముం జేసి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావము నొనర్పన్నేర్తు నన్నింటికిన్ ౧౦౪

ఆ. వె. అంతమాత్రమున సమస్తతత్త్వములును
బోయెననెడి బుద్ధిఁ బూనరాదు
ఘటకపాలరీతిఁ గాఁ బరమాణువు
లందుఁ బృధివి నిల్చు నబ్జసూతి ! ౧౦౫

వ. మఱియు శాశ్వతంబును క్షణికంబును శూన్యంబును నిత్యానిత్యంబును సకర్తృకంబును నహంకారాగ్రిమంబును మహత్తను ననునీయేడు భేదంబులం జొప్పడు మహత్తత్త్వంబు. దీనికతన నహంకా

రంబుపుట్టె; నీ విష్ణుమహత్త్వంబు వలన సమస్తభూతంబులును యథాపూర్వంబగుగతి రచియింపు మని చెప్పి, ౧౦౬

ఉ. చారుహాసన్ముఖిన్ విమలచందనగంధి సితాంబరన్ మనో
హారిణి రాజసిన్ సరసిజాసన దివ్యసరస్వతిన్ మహా
దారవిభూషణన్ గొనుము దారను గా నని నా కొసంగె ని
ష్కారగ నొక్కశక్తిని మహాసుగుణన్ జగదంబ సూన్నతో.

క. ఒసఁగి యిటులనియె నోయి స
రసిజాసన! యేగు మీసరస్వతితో స
ర్వసుఖముల ననుభవించుచుఁ
బొసఁగన్ వసియింపు సత్యభువనమునాదన్. ౧౧౮

వ. మద్విభూతియగు నీ సరస్వతి నెన్నండు నవమానింపక యిష్ట సుఖమ్ము లనుభవించుచు స్వకర్మానుయాతంబులై జీవసమూహంబులను లింగకోశంబులం గొని చతుర్విధంబుగఁ గాలకర్మస్వభావానుగుణంబుగ సచరాచరంబగు జగంబు సృజియింపుము. సత్వగుణప్రధానుండగుట విష్ణుండు నీ కెక్కుడు; దుస్సహమ్ములగు విషయమ్ములందు మానవప్రకృతులందును దదన్య ప్రకృతులందును బుట్టుచు దానవులం బరిమార్చుచుండు శంకరుండును నట్ల సహాయుం డగుచుండు. ౧౦౯

క. దేవతలం జేయుము భూ
దేవాదిద్విజులు మిమ్మధికదక్షిణలన్
భావింపఁదగిన యాగ
శ్రీ వెలయఁగ నెపుడుఁబూజసేయుదు రెలమిన్. ౧౧౦

వ. తత్తద్యాగమ్ములయందు మన్నామోచ్చారణ మాత్రమ్మునన్ జేసి మీరును సంతుష్టిఁ జెందుదురు గాక. మీలోఁ దమోగుణ

ప్రధానుండగు శంకరుండు విశేషించి పూజనీయుండు ; దైత్యుల వలనిభయంబు మీ కేరికిని దుస్సాధంబగునెడ వారాహీప్రము ఖావతారంబుల మదీయ శక్తు లుత్పత్తినొందుచు సంహరించెడిఁ గాక. మంత్రరాజంబగు నవాక్షర మంత్రంబు సబీజంబుగా నెల్ల ప్పుడు జపియించిన నీకు సర్వార్థసిద్ధి గాఁగలదు పొమ్మని చెప్పి హరిం జూచి యిట్లనియె. ౧౧౧

ఉ. ఈరమణీలలామఁ గమలేక్షణ నిందిరఁ జందిరాననన్
దారనుగా గ్రహించి త్వదుదారభుజాంతరసీమ కేళికా
గారముగా నొసంగు మొకకాలమునందయినన్ విమానితం
గా రచియింపకే మిగుల గారముగాఁ గనఁగాఁ దగుంజుమీ

క. దేవతల జీవికకునై
యావశ్యకములు సమస్తయాగంబులు భూ
దేవతల కని విధించితి
నావిషయంబున మెలంగఁ డవిరుద్ధగతిన్. ౧౧౩

క. మీరలు ముగురు మదంశో
దారు లగుటఁజేసి జగము తగ మిము నెంతే
నారాధించు సమమ్మగ ;
నారయను భేదంబు నెవ్వఁ డతఁ డడుగంటున్ ౧౧౪

గీ. హరిహరబ్రహ్మలకు భేద మరయరాదు
గాని గుణభేద మొక్కింత గలదు మీకు
సత్త్వము ప్రధానమగు నుపసర్జనంబు
తక్కిన గుణద్వయము నీకుఁ దమ్మికంటి. ౧౧౫

క. ఈవు రజోగుణ మూనెడి
యావేళలయందు నుపవనాదికమున సు
శ్రీవెలయఁగ నీభార్గవి తో
విహరింపుము మదిం గుతుకమలరారఁగ. ౧౧౬

వ. వాగ్బీజమాయాబీజకామబీజసంపుటీకృతంబును బరమార్థదంబు నగు నిమ్మహామంత్రంబుఁగైకొను మని యమ్మనురాజం బుపదేశించి యిట్లనియె. ౧౧౭

ఉ. నా కెపు డిచ్చ పుట్టునొ వినాశమొనర్తుఁ బ్రపంచమష్ట, నా యాకృతియందు మీ ముగురు నైక్యముఁ జెందెద రట్టివేళ, సా ఖ్యాకరమై జయప్రదమునై తగు నీ వరమంత్రరాజముం జేకొని పేర్మిమైఁ బఠన సేయుము పొమ్ము శుభంబు నీకగుఁ౯. ౧౧౮

వ. వైకుంఠంబు నీకు నివాసంబగుఁ గాక యని శంకరుం జూచి యిట్లనియె. ౧౧౯

గీ. సత్త్వము రజోగుణము నుపసర్జనములు
తమము ముఖ్యము నీ కస్మదంశజనిత
యగు మహాకాళి యీ గౌరి తగు కళత్ర
ముగ వసింపుము కైలాసభూధరమున. ౧౨౦

ఉ. గౌరిని గూడి సంతతసుఖమ్ములు చెంద రజోగుణంబు దే వారులతోడఁ బోరుల జయంబు గొనంగఁ దమోగుణంబు సం సార మహార్ణవోత్తరణసాధన మస్మదభిఖ్య యాగమా ధారము సంస్మరింపఁగ నుదారము సత్త్వగుణంబు నీకగుఁ౯. ౧౨౧

గీ. ముగురకును మూఁడుగుణములు ముఖ్యములు గు
ణంబులకు వెలియగుపదార్థంబు లేదు

అట్టివాఁ డొక్కపరమాత్మ యతఁ డదృశ్యుఁ
డేనుఁ గాలానుగతి గుణ మూనుదాన. ౧౨౨

వ. సర్వంబునకుఁ గారణంబకాని యేను గార్యంబుగాను; నావలన సత్త్వరజస్తమోగుణాత్మకం బగుపరాహంతయు దానివలన * మహత్తత్త్వంబును దానివలన నహంకారంబును దానివలనఁ బంచతన్మాత్రలును వానివలనఁ బంచభూతమ్ములును యథాక్రమంబుగ నుద్భవించె భూతపంచకంబును గర్మేంద్రియపంచకంబును జ్ఞానేంద్రియపంచకంబును మనంబును నను నీ పదియాఱును కార్యంబులును గారణంబులు నైయొప్పు. మహత్తత్త్వాదిసప్తకంబును నిట్టిదియ. పురుషుండు కార్యకారణోభయ కోటిప్రవిష్టుండు గాకయుండు; నిదియంతయు సంక్షేపమ్ముగా వివరించితి నిఁక మీ మీవాసమ్ములకుం బొండు; విషమంబగు కార్యంబు దటస్థించినచో శబలితుండగు పరమాత్మను స్మరించునది. స్మరణమాత్రమ్మునం జేసి యేను గోచరింపఁగలదాన నని మా ముగురకుం జెప్పి పనిచిన నేమును నా స్థానంబు వదలి చనుదెంచువారము,

క. స్త్రీరూపమెడలి పురుషా
కారము సంప్రాప్తమగుడుఁ గలరీతిగ నా
యారీతులెంచుచు విమా
నారూఢులమగుచు నేగు నా సమయమునన్. ౧౨౪

చ. కనుఁగొన నా సుధాజలధిగాని మహామహిమానుభావ యా
జననియుఁగాని యా చెలుల సంఘముగాని మణీఘృణీ కన
త్కనకమయంబు ద్వీపమదిగాని మఱొక్కటిగాని లేద యే
మనఁగల! శుద్ధశూన్యముగ నయ్యెడ నెయ్యెడఁదోఁచె నారదా.

---

* ఈ మహత్తత్త్వమే బుద్ధియనియుఁ జెప్పఁబడు.

వ. పిదప నేమును మ:ను మధుకైటభుల వధించిన చోటి కేతెంచి విమానంబు డిగితి మచ్చటన మజ్జన్మ పంకజంబునుం బొడసూపె.

—* బ్రహ్మాండోత్పత్తి *—

ఆ. వె. దేవియనఁగ నిట్టి దివ్యస్వరూప మ
హానుభావ యట్టి యనఘచరితఁ
గన్నులార నేము గాంచితి మనుడు నా
రదుఁడు దండ్రి కనియె ముదము దనర. ౧౨౭

వ. తండ్రీ! నీ చెప్పిన దేవీ మహత్త్వంబు నా మనమ్మునకు వచ్చె. నీకుఁ బురుషుండన నెట్టిఁడో వివరింపు మదిగాక యింత వట్టును సగుణయగు శక్తి ప్రభావం బెఱింగించితి విఁక నిర్గుణ శక్తి ప్రభావంబు వినఁగోరెద. నేను శ్వేతద్వీపమ్మున నే తదర్థంబు దపంబొనర్చుడు సిద్ధులగు తపస్వి గణంబులు పొడ సూపిరి గాని తద్రహస్యంబు గోచరింపదయ్యె. ౧౨౮

క. కావున నిర్గుణశక్తి ప్ర
భావము నయ్యాదిపురుషు పారమ్యంబున్
నీవ యనుగ్రహమున సం
భావించి యెఱుఁగఁ జేయవలయు మహాత్మా! ౧౨౯

వ. అను నారదునకుఁ జతురాననుం డిట్లనియె. ౧౩౦

క. నిర్గుణుఁడగు పూరుషునిన్
నిర్గుణయగు శక్తినిన్ మునివరులు చిత్సం
సర్గమునఁ గాంతు రొరులకు
దుర్గమము నిరూప మెట్లు దోఁచుం జెపుమా! ౧౩౧

గీ. జ్ఞానభావ్యులు విశ్వాసగమ్యులును న
నాదినిధనులుఁ బ్రకృతియు నాదిపురుషుఁ
డును జగద్వ్యాపకులు వీరి నెనయుచట్టి
వస్తువొక్కింతయును లేదు వాస్తవముగ. ౧౩౨

సర్వభూతగతంబగు తేజంబు పరమాత్మకంబని యెఱుఁగునది. ప్రకృతిపురుషులన నెల్లప్పుడు దేహమందు మిశ్రీభూతులై యేక రూపులై యవ్యయులై నిర్గుణులై నిర్మలులై, నిర్మములై, చిదాత్మకులై యొసంగుచుందురు. ౧౩౩

క. పరమాత్ముఁడనఁగ శక్తియ
పరికింపఁగ శక్తియనఁగఁ బరమాత్ముఁ డ యీ
యిరువురకుం జొప్పున న
తరమెఱుఁగఁగ రా దదెట్టి తత్త్వజ్ఞులకున్. ౧౩౪

క. విరతిగలుగు మహనీయుల
కరయఁగ నగు విశ్వమున నహంకారకృతం
బు రహి నదియేరికైనన్
విరతిం గలుగంగ నీకు వేజన్మములన్. ౧౩౫

గీ. సగుణుఁడగువాఁడు నిర్గుణచర్య నెఱుఁగు
వాఁడె! పైత్యాదికంబునఁ బరుసనైన
రసన కలవడునే! రసారసవిచార
మత్సికెనయునె! పీతనీలాదికములు. ౧౩౬

క. కనుఁగొనఁగ నహంకారం
బునఁ బుట్టియు సగుణమగుచుఁ బొల్చెడి చేతం
బున కెట్లలవడు! నిర్గుణ
మన వన్నెకు నెక్కు నా రహస్యము చెపుమా. ౧౩౭

గీ. అనుడు నారదుఁ డిట్లను ననఘ ! సత్త్వ
మనఁగ నెట్టిదియో ! రజంబనఁగ నెట్టి
దో ! తమోగుణ మన నెట్టిదో ! వచింపు
వేఱువేఱ నిరూపించి విస్తరముగ. ౧౩౮

వ. అని యడిగిన విరించి యిట్లను. కుమారా ! సత్త్వరజస్తమంబులకుఁ గ్రమంబుగ జ్ఞానశక్తి క్రియాశక్త్యర్థశక్తులను మూఁడు శక్తులు గలవు. అందర్థశక్తి వలన శబ్దస్పర్శ రూపరసగంధంబులను తన్మాత్రంబు లుద్భవించె. ఇందు శబ్దగుణకమాకాశంబు స్పర్శగుణకంబు వాయువు రూపగుణకం బగ్ని రసగుణకంబు జలంబు గంధగుణకంబు పృథ్వి అర్థశక్తిసమాయుక్తంబులగు నీ పదియును తమస్సర్గంబు నాఁబడు. శ్రోత్రత్వక్చక్షూరసనాఘ్రాణంబులను జ్ఞానేంద్రియపంచకంబును వాక్పాణిపాదపాయుపస్థలను కర్మేంద్రియపంచకంబును ప్రాణాపానవ్యానోదాన సమానమ్ములను వాయువులైదుం గలసి యీ పదియేనును రజస్సర్గంబు నాఁబడు. ఇవి క్రియాశక్తిమయంబులును జనుపాదానకంబులునునగు కరణంబులు. మఱియు జ్ఞానేంద్రియపంచకమ్మునకు దిగ్వాయుసూర్యవరుణాశ్వినేయు లేగురును నధిష్ఠానదేవతలు. వీరుజ్ఞానశక్తియుక్తంబగు సత్త్వంబువలన జనించిరి కాన వీ*రాఱుగురును బుద్ధ్యాదికంబగు నంతఃకరణచతుష్టయంబును తదధిష్ఠానదేవతలగు చంద్రబ్రహ్మరుద్రక్షేత్రజ్ఞులు నలువురును మనంబును గలిసి యీపదియేనును సాత్త్వికసర్గంబునాఁబడు. మఱియుఁబరమాత్మకు స్థూలంబనియు సూక్ష్మంబనియు రెండురూపంబులు గలవు. అందు స్థూలం బుపాసకులకు ధ్యానయోగ్యంబు, నాశరీ

* ఇందశ్విను లిద్దరుగాఁ జూడఁదగు.

రంబు సూత్రంబు నాఁబడు. ఇఁకఁబరమాత్మనిస్థూలశరీరం బెట్టిదన పంచీకృతసూక్ష్మభూతంబులవలన మహాభూతోత్పత్తి యగు. అందుఁ బంచీకృతోదకంబునఁబ్రతిబింబితమధ్యమాధి కారిచైతన్యమునకు దేహమున "నహ"మనుతాదాత్మ్యం బుద యించు. అందు విశేషాభిమాని యగు చైతన్యంబ యాదినారా యణ సంజ్ఞకంబు, పంచీకరణంబుచే నాకాశాదిమహాభూతవిభా గముదృఢీకృతమగు. పదఁపడి శబ్దాదిగుణంబు లేకైకవృద్ధిక్ర మంబున నిందు వఱలుచుండు నదియెట్లన్న నాకాశంబునకు శబ్దం బొక్కటియె గుణంబు. వాయువునకు శబ్దస్పర్శమ్ములును నగ్నికి శబ్దస్పర్శరూపమ్ములును జలమ్మునకు శబ్దస్పర్శరూపరసమ్ములును బృథివికి శబ్దస్పర్శరూపరసగంధమ్ములైదును గుణమ్ములై చెల్లు; నిట్టిగుణమేళనంబున బ్రహ్మాండముద్భవించె, సమస్తజీవమ్ములును బ్రహ్మాండాంశసముద్భవమ్ములుగా నెఱుంగునది; జీవరాసుల సంఖ్య యెనుబదినాల్గు లక్షలు. ఇంకసత్త్వాదిగుణంబుల స్వరూ పం బెఱింగించెద నని యిట్లనియె. ౧౩౯

—* సత్త్వాది గుణస్వరూపము *—

పీ్రత్యాత్మకంబుగా వెలయు సత్త్వము సుఖ
ములవలనఁ బ్రీతి సంభూతమగును
నార్జవం బొకటి సత్యంబు శౌచంబు శ్ర
ద్ధాక్షమా సంతోష ధైర్యములును
శాంతియు దయయు లజ్జయునను వీనిచే
సత్త్వప్రతీతి నిశ్చయము సుమ్ము
మఱియు సత్త్వమ్ము ధర్మ ప్రీతికరమును
శ్వేతవర్ణమ్మునై చెలఁగుచుండుఁ

గీ. దనరు సాత్త్వికరాజసతామసమ్ము
లనఁగ శ్రద్ధలు ; మూఁటిలో నాద్యమైన
దాని వృద్ధి యొనర్చు సత్త్వమ్ము ; తక్కుఁ
గల యసచ్ఛ్రద్ధల నడంచి కలఁచుఁ బుత్ర. ౧౪౦

వ. రజోగుణంబు రక్తవర్ణంబును దుఃఖజంబగు ప్రీతిం గలుగఁ జేయు నదియు నని యెఱుంగునది. ద్వేషంబును మాత్సర్యంబును ద్రోహంబును నుత్కంఠయు నిద్రయు రజశ్శ్రద్ధయు మానంబును దమమ్మును గర్వమ్మును రజోగుణ జన్యంబులు విచక్షణులగువారు వీనింబట్టి రజోగుణంబు నిశ్చయింతురు.

సీ. మఱియుఁ దమోగుణం బెఱుఁగుము కృష్ణ వ
ర్ణముగ ; మోహము విషాదము నొసంగఁ
జేయు నియ్యది దీనిచేష్ట లాలస్య మ
జ్ఞానమ్ము నిద్రయు దీనతయును
గార్పణ్యము భయమ్ముఁ గౌటిల్యము వివాద
రోష వైషమ్యముల్ దోషదర్శ
నంబును నాస్తికత్వంబును తామస
శ్రద్ధయు, వీనిచే సత్పురుషులు

ఆ. వె. తమము నిర్ణయింతు రెద్దియు శుభముల
నిచ్ఛగించువార లిందు సత్త్వ
మొసఁగఁ జేసి రజముపసఁ గసిమసఁగుచుఁ
దమము సంహరింపఁ దలఁపవలయు. ౧౨౪

చ. అరయఁగ నొక్కటొక్కటికి నాశ్రయమై కనుపట్టుటన్ బర
స్పరము విరోధభావమును బాల్పడనీయక వీని మూఁటినిన్

గర మనుకూలరీతిఁ గనఁగాఁదగు నియ్యవి మాటికిన్ బర
స్పరము విరోధముల్ సలుపుఁ బట్టకయుండిన ముప్పుమూఁడెడిన్.

వ. మఱియు నింక నిద్దానిన విస్తరించెద నాకర్ణింపు మెయ్యది యైన వినినంత మాత్రన ఫలంబు చేకూర దెట్లంటేని కామ క్రోధాదివర్జితుఁడు గానివాని తీర్థయాత్రాదికంబును బోలె ననుభవరహితంబగు శ్రవణంబు వ్యర్థంబు. కామక్రోధలోభ మోహమదమాత్సర్యతృష్ణాద్వేషాసూయేర్ష్యాఽక్షమాఽశాంతు లను నియ్యవి యొండొక నాశ్రయించి యుండు నంత దనుకఁ బురుషుండు పాపాత్ముండు; వాఁ డెయ్యది యొనర్చిన నిష్ఫలంబు. కర్షకుఁడు శ్రమంపడి తగుకాలమ్మున బీజావా పంబొనర్చి యహోరాత్రమ్ములుగాచి తుదకు ఫలకాలమ్మున నిద్రవోయిన ఫలంబు మృగాధీనంబగుభంగి నెంత శ్రమమ్మున దీర్థయాత్రాదికం బొనర్చినను గామాదుల జయింపఁడేని ఫలమ్ముఁ జెంద నేరఁడని చెప్పి మఱియును, ౧౪౪

మ. సరవిన్ శాస్త్రవిచారణంబు కతనన్ సత్త్వంబు వర్ధిల్లుఁ ద
త్పరతం జేసి క్రమక్రమమ్మునఁ దగున్ వైరాగ్య; మద్దానిచే
త రజంబున్ దమముం ద్యజించి కడు విద్యాసంతుఁడై బ్రహ్మవి
ద్వరుఁడై ముక్తి నిఁగాంచు మానవుఁడుతథ్యంబింతయున్ నారదా!

వ. లోభయోగంబున రజం బుత్కటం బయ్యెనేని సత్త్వతమంబుల నణంచు; నట్ల తమంబును మోహయోగమ్మునం జేసి ప్రవృద్ధంబై సత్త్వరజంబుల నణంచుఁ; దత్ప్రకారంబు వేఱ్వేఱ విస్తరించెద.

సీ. సత్త్వ ముత్కటమై రజస్తమోభవములౌ
బాహ్యార్థముల డించుపఱచి పేర్మి

యజ్ఞాదికర్మముల నాసక్తిఁ గొల్పి సా
త్త్వికభోగములయందుఁ బ్రీతిఁ జొనిపి
మోక్షమ్మున మనమ్ము దీక్ష వహించు; న
ట్లు రజోగుణము వృద్ధినందె నేనిఁ
దగు సనాతనము లౌ ధర్మంబు లడఁగు ర
జశ్శ్రద్ధ పోసఁగు నెసంగు సర్థ

గీ. మనుసరించును భోగంబు లఖిలములును
సత్త్వతమములు మొదటికి సమసిపోవు;
నట్లు తమమును నుత్కటం బయ్యె నేనిఁ
బ్రథమమున వేదశాస్త్రవిశ్వాస మడఁగు. ౧౪౭

గీ. మఱియుఁ దామస మగుశ్రద్ధ మదిని దవిలి
వ్యయ మొనర్చు ధనంబు ద్రోహములు సేయు
శాంతిఁ గనఁ డెన్నటికినైన సత్త్వరజము
లడఁగు మొదటికి స్వేచ్ఛావిహార మమరు. ౧౪౮

క. క్రమమున సత్త్వముఁ రజమును
దమముఁను నన్యోన్యమిథునధర్మంబున శ్రీ
రమునీరముఁ బలె నన్యో
న్యము కలసియ యుండు విడిచి యలవడ కుండన్

గీ. రజము సత్త్వంబు, సత్త్వమ్ము రజము, తమము
సత్త్వరజముల విడిచి యెచ్చటను నొక్క
టొక్కటిగఁ గానరావు సంయుక్తధర్మ
కలితములు జన్యజనకతాకలితములును. ౧౫౦

క. సత్త్వము రజస్తమములకు
సత్త్వరజంబులకుఁ దమము జనకంబగు నా

సత్త్వతమములకు రజమును
దత్త్వముగ జనకమగు విను తత్త్వజ్ఞనిధీ. ౧౫౧

చ. జనకత మృష్టటక్రియ నెసంగు గుణంబులు మూఁడు బుద్ధి నె
క్కొని సతతంబుఁ గామములకుం బురికొల్పుచు నుండు నాదికిం
గనఁగ రజంబు జాయ, యెసకంబున నిద్దియు దానిజాయ యై
చను నివిరెండునుందమము జాయలిటుల్ దగు యుగ్మభావముల్.

వ. అనుడు నారదుం డిట్లను మహాత్మా! నీచెప్పిన గుణలక్షణంబు
కతన నాకుఁ దృప్తి చొప్పడదు. నన్ననుగ్రహించి యీగుణ
పరిజ్ఞానంబు తెల్లమగునట్లు బోధింపు మన నతం డిట్లనియె.

క. ఏనెఱిఁగి నంతవట్టును
బూని యెఱింగింతు వినుము పుత్త్రా! సమ్య
గ్జ్ఞానము నాకును నలవడ
దైనను వచియించువాఁడ నాలింపుమొగిన్. ౧౫౪

చ. పతికిని బంధుసంతతి కపారముదం బొడఁగూర్చునట్టి య
య్యతివయ యెల్లవేళ సవతాలికి నప్రియయౌఁ గదా! యటుల్
మతిఁబరికింప సత్త్వముఁ దమంబు రజంబును బీడఁబెట్టు నీ
గతియ రజస్తమంబులకుఁ గన్పడు స్వేతరమందు నారదా!

వ. సత్త్వంబు స్వభావసుభగంబయ్యు స్వేతరసంపర్కమ్మనం జేసి
వికృతిం గొలుపు నది యెట్లంటేని, ౧౫౬

ఉ. జానగు జవ్వనంబుఁ గడుఁ జక్కదనంబు నయంబుఁ గామశా
స్త్రానుగతప్రచార మొలయం దగు జవ్వని సత్త్వరీతులం
బూని చెలంగుచున్ సవతిపోరునఁ దానును దుఃఖమొందు చం
దానఁ దదన్యభావమును దాలుచు సత్త్వము వైకృతస్థితిన్.

క. కనుఁగొనుము చోరులకు భీ
తిని గొల్పెడిసేన చోరధికకృతులగు స
జ్జనులకు సుఖదం బగున
య్యనువునన గుణమ్ములకును నగుభిన్నగతుల్. ౧౫౮

మ. ఘననిర్ఘోషవిశేషమై తిమిరయుక్తంబై కనచ్చంచలా
జనితత్విడ్యుతమైన దుర్దినము బీజం బూడ్చి నిశ్చింతఁ గై
కొని కూర్చుండిన కర్షకావళికిఁ గులుకన్ గూర్చియున్ దున్నఁజొ
చ్చిన తక్కుంగల వారికిన్ శ్రమదమై చెన్నారదా నారదా.

చ. అదియునుఁగాక వర్షఋతు వన్నిసుఖమ్ములుగల్గువారి నె
మ్మదికి ముదం బొసంగియును మన్ననఁజేయు ప్రియుండు దూరమై
కదలినవారికిన్, నిలువఁగాఁదగు గేహము కాష్ఠజాతమున్
మొదలుగ లేని గేస్తులకు మోదమిడందగునే! గ్రహింపుమా.

చ. మనము వినిర్మలంబయి సమంబుగ నింద్రియముల్ పదార్థముల్
గొనఁగ సమర్థతం బొరసికోలు ఘటించి శరీరమందుఁ జు
ల్కన గనుపట్టి శాంతి పొడకట్టుతతిన్ జనుఁడెన్నఁగాఁ దగున్
దనయెడ సాత్త్వికంబగు విధం బధికం బయి చెన్నుమీఱుటల్.

గీ. రజమునకు లక్షణములు నిద్రావిజృంభ
ణంబు జృంభాతిరేకతంద్రావిశేష
చిత్తచాంచల్యపరదేశజిగమిషలును
పాపబుద్ధివివాదతాత్పర్యములును. ౧౬౨

క. కాయము బరువగు నక్షిని
కాయమును మనంబు శూన్యగతిఁగను నిద్రా
పాయ మ్మొనయుఁ దమం బ
త్యాయతమై యేదికేనిఁ దల కెక్కుతఱిన్. ౧౬౩

చ. అనవిని నారదుఁ డను మహాత్మ ! గుణంబులు భిన్నభిన్న వ
ర్తనములు గా వచించి తొక తొవునకున్ సమకూడెనేనిఁ గ
ల్గునె మఱికార్యసిద్ధి ? రిపుకూట మదొక్కెడఁ గూడుకొన్నఁ జే
టొనయును కాని కార్యగతి యెచ్చటనేని ఫలింపనేర్చునే ? ౧౬౪

వ. అనవుడు విరించి యిట్లను, ౧౬౫

క. తైలము వర్తియు నగ్నియు
లోలోన విరుద్ధరీతులుగ నుండియుఁ దా
మేలీలఁ గార్యమొనరుపఁ
జాలునో గుణములును నట్లచాలెడిఁ బుత్రా. ౧౬౬

వ. అని పితామహుండు తనకుం జెప్పిన చొప్పున నారదుండు నా కెఱిగించె నయ్యది నీ కెఱిగించితి. గుణంబులన విశ్వకారణంబులు శక్తియన జగద్వ్యాపినియై సగుణయనియు నగుణయనియు రెండు తెఱంగులనొప్పు. పురుషుండనఁగ నిరీహుండును నవ్యయుండును బూర్ణుండునై కార్యకారణభావమ్ములు లేక చెన్నారు. సదసదాత్మకంబగు నీప్రపంచం బంతయు మహామాయయగు శక్తియ నిర్వహించు. బ్రహ్మ విష్ణుమహేశ్వరులును సూర్యచంద్రులును అష్టవసువులును అష్టదిక్పాలకులును గుమార వినాయకులు మొదలగు దేవతలును శక్తి సంయుక్తులగుటం జేసియ తత్తత్కార్య నిర్వాహకు లగుచుందురు. కాన నమ్మహాశక్తి నారాధింపుమని చెప్పి వ్యాసుండు మరల జనమేజయున కిట్లనియె. ౧౬౭

ఉ. ఆ జగదంబ నా కలుషహారిణి నాజగదంతరాత్మ నెం
తే జపియించి సద్గతుల నెందఱు వొందరు నీవుఁ గూడ నా
యోజ నఖండభక్తి చెలువొందఁగ నా పరదేవతాంఘ్రిలన్
బూజ లొనర్చి యేరికిని బొందఁగరానిఫలంబు నొందుమా. ౧౬౮

వ. మఱియు నద్దేవి మహత్త్వంబింతింతయే ! వ్యాఘ్రాది సందర్శన
భయంబునఁ దదీయబీజాక్షరంబగు నైకారంబు బిందురహితంబుగ
నేని యెవ్వం డొకఁడు యాదృచ్ఛికంబుగ నుచ్చరించు నవ్వాఁడు
పూర్ణకాముండగు నిందులకు దృష్టాంతంబుగ నిరక్షరకుక్షియగు
సత్యవ్రతుండను ద్విజకుమారుఁడు కిటిముఖోద్గతంబగు నైకారంబు
బిందురహితంబుగ ననుకరించినంత దయార్ద్రహృదయయగు
పరమేశ్వరి యతనిం గవిరాజుగ నొనర్చెననుడు, జనమేజయుం
డతని కిట్లనియె. ౧౯

క. సత్యవ్రతుఁ డన నెవని య
పత్యంబవ్వాని కెట్లు పరమేశ్వరి సం
ప్రీత్యనుగతయై వరమిడె
సత్యవతీతనయ ! నాకు సత్యము చెప్పుమా. ౨౦

గీ. కిటిముఖంబున బీజంబు గెరలుటేమి
దాని సత్యవ్రతుఁడు మది నూనుటేమి
జగదధీశ్వరి కానంద మగుటయేమి
చిత్రమియ్యది వివరించి చెప్పు మనఘ. ౨౧

వ. అనవుడు వ్యాసుం డిట్లనియె. నే నొకనాఁడు తీర్థయాత్రకై
వెడలి సకలమునిశరణ్యంబగు నైమిశారణ్యంబునకుం జని యట
లోమశాది మునీంద్రులకుం బ్రణమిల్లి కథాప్రసంగంబులఁ గాల
క్షేపం బొనర్చుచున్నంత జమదగ్ని మహాముని యొక ప్రసంగం
బున నమ్మునులం గాంచి యిట్లనియె. ౨౨

చ. మునివరులార ! రుద్రహరిముఖ్యులు దేవతలో ! దిగీశులో !
యినుఁడో ! నిశాధినాయకుఁడో ! యింకమఱెవ్వరు సేవ్యులో మనం

బునఁ దగఁ జర్చ చేసి యనుభూతగతిన్ వచియింపుఁ డంచుఁ బ
ల్కిన విని లోమశుండు వలికెన్ జమదగ్ని మహామునీంద్రుతోన్.

క. శుభ మిచ్ఛగించు వారల
కభయ విధాయినియుఁ బాపహారిణియు మహా
విభవయు నభవయునగు నల
యిభరిపువాహయగు జననియే సేవ్యసుమీ. ౧౭౪

వ. స్మరణమాత్రమ్మున సర్వసౌఖ్యములిచ్చునది యాపె కాని
తక్కరులుగా రిందుల కితిహాసం బొక్కండుకల దాకర్ణింపుము.

క. కోసలదేశంబున నొక
భూసురుఁ డనపత్యుఁ డగుచుఁ బుత్రునికొఱకై
చేసెను దమసాతటమునఁ
దా సవ మొక్కయెడ దేవదత్తుఁడు పేర్మిన్. ౧౭౬

—* సత్యవ్రతోపాఖ్యానము *—

సీ. వేదవేదాంగవిద్యాదర్శనాపర
బ్రహ్మ సుహోతృండు బ్రహ్మయయ్యె,
వేదంబునకు మాఱువిధి యొనర్చిన యాజ్ఞ
వల్క్యమహానీంద్రుఁ డధ్వర్యుఁడయ్యె
నమరేంద్రునకు గురుత్వ మొనర్చెడి కళాధి
నేత బృహస్పతి హోతయయ్యె,
నాగమతంత్రవిఖ్యాతుండు పైలుఁ డ
త్యార్జితాత్ముండు ప్రస్తోత యయ్యె

గీ. ఘనుఁడు గోబిలమౌని యుద్గాతయయ్యెఁ
దక్కఁగలవారు దక్కఋత్విక్కులైరి

సుతునిఁ బడయఁగఁ గోరి భూసురుఁడు దేవ,
దత్తుఁ డొనరించునట్టి సత్రంబునందు. ౧౭౭

క. ఆతటి సామాగమ వి
ఖ్యాతంబు రథంతరంబు నల గోబిలుఁ డు
ద్గాత సుసప్తస్వరసము
పేతముగా నుచ్చరించె వేల్పులు మెచ్చన్. ౧౭౮

వ. తత్సమయంబున నాతనికి దైవికంబుగ నిశ్వాసంబు వొడమి
స్వరభంగం బగుడు యజమానుం డతని కిట్లనియె. ౧౭౯

ఆ. వె. సుతునికొఱకుఁ జేయుక్రతు విధి మఖ్యా-మ్య
కర్మమునకు విఘ్నకర్త వగుచు
శ్వాసమెడలఁ జేసి స్వరభంగ మొనరించి
తేమనం గలాఁడ నింకమూర్ఖ ! ౧౮౦

క. అని యజమానుఁడు తనుఁ ది
ట్టిన గోబిలమౌనియుఁ గడిందియలుక నె
క్కొ-న దేవదత్తు నేత్తెఱఁ
గనుఁగొని యనెఁ గనుల నగ్నికణములు రాలన్. ౧౮౧

వ. సర్వప్రాణిసాధారణంబగు నిశ్వాసం బరికట్ట నొకరి తరంబే ?
యనపరాధినగు నన్ను మూర్ఖ యని తిట్టితివి గాన నీకుం బొడము
తనయుండు నిరక్షరకుక్షియు మూర్ఖుండును గాఁగలఁ డని శపి
యించె; నంత దేవదత్తుండు పశ్చాత్తప్తుండై గోబిలుం గాంచి

క. అపరాధ మేమి ? యింతనె
శపియింతురె ! మూర్ఖ సుతుఁడు జనియించిన నా

కుపకార మేమి కనఁగ న
నపత్యతయ దానికన్న నధికముగాదే ? ౧౮౩

ఆ. వె. ఎవఁడు గాని మూర్ఖుఁడేనిఁ బూజ్యత లేదు
విప్రుఁడైన వేఱ వెదక వలెనె ?
పశువురీతి శూద్రుభాతి మూర్ఖుండైన
బ్రాహ్మణుండు కర్మబాహ్యుఁడరయ. ౧౮౪

క. ఏరా జేలెడి భువిఁ బెం
పారుఁ మూర్ఖుండు పూజ్యుఁడై విప్రుఁడు ; భూ
దారుం డాతఁడు నింద్యుం
డా రాజ్యము విడుచు టొప్పు ననఘులు విబుధుల్.

క. తన దేశమ్మునఁ గలమూ
ర్ఖుని విప్రుని రాజు దున్నుకొనువానిఁగఁ జే
యునగుఁ బన్నిదుశూద్రుని
గనుగతి నవ్వానిఁ జూడఁగాఁ దగునెందుఁ. ౧౮౬

క. భూసుర శూన్యంబుగఁ దా
జేసినఁ శ్రాద్ధమొకటఁ జేయఁగనచ్చుఁ
బో ! సేయరాదు మూర్ఖుని
బోసేయఁగఁబెట్టి మెట్టి ముప్పుననేనిఁ. ౧౮౭

క. జడుఁడైన విప్రునకు నె
వ్వఁడు నేమియు నీయరా దవశ్యమయే నె
క్కుడుగ నిడక పొట్టకు సరి
పడునన్నము పెట్టి పంపవలయుఁ బ్రాజ్ఞుల్. ౧౮౮

క. తానును మూర్ఖుండగువాఁ
డేనియు నవ్వానిధనము నెవ్వండు దినం
గానేమి కొఱఁత ! నింబఫ
లానీకము కాకభోగ్యమగుటయుఁ దగదే ? ౧౮౯

ఉ. భూపతిచేత మన్ననలు పొందఁగ నర్హుఁడుకాఁడు దేవతా
శాపరిపూర్తికిం దగిన సత్కృతికిం గొఱగాఁడు పైతృకో
ద్యాపన మాచరించుటకుఁ దద్దులు పిల్వఁగ సంశయింతు రిం
కేపనిసేయఁగా వలయు ! నిట్టిసుతుం గని మానిసత్తమా. ౧౯౦

తే. గీ. అయ్యొ ! గోభిల ! సంసారమందు మూర్ఖ
పుత్త్రకు మించు కష్టమ్ము పుడమిఁ గలదె ?
అంతకన్నను జావు మే లన్యమేది
యేనియు భరింపనగుఁ గృపఁ బూను మనఘ ! ౧౯౧

క. అని చరణంబులఁ బడు న
య్యనఘాత్ముని దేవదత్తు ననుకంపాదృ
ష్టిని గనె గోభిలుఁ డెందున్
ఘనులకుఁ గోపంబు క్షణముకన్న నిలుచునే ? ౧౯౨

ఆ. వె. సహజశీతలంబు జల మది యగ్ని చే
గాని యాతపమునఁగాని కాఁగు
దానిపొత్తు విడిచి తనగుణంబును గాంచు
నట్లె శాంతులకును నబ్బు శాంతి. ౧౯౩

క. శాంతుఁడయి గోభిలుఁడు ధీ
మంతుం "డో దేవదత్త ! మఱి నీపుత్త్రుం
డెంతయు మూర్ఖుండయ్యు న
నంతరమున బుద్ధిమంతుఁడగుఁ గవియు నగున్. ౧౯౪

ఆ. వె. అనుడు దేవదత్తుఁ డతిమోదమంది యి
ష్టిని సమాప్తి చేసి యనఘులైన
ఋత్విజులను సత్కరించె నంతకుఁ గొంత
కాలమునకు నతనికాంత యెలమి. ౧౯౭

క. రోహిణి యను పేరి వరా
రోహ కలితగర్భ యగుచు రోహిణిగల పు
ణ్యాహమ్మున సుతుఁ గనెఁ గడు
మోహమ్మున జాతకర్మము నతఁడొనర్చెన్. ౧౯౮

వ. పిదప నక్కుమారునకు శుభ దినమ్మున నుతథ్యుండను పేరు పెట్టి విధిచోదితంబగు కాలమ్మున నుపనయనం బాచరించి వేదంబుఁ జెప్ప నారంభించుటయు, ౧౯౯

ఉ. 'ఓ'మని తండ్రిచెప్ప నతఁడూరక చూచు, "నిదేమి పాపమో
రీ! మఱుమాట లే" దనిన నేడువ సాఁగు మతేమియందు నా
సోమరిపోతు నా వెడఁగు శుంఠఁ, జనెన్ బది రెండు నేడు లి
ట్లామెయి సంధ్యవార్చువిధమైన నెఱుంగఁ డిఁ కేటి వేదముల్ ?

క. ఇటు మూర్ఖుడైన కుమారున్
గటకటపడి జననియున్ జనకుఁడున్ లోలో
మటమట లాడెదరఁట ! యు
క్కటు ! యితరుల కెన్న నతఁడు గర్హ్యుఁడ కాఁడే ?

క. జననీజనకులయాదర
మెనయనిజన్మంబు జన్మమే ? యని వైరా
గ్యనియతుఁ డగుచు నుతథ్యుడు
వనమున కేతెంచె లోన వగ గడలుకొనన్. ౨౦౦

ఆ. వె. మూర్ఖుఁ డైనకొడుకు పుట్టుటకన్నను
గుడ్డియైన మతియుఁ గుంటియైన
మే లటంచు నతనిమేలు గణింపక
తల్లిదండ్రులు మదిఁ దలఁప రైరి. ౨౦౧

వ. అతండును గంగాతీరమ్మున నొకపర్ణశాల నేర్పఱచుకొని వసిం
చుచుఁ బ్రతిదినంబును శూద్రునింబలె నమంత్రకంబుగ స్నానం
బాచరించుచు ఫలమూలాదులఁ గాలక్షేపం బొనర్చుచు సత్యంబు
దక్క వేఱొండు పల్క నని వ్రతం బూని యట నున్నంత జను
లందఱు నాతని సత్యతపుండని పల్కిరి. ౨౦౨

క. అపకారంబొనరుపఁడఁట !
యుపకారం బంతకన్న నొనరుపఁడఁట ! యా
తపమునకన్న మఱింకొక
తప ముండునె యెంచిచూడఁ దత్త్వజ్ఞులకున్ ? ౨౦౩

సీ. తగురూప మలవడి సుగుణంబుల నెసంగి
వంధ్యయై యొప్పుజవ్వని విధమునఁ
గొమ్మలనొప్పి పూగుత్తులఁ జెలువారి
సఫలముగానివృక్షమువడువున
బలుపెక్కి మిగులఁ జూపుల గుట్టమై కొంచె
మైనను పా లీని యావు పగిది
ధనధాన్యములు గల్గి తగు రాజ్యముండి దా
తృత్వము లేని పార్థివుని మాడ్కి

గీ. నుత్తమ ద్విజకులమున నుద్భవించి
చదువు సంధ్యయు లేక నిష్ఫలుఁడనైన

నాకు మరణంబుకన్న నన్యంబు శరణ
మున్నదె? యటంచు నతఁ డిట్లు లూహ సేయు. ౨౦౫

చ. వెనుకటి జన్మమందు నొక వేదపుఁ బుస్తకమైన విప్రనం
దనునకు దాన మిచ్చు సుకృతమ్మునఁ బోవనినాకు విద్య ర
మ్మనిన నదేలవచ్చు నకటా! విరిబోఁడియు విద్యయున్ ధనం
బును దొలిజన్మమం దిడని మూర్ఖులకున్ లభియింప నేర్చునే?

క. నా తోడివా రఖిల వి
ద్యాతంత్రమ్ముల సమర్థులై యుండఁగ నా
కీతీరు గలుగు టెన్నఁగ
నా తొలిజన్మంపు ఫల మనంగాఁ దగదే? ౨౦౬

క. ఏవారి దూఱ నేమగు
దైవాధీనములు సకలతంత్రమ్ములు నా
దైవగతి దాఁటఁ దరమే?
యావారిజభవునికైన నభవునికైనన్. ౨౦౭

వ. అనివిచారించుచుఁ బావనోదకంబగు నవ్వనమ్మున జపతపము లెఱుంగక కాలయాపనం బొనర్చుచున్నంత నతని మును లెల్లరు సత్యవ్రతుం డనిరి. ఇట్లు పదునాలుగేండ్లు గతించు పిమ్మట నొక్కనాఁడు, ౨౦౮

చ. యమసమ దేహుఁడున్ వనవిహారియు బాణధనుర్ధరుండు దు
ర్గమభుజశాలి యొక్కఁడు కిరాతుఁడు వేఁటకు వచ్చి యొక్కకో
లముఁ బడనేయ నయ్యది తలంకుచు భూసురపుత్రునగ్రభా
గమునఁ బలాయితంబగు చొకానొకరావ మొనర్చె నార్తమై.

వ. దైవవశంబున నయ్యది సారస్వతబీజం బయ్యెఁ దత్ప్రభావం బెఱుంగనివాఁడయ్యు నతండు, ౨౧౦

క. కోలము కిరాతబాణ
వ్యాలోలం బగుచు నిట్లు పలికె నటంచుక్
జాలిమెయిం దదనుకరణము
వాలాయము సలిపెం దపముపఘుపున నంతక్. ౨౧౧

వ. అయ్యడవిపందియుం దత్సమీాపస్థంబగు నొక్క పొదరింటం డాంగుడుం దదన్వేషణంబునకుం గిరాతుం డేతెంచి సత్యవ్రతు నకు మ్రొక్కి యిట్లనియె. ౨౧౨

ఉ. తీవ్రశరంబు దాంకి చనుదెంచెను గోల మ దేడ కేగె నో
సువ్రత ! చెప్పి యాంకటను జొక్కు కుటుంబము నుద్ధరించి స
త్యవ్రతనామధేయము యథార్థము సేయంగదయ్య ! మా కిరా
తవ్రజ మిట్లుగా బ్రతుక ధాత విధించిన ధర్మమేకదా. ౨౧౩

క. తనకులవృత్తి విడువం దగ
దని మీావిప్రులె వచింతు రది గాకేవృ
త్తినినైనం దనకుటుంబం
బును బోషించు టది తగదె ? భూసురవర్యా ! ౨౧౪

ఆ. వె. అనుకిరాతుపలుకు లాలించి సత్యవ్ర
తుండు చెప్ప కూరకుండెం జెప్ప
కున్నం దనవ్రతంబు బన్నంబు జెందుం జె
ప్పిన నఘంబు జంతుపీడవలన. ౨౧౫

వ. అని ప్రాణిసంరక్షణార్థంబగు నన్నృతంబున వ్రతభంగంబు గామి నిశ్చయించి నిరుత్తరుండై తత్కిటిముఖోద్ధంబగు సారస్వతబీజం బుచ్చరించుచున్నంత, ౨౧౬

క. అంబ కృపగలిగి ప్రత్య
క్షంబై యవ్విప్రసుతునిఁ గవితావాల్మీ
కిం బొనరిఁచె నఁట! తద్బీ
జంబు పఠించిన నరులకుఁ జదువులు కొదవే. ౨౧౮

వ. ఇట్లు పరదేవతా నిర్హేతుక కటాక్షమ్మునం జేసి నిరంకుశకవితాప్రభావమ్ముఁ జెంది యాసత్యవ్రతుం డక్కిరాతుంజూచి యీశ్లోకంబు నుడివె.

*శ్లో. యా పశ్యతి న సా బ్రూతే, యాబ్రూతే సా నపశ్యతి
అహో వ్యాధ స్వకార్యార్థిన్, కింపృచ్ఛసి పునఃపునః,

వ. అనుచు వ్యాధుండు నిరాశుండై యరిగె సత్యవ్రతుండును మహాకవియై తద్బీజమ్ము జపియించుచు విఖ్యాతింబడసె. ౨౨౦

చ. అతని కవిత్వముల్ విని యహో! యని మెచ్చెడివారుఁ బండితుండితఁడొకఁడే యటంచు నుతియించెడివారు నమస్కరించువారతులవిభూతిఁ గానుకల నంపెడివారు సరస్వతీదయాగతకవితానుభావులకు గౌరవసంపద లబ్బు టబ్రమే. ౨౨౧

ఆ. వె. అట్టితనయుఁగాంచి యానందమందిరి
తల్లిదండ్రులెంత ధన్యతములొ
ముందు మూర్ఖుఁడైన పుత్రుండు తుదకు జ
గత్ప్రసిద్ధమైన కవితఁగాంచె. ౨౨౨

ఉ. కావున నంబికాకరుణ గాంచినవారికి నెందు విద్య గానీ, విభవమ్ముగాని, మఱి యెద్దియుఁ గాని, యసాధ్యమే? మునీం

---

* క. ఎదిచూచునొ యది చెప్పదు, విదితముగాఁబల్కునేది వీక్షింపని ద
యగ్యది సారెసారె నేఁడుడి, గద? వెవ్వరు చెప్పవా? రోగిన్ జనుమృగయా!

దా ! వినుమంచుఁ జెప్పె జమదగ్నికి లోమశవహాని, నీవునుఁ
భూవర ! యంబికాకరుణఁ బొందుము చెందుము సర్వసంపదల్.

క. ఆ యంబ ప్రీతిఁ జెందుట
కై యజ్ఞ మొనర్పు మఖిలమగు కామంబుల్
శ్రీయును సంపదయును విపు
లాయుర్ధాయాదికంబు నలవడు నీకున్. ౨౨౮

ఉ. దీనులు రోగపీడితులు దృగ్వికలుల్ క్షుధితుల్ శఠుల్ పరా
ధీనులు మూర్ఖులుఁ విగతతేజులు రిక్తులు నాదిగాఁగ నీ
మానవులఁ గ్రహింపు మనుమానముఁనఁ దొలిజన్మమందుఁ ద
ద్ధ్యాన మొనర్పకున్కిఁ బరమాతురులై రిపుడంచు భూవరా.

సీ. తులలేని యైశ్వర్యముల నెసంగెడివారు
పుత్రపౌత్రులకల్మిఁ బొల్చువారు
వేదవేదాంగాది విద్యలుకలవారు
భోగమ్ములను దులఁ దూఁగువారు
పుష్టికల్గినగాత్ర యష్టిఁబొల్చెడివారు
సామ్రాజ్య విభవమెసంగువారు
పదిమంది బందుగుల్ బలిసి కొల్చెడివారు
సర్వథాసౌఖ్యముల్ జరుగువారు

గీ. నెల్లకాలము శుభముల నెనయువారు
మొదలుగాగలవారలు మున్ను జగద
ధీశ్వరిని దేవ దేవిని దెలివికలిమి
నెఱిఁగి కొల్చినవారని యెఱుఁగు మధిప ! ౨౨౯

—* దేవీయజ్ఞ విధానము *—

క. కావున దేవీమఖముం
గావింపుమటన్న వ్యాసుఁగాంచి పరీక్షి
ద్భావరతనయుఁడు జననుత
భావుఁడు జనమేజయుండు వలికెం బేర్మిన్ ౨౨౮

క. దేవీయజ్ఞ విధానం
బేవిధముననుండు దాని కేయేవస్తుల్
గావలయు నాకు నానతి
యీవే ! కృప ననుచు వ్యాసుఁ డిట్లని తెలిపెన్ ౨౨౯

వ. రాజేంద్ర ! సాత్త్వికంబును రాజసంబును దామసంబును నిర్గుణంబును జ్ఞానమయంబును నన దేవీయజ్ఞం బైదువిధమ్ములు గలయది ; యందు మునులకు సాత్త్వికంబును, రాజులకు రాజసంబును రాక్షసులకు దామసంబును, జ్ఞానులకు నిర్గుణంబును, ముక్తులకు జ్ఞానమయమ్మును, గర్తవ్యంబులు ; సమీచీన దేశకాలమంత్ర బ్రాహ్మణ ద్రవ్యంబులు గలుగునది సాత్త్వికంబు నాఁబడు. ఏ యజ్ఞంబు కాని ద్రవ్యశుద్ధి క్రియాశుద్ధి మంత్రశుద్ధులు లేనిచో సంపూర్ణఫలం బీనేరదు. అన్యాయార్జితంబగు విత్తమ్ముచేఁ జేసిన జన్నంబు పరలోకమ్మునకు వెలియగు, నిద్దానికిఁ బ్రత్యక్ష దృష్టాంతంబు మన పాండవుల రాజసూయం బది యెట్లంటేని,

మ. రమణీయుండగు శౌరి తోడుపడ భారద్వాజముఖ్యుల్ మహో
త్తము లార్త్విజ్యమొనర్పఁ బూర్వమున మీ తాతల్ తగన్ రాజసూ
యము గావించి ప్రసిద్ధిఁ గాంచి నెలలో నాత్మీయమహా సర్వరా
జ్యముఁ గోల్పోవుటకున్ గతంబు ధన మన్యాయార్జితం బౌటయే.

గీ. ద్యూతమాడి పరాజయోపేతులై రి
నాతి పాంచాలి సభకు నానీతయయ్యె
సిరి సమస్తము శత్రులచేతఁ జిక్కె
దమ కరణ్యంబు రాజ్యమై తారసించె. ౨౩౨

క. అటఁ బండ్రెండేఁడులు మి
క్కుటమగుకష్టములఁ జెంది కోమలితోఁ బి
మ్మట విరటుఁ గొల్వ నేగిరి
కటకట! మఱి యింతకన్నఁ గష్టముకలదే. ౨౩౩

ఉ. పాతకుఁడైన కీచకుఁ డపాత్రుఁడు ద్రోవదిఁ బట్టి యెంతయుఁ
యాతనపా లొనర్పనపు డాసతికష్టము మాన్పుపుణ్యపుఁ
జేఁతకు నొక్కరైన దయ సేయ రిసీ! యదురాట్కటాక్షసం
పాతము లేదఁ జొచ్చెనొకొ? పాఱులదీవన లేదఁ బోయెనో.

ఉ. గణ్యుఁడు కర్త ధర్మజుఁడు, కంజదళాక్షుఁడు తోడునీడ, బ్రి
హ్మణ్యులు ఋత్విజుల్, గడు శుభావహమౌ క్రతు విందు ధర్మవై
గుణ్యము లేక యున్న సమకూడెనె యిట్టిదొసంగు; లెందునుఁ
బుణ్యపుసేఁతయైనఁ జెడిపోయిన ముప్పులు మూఁడకుండునే.

గీ. ధర్మవిక్రృతియు లేక సత్రంబొనర్చు
వారలకు భంగపాటు చేకూరెనేని
మంత్రములు వ్యర్థములు వేదమతము తప్పు
మును లసత్యులు తపములు ముప్పు లధిప. ౨౩౬

క. కావున నేకర్మంబేఁ
గావించినపిదప దొసఁగు గలిగిన దానిఁ
గేవల లోపము కల దని
కోవిదు లూహింప వలయుఁ గురుకులతిలకా. ౨౩౭

వ. కర్తృభేద ద్రవ్యభేద మంత్రభేదమ్ములఁ గర్మవైపరీత్యంబు గల్గుచుండు. మున్ను దేవేంద్రుండు విశ్వరూపుని గురునిగాఁ గైకొని జన్నంబొనర్చిన నతండు మాతృపక్షీయులగు రక్కసులకు గూడ నుపకరించెఁ బిదప నింద్రుండు కుపితుండై తన వజ్రమ్మున నతని శిరంబు డొల్లసేసెఁ గావున నెవ్వండేనిఁ గర్మవైపరీత్యం బొదవకుండఁ గాపాడికొనవలయు. సర్వంబు దైవాధీనంబనుట సరికాదు. ౨౩౭

క. మును ద్రుపదనృపతి ఘటజ
న్మునిఁ బరిమార్పంగ జన్నమున ధృష్టద్యు
మ్నుని ద్రోవది యను కూఁతుం
గని ధన్యుండయ్యె వికృతిగననికతమునన్. ౨౩౮

గీ. దశరథుం డనురాజు సత్రంబొనర్చి
సుతుల నల్వురఁ గని జగద్ధిత మొనర్చె
నేదియేనియు సఫలమై యొసఁగుఫలంబె
కర్మలోపంబు లేమియె కారణంబు ౨౩౯

వ. సాత్త్వికం బగుజన్నం బొనర్చుట యేరికిని గష్టతరం బయ్యెది వైఖానసవ్రతనిష్ఠులును సాత్త్వికభోజనులునునగు మహామునులు సేయువారు. రాజసం బభిమానవంతులగు క్షత్రియులకును వైశ్యులకును విహితంబు. తామసయాగంబు మదమత్తులగు దానవులకు యోగ్యంబు. మోక్షకాములకు మానసంబు కర్తవ్యంబు తత్ప్రకారంబు వినుము. ౨౪౦

సీ. మనము నిర్మలముగ నొనరించి గుణములు
వర్జించి యింద్రియవర్తనముల

నణంగించి దేహంబు నతిశుద్ధముగఁ జేయఁ
గలవాఁడు తగునధికారిసుమ్ము
మాటపమ్మును వేది మహితాగ్నులను బుత్వి
జులను దక్షిణల నచ్చుగ మనమునఁ
గల్పించుకొనవలెఁ గడఁగి దీనికి హోత
యజమానుఁడును గూడ నరయ మనము;

గీ. నిర్గుణబ్రహ్మ మధిదైవనియతిఁ దనరు,
నాద్యయును నిర్గుణయు నగునట్టిశక్తి
ఫలద, బ్రహ్మైక్య మిద్దానిఫలము, మునులు
దీని సేఁతకుఁ దగువారు తెలియుమధిప! ౨౮౧

క. ఏవంవిధ మగుజన్నం
బేవారు రచింతురో మహీంయశ్శ్రీధా
ధీవిభవు లగుచు వారే
జీవన్ముక్తు లని చెప్పఁ జెల్లుదు రధిపా! ౨౮౨

వ. తక్కిన జ్యోతిష్టోమాదికంబునకు ఫలంబు స్వర్గంబు, అయ్యది యస్థిరంబు. ఐనను మానసంబు రాజన్యులకు దుష్కరం బగుటంజేసి తాదృశంబులగు యాగంబులు కర్తవ్యంబులు. అందుఁ దామసంబగు యాగంబొనరించి సర్వవైరంబుఁ దీర్చికొంటివి. ఇఁక రాజసంబగు జన్నం బొనర్చి ధన్యుండవు కమ్మని మఱియు నిట్లనియె.

శా. దేవీబీజవిధానవేత్తలగు భూదేవాగ్రణుల్ బుత్విజుల్
గా వేదోక్తవిధానరీతిగ జగద్ధన్యంబుగా వేడ్కమై
దేవీయజ్ఞ మొనర్చి దుర్మృతిగతిం దీండ్రించు నీతండ్రి స్వ
ర్గావాప్తిం గనఁగాఁ బిత్రృణమును బాయం జెల్లదే? భూవరా!

మ. ఘనసంగ్రామమొ! పుణ్యభూతలమొ! గంగాతీరమో! కాక నీ
జనకుం డున్నతసౌధరాజమున దుస్సర్పమ్ముచే దుర్మృతిం
గని ఘోరంబగు రౌరవమ్మునఁ బడెన్, గాళీమహాయజ్ఞసం
జనితానంతవిశేషపుణ్యమున నచ్చెల్లోకముల్ గూర్పుమా.

ఉ. చెందితి సర్వసౌఖ్యములఁ జేసితిఁ బుణ్యములన్ జిరాయువుం
బొందితిఁ గర్మబద్ధ మగుబొంది నిఁకన్ ద్యజియించి యాత్మతోఁ
బొందఁగరానిసౌఖ్యములఁ బొందఁగఁజెల్లదె? యంచుఁ దృప్తిఁ జె
న్నొందినవానికిన్ గలుగు నుత్తమలోకము పార్థివోత్తమా.

వ. భవజ్జనకుం డిట్టి తృప్తిగల్గి దేహత్యాగం బొనరించినవాఁడు కాఁడు. కావున మున్ను మహావిష్ణువుచే నొనర్పంబడినదియు ననర్గళ ఫలదంబును నగుదేవీయజ్ఞం బొనరించి యక్కతనఁ గృతార్థు నొనర్చి పితౄణవిముక్తుండవు గమ్మనుడు జనమేజయుండు సాశ్రుకంఠుండై సాత్యవతేయున కిట్లనియె. ౨౮౭

మ. హరి జన్నంబొనరించె నంటి వొగి నాయజ్ఞంబున న్నాథులె
వ్వరొ? యద్దానివిధాన మెట్టిదొ? జగద్వంద్యుండు విష్ణుండు త
త్పరతం జెందుట కేమికారణమొ? సర్వమ్మున్ గుదింగూర్చి స
త్కరుణాదృష్టివచించి మీఁద మఖముల్ గావింపఁగాఁజేయుమా.

క. అనుజనమేజయుఁ గనుఁగొని
యనువ్యాసుం డధిప! విను మహాద్భుతమగున
ట్లొనరించె మున్ను జన్నం
బును విష్ణుం డంబ మిగుల వేడ్కఁ జెందెన్. ౨౮౯

వ. హరిహరవిరించు లట్లు దేవీ నికటంబునుండి శక్తియుక్తులై విమానం బధిష్ఠించి స్వస్వరూపమ్ములు ధరియించి యర్ణవ నికటమ్మున కేతెంచినపిమ్మట, ౨౯౦

గీ. ముగురకును మూఁడు వాసముల్ తగుగతిని నొ
సర్చికొని యున్న యంత ననంతకరుణ
మైన యీ యంబచే ముక్తయయ్యె నచల
మైన యాధారశక్తి యద్దాని నూని, ౨౧౨

సీ. ధర పుట్టె, నద్దానిఁ దగ మధుకైటభ
మేదోభరమ్ములతో మిళితమైన
కతమున మేదినిగా వచింతురు; ధార
ణముఁ బొనర్చినకారణమున ధర య
నియు, మహీయస్త్వం బెనయుటను మహి యని
యును, విస్తృతంబగుటను బృథివి య
నియు, వచింతురు దాని నెఱిమోయుటకుఁ బర్వ
తములఁ జేసిరి విస్తృతములు గాఁగ

గీ. నందు మేరువు కనకమయంబు రత్న
శృంగసంశోభితంబు; మరీచినార
దాత్రిపులహక్రతుపులస్త్య లలనసిష్ఠ
దక్షులును బ్రహ్మపుత్రులై తనరు మునులు. ౨౧౨

గీ. అలమరీచికి సుతుఁడు గశ్యపుఁడు దక్షు
నకుఁ ద్రయోదశకన్యకల్ ప్రకటమతులు
పుట్టె; రమరులు దైత్యు లిర్వురును దక్ష
కన్యకలయందుఁ గల్గిరి కశ్యపునకు. ౨౧౩

గీ, దానఁ గాశ్యపి సృష్టి యత్యధికమయ్యె
మనుజులును బశువులును గ్రమముగ విస్త
రించునంతటఁ బుట్టె విరించి దక్షి
ణాంగముననుండి ఘనుఁడు స్వాయంభువుండు. ౨౧౪

వ. అవ్విరించి వామభాగమ్మునుండి శతరూపయను నొకకన్నియ
పుట్టె వీరిరువురకుఁ బ్రియవ్రతోత్తానపాదులును నతిసుందరులగు
ముగ్గురు కన్యకలును నుదయించిరి. ౩౫౫

క. ఏవంవిధముగ సృష్టిని
గావించి సరోజభవుఁడు గాంచనగిరియం
దావెనుక బ్రహ్మలోకము
గావించుకొనె న్నివాసగతికై తనకున్. ౩౫౬

వ. విష్ణువునకు నత్యుత్తమంబు వైకుంఠలోకంబును శివునకు రజత
మయంబగు కైలాసనగంబును నివాసంబులుగాఁ గల్పించె. ౩౫౭

క. నానారత్న విరాజిత
మై నయనోత్సవకరంబునై తగునాక
స్థానము మేరుగిరిస్థము
గా నొసరిచి దేవతలకుఁగా నొసఁగె వెసన్. ౩౫౮

సీ. మఱియు సముద్రంబు మథియించునప్పుడు
నుచ్చైశ్శ్రవంబను నొక్క యశ్వ
మును నాల్గుదంతమ్ము లెనసిన యైరావ
ణంబను గజము విన్నాణమైన
పారిజాతంబను పాదపంబును గామ
ధేనువు సామ్యంబులేని సొబగు
గల రంభ మొదలుగాఁగల యచ్చరలు నందు
బొడమినఁ గైకొనె గడఁగి యింద్రుఁ

గీ. డుదయమందిరి జలజారియును భిషగ్వ
రుండు ధన్వంతరియును నఖండమైన

యర్ణవమునుండి వీరు దేవాంశభవులు
స్వర్గవర్తులు సృష్టి యీ సరణిఁజెలఁగె. ౨౫౯

వ. మఱియు నండజస్వేదజోద్భిజ్జజరాయుజంబులను నాల్గుభేదమ్ములు గలిగి కర్మవశమ్మున ననేకజీవరాసు లుత్పన్నంబు లయ్యె. ఇవ్విధంబున కృతకృత్యులై బ్రహ్మవిష్ణుమహేశ్వరులు తమతమస్థానంబుల సుఖంబుండి రంత విష్ణువు లక్ష్మితో సమస్తసుఖంబు లనుభవించుచు నొక్కనాఁడు సుధాసింధుగతం బగు మణిమండితద్వీపమ్మును నటఁ బొడకట్టినమహాశక్తియుఁ దన్నిమిత్తమ్మున దొరకొన్నమంత్రంబును దమకు స్త్రీరూపప్రాప్తియు మున్నుగాఁ గలసంగతులు మనమ్మునకుం దెచ్చుకొని యంబికాయజ్ఞంబొనర్పఁ గృతనిశ్చయుండై, ౨౬౦

చ. తనభువనంబు వెల్వడి ముదంబున నంబుజసంభవుఁ భవుఁ
ధనదు సురేంద్రుఁ బావకుని ధర్ము వసిష్ఠుని దక్షుఁ గశ్యపుఁ
ఘనుఁడగు వామదేవమునికాంతు బృహస్పతిఁ దక్కువారలఁ
బని గొని పిల్చి యత్నము నపారముగా నొనరించి యంతటన్,

వ. సమర్థులగు సప్తవింశతిబుత్త్విజులఁ గూర్చుకొని సువిస్తరంబు లగు వేదులఁ గల్పించి యథావిధిగ నగ్నుల నాసాదించి దేవీబీజ సమన్వితంబులగుమంత్రమ్ములచే వేల్చిన సంతసించి జగదీశ్వరి యశరీరిణియై యిట్లనియె. ౨౬౧

ఉ. ఎంతయు సంతసించితి రమేశ! భవత్కృతమైన యజ్ఞ మిం
తింతగ నొప్పునే! భవదభీష్టములెల్ల ఫలించుఁగాక వా
కాంతుఁడు నిందురుడున్ మొదలుగాఁగల దేవతలెల్ల నిన్ను న
త్యంతము పూజసేయ వరదాతవు గాఁగల వెల్లవారికిన్. ౨౬౨

సీ. జన్మములను నీకు సకల దేవతలలోఁ
బ్రాముఖ్య మెంతేనిఁ బరిఢవిల్లు
రాక్షసభీతి గీర్వాణులెల్లరు నిన్ను
శరణుఁగ్గై కొనిసారె సంశ్రయింతు
వేదమ్ములఁ బురాణవాదమ్ములను నీవ
యధికుండ వంచుఁ బ్రఖ్యాతి వచ్చు
ధర్మమ్మునకు నుపద్రవ మబ్బుతఱిఁ దత్త
దవతారములు దాల్చి యవనియందు

గీ. వివిధయోనుల యందు నావిర్భవించి
భూభరమ్మును దీర్చెడి పుణ్యమూర్తి
వై నెగడఁగలవు సిరి నిన్ననవరతము
వదలకుండెడి నాదగువరము కలిమి. ౨౬౪

క. వారాహి నారసింహియు
నా రాజిలురూపముల నెనసి శక్తులు నీ
కారయ సహాయలై కా
ర్యారంభములఁ సమాప్తి నందింతురొగిన్. ౨౬౫

వ. అట్టిశక్తుల నెన్నండును నీ వవమానింపక తగుగతి మన్నింపు చుండుము. భూలోకంబునను స్వర్గలోకమ్మునను నీమహిమంబమేయమ్మై యొప్పు నని చెప్పి విరమించిన విష్ణుండు నమందానందంబు చెంది క్రతుసమాప్తి నొందించి యెల్లర గౌరవించి మరల వైకుంఠంబున కరిగి సుఖం బుండె. ౨౬౬

క. అనిచెప్పినవ్యాసునిఁ గని
జనమేజయుఁ డిట్లు వల్కె సాత్యవతేయా!

మును దేవీయజ్ఞం బిం
క నెవరొనర్చిరో వచింపఁగాఁదగుఁ బేర్మిన్. ౨౬౭

వ. అనవుడు నాతండొక్క యితిహాసం బిట్లని చెప్పందొడఁగె ౨౬౮

—* ధ్రువసంధ్యోపాఖ్యానము. *—

మ. అలరారున్ సరయూతటమ్మున నయోధ్యాపట్టణం బద్ది కో
సల దేశమ్మున కెల్ల భూషణము కంజాతాప్తవంశ్యుండు కీ
ర్త్యలఘుం డప్పురి నేలుచుండు ధ్రువసంధ్యాఖ్యుండు రారాజు వి
ప్రులు రాజన్యులు వైశ్యులుం గలరు శూద్రుల్ తత్పురిన్ ధార్మికుల్

ఉ. ఆతని రాజ్యమందు నొకఁడైనను జోరుఁడు గాని జారతా
ఖ్యాతుఁడు గాని సూచకుఁడు గాని వసింపఁడు రాజ్య మీగతి
న్నీతిగ నేలు నాదరణి నేతకు నిద్దఱు ముద్దరాండ్రు, త
జ్జాతియు నీతిరీతియును జందము నందము నందనీయముల్.

క. ఆవిధి మనోరమయు లీ
లావతి యనఁ దనరు నా విలాసవతులతో
భూవిభుఁడు సుఖంబుండఁగ నా
వెలఁదులు చూలు దాల్చి యంతఁ గ్రమముగన్, ౨౭౧

వ. * సుదర్శనుండును శత్రుజిత్తు నను నిరువురు పుత్రులం గనిన రాజు వారలకు జాతకర్మాదికం బాచరించి యథావిభవంబుగ విప్రులకు ద్రవ్యంబు లొసంగి సమస్తాహార్థమ్మున వారలం జూచుచు మనోహరులగు నక్కుమారుల కతమున నానందమ్మునఁ గాలక్షేపం బొనర్చుచుండె. ౨౭౨

---

* సుదర్శనుఁడు శత్రుజిత్తుకన్న 1 మాసము పెద్ద.

ఉ. వారలలోన జ్యేష్ఠుఁ డనవద్యతనుండు సుదర్శనుండు, వి
స్తారవిలాసరూపసముదారవచోవిభవాభిరాముఁడుఁ
ధీరుఁడు శత్రుజిత్తతని తెల్విఁ కిఁ దండ్రియు మంత్రులుఁ భటుల్
పౌరులు సంతసించి కడుఁబక్షమునఁ గనుచుందు రాతనిఁ.

వ. అంతనొక్కనాఁడు ధ్రువసంధి మృగయావినోదార్థం బడవి
కేతెంచి యనేకమృగమ్ముల నుక్కడంచుచు నొక్కనికుంజమ్ము
నందలి సింహముం గొట్టుడు, ౨౭౪

మ. సట లింతింతలు చేసి యూర్ధ్వముగఁ బుచ్ఛంబుఁ దటాయించివి
స్ఫుటవక్త్రాభ్రపటత్పటధ్వని నభోభూభాగముల్ నిండ మి
క్కుటమౌ కోపభరమ్మునఁ భయదమై కుంజం బొకంజన్ సుదు
ర్ఘటవేగమ్మున వెల్వడె న్నృపవరుఁ గ్రాసంబుగాఁ గైకొనఁ,

వ. చనుదెంచునాహార్యక్షంబు నీక్షించి యతఁడు వాలును బల
కయుఁ దాల్చి చలింపక రెండవసింగంబై నిలిచె. తద్భటులు తమ
తమ యాయుధమ్ములతో సన్నద్ధులై యనేకశరమ్ము లద్దానిపై
విడుచుటయు, ౨౭౬

ఉ. చెచ్చెర వచ్చి యాన్నృపతిసింహునిపైఁ బడె ధైర్య మెంతయుఁ
హెచ్చఁగ నాతఁడుఁ గడఁగి యేసెఁగ దాసి మృగేంద్రుఁడంతటఁ
నొచ్చి మఱింత హెచ్చి తన నూతనశాతనఖాగ్రధారలఁ
వ్రచ్చినఁ జచ్చె నాన్నృపతివల్లభుఁ డేమనవచ్చు దైవముఁ.

క. ఆ నృపతి ఖడ్గనిహతిఁ
దా నొచ్చినదగుటకతనఁ దత్క్షణ మదియుం
బ్రాణములు వీడి యాన్నృపు
పై నొరిగెఁ మృతులగతులు బహుభంగులుగా! ౨౭౮

వ. అంత రాజభటులు లేతెంచి జరిగిన వృత్తాంతం బెల్ల మంత్రుల కెఱింగించిన వారును వసిష్ఠ పురస్సరంబుగాఁ గరణీయంబులు నిర్వర్తించి సుదర్శనునకుఁ బట్టాభిషేకం బొనర్ప నుంకించిరి.

ఉ. దానికి సమ్మతించిరి ముదమ్మునఁ బౌరజనుల్, వసిష్ఠుఁడున్
"భూనుతుఁ డీతఁ డీతనికిఁ బోలును రాజ్య మొసంగుఁ" డంచు స
న్మానము చూపె నంత నభిమానధనుండు యుధాజిదాఖ్యుఁ డ
న్మాన్యుఁడు శత్రుజిత్తున కనుంగగు తాత రయంబెలర్పఁగన్,

వ. జామాతృ మరణంబు విని యుజ్జయినీపురంబు నుండి యేతెంచె నాలోనన మనోరమాజనకుం డగు కళింగాధిపతి వీరసేనుండు తన మనుమఁడగు సుదర్శనునకు హితం బాచరింప నటకువచ్చె నిట్లు యుధాజి ద్వీరసేను లిరువురును తమ తమ దౌహిత్రులకుఁ గూర్చువారై మంత్రులతో నాలోచించు చున్నంత యుధాజిత్తు వీరసేనున కిట్లనియె. ౨౮౧

క. నీదుమనుమఁడు సుదర్శను
డాదరణీయుండు జ్యేష్ఠుఁడగు కతమున రూ
పాదికమున జ్యేష్ఠుం డగుఁ
గాదే మాశత్రుజిత్తు గనుఁగొనుమిత్తన్. ౨౮౨

వ. లోకమ్మున వయోజ్యేష్ఠులకన్న గుణజ్యేష్ఠుల గౌరవింతు రట్లగుట నామనుమఁడ రాజ్యార్హుం డనుటయు, ౨౮౩

గీ. వీరసేనుండు వల్కు "నీ వెట్టిమాట
తగదు నా సుతయే కదా! ధర్మపత్ని
తత్తనూజుఁడు రాజు సుదర్శనుండు
జ్యేష్ఠుఁగాదని ధర్మముల్ సెప్పు టెట్లు?" ౨౮౪

వ. అనుచు వీరసేనునకు మంత్రి లెదురాడక సుదర్శనునక పట్టంబు
గట్ట నుంకించుచు యుధాజిత్తు మంత్రులంజూచి, ౨౮౭

ఉ. మీరును మీరు నేకమయి మేదినికిం బతిగా సుదర్శనుఁ
వారకచేయ నొప్పికొనువాఁడె యతండు ! బలాన్వితుండు వి
స్ఫారవివేకశాలి గుణవంతుఁడు నా మనుమండు మధ్యలో
దారత మిమ్ము గీటడంచి తప్పక రాజ్యము సంగ్రహింపఁడే ?

క. కరమున నే నసిఁ బూనిన
ధరణియు వ్రక్కలగు ననినఁ దక్కొరులకు నఁ
బూరయఁగఁ దరమే ? మనమున
నరసికొనుఁడు మీఁద జరుగునట్టిది యెల్లఁ. ౨౮౮

వ. అని వీరాలాపమ్ము లాడిన వీరసేనుండు యుధాజిత్తున కిట్లను,

క. నా మనుమఁడు నీ మనుమఁడు
నీమెయిని సమానులగుట యేర్పడె మఱియుఁ
నా మనుమఁడు జ్యేష్ఠుం డతఁ
డీ మహి నేలంగఁ గర్త యెన్నివిధములఁ. ౨౮౯

వ. ఇట్లు వా రెడతెగని వైరమ్మున వాదించుచుంటకు నచటివా
రందఱును వ్యగ్రమానసులైరి. ౨౯౦

క. ధ్రువసంధినృపతిమరణం
బు వినితగఁ శృంగబేరపురవాసులు చో
ర్యవిధి ధనంబు హరింపఁగ
తవతవ నప్పురమునకు హుటాహుటినడలన్. ౨౯౧

వ. వచ్చి యతికోలాహలంబుగా సకలదిక్కుల వ్యాపించియుండి
రంత యుధాజిద్వీరసేనులు తమతమసైన్యములను గూర్చుకొని
యుద్ధ సన్నద్ధులైరి. ౨౯౨

—* యుధాజిద్వీరసేనుల యుద్ధము *—

క. ధృతశస్త్రాస్త్రహస్తులును స
గతసైన్యసమేతులును నఖండరుడావే
శితులును నగు నయ్యిరువుర
కతులితమగు తుములయుద్ధమయ్యె నృపాలా! ౨౯3

క. దండిమెయి వీరసేనుఁడు
కొండపయిన్ గురియు మొగులుకొమరున సత్యు
ద్దండంబుగ బాణంబుల
తండంబులువరపె నాయుధాజిత్తుపయిన్. ౨౯౪

క. వీఁక నిటు వీరసేనుఁడు
దాఁకి ప్రయోగించుశరవితానము గను ను
ద్రేకమున యుధాజిత్తు
త్సేక మెలర్చెడిశరముల ఛేదించె వడిన్. ౨౯౫

క. తురగంబులుఁ దురగంబులు
కరులుఁ గరులు భటులుభటులు గలసి పెనఁగ నం
బరచరులును భయపడిన ని
తరులకు నాసంగరంబు దరమే పొగడన్. ౨౯౬

వ. అట్టి యెడఁ జూర్ణంబులగు రథంబులును ఖండితంబులగు వార
ణంబులును భగ్నంబులగు తురగంబులును పాతితులగు
పదాతులును ద్రెళ్లినశిరమ్ములును దెగినకరమ్ములును బగిలిన

వక్షమ్ములును దగిలినబాణమ్ములును నై సంగరమ్ము పరి
వర్తిల్లె. ౨౯౭

క. పిశితంబుఁ గ్రహియించెడి
యశనాయాపీడితమ్ము లగు బహు కంకా
ది శకుంతమ్ముల యార్భటి
దశదిశ లొక్కటిగ మ్రోసె ధరణీనాథా! ౨౯౮

క. కొండల కెనయగు మాంసపు
ఖండపుఁ బ్రోవులను వెడలఁగాఁ జొచ్చె మహో
ద్దండము లగు సెలయేఱుల
తండములన రక్తములు పదంపడి యచటన్, ౨౯౯

చ. అరదమునుండి చచ్చిపడినట్టి శవమ్ముల పైపయిన్ దివిన్
గరమును మాంసముం గొనెడికాంక్షఁ జరించెడిగ్రద్ద పెద్ద ని
ద్దురగనియుండియున్ సొబగుతోఁ దులఁదూఁగునిజాంగకమ్ములన్
బారసెడి దేహమందుఁ జొరబోయెడిజీవుఁడు నాఁగఁ జొప్పడెన్.

చ. అనిఁ దెగటారి యాకసమునందు విమానము నెక్కి యంకమం
దెనసి విలాసముల్ గొలిపి యింపుఘటించెడి యప్సరోంగనన్
గని యొకవీరు! డిట్లులను "గాంత! మదీయశరీర మెంతచ
క్కనిదొ గతాసువయ్యుఁ గసుగందదు కన్గొనుమా! రణావనిన్.

చ. ఇఁక నొకవీరుఁ డచ్చరయు నింపుగ ముచ్చటలాడుచున్ జక
చ్చకితవిమానమెక్కి చనఁ జయ్యన నాతనిధర్మపత్ని య
గ్నికి నెరఁజేసి దేహము నొగి న్నవదేహముఁ దాల్చి వేగఁ ద
న్నికటముచేరి యాసవతినిన్ బడఁగొట్టె మగండు నవ్వఁగన్.

మ. అనిలోఁ బోరొక్కనియిద్ధయుద్భటభటుల్ ప్రాణంబుఁగోల్పోయి నె
ట్టన నొక్కమ్మడి నేగియేగి యట మింటన్ దమ్మునంటంగ వ
చ్చిన వేల్పుంజవరాలిమిన్నఁ గని చూచిన్నారిపోన్నారి యం
గనకై వెన్కటికన్న నెక్కుడురుషన్ గాట్లాడి రత్యంతమున్.

సీ. నాభార్యకన్న విన్నాణంబు గలదాన
వంచు నచ్చర గారవించె నొకఁడు
ఏకపత్నీవ్రతం బేమి సేయుదు ముట్ట
దగదు పొమ్మనె వేల్పుమగువ నొకఁడు
కలికి! నాచెలిమిన్న కన్న నెక్కుడుదాన
వా! పొమ్మనియె వేల్పువనిత నొకఁడు
తనప్రతాపము సెప్పి తన కనుకూలఁగాఁ
గావించుకొనె దేవకాంత నొకఁడు

గీ. అయినవా రెందఱో! యిప్పుడగుచునున్న
వారలెందఱో! కాబోవువారలెంద
ఱో! యొకండంచుఁ గలఁడె మీరో యువిదల
కనుచు నిరసించె నప్సరో వనిత నొకఁడు. ౩౦౪

ఉ. ఒక్కని చెట్టవట్టి మఱియొక్కనికిన్ విడె మిచ్చి ముద్దు వే
ఱొక్కనికిచ్చి చల్లనిమృదూక్తుల వేఱొకనిన్ నగించి యిం
కొక్కని చెక్కుఁగొట్టిపొలుపొందె నొకచ్చరలేమ; యొక్క నిం
జిక్కటసున్న గాదె వెలచేడెలు స్వర్గముపొంత వోయినన్.

మ. బలపాదాహతి రేఁగు ధూళి దిశలన్ వ్యాపించి పై నంబర
స్థలి కేతెంచి సరోజబాంధవుని తేజంబున్ నివారించి ని
శ్చలమై రేబవలన్నమాట లవలేశంబైన లేకుండఁ జే
సె లలద్రిక్తపయోధిలోఁబడుడుఁదోఁచెన్ సూర్యుఁడామీఁదటన్

క. అట్టియెడ వీరసేనుని
బెట్టిదమగు తూపులేసి బిట్టడఁచె జగా
జెట్టి యుధాజిత్తతఁడును
జెట్టువలెన్ గూలె సేన చెదరెన్ దిశలన్. ౩౦౭

వ. మనోరమ తన తండ్రి మృతిన్ విని దుఃఖితయై, ౩౦౮

చ. పతి చనిపోయెఁ దండ్రి నరపాల శిరోమణి మన్నిమిత్తమై
మృతిఁగనె నాజిలో, సుతుఁడు మేలును గీడు నెఱుంగరాని చి
న్నతనమువాఁడు; దిక్కెవరు నాకిటఁ! బాతకుఁడైన యూతఁ డీ
సుతుని వధించి రాజ్యమును సొమ్మును మన్నని కీఁదలంపఁడే.

ఉ. పాపముఁ బుణ్యమంచుఁ దనవార లటంచును నన్యు లంచుఁ గో
పోపహతుల్ నిరస్తవినయుల్ కడులోభులునైన వార లా
హా! పరికింప నేర్తురె? భయం బెదఁ బాపి యనుగ్రహించులో
కోపకృతి స్వభావులు మహాత్ము లిక్కడ నెవ్వ రిమ్మెయిన్!

గీ. మొదలనుండియు నే నన మదినిమండు
సవతి లీలావతియుఁ గృప సలుపునొక్క!
శీఘ్రముగ వచ్చి యయ్యుధాజిత్తు మమ్ము
బంధనాగారమునఁ బడవైచు నిజము. ౩౧౧

వ. మున్నింద్రుండు కోపావిష్టుండై మాతృగర్భగతుం డగు బాలకుం
దన వజ్రమ్మున నేడుఖండమ్ములుగా ఖండించి పిదప నయ్యేడింటి
నేడేడుఖండమ్ములుగా నొనర్చిన నవి యేకోనపంచాశత్ఖండంబు
లై మరుత్తులనం బరఁగె. మఱి యొకనృపకాంత తన సవతి గర్భ
వతియగుటకు సహింపక విషమ్మువెట్టిన విషదగ్ధుండగు బాలకుం
డుదయించె నతండుకాఁడె సగరుండు? ౩౧౨

క. మును దశరథభూపా లాం
గనయౌ కైకేయి తనదుగాదిలి సుతు రా
జును జేసి సవతికొడుకుఁ
వనమున కంపించె ననెడి వార్తలు వినమే? 3౧3

గీ. అరయ నాసుతు రాజ్యమ్మునందు నిల్పి
మంత్రులెల్ల యుధాజిత్తుమాట కడ్డు
చెప్పలే రన్నదమ్ములు సేయఁదగిన
వారు లేరైరి యింకెట్లు వర్తనంబు. 3౧౪

వ. అని బహుప్రకారమ్ములఁ జింతించి సకలకార్యనిపుణుండగు విదల్లుం డను మంత్రివరు నేకతంబ రావించి యిట్లనియె. 3౧౫

చ. తనయుఁడు చిన్నవాఁడు తగు తంత్రవిధిజ్ఞుఁడు నాదు తండ్రి యు
ద్ధనిహతుఁడాయె మీాప్రభువుధార్మికుఁడంతకుమున్న యంతముఁ
గనెఁగద! శాత్రవుల్ ప్రబలి గర్వ మెలర్పఁగ మానభంగముఁ
బొనరుపనుండి రియ్యెడలఁ బోలు నుపాయ మొకండొనర్పఁగఁ.

వ. నాపుడు మంత్రి యిట్లనియె. 3౧౭

క. చలపట్టి యుధాజి ద్భూ
తలనాథుఁడు మిగుల మిమ్ము దండించు నతం
డలఘుం డియ్యెడ నిటుపై
నిలుచుట యుచితంబు గాదు నిక్కము తల్లీ! 3౧౮

క. బలవంతుండును గాశీ
తలనాథుం డెంత కేనిఁ దగు నస్మన్మా
తులుఁడు స్వబాహుం డతఁడు మ
నలఁబ్రోచు నచటికినేగ నామతమనినఁ, 3౧౯

వ. వల్లె యని యారాజపత్నియు రణనిహతుండగు తన తండ్రికి నర్ధ్వకృత్యంబులు నెఱవేర్పంజేసి సైరంధ్రి విదల్ల సహితంబుగాఁ గుమారుం దోడ్కొని భాగీరథీ తటమ్మున కరుగుటయు, ౩౨౦

ఉ. క్రూరులుచోరు లచ్చట నకుంఠితదుర్నయలీల రాత్రి య
వ్వారలఁ గొట్టి మేనఁ గలవస్తువులున్ ధనమున్ సమస్తమున్
గారణమాత్రులై బలిమిఁ గైకొని యేగిరి "యూరు విడ్చి పో
ర్గారికిఁ బోయినన్ జలమునూనినకర్మము మాన నేర్చునే? ౩౨౧

వ. ఇట్లు చోరోపహతయై ప్రతికూలమ్మగు దైవమ్మునకు వగచుచు వస్త్రమాత్రావశేషంబుగ నచ్చోటుగదలి సైరంధ్రి సహాయగ నుడుపం బెక్కి గంగానదిం దాఁటి భారద్వాజాశ్రమంబునకుం జని కొంత ధైర్యమ్ము చెంది యమ్మునియెదుట నిలువంబడుడు నమ్మహానుభావుండు కరుణార్ద్రుండై యామె కిట్లనియె. ౩౨౨

క. నీ వాసస్థల మెయ్యది?
నీవల్లభుఁ డెవఁడు? దుఃఖనీరధి మునుఁగం
గావలసె నేమికతమున!
దేవతవో! మర్త్యసతివొ! దెలుపుము మాకున్.

వ. అను మునివరునకు మాఱాడక శోకించుచున్న విదల్లుం డమ్ముని వరున కిట్లనియె. ౩౨౪

మ. ధ్రువసంధ్యాహ్వయుఁడొక్కరాజు సుజనస్తుత్యుం డయోధ్యాపురీ
ధవుఁ డాతం డొకనాఁడు వేఁటకయి కాంతారమ్మునం గ్రుమ్మఱన్
గవిసెన్ సింగ మఖండ చండిమమహాకారామితారావదు
ర్వ్యవసాయాతిరయప్రకృష్టభయదారంభాతిసంరంభమై.

వ. అట్టియెడ నాతండును పిఱుతివియక యద్దాని కెదురై పోర నయ్యెడియు, ౩౨౬

క. అక్షీణగతిని నృపహా
ర్యక్షునిపై కుఱుక నతఁ డహంకృతి నై చెఁ
గౌక్షేయకంబు పదఁపడి
యాక్షణమున గతాసులైరి యన్యోన్యమ్మున్. ౩౨౭

క. ఆతనిసతి యీసతి తను
జాతుం డీతండు వేఱుసతియును నాభూ
నేతకుఁ గల దాపెకుఁ దను
జాతుం డొక్కరుఁడుగలఁ డసాధ్యుఁడు బలిమిన్. ౩౨౮

వ. ఇట్లిరువురకు రాజ్యంబుఁ బట్టంబు గట్టఁబోఁటె నిరువురి మాతామహులుం బోరాడి రా సమరమ్మున నీతనితాత పరేతయయ్యెఁ బిదప నీరాజపత్ని తనపుత్త్రునిం గాపాడుకొనగతిలేమి వనమ్మునం గ్రుమ్మరునది పుణ్యవశమ్మున భవద్దర్శనంబొనరించె. భయాతురు లగు ననదల సంరక్షణంబు కోటియజ్ఞఫలదంబని భవాదృశులకు వక్కాణింప వలయునే? అనపుడు భారద్వాజుం డమ్మనోరమ కిట్లనియె. ౩౨౯

క. సచ్చరితవైన నీకుఁ
వచ్చినభయమేమి? పుడమి పాలించు నిజం
బిచ్చెఱుపాపఁ డభయుం
బిచ్చితి నిచ్చోట నిలువు మిచ్చానుగతిన్. ౩౩౦

వ. అని యొక్కపర్ణకుటీరముం జూపించిన నాపెయు విదల్ల సైరంధ్రీ సహితంబుగఁ గుమారుండును దానును సుఖంబుండె, నట యుధాజిత్తును, ౩౩౧

ఉ. సంగరరంగమున్ విడిచి సైన్యసమేతముగా నయోధ్య కు
ప్పొంగుచువచ్చి మంచిదగుమూర్తమునం దలశత్రుజిత్తు ను
త్తుంగతరోత్సవం బెలయ దుందుభినిస్వనముల్ సెలంగ రా
జ్యాంగమునందు నిల్పెఁ బురమంతయు మంగళసంగతంబుగన్.

వ. అట్టియెడ ధర్మాధర్మవిచక్షణులగు కొందఱు జనంబులు, 333

గీ. అల మనోరమ యెచ్చటి కరిగెనొక్కొ!
యెడ కేగె సుదర్శనుం డిద్ధచరితుఁ
డకట! వీరసేనుఁడు మృతుడైన కతనఁ
గాదె? యిటువంటి కష్టంబు కలిగె ననుచు, 334

గీ. వగలఁ బొగిలియు శత్రుజిద్వశగులైన
కతన నేమియు ననక సమ్మతిగనుండి
రట్లు మన్నని రాజ్యమ్మునందు నిల్పి
యయ్యుధాజిత్తు తనపురి కరుగునెడల. 335

—* యుధాజిత్తు భారద్వాజాశ్రమమ్మున కరుగుట *—

వ. సుదర్శనుండును దల్లియు భారద్వాజాశ్రమమ్మున నున్నవారని
యెఱింగి యతనిం జంప నూహించి చిత్రకూటపర్వతమ్మున కరిగి
నిషాదాధిపతియగు బలుఁడను వానిం బురస్కరించుకొని శృంగి
బేరపురాధిపతియగు దుర్దర్శు నికటమ్మున కేగుటయు, 336

చ. విని మనమందు భీతి గడు విస్తరిలంగ మనోరమాంగనా
జనతిలకంబు కన్నుల నజస్రము నశ్రులు గ్రమ్మ నమ్మునీం
ద్రునిదరిఁ జేరి " యీసుతుని ద్రోహమునం గడతేర్ప శత్రుజి
జ్జననికిఁదండ్రి మాకుఁగడుశత్రుఁడు వచ్చె మునీంద్ర వింటివే?

వ. మున్ను పాండవులు పాంచాలీసహితులై మున్యాశ్రమమున నున్నయెడ వారలేవురు నొక్కనాఁడు వనంబున కరుగుటయు ద్రౌపది ధౌమ్యాదిమునులతో నాశ్రమమ్మున నుండె నయ్యవసరమ్మున, 33౯

శా. ఆమార్గమ్మున నేగుదెంచె వెస సైన్యంబుల్ తనుంగొల్వ దుష్కామార్తుండు జయద్రథుం; డతఁడు వేడ్కన్ వేదనిర్ఘోష ముద్ధామప్రక్రియఁ గా నొనర్చుమునులం దర్శింప నేతెంచి యచ్చో మాద్యత్కరియాన యానఁగనె మించుంబోఁడి నాద్రౌపదిన్.

చ. కనుగొనినంత నెమ్మది వికారము దొట్రిల మాటిమాటి కవ్వనజదళాక్షిపై వల పవారితమై చన ధౌమ్యుఁ గాంచి యిట్లను "మునివర్య! యీజలరుహాసన యీతనుమధ్య యీకనత్కనకనిభాంగి యెవ్వతెయొ! గ్రక్కన నా కెఱింగింపు నావుడున్,

క. పాండుతరకీర్తియుక్తు ల
ఖండులు పాండవులు వారి గాదిలిసతి యీ
యండజయాన నెఱుఁగవె?
పాండవులన నీకుఁ గూర్చుబంధులుకారే? 3౮౧

గీ. వారలేవురు మృగయకై వనముపొంతఁ
బోయి రిప్పుడో యిఁకనో రాఁబోవు వార
లనిన విని సైంధవుండు నయ్యతివఁ గాంచి
యిట్టులని పల్కె నాదరం బినుమడింప. 3౮౨

చ. కుశలమె నీకుఁ బాండవులకున్! బతులెచ్చటికేగి! రెంతయున్ గృశవయి తీ వరణ్యమున కేగుకతంబున; మీకు నింత దుర్దశఘటియించెఁగా! యనుచుఁ దద్దయుమోహ్యుఁడునాగబ్రాలైఁబంచశరవికారదూషితుఁడు సైంధవుఁ డెక్కుడు బంధువుంబలెన్.

వ. పదఁపడి ద్రోవదియు బంధుసత్కారంబొనర్చి నంత యతండును,

క. పశువుగతి మంచిచెడ్డల
ప్రశంస విడనాడి ఋషులఁ బరికింపక దు
ర్వశుఁడై హరించె నాపె వి
వశులగు దుష్టులకు వావివరుసలు గలవే ? ౩౮౫

వ. పిదపఁ బాండవుల వలన నామె విముక్త యయ్యెనని విందుఁగాన నేరిని విశ్వసింపఁ దగదు. మున్ను వైరోచనసుతుండును బహుళ యజ్ఞకర్తయు ధార్మికుండును బ్రహ్లాదపౌత్రుండు నగు బలిచక్రవర్తిని హరి కపటవామనాకారమ్మున నింద్రహితార్థంబుగా వంచించె. ౩౮౬

ఉ. వామనమూర్తి లోభమున వచ్చి తనుం ద్రిపదప్రమాణ మా
భూమిని గోరినన్ గపటభూసురుఁ డంచు నెఱింగియున్ మహో
ద్దాముఁ డఖండదాత బలి దా నఖిలమ్మును ధారవోసెఁ గా
నీ మఱుమాట వల్కఁ డతఁ డెంతటిసత్యవదాన్యుఁడో కదా.

వ. సత్త్వగుణప్రధానుండగు సాక్షాన్మహావిష్ణు విట్లొనరింప నిఁక నన్యులన నెంత! కావున లోభోపహతచిత్తులకుఁ జేయరాని కార్యంబుండదు. ౩౮౭

మ. పరహింసన్ బొనరింతు రొండ్లధనమున్ బ్రాణంబులున్ గొంద్రుము
ష్కరులై యన్యవధూరతిన్ దిరుగుచున్ గార్యం బకార్యం బటం
చరయన్నేరరు లోభు; లెయ్యెడల నన్యాయంబు లేతత్కృతుల్
పరలోకం బని భీతి చెందరు మనోవాక్కాయకర్మంబులన్.

ఉ. దేవతలన్ యజింత్రు పరదేశములన్ జరియింత్రు దాతలై
కోవిదకోటికిన్ ముదము గొల్పుదు రుత్తము; లల్పలోభులో!

జీవుల హింససేయుదురు చేయుదు రెంతయుఁ జౌర్యముఁ దగన్
భావనసేయఁగాఁ బరధనంబు హరించెదిత్రోవ లిన్నియున్.

వ. కావున మన యాశ్రమనికటమ్మునఁ గాచియున్న యయ్యుధాజిత్తు నవ్వాలికన్ని నన్ను నిర్భయంజేసి నా పుత్రుఁ గాపాడు మనవుడు మునివరుండు వల్లెయని యుధాజిత్తుకడకేగి నీ రాకకుం గతమేమియని యడుగుడు నతండు మనోరమానయనంబున కని నుడివె నంత మునియును, ౩౫౧

క. పతిశోకముఁ బితృశోకము
నతిభరమై తన్ను నేచ నాత్మజుతో న
య్యతివ మము శరణుఁజెందె వి
గతభయయై యిచటనుండి కదలునె మరలన్. ౩౫౨

వ. అనవుడు యుధాజిత్తుమ్ముని కిట్లనియె. ౩౫౩

క. క్రమముగ ననిపిన ననుపుము
క్రమమునకుం దక్కి తేనిఁ గడఁగి బలాత్కా
రముగఁ గొనువాఁడ నిజమనఁ
గ మునివరుఁడు కనుల నగ్నికణములు వెడలన్, ౩౫౪

ఉ. ఓరి దురాత్మ! యోరికలుషోదర! యోరిజఘన్య! పో బలా
త్కారముగా గ్రహింపఁదగు దార్ఢ్యము గల్గిన నట్లొనర్ప రా
దే! ఋషులన్న రాజులకు నెల్లిదమే? మును మా వసిష్ఠుతోఁ
బోరెను గాదె ధేనువును బొందఁగ గాధిసుతుం డెఱుంగుదే?

వ. పిదప మంతనమ్మున యుధాజిత్తు మంత్రి కిట్లనియె. ౩౫౬

క. మునిపల్కులు వింటివికద!
మనోరమను సుతునితోడ మనము హరింపం

గ నుపాయమేది ! రిపువృ
ద్ధిని సైఁపఁగరాదు సూవె ధీమంతులకున్. ౩౫౭

ఆ. వె. రాజయక్ష్మపగిది రాజన్యులకు రిపు
శేషమున్న బాధ చేయుఁగానఁ
దవిలి వీనిఁ జంపి సౌహిత్రురాజ్యంబు
విగతశత్రుకముఁగఁ దగనొనర్తు. ౩౫౮

క. ఇటనన్ను నెదిరికొని పో
రుట కెవ్వఁడు లేకయుంట రూఢియకద ! యీ
జటిలుని పల్కులకుం జం
కుట యుచితమె యనుచు మంత్రి కోవిదుఁడనియెన్.

చ. నరవర వింటివే ! మునులనన్ మహనీయులు సాహసించు ము
ష్కరుల నొకింతలో నణఁపగా గల రెందును వారు పూన దు
ష్కరమగు కార్యముండ దదిగాక మునీంద్రుఁడు "గాధిపుత్రునిన్
గరము నెఱుంగుదే" యనిన కారణమున్ విను మే వచించెదన్.

క. మును విశ్వామిత్రుం డను
జనవరుఁ డొక్కెడ వసిష్ఠసంయమిఁ జూడన్
జనుటయు నమ్ముని తగు నా
సనమిడి గౌరవము సలిపి సంతస మెసఁగన్, ౩౬౧

వ. సైన్య సహితంబుగా విందునకు నిలువుమనుడు నతం డట్లొనర్చె.

ఉ. నందినియున్ వసిష్ఠమునినాయకునానతి తెప్పపాటులో
నందఱ కన్నిభంగుల ననంతములై తగుభక్ష్యభోజ్యముల్
విందులొనర్ప సైన్యసముపేతముగా నలగాధిపుత్రుఁ డా
విందును దృప్తిగా ననుభవించె నుతించుచుఁ దన్మహత్త్వమున్.

వ. పిదప నమ్మునివరు నడిగి యాధేనువుం గొనువాఁడై సవిన
యమ్మున నిట్లనియె. ౩౬౪

ఉ. ధేనులఁ జూడమో! మునుల దివ్యమహామహిమానుభావులం
గానమొ? యెన్నఁడేని యిటు గాంచితిమే? యొకరెప్పపాటులో
సేనలతో నృపాలురకుఁ జెచ్చెర విందులొనర్చి తృప్తులం
గా నొనరించు ధేనువులఁ గన్గొన నీమహిమంబు శక్యమే. ౩౬౫

క. అని మెలమెల్లన నిట్లను
ననఘా! ధేనువుల దశసహస్రంబులు నీ
కు నొసంగెద నా కిద్దా
నిని దయసేయఁగదె కోర్కె నెరవేర్పఁగదే? ౩౬౬

క. అనుడు వసిష్ఠుండను నో
జనవర! యెన్నేని దీనిసరిగా విడి నం
దిని యనుధేనువు హోమం
బున కీక్షీరములు మాకు ముఖ్యము లరయన్. ౩౬౭

వ. గాన దీని నీనేరననుడు నతం డిట్లనియె. ౩౬౮

క. ఈకుంటివేని యెట్లేఁ
జేకొనియెద నెల్లినేఁట సిద్ధ మనుడు నెం
తో కోపిష్ఠై వసిష్ఠుఁడు
నై కొందువుగాక చూడఁగాఁగల నేర్పున్. ౩౬౯

వ. నావుడు విశ్వామిత్రుండు బలిష్ఠులగు భటులం బిలిచి నందినిం
బట్టుకొనుఁడనుడు వారును నద్దాని నట్లొనర్ప భయకంపితయ
గుచు నయ్యది వసిష్ఠున కిట్లనియె. ౩౭౦

ఆ. వె. ఏమి తప్పుగలిగె ? నేకారణంబున
నన్ను విడిచెదీ ? వనయులు భటులు
పట్టికొనఁగనేల ? బాధింపఁగానేల ?
యనుచు మునియు ధేనువునకు ననియె. ౩౭౧

మ. బలవంతుం డగురాజు దుర్నయమునం బాధించుచున్నాఁడు నేఁ
గలకార్యంబు మఱేమి ? నిన్ను విడువంగా నోప నాశక్తికిం
దలదాఁకెన్, దపమేడ ! యుద్ధమునకుం దార్కొలు తానేడ ! నీ
తలమైనన్ విడిపించుకొమ్ము నను వొందన్ రమ్ము ముమ్మాటికిన్.

మ. అని మానీంద్రుఁడు వల్కి నందినియుఁ గ్రోధావేశమొప్పార హుం
మ్మను నాలోనన రాక్షసుల్ ప్రబలదర్పాహంకృతుల్ మీఱఁ ద
ద్ఘన కాయమ్మునఁ బుట్టి నిల్వుమని తత్సైన్యంబు వారించి గ్రి
క్కునఁ గాఁ జేసిన నెట్టులో మిగిలెఁ దత్క్షోణీశ్వరుం డొక్కఁడున్.

ఉ. అంతయుఁ గాంచి నెమ్మనమునం దతిభీతియు సంతసంబునుం
జింతయుఁ దొట్రిలంగఁ గడు సిగ్గిలి సీ ! నృపపౌరుషంబు గో
రంతయుఁ గాదు బ్రాహ్మణతపోధికతాధిగతప్రతాప మిం
తింతఁగ నొప్పునే ? ముని జయించుట కేమియుపాయ మిత్తఱిన్.

మ. అని దీర్ఘంబగు చింత నెమ్మనమునం దావిర్భవింపన్ ధిగం
చును క్షాత్రంబును ధిక్కరించి తప మస్తోకంబుగాఁ జేసి వా
రని కిన్కం ద్విజుఁడై మునీంద్రుఁడగుచున్ బ్రహ్మర్షి యంతయ్యు న
మ్మునికింజాలకపోయె * బ్రాహ్మణులతోఁ బోరాడుటల్ మాటలే.

క. కులనాశకరంబగు వి
ప్రులతో వైరంబుగాన భూవర ! మనమున్

* తాపసులతో

జలపట్టి కొలువితోడన్
దలఁగొకికొనకయ చనఁగఁదగు మనపురికిన్. 326

ఉ. దీనుఁడు నిర్ధనుండు గతతేజుఁడు బాలుఁడు తోడు లేదర
ణ్యాని వసించువాఁ డనదనాఁదగువాఁడు సుదర్శనుండు నీ
పై నెటు రాఁగలాఁ డటఁలు వచ్చినఁ జూడఁగవచ్చుఁ గాని యీ
మానివరేణ్యునిం జెనకి మానముఁబ్రాణముఁ గోలుపోకుమీ.

ఆ. వె. తృణము వజ్రమగును దృణమగు వజ్రంబు
దోమ యేనుగున్న దో నెదుర్చు
శశకమైనఁగాని శార్దూలమును జంపు
దైవయోగ మొకటి దప్పనేని. 327

క. కాఁదగినది కాకుండదు
కాఁ దగనిది కాదు దైవకారణమున నా
మోదము ఖేదముఁ దుల్య
ప్రాదుర్భావమ్ము లిందు వగవరు తజ్ఞుల్. 328

వ. అను మంత్రివచనమ్ములకు సమ్మతించి మునీంద్రపాలికిం జని
నమస్కరించి నానేరమి సైఁపుమని వేఁడుకొని యనుజ్ఞాతుండై
యుధాజిత్తు తనపురమ్మున కరిగె నంత మనోరమయు స్వస్థచిత్త
యగుచు నయ్యాశ్రమమ్మున నుండె శుక్లపక్షచంద్రుంబలె దినదిన
ప్రవర్ధమానుండగు సుదర్శనుండు సవయస్కులగు ఋషిపుత్రుల
తోడం గ్రీడించువాఁ డొక్కనాఁడు విదల్లుం గుఱించి ముని
పుత్రుం డొకఁడు క్లీబయని యామంత్రించుటయు, 330

—* సుదర్శనునకు కామబీజప్రాప్తి *—

క. విని యందు నాదివర్ణము
ననువుగ బిందువునుగూర్చి యనుదినముఁ బఠిం
చెను భావిభాగ్య వశమునఁ
జనె నొక వైదేడులిట్లు జననాథమణీ! 3౮౧

ఉ. న్యాసమునున్న ఛందమనునట్టిది లే దిఁక ధ్యానమన్న స
న్న్యాసము సర్వశూన్యముగ నాతఁ డదృష్టమహోదయమ్మునన్
జేసి మనమ్మునన్ నిలిపి శ్రీకరమై తగు కామబీజ మ
భ్యాసము చేసె నెన్నటికినైనను విస్మృతిఁ జెందకుండగన్. 3౮౨

గీ. అంత నేకాదశాబ్దంబునందు నుపన
యనము గావించిముని వేదమభ్యసింపఁ
జేసె నా రాజసుతుఁడు సుశిక్షవహించె
వేదమున శాస్త్రమున ధనుర్వేదమందు. 3౮3

మ. ఒకనాఁ డంబిక రక్తవర్ణయును రక్తోద్యద్విభూషాంబరా
దిక బాభాసురచారుగాత్రియును నై దివ్యస్వరూపంబుతో
నకలంకుండగు నా సుదర్శనునిపై నత్యాదృతస్వాంతయై
సుకృతంపుంగనియై ఖగేశరథయై చూపట్టెఁ బ్రత్యక్షమై 3౮౪

ఆ. వె. ఆ సుదర్శనుండు నాయంబ వైష్ణవిఁ
గాంచి మ్రొక్కి భక్తి గడలుకొనఁగ
సేవ సేయుటయు దయావతి యాతల్లి
శరశరాసనాది సకలమొసఁగె. 3౮౫

గీ. శరశరాసన కవచముల్ శరధియుగళ
మాదిగాఁగొని దేవీకృపామృతమున

కాటపట్టయి మిగులఁ బ్రఖ్యాతి నెసఁగి
యతఁడు నవమన్మథుండయి యలరునంత, 368

శా. కాశీరాజతనూజ రూపమునకుం గాణాచి, విద్యావయః
ప్రాశస్త్యంబుల కెల్ల, మొల్లమునకుం బ్రాణంబు, బల్ చాతురీ
సౌశీల్యంబులప్రోవు నా శశికలాశ్యామాశిరోరత్న మ
య్యాశానాప్తతనూజతుల్యు విని వందిద్వ్యప్రభావాస్పదున్.

చ. విని తదధీనచిత్తయయి వేఁగుచు వేకువ నొక్కనాఁడు చ
య్యనఁ గనుమోడ్చునంత జగదంబ ముదంబున స్వప్నమందుఁ బే
ర్మినిఁ బొడసూపి యిట్లను "వరింపుము, నిన్ను సుదర్శనుండు గై
కొనుఁ గనకాంగి! నీదయినకోర్కె ఫలించు నవంచితంబుగన్."

క. అని పలికి చనియె నంతట
వనజాక్షియు మేలుకాంచి స్వప్నము తన చిం
తనమున కనుగుణమగుటకు
మన ముబ్బఁగ మోము మాటిమాటికిఁ జెలఁగన్, 369

వ. హర్ష నీరధి మునుంగుడుఁ దల్లి యిందుల కేమికారణం బనవుడు
సిగ్గునఁ దలవంచె. 370

ఉ. పిమ్మట నెచ్చెలుల్ గదిసి పేర్మి నొకించుక చెప్పరాదె! మీ
యమ్మకుఁ జెప్పమంచును రహస్యమునన్ దను మాటిమాటికిన్
గ్రిమ్మన రాత్రి స్వప్నమునఁ గల్గినముచ్చట లచ్చుగాఁగ న
క్కొమ్మ వచించె; నెచ్చెలులకున్ వినరాని రహస్యముండునే.

ఉ. అంత వసంతమందుఁ జిగురాకులచేఁ బొగరెక్కి కోయిలల్
అంతులు సేయఁ జుమ్మనుచు అంపిలి తుమ్మెదదిమ్మరీండ్లు బల్

గంతులువేయ నాశశికలాలలితాంగి సఖీసమేతయై
కంతునికిన్ నివాస మనఁగాఁదగు పుష్పవనమ్మునం దొగిన్.

క. బహుఫలభరితకుసుమఘూ
ర్ణవహాపల్లవ కలితలలితపాదపవల్లీ
విహృతిమెయిఁ బొద్దుపుచ్చుచు
నహర్పతిసమాను నొక్కయగ్రజుఁ గనియెన్. 3౯3

చ. కని వినయమ్మునం జరణకంజములం బడి మ్రొక్కి యిట్లనున్
వనజభవావతార ! తమవాస మదెక్కడ ? నేడనుండి యి
వ్వని కరుదెంచుటో ! తమరువచ్చిన కారణమేమొ ! పేర్మినె
క్కొన వచియింపుఁడా ! యనుడుఁ గోమలికిన్ ద్విజవర్యుఁడిట్లనున్

శా. భారద్వాజ మునీంద్రునాశ్రమను మద్వాసంబు కార్యార్థినై
దూరం బేగుచు నుంటి నావలన నెంతో కార్య మున్నట్లు న
న్నారాధించి ప్రశంస: జేసితివి నీ యాంతర్యమున్ దెల్పి నీ
వే రాజన్యుని పుత్రివో నుడువుమా ! యిందిందిరాభాలకా !

వ. అను నవ్విప్రకుమారున కక్కోమలి యిట్లను మహాత్మా !
యేను గాశిరాజు కూఁతుర శశికల యనుదానఁ దమరు పూజ్యు
లగుటం జేసియు భవద్దేశమందలి విశేషమ్ములు వినఁ గోరియుఁ
బ్రశంసించితి. భవదాశ్రమమ్మునం గల చక్కని యొక్క విశే
షంబు వక్కాణింపుఁడన నక్కమలాక్షి కతం డిట్లనియె. 3౯౬

క. కలఁడు ధ్రువసింధుఁ డను భూ
తలపతి యా నృపసుతుఁడు సుదర్శనుఁడను వాఁ
డలఘుఁడు మా యాశ్రమమునఁ
గలఁ డాతం డెంతకేనిఁ గలఁడు కుమారీ ! 3౯2

ఉ. అంబురుహాక్షి ! యీతఁడు గుణాలయుఁ డాకృతిపంచచాణుఁడా
యంబకు భక్తుఁ డెంతయు నయంబునఁ బొల్పెడిముద్దులాఁడు వా
నింబలె నొప్పువేఁబాకరిని గనఁ బోము మఱేమి ! బ్రహ్మ నీ
కుం బనిఁ బూని చేసె ననుకొందు నినుంగని సుందరీమణీ! ౩౯౮

క. పూవుం దావియుఁ గొమ్మయుఁ
జేవయు బంగారు మణియుఁ జేర్చిన విధి యో
పూవుంబోఁడిరో ! నీ కా
భూవరమన్మథునిపొందు పొసఁగింపఁడొకో ? ౩౯౯

క. అనుభూసురవచనములకు
మన మలరఁగ మోము మాదమందరుచిరహా
సనియతిఁ బొదల శరీరం
బునఁ బులకలు వొడమనొప్పెఁ బూబోఁడి వెసన్. ౪౦౦

గీ. భూసురుం డేగె నంత నాభాసురాంగి
పూర్వమునకన్న ననురాగమును వహించి
చచ్చిచానవివానిబల్ హెచ్చునకు స
హింపనేరక చెలిమిన్న కిట్టులనియె. ౪౦౧

చ. చెలియరో ! యేమనోహరుని చెల్వము విన్నది యాదిగాఁగఁ జం
చలతయు బల్ వికారము విచారముఁ దోరముగా నెసంగు న
చ్చెలువుఁ డెవండొ? గోత్రమును జెయ్వులుదేశముఁదల్లిదండ్రులుం
గులము నెఱుంగ రాదెటులొకో ! యిటు మన్మథుఁడార్తి వెట్టినన్ ?

చ. కలఁ గనుఁగొంటి నాతని వికాసము హాసము భాసమానని
స్తులతర హావభావములు సుందరి ! యేమని చెప్పుదాన నా
కొలఁది యదృష్టహీనలకుఁ గోరినఁ బైఁబడి మ్రొక్కి వేఁడినన్
గలుఁగునె ? యట్టివాఁడు కలఁగన్నదియే యొకలాభ మంగనా !

సీ. చందనంబు విషంబు చందంబుగాఁ దోఁచుఁ
బూలమాలిక పాముపోల్కె నుండు
వెన్నెల నిప్పులకన్న వేఁడిమి చూపు
హర్మ్యంబు యమకూప మనఁగవచ్చు
పూసెజ్జ కత్తులబోనుగాఁ గనుపట్టు
రాత్రి మృత్యుప్రమాణ నెసఁగుఁ
బగలన్నఁ బగవాని పగిది బీరము చూపు
గీతాదికంబన్న భీతి పుట్టు
గీ. విడెము మడలుగొల్పు పూఁదోఁట వెట్టిఁజేయుఁ
జెలులపైఁ గోపమొదవుఁ జాపలము హెచ్చుఁ
దల్లిదండ్రుల కిది చెప్పఁ దప్పు, చెప్ప
కున్న నేగతినబ్బు నవ్వన్నెలాఁడు. ౪౦౪

మ. అనురాగం బది కన్నుగానదు మనంబా! మిట్టుపల్లమ్ములన్
గన కెచ్చోటకునైన నేగు నిఁక వేడ్కల్ మంచియుం జెడ్డయున్
మునుపే నేరవు మన్మథుండు చపలాత్ముం డెంతయున్ మూర్ఖుఁ డం
గనలన్ లోఁకువఁ జేసి మీఁదఁబడు శక్యంబే నివారింపఁగన్?

మ. మదనుం దిట్టఁగ రాదు కోయిలలతో మాఱొడ్డఁగా రాదు నె
మ్మది వారింపఁగ రాదు కోర్కెలపసన్ మర్దింపఁగా రాదు దు
ర్మదమున్ గ్రిందుగఁ జేయ రాదు తనకామం బన్యులౌ వారితో
మొదలే చెప్పఁగ రాదు కష్టమకదా! పూఁబోఁడియై పుట్టుటల్.

క. కులకాంతనైన నకతనం
గలుగదు స్వాతంత్ర్య మేమిగానున్నదో! నె
చ్చెలి! వెలవెలఁదుక లేనో
ములునోఁచిరో! వెట్టిమాటపోనీఁగదవే. ౪౦౭

ఉ. ఆతఁడు రాజ్యహీనుఁడు వనాంతరవాసియు నంచు వింటిఁ బ్రి
ఖ్యాతులు రాజ్యసంపద లఖండముగాఁ గలరాజపుత్రు లీ
భూతలమందు లేరొ ! ననుబోటికి వారలు తగ్గవారు కా
రో! తరుణీ! యదేమొ యతఁడొక్కఁడ నామదిఁజిక్కిసొక్కెడున్.

క. ఆనృపుఁ డుండినయెడ నా
కానతి యిడె నొక్కవిప్రుఁ డటకేగుటకున్
మానసము తొట్రువడు న
వ్వానికి నావంతఁ దెల్పువా రెవ్వరొకో ? ౪౦౯

చ. అలరెడివేడ్కఁ దండ్రియు స్వయంవరముం బొనరింపఁ డాయె నె
చ్చెలు లొకరైన బిట్టెనయుచింత నడంపఁగఁ జాలరైరి నా
కలఁ గనుపట్టి చెప్పినజగత్ప్రసు వాపరదేవియైన బా
ము లెసఁగఁజేయు నాకుఁగలమోహము మేర యెఱుంగ దక్కటా.

వ. ఇట్లు తదధీనచిత్తయై యక్కన్నెమిన్న యుండె, నట సుదర్శనుండు స్వప్నాద్యవస్థలఁ దన్మహామాయాసందర్శనం బొనర్చుచుఁ దదేకధ్యానపరాయణుండై కాలమ్ముఁ బుచ్చుచుండె నతనికడ కొక్కనాఁడు శృంగిబేరపురాధ్యక్షుండగు నొక నిషాదపతి యేతెంచి సర్వోపస్కరయుతంబును జతుస్తురగయుక్తంబును బతాకాదిశోభితంబునునగు నొక్కరథం బుపాయనంబుగా నొసంగిన మిత్రభావమ్మునం గారవించి యయ్యది గైకొనియె. అట్టియెడ,

క. భారద్వాజాశ్రమగతు
లై రాజిలుమునులు వల్కి రాతనిఁ గని యో
వీరాగ్రేసర ! యిఁక భూ
భారధురంధరుఁడగుచుఁ బ్రబలెదవు గడున్. ౪౧౨

ఉ. ఏపరదేవతామహిమ మించుక గల్గినవారు పాపముల్
తాపము లాపదల్ గడచి ధన్యులు మాన్యులునై జగజ్జయ
వ్యాపృతులై చెలంగెదరొ! భద్రవిధాయిని యామె ముఖ్యమా
పాప్రక మట్టినీకు దురవాపము గల్గునె ముజ్జగమ్ములన్? ౪౧౩

వ. అని మనోరమం గాంచి, ౪౧౪

క. ఓ వీరమాత! విను పా
రావారపరీతమా మహారాజ్యశ్రీ
కేవల దేవీకృపకున్
దావలమగు నీకుమారునకు సంధిల్లున్ ౪౧౫

చ. అనిన మనోరమాసతియు నట్టులె మీవచనంబు నిక్కమా
ననఘచరిత్రులార! యొకఁడైన సహాయము లేని నాతనూ
జున కెటు రాజ్యభారమది చొప్పడుఁ దప్పునె మీనుడుల్ మహా
జనులగువారిదీవనలె సర్వము నిర్వహణం బొనర్చెడిన్. ౪౧౬

క. ఈదశదిశ లొకటైనను
మేదిని రజమైన జలధి మిట్టైన నగున్
భూదేవత లిడు నాశీ
ర్వాదములకుఁ దిరుగులేదవార్యము లగుటన్. ౪౧౭

క. అని నెమ్మది యుబ్బఁగ నా
నుని సేమముఁ గోరి యామనోరమయుండెన్
ఘనుఁడు సుదర్శనుఁడు జగ
జ్జననికటాక్షంబు తనకు సంతస మొసఁగన్. ౪౧౮

ఆ. వె. ఆరథంబు నెక్కి యలరెడివేడ్క నెం
దేనిఁ జనెడివేళఁ గానుపించు

దక్షమై తనర్చు నక్షౌహిణీసైన్య
నుద్యమం దెలర్చు మహీపుమాఁడ్కి. ౪౧౯

ఉ. శోభనదాయియై సకలశోకవినాశకమైన కామరా
జాభిధబీజముఁ గురుదయావశతన్ దగ సంగ్రహించి శ్ర
ద్ధాభరితంబు గా నెవఁడు తద్దయుఁ దజ్జప మాచరించు వాఁ
డాభగవత్యనుగ్రహము నంది పురందరసన్నిభుం డగున్. ౪౨౦

సీ. అంబార్చనాసక్తులగు వారలకుఁ గలు
గనిశుభమ్ములు లేవు, కావరమున
నెవ్వ రంబార్చన నీసడింతురో వారు
మాతృకాద్రోహులు మందమతులు
దుష్టులు రోగులు దుఃఖపీడితులునుఁ
గా నెఱుంగుము దేవమాననీయ
యై యాదిశక్తియై యమరు నాయంబయే
యఖిల జీవులయందు నలరుచుండు

గీ. బుద్ధి ధృతికీర్తి లక్ష్మిసమృద్ధి శక్తి
శ్రద్ధ స్మృతి లోనుగాఁగల సకలమగుచు
నామె నెఱుఁగనివారల యజ్ఞులనఁగ
నెఱుఁగువారల పండితు లెఱుఁగు మధిప! ౪౨౧

ఉ. బ్రహ్మ మొదల్ పిపీలికలు పారముగాఁ గల జీవసంతతుల్
బ్రహ్మవచోభిధేయము నపార మనాద్య మమేయమౌ పర
బ్రహ్మము గాఁగ నే పరమపావని నే జగదంబఁ గొల్తు రా
బ్రహ్మముఁ దానెటింగె నొకపాటి యనందగునే సుదర్శనుణ్ ?

శా. దేవారాధితమై. మహామహిమమై దివ్యస్వరూపాఢ్య వి
ద్యావిద్యాకృతియై జగం బఖిలమున్ వ్యాకీర్ణమున్ జేసి స

ద్భావాతీతుఁ బురాణపూరుషుని సంభావించు నేదేవి యా
దేవిం గొల్చి సుదర్శనుండు సుఖమందెన్ రాజ్యముం బాసియున్.

క. శశికలయు నా సుదర్శన
వశగతహృదయ యయి వలపు వడ్డికిఁ బాలన్
గృశయయి భృశచింతనయై
యశనాయాదికము మఱచె నధిప వతంసా! ౪౨౪

చ. కొమిరె విచారణాంశమును గొంత యెఱింగి సుబాహుఁ డాపెతం
డ్రి మురువుమీఱఁ బుత్రిపయి నెమ్మి దలిర్ప స్వయంవరం బొన
ర్ప మదిఁ దలంచి యెల్లనరపాలురకున్ దెలియంగఁ జేసె, న్యా
యమకద రాజపుత్రిలు స్వయంవరమందు వివాహ మాడుటల్.

వ. స్వయంవరమ్మును నిచ్ఛాస్వయంవరంబు పణస్వయంవరము
శుల్క స్వయంవరము నా మూఁడు తెఱంగు లందు శ్రీరాముండు
శివధనుర్భంగం బొవర్చి సీతం గైకొన్నది పణస్వయంవరంబు
తక్కుఁగల రెండును బ్రసిద్ధమ్ము లందాద్యమగు నిచ్ఛాస్వయం
వరంబు చాటం బంచుడు, ౪౨౮

ఉ. మాళవచోళమద్రవరమాగధవంగకళింగసింధుబం
గాళకరూశలాటకురుకాశమరాటవరాటగౌళనే
పాళవిదర్భబర్బరనృపాలకుమారకు లాసుబాహుభూ
పాలుని పట్టణంబునకు వచ్చి రనేకు లుదంచితస్థితిన్. ౪౨౭

వ. అంతకు మున్న యన్నళినాక్షి తద్వృత్తాంతం బెఱింగి సఖంగాంచి
కుంచితాస్యయై కనుఁగొనల నశ్రులురుల మంతనంబున నిట్లనియె.

ఉ. నెచ్చెలి! నా మదిం గలుగు నెవ్వగ నెవ్వగ నాఁపికొందు? నా
నచ్చిన చెల్మికాఁడు జననాథ శిరోమణి నాఁటిరాత్రి భూ

భృచ్ఛ్రయరాజపుత్రి కడుఁ బేరిమి నాకిడినట్టికోర్కె యు
ద్యచ్చరితుండునైతగు సుదర్శనుఁడక్క నొరుఁ వరింతునే ? ౪౨౯

మ. ధనముల్ కాల్పనె ? రాజ్యసంపదలు కాంతారమ్మునన్ జేర్పనే?
గొన ఖండంబును జాతురీగరిమయున్ గూలంకషప్రజ్ఞ యె
వ్వనికిం జొప్పడు వానిఁ గోరఁదగు నవ్వాఁడెన్నఁగా నా సుద
ర్శనుఁడే యింతకు నొక్కకండొక తెరన్ జక్కంగఁ గన్పట్టెడిన్

క. అని త్రిప్పరానిపేర్మినిఁ
దనతోడం బల్కు రాజతనయవచనముల్
పనిఁగొని జననికిఁ దెల్పఁగఁ
జని యావైదర్భితోడ సఖి యిట్లనియెన్ ౪౩౧

వ. అమ్మా ! మన శశికల సుదర్శనుండను రాజపుత్రుం దక్క న
న్యుని వరింపనని నిశ్చయించుకొని యున్నయది. ౪౩౨

క. భారద్వాజాశ్రమమున
నారాజ తనూజు వాసమఁట ! యాతనికిన్
ధారాళముగఁ ద్రిశుద్ధిగ
ధారాదత్తంబుజేసెఁ దననెమ్మనమున్. ౪౩౩

వ. అనుడు వైదర్భియు నయ్యుదంతంబు తన పతికెఱింగించిన నతం
డమ్మగువ కిట్లనియె. ౩౩౪

ఉ. వాని నెఱుంగుదే చెలియ ! వాఁడన రాజ్యముఁ గోలుపోయి య
న్నానకు లేక కాననమునన్ మునిపల్లె వసించుఁ దల్లితోఁ
బూని యుధాజిదాహ్వయుఁడు పోరునఁ జంపెను వీరసేను న
వ్వానికతమ్మునన్ గడు నభాగ్యుఁడు వానికిఁ బుత్రి నిత్తునే ?

క. కావున నచ్చుగఁ జెప్పెదు
నీవేగి తనూజ కిపు డనింద్యచరిత్రుల్
కోవిదులు భాగ్యవంతులు
వేవేలు స్వయంవరమున విడిసిరి నృపతుల్. ౭౩౬

వ. అని భర్త వలికిన వల్లెయని యావైదర్భి పుత్రికడ కరిగి బుజ్జగించి
శిరమ్ము మూర్కొని తొడపై నిడుకొని యల్లన నిట్లనియె.

మ. ఫలమూలాశి వనప్రవాసి కృశుఁడున్ బంధువ్రజత్యక్తుఁడున్
బలకోశాదివియుక్తుఁ డెంతయును నిర్భాగ్యుం డతం డున్నతుల్
గలవా రూర్జితు లార్జితోత్కటయశః ఖ్యాతుల్ నరేంద్రాత్మజుల్
దలఁప న్నీకయి వచ్చిరందఱును సౌందర్యమ్మునన్ మన్మథుల్.

తరల. అల సుదర్శను తమ్ముఁడున్ గడునందగాఁడు మహాబలుం
డలఘుఁ డాతఁడు శత్రుజిత్తు ధరాధిపత్యము గల్గు వాఁ
డెలమి నీకనుకూలుఁడై తగు నేతదర్థమ కాదె తాఁ
గలన నీతనితాత చంపెఁ బగన్ గళింగధరాధిపున్. ౭౩౯

క. అదియునుగాక యుధాజి
త్తదనగు నెడ నితనిఁ జంపు నాకతనమున నే
కద! భారద్వాజునికడ
సుదర్శనుండుండు టరయ సుదతీ! వినుమా! ౭౪౦

క. నీతండ్రి సుదర్శనున క
పేతవిభవుఁడనుచు నిన్నుఁ బెండిలిసేయన్
జేతోగతి వాంఛింపం
డాతలఁ పికఁ విడిచి పెట్టుమమ్మ కుమారీ! ౭౪౧

వ. అనుడు నక్కోమలి తల్లి కిట్లనియె. ౭౪౨

చ. వనమున నుండుఁగా కతఁడు పట్టణమందు వసించుఁగాక ని
ర్ధనుఁడగుఁగాక మేటిధనధాన్యములం దులఁదూఁగుఁగాక నా
మన సలవానిఁ దక్కఁ బెఱవానిని నొల్లను ధాతయైన ఫా
లనిహితమైన వ్రాఁతలకు లౌఁతిగతుల్ పొసగింపనేర్చునే ?

క. శర్యాతి వచనమున మును
నార్య సుకన్యాభిధాన చ్యవనునిఁ గొని న
ట్లార్యావచనమ్మున శుభ
చర్య సుదర్శను వరింతు సత్యవ్రతనై. ౨౨౪

క. కైతవ మెఱుఁగక భర్తకుఁ
జేతోమోదమున సేవఁ జేసెడి సతికిం
బ్రీతియు స్వర్గము మోక్ష వి
భూతియునుం గలుగు నిక్కముగ నోతల్లీ ! ౨౨౫

క. మచ్చిత్తభిత్తి భగవతి
విచ్చలవిడి వ్రాసె వానివిధమంతయు నా
నచ్చినవాఁ డతఁ డొక్కఁడ
పొచ్చెము లేదిందుఁ గూర్మి పొసఁగె నతనిపై. ౨౨౬

క. అని శశికల వివిధ నిద
ర్శనములు చూపించి తనకు రమ్యుండు సుద
ర్శనుఁ డొక్కఁడ యని చెప్పిన
జననియుఁ బతి కెఱుఁగఁజేసెఁ జని సకలంబున్. ౨౨౭

వ. అంత స్వయంవర మహోత్సవం బాసన్నం బగుడు శశికల సుద
ర్శనురామికిఁ జింతించి యత్యాప్తుండగు నొక్కవిప్రునిం బిలిపించి
రహస్యమ్ముగ నిట్లను నో యయ్యా ! మాయయ్య

యెఱుంగకుండ భారద్వాజాశ్రమమ్మున కరిగి సుదర్శనుంగాంచి
నా వచనమ్ములుగా నిట్లనుము. ౪౪౮

ఉ. అంబ నినున్ వరింపుమని యానతి నాకిడె నామనంబు స
త్యంబుగఁ జిక్కె నీపయి స్వయంవరమా నిఁక నెల్లి; రాజసం
ఘంబు పురంబునన్ విడిసెఁ గాని త్వదాగమనంబు లేదు న్యా
యంబె యనాదరంబు విషమాంబకదర్శన! యో సుదర్శనా!

ఉ. నే నినుఁ దక్క నన్యుని గణింప వరింప మదిం దలంప నా
మేను నిజంబు నీయదిసుమీ వినుమీ! నను మానితేని నిన్
గానమి వహ్నిలోఁ బడుదుఁ గానియొడన్ విషమాహరింతుఁ బ్రా
ణానకు వెన్కఁజూతునని నన్ దలపోయకు ప్రాణవల్లభా! ౪౫౦

చ. మనకుఁ బరాంబికాకృప సమస్తశుభమ్ములు గల్గు దైవమున్
మనమున నమ్మి రావలెఁ జుమా! శివకేశవముఖ్యు లేజగ
జ్జననికి వశ్యు లాజనని సత్యము దప్పనితల్లి యాపె వా
క్కును వితయానె నాథ! కయికొమ్ము ననుం బ్రతికించి పుణ్యమున్

చ. అని వచియింపు మానరవరాగ్రణి కిట్టులె యంచు శాస్త్రమా?
యనఘ! సమస్తమున్ దెలిసినట్టిమహాత్ముఁడ వీవు కార్య మే
యనువునఁ జక్కనౌనో యటు లాతనితోఁ వచియించి పున్నెమున్
గొనుము పరోపకారమునకున్ సమమైన విశేషమున్నదే?

ఉ. అక్కరుణాకరున్ గడు రహస్యమునం గను మట్లు కాంచి నా
చక్కఁదనం బొకింత సరసంబుగఁ జెప్పుము చెప్పి నాదు పై
న్మక్కువ మేరలేని దని మాటికిఁ దెల్పుము చేతు లెత్తి నే
మ్రొక్కితినంచుఁ బల్కుమిక ముంచినఁ దేల్చిన నీవ నావుడున్,

వ. తద్దత్తంబగు దక్షిణాగ్రహించి యాతండును సుదర్శను కడ కేగి సకలమ్మును వచియించి యతనిచే స్వయంవరమ్మున కేతెంచెదనని యనిపించుకొని తత్క్షణమవచ్చి యక్కన్నెతో నంతయు నుడివె, నట సుదర్శనుండు స్వయంవర గమనోన్ముఖుండగుటయు,

క. తల్లి మనోరమ శోకం
బుల్లమ్మునఁ గడలుకొనఁగ నాగి గుండియలున్
జల్లన నల్లన నశ్రులు
వెల్లివిరియఁబల్కె నిట్లు విహ్వలమతియై. ౪౯౧

చ. పలువురు రాజు లున్నెడకు బాసట లేకయ పోఁదలంచెద
ప్పలుగు యుధాజిదాఖ్యుఁ డతివైరి నినుం గడతేర్ప నెంచి తా
నలయెడ కేగుదెంచు, నను నాత్మజశోకపరీతఁ జేయఁగాఁ
దలఁపకుమయ్య! నాపలుకు దబ్బఱ సేయకు మయ్య నాపుడున్,

ఉ. అంబికయానతిన్ శిరమునం దిడి యేగెడి నాకు నెందు న
ష్టం బొకదుండునే? యొరులధాకకు జంకుదునే? మదంబ! శో
కం బుచితంబె క్షత్రియకుఁ! గాఁదగుకార్యము కాకపోదు దుః
ఖంబును సౌఖ్యముం జగతిఁ గావశికుండలు ప్రాణికోటికిన్.

వ. అని తల్లికి ధైర్యంబు చెప్పి నిపాదదత్తంబగు రథం బధిష్ఠించి చన నుద్యుక్తుండగు కుమారుంగాంచి మనోరమ యిట్లను నోయన్నా! విజయార్థం బేగెడి నిన్ను నగ్రమ్మున నంబికయు వెనుకఁ బార్వతియు విషమమార్గమ్ముల వారాహియు దుర్గమ్ముల దుర్గయు ఘోరకలహమ్ములఁ బరమేశ్వరి యగుకాళికయు స్వయంవరమ్మున సౌమ్యయగు మాతంగియు భూపమధ్యమ్మున భవానియు గిరిదుర్గంబుల గిరిజయుఁ జత్వరమ్ములఁ జాముండయుఁ గాననముల సనాతని యగుకామగయు వివాదమ్ములఁ వైష్ణవియు శత్రుసమాగమమ్మున

భైరవియు సర్వదేశంబుల జగద్ధాత్రియగు భువనేశ్వరియుఁ గంటికి
ఱెప్పచందమ్మున రక్షింతురుగాత మని దీవించి మఱియును,

శా. అన్నా ! నివ్విడనాడి యిచ్చోట క్షణంబైనన్ వసింపంగఁ జా
ల న్నిన్నున్ గనులారఁ గాంచికద కాలంబెల్ల హేలాగతి
న్వెన్నాణంబుగఁ బుచ్చుచుందు నదియున్ విఘ్నంబుగావింప నీ
కు న్యాయంబె ? రథంబుపైనిడి ననుం గొంపొమ్ము నీతోడుతన్.

వ. సుదర్శనుండు వల్లెయని ధాత్రేయీసహితంబుగఁ దల్లిని రథం
బెక్కించుకొని శీఘ్రగమనమ్మునఁ గాశీపురమ్ము చేరిన సుబాహుం
డెదుర్కొని తగినవిడిది యొసంగి యుపచారమ్మునకుఁ దగువారి
నియోగించె దౌహిత్రసహితుండగు యుధాజిత్తును దక్కఁగల
రాజన్యులును సుదర్శనుంగాంచి తమలో నిట్లు ప్రశంసించు
కొనిరి. ౪౬౦

—* సుదర్శనుండు స్వయంవరమున కేగుట *—

ఉ. తా నిట కేగుదెంచెను సుదర్శనుడుం దగువానిభంగి రా
ట్సూనుల రాజరాజసుత సుందరు లందఱినిం ద్యజించి త
న్నీనళినాక్షి కోరుననియే మనమందుఁ దలంపఁ బోలు నే
మో ! నగినట్టియూళ్ళు లగు నొక్కెడఁ బట్టణముల్ గ్రమమ్ముగన్

క. అనిన యుధాజిత్తిట్లనుఁ
గనుఁడీ ! మీరెల్ల నాదుకడిమి నిట సుద
ర్శనుఁ గడతేర్చెద ననవుడుఁ
బనిఁగొని యనుఁ గేరళాధిపతియాతనికిన్. ౪౬౨

మ. ఇది యిచ్ఛావరణార్థ మేర్పడియె నవ్యేణాక్షి యిందొక్కరున్
మది కింపై తగువాని నంగభవుసామ్రాజ్యమ్మునం గూర్చు న

య్యది తక్కంగల యస్మదాదుల కవార్యం బట్లు కాదేని దు
ర్మదు లీరాజులటందు రెల్లరును మర్యాదావినాశంబుగన్.

చ. అది యటులుంచు న్యాయ్యమగు నాతనిరాజ్యము దుర్నయమ్మునన్
మొదల హరించి యిచ్చితివి ముగ్ధులమన్నని; కాతనిన్ వరిం
పఁదగదె ? యీ సుదర్శనుఁడె పట్టముగట్టెన ! చేలరీతి నె
మ్మది నిటు కుందనేల వినుమా ! యితఁడే నినుఁ జక్కఁ జేసెడిన్.

క. విను మెన్నఁడేని ధర్మ
మ్మునకున్ జయమబ్బు సత్యమునకగు వృద్ధుల్
చనకుముదార్మార్గ్రమునకు
ఘనుఁడందటి నేలువాఁడుగలఁడో ! లేఁడో ! ౪౬౧

ఉ. అందఱినిన్ వరింపదు కదా ! యొకరాజతనూజ యిందఱున్
సుందరు లిందఱున్ మిగుల శూరు లుదారులు వీరిలోన నా
సుందరి యొక్కనింగోన నసూయమొయిన్ మనమెల్లఁ బోరినన్
నిందకు మూలమా నిది యనీతియొ ! నీతియొ ! నిర్ణయింపుమా.

క. అనుడు యుధాజిత్తను నీ
వనిన ట్లిచ్ఛాకృతస్వయంవర మిది యొ
క్కని ననవద్యచరిత్రుని
ననఘుని వరియించెనేని హర్షమ మాకున్. ౪౬౨

చ. పలువు రఖండతేజులు నృపాలకుమారకు లుత్తమోత్తముల్
గలయెడ నెవ్వఁడో యొకఁ డగణ్యుఁడు కన్యఁ బరిగ్రహింప యో
గ్యులుగని యూరకుండుటదియున్ గడుయుక్తమె! సింహభోగ్యమా
ఫలలము నక్కకున్ విడువఁబాడియె ! యేడవి ! నీతివాక్యముల్ !

గీ. అగ్రజాతికి వేదమ్ము లధికబలము
చాపమెక్కుడుబలమగు క్షత్రియులకు
బలము గలవానిరాజ్య మీపడఁతిమిన్న
బలమ శుల్కంబు రాజవివాహములకు. ౪౯౯

వ. అయ్యది సుదర్శనునకుం గలిగెనేని యతండ పరిగ్రహించు నిత
రులకుఁ గలదేని యితరులు వశయుదు రని యన్యోన్యకలహమ్ము
లొనర్చు నవనీపతులకడకు సుబాహుం డాహూతుండై
వచ్చుటయు, ౪౭౦

క. అవనీపాలుర కెల్లను
వివాదము తటస్థమాయె వింటివికద ! యో
యవనీవర ! నీవియ్యెడ
వ్యవస్థనేర్పరచి వీరివా దడఁపఁదగున్. ౪౭౧

వ. అన నతం డిట్లనియె. ౪౭౨

చ. జనవరులార ! నాకొమిరె చాల సుదర్శనునిన్ వరింపఁగా
ననయము నెంచుచున్న దతఁ డర్హుఁడు గాఁడని యెంతచెప్పినన్
విన దతఁడున్ స్వయంవరపువేడుక వచ్చె బహూక్తు లేల దై
వనియతి కన్యకాకరణపాటవ మేరికినైనఁ గల్గునే. ౪౭౩

వ. అనుడు నాతని చిత్తవృత్తి నెఱింగి సంపన్నులగు రాజన్యులంద
ఱును సుదర్శనుం బిలువంబంచి యిట్లనిరి. ౪౭౪

ఉ. ఓయి నృపాలపుత్త్ర ! యిటకొక్కరుఁడై చనుదెంచి తీవు సే
నాయుతు లెందఱో నృపతినందను లాహవమాచరించి య
బ్జాయతనేత్రి నీశశికలాబ్జముఖిన్ గ్రహియింప నున్నవా
రీయెడ నీకుఁ జేయగల దించుకయున్ గనుపట్టనేర్చునే ? ౪౭౫

శా. నీకుం దమ్ముఁ డఖండశౌర్యనిధి వర్ణింపంగ యోగ్యుండు లో
కైకాగ్రణ్యుఁడు శత్రుజిత్తును సహాయీభూతుఁడై తాతయుఁ
బీఁక న్నిన్ను వధింప నియ్యెడ కౌగిఁ విచ్చేసియున్నారు నీ
రా కత్యంతము శోచనీయము కదా! రాజన్యవంశాగ్రిణీ. ౪౭౬

గీ. ఎవరు పిల్చిరో నిన్ను! నీ వేకతమున
వచ్చియుంటివో కలిగిన వాస్త
వంబు చెప్పితిమి మీఁద నీదగుచిత్తవృత్తి
కర్హ మగున ట్లొనర్పు మటన్న నతఁడు, ౪౭౭

ఉ. వారలఁ గాంచి యిట్లను నృపాలకులార! కృపాళులార! మీ
పేరిమి యింతయేప్పనోకో భీతిలియిప్పుడు లాభమేమి, నా
భారము దేవదేవి దిటఁ బంపిన దాజగదంబ నాకు నై
క్షీరమొ నీరమో యొకటి చేయదె శత్రులచేతి కిచ్చునే? ౪౭౮

చ. ఎలమి సమస్తమందుఁ బరమేశ్వరినే కనుఁగొందు నాకు శ
త్రులనుచు మిత్రు లంచుఁగలరో! యలరారెడివేడ్క నంబ నా
కలఁగనుపట్టి పొమ్మనిన గన్గొన వచ్చితి నీస్వయంవరం
బలుక నెవండు న న్నెదురు నాతని కంబిక శత్రు వయ్యెడుఁ.

మ. బలమిచ్చున్ యశమిచ్చు సంపదలిడుఁ బాలించుఁ దేలించు దు
ర్బలులన్ జేయు దరిద్రులం బొనరుచున్ భంజించు గుంజించు నే
యలఘుప్రాభవ యేజగజ్జనని యేయార్యామహాదేవి త
ద్బలమే నాకు బలంబు తక్కబలమున్ బాటింప నే నెన్నఁడున్.

క. శక్తు లశక్తులు గలరే
శక్తియనుగ్రహము గల్గు జనులే శక్తుల్
శక్తికృపలేనివార ల
శక్తులు బ్రహ్మాదులైన జనవరులారా! ౪౮౧

చ. జయమయినం బరాజయము సంభవమైనను నాకుఁ గాదు త
జ్జయ మజయమ్మునన్ యశ మసద్యశమున్ జగదంబ, కట్టి నా
కయి వగవంగఁ బోకుఁడు మహామహులార ! దయాళులార ! ని
శ్చయముగ నేను శక్తుఁడ నశక్తుఁడ నేమిటి కీవిచారముల్. ౪౮౨

వ. అను నాతని వచనమ్ములకు సంతసించి కొందఱు రాజు లిట్లనిరి.

క. నీపలుకెల్ల నిక్కము
భూపకులవతంస ! నీవు పుణ్యాత్ముఁడ వెం
తో పగఁ బూని యుధాజి
ద్భూపతి యున్నాఁడు మఱచి పోయెదుసుమ్మా! ౪౮౪

వ. నావుడు సుదర్శనుండు రాజేంద్రులారా ! మీకు నాయం దను
గ్రహం బింత యొప్పినకతనం గదా యింతవట్టు నాకెఱింగించి
తిరి. దైవాధీనం బగు నీచరాచరాత్మక ప్రపంచంబున మృత్యు
వనునది తనంతన సంఘటించునుగాని యొకని నొకఁడు చంపు
వాఁడు లేఁడు. జీవుండు కర్మాధీనుండగాని స్వతంత్రుండుగాఁడు.
కర్మంబును సంచితవర్తమాన ప్రారబ్ధభేదమ్మున మూఁడుదెఱం
గులై యొప్పుఁ గాలకర్మస్వభావ వ్యాప్తంబగు నీజగంబునఁ గాలం
బాసన్నంబుఁ గాదేని దేవునకైనఁ జంపఁనశక్యంబు. కాలవశం
బున మృతులగుప్రాణులకు యముండు నిమిత్త మాత్రంబుగా
నెఱుంగునది. సింహంబు కతన మజ్జనకుండును యుధాజిత్తు కార
ణంబున మన్మాతామహుండును మృతులగుటయు నిట్టిదకా తెలి
యుఁడు. తానెంత ప్రయత్నం బొనర్చినను దైవయోగంబు
మూఁడినఁ జావక తీరదు. ౪౮౫

గీ. ఎవ్వఁడో తన్ను రక్షింపనేల ? దైవ
బల మొకటి తప్పకుండిన వాఁడు శత్రు

భయము రోగాదిభయమును బాసి వేయి
వత్సరమ్ములు జీవించు వంత తగునె ? ౯౪౬

క. శుభమును నశుభమును నీ
యుభయమును బురాకృతమున నొడఁగూడును దా
ను భయంబందినఁ దప్పద
నుభవించియ తీరవలయును నరుల కెల్లన్. ౪౪౭

గీ. తా నొనర్చిన కర్మంబు తనకుఁ గష్ట
మొసఁగుతఱి తెల్విగలవాఁడు వ్యసనపడఁడు
అన్యు లపకారమును దన కాచరించి
రనుచు నజ్ఞుండు వైరమ్ముఁగని కృశించు. ౪౪౮

ఉ. దైవము నమ్మి వచ్చితిని దైవము సైన్యము తోడు నీడయున్
దైవము తల్లిదండ్రులును దైవము వైరియు నాకు సర్వమున్
దైవము తద్బలంబు సుఖదాయియొ కష్టము నిచ్చునట్టిదో
భావిఫలం బెఱుంగ మనపాటి మనుష్యుల కర్హ మెట్లగున్ ?

గీ. అయ్యుధాజిత్తు సుఖములనందుఁ గాక
యతఁడు శత్రుండుగాఁడు నే నతనికైన
నగుదుఁ గాక మఱేమి, లోకైక జనని
కలదు నా పాలిటికిఁ గల్పకంబు పగిది. ౪౫౦

వ. అనుడు నెల్లరు సంతసించిరి సుదర్శనుండును దన యొడ కరిగి
సుఖంబుండె. మఱునాఁడు సుబాహునిచే నాహూతులై రాజ
న్యులందఱును దదాస్థానమ్మున విమాన సంగతు లగు నమరులం
బోలె మంచంబుల నధిష్ఠించి శశికలాగమనమ్మున కెదురు
చూచుచు నక్కలికి యెవ్వని వరించునో యని సందేహించు

వారును సుదర్శనుండకా నొరుల వరింపదను వారలును
నల్లిన నన్యోన్య కలహంబు దప్ప దనువారును నైయుండు నెడ,

ఉ. మంగళ వాద్యముల్ సెలఁగ మజ్జనమాడి విభూషితాంగియై
యంగజుపూవు బాణమన నా లలితాంగియుఁ బట్టు పుట్టముల్
రంగుగఁ గట్టి యొప్పుగఁ గరంబునయందు మధూకమాల వే
లంగ నృపాలపుత్రిలు కలంగఁ జెలంగి సఖీసమేత యై, ౮౯-౨

వ. తత్సభానికటమ్మున నొక మణిస్తంభంబు చాటునఁ దలవంచు
కొని చింతించుచున్నం గని స్మితపూర్వకంబుగ సుబాహుం
డిట్లనియె. ౮౯-౩

శా. అమ్మా! కన్గొనుమమ్మ! రాజసుతు లత్యంతోన్నతుల్ మేటిరూ
పమ్మందున్ మదనుల్ యశోన్వితు లతిప్రౌఢుల్ నినున్ గైకొన
న్నెమ్మిన్నేఁడిట వచ్చియుండి రొకరున్ నీకిష్ట మౌవాని నే
ర్కొమ్మా! రూపవయఃకులోన్నతి కలాకూలంకషాలంకృతున్.

వ. అనుడుఁ దండ్రికి నక్కుమారిక యిట్లనియె. ౮౯-౪

ఉ. కాముకు లున్మకుల్ శఠులు కశ్మలచిత్తులు పాతకుల్ జగ
త్పాపములు వీరియుగ్రమున సాధ్వులు వర్తిలరాదు "సాధ్వియౌ
భామిని భర్తఁదక్క నొరుఁబాఱఁగఁ జూడఁగ రా" దటంచు వి
ద్యామహితుల్ వచింతు రిది ధర్మ విరుద్ధ మొనర్ప నేర్తునే?

క. పలువుర దృగ్విషయంబై
కులకన్యక చనిన దానికొఱ కెల్లరునుం
దలపోయుదు రెల్లిదముగ
వెలపొలఁతుకభంగి దానివిభవం బెల్లన్. ౮౯-౫

ఉ. మాలిక చేతఁ బూని తగుమానినిభంగి స్వయంవరస్థలం
బేలలితాంగి త్రొక్కె నదియే వెలభామిని వేఱ యున్న దే
చాలుగనున్న యీనృపతిసంఘములోఁ జొరఁబాఱ నాకునుం
బోలునె తండ్రి ! యేను వెలబోటినె యిప్పని నాచరింపఁగన్ ?

క. ఏను సుదర్శను సామ్మా
దానన కద ! సభకు నేగి తక్కొరుఁ జూడం
గా నేమి మానమున కవ
మానం బొనరింపఁ దగునె మానిని నయ్యున్ ? ౯౯

మ. వసధుల్ వట్టిన భూమి నెక్కలయినన్ భాస్వంతుఁ డస్తాచల
మ్మున నావిర్భవమందినన్ శశికుహూస్ఫూర్తిన్ బ్రివర్తించినన్
విను మే నల్లసుదర్శనున్ విడిచి పృథ్వీనాథు వేఱొక్కనిన్
గన మూట్టన్ వినఁ బేర్కొనన్ మనమునన్ గాంక్షింప ముమ్మాటికిన్.

క. కావున నాతనికి నను
న్నివిచ్చి వివాహ మెల్లినేఁటఁ దగు గతిన్
గావింపుము కాదేనిన్
జీవితమున కిపుడ విడుతుఁ జేరెఁడునీటన్. ౧౦౧

—* సుబాహుండు చింతించుట *—

వ. అనువచనంబు లాలించి సుబాహుం డితికర్తవ్యతామూఢుండై
తనమనమ్మున, ౧౦౨

ఉ. వచ్చినవారు రాజు లనవద్యచరిత్రులు వేనవేలు వీ
రిచ్చకమాడినన్ వెడల రేమియొనర్తు ? మదాత్మ జాతకు
న్నచ్చిన యాసుదర్శనుఁడనన్ బలహీనుఁడు, నాకు వీరిచేఁ
జచ్చుట సంభవించె నిది శత్రువు పుత్రిక గాదు గా ! తుదిన్.

వ. అని కొండొకసేపు విచారించి ధైర్యమ్ము దెచ్చుకొని పలువురితోఁ
గలహించుట యెట్టిబలవంతునకేనిఁ దగదని వారినొప్పించువాఁడై
వినయవినమితుండై బద్ధాంజలిపుటుండై దీనుండై డగ్గఱఁ జని
యిట్లనియె. ౧౦౪

ఉ. ఓసరపాలురార! కరుణోదధులార! మహాత్ములార! నా
పై నెనరుంచి నాదుపొరపాటు క్షమించి యనుగ్రహించి నా
మానముఁ బ్రాణముల్ మిగుల మన్ననఁజేసి యొసంగి కూర్చున
న్మానములన్ గ్రహించిచనుమానమునన్ దయసేయు టొప్పగున్

ఉ. ఎన్నివిధంబులన్ వితిచి యే బతిమాలిన వానిఁ దక్క మా
కన్నియ యన్యునొల్ల నని గట్టిగఁబట్టును బట్టియున్న దే
మన్నను మాఱువల్క దది యన్నెముఁ బున్నె మెఱుంగనేర ద
న్నన్న! మదర్థమై శ్రమమునందితి రిందఱునున్ వృథాగతిన్

మ. కరులన్ రత్నములన్ దురంగమములన్ గ్రామంబులన్ గాంతలన్
సిరులన్ సౌధములన్ మహాంబరములన్ శ్రీమించుపూఁదోఁటలన్
ధరణీరాజ్యమునెల్ల నిచ్చెదను నాతప్పొప్పులన్ సైఁచి కూఁ
తురుగా నాదుకొమార్తె నెంచి నను నిర్దుష్టున్ బొనర్పందగున్

వ. అని బహుభంగులం బ్రార్థించు నాసుబాహున కొక్కరును
మాఱాడక మిన్నకుండిరి. యుధాజిత్తు క్రోధతామ్రాక్షుండై
పండ్లు పటపటఁ గొరుకుచు నిట్లనియె. ౧౦౮

ఉ. ఏమివచించెదీవు మది నింతవివేకము లేక పుత్రికన్
సోమరివై సుదర్శనుని సొమ్ముగఁ జేయఁదలంచి యోగ్యులన్
భూమివరేణ్యులన్ వెడలిపొమ్మనలేకిటు నక్కజిత్తులన్
వేమఱు పన్నినన్ దెలియనేరమె తక్కొడు లంత మూర్ఖులే.

చం. మొదలన సందియం బయిన మూర్ఖుఁడవై యిటులెల్లరన్ వృథా
విధిమెయిఁ బిల్వఁబంచి పలవించినఁ బోవునె ! నన్నుఁ జూడు నీ
మదమడఁగించి చక్కఁడఁచి మందుని నిందు్యని నీసుదర్శనున్
బదిలము చేసి మన్ననికిఁ బట్టముగట్టెద నీకుమారికన్. ౧౧౦

క. అనిలో నాకొక్కసుద
ర్శనుఁ డుప్పో ! యూరుఁగారొయె ! సకలనరేంద్రుల్
పనిగొని యెదురుకొనిన నొ
క్కనిమిషమునఁ జక్కఁడంపఁ గలనెఱుఁగవొకో. ౧౧౧

శా. భారద్వాజమునిం గణించి మును తత్ప్రాణం బుపేక్షించితి
స్వీరుల్ వీరలుమెచ్చ నేఁడడఁతు నీనేర్పింకఁ జాలించి యా
నీరేజాక్షిని నాదుమన్ననికిఁ బెండ్లింజేసి రక్షించుకొ
మ్మా! రాజ్యంబు మదాశ్రయంబుకలిమిన్ మేలెంచి కీలెంచుమీ.

తే. గీ. రాజ ! ' నీచాశ్రయోనకర్తవ్య ' యనఁగ
వినవొ ? యేమని యీ సుదర్శనుని కిత్తు
వాత్మజాతను ; మహాదాశ్రయంబు గోరి
తేని నామనుమని కిమ్ము మానవేంద్ర ! ౧౧౩

క. ఒక్క సుదర్శనుఁ దక్కఁగఁ
దక్కొరుల వరించెనేనిఁ దగఁలాటంబుల్
పొక్కవు మంటపమునకున్
జక్కఁగ నీతనయఁ బిలువఁ జనుము నృపాలా ! ౧౧౪

వ. అనిపలుక నయ్యుధాజిత్తున కుత్తరం బీనేరక కాశీరాజు చింతా
క్రాంతుండై తలవంచుకొని యంతిపురమ్మున కరిగి భార్యం గాంచి
యిట్లను " నోతరుణీ ! యెల్లైన సుదర్శనున్ విడిచి మనకన్నియ

యన్యుని వరించు నట్లొనరింపవలయుఁ గాదేని మానంబుదక్క "
దనపుడు వల్లెయని యాపె శశికల పాలికిం జని మెల్లన నిట్లనియె.

ఉ. అమ్మరో ! యాసుదర్శనునికన్న బలాఢ్యులు రూపవంతులున్
సొమ్ములు గల్గువారలును జూడఁగ వేలకొలంది వచ్చి ర
ర్థమ్మును బ్రాణమానములు దక్క విఁ కాతనిఁ గోరితేని మా
యమ్మ ! వినంగదమ్మ ! పదవమ్మ ! స్వయంవర రంగభూమికిన్.

క. వినుము సుదర్శనుఁ గోరిన
ఘనుఁడు యుధాజిత్తు వానిఁ గడతేర్చి క్షణం
బున నిన్ను నన్ను నీ జన
కుని నట్లొనరించు నంత క్రూరుఁడుఁ గలఁడే ౫౧౭

క. అని నయమున భయమున న
వ్వనజముఖికిఁ దెల్పు నా యవసరంబునఁ ద
జ్జనకుఁడు సుబాహు భూపతి
చనుదెంచి మఱియును జెప్పెఁ జనువున బలిమిన్. ౫౧౮

క. వెస నా శశికలయును దా
నసిధారావ్రతము పూని యగ్ని నుఱికెదన్
విసమున్ మెసవెద నన్యుఁడు
విషమాంబకుఁడైన నొల్ల వేయేమిటికిన్. ౫౧౯

చ. వినుము నృపాల ! నా మనవి వీరలకున్ మది జంకెదేని న
న్ననువుగ నా సుదర్శనున కర్పణఁజేసి రథమ్మునందు మ
మ్మనిచి మహోత్సవం బలర నూరికి నావల విడ్వ మట్లొన
ర్చిన నెదిరించు శత్రుల హరింపఁ గలాఁడతఁ డాహవమ్మునన్.

వ. అను నబ్బాలకతం డిట్లను. ౫౨౧

చ. పలువురితో విరోధమది బ్రహ్మకునైనఁ దరంబుగాదు నా
పలుకు గణించి పంతమును బట్టకు మెవ్వరికైన సాహసం
బలవడ దన్ని కార్యములయందును "వెట్టి యడంగె రోఁకలిన్
దలకును జుట్టుమం" చనువిధమ్మునఁ బల్కుదురమ్మ పుత్రికా!

చ. వదలుమటంచుఁ జెప్పెదవు వారలు వీరలు వైరయుక్తు లు
న్మదులు నృశంసు లెల్ల నరనాయకులున్ మిముఁజుట్టి యేకమై
కదిసిన మీరొనర్పఁగల కార్య మొకించుకయేని లేదు నా
మది యెటులొప్పు దుర్మదులు మానక యెంతకునైన నొప్పరే?

వ. నా కొక్క యుపాయంబు దోఁచుచున్నయది. మున్ను సీతా
వివాహమ్మున జనకుం బలెఁ బణం బేర్పఱతు నట్లైన నిర్వివాదం
బుగ సమర్థుఁడగు వేరొకఁడుగాని సుదర్శనుండుగాని నన్నుం
గైకొను ననుడు శశికల యిట్లను నోయయ్యా! సమర్థుండైనఁ
గాకున్న నాకు సుదర్శనుండ భర్త కాని యన్యుండు గా
నేరఁడు. ౧౨౮

ఉ. ఈవు పణంబు నేర్పఱచితేని ధనాంగనరీతి నేనునున్
గావలె వీరికిన్ సమముగా వశనై; యొకఁడెవ్వఁడో ననుం
జేవ గలాఁడొ వేఱొకఁడొ చేకొను నప్పుడుమాత్ర మెల్లరున్
భూవిభు లూరకుందురె? సముద్ధతు లెంతురె ధర్మపద్ధతుల్.

క. ఏ విధినైనను గలహము
భావింతు లోకైకజనని భావించి ననున్
దేవేరిగ నొనరింపు య
థావిధిగ సుదర్శనునకుఁ దలఁకకుమింకన్. ౧౨౯

వ. స్వయంవర మంటపమ్మున కరిగి రాజులం గాంచి యుపాయ మ్మున నిట్లనుము. "నేటిదినమ్మున కీ సభం జాలింత మెల్లిన నీ కార్యంబు నెల్లి సమర్థించెద నిది నిక్కువ" మని యవ్వారిని విడిదల కంపించి యీ రేయి గుప్తంబుగ నాతని రావించి విధి విధానంబుగ నన్ను సమర్పింపుము. మీఁద నాతండు నన్నుఁ దన రథంబునం దిడికొని పోవనేర్చు రాజులు సంగరోన్ముఖులై దుర్మదమ్మున నడ్డుపడిరేని యస్మదుపాసితయగు శక్తియ నివారించుఁగాక. కాదేని సుదర్శనుతోడి లోకంబ నాకును జేకుఱు నింత నిశ్చయంబని మఱియును, గి_౨౭

క. ఒసఁగిన నొసఁగుము విధిగా
నొసఁగంగా నేరవేని యొగి నాయంతఃక
బ్రిసవశరుఁడు సాక్షిగ దే
వి సహాయగ నతని వెంట వెడలెద ననుడుఁ. గి_౨౮

—* శశికలా వివాహము *—

వ. సుబాహుండును గుప్తంబుగా సుదర్శనునకు వివాహంబు సేయం దలంచి చని సభ్యుల కిట్లను. నేఁటి కీ సభ చాలింతము రేపు భవదిచ్ఛాను సరణంబుగ స్వయంవరంబగుఁ దడవొనరింపక ప్రకృతము విడుదులకు దయసేయుం డనుడు నంగీకరించి రాజన్యులందఱును శిబిరమ్ముల కేగి పురంబు నల్గడల రక్షకుల నియోగించి సుఖంబుండి రంత నతండును వివాహంబునకుఁ దగు సంభారం బొనరించి యార్యుల రావించి యెఱుకలెఱుఁగకుండ సుదర్శనుని బిలిపించి మంగళ స్నానాదికృత్యంబులు నిర్వర్తించి యిరువురఁ నేకవేదిఁ గైసేయఁ జేసి యాచమనీయార్ఘ్యపాద్యమ్ము లాచరించి యనర్ఘ వస్త్రద్వయం బొసంగి మధుపర్కంబిడి గోవును

సమర్పించి కుండలమ్ము లలంకరించి విధివిధానమ్మునఁ గన్యా
దానం బొనరించె. ౨౯

ఉ. అంత సుదర్శనుండు దగ నాలలితాంగి సుధాకరాస్య సు
స్వాంత ననంతరమ్యగుణ నంబుజపత్ర విశాలనేత్ర ని
శ్చింత రమాసమన్ హరి శచీసతిఁ బోలె గ్రహించె మేదినీ
కాంతుఁడు గాశిరాజు పలుకానుకలన్ దనియించె నల్లునిన్.

ఉ. పిమ్మట నెచ్చెలుల్ గదిసి పేర్మిమెయిన్ దళుకారుబంగరుం
బొమ్మయుఁ బోని యానృపతిపుత్రిక నెత్తి యలంకరించి పొం
కమ్మగు యానమందు నెసకమ్మున నుంచియు మంటపమ్ముమ
ధ్యమ్ము నలంకరించిన సుదర్శనుపాలికిఁ దెచ్చి రిమ్ముగన్. ౩౧

వ. అంత బురోహితుండును నగ్న్యాధానం బొనరించి లాజావిసర్గంబు నిర్వర్తింపఁజేసి ప్రదక్షిణాదికం బొనరింపఁ జేయుడుఁ గాశీరాజు సంతుష్టాంతరంగుఁడై సర్వోపస్కరయుతంబు లగు రెండువందల రథమ్ములును నానాలంకారయుతంబులగు ననేకప సహస్రమ్ములును విహంగమరాజవేగమ్ములగు తురంగాయుతమ్ములును గ్రమేళకశతంబులును కాంచన భూషితంబులగు దాసీశతంబులును వివిధచిత్రవిచిత్రితంబులగు వాసగృహమ్ములును పూఁదోటలును ప్రకటమ్ము లగు శకటమ్ములును తక్కంగలుగు నానావిధవిశిష్టపదార్థమ్ములును నుపాయనంబుగా నొసంగి యల్లునిఁ గారవించి వియ్యపురాలగు మనోరమం గాంచి విహితాంజలిపుటుండై యిట్లనియె. ౩౨

క. అమ్మా! యీసుత నీసుతు
సొమ్మయి నప్పు డిఁక నీదుసొమ్మననేలా.

నెమ్మిఁగలిగి యెంతయు గా
రమ్మున నేలొక్కొమ్మ నే గరములు మొగుడ్చున్. ౫౩౩

వ. అనుడు మనోరమ సంతోషపూర్వకంబుగ నిట్లను. ౫౩౪

గీ. ఇంతకన్నను వృద్ధిచే నెసఁగుమయ్య
రాజ్యహీనుండనక మహారాజవయ్యు
నిచ్చితివి మత్కుమారున కిగురుఁబోఁడి
రత్నపుంబొమ్మవోని గారాపుఁబుత్రి. ౫౩౫

ఉ. ధీరులయందు నుత్తముల ధీవసులందుఁ గృపాళులన్ మహో
దారుల వీరులన్ మఱియు ధన్యుల మాన్యుల నన్యులందు నిం
కేరు భవత్సమానులు? మహీంద్రమహేంద్ర! సుబాహుభూప! మా
భారము నీది నీ కొమిరెభారము మాయది నేఁటివారమే. ౫౩౬

ఉ. ఏరికినైనఁ బుత్త్రికలనిచ్చెడిచో ధనధాన్యసంపదా
ధారవిహార పుష్పవనతల్పము లాదిగఁ గల్గుభాగ్య వి
స్తారము నెంతు రెంతటి వదాన్యశిరోమణు; లట్లుఁ గాక సా
ధారణు మత్కుమారకు సుతాపతిఁ జేసితి వింత యొప్పనే.

మ. ధనధాన్యంబులు గల్గి యెక్కుడగు విద్యాబుద్ధులం బొల్చి వ
ర్తనలం బెద్దలమెప్పుఁ గాంచిన మహాధన్యాత్ములౌ రాజనం
దనులన్ జూడక నీకుమారి తనయంత న్నాతనూజాతు ని
ర్ధనునిం గోరుట కేను మెచ్చ నిను నాంతర్యమ్మునన్ మెచ్చెదన్.

వ. అనవుడుఁ బ్రీతుండై సుబాహుం "డోయమ్మా! నీకొమరుండు
రాజ్యవిహీనుండని విచారింపనేల? మద్రాజ్యం బఖిలం బతనిది
కాదే" యని మఱియును, ౫౩౯

శా. నారాజ్యం బఖిలంబు నిచ్చెదను సేనానీత్వముం బూనెదన్
నీరాజ్యం బిది యేను సేవకుఁడ నా నీభేదమేలా ? పయో
నీరన్యాయమునన్ వసింపుదము మన్నీలున్న వారింకఁ ద
ద్వైరం బెట్టులొ సామదానములనో వారింతు భేదాననో. ౧౪౦

క. ఆమాఁట జక్కఁబడరే
నేమాయెన్ సంగరంబె యే నొనరింతున్
బో ! మానిని ! జగదంబిక
యే మన కన్నిఁటికిఁ గలఁ ది కేటికిఁ జింతల్. ౧౪౧

వ. నావుడు మనోరమ యిట్లను. ౧౪౨

ఉ. నీవచనంబుచేతన జనించె ముదంబు మదంబ నీకు సా
ఖ్యావహమయ్యెడున్ సుఖములందును పుత్రులతోడఁగూడి యీ
భూవలయంబు నీవ తగుపోణిమి నేలుకొనంగదయ్య ! మ
ద్దేవియ మత్కుమారునకుఁ దెచ్చి యొసంగును దండ్రిరాజ్యమున్.

చ. కరమున మన్నుపట్ట నది కాంచనమౌఁ దనయత్న మింతయుం
బోరయక యే సమస్తమును బూర్ణమగున్ బ్రజలందఱున్ మహా
దరము వహింత్రు నెమ్మది ముదమ్మునఁ బొంగు సమస్త కార్యమున్
సరిపడు నొక్కపెట్ట గ్రహచారము చాలినయప్పుడేరికిన్. ౧౪౪

ఉ. చింత యొకింత లే దఖిలజీవులకున్ సుఖవేళఁ గష్ట మొ
క్కింతయు రాదు కష్టమున నించుకయున్ సుఖమబ్బఁ బోదు తె
మ్మింతకు నాతనూజునకు నిప్పటికాలము మంచిదౌట నా
వంతయు వంతరాదిఁకఁ బ్రయత్నమొనర్పుము కూఁతునంపఁగన్.

వ. అని యన్యోన్యకష్టసుఖప్రచారమ్ముల నారేయిఁ గడపుచున్నంత
నగరమ్మున విడిసియున్న రాజకుమారులు మంగళతూర్యాదిని
స్వనమ్ము లొక్కింత యాలించి, ౧౪౬

ఉ. కొందఱిదేమి హేతువనుకొందురు కొందఱు పెండ్లికాల మీ
చందమునం జెలంగు నని సందియ మందరు కొంద ఱీనృపుం
డందఱ మోసపుచ్చి తనయాత్మజ నాతనికిచ్చి పెండిలిం
దొందరగా నొనర్చెడివినోదము గాదగు నందు రమ్మొయిన్ ౹౹౬౭౭౹౹

ఉ. అంతటఁ గాశిరాజు వినయమ్మున రాజులఁ బిల్వ నేగ భూ
కాంతులయం దొకండయిన గౌరవమున్ బొనరింపఁ డంతయున్
స్వాంతమునం దెఱింగియు సుబాహుఁడు వేల్పులఁబోక "యోధరా
కాంతులు ! పెండ్లి విందునకుఁగా దయసేయుఁడు మీర లెల్లరున్.

క. నాపుత్రి యెంత చెప్పిన
మాపలుకులు వినక తనదుమది కెక్కిన యా
భూపతనూజు సుదర్శను
నే పెండిలియాడెఁ జెప్పఁ డేమి యొనర్తున్ ? ౹౹౬౭౮౹౹

తే. గీ. మీమ్ము నియ్యెడ దయఁజూపి మించుపేర్మి
నించి నా గౌరవమును దక్కించుపొంటె
వేడుకొనియెద" నావుడు ఱేఁడులెల్లఁ
దలలు పంకించి యీరీతిఁ బలికి రతని. ౹౹౬౭౯౹౹

క. భోజనములాయె నొకరును
రాజా ! రాఁజాల రకట ! రాత్రి వివాహ
శ్రీ జరిపి బడలియుంటివి
భోజనమున కేమి ! పొమ్ము పోదుము మేమున్. ౹౹౬౮౦౹౹

వ. నావుడు సుబాహుండు వారలమనంబు గ్రహించి సంశయించుచు నగరికరిగె నంత నారాజులలోఁ గొందఱు సుదర్శనుం జంపి కన్య కన్ గైకొందమనువారును నది న్యాయంబుగాదు మిన్నక యుత్సవంబు నాలోకించి పోవుదమనువారును మఱియు నానా

పరిచారంబులఁ బరిసంగించువారునునై యాయామార్గమ్ములం గాచియుండిరి. సుబాహుండు తక్కు కార్యంబుల సలక్షణమ్ముగా నెఱవేర్చి యల్లుని సతీసమేతమ్ముగా నంపువాఁడై పారిబర్హం బొసంగుచున్నంత, ౧౧౨

—* సుదర్శన యుధాజిత్తుల యుద్ధము. *—

క. దూతలువచ్చి సుబాహుధ
రాతలపతి కిట్టులనిరి రాజా ! నీ జా
మాత నిపుడంపఁబోకు మ
రాతులు గలరయ్య త్రోవ రక్కసుల క్రియన్. ౧౧౩

వ. నావుడు సుబాహుం డంతకుమున్న రాజులచందం బెఱింగిన వాఁడగుటం జేసి సంశయించుచుండ సుదర్శనుం డిట్లనియె.

చ. నృపవర ! వారలేమి యొనరింపఁగలా రొనరించి రేని స
త్కృపగల తల్లి యా జగదధీశ్వరి నాకు సహాయభూతయై
రిపుల నడంపకున్నె తగురీతిఁ బ్రయాణమొనర్పుమయ్య మా
తపసుల యాశ్రమమ్మున ముదంబున నుండెదమయ్య ! తద్దయున్.

మ. తగువాసం బది గాదటంచు మదిఁ జింతం జేయఁగాఁబోకు మె
ప్పగు మా యాశ్రమమందు దివ్యమణి దీప్యత్కాంచనరాజాతమా
సొగసుంగుల్కెడి బావులా చెఱువులా సొంపారుపూఁదోఁటలా
నగరుల్ మీనగరంబులుం దగవు విన్నాణంబునన్ దానికిన్.

వ. అనవ్రడుఁ గాశిరాజును నసంఖ్యమ్ముగా ధనం బొసంగి సతీసమే తంబుగా నంపుచుఁ దానును బలసమేతంబుగాఁ బిఱుందన వెడలె.

ఉ. అంత సుదర్శనుండు దనయంకమునందలి కాంతతో రతీ
కాంతుఁడు నాఁగ నిర్భయముగాఁ జనుదెంచెడివేళ రాజు ల

త్యంత " మదే రథం బదె సుదర్శనుఁ డేగెడుఁ గాంతఁ గూడి మా
పంతములెల్లఁ జెల్లఁ జని పట్టుఁడు కొట్టుఁ" డ టంచు రేఁగినన్.

వ. సుబాహుండు వారల కడ్డపడియె నంత సుదర్శనుండు నిశ్చల
చిత్తమ్మున నేకాక్షరమ్మగు కామరాజమహామంత్రంబు జపించుచు
నంబాపదనళినంబులు మనంబున గుఱికొల్పి యుండె నాలోనన
యుధాజిత్తును శత్రుజిత్తున్ దాఁకిన, గి౫౯

ఉ. వీఁక సుబాహుఁ డాత్మభుజవీర్య మెలర్పఁగ శంఖదుందుభి
ప్రాకటరావముల్ సెలఁగ బాణపరంపరలన్ యుధాజిదా
ఖ్యాకు నెదిర్చె నిర్వుర కఖండముగాఁ బొసఁగెన్ రణంబు! ని
ర్భీకత నంబపై మనము వెట్టె సుదర్శనుఁ డప్పు డొప్పఁగన్.

ఉ. దారుణరీతిగా రణము తద్గతి నొప్పుచునుండ దీవ్యదా
కారముతో మహాయుధనికాయముతోఁ దగువల్వతో నలం
కారముతోడఁ గల్పసుమకాండ పరీవృత దివ్యమాలికా
భారముతో మృగాధిపతివాహనయై జగదంబ గ్రక్కునన్, గి౬౦

వ. ప్రత్యక్షం బగుడు సుదర్శనుండు హర్ష పులకితగాత్రుండై మాము
కుం జూపుచు, గి౬౧

ఉ. ఇంక భయమ్ము చెంద మన కేమిటి కంచు రథమ్ము డిగ్గి యే
ణాంకముఖిలలామ యగు నంగనతోఁ దనమామతోడ ని
శ్శంకఁ దదంబికాంఘ్రి జలజమ్ములకుం బ్రణమిల్లె నన్ను లా
తంకము చెంద సింగమును ధ్వాన మొనర్చె ననూనరీతిగన్.

వ. మఱియు ఘోరవాయువులు వీచె దిక్కులు మిక్కిలి దారుణ
ప్రకారంబులయ్యె దానం జేసి రాజులందఱును భీతిల్లి నిశ్చేష్టులై

మహైశ్వర్యపర్యాకులులై చూచుచున్నంత సుదర్శనుండు సేనాధిపతి కిట్లను. అస్మదుపాసితయగు జగదంబ శరణమై యేతెంచె నింక నీ వోరులకుఁ దలంకక రాజసంకులమ్మగు పథమ్మున ననర్గళమ్ముగ సైన్యమ్ముఁ బోనిమ్మనవుడు నతఁ డట్లచేసె యుధాజిత్తు భయగ్రస్తులై మార్గిస్పడి చూచుచున్న రాజులంగని యిట్లనియె. ౫౬౪

ఉ. సింగముమీఁద నెక్కి యొక చేడియ వచ్చినయంత భీతులై
క్రుంగఁగనేల ? రాజు లధికుల్ గలచో నొక దుర్బలుండు త
న్వంగిని జేకొనంగ నదియారసి యూరకయుండఁ జెల్లునే ?
వెంగలి వీనిఁ జంపి బృధివీపతిపుత్రికఁ దెత్త మిత్తఱిన్. ౫౬౫

క. అని తాను శత్రుజిత్తును
గినిసి సుదర్శనునివంకఁ గీలించె శరా
సన మూకర్ణాంతంబుగ
ననేక బాణముల వాని నాతఁడు దృంచెన్. ౫౬౬

వ. అంత నంబికయు, ౫౬౭

చ. కనులను మిణుఁగుల్ సెదరఁగా నృపులందఱు కన్నిరూపులై
కనలి యనేకబాణముల గాఁడఁగఁజేసిన సంకులక్రమం
బునఁ దగె యుద్ధరంగము సముజ్జ్వలదేతదనూనబాణమ
ర్దనమున శత్రుజి త్తతనితాతయుఁ గూడఁ బరేతులైరొగిన్.

వ. తక్కుంగలవార లందఱు నద్దానికిఁ బరమాద్భుతం బందిరి. సుబాహుండు పరమప్రీతుండై యానందబాష్పమ్ములు వెల్లివిరియ నప్పరశక్తి నిట్లని వినుతించె. ౫౬౮

ఉ. పేరిమి సర్వభక్త జనపీడ లడంచెడి తల్లిరో! నమ
స్కారము, శాంతి విద్య శివ కామద నాఁజను తల్లిరో! నమ
స్కారము, కొల్చువారలకు సంపద లిచ్చెడి తల్లిరో! నమ
స్కార, మకారణంబ యుపకార మొనర్చుట నీక చెల్లెడిన్. ౫౨౦

పంచచామరము. సమస్త జంతుజాలమున్ పవిత్ర సత్కృపాకటా
క్షమంగళోజ్జ్వల త్తరంగ సంగతిం బొసంగఁ జే
సి మేలుఁగూర్చి ప్రోచుతల్లి! శ్రీకరిన్ నినున్ సదా
నమస్కరింతుఁబ్రోవుమమ్మ! నన్నుఁబేర్మిమీఱఁగన్.

క. అగుణవగు నిన్నుఁ గొనియా
డఁగలనె? మూఢుండ సగుణుఁడన్ దుష్టుండన్
భగవతి! నీ యాథార్థ్యం
బు గనం జాలరు విరించి ముఖులగు సురలున్. ౫౨౨

గీ. ఈవ వాగ్దేవతవు, బుద్ధి వీవ, మతివి
నీవ, జంతువులకు గతి నీవ, నిన్ను
నుతి యొనర్పంగఁ దరమె? మనోనియంత్రి
వగుచు నెల్లెడ వర్తింతు వఖిల జనని! ౫౨3

ఉ. తావకభక్తముఖ్యుఁడు సుదర్శను సంగతిఁ జేసియేకదా!
భావుకమై యశేష జనపావనమై యజముఖ్యదుర్లభం
బై వెలుగొందు త్వత్పదనవాంబురుహద్వయి నూడఁగంటి నీ
సేవకకోటిలో నొకనిఁ జేసి ననుం గరుణించు మమ్మరో! ౫౨౪

ఉ. అంబ! రిపున్ హరించి భవదంఘ్రి రజోలవలేశధారి బా
లుం బలహీనునిన్ విజయలోలు ననాథు సుదర్శనున్ గృపా
లంబితచిత్తవై శశికలాసతితోఁ గరుణించి యింత పూ
ర్ణం బగునమ్మ! నెమ్మి నిను నమ్మి భజించెడి భక్తకోటిపై.

గీ. మంత్రతంత్రమ్ము లెఱుఁగ నీ మహిమ యెఱుఁగ
మూఢభక్తిని వినుతింతు మొఱకు నన్నుఁ
బాలనము సేయుమమ్మ ! నీవాఁడ నమ్మ !
కిల్బిషమ్ము లడంచి రక్షింపుమమ్మ ! ౧౭౬

వ. అని బహుభంగుల నుతించు సుబాహుం గరుణించి యంబ భవ
దభీష్టం బేమనుడు బద్ధాంజలిపుటుండై యానంద పులకితగాత్రుం
డై యిట్లనియె. ౧౭౭

శా. తల్లీ ! నీదగు దర్శనంబుకతనన్ ధన్యుండనై యున్న నే
నొల్లన్ స్వర్లోకఁ డేదియేని కరుణాయోగమ్మునం జేసి నా
యుల్లమ్మందు వసించు టొక్కటియు లోకోత్తంస మీకాశి ను
ద్వల్లీలన్ వసియించు టొక్కటియు ని ష్టార్థింతు నత్యంతముల్.

క. దుర్గమ మగు రిపువర్గ ము
నర్గళకృప సంహరించి న న్నేలిన యో
సర్గవిధాయిని ! నా పురి
దుర్గాభిఖ్య నివసింపు త్రుంపుము రిపులన్. ౧౭౯

గీ. ఈపురం బెంతదనుకఁ దా నిల వెలుంగు
నంబ ! నీవంతదనుక మా కభయదాత్రి
వగుచు వసియింపవలయు మహానుకంప
దనర నిచ్చోట ; నిదియ నాకును వరంబు. ౧౮౦

వ. నావుడు జగదంబిక యంగీకరించెఁ బిమ్మట సుదర్శనుం డామె
నిట్లు వినుతింపఁదొడఁగె. ౧౮౧

గీ. సృష్టిరక్షావిలయములు సేయఁ జాలె
దంబ ! యొక్కింతయుచ్చు నీకమరేశాని

యట్టినీ విట్టిదీను న న్నాదరించి
కాచితి వటన్న నిదియు దుష్కరమె నీకు ? గీ॥ ౨

గీ. ఏమికార్య మొనర్తు ? నే నెచటి కేగు
వాఁడ ? మూర్ఖుఁడనయ్యు భవత్ప్రసాద
బలముచే సర్వ మొనరింపఁ గలను దేవి !
కృప దలిర్పంగ నా కానతి మ్మనవుడు. గీ॥ 3

ఉ. చేసెడిదేమి నాకు నృపశేఖర ! యీ లలితాంగితోడ న
చ్చాసనమున్ వహించి విలసన్మతివై చని యాయయోధ్య సిం
హాసన మెక్కి నన్నుఁ బవ కంచితరీతిని రాజ్య మేలుకో
మ్మా ! సురనాధవై భవుఁడవై నిను నేఁ బయి నుండి కాచెదన్.

క. బలిదాన విధానం బది
యలరఁ జతుర్దశిని నవమి నష్టమిని సన్
గలకాలమ్మును శ్రద్ధా
కలితుఁడవై పూజ సేయఁగా వలెఁ జుమ్మా. గీ॥ ౪

క. అదిగాక శరత్కాలము
మదభీష్టం బెంతయేని మత్పూజలు నె
మ్మది నవరాత్రవిధానము
పొదలఁగఁ దత్కాలమందుఁ బొనరుపు వత్సా. గీ॥ ౬

గీ. మాఖ చైత్రాశ్వి నాషాఢ మాసములను
నొప్పుగాఁ జేయుమయ్య మహోత్సవములు
కృష్ణపక్ష చతుర్దశి కేవల నవ
రాత్రములు నష్టమియును బాత్రములు మిగుల. గీ॥ ౭

చ. అని వివరించి యంతటఁ బరాంబ యదృశ్యతఁ గాంచె నాసుద
ర్శనుపరిఁ జేరి యెల్లరును రాజులు భక్తియు నమ్రభావముం
దనర సురల్ సురాధిపు విధమ్మున మ్రొక్కి నుతించి రంబికన్
మనమున నమ్మువారు జనమాన్యత గాంచుట కేమి శంకయా.

క. మామయగు సుబాహుండును
భూమీపాలకులతోడఁ బోయి యతనికిం
జేమోడ్పు ఘటించెను దే
వోమూర్తులయందు వయసు చూడంబడునే. గీ౯

వ. పిమ్మట రాజన్యులందఱును సుదర్శనుం గాంచి మహాత్మా! నీ
విఁక నయోధ్యాపురమ్మునఁ బైతృకంబగుసింహాసనమ్ము నధి
ష్ఠించి మమ్మందఱఁ బాలించుచు మాచే వలయుపనులం గొనుచు
నింతకు మున్నజ్ఞానవశమ్మున నొనర్చిన యస్మదపచారమ్ముల
సైరింపవలయు సంసారకూపమ్మునం బడి సారాసారవివేకంబు
దక్కి పశువులగతిఁ దిరుగు మాకు నీయనుగ్రహమ్మునం గదా!
జగదీశ్వరీసందర్శనంబు గలిగె నిట్టి నీ కేమి యాచరింపం గలవార
మని బహువిధముల ననునయించి మఱియును. గీ౦

చ. అడిగెద మొక్కమాట వినయమ్మున; సర్వ మెఱుంగునట్టియో
యొడయఁడ! దేవి నాఁగ నెవరో! యిట నెచ్చటనుండి వచ్చెనో!
కడఁమఁద మయ్యె మా కెఱుఁగఁగా నొనరింపు మనన్ సుదర్శనుం
డెడపక వారి కిట్టులనియెన్ జగదీశ్వరి నాత్మ నెంచుచున్. గీ౧

ఉ. చెప్పెడిదేమి యోనృపతిశేఖరులార! త్రిమూర్తులాత్మ నె
ల్లప్పుడు నేజగజ్జనని నంబిక నెమ్మి భజింతు రాపె యే
యిప్పరశక్తి సాత్త్వికి మహీముఖలోకములెల్లఁ బ్రోచుఁ ద
న్నెప్పుడుఁ గొల్చువారలకు నిచ్చు నిరామయభాగ్యసంపదల్.

గీ. వెలుఁగుచు రజోగుణమ్మున సృష్టిసేయు
సత్త్వగుణమునఁ బాలించు సంహరించు
నఖిలము తమోగుణంబూని; యక్కతమున
సగుణయనఁ నొప్పు నీశక్తి జగమునందు. గీ-3

క. ఈ సగుణ శక్తియే యగు
దాసుల కెల్లరకు సౌఖ్యదాయినియును సే
వాసక్తులకుఁ సేవ్యయు;
వీసంబు నెఱుంగ సగుణవిధ మే ననుడున్. గీ-౪

ఉ. చిన్నతనమ్మునందు వనసీమకు వెళ్ళడి భీతి గ్రమ్మ బల్
విన్నఁదనంబుదోఁప నొకవిద్దెయు బుద్ధియు లేనిప్రాయమం
దెన్నఁగ నిట్టి శక్తికృప యేగతిఁగల్గెనటంచు మాకు న
న్నన్న! కదుఁ విచిత్రమగు నా తెఱఁగుఁ వివరించి చెప్పుమా

గీ. అనుడు నతఁ డిట్టులను బాల్యమంద నాకుఁ
బట్టువడె నొక్క బీజంబు భాగ్యవశతఁ
బేర్మి నయ్యదియే కామబీజ మయ్యె
నదియనాకు నొసంగె విద్యాదికంబు. గీ-౬

క. మునులకతన నప్పుడు
వినియుంటిని దేవినాఁగఁ బిడప నదియె యం
బను జూడఁగ సాధనమ
య్యెను బీజావృత్తి కెంతయేనియుఁ దోడై. గీ-౭

వ. నాపుడు రాజులందఱును బరశక్తి ప్రభావమ్మునకును సుదర్శ
ననదృష్టమ్మునకును సంతసించి తమతమపురమ్ముల కేగి సుఖం
బుండిరి. సుబాహుండు నల్లు నంపించి తనపురమ్మున కరిగి

యయ్యెడ దుర్గాలయమ్ముఁగట్టించి ప్రతిష్ఠాదికంబొనర్చి విశ్వేశ్వ
రుతోఁబాటు పూజాదులు జరపుచుండె. సుదర్శనుండు పర
మోత్సాహమునఁ గోసలదేశమ్మున కరిగి యయోధ్యానగర
సమీపమ్మున విడిసె. గీ౯౮

—* సుదర్శనుఁ డయోధ్యకరుగుట *—

ఉ. సంగతి యంతయుం దెలిసి సంగతులై సచివుల్ మృదంగ స
న్మంగళరావముల్ సెలఁగ నాగరకాంతలు లాజ లొప్పవే
డ్కం గురియింప వందులు గడంగి నుతింప నెదుర్కొనన్ జయా
భంగురుఁడై సుదర్శనుఁడు పత్నియుఁ దానును నేగెఁ బ్రోలికిన్.

వ. ఇట్లు పౌరజనసమర్పితనానోపాయనగ్రహణపురస్సరంబుగ నంతః
పురంబు సొచ్చి పుత్రశోకమ్మునం గుందుచున్న సవతితల్లిం గాంచి
నమస్కరించి వినయమ్మున నోదార్చుచు నిట్లనియె. ౬౦౦

క. నీతనయుని నీతండ్రిని
నీతివిహీనుండ నగుచు నేఁ జంపఁగ లే
దో తల్లి! భవత్పదకం
జాతమ్ములు సాక్షి శక్తి చంపె నిరువురన్. ౬౦౧

గీ. ఒకరు చేసినకర్మంబు నొకరు పొంద
నేర్తురే యిందులకు ని.త యార్తియేల
తగ నవశ్యంబు కాఁదగుతంత్రములకు
శోకమంద రొకింత తద్జ్ఞులు నిజంబు. ౬౦౨

ఉ. దాసుని నన్ను నీసుతువిధమ్మునఁ జూడఁగదమ్మ! శోకముం
జేసి కృశింపనేల? దయచేసి మనోరమకన్న నెక్కుడై
వాసియు వన్నెయుం గలిగి వర్తిలవమ్మ! యొకింతభేదముం
జేసెడివాఁడఁ గాను జననీ! పరిచర్య యొనర్తు నిచ్చలున్. ౬౦3

క. తన చేసిన కర్మముచేఁ
దన కాపద సంభవింప దైవము దూఱన్
జన దన్యుల నిందింపన్
జన దయ్యది యనుభవమునఁ జక్కంబడెడిన్. ౬౦౪

గీ. దారుమయకాంత నర్తకప్రేరణమునఁ
జేసి నటియించు విధమున జీవుఁడాత్మ
కర్మవశమున సుఖదుఃఖములను జెందు
నందుఁదద్జ్ఞులు దుఃఖించు టనుచితంబు. ౬౦౫

గీ. చిన్నతనమున నీతండ్రి చెట్టఁదలఁచి
నన్ను రాజ్యవిహీను నొనర్చునప్పు
డేను గర్మానుభవమని యెంచుకొంటిఁ
గాని శోకింపలేదు నిక్కంబు తల్లి. ౬౦౬

క. నీతండ్రి వీరసేనున్
నాతాతన్ జంప నాజనని ననుఁగొని దుః
ఖాతురయై కాంతారం
బేతెంచెడి త్రోవ దొంగలేతెంచి వడిన్ ౬౦౭

క. కట్టినపుట్టము మొదలుగ
నెట్టన హరియింప దుఃఖనీరనిధికిఁ దాఁ
గట్టెఱుఁగక పడుకష్టము
లెట్టి రిపునకైనఁ గూడ వెప్పటికైనన్. ౬౦౮

వ. అట్టియెడ విడల్లుండును ధాత్రేయియు మమ్మును విడువక కష్ట
సుఖమ్ములకోర్చి వెంటన్ జనుదెంచిరి. ౬౦౯

ఉ. పిమ్మట నెట్టకేలకుఁ దపించితపించి సురాపగాసమీ
పమ్మననున్న యొక్కమునిపల్లెకుఁ జేరితి మామునీంద్రులుఁ
దమ్ముల గారవించియుఁ గ్రమమ్మున నింతకుఁ దెచ్చిరమ్మ ! నా
కమ్మెయి దుఃఖ మిమ్మెయి ననంతముదమ్మును లేదు తల్లిరో !

వ. ఇప్పటికైన నేరియందు మాత్సర్యంబుగాని వైరంబుగాని లేదు. రాజ్యభోగంబుకన్న నీవారాన్నభక్షణం బొనర్చుచు నింద్రియ జయం బొనరించి ధర్మాచరణంబు కర్జం బని తోఁచెడి. సకల జన్మంబుల మనుష్యజన్మంబు దుర్లభం బదియును భారతఖండం బున నగుటెక్కుడగు, నట్టి జన్మంబునొంది సర్వసాధారణంబులగు నాహారాదిసుఖంబులందుచు మందుఁడై వర్తించుటకన్న స్వర్గ మోక్షప్రదం బగుధర్మసాధనం బొనర్చుట లెస్సగాదె! యను సుదర్శనువచనమ్ములు విని లీలావతి లజ్జితయై పుత్రశోకంబు పరిత్యజించి యిట్లను, ౬౧౧

చ. నిను నిటు చేయునప్పు డవినీతి యొనర్పకు మన్న నన్ను మ
జ్జనకుడు లెక్కపెట్టక యసత్కృతి నీకొనరించి తాను జ
చ్చినయదిగాక మత్సుతునిజీవముఁగూడ హరించెఁ దా నొన
ర్చినకృతి దన్నడంచె నొకరిఁ జెఱుపన్ విధి తన్ను మాపదే.

క. నీతాత వీరసేనుం
డే తాదృశుఁడే తలంప నితనిని నాకై
నాతండ్రి చంపెనకటా !
యోతండ్రీ ! తప్పునాది యొరు లెవ్వరిటన్. ౬౧౩

క. నీ తల్లి నాకు సోదరి
నాతనయుఁడ వీ వకారణంబుగ దుఃఖా

స్వీతనయి కుందనేల ! మ
హీతల మేలుకొనుమీ మహేశ్వరికరుణ౯ ౬౧౪

గీ. వారొనర్చినకర్మంబు వారిఁ జంపె
నిన్ను నిందింపఁ బాపంబు నేనెఱుఁగనె
చచ్చినకుమారునకు నేడ్వ సజ్జనుండ
వైన నిన్నలయించుట కడల వలదె. ౬౧౫

వ. అని యూపె యానతిచ్చుటయు నతండు మంత్రిలం బిలిచి
దైవజ్ఞనిర్ణీతంబగు శుభముహూర్తమ్మున హేమసింహాసనంబు
నిర్మింపంజేసి మణిమండితంబగు నొక్క ప్రాసాదమ్మునందుంచి
తత్సింహాసనమ్మున యథావిధిగ జగదంబిక స్థాపించి, సర్వకాల
మ్ముల నీయంబిక నర్చింపుఁడని పౌరులకాజ్ఞాపించి పిమ్మటఁ
బట్టాభిషిక్తుండై సుఖమ్ముగ రాజ్యభారమ్ము వహించె. ౬౧౬

గీ. ఆ సుదర్శనుకతమున నంబ జగద
ధీశ్వరి కృపావలంబ లోకైకజనని
యలరి కోసలదేశమ్మునందు నిలిచి
యెల్లవారికి శుభముల నిచ్చుచుండె. ౬౧౭

సీ. ధర్మజ్ఞుఁడై నీతిఁ దప్పక ప్రఖ్యాతిఁ
బొందిన యలదిలీపునివిధమున
ప్రజలఁబిడ్డలరీతిఁ బాలించి యశముచేఁ
బ్రబలిన రఘుమహారాజు పగిది
సత్యంబు దప్పక జగతిఁ బాలించి ప్ర
శస్తి కెక్కిన హరిశ్చంద్రుమాడ్కి
శిష్టరక్షణదుష్టశిక్షావిశేషముల్
సలిపి ధృతిమీలిన రామచంద్రుపోల్కి

గీ. శుద్ధవర్ణాశ్రమాచార పద్ధతులును
ప్రతిగృహమ్మున నంబాసపర్యలును నె
సంగ శశికల సౌఖ్యంబొసంగ సంగ
తముగ రాజ్యం బొనర్చె సుదర్శనుండు. ౬౧౮

క. మామయు నల్లుడుఁ దమతమ
సీమల నంబాసపర్య చేయు కతమునన్
గ్రామాదులలోఁ బండిత
పామరసాధారణముగఁ బ్రబలెన్ బూజల్ ౬౧౯

—* నవరాత్రి పూజావిధానము. *—

క. అన జనమేజయుఁడనుఁ గ్రి
న్నన శరదాగమమునందు నవరాత్రమ్ముల్
చనుదెంచిన నేవిధి నం
బను బూజింపంగ వలయుఁ బరమమునీంద్రా. ౬౨౦

క. నరపతి జనమేజయుఁ డా
దరమున నిటులడుగ మౌనితల్లజుఁ డనియెన్
శరదాగమ మందు వసం
తఋతువునందును యజింపఁదగు జగదంబన్. ౬౨౧

మ. అరయన్ సర్వజనౌఘనాశకములై యత్యంతఘోరమ్ములై
పరమవ్యాధికరమ్ములయ్యుఁ గడు శోభాస్ఫూర్తి నొప్పారి శాం
కరికిన్ బ్రీతికరమ్ములై మిగుల వేడ్కల్ సేయు లోకాళికిన్
శరదారంభవసంతఘుల్ శమనదంష్ట్రాప్రాయముల్ భూవరా.

క. కావున నీ ఋతువులను శు
భావహనవరాత్రముల సమంచిత భక్తి

శ్రీవిభవము లలరఁగఁ బర
దేవత నర్చింతు రెల్ల ధీరులు నధిపా! ౬౨౩

వ. నవరాత్రి విధానం బెఱింగించెద సావధాన మనస్కుండవై యాకర్ణింపుము. చైత్రాశ్వయుజమాసమ్ములయందు సితపక్షమునఁ బ్రతిపత్తిథి మొదలుకొని నవరాత్రంబులును దేవి నారాధించు నరుండంతకు మున్నమవసయందుఁ దత్తత్పూజాద్రవ్యంబులు సంగ్రహించుకొని యా దినమ్మున హవిష్యాశనంబున నేకభుక్తంబొనర్చి సమప్రదేశమ్మున షోడశహస్త ప్రమాణమ్మును స్తంభధ్వజ సమన్వితంబును నగు నొక మండపం బేర్పఱచి గోరమృద్గోమయమ్ములచేఁ జక్కఁగా నలికి ముగ్గుపెట్టి తన్మధ్యమ్మునఁ జతుర్హస్త విస్తృతమ్మును నేక హస్తోన్నతంబును నగు నొక వేదికఁ బీఠార్థంబు నిర్మించి విచిత్రతోరణ వితానాదికంబులచే నలంకరించి మఱియును, ౬౨౪

క. ఆనాఁటిరాత్రి మంత్ర వి
ధానజ్ఞుల సకలవేదతత్త్వజ్ఞుల స
న్మానించి పిలువవలయు మ
హానియమముగల్గు బ్రాహ్మణాగ్రేసరులన్. ౬౨౫

వ. మఱునాఁ డుదయమ్మున నదీనదవాపీకూపతటాకంబులం దొండె గృహమ్మునందొండె స్నానం బాచరించి సంధ్యావందనాదులు దీర్చికొని పూర్వోద్దిష్టులగు బ్రాహ్మణుల నర్ఘ్యపాద్యాదికమ్ముల నర్చించి శక్త్యనుసారంబుగ వస్త్రాలంకరణాదుల సంతుష్టి గావింప వలయు. ౬౨౬

గీ. ద్విజులు తొమ్మండ్రు వలయుఁ గాదేని నేవు
రైన మూగురునైన మహామహులం డొ

కండయినఁ గావలయుఁ బూజకాలమందు
నంబికామూలమంత్రజపంబుపొంటె. ౬౨౭

గీ. మఱియుఁ బారాయణమునకై మహితు శాంతు
ననఘు నొక్కని వరియింపనగు ద్విజున్మ
స్వస్తివాచనపూర్వంబు శక్తిపూజ
మొదలు వెట్టంగవలయు సమ్మోదమలర. ౬౨౮

వ. పూర్వోక్తంబగు వేదియందు క్షౌమవస్త్ర సమన్వితంబగు సిం
హాసనంబుస్థాపించి యందుఁ జతుర్హస్తయు నాయుధ సమంచితయు
రత్నాలంకార విరాజితయు ముక్తాహారభాసురయు దివ్యాం
బర ధారిణియు సౌమ్యయు సర్వలక్షణ సంయుతయు శంఖచక్ర
గదా పద్మాన్వితయు సింహవాహనయు నగు జగదంబిక నాగ
మోక్త విధానంబున స్థాపింపవలయు. ౬౨౯

క. తగ నష్టాదశభుజ యగు
జగదంబికఁ బీఠమందు సంస్థాపనఁ జే
యఁగవలయునంచుఁ గొందఱు
నిగమ విధానజ్ఞులందు నృపతివతంసా. ౬౩౦

వ. విగ్రహాభావమ్మున నవాక్షర మంత్ర సంయుతంబగు యంత్రం
బును బీఠపూజకై స్థాపించి దాని పార్శ్వంబునఁ * బంచపల్లవ
సంయుతంబును వేదమంత్ర సంస్కృతంబును బుణ్యతీర్థజలపూరి
తంబును కనత్కనకరత్నసమంచితంబును నగు కలశంబు నిలిపి
యయ్యంత్రంబుతోఁ బాటు పూజింపవలయు నని మఱియును,

* మేడి, మఱ్ఱి, రావి, జువ్వి, మామిడి.

క. మంగళ మృదంగ నిస్వన
సంగత వారాంగనా సుసంగీతకళా
భంగీతతనటన వ్యా
సంగాదికములను బొద్దు జరపఁగవలయున్. ౬౩౨

వ. హస్తానక్షత్రయుక్తం బగు ప్రతిపత్తిథిని బూజారంభం బొన
ర్చుట మిగుల శ్రేయస్కరంబు. మఱియును, ౬౩౩

శా. అంబా నక్తములుండి యొండె మఱి యేకాన్నంబుచే నొండె దీ
క్షం బూజించెడి యీ దినంబు లుపవాసంబుండి యొండేని మఖం
బుం బూర్ణం బొనరింతునంచు నియమంబున్ శక్తికల్మిన్ దద
గ్రింబుందున్ వచియించి పూనఁదగు నార్యాపూజకుం డొప్పఁగన్

సీ. మందార కరవీర మాలతీచంపకా
శోక కరజదివ్య సుమచయములఁ
జందనాగురుకనచ్చారు కర్పూర బి
ల్వదళార్ఘ్యపాద్యాది లక్షణముల
నారికేళ కదళీనారంగదాడిమీ
పనసాదితరుజాత ఫలవితతుల
నన్నపానముల దివ్యద్భక్ష్యభోజ్యచో
ష్యాదికంబులఁ బాయసాదికముల

గీ. ధూపముల దీపముల మహాస్తుతుల నతుల
నతులగతుల వ్రతంబు నున్నతు లొనర్చి
సతుల సుతుల సుమతుల సద్గతుల నలరి
వెలలఁ బాయుదు రిదియ దేవీవ్రతంబు. ౬౩౪

క. ఎన్నిక శక్త్యనుసృతిగా
నన్నంబిడవలయు భూసురాదులకు వ్రతం
బెన్నివిధంబులఁ జేసిన
నన్నంబిడఁడేని వ్యర్థమగు నరనాథా. ౬౩౬

గీ. మాంసము భుజించు వార లంబికా యజింతు
రేనిఁ బశువుల బలిదాన మీఁగవలయు
నజవరాహామహిషము లత్యంతముఖ్య
ములు బలివిధానమున కని మునులమతము. ౬౩౭

గీ. అంబకట్టెదుటను జంపినట్టిపశువు
లెల్ల స్వర్గమ్మునకు నేగు హింస నింద్య
మయ్యు యజ్ఞాదికముల దేవ్యర్చనాది
కముల నింద్యమ్ముగాదు స్వర్గదముగాని. ౬౩౮

వ. మఱియుఁ ద్రికోణంబగు కుండంబేర్పఱచి యందు హోమంబొనర్ప వలయుఁ ద్రికాలమ్ములయందును నృత్తగీతవాద్యమ్ములు సెలంగ మనోహరమ్ములగు పూజాద్రవ్యమ్ములచే నర్చింపవలయు భూమిపై శయనింపవలయు వస్త్రాలంకారాదికం బొసంగి కుమారికల నేకైకవృద్ధి క్రమంబునఁగాని యంతకు ద్విగుణమ్ముగఁగాని త్రిగుణంబుగఁగాని నిత్యంబును నారాధింపవలయుఁ గుమారీలక్షణం బెట్లంటేని, ౬౩౯

గీ. రెండువత్సరముల నలరెడునదియు కు
మారి; మూఁడేడు లైనచో మహిప! యది త్రి
మూర్తి; నాల్గేనిఁ గళ్యాణి, మొనసె నేని
యైదు రోహిణి; కాళిక యాఱు మొనయ. ౬౪౦

గీ. సప్తవర్షంబులైనచోఁ జండిక యనఁ
బరగు, నెన్మిదియైన శాంభవి యనంగ
నలరుఁ, దొమ్మిదియైన దుర్గాఖ్య నెసఁగుఁ
బదియయిన దాని నెంతు్రి సుభద్రయనుచు. ౬౪౧

గీ. ఇంత కెక్కుడు వయసామెనేని శక్తి
సంతసింపదు తత్తదర్చనమునం గు
మారిలోనగునట్టినామములు వాడ
వలయు నద్దాన నంబకుఁ గలుగుఁ బ్రీతి. ౬౪౨

సీ. మాటిమాటికిని గుమారిఁ బూజించిన
దుఃఖదారిద్ర్యముల్ తొలఁగిపోవు
పూర్ణభక్తిని దాఁ ద్రిమూర్తిఁ బూజించిన
నాయుస్త్రివర్గముఖ్యఫల మబ్బు
ననువుమీఱంగఁ గళ్యాణిఁ బూజించిన
విద్యావినయరాజ్యవిభవ మొనయు
నకలంకభక్తిఁ గాళికఁ బూజచేసిన
శతు్రిసంతతికి నాశనము పొసఁగు

గీ. చండిక యొసంగుసంపదల్, శాంభవి యిడు
నృపుల నలరించు శక్తి, నెంతే నసాధ్య
కార్యములు నెఱవేర్చు దుర్గయు, సుభద్రి
వాంఛితము లిడు, రోహిణి వ్యాధులడఁచు ౬౪3

వ. మఱియు వీరలనర్చించుపట్ల శ్రీరస్తనుమంత్రంబున నొండె శ్రీయుక్తంబు లగుమంత్రంబులనొండె బీజమంత్రమ్ములనొండె నుపయోగింపవలయు. ౬౪౪

క. ఆరయఁ గుమారతత్త్వము
లారాజీవభవముఖ్యు లగుసురలను లీ
లారీతిఁ సృజియించు కు
మారిం బూజించెదరు సమాహితభక్తిన్. ౬౪౫

క. సత్త్వాదులచేతఁ ద్రిమూ
ర్తిత్వమ్ము న్నిఖిలరూపధేయత్వము వ్యా
ప్తత్వమును గాంచుశక్తిన్
దత్త్వనిధిఁ ద్రిమూర్తి భక్తి దనర యజింతున్. ౬౪౬

గీ. తనుభజించెడి భక్తసంతతికి నెప్పుడు
నఖిలకళ్యాణములును సమస్తకామ
ములు నొసంగెడి కళ్యాణి నెలమిఁ బూజ
చేసెద నఖండ భక్తి సుశ్రీలు సెలఁగ. ౬౪౭

గీ. సకలభూతమ్ములనుఁ బూర్వజన్మ మందు
గూడఁబెట్టిన బీజముల్ కొమరుమిగుల
వెలువరించెడి రోహిణి విపులవిభవ
కారిణిఁ దలంతుఁబేర్మి నఖండభక్తి. ౬౪౮

గీ. చండముండాదిహారిణి చండరూప
చండికకుఁ బూజలిడుదుఁ బ్రచండభక్తి
కారణము లేని యుత్పత్తి గలుగు శాంభ
విని శుభప్రద భజియింతు విపులభక్తి. ౬౪౯

క. ఏవంవిధమంత్రమ్ముల
నేవంవిధపూజలను సమిద్ధములగు నా
నావస్త్రాలంకృతుల శు
భావహాలగు కన్యకలకు నర్పింపవలెన్. ౬౫౦

వ. మఱియు హీనాంగియు దుర్గంధబంధురయుఁ గుష్ఠయుక్తయు వ్రణాంకితయు దుష్కులభవయు జాత్యంధయుఁ (1) గేకరయుఁ (2) గాణియుఁ గురూపయు బహురోమశయు రజశ్చిహ్నద్వ్యంకితయు శ్యామయు (3) గర్భసముద్భూతయు గోళకయుఁ గన్యకోద్భూతయు నగు కన్యకల వర్జించి యరోగిణియు సురూపాంగియు సుందరియు వ్రణవర్జితయు (4) నేకవంశసముద్భూతయు నగుకన్యక నర్చింపవలయు. సర్వకార్యమ్ముల బ్రాహ్మణియు జయార్థంబు నృపవంశజయు లాభార్థంబు వైశ్యకులోత్పన్న గాని శూద్రవంశసంభవగాని పూజనీయ లని యెఱుంగునది. బ్రాహ్మణ క్షత్రియులకు బ్రాహ్మణియు వైశ్యులకుఁ ద్వివర్ణజయు శూద్రులకుఁ జతుర్వర్ణసంభవయుఁ గారులకు స్వకులోద్భవయు నారాధ్యలని యెఱుంగుము. ౬౫౧

క. నవరాత్రి విధానమున వి
భవము కొలఁదిఁ బూజసేయఁ బరమహితము శ
క్తివిభవ శూన్యుం డష్టమి
ని విశేషంబుగ యజించె నేనియుఁ జాలున్. ౬౫౨

గీ. అష్టమిని మున్ను దక్షయజ్ఞాపహంత్రి
యగుచుఁ దను యోగినీకోటు లనుసరింప
భద్రకాళి జనించె నృపాల! తన్ని
మిత్తమున నష్టమిని బూజ మేలుఁగూర్చు. ౬౫౩

క. నవరాత్రికాల మెల్ల ను
పవాస మొనరింపలేని వారికి నుపవా

---

(1) మెల్లకన్ను గలది.
(2) ఒక కన్ను గ్రుడ్డియైనది.
(3) 1 వత్సరము దాటని వయస్సుగలది.
(4) ఒక్క తండ్రికి జన్మించినది.

సవిదులు సప్తమి యష్టమి
నవమియు నివి మూఁడుపోషణము లనిరి నృపా ! ౬౫౪

—* నవరాత్రి మహాత్మ్యము *—

క. ఈ మూఁడు దినములను దగు
హోమంబులఁ బూజనముల నొగి నలరింపన్
గామములిడు నవరాత్రి మ
హామహాకర్తలకుఁ బలెఁ బరాంబిక కరుణన్. ౬౫౫

క. నవరాత్రి వ్రతమున కీ
యవనిన్ వేఱొండుసాటి యనుకొనకుము వై
భవమిడు నాయువు నిడు, నిడు
శివమున్ విద్యయును యశముఁ జేవయుఁ బరమున్.

క. విను రాజ్యభ్రష్టునకున్
దనయంతన రాజ్యమబ్బు ధరణీశ్వర ! వి
ద్యనుగోరి పూజచేసిన
ఘనులకు విద్య లవియెల్లఁ గరగతములగున్. ౬౫౭

క. వెనుకటి జన్మమ్మున నే
జను లీ నవరాత్రిపూజ సలుపరొ వారే
యనపత్యులు రిక్తులు రో
గ నిధులు దుర్జను లగుణులుఁ గష్టులు భ్రష్టుల్. ౬౫౮

గీ. విధవలును వంధ్యలును ధనవిరహితలును
నైన కాంతలఁ గన్గొని నప్పు " డీయ
భాగ్యలెల్లరుఁ బూర్వభవమ్మునందు
నీ వ్రత మొనర్పలే " దని యెఱుఁగు మధిప. ౬౫౯

గీ. ఘనతరంబుగ రక్త చందన విమిశ్రి
బిల్వదళముల నెవఁ డతిప్రీతి దనర
నంబ నవరాత్రములఁ బూజనం బొనర్చు
నతఁడు భూపతి యగును భూపతిపతంస ! ౬౬౦

చ॥ హరిహర పద్మగర్భులును నష్టదిగీశ్వరు లెల్ల దేవతల్
పరమమునీంద్రు లందఱును భక్తి దలిర్పఁగ నేపరాంబికా
చరణములన్ యజించి విలసద్గతి నొందుదు రమ్మహేశ్వరిన్
నరులు యజించు టబ్బురమె ! నారక మేగెడివారు దక్కినన్.

గీ. బ్రహ్మ సర్గంబు విష్ణువు పాలనంబు
హరుఁడు లయమును జేయు నేయంబకతన
నాజగద్ధాత్రి సర్వ పాపాపహంత్రి
నమ్మహేశ్వరిఁ బూజించు టబ్బురంబె. ౬౬౨

గీ. పలుపలుకు లేల విను మహాపాతకము లొ
నర్చు దుర్మార్గుఁడైన నెన్నంగ నొక్క
సారి నవరాత్రముల జగజ్జనని పూజ
సేయఁ బాపమ్ము లెల్లను బాయు నిజము. ౬౬౩

వ. రాజేంద్రా ! మున్ను కోసలదేశమ్మున సుశీలుండను నొక్క
వణిజుండు ధనధాన్యవిహీనుండు గలఁ డాతనికి సంతానంబధికంబు
బిడ్డలఁ బోషింపనేరక యొక్కనాఁ డొక్క విప్రసత్తముం గాంచి
నమస్కరించి యిట్లనియె. ౬౬౪

క. ఓ విప్రా ! మహాభాగ ! కృ
పావంతుఁడవగుచు నా యభాగ్యదశను నీ
వేవిధినైన హరింపం
గావలయుఁ గుటుంబభృతియుఁ గఱవై తోఁచున్. ౬౬౫

క. ధనికుఁడఁ గావలెనని నే
మ్మనమున నా కిచ్చులేదు మన్నించి కృపం
గని నా కుటుంబభరణ
మ్మునకు నుపాయం బొకండు పొనరుపుమనఘా. ౬౬౬

క. నాకొడుకులు నాకూఁతులు
నాఁకలికిం దాళలేక యన్నంబడుగన్
లేక యొనర్చెడి దేమియు
లే కిటువచ్చితిని జూడలేక మహాత్మా! ౬౬౭

క. అదిగాక పెండ్లికీడై
నది గలదొకకూఁతు రది దశాధికవర్షం
బాదవినఁ గన్యాదానో
క్తదశకుఁ జెడుఁ బెండ్లియగునె ధనహీనులకున్ ౬౬౮

గీ. దానిఁ దలఁచిన గుండె బ్రద్దలగు నాకు
నేమిసేయుదు ? దారిద్ర్యమెట్లు విడుచు
నరసియేదేని నొక్క యుపాయమున్నఁ
బూని యొసరించి పుణ్యమ్ముఁ బొందుమయ్య. ౬౬౯

వ. అనిబహువిధంబులం బ్రార్థించిన నవ్వైశ్యుంగాంచి సంశ్రితవ్రతుం
డును దేవీమహాత్త్వవేత్తయు నగునావిప్రుం డు వల్కు " నో
యనఘా ! శరత్కాలమ్మున నాశ్వయుజసితపక్షమ్మునఁ బ్రతిపదాది
నవరాత్రవ్రతం బొనర్చి దేవినారాధించితేని నీదారిద్ర్యంబు దొలఁ
గు నిద్దానికి వేఱొండు తుల్యమ్ముగాదని చెప్పి మఱియును ౬౭౦

ఉ. జ్ఞానమునిచ్చు మోక్షమునొసంగు వెస న్నవరాత్రకాలమం
దేనరుఁడైన నంబ జగదీశ్వరిఁ బూజనభోజనంబులన్

ధ్యానములన్ జపంబులను దద్దయు హోమములన్ ధనాంగనా
గాన వినోదనృత్యములఁ గ్రిన్ననఁ దుష్టియొనర్చి మించినన్. ౬౨౧

వ. మున్ను శ్రీరామచంద్రుం డరణ్యమ్మున సీతావియుక్తుండై
కిష్కింధానగరమ్మున సుగ్రీవసాహాయ్యమ్మున నీ నవరాత్రివ్రతం
బొనర్చియ కాదే సముద్రంబు బంధించి పుత్రమిత్రపరివార సహి
తంబుగ రావణ కుంభకర్ణుల హరించి విభీషణునకు రాజ్యంబిచ్చి
సీతం గైకొని యయోధ్యకేతెంచి నిష్కంటకంబుగ రాజ్యం బొ
నర్చెఁ గాన నీవ్రతంబు శత్రునాశకరంబు సంపత్కరంబు సంతాన
దాయకంబని చెప్పి యావైశ్యునకు మాయాబీజాభిధం బగుతన్మం
త్రం బుపదేశించిన నతండు తనగృహమ్మునకరిగి యథాశక్తిగ
నీవ్రతంబు తొమ్మిదివత్సరమ్ములొనర్చె నంత, ౬౨౨

ఆ. వె. నవమవత్సరమున నవరాత్రముల నష్ట
మీదినమున రాత్రి మేదురాద
రం బెసంగ నతని కంబ ప్రత్యక్షమై
పెక్కువరము లిడియెఁ బేర్మిమీఱ. ౬౨౩

వ. అనుడుఁ బరాశరాత్మజునకుఁ బరీక్షిదాత్మజుం డిట్లనియె. ౬౨౪

క. శ్రీరాముఁ డేకతమ్మున
దారం గోల్పోయె నతనితండ్రి యెవ ? రతం
డేరాజ్యమేలు ? రాజ్యం
బేరీతిఁ ద్యజించి యడవికేగెనో ? చెప్పుమా ! ౬౨౫

వ. నావుడు జనమేజయునకు వ్యాసుం డిట్లనియె. ౬౨౬

గీ. దశరథుండను రాజయోధ్యాపురమ్ము
నేలు నినవంశజుండు సుశీలుఁ డతని
సతులు మూగురు పెద్ద కౌసల్య రెండ
వయది కైకేయియును మూఁడవది సుమిత్ర. ౬౭౭

—* శ్రీ రామ చరిత్ర *—

వ. అతండు సంతానవిహీనుండై పుత్రికామేష్టియొనర్చి మువురి
యందు నలువురుకొడుకులఁ గనియె నందు, ౬౭౮

క. కౌసల్యకొడుకు రాముఁడు
భాసురుఁ డాతండు మిగుల భరతుఁడు కైకే
యీసుతుఁడు సుమిత్రకు రిపు
శాసకులగు లక్ష్మణుఁడును శత్రుఘ్నుండున్. ౬౭౯

గీ. జాతమాత్రంబునన ధనుశ్శస్త్రపాణు
లయిన నలువురు కొమరుల క్షానృపాలుఁ
డర్హ సంస్కృతు లొనరించి యలరునంతఁ
గౌశికుం డేగుదెంచె మఖం బొనర్ప. ౬౮౦

గీ. వచ్చి మఖరక్షణకు ననవద్య రాముఁ
గోరె షోడశవార్షికుఁ గువలయేశుఁ
డిచ్చె లక్ష్మణు జతఁజేసి; యేగి రిరువు
రును మునీశ్వరు వెంట దారి నొకచోట ౬౮౧

గీ. మునుల బాధించు తాటకఁ దునిమి కడువి
నీచుని సుబాహుఁ జంపి మారీచు నిహత
కల్పుఁగాఁ బాఱఁదోలి మఖంబొనర్పఁ
జేసె రాముండు కౌశికు చేత నంత. ౬౮౨

చ. ఎలమిని మూఁగురున్ మిథిల కేగెడిచో రఘురామపాదస
జ్జలజపరాగసంగతిని శాపము వాసె నహల్య శైవమౌ
విలు విఱుగంగఁ జేసి యట విక్రమధుర్యుఁడు రామమూర్తి పై
థిలి జనకుం డిడన్ గొనె సతీమణిగాఁ గమలాంశసంభవన్.

గీ. లక్ష్మణున కిడె నూర్మిళ లలితగాత్రిఁ
దగఁ గుశధ్వజతనుజాతల గుణవతుల
భరతశత్రుఘ్నులకు నిడెఁ బార్థివుండు
సపరివారముగఁ బురికిఁ జనిరి వారు. ౬౮౪

గీ. అంత దశరథనృపతి రాజ్యార్హుఁడైన
రామునకు రాజ్య మీ నెంచు రాణి నెఱిఁగి
పూర్వదత్తవరంబులఁ బొందెఁ గేక
యాత్మజ వశుండయిన భర్త నడిగి పిదప. ౬౮౫

క. ఒక వరమున రాముఁడు జా
నకితో లక్ష్మణునితో వనంబేగెను వే
ఱొక వరమున భరతునకున్
బ్రకటగతిన్ రాజ్యమబ్బెఁ బదునాల్గేఁడుల్. ౬౮౬

గీ. చండరాక్షసయుత మగు దండకావ
నమ్మునకు రాముఁడేగఁ దాపమ్ముఁజెంది
దశరథుఁడు పూర్వశాపమ్ము దలఁచి తలఁచి
పరగతికి నేగె నంతట భరతుఁ డాత్మ. ౬౮౭

గీ. మిగుల శోకించి తన తండ్రి మృతికిఁ దల్లి
తన కిడిన రాజ్యమని మనమ్మున నెఱింగి
సకల రాజ్యంబు విడిచె నన్నకుఁ బ్రియం బె
సంగునను బుద్ధి శ్రీరామచంద్రుఁ డచ్చట, ౬౮౮

క. పంచవటి కేగి మదనో
దంచితయై కోరు రావణానుజ నంతే
వంచించె శూర్పణఖ నది
గాంచి ఖరాదు లతికోప కలుషితులగుచున్. ౬౮౯

క. ఒకనరుఁ డధముఁడు చెలియలి
ముకు సెవులును గోసె వింతపుట్టె ననుచు మే
టికడిమి యుద్ధం బొనరిచి
యొక పెట్టన ద్రెళ్లి రందఱుఁగి రామునిచే. ౬౯౦

క. మునిహితముగ రాముఁడు గ్రి
న్ననఁ దానిటు చేయ శూర్పణఖ లంకాప
త్తనమేగి రావణునకున్
దన పరిభవమంతఁ జెప్పి తద్దయు నార్తిన్. ౬౯౧

క. శోకించిన రావణుఁడు రు
డాకలితుండగుచు వెడలి యరదము డిగి మా
యాకరుఁడగు మారీచా
ఖ్యాకునిఁ గాంచనమృగంబుగాఁ జేసి వెసన్. ౬౯౨

క. పనిచిన జానకిఁ గని కాం
చన మృగమని భ్రాంతిఁ జెంది చర్మంబును జ
య్యనఁ దెచ్చి యిమ్మనుచు రా
మునిఁ గోరెన్ దైవము కతమున నాతండున్. ౬౯౩

శా. ఆలోచింపక లక్ష్మణున్విడిచి చాపాస్త్రమ్ములం దాల్చి హే
లాలోలంబగు నమ్మృగమ్మునకునై లక్షించి లక్షించి వృ
క్షాళిన్ గ్రుమ్మరి కొండలన్ గడచి కర్ణాంతంబు రాఁదీసి శా
ర్యాలంకారుఁడు బాణమేయ నదియున్ హా! లక్ష్మణా! యంచొగిన్

క. ఉచ్చైర్నాదం బడరఁగఁ
జచ్చినఁ దద్విపులరవము జానకి విని బల్
హెచ్చిన భయమున లక్ష్మణు
సచ్చరితుంగాంచి యను వసవసయొసంగన్. ౬౯

క. నీయన్న నిహతుఁడాయెఁ గ
దోయీ! వేవేగ నేగవోయీ! జాగున్
జేయక యోపినకొలఁది స
హాయ మ్మగుమోయి! "లక్ష్మణా!" యనెనోయీ!

చ. అన విని లక్ష్మణుండు జనకాత్మజ కిట్లను "రాముఁ జంప నో
పునరులు పుట్టువారలును బుట్టిన వారలు బుట్టఁబోవు వా
రును మఱిగారు రాఘవుని రూఢి నెఱుంగవె? యాజ్ఞఁదప్పి నేఁ
జనిన సహించునే? తనదుచావున కొప్పను గాని మానినీ.

క. ఇంతకు రాఘవునకు నొ
క్కింతయు భయమబ్బదింత యేమిటి" కన న
క్కాంతయుఁ గన్నుల నశ్రులు
దొంతరలై జాలువారఁ దుడుకునఁ బలికెన్. ౭౦

చ. తెలిసె భవన్మనోరథము తెల్లముగా; ననుఁ జెందు నిచ్చ నీ
కలవడెఁ గేకయీతనయుఁడంపె నినున్ "సమయంబుఁజూచి యి
వ్వెలఁదిని గొ" మ్మటంచు విను వెట్టెనె? రాముఁడు పోవుమీద ని
య్యెల నిలువంగనేర్చి వరియింతును నిన్నని నమ్మికొంటివే.

క. చనినఁ జనుము చనకుండినఁ
జనకుండుము రాముఁడే నిజంబునకున్ జ
చ్చినఁ జచ్చెద నన్నయెడన్
బొనరుచు నుపకార మిదియ పో దుష్టాత్మా! ౭౧

క. అనవుడు హరి హరి! తల్లీ!
యనఘుని నన్నిట్టులాడ నగునే ? యని దై
వ నియోగమునకు వగచుచుఁ
జనియెఁ బాష్పాంబు సిక్తసర్వాంగుండై. ౨౦౧

గీ. డంబుమీఱెడి భిక్షువేషంబు దాల్చి
యంత నిక్కంపు యతివోలె నవనిజాత
యున్నెడకు వచ్చె రావణుం డుదితభక్తి
నర్ఘ్యపాద్యాదులిచ్చె నయ్యవనిపుత్రి. ౨౦౨

గీ. ఆ యవనిపుత్రి రూపు కన్నారఁ గాంచి
రావణుం డను “ నకట ! రాజీవనయన !
యెవఁడు నీ తండ్రి నీ జీవితేశుఁడెవఁడు ?
వనమునం దొంటి నుండఁగావలయుటేమి. ౨౦౩

ఆ. వె. భర్త యనదయైన భ్రాతృవర్గంబైన
లేదె ! మేడలందుఁ బ్రోదిసేయఁ
దగిన నీ యడుగులు దగునె యీ కర్కశా
రణ్యభాగములకు రాజవదన ! ౨౦౪

గీ. మునివనితఁ బోలెఁ బర్ణశాలను వసింప
వ్రాసెనే బ్రహ్మ ! యని మాయవగలఁ బొగులు
కపటయతి యైన రావణు కపటకృత్య
మెఱుఁగ కిట్లని పల్కె నయ్యిందుముఖియు. ౨౦౫

సీ. దశరథుండను రాజు ధర్మజ్ఞుఁ డతనికి
నలువురు పుత్రులా యలఘులందు
జ్యేష్ఠుండు రాముఁ డాశ్రితజన వత్సలుం
డాతండు నా భర్త యతని సవతి

తల్లి కైకేయి యుత్తమురాలు వనమున
కంపించె రాజ్యమ్ము నపహరించి
వసియించు నాతఁ డివ్వనమున; నిప్పుడ
చనియెఁ గాంచనమృగంబును వధింపఁ;

గీ. దమ్ముఁడును నేగె నిరువు రుద్ధత బలాఢ్యు
లరుగుదెంచెద రింతలో నంతదనుక
నిలిచి వారలొసంగు పూజలను దనిసి
యరుగుటకు నిన్నుఁ బ్రార్థింతు యతివరేణ్య. ౭౦౬

గీ. యతివి విష్ణుస్వరూపుఁడ వైనకతనఁ
బూజనీయుఁడ వైతి వెప్పుడునురక్క-
సులు చరించెద రివ్వనస్థలికి నెచట
నుండివచ్చితో! చెపుమ నీయున్న యునికి. ౭౦౭

మ. అనుడుర్ రావణుఁ డిట్లువల్కు- విను " మాయాభిక్షురూపమ్మున
న్నినుఁ జూడర్ జనుదెంచినాఁడఁ దరుణీ! నే రావణాఖ్యుండ శూ
ర్పణఖాఖ్యాక మదీయసోదరి నినుర్ వర్ణించి వర్ణించి చె
ప్పి నను౦ బంచె ఖరాదిరాక్షసులఁ జంపెర్ రాముఁడంచుర్ వడిర్

మ. హృతరాజ్యుండు వనప్రవాసి విగతశ్రీకుం డపూర్ణుం డసం
గత సైన్యుం డబలుండు మానవుఁడు వేడ్కల్ సేయునే నీకు నీ
పతి కాంతల్ మగఁ డెట్టివాఁడయిన సంభావింప రన్యార్థినుల్
నతు నత్యున్నతు దాసు నన్నుఁ గొనుమీ నారీశిరోరత్నమా!

క. మందోదరి యని చెప్పఁగ
విందువకా! యాపె నాదు ప్రేయసి నిన్నా
సుందరి కన్న నధికముగ
నందల మెక్కింతు రాజ్ఞి వగు మెల్లరికిర్. ౭౧౦

చ. సురపతి నోంచితిన్ జముని చొప్పడఁగించితి శ్రీదు మాపితిన్
వరుణుని గెల్చితిన్ శశిదివాకరులన్ బనిగొంటి నాకు నీ
నరుఁడొక లెక్కయే! యొక యనంగుని కోపఁగఁజాల నింక నీ
చరణములాన యింతదయ సల్పఁగరాదె? త్రిలోకసుందరీ! ౨౦౨

ఉ. నేఁటిది గాదు నీ యెడల నేస్తము నాకుఁ; గటాక్షముంచు మో
పాటలగంధి! నీజనకుఁ బల్మరు వేఁడిన శైవచాప మన్
గాటపుటడ్డు దెల్పెఁ జెలి! నా కది గూడనిదౌట నేను నా
నాఁట స్వయంవరంబును గనన్ జనుదేరఁగ లేదు సుందరీ!

గీ. నాఁటనుండియు విరహమ్ము నాటె నాకు
నెట్లు సంప్రాప్తమగుదువో యీ వటంచు
ననుకొనుచునుండ నేఁటికి నబ్బితింక
జాగుసేయకు నా యనురాగ మెఱిఁగి. ౨౦౩

క. అను రావణువచనముల క
వనిజ భయము చెంది మనముఁ బాదుకొలిపి "యో
జననింద్య! మదనపీడిత!
యనుచితములు ప్రేలఁబోకు మరుగు మవలకున్. ౨౦౪

ఉ. స్వైరిణిగాను నే జనకసత్కులసంభవఁ గాని నామనో
ధీరత గుర్తెఱుంగ కిటు దెప్పరమాగతిఁ బల్కు నీకు నా
కారణమై మృతిం గనెడికాలము చేరువ గాక యున్నె? యే
వీరునికైనఁ గాని రఘువీరునితో నెదిరింప శక్యమే. ౨౦౫

క. పాపాత్ముని వచియించుచుఁ
గోపమ్మునఁ బర్ణశాలకుం జనునాలోఁ
బాపాత్ముఁడు రావణుఁడు స్వ
రూపము గనుపఱచి భీకరుం డగుచు వడిన్. ౨౦౬

ఉ. హా!రఘురామ! యంచు,సుగుణాకర! లక్ష్మణ! యంచుఁ బిల్చుచున్
బోరన నేడ్చు నాజనకపుత్రి బలాత్కృతి నెత్తిపట్టి బల్
దారుణరీతి నంబరపథంబునఁ బో నరుణాత్మజుండు దుః
ఖారవ మాలకించి వడి నడ్డమువచ్చె జటాయు వుగ్రుఁడై.

ఉ. ఆతని ఘోరయుద్ధమున నక్కుటిలాత్ముఁ డడంచి మించి దుః
ఖాతురయైన సీతఁ గొని యంబుధిదాఁటి చెలంగి లంకలో
నా తరుణీమణిన్ భయదమైన యశోకవనమ్మునన్ గన
ద్ధేతులు రాక్షసాంగన లహేతుకకోపలు చుట్టువారఁగన్. ౨౧౮

క. ఉనిచిన నా జనకాత్మజ
యునుఁ బాతివ్రత్యగరిమ నొక్కింతేనిన్
ఘనత చెడకుండ రాముని
మనమున నిడి యవ్వనమున మాన్పడి యుండెన్. ౨౧౯

క. అంత నట రామచంద్రుం
డెంతయు మోదమున మృగము నీడిచికొని యొ
క్కింతవడి వచ్చుటయుఁ ద
త్ప్రాంతమ్మున లక్ష్మణుండు వగ గడలుకొనన్. ౨౨౦

క. ఎదురైనఁ జూచి యిట్లను
నదయుఁడవై జానకీలతాంగి నొకర్తున్
వదలి యిటు రాఁదగునె? దు
ర్మదరక్షఃప్రచుర మీయరణ్య మెఱుఁగవే. ౨౨౧

క. అన నిట్లను నేమని నే
మనవి యొనర్పంగలాఁడ మైథిలిపలుకుల్
వినలేక వచ్చితిని మా
నినులు వివేకంబుపట్ల నేర్తురె యెందున్. ౨౨౨

గీ. కాలయోగంబు దాఁట శక్యంబు గాద
టంచు వృత్తాంతమును విన్నవించె నంత
నిరువురును బర్ణశాలకు నేగి జనక
తనయఁ గానక శోకించి తద్వనమున. ౭౨౩

క. నలుగడల వెదకి యొక్కెడ
నలుఁగులు దీండ్రింపఁ బ్రాణమవశేషముగా
నిలఁ బొరలుజటాయువుఁ గన
నెలుఁగు బయలుపడమి మెల్ల నిట్లను నార్తిన్. ౭౨౪

ఉ. సీసతిఁ గొంచు రావణుఁడు నిందితుఁ డేగఁగ నడ్డువచ్చి నే
నోసరిలంగఁ జేసిన మదోద్ధతుఁడై పడవైచి యేగెఁ ద
ద్వాసము లంకయన్పురము ప్రాణము నిల్వదు పోవుచుంటి నీ
వాసరసీరుహాక్షి కయి యత్న మొనర్పుము వేగ రాఘవా.

క. అని మృతిఁగన నాతనికి ద
హనాదిక మొనర్చి తద్దహనమునఁ జనుచున్
ఘనకాయు నొక్కెడఁ గబం
ధుని శాపవిముక్తుఁ జేసి తొలఁగి కడంకన్. ౭౨౬

గీ. అతఁడు చెప్పిన తెరువున నరిగి సూర్య
పుత్రుతో మైత్రిఁ జేసి యపూర్వ బలుని
వాలిని వధించి సుగ్రీవువంతఁ దీర్చి
యంతఁ గిష్కింధ నాతని కాతఁ డొసఁగె. ౭౨౭

క. ఆసుగ్రీవుఁడు గొలువఁగ
హా! సీతా! యనుచు సీత కడలుచు నచటన్
మాసములును వత్సరములు
చేసె నివాసంబు మైత్రిఁజేసి యతఁడొగిన్. ౭౨౮

క. నెమ్మది తన్మయమై తా
పమ్మి గడలుకొనఁగఁ గనులఁ బలుమరు నశ్రుల్
గ్రమ్మఁగ రఘురాముఁడు తన
తమ్మున కిట్లనియె ననుగతమ్మగు పేర్మిన్. 229

ఉ. తమ్ముఁడ! జానకిం గనువిధమ్ము గనంబడ దెట్లు సేతు పై
వమ్ము మ నమ్మకన్నుఁ జలపట్టెఁ గదా! జనకాత్మజావిహీ
నమ్మగ నేనయోధ్యకుఁ జనం బనిలేదు బహూక్తులేల ప్రా
ణమ్ములు నిల్వనోప విఁక నాకయి సారెకుఁ గుందఁబోకుమీ.

ఉ. శ్రీకరమైనరాజ్యము హరించె నరణ్యమునందు వాసమున్
జేకుఱఁ జేసెఁ దండ్రి మహనీయునిఁ జంపె మఱింతఁ జేసియున్
బోక మదర్ధగాత్రమును బోకడ వెట్టె నిఁకేమి సేయు? దు
ష్పాకము దైవ మన్నిఁటికిఁ బాల్పడి యుంటిని మ్రానుకైవడిన్.

చ. పరిపరిరీతులన్ మనము పాడగు బంగరు చేతఁబట్టఁగా
నెరువయితోఁచు దేహమున కెంతయు నార్తి తటస్థమా మఱె
వ్వరు తను నాదరింప రెటువంటిమహాత్మునకైన నేదియున్
సరిపడ దించుకేని గ్రహచారము చాలనినాఁడు తమ్ముఁడా.

చ. మనుకులమందు ముందు జనమాన్యులు రాజకుమారు లెందఱో
జననమునందరో! మిగుల సౌఖ్యములొందరొ! మందభాగ్యులై
మనవలెఁ గుందిరే? మనువు మన్ననయుం జెడఁ బుట్టినార మే
మనఁదగు నిద్దఱిద్దఱము యందొక భేదము లేదు తమ్ముఁడా. 233

చ. వనమున భార్యఁగోలుపడి వంతలఁ జెందుచు నుంటి నేను నీ
వన గృహమందు పీడి తకటా! వికటంబుగ నెంచినాఁడ నీ
వనితఁ గనందగున్, గనఁగవచ్చునె నాసతి? నాకు సాటి యీ
మనుకులమంద కాదు మఱి మానవజాతులకు లంద లేదుగా.

క. మనువు మొద లింత దనుకన్
జనియించిన రాజులం దశక్తుండు నకిం
చనుఁ డక్షముండు నా క
న్నను లేఁడిఁకఁ బుట్టఁబోఁ డనదయు నదయుఁడున్

ఆ. వె. ఎవరి దూఱువాఁడ నేమనువాఁడ ధ
నంబు బలము రెండు నాకు లేవు
ఈవుదక్కఁ తోడిఁకెవ్వరు లేరు పూ
ర్వకృత మనుభవింపవలయుఁ గాదె. ౨౩౬

గీ. ఇంద్రపదవికిఁ దుల్యమై యొసఁగురాజ్య
మా! గతించె వనంబు సంప్రాప్తమయ్యె
వగవ నిందుల కొక్కింత వనజనయన
సీత లంకేశు చేతిలోఁ జిక్కె నబల. ౨౩౭

చ. వలఁబడు చక్రవాకిగతి వానికిఁ జిక్కెడివేళ నెంతఁగాఁ
గలకల మందెనో, తను నొకర్తుగ డించిన నన్ను నేగతిం
దలఁచెనో? కాదుకాదు, కడుఁదప్పొనరించిన నేమిచేసినన్
బలుక దొకింతయేనిఁ బతిభక్తికి లోప మొనర్ప నెంచునే.

ఉ. లంకకు నేగి వానికిఁ దలంకి కలంకిని యౌ నటంచు నా
శంకఁ గొనంగరాదు విను స్వైరిణియే జనకాత్మజాత! యా
తంకము గల్గెనేని విహితమ్ముగఁ బ్రాణములం ద్యజించు న
ప్పంకజగంధి యిట్లయిన పక్షమునం బ్రతుకంగ నేర్తునే. ౨౩౯

క. అని బహువిధముల శోకం
బున బుగ్గిగెడి యన్నఁ జూచి పోరిఁ బోరిఁ జింతం
గననేల? రాక్షసాధముఁ
దునిమి జనకజాతఁ దెత్తుఁ దూర్ణతరముగన్. ౨౪౦

గీ. ఆపదలయెడ సంపద లబ్బినప్పు
డేకరీతిని ధీరత్వ మెవనికొదవు
నతఁడ ధీరుఁ, డధీరుఁ డయ్యవసరములఁ
దన్మయుండగు నదియ చింతాకరంబు. ౨౮౧

గీ. యోగము వియోగమును దైవయుక్తిఁ జేసి
కలుగు నియ్యవి సతములుగావు సూవె
ఇందులకు నింత వగవగనేల ? యవియు
మనమునకుఁ జొప్పడవు దేహమునకుఁగాని. ౨౮౨

క. కాలవ్యత్యాసంబున
నే లలనయు రాజ్యభరము నిటులాయె నిఁకన్
గాలము సరియగు రాజ్యస
తీలాభము లబ్బుఁ జెడ్డదినములు వోవున్. ౨౮౩

క. ప్రారబ్ధం బనివార్యం
బేరికయినఁగాని యింత యేలా ! ధీరుల్
వీరులు వానరు లవనికు
మారిన్ వెదకంగఁ గడు సమర్థులు దిశలన్. ౨౮౪

ఆ. వె. సీత యున్నచోటుఁ జెచ్చెర వానరు
లేగి చూచివత్తు రేను వానిఁ
జంపి క్షణములోన జానకిఁ దెచ్చెద
నింక వగలఁ బొగలనేల చెప్పుమ. ౨౮౫

క. మనకు సహాయులు లేరని
యనుకొనకుము భరతుఁ బిలువ నంపించిన సే
నను గొని చనుదేరఁడె ? శ
త్రునిఁ దునుమఁగ లేమె ? యింత తుందుడుకేలా. ౨౮౬

గీ. రఘుమహారాజు తా నేకరథముఁ గొని స
మస్త దిశల జయించె నీ వట్టివాని
వంశమునఁ బుట్టియును శత్రువధకు నిట్లు
తలఁక నేటికి నావంటి తమ్ముఁడుండ. ౭౪౭

ఉ. ఏ నొకరుండనే జగమునెల్ల జయింతు సహాయులేల ? కా
దేని విదేహభూమిపతి కించుక యీస్థితిఁ దెల్పినన్ మహా
సేనఁ దతండు వచ్చు నిఁకఁ జేయఁగరాని దొకండు గల్గునే ?
మానవనాథ ! రావణునిమాటటులుంచు మెవం డెదుర్కొనున్ !

గీ. సుఖము దుఃఖము నను నివి సుస్థిరములు
గావుగా ! చక్రనేమి వైఖరిని దిరుగు.
చుండు ధీరుండు దీన మగ్నుండు గాఁడు
తప్పనే యేరికైనను దైవకృతము. ౭౪౯

సీ. మును దేవతలు నహుషుని నింద్రపదమున
నిల్ప నింద్రుఁడు దైవనియతికి నెద
భయమంది కుందుచుఁ బంకజాంతరమున
నజ్ఞాతవాసంబు నమరఁజేసె
బహువత్సరము లంత నహుషుఁ డింద్రునిభార్య
యగు శచిఁ గోరి విప్రవమాన
మొనరింపఁగ నగస్త్యుఁ డుద్ధతకోపుఁడై
సర్పంబ వగుమని శాపమిచ్చె

గీ. నహుషుఁ డహియయ్యె నింద్రుఁ డానంద మెసఁగఁ
దన పదంబును గైకొనె ననఘ ! వ్యసన
మబ్బుతఱి శోకమందిన నగునె, యోర్చి
కొనిన సకల సుఖమ్ములు గొనఁగవచ్చు. ౭౫౦

గీ. ఈవు సర్వజ్ఞుఁడవు చెప్ప నెవరితరము
ప్రాకృతుని మాడ్కి శోకింప ఫలముగలదె?
యనెడి లక్ష్మణుపలుకుల నంత రామ
చంద్రుఁడును సమ్మదము చెందె జనవరేణ్య. ౭౧౧

గీ. అపుడు వారలసన్నిధి కరుగుదెంచె
నారదుఁడు కాంతినిర్జితపారదుండు
రామలక్ష్మణు లామునిరాజు గార
వించి యెంతయుఁ బూజఁగావించి రెలమి. ౭౧౨

క. మునియును శోకార్తుని రా
మునిఁ గని యిట్లనియె నీదు ముదితఁ సీతఁ
దన చేటెఱుఁగక రావణుఁ
డనయుండై యపహరించెనని వింటి దివిఁ. ౭౧౩

క. శోకింపనేల విను మో
కాకుత్స్థకులావతంస! కలసంగతి నీ
వాకుటిలాత్మునిఁ జంపుట
కేకద! యవతారమంది తినవంశమునఁ. ౭౧౪

క. ఆకతమున జనకాత్మజ
నాకుటిలాత్ముఁడు హరించె నహినెఱుఁగక కా
దే! కంఠమునం దిడికొనె
నీకావలఁ డింక మనుటరీట్లు ఘటించుఁ ౭౧౫

సీ. పూర్వజన్మమ్మున భూతనూజాత ము
నీశ్వరకన్యక యీామె తపము
నాచరించుచునుండ నతిదుష్టుఁ డగురావ
ణాసురుఁ డొక్కనాఁ డడవికేగు

దెంచి యక్కన్నియఁ గాంచి మోహించి త
నకు భార్యఁగాఁ గోరిన వినక తను
నెదిరింపఁ గచభరం బెనసిపట్టిన నా త
లోదరి "యోమత్త! యోదురాత్మ!

గీ. యనఘ నగునన్ను ముట్టినయట్టి నీదు
చావునకు భూస్థలి నయోనిజాత నగుచుఁ
బుట్టెద" నటంచు శపియించి పోలిసి యిపుడు
మైథిలియనంగఁ బుట్టెఁ దన్మరణమునకు. ౯౭౮

క. ఈవును హరియంశమ్మున
దేవప్రేరణముచే నిదే పనిగా ని
ట్లావిర్భవ మందితివి గ
దా! వగపేల! వధియింపు మాదుష్టాత్మున్. ౯౭౯

ఉ. జానకి రావణాసురువశమ్మును బొందక యిందుఁ డెంపునా
ధేనువుపాలునన్ సుధయు దేహము నిల్పఁగ నీదునామమే
ధ్యానముఁ జేయుచున్ బ్రతిపదమ్ము నినుం గొనియాడుచున్ దగన్
బ్రాణముతోడ నున్నది నృపాలక! నేఁ గనుఁగొంటి నింతయున్.

ఉ. వాని జయింప నీకొకయుపాయముఁ దెల్పెద నంబికన్ జగ
త్ప్రాణనదక్షమైన నవరాత్రవిధానమునన్ బలిన్ విధా
నానుగతంబుగాఁ దగినయట్టిపశువ్రజముం బొనర్చి య
ద్దాన దశాంశ మగ్నికిడి తన్వుము హోమవిధానసత్క్రియన్.

క. ఈగతి నొనరించిన శర
దాగమమునఁ గార్యసిద్ధి యలవడు దీనిన్
భోగిశశయనుఁ డింద్రుఁడు
నాగమవిహితముగఁ జేసి యందిరి సిద్ధుల్ ౯౮౦

గీ. తనదు భార్యను జందు ౦డు గొనఁగ గురుఁడు
నీవ్రత మొనర్చి తాఁ గృతకృత్యుఁ డయ్యెఁ
గశ్యపవసిష్ఠభృగుమునిగాధిసుతులు
చేసి రిద్దాని నిది కార్యసిద్ధిదంబు ౭౬౧

గీ. వృత్రుని జయింప నిందు ౦డు త్రిపురవిజయ
మునకు శంకరుఁడును దా మధుని హరింప
హరియు నొనరించి రీవ్రతం బఘహరంబు
జయకరము సౌఖ్యకరము యశస్కరంబు. ౭౬౨

క. అనఘ ! యిది సుఖితులును జే
యనగుఁ జుమీ వ్రతము ! మఱియు నతిదుఃఖితు లౌ
నరు లిద్దాని నొనర్చిన
జననికి దయగలుగుఁ జెలఁగు సౌఖ్యములెల్లన్. ౭౬౩

క. అనవిని శ్రీరాముం "డో
మునివర ! యావ్రతవిధానముం దద్దేవీ
ఘనచరితంబుఁ బ్రభావం
బును నాకుం దెల్పు" మనుడు ముని యిట్లనియెన్.

గీ. శక్తియన నిట్టిదని చెప్ప శక్యమగునె
హరిహరబ్రహ్మలందు రక్షావసాన
సృష్టిరూపమ్ములఁ బొలంగు జీవరాసు
లందుఁ దత్కళ యనుగతమై చెలంగు. ౭౬౫

గీ. బ్రహ్మ మొదలు పిపీలికారాశి దనుకఁ
దత్స్వరూపం బితర మొకింతయును లేదు
ఆమె విహరించుఁ గల్పాదియందుఁ బరమ
పురుషుతోఁ గూడి నిర్గుణస్ఫూర్తి నొలయు. ౭౬౬

గీ. మీఁద సగుణాత్మయగుచుఁ బేర్మిమెయి నఖిల
భువనములు సృష్టిఁ జేసి త్రిమూర్తులను ని
మిత్తమాత్రమ్ముగా వీనిమీఁద నుంచు
నామె నెఱిఁగిన బంధమ్ము లడఁగిపోవు. ౭౬౭

గీ. ఆమెనామములన నకారాదియును క్ష
కారమంతంబు గల వర్ణగణము సర్థ
యుక్తముగ గుణకర్మాదియుక్తిఁ గూర్చ
వెలయు నెన్నని యన రాముఁ డెలమి దనర. ౭౬౮

క. దేవీపూజాకృతి శ్ర
ద్ధావంతుఁడనగుచుఁ జేయఁ దలఁచెద నాకున్
గేవలము తద్విధానం
బీవానతి యిమ్మనన్ మునీంద్రుం డనియెన్. ౭౬౯

చ. సమమగు దేశమందు విలసద్గతిఁ బీఠము వెట్టి వేదయు
క్తముగఁ బరాంబిక న్నిలిపి తన్నవరాత్రములం దుపోషణ
క్రమమున నుండి యీ వ్రతవరంబుఁ గరంబు నొనర్చు మే గురు
త్వ మొనరుతున్ జగత్ప్రియహితంబగు కార్యముగాన నావుడున్,

క. రాముం డాశ్వయుజమ్మున
నా ముని చేయింపఁ దన్మహావ్రతమును స
ద్భూమీధరమునఁ దమ్ముని
తో మోద మెలర్పఁ జేసెఁ దొమ్మిది దినముల్. ౭౭౦

ఆ. వె. అష్టమీదినమ్మునందు నిశీథమ్ము
నందు సింహవాహ యగుచు జనని
దర్శనంబొసంగి దయఁజిల్కుచూపుతో
నిట్టులనియె రాఘవేశ్వరునకు. ౭౭౧

క. రామా! జగదభిరామా!
నా మది సంతోషపెట్టినాఁడవు నీకుం
గామము లొసంగవచ్చితి
నీ మానినితోడఁ బొత్తు నీకబ్బ నికన్. 223

సీ. మత్స్యమై మున్ను సోమకుఁ దునిమి వేదముల్
బ్రహ్మకిచ్చిన జగత్ప్రభుఁడ వీవ
కూర్మంబవై యబ్ధిఁ గ్రుంకి మందరమెత్తి
రహిొనెసంగిన మహామహుఁడ వీవ
కోలమై యిలఁదాల్చి కుత్సితుం డగు హిర
ణ్యాక్షుఁ జంపిన దానవారి వీవ
నరహరివై హిరణ్యకశిపుఁజంపి ప్ర
హ్లాదు నేలిన కృపాపాది వీవ
గీ. కపటవామనరూపంబుఁ గాంచి బలిని
దోంచి యిందున్ని కిచ్చిన దొరవునీవ
పరశురాముఁడవై భూమి పాలకులను
రూపు మాపినయట్టి ముక్కోపి వీవ. 224

క. నీ యవతారము లన్నియు
నా యంశముతోడఁ గూడిన యవియు మఱి నీ
కాయాయి వానరులును స
హాయులగుదు రందఱును మదంశోపేతుల్. 225

క. ఇపు డాచరించినట్టులె
సపర్య రాఁబోవు నీవసంతర్తువునం
దపరిమిత శ్రద్ధాభ
క్తి పరీతుఁడ వగుచు సలిపి దీప్తిం గనుమా. 226

క. రావణుఁ బరిమార్పఁగ నమ
రావళులకు మేలుఁగూర్ప ననఘు దశరథ
క్ష్మావిభుఁ గృతార్థుఁజేయఁగ
నావిర్భవ మందితిప్పు డర్కకులమునన్. ౭౭౭

ఉ. ఈతఁడు లక్ష్మణుం డలఘణీందు్రని యంశము రావణాత్మజున్
బాతిఁ జేయు దేవముని బాధకు రావణుఁ జంపి మీఁద సా
కేతపురమ్ముఁజేరి చిరకీర్తి ననేక సహస్ర వర్షముల్
భూతల మేలి పైఁ ద్రిదివమున్ గనఁగాఁ గల వంచు నేగిరన్.

క. శ్రీరామమూర్తియును విజ
యారాధన చేసి దశమియందు వితరణ
శ్రీ రంజిల్లఁగ భూసుర
వారము దనియించి లంకపై కరిగె వెసన్. ౭౭౯

ఉ. వారధిగట్టి రావణునిఁబట్టి వధించి తదీయ రాజ్యముం
గూరిమి నవ్విభీషణునకున్ దగనిచ్చి ధరాత్మజాత సు
శ్రీరహిమీఱఁ గైకొని సుశీలురు వానరు లాశ్రయింపఁగా
ధీరుఁడు రామచంద్రుఁ డరుదెంచె నయోధ్యకు సుప్రమోదుఁడై.

క. దేవీచరితము వినిన శు
భావహమగు యశముగలుఁగు నైశ్వర్యాయు
ర్భావమ్ము లెనయు నిట్టిది
భూవలయమ్మునను లేదు భూపవతంసా. ౭౮౧

వ. అని వ్యాసుండు జనమేజయునకుం జెప్పిన ట్లకథకుండు శౌన
కాదులకుం జెప్పెనయు, ౭౮౨

—* స్కంధాంత పద్యములు *—

క. రాజాధి రాజనతపద !
రాజారామాఖ్య విబుధరాజచ్ఛాత్రా
తేజోభిభూతమిత్రా !
భూజనహిత ! సకలలోక పూజ్యచరిత్రా. ౭౨౩

చ. సతత మహాన్నదాన విలసత్పరిపూర్ణ కళాప్రదాన వ
ర్ధిత నిరవద్యకీర్తి విశదీకృతవాగ్రమణీమణీకర
స్థితసితనీరజాతరససేవనలోలుపమత్తబంభర
ద్యుతి ! మతిమద్గతీ ! బుధవిధుస్తుత ! బుద్ధిబృహస్పతీ ! కృతీ.

మాలినీవృత్తము. సుకవి వినుత శిష్యా ! సూరివంద్య ప్రశిష్యా !
సకలమత విహారీ ! సాధులోక ప్రచారీ !
అకపటమతిలీలా ! వ్యాప్త సాద్గుణ్యహేలా
ప్రకట విబుధశంసా ! బ్రహ్మవిద్వద్వతంసా. ౭౨౫

గద్య

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబయిన
దేవీ భాగవతం బను మహాపురాణము
నందుఁ దృతీయ స్కంధము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీ మత్పరదేవతార్పణమస్తు.

శ్రీ మత్పరదేవతాయై నమః

శ్రీ

దేవీభాగవతము.

చతుర్థస్కంధము.

నిర్లిప్తహృదయకమలాం
తర్లక్ష్యీకృత సమస్తతత్త్వ! కుకవితా
దుర్లతికావిచ్ఛేదక!
చర్లబ్రహ్మామ్నాయసుధీ! యశస్సత్త్వనిధీ. ౧

వ. అవధరింపు మనంతరంబు మునులు "మహాత్మా! యవ్వలి కథ వినిపింపు మనవుడు సూతుం డిట్లను నట్లు పురాణకథనోన్ముఖుండగు వ్యాసునకు జనమేజయుం డిట్లనియె. ౨

క. అస్మత్కులాభివర్ధన!
విస్మయకరదివ్యచరిత! వేదవ్యాసా!
భస్మీకృతపాపౌఘ! శ్రు
తి స్మృతితత్త్వజ్ఞ! యొకటి దెల్పుము నాకున్. 3

ఆ. వె. శూరసేన సుతుఁడు సుగుణుండు వసుదేవుఁ
డనఁగ విందు హరియుఁ దనుజభావ
మందె నెవని ; కాతఁ డంగనామణితోడఁ
గంసుచేత నెట్లు కట్టఁబడియె. ౪

ఆ. వె. హరియు బంధనాలయమ్మున దేవకి
కుదయమంది మీఁద నొదిగి గోకు
లమున కేగ నేల ? లలితుఁ గృష్ణునిఁ గన్న
వారు పూర్వమం దెవరొ వచింపు. ౫

గీ. దేవకీ వసుదేవులు తెలిసి తెలియ
కాచరించిన దేమి కంసాధమునకుఁ
గృష్ణునన్నల నార్గుర నేల చంపెఁ
బుట్టినప్పుడ కంసుండు పట్టుఁబట్టి. ౬

ఆ. వె. బాల కంసుచేతఁ బట్టువడియు నభ్రి
పథముఁ జేరు టేమి ? పరమపురుషుఁ
డైన హరికి గొల్ల యలరుఁబోణులతోడఁ
గాఁపురం బొనర్పఁ గలుగు టెట్లు. ౭

క. ఆ కృష్ణుం డొనరించిన
ప్రాకృతకార్యముల నెల్లఁ బరిశీలింపన్
నాకే కా దెవ్వరికిం
జేకుఱు నాశ్చర్య మిట్టిచేతలు కలవే. ౮

క. కర్ణా కర్ణికగాఁగ సు
పర్ణధ్వజు చరిత విని యపరిమిత సందే
హార్ణవగతమగు నామది
నిర్ణయము వచింపుమీ మునివరేణ్యా ! కృపన్. ౯

ఆ. వె. ధర్మపుత్రు లగుచుఁ దనరెడి నరుఁడు నా
రాయణుండుఁ గడుఁ బురాణ ఋషులు
బదరికాశ్రమమున బహుకాలము తపమ్ముఁ
జేసి రనుట సుప్రసిద్ధము కద. ౧౦

తే. గీ. విద్యమానశరీరులై వెలయు వీరు
మరలఁ గృష్ణార్జునులు గాఁగ మాఱు టెట్లు
ముక్తిఁ గోరికదా వీరు మున్ను తపము
నాచరించిరి మఱి జన్మ మంద నేల. ౧౧

క. తన కులవర్తనమును ద
ప్పని శూద్రుఁడు వచ్చుజన్మపరిపాకమునన్
గను క్షత్రియత్వమును జె
ప్పిన శుచి మసలిన నతండ విప్రతఁ గాంచున్. ౧౨

క. అనువుగ వర్తించిన వి
ప్రునకున్ జన్మంబు లేదు రూఢిగ వీరల్
మునులు మహాత్ములు విపరీ
తనియతి క్షత్రియభవంబుఁ దాల్పఁగ నేలా. ౧౩

గీ. అవనిసురశాప మెల్లయాదవులఁ గసిమ
సంగె గాంధారి శాపంబు సరసిజాక్షు
నన్వయము మాపె నని వింటి; హరితనూజు
మించి యుల శంబరుండు హరించు టేమి. ౧౪

గీ. శక్తిమంతుఁడు హరి యుండ శంబరుండు
సూతికాగార మేరీతిఁ జొచ్చి పిన్న
బాలు హరియించె నొక్కో ! యిప్పలుకు వినిన
దుర్ఘటంబని మనమునఁ దోఁచకున్నె. ౧౫

గీ. ఆత్మజు హరించె శంబరుండన్నమాట
దివ్యచక్షుష్కుఁడగు హరి తెలియలేఁడె
యరయ నీ సందియంబుల నన్నిఁ బాపి
తెలియఁజెప్పవె సాత్యవతేయ ! నాకు. ౧౬

క. సరసిజలోచను తదనం
తరమునఁ దద్భార్యలెల్ల దస్యులచేతన్
బరిపరి బాధలు పడుటకు
నరయఁగఁ గతమేమొ చెప్పుమా ! యనఘమతీ ! ౧౭

గీ. విష్ణునంశమ్ము చేఁ బృథివీభరంబు
నడఁపఁ బుట్టిన యద్దానవారి మధుర
భయమునై వీడి ద్వారకాపట్టణంబు
నందు సకుటుంబముగ నుండు టబ్బురంబు.

వ. అదియునుంగాక మహాత్ములును జగద్విదితంబుగ రాజసూయం బొనర్చి విప్రుల కనేకదక్షిణ లొసంగినవారును ధర్మతత్పరులును కృష్ణాశ్రితులును నగు పాండవుల కేల దుఃఖంబు సంభవించె ! వేదీ మధ్యంబునం బొడమిన మహాభాగయు రమాంశజయునునగు ద్రోవది యంటరానిసమయమ్మున దురాత్ముఁడగు దుశ్శాసను నిచే గృహీతకేశయై సభామధ్యమ్మునం గ స్తిపడ నేల ? మఱియు విరాటునింట దాసి యగుటయుఁ గీచకునిచే నవమానిత యగు టయు నాయమ కేపాపంబున ఘటించె ? సదాచారులగు పాండవులు ధనలోభమ్మున భీష్మద్రోణులం జంప నేల ? మఱియు, ౧౮

క. హరి ప్రేరేపింపఁగఁ దా
మరయక పాండవులు వంశమంతయు నష్టాం

కురముగ నొనర్చి రన్వయ
హారణమ్మనకన్న బిచ్చమైనను దగదే. ౨౦

క. మును భారతవంశము నా
శన మగుడున్ నీవు మాతృశాసనమున నె
క్కొని గోళకులగు పుత్రులఁ
గని నిల్పితి వేమి సార్థకంబు మహాత్మా! ౨౧

గీ. తుదకు వరిముల్లురీతి నద్భుతముగాఁగ
బ్రతుకుఁ గాంచిన మాతండ్రి బ్రాహ్మణుని గ
శమ్మనం దేల వైచె సర్పమ్ము! నెంత
రాజయినఁ గాని విప్రవైరమ్ము చనునె. ౨౨

క. ఆయీసందేహంబులు
పాయవు నామదిని సత్కృపామతివై వి
జ్ఞేయగతిఁ దెలుపుమనుడు ద
యాయతమతి యగుచు వ్యాసుఁడాతని కనియెన్. ౨౩

—* వ్యాసుండు కర్మవిధము దెలుపుట *—

క. నరపాల! కర్మగతి యన
సురలకు దుర్జ్ఞేయ మధికసూక్ష్మమ్మును ద
త్పరిపాక మెఱుఁగ శక్యమె
నరులకుఁ గర్మంబ కారణం బన్నిటికిన్. ౨౪

గీ. కర్మమను బీజమున జీవగణము లఖిల
యోనుల జనించు నశియించుచుండు జీవుఁ
డాదియును నంతమును లేక యలరువాఁడు
గాని నిధనంబుఁ గనువాఁడు గాఁడు సూవె. ౨౫

గీ. కర్మవశమున జీవుండు గాంచుచుండుఁ
గాయసంబంధ తద్వియోగములు కర్మ
మమరు సంచితమని భవిష్యంబనియును
దెలియఁ బ్రారబ్ధ మని మూఁడు తెఱఁగు లగుచు. ౨౬

చ. చను సుఖదుఃఖముల్ జరయుఁ జావును బుట్టువుఁ గామలోభముల్
గనుఁగొనఁ గర్మసంస్కృతివికారములై యజరుద్రముఖ్యులై
నను విడ లేరు కర్మము ఘనం బది యన్నిటికన్నఁ దత్ఫలం
బనుభవరీతిఁ గాక మఱి యన్యవిధమ్మునఁ బోవ నేర్చునే. ౨౭

గీ. రుద్రుఁడు కపాలి చంద్రుఁడు రోగి యాట
సూర్యుఁడు పరిభ్రమించు టించుకయు నన్య
కారణమ్మునఁ గా దది కర్మఫలము
సకలజగమును గర్మవశంబు సుమ్ము. ౨౮

గీ. జగము నిత్య మనిత్యమన్ సంశయంబు
మునుల కెడ తెగదన్న నెవ్వనికిఁ దెలియు
మాయచొప్పడునంతకు నీయఖిలజ
గమ్ము నిత్యప్రచారమై కానిపించు. ౨౯

క. నానాయుగముల నానా
యోనుల నానావిధాభియోగంబుల జ
న్మానుగతి హరికిఁ గర్మా
ధీనతఁ గాకున్నఁ గలుగునే నరనాథా ! 30

శా. వైకుంఠమ్ముఁ బరిత్యజించి కమలాబాంధవ్యమున్ వీడి లీ
లాకాంతారవిహారముల్ విడిచి హేలానృత్యవాద్యాది సు

శ్రీకళ్యాణము లుజ్జగించి హరివాంఛింపఁ గతం బేమి ! ఘో
రాకార మ్మగుగర్భనారకముఁ గర్మాధీనుఁడే కాని-చోఁ 31

క. మలమూత్రపానమునఁ బం
కిలమగుగర్భంబునఁ దలకిందుగ భీత్యా
కలితుఁ డగుటకన్నను నీ
యిల వేఱొకదుఃఖ ముండునే నరనాథా ! 32

గీ. గర్భమున కెక్కుడగు నరకంబు లేదు
పురువు లంగమ్ములను బట్టి పొడుచు నాఁక
లి యధికంబుగఁ బీడించు లేవరాదు ;
పదినెలల కష్టమియ్యది పార్థివేంద్ర ! 33

క. ఈ కష్టములకుఁ దలఁకి య
నేక సుఖమ్ములను విడిచి యేకాంతగతిం
గైకొని మునీశ్వరులు తప
మాకాంక్షించెదరు గర్భ మతిదుఃఖదమా. 34

క. ఒక కల్పమేనియును నా
రకమున వసియింపవచ్చు రాజా ! గర్భం
బకటకట ! దుఃఖబహుళం
బొక క్షణమేనియును దాన నుండుట భరమా. 35

గీ. దారుణంబగు యోనియంత్రమ్ము వెడలి
పడుట యొకకష్ట మామీఁద బాల్యమందు
నేకములు గష్టములు సెప్ప నేల దీని
నేవగింతురు తత్త్వజ్ఞు లెఱుకకలిమి. 36

గీ. యజ్ఞ దాన తపోజన్యమైన సుకృత
కలన స్వర్గంబు గల్గుఁ జంచలముగాని
యదియు నిత్యంబుగాదు పుణ్యంబు క్షీణ
మైన నటనుండ నిందు్రనకైనఁ జనదు. ౩౭

గీ. కృతశుభాశుభకర్మముల్ కేవలాను
భావ్యములు దాఁటఁగా రావు బ్రహ్మకైన
విష్ణు వెత్తిన యవతారవిధ మదెల్లఁ
గర్మవశ మని యెఱుఁగు నిక్కము నృపాల ! ౩౮

క. రామావతారమునఁ గపు
లై మహి నావిర్భవించి రమరులు ; కృష్ణుం
డై మధుసూదనునకుఁ దో
డై మెలఁగిరి యాదవులయి యాహవభూమిన్. ౩౯

గీ. బ్రహ్మచేఁ బ్రేరితుండయి పద్మనేత్రుఁ
డెత్తు నవతారములు ధర్మ మెసఁగఁజేయఁ
బ్రతి యుగమ్మున నవతార ఫలము హరికి
రాక్షసవినాశమును ధర్మరక్షణంబు. ౪౦

క. శ్రీకృష్ణుని చరితము సు
శ్లోకము పుణ్యప్రదంబు శోభనము లస
చ్ఛ్రీకము శృంగార రస
వ్యాకీర్ణము సర్వలోకవంద్యం బధిపా ! ౪౧

గీ. యదుకులమునందు వసుదేవుఁ డవతరించెఁ
గశ్యపుని యంశమున శాపకారణమునఁ
గలిగె గోవృత్తి ; కశ్యపుకాంత యదితి
యును సురసయును శాపానుయుక్తిఁ జేసి. ౪౨

గీ. దేవకియు రోహిణియు నాఁగ భూవలయము
నందు నక్కయుఁ జెల్లెలునై జనించి
రనుడు జనమేజయుం డను మునివరేణ్య !
కశ్యపున కేల శాపంబు కలిగెఁ జెపుమ. ౪౩

ఆ. వె. అతని భార్యలైన యదితియు సురసయు
శాప మందనేల జగదధీశుఁ
డైన హరియు మానుషావతారం బెత్తి
గోకులమున నేల కోర్కెఁ జెందె. ౪౪

క. వైకుంఠవాసుఁడగు హరి
గోకులమునఁ బుట్టి వింతకోర్కెల శుద్ధ
ప్రాకృతచర్యల మెలఁగుట
కేకారణ మెఱుఁగఁ జెప్పవే మునివర్యా. ౪౫

ఉ. మానవజన్మమన్నఁ గడు మాన్యము గాదది గర్భదుఃఖము
ఖ్యానగతంబు దానికి మహామహుఁడౌ హరి సమ్మతించి యె
న్నే నవతారముల్ గొనుచు నెంతయుఁ గుందఁగనేల రాముఁడై
కాననమందు మ్రగ్గవడిన కష్టముకన్నను గష్టమున్నదే ! ౪౬

ఉ. గోవులఁ గావఁడో వెడఁగు గొల్లల కొంపలలోఁ జరింపఁడో
చావునకుం దలంకి తన జన్మగృహంబు పరిత్యజింపఁడో
చేవ గలట్టి కంసుని నశింపఁగఁ జేయఁగఁ గష్ట మందఁడో
యేవగఁ జూచినన్ సుఖము కృష్ణునికిం గనుపట్ట దింతయున్.

వ. అనవుడు వ్యాసుం డిట్లనియె. ౪౭

క. హరి యవతరించుటకు నో
నరపాల ! యనేక కారణంబులు గల వా

దరమున విను వసుదేవుని
చరితమ్మును నతని సతుల చారిత్రమ్ముల్. ౪౯

వ. ఒక్కనాఁడు కశ్యపుఁడు యజ్ఞార్థంబుగ వరుణు ధేనువుల నపహ
రింప నతండు గుపితుం డగుచుఁ బరమేష్ఠికడకుఁజని యిట్లను.
"నా ధేనువులు కశ్యపాపహృతమ్ము లగు కతనఁ దదీయతర్ణ
కంబు లడలెడి మాతృహీనమ్ములైన యీ వత్సంబులంబోలె
నీతని భార్యలును దుఃఖింతురు గావుత" మని మఱియు నదితిం
గుఱించి "మృతవత్సవై కారాగార నివాసినివై యుందు" మని
శపించిన విని నీరజాసనుండు గశ్యపు రావించి యిట్లనియె. ౫౦

గీ. ఈవు లోభగుణం బూని యితని ధేను
వుల హరింతువె? ధర్మంబు పోలియదే! యె
ఱింగియును నింద్యమైన పనిం గణింప
లేని నీ బుద్ధి కేమన నౌను మౌని! ౫౧

వ. యుక్తాయుక్తంబు లెఱింగియు నెఱుంగనిగతి ననుచితం బొనరించి
తివి గాన భార్యలిరువురితోఁగూడ యదువంశమ్మునం బుట్టి
గోపాలకత్వం బొనరింతువు గాక యని శపించి మఱియు నిట్లనియె.

క. ధరణీ భారం బెల్లను
హరియించెడివాఁడు పరముఁ డాద్యుఁడు హరి సు
స్థిరవైభవుండు నీకుఁ గొ
మరుఁడై జనియించు లోకమాన్యుండగుచున్. ౫౩

వ. దితియు నొక్కెడ నదితిం గాంచి "నీకుం గుమారు లేడ్వు రుద
యించి నశింతురుగావుత" మని శపించె; ననవుడు వ్యాసునకు
జనమేజయుం డిట్లనియె. ౫౪

క. దితి యేల శపించె మరు
త్పతిజనని నదితిని దనదుభగినిన్ నాకుం
గత మెఱిఁగింపు మనుడు భూ
పతి కిట్లని చెప్పఁ దొడఁగె వ్యాసుఁడు పేర్మిన్. ౫౫

వ. రాజేంద్రా! దక్షునికొమిరెలగు దితియు నదితియుఁ గశ్యపునకు భార్య లందు నదితికి నింద్రుం డుదయించిన దితి తనపతి యగు కశ్యపుం గాంచి "ఇంద్రతుల్యపరాక్రముఁడగు కొమరుం గరుణింపవే" యని ప్రార్థించుడు నతండు నట్లనుగ్రహించె నంత దితియు సంపూర్ణగర్భవతియై యున్నెడ నదితి దానికి సహింపక తనపుత్రుండగు నింద్రున కిట్లనియె. ౫౬

క. దితికడుపున నొకతనయుం
డతివీరుం డుద్భవించు నని కడుఁజింతా
న్వితనైతి వైళమే త
త్ప్రతిక్రియ యొనర్పు మనకు వలయుఁ గుమారా. ౫౭

గీ. గర్భవతియగు సవతాలి గాంచి నా మ
నంబు చింతాకులంబయ్యె నాఁడునాఁటి
కలరెనే శాత్రవుఁడు రాజయక్ష్మపగిది
నుపశమింపఁగరాదు సు మ్మొకరిచేత. ౫౮

క. అనవుడు నింద్రుఁడు దితికడ
కనువుగఁ జని మ్రొక్కి నాఁడు సాష్టాంగ నమ
స్కారించి వినయమధురం
బును విషగర్భితముఁ గాఁగఁ బొరి నిట్లనియెన్. ౫౯

గీ. అమ్మరో! నీవు వ్రతపరాయణతఁ జాల
బడలి కృశియించితివి నీకుఁ బాదసేవఁ
జేయ వచ్చితిఁ బెద్దలసేవకన్నఁ
గలదె సుకృతంబు సకల లోకమ్ములందు. ౬౦

వ. అని పాదమ్ము లల్లన నొత్తుచున్నెడ నాపె నిద్రించె నతండు వజ్రంబు గొని. ౬౧

గీ. యోగబలమున గర్భంబు వేగఁ జొచ్చి
యేడు తెఱఁగుల ఖండించె, నిట్లొనర్ప
వజ్రధారాభిఘాతంబు వలనిబాధ
తాళఁజాలక శిశువు రోదనము చేసె. ౬౨

వ. మఱియు నతండు మెల్లన "మారుద" యని నుడువుచు నొక్కొక్క ఖండం బేడేడుతునుకలు గాఁ దునిమిన నాపెగర్భం బేకోన పంచాశత్ఖండంబు లయ్యె నంత నదితియు మేల్కాంచి సపత్నియే యిందులకుఁ గారణం బని యెఱింగి కోపించి యిట్లు శపియించె.

ఉ. పాతకురాల! గర్భమును భంగ మొనర్చినయట్టి నీతనూ
జాతుఁడు రాజ్యహీనుఁడగు సత్యము గల్గినదాననేని నీ
వాతురవై భవాంతరమునందును నిప్డును బాధనాలయా
పాతమునం గృశించి సుతభంగమునం దపియింప కుందువే. ౬౩

వ. నాపుడుఁ గశ్యపుండాలించి దితిం గాంచి యిట్లను "నోలతాంగీ! కోపింపకు మీఖండమ్ము లన్నియు మరుత్తు లనఁ బరఁగి బలాదికమునఁ బురందరసామ్యమ్మున నెగడెడి, భవద్వితీర్ణంబగుశాపం బిత్తలోదరి యష్టావింశమ్మగు ద్వాపరమ్మున మనుష్యాంశమ్మున ననుభవించునని చెప్పి మఱియును. ౬౪

చ. వరుణుఁడు శాపమిచ్చె మును వారనికోపము నూని నీవు నా
వరుసన శాపమిచ్చితి వవంధ్యము లియ్యవి తప్ప నేర్చునే
యురువుర శాపహేతువున నీ సతి మానుషయోనిఁ బుట్టు నో
తరుణి ! కృపామతిన్ గను పృథాకలహమ్ము లడంచు శ్రేయమున్.

గీ. అని పతి వచింప సత్కాంత యడ్డు సెప్ప
కూరకుండె నరేంద్ర ! యయ్యువిద యదితి
దేవకీదేవి యగుచు మేదిని జనించె
నెఱుఁగు మిది శాపకారణం బింత నిజము. ౬౭

క అన విని జనమేజయుఁ డి
ట్లనియెన్ నీచెప్పినట్టి యాఖ్యానము వి
న్నను బాపరూపభవబం
ధనమునకుం దలఁకు నామనంబు మునీంద్రా ! ౬౮

గీ. కశ్యపునిపేర్మిగాఁ ముకు లోకముల నేలు
వాఁడు దేవేంద్రుఁ డిట్టి యపాత్రికర్మ
మొనరిచె నటన్న నకట ! తక్కొరులు పాప
ములకుఁ దలఁకుదురే ! భవాంబుధి మునింగి. ౬౯

వ. సంసారకారణంబునసకదా ! మత్పితామహులగు పాండవులు శ్రీ
కృష్ణప్రేరితులై యధర్మబహుళంబును దారుణంబునునగు సంగ్రా
మం బొనర్చి మహాత్ములును వేదవేదాంగపారంగతులును దేవాం
శసంభవులునునగు భీష్మద్రోణాదులఁ బలువురఁ బరిమార్చిరి.

క. సారవిహీనంబగు సం
సారం బని యెఱిఁగి దేవసములును ధర్మ
ప్రారంభులు నగువారలు
నీరీతి నధర్మవృత్తి నెనయం దగునే. ౭౦

—* సంసార విముక్త్యుపాయము *—

ఆ. వె. ధర్మ మనఁగ నేది దానికిఁ దగు నాస్థ
యెట్టి? దది ప్రమాణ మెట్టు లగునొ!
తెల్పుమయ్య వ్యాస! తెల్లముగా నిట్టి
కతల కతన మనము గలఁక చెందె. ౭౨

గీ. ఆప్తవాక్యంబు విశ్వాస్య మంటివేని
యాప్తుఁ డెవ్వఁడొ తెలియఁగ నలవి యగునె
విషయ సక్తతఁ జెంది పూరుషుఁడు రాగి
యగును రాగంబు ద్వేషంబు ననుసరించు. ౭౩

క. తనకార్యము సాధింపం
గను ద్వేషం బనృత మొదవఁగాఁ జేయును వి
ప్రనిరూపము నెపమునఁ గొని
చనఁడె జరాసంధుఁ గూల్ప జలజాక్షుఁ డొగిన్. ౭౪

క. అతఁడు త్రివిక్రముఁ డయ్యు న్నృ
పతివర! యాకతనఁ గాదె వామనుఁడై వి
శ్రుతిగాంచె ద్వారపాల
స్థితి కగ్గం బయ్యెఁ దద్వశీభూతుండై. ౭౫

గీ. ధర్మమున కాదిపదము సత్యంబు రెండ
వపద మెన్నంగఁదగు శుచిత్వంబు మూఁడ
వపద మెన్నఁగ దయ నాల్గవపద మెన్న
దాన మనిచెప్పు నెల్ల బుధవ్రజంబు. ౭౬

వ. అట్టినాల్గుపాదమ్ములం దక్కిన ధర్మంబు నిలువదు ధర్మహీనంబగు కర్మంబు ఫలప్రదంబు గానేర; దందు నిశ్చలుండు మృగ్యుండని పలికి మఱియు నిట్లనియె. ౭౭

ఉ. దాత మహానుభావుఁడు శతక్రతుకర్త నయానయాది ని
ర్ణేత జితేంద్రియుండు రమణీయచరిత్రుఁడు వేదమార్గసం
స్థాత ధరాసురాదిజనతానుతుఁడౌ బలిచక్రవర్తి నా
రీతి నధర్మమార్గమున శ్రీహరి వంచన సేయు టొప్పునే. ౭౮

వ. ఇందధికుండు బలియో హరియో తెల్పుమనవుడు సాత్యవతే
యుం డిట్లనియె.

గీ. మాయ పన్నిన కపటవామనుని కన్న
నాడి తప్పక మేదిని యఖిల. ధృతని
కిడిన బలి యుత్తముం డని యెన్నఁదగదె
ధర్మమన నొండుగలదె సత్యంబుదక్క. ౮౦

గీ. తీర్థములు సారెసారెకుఁ దిరుగుఁ గాక
జన్నములు తేపతేపకు సలుపుఁగాక
దానమతి మాటిమాటికిఁ బూనుఁగాక
సత్యవంతున కేవాఁడు సాటివచ్చు ? ౮౧

వ. త్రిగుణాత్మికయగు మాయ బలవతి యగుకతన. సాంసారికునకు
సత్యంబు దుర్లభంబు నిస్సంగులును నిష్ప్రతిగ్రహులును వైఖా
నసులును నగుమునులకు సత్యంబు సుసాధం బట్టివారల యిట
దృష్టాంతంబుగాఁ గలరు. తద్భిన్నంబగు నఖిలజగంబును మాయాశ
బలితమ్మగుచు మోహంబునిధిం దరింపరామి భ్రమించుచుండుఁ
గార్యార్థి యగు సంసారికిఁ గపటం బవశ్యకర్తవ్యంబు ; దానం
బాపంబు సంభవించుఁ, గామక్రోధలోభాదులు బలవంతంబు
లగుకతనఁ గర్తవ్యాకర్తవ్యమ్ముల నెఱుంగనీవు. విభవమ్మువలన
నహంకారంబును నహంకారంబువలన సంకల్పవికల్పమ్ములును
నాశాతృష్ణాదైన్యదంభంబులును నసూయయు మున్నుగాఁ గలి

దుర్గుణమ్ములు పెక్కు సంభవించుఁ గాన సంసారికి మహామోహ
మ్మునం బడక తీరదు. ౮౨

గీ. మనము పరిపక్వమై శుద్ధి గనదయేని
ధనము న్యాయార్జితం బయి తగదయేని
శత్రుసంపర్కంబు దూరమై చనదయేని
వాఁ డొనర్చిన కర్మంబు వమ్ము సుమ్ము. ౮౩

గీ. కర్త ద్రవ్యంబు దేహంబు కారయితయు
శుద్ధులై యున్నఁ గర్మంబు శుద్ధిఁ జెందుఁ
గాని విపరీతము లయినఁ గర్మఫలముఁ
గూడ విపరీత మగుఁ జూవె కురువరేణ్య! ౮౪

క. తన వృద్ధియుఁ బరహానియుఁ
గనఁ గర్మం బాచరించు ఘనులందఱు నె
క్కొని తత్ద్గుణ శుద్ధిని
గనకున్నఁ బ్రమాద మొదవుఁ గర్మమ్మునకున్. ౮౫

వ. ప్రాజాపత్యు లగు దేవదానవులు కార్యార్థులగు కతన సదా
పరస్పర విరోధమ్మునం బ్రవర్తింతురు. గుణత్రయ సముద్భూతు
లగు దేవ మనుష్యతిర్యగాదులకుఁ బరస్పర జాతివైరంబు స్వాభా
వికంబు. అహంకార సముత్పన్నంబగు నీ సంసారమ్మునందు రాగ
శూన్యం బుదయించుట కల్ల యని మఱియు నిట్లనియె. ౮౬

ఆ. వె. వేయి మాటలేల విశ్వంబు సర్వంబు
మోహమయము రాగమూల మగుచు
నాదియుగమునంద యలరారె నింక నీ
కలియుగమ్ము చెప్ప నలవి యగునె! ౮౭

క. ద్రోహము నొనర్చిన వానికి
ద్రోహం బొనరింప నిరువురును సములే యు
ద్రోహికి ద్రోహ మొనర్చిన
ద్రోహాత్మునికన్న జగతి దుష్టులు కలరే? ౮౮

వ. సుకృతవంతులకుఁ గృతయుగమ్మును గలిపురుషులకుఁ గలికాలం
బును మధ్యములకు మధ్యయుగంబులును నిర్ణీతంబులు. అందు
నొకానొకఁడు వాసనావశమ్మునఁ గలియందును ధర్మాత్ముఁడు
కాఁగలఁడు. ఏ యుగమ్మునను ధర్మంబునకుఁ బూర్వజన్మ
వాసనయ కారణంబు. ౮౯

గీ. సత్యసంధులు మును లతిశాంతు లగుచుఁ
గాననమ్ములఁ దపము లు పూనియుండ
మఘవు నంతటివాఁడు పెన్మచ్చరమున
వారి నియమమ్ములకు భంగపా టొనర్చు. ౯౦

వ. ఇందులకుఁ బురాతనంబగు నొక యితిహాసంబు గలదు. ౯౧

గీ. ధాతమానసపుత్రుండు ధర్ముఁ డనెడి
బ్రాహ్మణుఁ డొకండు వేదసంపన్నుఁ డతుల
ధర్మతత్పరుఁ డలరు నాతఁడు పదుగుర
దక్షసుతలను బెండ్లాడె ధర్మరతల. ౯౨

వ. వారితో గృహస్థధర్మమ్ములం బ్రోద్బలపుచ్చుచు హరి కృష్ణ నర
నారాయణులను నలువురఁ దనయులఁ గాంచె నందు హరికృష్ణులు
యోగాభ్యాసరతులైరి. నరనారాయణులును, ౯౩

—* నరనారాయణులు తపం బొనర్చుట *—

శా. మంచుంగొండకు నేగి చేసి రచటన్ మందాకినీ తీరమం
దం చన్మంజులకుంజభాగముల నధ్యక్షించి లోలోన 'నో'
మంచన్ మించుగతిం దపంబొక సహస్రాబ్దంబు లద్దాన గం
పించెన్ సప్తకులాచలంబులును క్షోభించెన్ దిశాచక్రముల్. ౯౧

క. ఘోరంబగు తప మా నర
నారాయణు లిట్లొనర్ప నాకవిభుఁడు పెం
పారు భయమ్మున మనమున
వారి తపశ్శ్రీలు భంగపఱుపం దలఁచెన్. ౯౨

వ. తలఁచి యైరావతం బెక్కి గంగాకూలమ్మునకుం జని యచట
నరుణద్వితయంబు వడువున బ్రహ్మవిష్ణువుల చందంబున వైశ్వాన
రద్వయంబుపగిదిఁ దపం బొనర్చు ధర్మతనయులం గాంచి గజంబు
డిగ్గి డగ్గఱకుం జని యిట్లనియె. ౯౩

ఉ. ఏమి మనంబునందలఁచి యిట్లు తపం బొనరించుచున్న వా
రో మహనీయులార! మదినున్న వరంబు వరింపుఁడయ్య సు
త్రాముఁడ నేను వచ్చితి భరంబని యెంచక, చాలు నింక మీ
ఘోరతపంబు మాకు సమకూర్చెను సంతస మెంతయేనియున్.

ఆ. వె. కోరఁ దగనిదైనఁ గోరుఁ డొసంగెద
ననుచుఁ బల్కు హరివచనములకును
మాఱు పలుకరైరి మహనీయు లతి జప
ధ్యానగరిమ మదిని దవులు కతన ౯౪

క. పలుకని మునులంగని బి
ట్టలుకం బాకారి వారి ధ్యానాసక్తిన్

బాలియించఁగ నోకమాయన్
గలుగంగాఁ జేసె నంతఁ గలుషితమతియై. ౯౯

క. పులులుం బాములు సింగం
బులునుం దోఁడేళ్ళుఁ జిఱుతపులులుం బెలుచన్
గలిగెను దన్మాయాబల
విలసనమున వేలకొలఁది వెఱఁగొదవంగన్. ౧౦౦

గీ. పుష్కలావర్తకంబుల బోరుకొలిపె
దావదవమును నల్దెసల్ దవ్వులుకొలిపె
నంధతమసంబు నల్గడ నాక్రమింపఁ
జేసె ఆగ్లురిపించె విశేషరీతి. ౧౦౧

క. నరనారాయణు లీగతి
మరుదధిపతి గడలుకొల్పు మాయకు భయమును
బారయక తమయంతన సు
స్థిరమతులై యుంట చూచి చెచ్చెర నతఁడున్. ౧౦౨

గీ. కోరువర మిచ్చెద నటన్నఁ గోరరైరి
వానకును నెండకును భీతిఁబూనరైరి
పులులకేనియు మదిలోనఁ దలఁకరైరి
పీరితపమున కెట్లొకో విఘ్నమనుచు. ౧౦౩

వ. వితర్కించి తత్తపోతిశయమ్మున కచ్చెరువంది సనాతనియు జగదీశ్వరియునగు నంబ వాగ్బీజమాయాబీజకామబీజంబులు జపియించు మహాత్ములతపంబున కంతరాయం బొనర్ప నెవ్వండు సమర్థుండని యోజించి నాకమ్మునకుం జని వసంతమన్మథులం బిలిపించి యిట్లనియె. ౧౦౪

క. స్వాయత్తస్తత్త్వులు నరనా
రాయణు లనువారు బదరికాశ్రమమం ద
త్యాయతరీతిఁ దపంబుం
జేయుచునున్నారు మనకుఁ జేటొదవంగన్. ౧౦౫

ఉ. వారితపంబు భంగపఱుపం జని యేను " వరంబు లిచ్చెదన్
గోరుఁ " డటన్న నాదుపలుకుల్ చెవిఁ బెట్టక పోయి రంత దు
ర్వారమదీయమాయఁ గనుపట్టిన వానకుఁ బెద్దగాలికిన్
గ్రూరమృగాలికిన్ మదినిఁగొంక రొకింత యదేమివింతయో. ౧౦౬

ఆ. వె. అంత నేను వారి దైన తపంబును
భంగపఱుప లేమి బెంగఁ గొనుచు
నేగుదెంచి దీని నేరు సాధింప లే
రంచు మిమ్ముఁ బిలువ నంపినాఁడ. ౧౦౭

క. కావున నిర్జరకార్యము
గావింపఁగ నీవు దక్కఁ గలవా రేరున్
భావింప లేరు నీయను
భావం " బిదమిద్ధ " మనఁగ వచ్చునె మదనా ! ౧౦౮

గీ. హరిహరబ్రహ్మముఖులు నీయంపగముల
దాడి కోర్వక దాసానుదాసులైరి
జగము లన్నియు గెల్చినజాణ వీవు
మనుజు లన నెంతవారలో మదన ! నీకు. ౧౦౯

ఉ. సంతస మూని వే మనవసంతునితోఁ దగునట్టియప్సరః
కాంతలతోడఁ గూడి చనఁగావలెఁ గావలె సిద్ధి ; వేల్పురా

వంత రవంత నీమది కవశ్యము రావలెనయ్య మార ! నీ
యంతటివాని కెంతఘనమైనది యింతటికార్య మెంచఁగన్.

గీ. రంభ మొదలగు నప్సరోరమణులందు
నొక్కరిత యిట్టిపని చేయనోపు నట్టి
దండు నీకు సహాయమై యుండ నెంత
లేసి తపములకైనను వాసి చెడదె. ౧౧౧

వ. అని యనునయ పూర్వకమ్ముగఁ బల్కు నతనికి మదనుం డిట్లను.

క. దేవా ! దేవరయానతి
గావింపఁగఁ గింకరుఁడు గలఁడైనను నా
భావమ్మునఁ గల భయసం
భావన తెల్లముగఁ దెలియఁ బఱచెద వినుమా. ౧౧౩

గీ. హరిహరబ్రహ్మలను జిత్తమందు నిలిపి
తపమొనర్చెడి తపసుల తపము పాడు
చేయఁగలఁ గాని దేవిని జిత్తమందుఁ
దలఁచు తపసుల వంచింపఁ దరము కాదు. ౧౧౪

శా. ఏవారైన మదీయబాణములఁ బేలుత్తించి యుంకించి త
ద్భావమ్ముల్ గలఁగించి తత్తపములన్ భంగంబు గావింతుఁ గా
నీ వాలాయముఁ గామబీజ మెదలో నిత్యంబు ధ్యానించు నా
దేవీభక్తులవంకఁ బోవుటకు సందేహింతు దేవాధిపా ! ౧౧౫

క. నరనారాయణులను ముని
వరు లీయిరువురును శక్తిభక్తులు వినుమా
మరుదీశ్వర ! నాశరముల
కరయుగ్మం గుఱిగా రనన్ బలాఢ్యాతి ఘనుల్. ౧౧౬

క. మాయాబలమున నైనను
పాయము చేనైన నీ వపాయము గనకే
మే యనువున నైనను సుమ
సాయక! యీ దేవహితము సాధింపఁదగుఁన్. ౧౧౭

వ. నావుడు మదనుండు మాతాడక రంభాదులతో బదరికాశ్రమంబు పొంతకుం జనునంత వసంతుండును మున్న తదాశ్రమంబు ప్రవేశించె. ౧౧౮

మ. చివురుం గొమ్మలతో రసాలములు పుష్పించెన్ ద్విరేఫాళి 'జుం జుం' మంచున్ బ్రతిసూనగుచ్ఛముఁ పయిం జూడందగెన్ మించి పం డువు గావించెను గణ్ణయుగ్మములకున్ బుంస్కోకిలారావ, మొ క్క వసంతుండు తదాశ్రమావనితటిం గాల్చూఁదు నాలోపలన్: ౧౧౯

—* వసంత ప్రవేశము *—

క. పొగడలు తమాలములు మో
దుగులున్ దిలకాగములు మధూకమ్ములు గెం
జిగురుం బూవులతోఁ ద
న్నగమున నింపుం దనర్చె నయనమ్ములకున్. ౧౨౦

సీ. లతలన్నియును బుష్పవతులై నగంబుల
నంచితంబుగఁ గౌఁగిలించుకొనియె
మందమ్ములై మంచిగందంపుఁదావితోఁ
జెలరేఁగి ననుగాడ్పు లలముకొనియె
రాలముగ్గినపండు గాలించి మెసవుచుఁ
గొదమ చిల్కలదండు కూయఁదొడఁగెఁ

బొండుటాకులమీఁదఁ బడెడి పూవులచాలు
పండువెన్నెలభాతిఁ బరిఢవిల్లె

గీ. నాలుమగలెల్ల మొల్లమా పూలఁజాల
లీల నోదవఁగఁజేయు నీ రాలలోన
నించు విల్కాని చెయ్వు లగ్గించుకొనుచు
సంతసింపఁగ సాగి రా సమయమందు. ౧౨౧

గీ. ఇటు వసంతుండు మున్న యచ్చటను జెలఁగఁ
బంచ బాణమ్ములును గేల నించువిల్లుఁ
దాల్చి యప్సరసలు వెన్నుఁ దన్ని రాఁ ద
దాశ్రమము సేరె సుమబాణుఁ డభయుఁ డగుచు.

ఉ. మ్రాఁకులు మోసులెత్త గరిమ న్నలతా ల్గరఁగంగఁ గోటరా
నీక నివాసమై తగు ఫణిప్రకరంబు కరంబు వేడ్కతో
నూఁకొనఁ గోకిలల్ ప్రీతి రవోదయముం బొనరింపఁ బాడి ర
వ్యాకులలీల నప్సరస లయ్యెడ రమ్యలయస్వరంబుగన్. ౧౨౩

వ. ఇట్లకాలవసంతోజ్జృంభణంబున మంజులతర గీతంబును గోకిలా
రవంబును శిలీముఖధ్వానంబును జెవులకుం దవిలి ఱెప్పలు విప్పి
నలుదెసలు చూచి నరనారాయణు లిర్వురును గాలధర్మ విప
ర్యాసమ్మునకు విస్మయం బొందుచుండిరి. ౧౨౪

గీ. కుజము లన్నియుఁ బుష్పించెఁ గోకిలార
వమ్ములును ముమ్మెదల విరావమ్ములును భ
రమ్ములై నిండె నీ భూధరమ్మునిండ
నన్న! చూచితె యిది యెంత యద్భుతంబొ! ౧౨౫

గీ. శిశిరఋతువను గజరాజు శిరముఁ దన ప
లాశ కుసుమమ్ములను గోరులం గలంచి
యరుగుదెంచె వసంతసింహం బటంచు
దోఁచుచున్న దిదేరి చాతుర్యమొకొ్క. ౧౨౮

సీ. అరయ రక్తాశోకకరయుఁ బలాశాంఘ్రి
కయును నీలాశోకకచయు నీల
నీరజనయనయు వారిజవదనయుఁ
గుందద్విజయు బిల్వకుచయు మంజ
రీకర్ణయును జపాశ్రీకాధరయు నీప
వసనాన్వితయు సిందువారనఖయు
గోకిలాలాపయుఁ గేకికలాపయు
సారసస్వననూపురారవయును
గీ. రమ్యవాసంతికాబద్ధరశనయు మద
హంసగమనయుఁ బుత్రజీవాభిధాన
లోమలతయును నగుచు నీలో వసంత
లక్ష్మిసంప్రాప్తమయ్యె సలక్షణముగ. ౧౨౭

చ. సమయము గానిచో నిటు వసంతము వొల్చుటఁ జూడ నస్మదీ
యమగు తపంబు వో నడప నాకవిభుం డొనరించినట్టి కృ
త్రిమగతి తోఁచుచున్న దమరీ మృదుగానరవంబు విన్కిఁజే
సి మది గలంగఁబాఱెఁ బరిశీలన చేయకయుంట పాడియే. ౧౨౮

ఉ. శీతలవాతపోతములు చేతముఁ దన్పఁగఁ జొచ్చెఁ గోకిల
వ్రాతము గీరసంతతి మరాళసమూహముఁ గేకి బృందముల్
గూఁతల మెప్పినర్చె మనకుం గడు మోహ మొనర్ప నెంచి స్వ
ర్ణేతయ పంపఁబోలుఁ దరుణీతతి యింతయు నిక్కువం బగున్,

వ. అనుచు నారాయణుండు ప్రశంసించుచుండు నెడ, ౧౩౦

సీ. పదియాఱువేల యేఁబది మంది మేనకా
ముఖ లచ్చరలు వెన్క ముందు నడువ
నళిమయంబగు నారి యారజంబున మించు
నించువిల్లు బుజాన సంచునించ
మకరందరసము చిమ్ముఁగఁజాలు సుమబాణ
ములగముల్ దూణీరములఁ జెలంగఁ
గుల్కుకోయిలదండు చిల్కతేజీబారు
కలకలమనుచుఁ జక్కటి నటింప ;

గీ. వచ్చి తమకట్టెదుట నిల్వఁబడిన మదను
నచ్చెరు వొకింత మనమున నాదుకొనఁగఁ
గాంచి రోనరించుతపముఁ జాలించి ధర్మ
తనయు లిరువురు సంతస మినుమడింప. ౧౩౧

గీ. దివ్యభూషణరుచి దశదిశలు వెలుఁగ
మునుల కెఱఁగుచు సురధన వనజముఖులు
మానవులు వినదుర్లభమైనపాటఁ
బాడ సాగిరి కామవివర్ధనముగ. ౧౩౨

వ. వారి యాటపాటలకు విస్మితులగుచు వారిట్లనిరి. ౧౩౩

ఉ. మిమ్ము వసంతమన్మథుల మీపతియైన బలారి మాముని
త్వమ్ము గలంచి మాతపము భ్రష్టము సేయఁగఁ బంపినాఁడు చి
త్తమ్మున నీసుతో ; నవితథంబుగ గుర్తెఱుఁగంగవచ్చెఁ గా
ర్య మ్మెట్టులైన మాపలుకు లారయుఁ డాదరమేదురంబుగన్.

ఉ. దూరమునుండి వచ్చితిరి తొయ్యలులార! పరిశ్రమంబు చే
కూరెడిఁ గాన మాయొసఁగు కొంచెపు విందుల సేదదేరి యిం
పారఁగ నస్మదాశ్రమమునందు వసింతురుగాక యూరకే
మీరిట కేగుదెంతురె తమిన్ దివిజేశ్వరుఁ డంపకుండినన్ ౧౩౫

క. పాకారి మాతపమ్ముం
జీకాకొనరింపఁ జేసి చెఱుపఁగ నంపెం
గాక మిము గణికలార! వ
రాకులు మీరెంత! తపము భ్రష్టమొనర్పన్. ౧౩౬

క. మాసామర్థ్యం బరయుఁడు
మీసౌందర్యమ్మున్గీవి మించందగు బల్
వాసి కలదాని గలుగం
జేసెద మొకతన్వి మీకు సిగ్గు ఘటింపన్. ౧౩౭

వ. అని నారాయణుండు కుడితొడ కేలం జఱచినమాత్రన యప్స
రోమణియగు నూర్వశి చెలులతోడం బుట్టె నిట్లనన్యసామాన్య
లావణ్యంబునం బొదలు నక్కన్నెం జూచి దేవసామాన్య లందఱును
మాన్యంబగు నమ్మునిమహిమమ్మున కచ్చెరువడుచు నిట్లనిరి.

చ. ఎఱుఁగక మీమహామహిమ కెగ్గొనరించి తపంబు భంగముం
జఱుపఁగ వచ్చియున్న మము మన్నన సేయుఁడు తొల్లి యెందఱెం
దఱో మహనీయులైన మునినాథుల నస్మదపాంగపాతముల్
చెఱుపఁగ లేదె! మీదరికిఁ జేరవు; మీమహిమమ్ము లింతలే!

వ. అదియునుంగాక నారాయణాంశసంభూతులగు మహానుభావులని
యెఱింగియు నింద్రుండు భవత్తపోభంగమ్మునకు మమ్ముం బనుచుట
యస్మదీయపురాకృత భాగ్యోదయంబ కాని యొండు గాదు

భవాదృశులిట్టి తుచ్ఛసుఖంబులకుఁ జిరకాలార్జితంబగు తపంబు వమ్ముసేయరింతు రేయని నుతించు దేవవేశ్యలం గాంచి చిఱునగ వంకురింప నిజతపఃకాంతులు శరీర మలముకొన జితకామలోభం బగు మనమ్మున సంతస ముప్పతిల నరుండు విన నారాయణుం డిట్లనియె. ౧౪౦

క. వేగమ మీలోకంబున
కేగి మదీయోరుజాత నీయూర్వశి మీ
రాగోత్రిరికిఁ గానుక
గాఁ గైసేయుండు శుభముగాఁ దగు మీకున్. ౧౪౧

గీ. "దేవతలకెల్ల శుభ" మంచు "దేవవిభున
కతులితానంద" మంచు నారాయణుండు
నరుఁడు దీవించి రంచు విన్నపము సేయుఁ
డేగుఁ డచ్చరలార! మీ యెడకు ననుఁడు. ౧౪౨

క. పలుకుల విన్నాణపుఁ దీ
పొలుకఁగఁ బయ్యెదలు మూయ నూఁకించుచు న
చ్చలలోచనాంత లిట్లని
రెలమిన్ గేల్మోడ్చి యమ్మునీంద్రుని తోడన్. ౧౪౩

ఉ. తావకపాదపద్మములదాపునఁ గాఁపుర ముండి త్వత్సమా
సేవనమాచరించుచును శ్రీల రహింపఁగ వచ్చినట్టి మే
మావల కెట్లు పోయెద మహో! యిటు లాడగఁ జెల్లునే మునీం
ద్రా! వధరించి మాహృదయతామరసమ్ము లెలర్పఁ జేయవే.

క. భవదూరుజాత లగునీ
యువతీమణులెల్ల మేల్మి నూర్వశితో నా

కవిభుం గన నేగెద రే
ము వసింతుము నీసమీపమునన మునీంద్రా! ౧౪౫

వ. నావుడు భవదభీష్టం బెయ్యది యనుడు వారలిట్లనిరి. ౧౪౬

చ. చదలును భూమియుం గలిసి చన్నఁ దపోధనులాడి తప్ప రీఁ
గఁ దలఁచితేని మాకుఁ బతిగా నినుఁ గోరెద మొప్పుమయ్య! యే
మదవతిమాటకైనఁ బెఱమాట వచించుట పాడి గాదు మే
మదియునుఁ గాక మన్మథశరానలదగ్ధల మాదరింపవే. ౧౪౭

ఉ. కమ్మనివింటిజోదు చెలికాని హిమాంశునిఁ గూడిమాడి దే
హమ్ము నహమ్ము మీఁదఁ బుష్పటమ్ముల నెమ్ములు గాడఁ జించి గా
యమ్ము లొనర్పఁ జొచ్చె హృదయమ్ముల నీచరణాబ్జమూలముఁ
నమ్మినదేవకాంతల సనాథలఁ బ్రోవఁగ నెంచు టొప్పదే. ౧౪౮

క. నాకమ్ము విడిచి మిమ్మున్
జేకొని సుఖవార్ధిలో మునింగెద మంచున్
మీకాళ్లఁ బడిన వేలుపు
రోకామినులన్ గ్రహింపరో మునిచంద్రా! ౧౪౯

క. అని వనటం బడు వేలుపు
వనితల సరసానులాపవైఖరి చిత్త
మ్మును గలఁకపఱుప నారా
యణ మునిచంద్రుండు వల్కె నవ్వొరలతోన్, ౧౫౦

క. సీతునకుఁ గాలి కెండకుఁ
జేతంబు సహింపఁజేసి చేసిన తపమున్
మీతారుణ్యమ్ముల పా
ల్సేత యుచితమగునె వేల్పు చేడియలారా! ౧౫౧

—* తత్త్వవిచారము *—

వ. అదియునుంగాక మతిమంతు లగువా రేతాదృశగార్హస్థ్య ధర్మంబు లం బ్రవర్తింతురే యను నారాయణున కచ్చర లిట్లనిరి. ౧౫౭

మ. వినుమో హరీ ! మునిరాజ ! మాపలుకు, స్వర్వేశ్యాకుచస్పర్శనం జనితానంద వశీకృతుండ వయి స్వేచ్ఛావర్తనన్ గంధమా దనభూమీధరమందు సంతతసుఖాద్వైతమ్మునై నుండు మ య్యనిమేషాలయమైన నింతకుఁ గడున్ హాళిం బ్రశంసించునే.

వ. నావుడుఁ దద్వచఃప్రసంగంబుల కచ్చెరువడుచు నమ్ముని యిట్లు తలపోసె, నహంకారంబు సంసారవృక్షమ్మునకు మూలంబును ధర్మహారణమ్మునకుఁ బ్రధమకారణమ్మును నని తెలిసి యీ వారాంగన లస్మత్తపోభంగమ్మున కేతెంచిరని యెఱింగియు మానమ్మున నుండక ధర్మవినాశంబుగఁ దదధిక సుందరంబగు సుందరీగణంబు సృజించుటయుఁ దదీయ సరసాలాపగోష్ఠి నుం టయు నన్నింతకుఁ దెచ్చె నీ మహామోహపాశమ్మున బద్ధుండనై యూర్ణనాభిచందమ్మునఁ గదలలేక కష్టమ్ములకుం జాలైతి, నకటా ! యిఁకనైన నీ విచారంబుడిగి శాంతంబుఁ బరిత్యజించి కోపాకులుండనై యీ సుందరులం దఱిమెద నని యనుకొనియు మరలఁ గోపమ్మునకన్న వైరంబు వేఱొండు గనుపట్ట దగోద్ధితం బగు ననలంబద్దాని దహించునట్లు దేహంబునం బుట్టు గోపంబు దేహంబు దహియించు నెట్టి హింసకునైన వెఱవదు, నరకాదు లకు సాధనం బగునని తలపోసి యితికర్తవ్యతా శూన్యుండై యుందుచున్న యతనిం గని యచ్చ్యనఘు తలంపెఱింగి నరుం డిట్లనియె. ౧౫౮

క. కోపము చీఁకటికూపము
కోపము పాపముల కాదిగురువగు హింసా
ధూపము కోపము గావునఁ
గోపింపం గూడ దేరికొఱకైన సఖా ! ౧౫౫

వ. ము న్నహంకారదోషమ్మున సహస్రదివ్యవత్సరమ్ములు ప్రహ్లాదునకు మనకుం బోరగుట యెఱుంగవే ? శాంతంబునన యీ సుందరులం బనుపుము నాపుడు నారాయణుం డతిశాంతుండయ్యె నని చెప్పిన సాత్యవతేయుం గాంచి జనమేజయుం డిట్లను. సుకృతియు ధర్మాత్ముఁడునగు ప్రహ్లాదునకును దపోనైష్ఠికులగు ధర్మతనయులకును సంయుగంబు గలుగఁ గతంబేమి ? తపోధర్మంబులం బరిశ్రమంబుదక్క నిట్టులైన నొండు గలుగనేర్చునే ? క్రోధలోభమాత్సర్యాదులకు మూలంబగు నహంకారంబు సత్యయుగంబునందును మహాత్ముల చిత్తంబు నాయత్తం బొనర్చిన నింక జపతపమ్ములు కలవే ! సూర్యుని యెదుటఁ దమంబుభంగి నహంకారమ్మున కెదుట సుకృతంబు నిలువ నేరదు. లోహనిగళబద్ధులకైన విముక్తి గలుగుఁగాని యహంకారావృతులకుఁ గలుగదని మఱియు, ౧౫౬

మ. నరనారాయణు లట్టి పెద్దమును లన్నా ! యిట్లహంకార దు
ర్భరులై యుండఁగ నస్మదాదుల విచారంబేల ? చిత్తమ్మహం
కరణాయత్తము గాకయున్ననరు లేకాలమ్మునన్ లేరు సం
సరణం బాహామికంబు దీనఁ బరమజ్ఞానంబు చేకూరునే ! ౧౫౭

వ. చరాచరాత్మకంబగు నీ యజాండం బంతయు నహంకారదోషదూషితంబగుచు మూత్రపురీషమయంబగు సంసారమ్మునంబడి పరిభ్రమించుచున్నయది. రాగశూన్యులును మహానుభావులును

నగు వారు సయితము కామక్రోధాదులకు లోనై చరించుచుందు
రేతాదృశంబగు కలికాలమ్మున నస్మదాదులకుం దరణోపాయం
బానతి మ్మనుడు సాత్యవతేయుం డిట్లనియె. ౧౫౭

క. యావదజాండ మహంకా
రావిర్భూతంబు గాన నందలిగుణముల్
సూవె సమస్తబ్రహ్మం
డావృతిఁదగుఁ గార్యభేద మగునె నరేంద్రా! ౧౫౮

క. పటమునకుం దంతుగుణమును
గటకాదులకును సువర్ణగతమగు గుణమ
ట్లెటులే మాయాగుణాలం
పటమగుచు నజాండమెల్ల మసలుచునుండున్. ౧౬౦

వ హరిహరాదులగు దేవతలును వసిష్ఠాదిమునులును నగాథంబగు
నీ సంసారకూపమ్మునం బడి వనధివీచీగతంబగు నౌకచందమ్మునం
దడఁబడుచుందురు. ఈ రేడులోకమ్ములందును దేహియగు
వాని నహంకారసంభూతమ్ములగు కామక్రోధాదు లాశ్రయిం
పక మానవు. ౧౬౧

గీ. సకలవేదాంతసంహితల్ చదువుఁగాక
నిఖలశాస్త్రప్రసంగముల్ నేర్చుఁగాక
పుణ్యతీర్థమ్ము లెన్నేనిఁ బోవుఁగాక
విషయసక్తుఁ డౌనర్పని విధులు లేవు. ౧౬౨

వ. కృతాదియుగత్రయమ్మునందును గామమోహమదాన్వితులకుఁ
బూర్వాపరవిచారంబు లేదు. కలియందు విశేషంబుగ స్పర్ధా
ద్రోహమదమాత్సర్యాధులు పాదుకొని దేహిం బాశనిబద్ధుని

చందమ్మున బ్రింగఁజేయుచున్నవి. ఏతాదృశంబగు సంసారమ్మున నరిషట్కంబు జయించిన మహాత్ము లసదని చెప్ప పారాశర్యునకు జనమేజయుం డిట్లనియె. ౧౬౩

క. వా రతిధన్యులు వా రని
వారణకృతసుకృతఖనులు వారు కృతసదా
చారులు వారు జితేంద్రియు
లేరిఁ మోహాదికమ్ము లెదురక యుండుఁ. ౧౬౪

మ. కలఁకఁ జెందు మనంబు మజ్జనకుఁ డల్కఁ మౌని కంఠమ్మునఁ
గలిదోషమ్మున నొక్కపాము ననుహీనంబుం బడఁ వైచె నఁ
బలుకుం బాపకరంబు లోఁ దలఁచుకొన్నఁ, దండ్రి యేరీతిఁ ద
త్ఫలముఁ జెందకయుండు నట్టి తరణోపాయంబుఁ జింతింపవే.

వ. అని దందహ్యమాన మానసుండగుచుఁ గొంతవడిఁ జింతించి మరల సుప్రసన్నమనస్కుండగుచుఁ దదుదంతంబు సాంతంబుగ నానతిమ్మనుడుఁ దన్మనంబు నరనారాయణ కథానక కథనంబునం బ్రసన్నం బొనర్పనెంచి యిట్లనియె. ౧౬౬

క. మును నరహరిరూపంబున
దనుజారి హిరణ్యకశిపు దానవు ఖండిం
చినపిదపఁ దత్తనూజా
తునిఁ బ్రహ్లాదుని ననిందితునిఁ దనభర్తఁ. ౧౬౭

గీ. జనకు నగరమునకు నొగి స్వామిఁజేసి
"ధర్మరక్షణ మింతేనిఁ దప్పకుండ
నేలుకొను" మన నాతఁడు నేలుకొనియెఁ
బైతృకంబగు రాజ్యంబు ప్రిభఁదలిర్ప. ౧౬౮

ఉ. వారక పాటు లాదియగు వర్ణము లన్నియు స్వస్వవృత్తి సం
చారముతోడ సేవ్యపరిచర్య యొనర్చుచునుండి రెచ్చుటల్
జారులుఁ జోరులున్ బిసునసంతతివారును లేరు కారుణీ
పూరకుఁడా హిరణ్యకశిపుప్రభవుం డిల యేలుపట్టునన్. ౧౨౯

సీ. ఇటు కొన్నినాళ్ళు పైతృకరాజ్యపాలనం
బాచరించి నృసింహునాజ్ఞ కతనఁ
బాతాళలోకంబు పాలింపఁగా నేగి
యచట నాతండున్న యంత నొక్క
దినమున భృగుమునితనుజుండు చ్యవనుండు
నర్మదానదికి స్నానంబొనర్పఁ
గా నేగి దిగి మున్గఁగా నందు విషభయం
కరమగు నొక్కనాగంబు గడఁగి

గీ. తపసికాయంబు పట్టి పాతాళమునకుఁ
దీసికొనిపోవ మౌని భీతిల్లి దీన
రక్షకుండగు సరసిజాతాక్షు మదిని
బాదుకొల్పి నుతించె 'మాంపాహి' యనుచు. ౧౩౦

చ. ఇటు నుతియించు నమ్మునిపయిన్ దయగల్గి సరోజనేత్రుఁడ
క్కటికము చూపఁ దద్విషవికారము దాపసి కెక్కదయ్యె నం
తట "మునిశాప మిచ్చు" ననుదందడిఁ బాము తనిర్గ్రహించెఁ ద
జ్జటి యురగాంగనల్ ముద మెసంగఁగఁ గొల్వ వసించె నయ్యెడన్.

వ. ప్రహ్లాదుం డొక్కనాఁ డతనిం గాంచి యుచిత సత్కారంబొనర్చి
రాక్షసవైరి యగు నిందుండు తన మర్మంబుల నెఱుంగుట
కంపిన దూతగా శంకించి వినయమ్మున "నీ రాకకుం గతం బే"
మనుచు నతం డతని సందియం బెఱింగి యిట్లనియెః ౧౩౧

మ. దనుజేంద్రా! వినవయ్య! నన్నమరదూతంగాఁ గనంబోల దిం
 ద్రునితోడం బని యేమి నాకు? భృగుపుత్రుండర్ బలారాతి పం
 పె నటంచున్ మదినెంచఁబోకు మిదె పేర్మిం జెప్పెదన్ నాచరి
 త్రను, నిక్కంబగు బుద్ధితోఁ గని సుహృద్భావంబు చూపందగున్.

ఉ. ఏ నొకనాఁడు నర్మదకు నేగి జలమ్ములఁ గ్రుంకుచుండ నా
 మే నొకపాము వట్టికొని మీ భువనమ్మున కీడ్చి తెచ్చె న
 న్న్యాన రమాధినాథ కరుణోదయ ముండుటఁజేసి తద్విష
 గ్లానియు నా కొకించుకయుఁ గన్పడకుండె సురారివల్లభా! ౧౭౪

ఆ, వె. నాఁటఁగోలె నీదునగరమ్మునన యుంటిఁ
 గాన వలదు వేఱుగాఁ దలంపు
 విష్ణుభక్తులందు విమలుండ వైన నీ
 దర్శనంబు గలిగె దానఁగాదె. ౧౭౫

వ. నావుడు హరిభక్తసందర్శనజనితానందపరవశుం డగుచుఁ బ్రహ్లా
 దుం డిట్లనియె. ౧౭౬

గీ. సకలలోకాటనంబును సలుపునట్టి
 దివ్యముని వీవు గావున దేవలోక
 మందు భువియందుఁ బాతాళమందుఁ గాని
 వెలయు తీర్థమ్ము లానతీవే మహాత్మ! ౧౭౭

వ. మీ తిరుగని తీర్థమ్ములును మీ గ్రుంకని నదులుం గలవే యను
 నాతనికిఁ జ్యవనుం డిట్లనియె. ౧౭౮

క. ప్రతిపదమునఁ దీర్థము వి
 శ్రుతమగు వాఙ్మనసకాయశుద్ధులకు మనో
 యతిలేని మలినమతులకు
 దితిజాధిప! కీకటంబు దేవాపగయున్. ౧౭౯

ఆ. వె. మొదలఁ జిత్తశుద్ధి యది కలదేనిఁ దీ
ర్థమ్ములెల్లఁ బావనమ్ములగును
చిత్తశుద్ధిలేని చెనఁటుల కెట్టి తీ
ర్థములు వమ్మటంచుఁ దలఁపు మధిప! ౧౮౦

గీ. పట్టణములెన్ని! యూళ్ళెన్ని! పల్లెలెన్ని!
గంగయొడ్డునఁగల వటఁ గాఁపురంబు
లున్న కైవర్తక నిషాద హూణ యవన
ముఖ్యులకు నెల్ల దొరకునే ముక్తిపదవి. ౧౮౧

క. గంగోదకపానము సే
యంగానేకాదు గంగ కరిగి యచట ము
న్గంగానే కాదు మనం
బుం గావలె నిర్మలంబు మునులకు నైనన్. ౧౮౨

గీ. తీర్థవాసంబు కష్ట మాతీర్థములను
బాతకము కొంచెమేని యపారమగును
ఎచటఁజేసిన పాపమ్ము లెడలుఁగాని
తీర్థకృతమగు పాపము త్రెఁట వనఘ! ౧౮౩

గీ. సర్వతీర్థాటనముకంటె సకలభూత
దయయు సత్యంబు శౌచంబు దప్పకున్కి
యధిక ; మిది యున్నవారికి నఖిలతీర్థ
రాజములు ప్రతిపదమునఁ దేజరిల్లు. ౧౮౪

వ. ఐనను భవదీయంబగు సంప్రశ్నంబున కుత్తరంబు వినుము. నైమి
శంబును జక్రతీర్థంబును బుష్కరంబు ననునివి పుడమియందధి
కమ్ము లితర తీర్థమ్ములు లెక్కింప నలవిగా దనవుడుఁ బ్రహ్లాదుఁ

డా తీర్థమ్ము లాలోకింప సపరివారమ్ముగ వెడలి నైమిశంబుం బ్రవేశించి యచట స్నానదానాదికంబు లాచరించి యదిమొదలు తీర్థ సంసేవనంబు గావించుకొంచుఁ జనువాఁడు ముందట. ౧౮౭

—* ప్రహ్లాద నరనారాయణ యుద్ధము *—

చ. కనియె సరస్వతీనది నకారణపాతకహారివారిమ
జ్జనకృదపారతాపసవశంవదతీరవిరాజమానకుం
జనమదనూనసూనచయసౌరభవాసిత నీరజాతసం
జనితమరందపానవశసంకులనిత్యరణద్విరేఫముఁ. ౧౮౮

ఆ. వె. కాంచి యచట నర్హకర్మముల్ నెఱవేర్చి
తత్తటమ్ముపొంతఁ దరలి చనెడి
దైత్యరాజసుతుని దారి కడ్డమ్ముగా
నొకటఁ గాననయ్యె నొక్క మట్టి. ౧౮౯

వ. దానం గొన్ని నైకరూపమ్ములగు నంపగములం గాంచి 'పావనంబగు ఋష్యాశ్రమంబున వీని కవకాశంబేమని విచారించుచున్నెడ. ౧౯౦

సీ. దండ దండంబుఁ గమండలువ్రును దగ
నమ్ములపొదియు శరాసనంబు
నెదుట నింపెసలారఁ గృష్ణాజినమ్ముపై
యోగమ్మునైఁ గూరుచున్న మునులు
పరతత్త్వనిధ్యానపరులు నున్నతజటా
భారమ్ముచేఁ గప్పఁబడినవారు
గన్పట్ట దైత్యుండుఁ గడు నల్కతోఁ గను
లుదయదరక్తప్రభాయుక్తి దెలుప

ఆ. వె. నిట్టులనియె "నేల యీదంభ తపము ? ధ
ర్మమున కిదియె తెఱవు ? మునులె మీరు ?
తపము సేత విల్లు ధరియించు టెచటేని
ధరణిఁ గలదె దంభ ధర్ములార !" ౧౮౯

వ. అని పలుకుదైత్యేంద్రుంగని మందహాసమ్ముతో నెకసక్కెమ్ముగ నరనారాయణు లిట్లనిరి. మా తపంబు గొడవ నీ కేల ? యేము బ్రాహ్మక్షాత్రముల నిష్ణాతుల మైనకతన నిట్లుంటి మని యెఱుంగ రాదె, పోపొమ్ము మిన్నక విప్రవైరంబునకు రాకుము. ౧౯౦

చ. అన విని యాతఁ డిట్లను సహంకృతి మీఱఁగ "మందబుద్ధులా
ర ! నను గణింప కీవెడఁగుఁబ్రల్లదముల్ పలుకన్ దపంబు పెం
పున సుకృత ప్రచారమునఁ బోలుదురే నను ! సంగరంబు సే
యన సుదియేనిఁ జేయుఁడు రయమ్మున మీగరువంబు మాపెదన్."

క. అలుకమెయి నిట్లు దైత్యుఁడు
పలుకఁగ నరుఁ డిట్టులనియె బవర మొనర్పం
దలఁపేని రమ్ము తల వ్ర
య్యలు సేసెద ననుడు భ్రుకుటి యదర నసురయున్.

శా. హంకారమ్ము చెలంగ హస్తమున నిష్వాసంబుఁ గైకొంచు జ్యా
టంకారమ్మున దిగ్గజశ్రుతులు బీటల్ వాఱి పెంపేద ని
శ్శంకన్ బాణము దొడ్డి యేసె నరుఁడున్ జాపంబు చేఁ బూని సా
హంకారుం డయి తున్మెఁ దచ్ఛరము బాణాసమ్ముతో వమ్ముగన్.

ఉ. కొండొకవిల్లు పూని మునికుంజరు వక్షమునందు నేయ నా
తండును వాఁడికోలఁ గొని తద్భుజమధ్యము గాఁడ నేసె దై
త్యుండొగి సొమ్మసిల్లి మఱియుం బెనుతూపుల నమ్మునీంద్రు మై
నిండఁగ నేయఁ దుంచెఁ దపనీయశరమ్ముల వాని నన్నిటిన్. ౧౯౪

ఆ. వె. గర్జితములతోడఁ గాలాంబుదమ్ములు
గుములు గట్టి సోనఁ గఱియు పగిది
నరునిమీఁద దైత్యనాథుండు హేమపుం
ఖమ్ములైన యాశుగములు వఱపె. ౧౯౫

వ. ఇట్లు పరస్పరజయాకాంక్షులగు మునీంద్రదైత్యేంద్రులు ఉదర మ్మునఁ దత్సమాలోకనసమాగతామరీస్వయంగ్రాహ సముదితా నంద దుర్భరాయమాణమానసులు దివౌకసులు కుసుమంబులు గురిసిరి. ౧౯౬

క. ఇరువురుఁ బఱపెడిశరములు
నరుణునిమండలము గప్ప నంబరభూమీ
చరులగు నమరులు నరులును
జిరమట్టాడంగఁ గటికిచీఁకటి గప్పెన్. ౧౯౭

క. నారాయణమునియున్ దే
వారిశరాసనము నొక్క యాశుగమునఁ బెం
పారం దునిమిన దైత్యుఁడు
వారక యింక నొక్కవిల్లు వడిఁ గైకొనినన్. ౧౯౮

క. మరలన్ నారాయణుఁడా
శరాసనము ద్రుంచెఁ దునుమఁ జయ్యన నతఁడున్
బరిఘమ్ము నేసె నాతని
యురమున ; వ్రేటువడి యతఁడు నుక్కు పొసంగన్.

వ. ఒక్కవాఁడితూపున నప్పరిఘుంబు ద్రుంచె ; దైత్యుండు గద గైకొనుడు నయ్యదియుఁ దునియలుగా నేసి నేతాదృశంబగు ఘోరయుద్ధంబు దివినుండి దేవగంధర్వాదు లగ్గించిరి. నారదుండును దారకాసుర కుమారసంగరంబు పగిది వృత్రామ

రేందుస్రిల యుద్ధంబువడువున మధుమాధవుల బవరంబుచాడ్పున
నానందంబు సంధించెనని పర్వతునితోఁ బ్రశంసించె, నిట్లు సహస్ర
దివ్యవత్సరమ్ము లహోరాత్రమ్ములు ప్రహ్లాదునకును శార్ఙ్గా
జగవధరులగు నమ్ములకును బోరు ఘోరంబయ్యె నంత, ౨౦౦

సీ. శంఖచక్రగదాది సాధనంబులు నాల్గు
కరములఁ దనరార గళమునందు
వనమాల వ్రేలఁ బచ్చని పైఁడిపుట్టంబు
గట్టినదొర కారుకమ్ము గ్రమ్మ
పగిది వైకుంఠుండు ప్రత్యక్షమైనఁ బ్ర
హ్లాదుండు మది బత్తి పాదుకొనఁగ
బవరంబు మాని తత్పాదద్వయంబుపైఁ
బడి మొరఁగిన రమాపతియు నతనిఁ

గీ. గాంచి "వీరు మదీయులు గాన నీక
జేయు"లని తెల్ప దైత్యుండు సిగ్గుగొనుచు
ముగురకు నెరఁగి చనియె నమ్మునులు సూడ
బుండరీకాక్షుఁడును దిరోభూతుఁడయ్యె. ౨౦౧

క. అని చెప్పిన వ్యాసుం గని
జనమేజయుఁ డనియె "నిట్లు చనునే యని నె
క్కొని సేయఁగ నరనారా
యణ మునులకుఁ దపముకల్మి వ్యర్థముగాఁగన్. ౨౦౨

వ. వీ రేకతమ్మున నహంకారంబు వాయరు? కందమూలాశనంబుల
వనమ్ములం గృశించి యనేకదివ్యవత్సరమ్ములు తపంబు సాధించిన
యిమ్మహాత్ముల కింత యహంకారం బొప్పునే యనుడు వ్యాసుం
డిట్లను నహంకారంబు శరీరంబునకుఁ గారణం బట్టిశరీరధారుల

కహంకారంబు వాయుదు హరిహరాదులకు సయిత మహంకా రంబు దుస్తరంబు తొల్లి తద్దోషమ్మునన కాదె పురుషోత్తమునకు భృగుశాపమ్మున నానాయోనులందు జన్మంబు ఘటించె ననుడు జనమేజయుం డిట్లనియె. ౨౦౩

క. భృగుశాపము హరికిం గ
ల్గంగఁ గారణమేమి ? యతఁడు గలిగిన చోటుల్ ?
జగమున నెయ్యవి ? వినిపిం
పఁగదే యనుపాండవునకు వ్యాసుండనియెన్. ౨౦౪

వ. అట్లు ప్రశ్నించిన కయ్యమునర్చి పరాజితుండై నిర్వే దమ్మునఁ బాతాళంబును విరోచనసుతుండనునగు బలికిం బట్ట మ్ముగట్టి గంధమాదనమ్మునకుంజని తపము సేయుచున్నంత బలి యమ్మ్యమురుల జయించిన విష్ణుసహాయులగుచు వారబ్బలి నోడించి స్వస్థానం బేలికొనిరి. అమరపరాజితు లగు దైత్యులు తమ గురుండగు శుక్రాచార్యు పాలికిం జని యిట్లనిరి. ౨౦౫

శా. అంతేవాసుల మైన మమ్ము మరు లత్యంత పరితాపమ్మునన్
వంతం బొందఁగఁ జేయుచుండి రిడ సంభావ్యంబు గాదేనిఁ బ్రా
ణాంతం బా నిఁక మాకు; నీమహిమచే నాదిత్యులం గెల్చి మా
వంతం బాపఁగదే సురారులను బ్రోవం జూడవే భార్గవా !

క. గురుఁడవు బహుమంత్రవిదు
త్తరుఁడవు మాపాలి దైవతము వీసురలం
బరిమార్పకున్న బ్రతుకం
దరమే? పరమాపదబ్ధి దరిఁజేర్పఁగదే. ౨౦౭

క. అనుచుఁ గావ్యుఁడు దైత్యుల
కును నభయం బిచ్చి నెమ్మిఁ గొలిపినఁ దద్వా
ర్తను విని సుర లిందు ్రనితో
ననిరి భయం బెదకు సందియమ్ము ఘటింపన్. ౨౦౭

వ. శుక్రమంత్రప్రభావమ్మునఁ గలిమి ననురులు మన కజేయులగుదురు కాన నేఁడ చని యనిం దెగటార్చి హతశేషులం బాతాళమ్మున కనుచుట కర్జంబనిన నింద్రుం డనుమతించె. సురలును బరాక్రమించి యసురులం దాఁకిన వారు సంత్రస్తు లగుచు శుక్రుని శరణుఁజొచ్చిరి. అతండు మంత్రప్రభావమ్మున సురలం దఱిమి యసురుల కిట్లనియె. ౨౦౮

సీ. అసురులు ! వినుఁడు సరసిజాతభవుఁడు దా
మును నాకుఁ బేర్మిఁ జెప్పినవిధంబు
సురపక్షపాతియై హరి దైత్యుల నడంచు
ననియె నప్పలుకు తథ్యమ్ముగాఁగ
మనహిరణ్యాక్షు నవ్వనజాతనేత్రుండు
కోలరూపముఁ దాల్చి క్రొవ్వడంచె
నరసింహరూపమ్మున హిరణ్యకశిపుని
సమయించె నాతఁ డసమబలుండు
గీ. మంత్రబలమునఁ జేసి యమరుల గెల్తు
నీశ్వరునిఁ దృప్తుఁ జేసి యభీష్టసిద్ధి
నంది వచ్చెద మీ రందఱంతదనుక
నాపదల కోర్చికొనుఁడన నసురు లనిరి. ౨౧౦

క. బలియురు ద్రెళ్లిరి యిఁక దు
ర్బలులము యుంటిమి సుపర్వబలముల యెదుటన్

నిలువఁగ నోపుదుమే ! యీ
చులుకఁ దనమ్మునకు నోర్చి శుక్రాచార్యా ! ౨౧౧

వ. నావుడుఁ గావ్యుం డిట్లనియె. మహాదేవు వలన నేను మంత్ర విద్యాభ్యాసం బొనర్చి వచ్చునంతకు మీరలు వనమ్మున శమద మాన్వితులై తాపసుల పగిది నుండునది. ౨౧౨

తే. గీ. దేశకాలబలమ్ములు తెలిసి సామ
దాన ముఖభేదము లెఱింగి తాను యుక్తిఁ
జేసి పగఱకుఁ బరిచర్య చేసియైన
నశుభ కాలంబు గడవఁద్రోయంగవలయు. ౨౧౩

ఆ. వె. పగఱ గెల్వఁజాలు బలముగల్గిన నాఁడు
పగఱతోడఁ బోరు పఱుపవలయు
లేనినాఁడు సామదానాద్యుపాయమ్ము
లాచరించి యశుభ మాఁగవలయు. ౨౧౪

క. కావున మీరలు మీమీ
తావులకుంబోయి సామదానాదులఁ గా
ర్యావసర మెఱిఁగి కపట
ప్రావీణ్యము దాల్చుఁడేను వచ్చెడి దనుకన్. ౨౧౫

వ. అని యొడం బఱిచి శుక్రుండు తపంబునకుఁ జనియె, నసురులును దమ వంశవృద్ధగు ప్రహ్లాదుపాలికింజని యిట్లనిరి. ౨౧౬

ఉ. తాతవు సత్యవాదివి సధర్ముఁడ విచ్చట నచ్చటన్ దట
స్థాతవు ప్రత్యయమ్మునెడఁ దద్దయుఁ బెద్దవు నీవు నిర్జర
వ్రాతమువంకఁ బోయి యసురప్రకరంబు కరంబు మీయెడన్
బ్రీతిఁ జరించుఁ జాపము ధరింపదు కేల నటంచుఁ దెల్పుమా.

క. అని వేఁడినఁ బ్రహ్లాదుం
డనిమిషు లున్నెడకు నరిగి యసురులు వారితో
"ననిఁ జేయుము చాపము చే
తను దాల్పుము వైరబుద్ధి దలఁప" మటంచున్. ౨౧౮

క. తెలుపు మనిరి వారలు వ
ల్కలములు ధరియించి వనములం దాపసులై
తలఁపులనైనను వైరము
దలఁపక యుండుటదియెల్లఁ దథ్యంబనుచున్. ౨౧౯

వ. నిర్జరులును దదీయవచనప్రత్యయమ్మునం గతమత్సరులై యుండి రంత రక్కసులు దంభతపోనియమమ్ము లాచరించుచుఁ గశ్యపాశ్రమమ్మున సుఖం బుండి రిట శుక్రుండు మహాదేవుంగుఱించి తపమ్మొనర్చిన నమ్మహాత్ముండు దృగ్గోచరుండుగా నమస్కరించి యిట్లనియె. ౨౨౦

క. సురలకుఁ బరాజయమ్ము న
సురులకు విజయంబొనర్చు శుభమంత్రము నా
దరమున నా కిమ్మనవుడుఁ
బరమేశ్వరుఁ డిట్లు మదిని భావించె వెసన్. ౨౨౧

క. క్రతుభుక్కులయెడ నితఁడప
కృతి సేయఁ దలంచె వారి కేగతినైనన్
గతికల్పించు టుచితమని
యతిదయ గలఁ డగుచు నిట్టులనె నెప మొదవన్. ౨౨౨

క. తలక్రిందుగఁ బొగఁ ద్రావుచు
నలయక వేయేండ్లు కడు నియమమునఁ దపముం

బలువిడిఁ గావించిన నీ
తలఁపు న్నెఱవేర్పఁ బొమ్ము తడయక శుక్రా! ౨౨౩

వ. శుక్రుండును దదాజ్ఞప్తవిధానంబున ధూమపానం బొనర్చుచు నధోముఖుండై తపంబు సేయుచున్నంత సమరులు కర్ణాకర్ణికగా నీవృత్తాంతమ్ము విని దంభతాపసులగు రక్కసులపైఁ గవిసిన వారు చేయునది లేక శరణుఁ జొచ్చిన వారిట్లనిరి. ౨౨౪

గీ. పశుపతి గుఱించి మేటితపం బొనర్చి
మంత్రసిద్ధిని గైకొని మమ్ము గెల్వ
వలయునని యెంచి గురునటు పంచి కపట
మగు గతిఁ జరించు టదియు మా కరయరాదె? ౨౨౫

వ. మీరు నిక్కపుశరణార్థులుగారు గాన మీ యుక్కడఁగించెద మనుడు నసురులు భీతులై కాలికొలఁది పలాయమానులగుచుఁ గావ్యమాత నభయంబు వేఁడిరి. సురలును వారి వెఱుందన చనువారు ముందఱ శుక్రజననీరక్షితులగు వారింగాంచి యాపెచే వారితులయ్యు బలాబలమ్ములు గణింపక చుట్టుముట్టిన నామె నిద్రయను నొకదేవత నంపించె నదియుఁ గడఁగి మోహయుత్తులం జేయ నింద్రుండు భయంబడి విష్ణుశరీరమ్మునం డాఁగిన నిద్ర యట కరిగి క్రోధతామ్రనన యగుచు నిట్లనియె. ౨౨౬

క. ఓరి దురాత్మక! విష్ణు శ
రీరమునఁ డాఁగినంత మృత్యువు నిన్నుం
జేరక పోవునె, వీని శ
రీరముతోఁ గూడ నిన్ను బ్రమింగెద ననుచుఁ. ౨౨౭

వ. కవిసిన నింద్రుండును భయమందుచు మహాత్మా! తపోబలమ్మున గరీయసియు ననివార్యయునగు నిక్కావ్యమాతం గడుకొని వైళమ

సంహారింపమి మన కుపద్రవంబు వాటిల్లు నని హారిం బ్రార్థించి నంత భక్తవత్సలుండగు ముకుందుండు చక్రింబుం బ్రయోగించిన,

క. భగభగ మని మంటలు గ్రి
మ్మంగనాచక్రంబు గావ్యమాతశిరమ్మం
దెగనటికె నిద్రితోడఁన్ ;
విగతజ్వరులైరి దివిజవీరులు నంతన్. ౨౨౯

—* భృగువు హారిని శపించుట *—

క. భృగుసతి తమచే మృతిఁ బొం
ద గదాధరవజ్రధరులు తద్దయు మదిలో
మగువం జంపినకతమున
భృగుఋషి శపియించు ననుచు భీతిలుచుండన్. ౨౩౦

క. సురనాథుని కారణమున
హారి తనమగువను వధించె ననువార్తను ని
ర్జరవైరులు దెల్పగ విని
కరమాక్రోశించి భృగువు కడు నల్క మెయిన్. ౨౩౧

వ. వచ్చి సరోజాక్షునిం బిలిచి “ పెక్కు యోనులలం బుట్టి జనన మరణదుఃఖమ్ము లనుభవించుచు వగలఁ బొగులు ” మనిశపించె ననుడు జనమేజయుండు భృగుమునికి మరల విధురత్వంబు వాసిన కత యెఱింగింపవే యని యడిగిన ద్వైపాయనుం డిట్లను. అట్లు శపియించి భృగుమునియుఁ దన కమండలూదకం బంజలి పుటమ్మునం దాల్చి యిట్లనియె. ౨౩౨

ఉ. ఏను దపోబలాన్వితుఁడ నేని మదీయ కమండలూదకా
హీనబలంబు పెంపునన యీ వనితామణి యింతలోన స

ప్రాణయగుల్ దపోనియమవర్తనధర్మముబుతమ్ములల్ గనుం
డో నరులార ! దైత్యసురయోధవతంసములార ! యంచొగిల్.

క. తలయును మొండెము నేక
స్థలమునకుం జేర్చి మంత్రజల మొక్కింతం
జిలికిన మాత్రన యా భృగు
లలనామణి బ్రతికె దైత్యులల్ ముద మెనయల్. ౨౩౪

వ. ఇట్లు లబ్ధజీవయగు కళత్రముం గైకొని యతండుండె, నింద్రాది
సురలు తాపసుండగు శుక్రునివలని భయమ్మునకు వగచుచుఁ
దమతమ యధిష్ఠానమ్ములకుంజనిరి. ఇందుండు తన కూఁతురగు
జయంతిం జూచి యిట్లనియె. ౨౩౫

క. తనయా ! నిను శుక్రాచా
ర్యున కిచ్చితి గంధమాదనోర్వీధర మం
దు నతండు తపంబున నుం
డినవాఁ డన్నగమునకుఁ గడిందిరయమునన్. ౨౩౬

క. చని యతని మనమునకు వ
చ్చిన యుపచారములఁ దనిపి చేతఃప్రియుగా
నొనరించుకొని తపోనియ
తి నడంచి మదీయభయము తీర్చుము తల్లీ ! ౨౩౭

చ. అను తనతండ్రి మాట వినయమ్మున నూఁకొని యాజయంతి గ్ర
క్కున విబుధారిదేశికుఁ డకుంఠితలీల వసించు గంధమా
దనమున కేగి యచ్చట నుదారగతిం దపమాచరించు నా
తనిఁ గనియెన్ మహామహుని దత్త్వవిచారపరాయణాంతరున్.

సీ. శ్రమమునఁ దోడఁగుఘర్మజలంబు వోవంగఁ
గదళీదళమునఁ జక్కంగ విసరి
మధురసుగంధి నిర్మల వారి పూరంబు
తివిరి పానార్థంబు దెచ్చి యిచ్చి
భగభగ మను పట్టపగ లింటియొండ పైఁ
బడకుండ వసనంబు గొడుగుఁ జేసి
యాఁకటికై పక్వమైన వన్యాహార
ములను సంపాదించి ముదము గొలిపి

గీ. దర్భలు చివుళ్ళుఁ బఱచి మెత్తందనమ్ము
దవిలి యెసకం బొనర్చు తల్పంబు గూర్చి
దేశకాలమ్ము లెఱిఁగి నిదేశ మెఱిఁగి
కవికి శుశ్రూష చేసె నక్కన్నెమిన్న. ౨౩౯

గీ. తత్తదుపచారములను సందర్భ మెఱిఁగి
తపసి సేవించెఁ గాని యత్తన్వి శాప
భయముమెయి మదికి మదనభ్రాంతి గలుగఁ
జేయు శృంగారచేష్టలు సేయ దాయె. ౨౪౦

వ. మఱియు సుభాషిణియగు నజ్జయంతి సమయానుకూలంబుగఁ బ్రీతిజనకమ్ములగు వచనమ్ముల నుతించుచు మునిమనోవృత్తి దెలియ నాతురుండగు తన తండ్రి యనిపిన దూతల నేకతంబ విదితవృత్తాంతులం జేసి యనుపుచు బ్రహ్మచర్యపరాయణయై యనేకవత్సరమ్ము లద్దైతేయగురునకు శుశ్రూష కావించు చున్నంతఁ బరమేశ్వరాజ్ఞప్తప్రకారంబుగ నక్కావ్య నియమమ్మునకు సహస్రవత్సరమ్ములు సంపూర్తియగుటయు మహాదేవుండు కరుణాతరంగితాంతరంగుండగుచుఁ బ్రత్యక్షమై వరంబు

వరింపు మనవుడు సురవిజయంబు మున్నగు నభీష్ట వరమ్ములును
తత్సాధకమ్ములగు మహామంత్రమ్ములును నర్థించిన నతం డను
గ్రహించి యంతర్హితుం డగుడు భార్గవుండు సమీపవర్తినియు
శుశ్రూషాపరాయణయునగు జయంతింగాంచి మందస్మితమధుర
భాషణమ్ముల నిట్లను. ౨౪౧

చ. ఎవతెవు నీవు? నీకు కుల మెయ్యది? నీ జనకుం డెవండు? ము
గ్ధవు నవయౌవనంబు కలదానవు మత్పరిచర్య సేయుచుం
టివి కత మేమి తెల్పుము? కడిందిమనోరథమైన సిద్ధిం జెం
దు వర మొసంగువాఁడఁ బరితుష్టి యొనర్చితి నీవు మా కొగిన్.

క. నీ మనమునఁ గల కోరిక
మే మెఱుఁగుదు మైనఁ దెలుపుమీ యన నా సు
త్రామతనూజ మనమ్మున
నామోదము చెంది లజ్జితానన యగుచున్ ౨౪౩

క. దేవవిభు కూఁతుర జయం
తావరజన్మను జయంతి యందురు నన్నుం
గావించె భవదధీనగ
దేవవిభుఁడు నాఁటఁగోలె దేవరయొద్దన్. ౨౪౪

క. పరిచర్య సలుపుచుంటిని
గర మనురాగంబు గలదు గార్హస్థ్యవిధిన్
దిరముగ నిను సేవింపఁగఁ
గరుణించి పరిగ్రహింపఁగాఁదగు ననుడున్. ౨౪౫

క. పరికిఁ గనుపడకుండఁగ
మాయాగమవిహిత సూత్రమార్గమ్మున సం

చార మొనర్చుచుఁ గ్రీడా
పారమ్యము గొనెద నొక్క పదివత్సరముల్. ౨౮౬

ఆ. వె. అని జయంతితోఁ గృహమ్మున కేతెంచి
పెండ్లి యాడి మిగులఁ బేర్మి నసర
దేవదానవుల కదృశ్యుఁడై తన్మయ
త్వంబుఁ జెందియుండె భార్గవుండు. ౨౮౭

వ. అసురులును గురుండు తపస్సిద్ధిం బడసి వచ్చిన తెఱంగు విని,

క. చని శుక్రునిఁ గానక చిం
తను గొని వెదకుచు మనంబు తద్దయు సందే
హనిమగ్నము గాఁగఁ దమ భ
వనములకుం జనిరి త్రిదశభయశంకితులై. ౨౮౮

క. దైతేయగురువరుఁడు తన
కూఁతుం గొని సర్వదృష్ట్యగోచరుఁడై క్రీ
డాతతుఁడై యుండుట పురు
హూతుఁడు తనయాత్మ నెఱిఁగి యుత్సాహమునన్.

క. తమగురువగు గురునిం గని
యమరుల కుపకృతి యొనర్చునవసర మిది గా
న మహితభవదీయమతిమ
హిమ సూపఁగ వలయునంచు నెంతయు వేఁడన్. ౨౯౦

క. వాచస్పతియును దన మా
యాచాతుర్యమునఁ జేసి యంతట దైతే
యాచార్య రూపముం గొని
వే చనె నవ్వారియెడకు వేడుక మెఱయన్. ౨౯౧

వ. రక్కసులును దమ యాచార్యునిరాక విని యెదుర్కొని నమస్క
రించి ముకుళితకరకమలులై యున్నంత నమ్మాయాశుక్రుండగు
వాచస్పతి వారలంగని కుశలంబడిగి యిట్లనియె. ౨౫౩

చ. పురమథనుం దలంచి తపముం బొనరించితి ధూమపాయినై
వరము వరించితిన్ ద్రిదశవర్గము గెల్వఁగఁజాలు మంత్రముం
గిరిశుఁ డనుగ్రహించె నిఁక గీటడఁగింతము నిర్జరాళికిం
బరమహితుండు చక్రికిని బ్రాణభయంబు మదిం గలంపఁగన్.

క. హరుఁడును నా కొసఁగిన మం
త్రరాజములు మీ కొసంగెదను గ్రక్కున ని
ర్జరుల వలన భయపడకుఁ డ
సురులార! యటంచుఁ గపటశుక్రుఁడు గడఁకన్. ౨౫౫

క. అభయం బొసఁగిన రాక్షసు
లు భయము విడనాడి సౌఖ్యలోలుపులై స్వీ
య భవనము లేగి రనఁ గురు
విభుఁడున్ ద్వైపాయనమునివిభునకు ననియెన్. ౨౫౬

గీ. కపటశుక్రాకృతినిఁ గాంచి ఘనుఁడు గురుఁడు
చేసిన విశేష మేమి యచ్చెరువు కాదె!
సకల మెఱిఁగిన యాతఁ డిట్టి కృతి కియ్య
కొనఁగ నన్యులు సత్యవర్తనులు గలరె! ౨౫౭

క. ఛలకర్మవర్తనుని గురు
నలఘుం డనుటెట్టు! లమరులన సత్త్వోద్భా
తులు తద్గురుఁ డిట్లయినన్
గల రాజసతామసులకుఁ గలుగునె ఋతముల్. ౨౫౮

గీ. హరివిరించిదేవేంద్రముఖ్యామరులు మ
హాత్ములు మునీంద్రులును నసత్యప్రవర్త
నంబునై కొన్న, మనుజులు నాఁగ నెంత ?
సత్య మన నెద్ది ? యద్దానిచర్య యెట్లు ? ౨౫౯

చ. గురుఁడును వామదేవుఁడు నకుంఠితతేజుఁడు గాధిపుత్రుఁ డు
ద్ధురుఁడు వసిష్ఠుఁడున్ మొదలు తొల్లిటిమాన్యులు పాపకృత్యసు
స్థిరమతులైరి యింద్రుఁడును శీతకరుండును వహ్నియున్ వెసన్
బరతరుణీమణీసురతభాజనులైరిఁక ధర్మ మెట్టిదో ! ౨౬౦

గీ ఎఱుక లేక చరించెడి హీనమతుల
కెల్ల జ్ఞానోపదేశంబు నీఁ గడంగు
పెద్ద లెల్లన నెవ్వరీపృథివియందు
సదుపదేశకులగు సత్యసంధు లనఘ ! ౨౬౧

చ. హరిహరు లేమి పద్మభవనాకవిభుప్రముఖామరుల్ మునీ
శ్వరులు మఱేమి రాగమను సంద్రమునం బడియున్నవార లో
నరవర ! రాగి యయ్యును గనంబడు నేరుపుకల్మి నొక్కొకం
డరయ విరాగి నా, వికృతు లబ్రమె దేహము దాల్చువారికిన్ !

చ. అరయఁ బరోపదేశకృతులందు సమర్థుల కాని యెందు నొ
క్కరుఁడును గానరాఁడు తన కార్యముపట్ల వివేకి దేహముం
బొరసిన వారికెల్లరకు మోహము తప్పమి నిక్కవంబు సం
సరణపుఁజర్య లీగతి నెసంగు ననాదిగ నెల్లవేళలన్. ౨౬౩

చ. హరి యొకవేళఁ దాఁ దపమునందుఁ జరించు మఱొక్కవేళ య
జ్ఞరతి నెసంగు నొక్కపుడు సాగరజావశుఁడై చెలంగు సం

గరపరుఁడో నొకప్పు డొకకాలమునఁ జయమందు వేఱొక
ప్పరయఁ బరాజయమ్ము గొను నన్నియు సంసృతిరీతులౌఁగదా.

గీ. హరిహరవిరించిముఖ్యు లౌనమరులు ముని
వరులుఁ దమతమయాయువు వఱలుదనుక
నెగడి మృతిఁ జెంది మరలఁ బుట్టఁగలవార
లెఱుఁగు మిట సందియ మొకింతయేని వలదు. ౨౬౫

వ దేహవంతున కెన్నటికినిఁ గామక్రోధాదికం బెడతెగదు. సంసా
రంబు తత్సంకులంబు దాని నతిక్రమించుపురుషుండు మృగ్యుండు
సంసారభీతుండు దారపరిగ్రహణంబున కేని నొల్లఁడని చెప్పి
మఱియు. ౨౬౬

చ. గురుతరుణీమణిం గలసెఁ గోరికమై హిమరశ్మి; భ్రాతృసుం
దరి రమియించె నగ్గురుఁడు తక్కురులఁ గణియింపనేల సం
సరణము రాగలోభమదసంకుల మయ్యెడ సంచరించు నొ
క్కరుఁడును ముక్తికేగఁ డటుగానఁ ద్యజింతురు దాని నుత్తముల్. ౨౬౭

గీ. కాన సంసారమున లేశమేని సార
మరయక త్యజించి జగదంబ ననుసరింప
వలయు నే యంబమాయలోఁ బడి జగంబు
మదిరఁ జవిగొన్నభంగి నున్మాద మొనయు. ౨౬౮

చ. చిరమతి నంబికార్చనము సేసి గుణంబుల త్రుళ్లడంచు న
న్నరుఁ డెనయుఁ విముక్తిని జనస్తుతమౌ నరజన్మ మెత్తి శాం
కరిని యజింపఁడేని కడఁకం దుదిదాఁకను నిచ్చె నెక్కు సు
స్థిరత యొలర్పమిం బడినతీరగు వానివిధంబు భూవరా! ౨౬౯

క. కావున నప్పరదేవీ
సేవామతులైన వారు జీవన్ముక్తి

(శ్రీ) వెలయుచు రనపుడు, " గురుఁ
డావిధి శుక్రుఁడయి వంచనాయత్తమతిన్. ౨౭౦

వ. ఏమి చేసె" నావుడు జనమేజయునకు వ్యాసుం డిట్లనియె.

గీ. కపట మెఱుఁగక శుక్రునిగాఁ దలంచి
యమరగురువాక్యములఁ గడు నాస్థఁ దవిలి
దైత్యు లున్నెడ శుక్రుఁడు తాఁ దలంచెఁ
దనదు శిష్యుల నార్తుల దయ దలిర్ప. ౨౭౨

క. అమరు లొనరించు బాధల
శ్రమంపడుచు సారె నాదురాకకుఁ జింతా
భిముఖతఁ గుందెడి శిష్యుల
నమలినబుద్ధులను జూచు టర్హమకాదే. ౨౭౩

— * శుక్రుండు దైత్యులకడకు వచ్చుట * —

వ. అని జయంతిం గాంచి తరుణీ! యేను సమయంబొనర్చిన వత్సరమ్ములు పదియు సంపూర్తిఁ జెందెఁ గావున నేఁడు శిష్యులం గనఁబోయి కొండొకకాలమ్మునకు మరల నిన్నుం గనవచ్చెద నస్మత్పుత్రులు దేవతలయందఁ సంక్రమింపంగలరు నావుడు జయంతి వల్లెయనిన నతండు తనయాజ్యులకడ కరుదెంచువాఁడు ముందట, ౨౭౪

మ. కనియెన్ దైత్యులయొద్ద వేదమతమున్ ఖండించుచున్ జైనవ
ర్తనమే శ్రేయ మటం చహింస మిగులన్ ధర్మంబటంచుం బలా
శనసక్తుల్ పశుహింస ధర్మమనుచున్ శాసించి రంచున్ గ్రమం
బున బోధించు గురున్ స్వకాకృతిధరున్ బొంగారుకోపమ్మునన్.

చ. గురుఁడఁట! సర్వశాస్త్రములకుం దెరువౌ నఁట! పాపబీజ లో
భరతి నసత్యవాక్యములు పల్కి సురారుల మోసపుచ్చు సు
స్థిరమతి నున్నవాఁడఁట! యిసీ! కడుఁబాపపులోభ మెంతయుం
నరకపుఁద్రోవ దాని గనినం నరుఁ డెప్పని జేయకుండునే.

క. అని దైత్యులఁ గని యెలనగ
వున నిట్లను "నాదురూపు వొరసిన కపటా
త్ముని గురునిఁ దెలియ నేరక
యనఘులు వంచింపఁబడితి రకటా! మీరల్. ౨౭౭

గీ. ఏను నిక్కపు శుక్రుఁడ నితఁడు దాంభి
కుఁడు మదాకృతిఁ బొరసిన గురుఁడు నమ్మఁ;
డితని పలుకుల నాస్థ మీ రేనయఁ బోకుఁ"
డనిన దైత్యులు సంభ్రాంతులైరి పిదప. ౨౭౮

వ. బృహస్పతియు సంశయడోలాయమానమానసుల రక్కసులఁ
గాంచి విశ్వాసార్హంబుగ నిట్లను. ౨౭౯

ఉ. దానవులార! నమ్మకుఁ డతం డమరప్రియ మాచరింపఁగా
లోనఁ దలంచి మిమ్ములను లోభమునం గికురింప వచ్చినాఁ
డేను భవన్నిమిత్తమున నీశునిఁగొల్చితి విద్యఁగొంటి ని
ద్దానికతమ్మునం సురలదర్ప మడంతురు మీర లొప్పుగం.

క. అను కపట శుక్రవచనం
బున మోహితులగుచు దనుజపుంగవులాశు
క్రుని నమ్మరైరి కపటం
బునఁ బడువారలు యథార్థమును గనఁగలరే. ౨౮౧

క. పది వత్సరముల నుండియుఁ
బదిలముగా విద్యఁ గఱపు పరమగురుని బల్
సదయునిఁ గాదననేర్తు మె
మదిలో నెఱిఁగితిమి నీదు మాయల నెల్లన్. ౨౮౨

వ. పొమ్ము పొమ్మని యనాదరించిన శుక్రుండు కోపించి మీరు ప్రియంబు గోరినయథార్థవక్తనగు నన్నవమానించితిరి గావునఁ బ్రణష్టసంజ్ఞులై పరాభవమ్ము నొందుదురుగాక యని శపించి వెండియు, ౨౮౩

క. నను నవమానించినఫల
మును వైళమ పొందఁగలరు మునుకొని యీతం
డొనరించినకపటం బది
యును నప్పుడ తెలియు నంచు నొగి నతఁ డరిగెన్.

గీ. దైత్యులకు శుక్రశాపంబు దవులు టెఱిఁగి
శక్రుకడ కేగి యలబృహస్పతి రయమున
శాపహతులగు దైత్యుల సంహరింపఁ
దివురు మన సంతసించె నద్దితిజవైరి. ౨౮౪

వ. దేవతలును యుద్ధసన్నద్ధులైరి. అంతట రక్కసులు చింతాక్రాంతులై యిట్లు వితర్కించిరి.

చ. తెలియక భ్రాతృభార్యరతిఁ దేలిన పాతకు మాయఁ జిక్కి ని
ష్కలుషు గురుం ద్యజించి యిటు శాపహతిం గనినట్టి బుద్ధిహీ
నుల మనలన్ జయింపఁగ మనోగతి నెంచి సురల్ రణేచ్ఛ వెం
పలరఁగ నున్నవార లకటా! మన కిప్డు సహాయు లెవ్వరో.

గీ. మనల వంచించి చనియె నమ్మాయగురుఁడు
దైత్యగురునకు నెప్పాట దయ యొసంగు

ననుచుఁ బ్రహ్లాదుఁ గలిసి చయ్యన గురువరు
కడ కరిగి పాదములకు మ్రొక్కఁగ నతండు. ౨౮౯

మ. కడుఁ గోపమ్మునఁ గాంచి పల్కు "హితముం గావింపఁగా నున్న నా
యెడ విశ్వాసము లేక ప్రల్లదము లెన్నో నాడి యిచ్చోటి కి
ప్పుడు రాఁ గారణమేమి! సత్వరగతిం బో రాదె యవ్వంచకుం
డోడయండై యుపకారమున్ సలుపలేఁడో! మీకు నిష్పట్టునన్.

వ. నావుడుఁ బ్రహ్లాదుం డనునయవచనమ్ముల నిట్లను. మహాత్మా!
యస్మద్ధితమ్మున కీవు తపం బొనరింపఁ జనినమీఁద నమ్మాయి
కుఁడు భవద్వేషంబు దాల్చి మమ్ము మోసపుచ్చె నజ్ఞానదోష
మ్మున నేము కల తెఱం గెఱుంగక నిన్నాడిన ప్రల్లదమ్ములు
సైరించి మమ్మనుగ్రహింపుము. ౨౯౦

చ. తెలియక చేయుతప్పులను ధీవరులొప్పి సహింతురి మౌనివ
ర్యులు క్షణకోపు; లగ్గలపుఁగ్రోధమునన్ శరణార్థులన్ విడం
దలఁచుట న్యాయమయ్య! మమతన్ మముఁ గైకొనకుంటివే రసా
తలమున కేగువార మిది తథ్యము నావుడు శుక్రుఁ డిట్లనున్.

క. కనుగొంటి జ్ఞానదృష్టిం
గొని మీ యాథార్థ్యమెల్లఁ గూర్మిమెయిన్ మి
మ్మనురక్షింతు రసాతల
మునకుంజన నేల మానమును విడనేలా? ౨౯౧

వ. బ్రహ్మవలన మున్ను నావినిన రహస్యం బొకండు గల దవశ్యము
గాఁదగుశుభాశుభమ్ముల నొక్కని కడ్డ నశక్యంబు దైవంబుకతన
బలహీనులగు మీర లిప్పుడు దేవతల కోపాటించి పాతాళమ్మున
కరుగునది. ఇంతదనుక దైవసాహాయ్యమ్మునం జేసి మీరు

త్రిలోకరాజ్య మనుభవించుచుండఁ బది యుగమ్ముల నుండి రాజ్యపదభ్రష్టులగు దివిజులకు నేఁటికి భోగకాలం బయనించె. సావర్ణికమన్వంతరమ్మున భవత్పౌత్రుండగు బలి త్రిలోకవిజయం బొనరింపఁగలఁడు. మున్ను హరి వామనరూపమ్మున నీ మనుమని రాజ్యమ్ము హరించునప్పుడు " సావర్ణిక మనువుకాలమ్మున నీకు నింద్రత్వంబు గలుగు " నని వచించె; నది మొదలు బలి గూఢరూపమ్మునఁ బ్రవర్తించువాఁ డొక్కయెడ గార్దభరూపమ్మున నొక శూన్యాగారమ్మున నింద్రునకుం గన్పట్టిన నతం డతని నెఱింగి యిట్లను. ౨౯౩

క. దానవులకెల్ల భర్తవు
ధీనిధివి జగమ్ములకు నధీశుఁడవగు నీ
కానే! గార్దభరూపం
బూనుట; యి ట్లేల భీతి నొదిగెదు చెప్పుమా. ౨౯౪

వ. నావుడు బలి యిట్లను. ౨౯౫

చ. జలచరరూపమునుం గొనఁడె సారసనేత్రుఁడు! బ్రహ్మహత్యమై
బలమఱి నీవు గూఢముగఁ బంకజమందు నడంగవో! తగఁ
దలఁపుము కాలశాసనము దాఁటఁగ నెవ్వఁడు శక్తుఁ! డేనునుం
దలఁకి ఖరాకృతిం బొరసి దైవగతిం జరియింతు నీగతిన్. ౨౯౬

వ. ఇట్లు వార లన్యోన్యమ్మును సంభాషించుకొని దైవమ్ముకతన సర్వమ్ము ప్రవర్తించుట యెఱింగి తమతమ పొందుపట్లకుం జనిరి.

క. కావునఁ గష్టసుఖమ్ములు
దైవాధీనము లటంచు దైత్యగురుఁడు వి
ద్యావిదునకుఁ బ్రహ్లాదున
కీ విధి నెఱిగింప నాతఁ డెఱిఁగి తనంతన్. ౨౯౭

వ. దైత్యులం గాంచి యిట్లను, నిప్పుడు కాలానుకూల్యంబు లేమి మనకు సంగరంబున జయంబు దుర్లభమ్మగుట మిన్నకుండుట శ్రేయంబు నావుడు మదగర్వితులగు రక్కసు లిట్లనిరి. ౨౯౯

చ. దైవ మనంగ నెట్టిదగు దానిని జూచినవాఁ డెవండు కా
ర్యావసరంబుపట్ల నలసాత్ములు పల్కెడిరీతి గాక మా
కీ వోడయండవై నిలిచితేని క్షణమ్మునఁ దున్మకుందుమే
దేవతలం? గడంగు మిఁకఁ దెంపరివై యరులన్ హరింపఁగన్. ౩౦౦

వ. అనినఁ బ్రహ్లాదుండు సేనాధిపత్యంబుఁ బూని యనికి సురలం బిలిచిన నింద్రపురోగములై వారును బోరితంబునకుఁ గట్టాయితం బైరి. ౩౦౧

క. సురపతికినిఁ బ్రహ్లాదున
కు రణం బటిముటి నెసంగె ఘోరమ్ముగ వ
త్సరములు నూఱు గతించెను
బరమాశ్చర్యంబు వోడమెఁ బైవారనకున్. ౩౦౨

వ. పిదప నెట్టకేలకు దైత్యులు జయంబంద నిందు్రండు వాచస్పతి యానతిం గొని జగదంబిక నిట్లు నుతింపఁ దొడఁగె. ౩౦౩

సీ. శూలధారిణి! నిత్యసుఖదాత్రి! శంఖచ
క్రగదాది కాయుధరాజమాన
హస్త! మహామాయ! యఖిలజగద్ధాత్రి!
దశతత్త్వరూపిణి! తల్లి! పంచ
కోశ సంస్థాయిని! కుండలినీరూప!
దీపశిఖాత్మిక! దేవి! దివ్య
శక్తి! బింద్వాత్మ! పుచ్ఛబ్రహ్మరూపిణి!
యానందకలిక! వేదాంతవేద్య!

గీ. దానవులతోడఁ బోరాడి దర్ప మెడలి
దీనదశఁ జెందియున్న మా దిక్కెకింత
సహజశీతలదృష్టిప్రసార మొసఁగఁ
జేసి రక్షించి ధన్యులఁ జేయఁ దగదె ? 304

—* సురలు దేవిని స్తుతించుట *—

గీ. సహజసుఖవంతులకుఁ గడు సౌఖ్యమబ్బు
దుఃఖితులకెల్ల దుఃఖముల్ తొలఁగిపోవు
ముక్తిఁ గోరినవారికి ముక్తి గల్గుఁ
దల్లి ! నిన్ను మనమ్మునఁ దలఁచిరేని. 305

గీ. సృష్టిరక్షాప్రళయములుసేయు నీదు
చరిత మెఱుఁగరు బ్రహ్మాదిసకలసురలు
పాపసంసారతారకపటిమ నలరు
త్వత్పదమ్ములు గొలుతురు ధన్యమతులు. 306

క. శరదిందుముఖులు చామర
లిరుప్రక్కల వీవ శిబిక లెక్కి మహాసుం
దరసాధ్వి నోలలాడెడి
నరులెల్లఁ బురాభవమ్మున న్నిభ క్తుల్. 307

క. కరులు గలవారు విలస
త్తరుణీసంభోగనియతతారుణ్యమదో
ద్ధురత గలవారు నరవర
పరిచితచరణులును నీదుభక్తులు తల్లీ ! 308

చ. అని నుతియించు నిందుర్పనకు నంబ చతుర్భుజయై మృగేంద్రవా
హన యయి రక్తవస్త్రధరయై విలసత్సుమమాల్యభూషణా

భినవశరీరయై కరుణపెంపున నింపెసలారు చారులో
చనములదీప్తు లొప్పఁగ వెసం బొడసూపె మనంబు పొంగఁగన్.

వ. ఇట్లు పొడకట్టి సురల కభయం బొసంగి యసురు లున్నకడ కరుగుటయు భయత్రస్తులై వార లన్యోన్యముఖంబులు గనుఁ గొనుచు, ౩౧౦

గీ. వక్త్రదృష్టిని మధుకైటభవధ చేసి
చండముండాదులను జంపి చండకోప
మడర మహిషాసురు వధించినట్టి శక్తి
మనల హరియింపవచ్చె నేమనఁగ వచ్చు. ౩౧౧

వ. పిమ్మటఁ బ్రహ్లాదుండు పిఱుతివియక సంగరం బొనర్పుఁడని మొసకొల్పిన నాతనివచనంబులు వినక భయమ్మునఁ బరుగిడు రక్కసుల నిలువరించి నముచి యిట్లనియె. ౩౧౨

క. ఎదిరించిన నంబిక మన
మదమడఁచుట నిక్క మాపె మన్ననమై మ్రొ
క్కుదము తదనుగ్రహమ్మునఁ
గదలి రసాతలమునకుఁ దగం జనుదమొగిన్. ౩౧౩

వ. ప్రహ్లాదుండును నముచివచనంబు లియ్యకొని యంబికనిట్లు సన్నుతించె. ౩౧౪

శా. మాలాసర్పమునుభంగి సర్వజగ మంబా ! యొప్పు నీయందు నీ
హేలన్ సర్వము నిర్వహించు విధివిష్ణీశాను లన్నన్ భవ
ల్లీలాకల్పితహేతుమాత్రు లరయన్ లేశంబు నస్యంబు లే
దేలాపల్కులు వేయు! మ్రొక్కులిడుదున్ హ్రీంమూర్తికి న్నీకొగిన్.

ఉ. అందఱ కీవ తల్లివికదా! జగదంబ! సురాసురులంను నీ
కుం దయ దప్పనేటికి! కొడుకుల్ పదిమందిగలట్టి తల్లికిం
గొందఱు దుండగుల్ మఱియుఁ గొందఱు సాధులు గావ్ప టబ్బమే!
నందనులందుఁ బక్షములు న్యాయమె బిడ్డలఁగన్న యమ్మకున్?

గీ. ఉభయులము స్వార్థపరులము యుభయులమును
గశ్యపోద్భవులము ధనకనకవస్తు
వాహనమ్ములకొఱకు నుభయుల మని నొ
వర్ప నొక్కెడఁ బక్షమూనంగఁ దగునె? 3౧౭

గీ. అన్నదమ్ముల మైనమే మనికిఁ జోరఁగ
నేమి కారణ, మిరువుర కిట్టిభేద
మెవరు కల్పించి రీవు కా, కేమి సురలు
కలహ మొనరింప నీ కిచ్చ కలుగఁ బోలు. 3౧౮

వ. కాదేని యన్నదమ్ముల కెన్నండేని వైరంబు గల్గునే! సర్వాకార
ణంబవగు నీకెటులఁగఁ బోలని దొండుందునే! ఇందుగ్రిందు ధర్మా
త్మం డగుటకు మాకును సమ్మతంబ యైనను భాగార్థంబు మా
కీ కలహంబు దప్పదు దీని వారింప నీకుఁ దక్క నొరులు వలం
తులుగారు. 3౧౯

ఉ. అంబురుహాక్షు నిల్పితికదా! జగ మేలు మటంచు; నాతఁ డే
కంబుగ రెండుపక్షములు గన్గొనఁ డేమనవచ్చు నా! సము
ద్రంబును ద్రచ్చునప్పుడు సుధన్ మణి వారల కిచ్చి తాను ల
చ్చిం బడసెన్ వృథా మెరుసు చేసి మమున్ గలహంబు దప్పనే?

వ. మఱియు నైరావతంబు నుచ్చైశ్శ్రవంబును గామధేనువును
నతని యనుమతింజేసి యింద్రుని పాలయ్యెఁ బక్షపాతియగు.

కతన తనయులగు సురల రాజ్యమ్ము నసిల్పి మమ్ముం బరాజితులఁ
జేయుచున్నవాఁడు. 3౨౧

క. ధర్మం బిదియే కద! దు
ష్కర్ములకుఁ జయ మొసంగఁగాఁ దగునే? యీ
మర్మమ్ము నీ వెఱుంగవె
దుర్మతు లమరులొ దితిజులొ దుఃఖనిహంత్రీ! 3౨౨

వ. వేదశాస్త్రమ్ముల కైనను నేకవాక్యత గన్పట్టదు. స్వార్థపరులగుటం జేసి తత్పరిశీలకులకును సామానాధికరణ్యంబు గానరాదు. సంసారమం దొక్కరుఁడును గాంతాకనకవిరక్తుండు లేఁడు కావున ధర్మాధర్మంబులు నీకుం దక్క నన్యులు నిర్ణయింప నసర్హు లది యట్లుండె. 3౨3

గీ. శశి బలాత్కారముగ గురుసతి హరించె
ధర్మ మెఱిఁగియు గౌతమతరుణిఁ గలసె
నిందుఁడు, గురుం డనుజుభార్య నెనసె గర్భ
వతి, నరసి చూడ నిది ధర్మవర్తనంబె? 3౨౪

గీ. ఇంచుకేనియు నపరాధ మెఱుఁగఁ డట్టి
రాహుకంఠంబు దెగఁగొట్టె రాక్షసారి
సత్త్వగుణ మున్నవాఁడఁట జనని! యాతఁ
డకట! మఱియొతుఁ రాజ్యంబు నపహరించె. 3౨౫

క. దేవతలు చేయు దుష్కృతు
లేవారు గణింప నేర్తు, రింతింతలె! యీ
దేవతలు ధర్మవర్తులె!
కోవిదు లిప్పాటఁ జెప్పుకొనఁ జెల్లునొకో! 3౨౬

క. సురలు సధర్ము, లధర్ములు
సురారు లని చెప్పునట్టి చోద్యపుఁ గతలన్
బరిశీలించినఁ బుక్కిటి
పురాణములు గాని నిక్కములు గావుసుమీ. 3౨౭

గీ. నీ కెఱుఁగరాని గోప్య మెందేనిఁగలదె ?
తెలుప వలసి వచించితి దేవదేవి !
శరణుఁజెందిన మమ్ము రక్షణ మొనర్ప
నెంచెదో చంప నెంచెదో యే నెఱుంగ. 3౨౮

వ. నావుడు జగదంబ రక్కసుల కిట్లను. మీరలు గతక్రోధులై నిర్భయమ్ముగ రసాతలమ్మున కరిగి యట ననుకూలకాలనిరీక్షణ పరాయణులై యుండునది. 3౨౯

గీ. ఎంతరాజ్యము కల్గిన నేమి, సుఖము
కలుగ నేరదు లోభసంక్రాంతమతుల
కది యొకటి లేనివారల కన్ని యెడలఁ
గలుగు సౌఖ్యంబు నా యాజ్ఞ గై కొనుండు. 330

క. నావుడు దానవు లా యమ
భావమ్ము నెఱింగి నతులు పచరించి చనన్
దేవియు నదృశ్య యయ్యెన్
దేవతలును జనిరి కథ యిది శుభమ్ములిడున్. 33౧

—* విష్ణుని యవతారములు *—

వ. నావుడు జనమేజయుం డిట్లనియె. 33౨

గీ. భృగువు శాపంబు కతన నవ్విష్ణువునకు
నెన్ని యవతారములుగల్గె, సిద్ధచరిత !

యే మనువు కాలమున నతఁ డిల జనించె
నెఱుఁగఁ జెప్పు మనవుడు మునీంద్రుఁ డనియె. 333

క. నరనారాయణులన నవ
తరించె శ్రీ విష్ణువెలమి ధర్మ్మండను భూ
సురునకుఁ జాక్షుషమన్వం
తరమున ; నిది చెప్పినదియె ధరణీనాథా ! 334

వ. తృతీయ యుగమ్మున వైవస్వతమన్వంతరమ్మున నత్రిభార్యయగు ననసూయకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురును బుత్రులై జనించి ; రందు బ్రహ్మాసోముండు, హరిదత్తాత్రేయుండు, హరుండు దుర్వాసుం డని యెఱుంగునది. 335

గీ. నాలవ యుగమ్మున జనించె నారసింహుఁ
డగుచు హరి దేవహితకారియై హిరణ్య
కశిపు వధియింపఁ ద్రేతాయుగమ్మునందు
వామనుండయి జనియించె బలి నడంప. 336

వ. అట్లు కపటవామనుండై కశ్యపున కుద్భవించి బలిని పాతాళమ్మున కనిపి పందొమ్మిదవ త్రేతాయుగమ్మున మరల జమదగ్నికి సుతుండయ్యె. 337

ఆ. వె. అతనిఁ బరశురాముఁ డందు రాతఁడ కాఁడె
క్షత్త్రకులము నెల్ల సంహరించి
పుడమియెల్లఁ గశ్యపునకు దానం బిచ్చె
నఘహరంబు నిక్క మతని చరిత. 338

వ. త్రేతాయుగమ్మునన రఘువంశప్రదీపకుండగు దశరథునకు శ్రీరాముఁడై జనియించె. 339

క. అష్టావింశయుగమ్మున
దుష్టుల హరియించి పుడమి దుడుకడఁపంగా
శిష్టులు నరనారాయణు
లిష్టులు కృష్ణార్జునులయి యొసఁగిరి జగతికిన్. ౩౮౦

వ. వారు కురుక్షేత్రమ్మునఁ గౌరవులతోడ ఘోరయుద్ధంబొనర్చి జయంబుగొని రిట్లు తత్తద్యుగమ్ములఁ బ్రకృతివశమ్మున ననేకావతారమ్ములు హరికి గలుగుచుండు. జగమ్మఖిలంబును బ్రకృతివశంబని యెఱుంగుము. సర్వాదియు సర్వగుఁడును నవ్యయుండును నగు పురుషుం డీ యఖిలమ్మును సృష్టించి యే యుపాధికతనఁ ద్రివిధుండై యొప్పు నా ప్రకృతి యుత్పత్తి కాలయోగమ్మున భిన్నమై ప్రకాశించుచుండు నయ్యాదియ సృష్టిస్థితిలయమ్ము లొనరించు, నది యెట్లంటేని. ౩౮౧

ఆ. వె. ప్రకృతియుక్తులగుచు బ్రహ్మయు విష్ణువు
శివుఁడుఁ జేయుచుంద్రు సృష్టిరక్ష
ణలయకృతులనెల్ల నరులకుఁ బ్రకృతి యొ
సంగుఁ గష్టములను సౌఖ్యములను. ౩౮౨

వ. ఆ ప్రకృతియకదా మున్ను కాకుత్స్థుండను నొక రాజన్యు సృష్టించి రాక్షస వినాశమ్మున కొక్కెడ నుంచె. ౩౮౩

క. ఒకఁడనఁగనేల యెల్లరుఁ
బ్రకృతికి వశులగుచు భవముపాలై సౌఖ్యా
దిక మనుభవించుచుందురు
వికలము గాకుండునట్టి విధితంత్రమునన్. ౩౮౪

వ. నావుడు జనమేజయుం డిట్లను, మహాత్మా! నరనారాయణాశ్రమమ్మున కేతెంచి యచ్చరలు నారాయణుం బతిగా వరించిరని

నుడివిని వాతండు పిదప నేమి యొనర్చె నక్కట విసవలతు ననిన సాత్యవతేయుం డిట్లనియె. ౩౮౫

ఆ. వె. శాపమీఁగ నెంచి చయ్యన నరుఁడు వా
రింప నుడిగి యా నిలింపవార
సతులఁ గాంచి స్మితమెసంగ నారాయణుం
డానతిచ్చె మధురమైన ఫణితి. ౩౮౬

క. కృతసంకల్పుఁడనగు నా
కతివలతోఁ బొందుఁ జెందు టర్హమె ! మీరల్
ప్రతిసెప్పక త్రిదివమ్మున
కతిరయమున నిప్పు డరుగుఁ డంగనలారా ! ౩౮౭

వ. మనోహరంబగు నీ శృంగారమునకు స్థాయిభావమ్ము రతినాఁ బరగు నయ్యది లేకున్న నే నెటు మిమ్మువలంబింతు మీపాటిబోటులకు వరణీయుఁడ నగుటంజేసి నాభాగ్యస్వరూపమ్ము లనన్య సామాన్యంబులు నాయందు దయగలిగి వ్రతభంగంబు గాకుండ నిప్పటికిఁ జనుండు మీ కోరినయట్లు యుష్టావింశంబగు ద్వాపర యుగమ్మునఁ బ్రవర్తించువాఁడ. ౩౮౮

క. సురవాక్యం బొసరింపఁగ
నరుదెంతు ధరాతలమున కయ్యెడ మీరల్
నరపతి తనూజలై నన్
వరియింతురు భార్యలగుచుఁ బరిపరిగతులన్. ౩౮౯

వ. అని యొప్పంజెప్పిన నయ్యచ్చరలు దివమ్మున కరిగి కలతెఱంగెఱిఁగించి శకునిసకు సఖీసమేతయగు నూర్వశిం జూపిన నతండును దల్లావణ్యమ్మున కచ్చెరువంది మునుల ధైర్యమ్మునకు మెచ్చి

వేనోళ్ళ సన్నుతించె; నరనారాయణులు నెప్పటియట్ల తపోనిష్ఠా
గరిష్ఠులై యుండి రియ్యది వారి చరితంబని మఱియును. ౩౧౦

క. వా రిరువురుఁ గృష్ణార్జును
లై రమణ జనించి పుడమి కానందము చే
కూరఁగఁ జేసిరి భృగుశా
పారంభము కారణముగ నవనీనాథా! ౩౧౧

వ. నావుడు జనమేజయుండు మునీంద్రా! కృష్ణావతార చరిత్రంబు
విస్తరించి వచింపుము, హరియును ననంతుండును నెవరికిఁ బుత్రు
లట్టి దేవకీవసుదేవులఁ గంసుం డెట్లు బంధనాగారమ్మున నుంచె?
మధురయం దుదయించిన హరి గోకులమ్మునకు రానేల? కంస
వధానంతరమ్మునఁ గృష్ణుండు ద్వారకయందు వసియించుటకుఁ
గతం బెయ్యది? ౩౧౨

క. తన పిత్రార్జిత దేశ
మ్మున నుండక యన్యదేశమున కేగుట యె
వ్వనికి నసహ్యంబన న
య్యనిమిషవంద్యునకు నెట్టు లది తగుఁ జెపుమా. ౩౧౩

వ. అదియునుంగాక ద్విజశాపమున యాదవకులంబు నాశమగుటయు,
కృష్ణనిర్యాణానంతరంబున నతని భార్యలం దోచిన దొంగలఁ
బార్థుండు సంహరింపకుంటయు నక్కజంబయి కన్పట్టెడి. ౩౧౪

క. గాంగేయుండును ద్రోణుం
డంగపతియు మొదలు వీరు లతిభారదులై
కుంగం జేసిరె! పుడమికి
దొంగలభారం బొకింత దోఁపదె చెపుమా! ౩౧౫

వ. మహా పతివ్రతలగు శ్రీకృష్ణుని భార్యల కిట్టి భంగపాటును వసు
దేవుండు పుత్రదుఃఖమ్మున మృతుండగుటయుఁ గృష్ణాశ్రితులగు
పాండవులకుఁ గష్టమ్ములు దొడరుటయు మహాభాగయగు
ద్రౌపది పడిన బన్నంబు లట్లుండఁ దత్పుత్రు లశ్వత్థామచే నన్యా
యముగ హతులగుటయు సౌభద్రుండగు నభిమన్యుండు బాల్య
మ్మునన యధర్మ యుద్ధమ్మునఁ దెగుటయు దేవకీతనయు లార్గురు
నుం గంసునిచేఁ జంపఁబడుటయు నాకు మిక్కిలి వ్యసనం బొసం
గెడి నిది యిట్లుండ. 3౫౬

గీ. యాదవులు ప్రభాసమ్మున హతు లగుటయు
వారి పత్నులు దొంగలబారిఁ బడుట
యట్టులుండఁగ నాదినారాయణుండు
కృష్ణుఁ డుగ్రసేనుని సేవ కెట్టు లొప్పె! 3౫౭

గీ. హర్ష శోకాదికములు లోకాధ్యుఁడైన
హరియు సామాన్యులంబోలెఁ బొరయు టెట్లు?
చోరుభాతిని రుక్మిణీసుదతిఁ గొని ప
లాయనం బొనరింప నేలా! యతనికి. 3౫౮

వ. మధురాపురమ్మునుండి హరి ద్వారక కేగుతటి వ్రజగోపనం
బొనర్చుచు నజ్ఞేయుం డగుట యెట్లు వివరింపుమని వెండియు.

ఉ పయక సందియమ్ము లతిపారముగాఁ గనుపట్టుచుండు న
త్యాయతబుద్ధిఁ దీర్పఁ దగునట్టి మహాత్ముఁడ వీవు, కోరఁగా
నాయెద గొంకెడుర్ దుప్రదనాథతనూజ నొకర్తు నేవురుర్
జాయగ నెట్టు లొప్పిరి? రసజ్ఞులు పాండవు లె గ్గెఱుంగరే! 3౬౦

గీ. ధర్మమతులు సమర్థు లుద్ధతులు పాండ
వులు మహాత్ములు వా రెట్లు కలికి నొక్క

రితఁ బశుప్రాయు లగుచు వరింప నెంచి
రియ్యదియు ధర్మమేని నా కెఱుఁగఁ జెపుమ. 3౬౧

గీ. దేవసముఁడైన గాంగేయుఁ డేవిధమున
గోళకులచేతఁ గులవృద్ధి గొనుట కొప్పె ?
నకట ! "యెల్లని సంతాన మర్హ" మనుచుఁ
జెప్పు ధర్మమ్ము లెంత కుత్సితము లనఘ ! 3౬౨

వ. నావుడు వ్యాసుం డిట్లనియె. 3౬3

క. దేవకి కొమరుని చరితము
పావనము సమస్తలోకపాపహారమ్మౌ
దేవశ్రావ్యము మిగుల శు
భావహ మద్దానిఁ బ్రీతి నాలింపు నృపా ! 3౬౪

—* కృష్ణావతార కారణము *—

క. ఒకనాఁడు పుడమి భారం
బుకతన స్వర్లోక మేగి పురపుర పొక్కెన్
సకరుణుఁడై యింద్రుండు ధ
రకు గోరూపధర కాదరమ్మునఁ బలికెన్. 3౬౫

గీ. నెట్టపంటగ శోకింప నీకు నేమి
వచ్చె ? నావుడుఁ బుడమి యవ్వాసవునకుఁ
గల తెఱం గెఱిఁగించె నికరుణి దీన
వదనయై యశ్రువులచాలు వఱద గాఁగ. 3౬౬

వ. సురేంద్రా ! దుఃఖకారణం బడుగు నీకు నే నేమని చెప్పుదు
జరాసంధుండును శిశుపాలుండును గంసుఁడును రుక్మియును నర
కుండును సాల్వుండును కేశియు ధేనుకవత్సకులు మొదలగు

దుర్మార్గులు కేవలాధర్మవర్తనులై పరస్పరద్వేషమ్ము పూని
చరించువారు వీరల భారమ్ము నే సైరింప నోప నని వెండియు,

చ. హరి కిటిరూపధారి యయి యక్కనకాక్షు వధించి నన్ సము
ద్ధరణ మొనర్చి నిల్పిన విధం బది నీవు నెఱుంగుదే కదా
మరల నిదొక్కబాధ సురమండలనాయక ! భూరిదుఃఖమే
దురతతరంగరింగణపు దుందుడుకుల్ గను నెన్ని భంగులన్.

వ. హరి మున్నట్లొనర్పనినాఁడు పాతాళమ్మునకుం జని యీ బాధల
కవిషయమనై సుఖముందుఁ గదా యని చింతించి మఱియును.

క. అష్టావింశయుగం బతి
దుష్టప్రచురమయి కడకుఁ దోతెంచుఁ గటా !
శిష్టవిగర్హితు లగు నా
కష్టాత్ములు నాకు భారకారులు కారే ? 320

ఆ. వె. భరము మోయఁజాలఁ బాతాళమున కిప్డు
పోవు దానఁ బేర్మి పోలుపుమీఱ
నానతిమ్ము భారమైన హరింపుము
తాళఁజాల నీకు దండ మిదుడు. 321

వ. నావుడు నింద్రుండు నీ భారమ్ము హరింప నే నెంతవాఁడ బ్రహ్మ
లోకమ్మున కరిగెదేనిఁ జతురాననుం డియ్యెడ నుపాయంబు
గల్పించు. 322

క. నీ వెంట నేను వచ్చెద
దేవీ ! యచ్చోటి కిపుడ తెరలిచనుట యొ
ప్పేవిధినైనను నావిధి
నీవలవంత నెడఁబాపు నిక్కం బనినన్. 323

వ. పుడమియు నియ్యకొని నిందు్రం డాపె వెనువెంటనరిగె నంత దుఃఖాక్రాంతయగు ధరణిం గాంచి చతురాననుం డిట్లనియె. నీ వేకతమ్మున నిట్లు దుఃఖింతు, నిన్నెవ్వఁడు పీడించె? నాపుడుఁ బుడమి యిట్లనియె. 3౭౮

ఉ. చెప్పెడిదేమి నాకుఁగల చేటు పితామహా! భార మాఁగఁగా దెప్పర మాయె; నింకఁ జనుదెంచుఁగదా కలి; దాన భూపతుల్ తప్పుదు రెల్ల ధర్మము, లుదారగుణమ్మును మాని చౌర్యముల్ చొప్పడ సంచరింతు, రిది చూడఁగ భారము గాక యుండునే?

క. ఈ కలుషాత్ముల నెల్లర
నాకై వధియింపు మయ్య నానాసైన్యా
నీకముల కోపఁ జాల వ
రాకిని నేనెంత ప్రోవ రాదె మహాత్మా! 3౭౯

వ. నాపుడు విరించి యోదేవీ! నే నీకృతి కసమర్థుండ జగన్నాథుం డగు శ్రీహరికడ కరుగఁదగు నని యంచ నెక్కి సురపరివృతుం డై ధరణీసహితమ్ముగ వైకుంఠమ్మున కరిగి సనాతనుండగు నద్దేవు నిట్లని నుతించె. 3౭౭

ఉ. వేయిశిరమ్ములుం మఱియు వేయికరమ్ములు వేయికన్నుల త్యాయతరీతి నొప్పు పరమాత్ముఁడ! యావదజాండసంతత ధ్యేయుఁడ! వేదపూరుషుఁడ! దివ్యము నీమహిమంబు నీవ కా వే యమరత్వ మిచ్చితివి విశ్వవిధాయక! మాకు సత్కృపన్.

వ. ఇట్లు సన్నుతించునాతనియెడఁ గరుణించి గరుడధ్వజుండు ప్రసన్నుండై యందఱ వేర్వేఱఁ గుశలంబడిగి యాగమనకారణం బే మనవుడు విరించి యిట్లనియె. 3౭౯

మ. ధర భారమ్మె సహింపఁజాల నని వంతం బొందు మూర్తుల్ దురు
ద్ధర మీకార్యము ద్వాపరాంతమున దుర్ధర్షస్థితిం భూభరో
ద్ధరణార్థం బవతార మెత్తుము నిరాతంకంబుగా భూస్థలిం
గరుణింపం దగదే యనాథులకు నీకన్నం బరుల్ గల్గిరే! ౩౮౦

వ. నావుడు నతం డిట్లనును. ౩౮౧

ఆ. వె. ఏను నీవు రుద్రుఁ డితరులు నమరులు
నస్వతంత్రులనుచు నరయు మఖిల
జగము యోగమాయసంగతి గుణసూత్ర
కలిత మగుచునుండుఁ గంజసూతి! ౩౮౨

వ. ఆపె దా నెట్లొనర్ప నిచ్ఛగించు నట్లు చేయుదము మనమందఱ
మును తద్వశగతులమ, అట్లుకానినాఁడు మున్ను నేను మత్స్య
కచ్ఛపాదికుచ్ఛయోనులం జనింతునే! యని వెండియు. ౩౮౩

క. ఆర్యములు గానినింద్యపుఁ
దిర్యగ్యోనుల జనింపఁ దివురుట సుఖతా
త్పర్యమొ పుణ్యమొ కీర్తియొ
శౌర్యమొ భోగమొ మఱేమి సారస్యంబో! ౩౮౪

వ. కిటినృసింహవామనరూపమ్ములు ధరించుటకును నయ్యంబయ
నిమిత్తంబదియునుం గాక, ౩౮౫

క. ఘనుఁడగు జమదగ్నిమహా
మునికిం బరశురాముఁడనఁగఁ బొడమి నృపతులం
దునిమి తటాకంబులు గా
నొనరించితి రక్త మిదియు నోకసుకృతంబే! ౩౮౬

వ. మీఁద రాముఁడనై జటావల్కలంబులు ధరియించి దండకార
ణ్యమ్మునం దిరుగుచు నన్నపానాదులు లేమిఁ గృశించి రాజ
చిహ్నంబులు విడిచి సిగ్గటి పాదచారినై గ్రుమ్మరుచు మాయా
పిహితుఁడనైన కతనఁ గాంచనమృగంబు కలలెఱుం గెఱుంగక
మొక యీరమ్మున నప్పుడమిచూలిం ద్యజించి యరుగుడు నంత
లక్ష్మణుండును గొండొక సేపునకు వెన్నడి వచ్చె. ౩౮౭

ఉ. పిమ్మట భిక్షురూపమునఁ బేశలగాత్రిని సీత నెత్తికొం
చమ్మెయి రావణుండరిగె నంత లతాంగిని గాన కేను శో
కమ్మ గడల్గొనంగ నల కాననమెల్లను జూచి యేతద
ర్థమ్మున మైత్రిఁ జేసితిఁగదా ! రవిపుత్రునితోడ నారయన్.

శా. వాలిం జంపితి ధర్మబాహ్యముగ నాపై వానరానీక ము
ద్వేలంబై వెనువెంట రా దనుజులన్ దీండ్రింపఁగా లంక కా
భీలప్రక్రియ నేగి యచ్చట నగంభీరుండనై నాగపా
శాళిం జిక్కితి సానుజుండ నయి, యన్యాధీనతల్ కూడ నే.

గీ. పాశములఁ జిక్కి చింతపాల్పడిన యన్న
దమ్ములను మమ్ము విడిపించెఁ దతబలుండు
గరుడుఁ డప్పుడు నామదిఁ గలుగుచింత
యింత యని చెప్ప శక్యమె యేరికేని ? ౩౯౦

సీ. రాజ్యమ్ము పోయె నరణ్యంబు గతి యాయె
భార్యయు రక్కసుపాలఁ బడియె
నతికష్టమగు రణస్థితి పొసంగె నిఁకేమి
సేయువాఁడ వనమ్ముచెంత కనుచు
నప్పుడు తండ్రి గవ్వైనను నాకీఁడు
ధనహీనుఁడఁ బదాతి ననద నకట !

రెంతటి ధనికున కేనియు వనవాస
మతిభరంబగుఁ జెప్ప నలవి యగునె

సీ. మాదృశునకంచు క్షత్రధర్మంబు విడిచి
బోయవడువున నవ్వనంబునఁ జతుర్ద
శాబ్దములు వేఁగి మీఁద జయమ్ముఁ గొంటి
దైవవశమున, నాకు స్వాతంత్ర్యమేది ? 3౯౧

వ. మీఁద జానకిం గైకొని యయోధ్యకరిగి కొంతకాలమ్ము సం
సార సుఖంబు లనుభవించుచుఁ బ్రజలఁ బాలించుచున్నంత.

గీ. కడలుద్రొక్కిన పడఁతిని విడువలేక
మరలఁ గైకొనె నితఁ డనుమాట కోప
లేక విడిచితి సీత సుశ్లోక నటవి
నకట ! లోకాపవాద కేమనఁగవచ్చు. 3౯3

క. పిమ్మట న త్తరుణీవిర
హమ్మున సంప్రాప్తమయ్యె నతిదుఃఖ మ్మ
క్కొమ్మ రసాతలమున కరి
గెమ్మహి భేదించుకొని యొగిం దనయంతన్. 3౯౪

ఉ. ఏనును దమ్ములుం బిదప నేగితి మొక్కుమొగిన్ నిలింపసం
స్థానము నిట్టి నాకుఁ బరతంత్రత గాక స్వతంత్రభావ మెం
దేనియుఁ గల్గుటెట్లు ! విను మీవును రుద్రుఁడు నిట్టివార లే
జ్ఞానములేమి మాయకు వశమ్మగ నిమ్మగ నుందు మెమ్మెయిన్.

వ. అని మఱియు నిట్లను. 3౯౬

ఉ. ఏ మహనీయము మాయ మన కేరికి గోచరిగాక యుండు ను
ద్దాముని శాంతుఁ దత్త్వమయుఁ దారకు నప్పరపూరుషున్ గనన్.

తే. "మహా" యంచు గర్వమున నిక్కుదు మప్పురవస్తు వాస్తవ
స్థేమము నాఁడు చూచితిమి దెప్పరమౌగతి నీ వెఱుంగవే. ౩౯౮

వ. అని సురల కిట్లనుఁ గల్పాదియందు సుధాసముద్రమ్మున మణిద్వీపమ్మున రాసమండలమ్మున మాచే నదృష్టపూర్వయు నశ్రుతచరియునగు జగదంబ చూడంబడియె, సర్వకామప్రదయగు నాపెన్ భజించిన మీ మనోరథమ్ముసిద్ధించు ననవుడు బ్రహ్మదు లాయంబను మనమ్మున నిలిపి వేఁడికొనిన నాకె ప్రత్యక్షంబయ్యె.

క. పాశాంకుశధారిణియు జ
పాశంకాకరణకాంతిపాటవకలనా
పేశలగాత్రియు నగు జగ
దీశానిం గాంచి యమరు లెనసినభక్తిన్. ౩౯౯

వ. ఇట్లు నుతించిరి. ౪౦౦

ఆ. వె. తలఁప నూర్ణనాభివలనఁ దంతువులు వి
భావసునివలన నపారగతి స్ఫు
లింగములును బొడములీలగా నీ జగ
మెచటఁ బుట్టు నాపె కెఱుఁగవలదె? ౪౦౧

—* దేవీ స్తుతి. *—

క. ఏ మాయాశక్తికి లో
నై మను నఖిలప్రపంచ మా భువనేశా
నీమహిమ నెన్నఁ దరమౌ
నే! మానులకైన మఱియు నెవ్వరికైనన్. ౪౦౨

వ. అని పెక్కుభంగుల నుతియించి తల్లీ ! కంసాది దుష్టులచే జగంబెంతయుఁ బీడింపఁబడుకతనఁ దద్భారం బోర్వక పుడమి నిన్ను

శరణంబు వేఁడెడి, హరిహరాదుల కసాధ్యులగు రక్కసులు నీచే
సాధింప నగుదురు కావునఁ దత్సంహారం బొనరించి భారంబు
దీర్పు మనవుడు నిందుసఖుండిట్లనియె. ౪౦౩

ఉ. ఏరును శక్తిశూన్యులయి యెప్పనిఁ జేయఁగలేరు బ్రహ్మకుఁ
భారతి, లచ్చి విష్ణునకుఁ, బార్వతి శూలికి, నుంటఁజేసి వీ
రారయ నాత్మకార్యములయందు సమర్థులు తత్సహాయతా
ధారములేమి వీరు ప్రభుతాగతికిం దగువారలౌదురే. ౪౦౪

వ. హరి యిట్లనియె. ౪౦౫

గీ. నీదు కళ మాకు నొక్కింత నెగడదేని
నేము ముగురము శక్తుల మింత నిజము
నీవు తోడింతయును లేక నిఖిలకృతుల
యందు ధారాళగతి నూని యుందువంబ ! ౪౦౬

వ. నావుడు జగదంబ సంతుష్టయై సురలఁగాంచి యాగమనకారణం
బేమనవుడు వారలిట్లనిరి. ౪౦౭

క. భూపాలకు లెల్లరుఁ గడుఁ
బాపాత్మతఁ దన్నుఁ గష్టపడఁ జేయఁగ స
ద్వ్యాపద కోపక భార
వ్యాపృతయై పుడమి వగచు నరయుము తల్లీ ! ౪౦౮

వ. తద్భారంబు దీర్చుటయ మాకభిమతంబని వెండియు, ౪౦౯

సీ. దానవకోట్లతో దర్పించి యెదిరిన
మహిషాసురుని రూపు మాపలేదొ
శుంభనిశుంభుల గాంభీర్య మెడలించి
రక్తబీజుని నేల రాయలేదొ

చండముండాది రాక్షసుల నుక్కడఁగించి
ధూమ్రలోచనుతల ద్రుంచ లేదొ
దుర్ముఖదుస్సహాదులఁ దునుమాడి క
రాళు నంతకపురిఁ ద్రోల లేదొ

గీ. జనని నీచేతఁ ద్రెళ్ళినదనుజు లెంద
ఱో వచింపఁగఁ దరమె ? భూదేవి భార
మును హరింపఁగదమ్మ మా మ్రొక్కులను గ్ర
హింపఁగదవమ్మ నీకన్న నెఱుఁగమమ్మ. ౪౧౦

క. నావుడు జగదంబ మొగం
బావిర్భూతస్మితోదయంబుగఁ బలికెన్
దేవతలతో నదభ్ర
భావహాకాలాభ్రగర్జితార్భటి చెలఁగన్. ౪౧౧

గీ. అని జరాసంధముఖ్యుల నన్యదుష్ట
నరపతుల నందఱ హరింప నా మనమ్ము
నందు యోజించి యుంచితి సమరులెల్లఁ
బుడమిఁ బుట్టుండు స్వస్వాంశముల రయమున. ౪౧౨

గీ. యాదవకులమ్మునను బుట్టు ననఘుఁడైన
కశ్యపుఁడు వసుదేవుఁడై కాంతతోడఁ,
బాడము భృగుశాపమున విష్ణువును నతనికి
బుత్రుఁడై, యేను నందునిపుత్రి నగుదు. ౪౧౩

క. నందునకు యశోదకు నే
వందనినై పొడమి యొకఁ డనఁగ నేల ప్రాసం
గందగు నన్నికృతుల నా
నందముపై నిర్వహింతు నవనవగతులన్. ౪౧౪

గీ. బంధనాగారగతుఁడగు పద్మనేత్రి
గోకులమ్మున కనిపెద గూఢవృత్తి
దేవకీగర్భగతు శేషుఁ డిగిచి రోహి
ణీలతాతన్వికడుపున నిలుపుదాన. ౪౧౫

క. బలరామకృష్ణు లిద్దఱు
నలయక మచ్ఛక్తియుక్తులగుకతన దురా
త్ముల ద్వాపరాంతమున ని
శ్చలగతి భూపతుల నెల్లఁ జంపుదు రెలమిన్. ౪౧౬

గీ. ఇంద్రునంశమ్మునన్ జనియించు నర్జు
నుం డతఁడు మాపు నరవర మండలంబు
యముఁ డనిలుఁ డశ్వినులు కారణముగ ధర్మ
జుఁడును భీముండుఁ గవలును బొడమఁ గలరు. ౪౧౭

వ. వీరును వస్వంశసంభూతుండగు భీష్ముండును దుష్టహారణంబు విశే
షించి యొనర్తు రింతేల వీరు నిమిత్తమాత్రులుగా నిఖిలంబు
నేన నిర్వహింతు మీరు మీమీపొందుపట్ల కరుగుండని మఱి
యును. ౪౧౮

ఉ. క్షత్రియజాతి నెల్లఁ బెలుచన్ హరియింతు రణావనిన్ గురు
క్షేత్రమునం దమంతన నశింతురు యాదవులున్ క్షణమ్మునం
జిత్రగతిన్ బ్రిభాసమునఁ జెటగుతృష్ణయు నోర్వలేమియున్
ధాతృని దేశమున్ ధరణిదైవతశాపము నేకమై తగన్. ౪౧౯

క. పిమ్మటఁ గృష్ణుండును దే
హమ్ము విడుచు శాపకలన, నఖిలసురలు! మీ
రిమ్మెయి గోకులమున మధు
రమ్మహిళలతో జనింప రమణం జనుఁడీ. ౪౨౦

వ. అని యానతిచ్చి యోగమాయారూపిణియగు నజ్జననియుఁ గను
మొఱఁగినంత నమరులు స్వస్థానమ్ముల కరిగిరి. ధర సర్వసస్యో
పేతమై సుస్థిరమ్ముగనుండెఁ బ్రజలెల్లరు సుఖులైరి ద్విజులును
మునులును సంతుష్టాంతరంగులై స్వధర్మనిర్వహణంబున జాగ
రూకులై యుండిరి. ౪౨౧

క. విను జనమేజయ ! యదుకుల
మున సరసిజలోచనుండు పొడమునిమిత్తం
బనివార్యంబగు శాపం
బును మాయాబలము క్షితిసముద్ధరణంబున్. ౪౨౨

గీ. ఎల్లరకు నెల్లశక్తుల నే పరాంబ
గలుగఁగాఁజేయు నా శక్తిబలము కలిమిఁ
గలిగె విష్ణువునకు గర్భకష్ట మింక
నితరు లీమాయ దాఁటువారేమొ చెప్పుమ. ౪౨౩

వ. రామావతారమ్మున నతని మునుపడ్డ బన్నములు వినియుంటివి
కదా ! వేయునేల, యోగీంద్రులును "నేను నాయది" యను
మహాపాశమ్మునఁ దవులుకొని తన్నివృత్తికై యాజగజ్జనని నారా
ధింతురు. ౪౨౪

క. లవలేశమేని నరుఁడే
భువనేశ్వరి భక్తివలనఁ బొగడిన ముక్తి
స్థవిరతఁ గాంచునొ యాపె వి
భవ మేరికినేని వినుతిపాత్రమ కాదే ! ౪౨౫

వ. విద్యయు నవిద్యయునని యప్పరశక్తికి రెండు రూపమ్ములు
గలవు. విద్యకతమున ముక్తియు నవిద్యకతమున బంధమ్మును
గలుగునని యెఱుంగునది.

క. అవతారము లన్నియు న
య్యావిద్యచే యంత్రితమ్ములగుకతమున వి
ష్ణువు తత్తద్బంధనములఁ
దవిలి సుఖాసుఖము లనుగతములుగ మెలఁగుఁ. ౭౨౭

క. హరిగాని హరుఁడు గానీ
సరసిజసంభవుఁడు గాని చంద్రార్కసురే
శ్వరధనదయమధనంజయ
వరుణాదులు గాని యెఱుఁగు పరతంత్రులుగాఁ. ౭౨౮

వ. మఱియు వసిష్ఠవామదేవ సనకసనందనాది మహామునులందఱును
దద్వశులకా యెఱుంగుము. ౭౨౯

గీ. హర్షశోకాది భావమ్ము లమరుచుండు
దేహమున్నంతదనుక సందేహమేల ?
సురల నమరులటంచు నిర్జరులటంచుఁ
బల్కుదురు కొంద ఱది సరిపడునె యెందు ? ౭౩౦

గీ. ఆయు వధికంబు నల్పంబు నగుటదక్క
బ్రహ్మ మొదలుగ మశకంబు పారముగ స
మానగతి నొప్పు మరణ ; మమరులనంగ
నిర్జరులనంగ నెవ్వరో నృపవరేణ్య ! ౭౩౧

క. జననము మరణము ననునివి
జనవర ! చక్రక్రమంబు చందంబున నొ
ప్పు నొకనికిని శాశ్వతమనఁ
జనునే మాయాకృతంబు సకలంబరయన్. ౭౩౨

వ. అమ్మాయ యెంతదనుక నలవడు నందాఁక నెవ్వండును ముక్తుం డుగానేరఁ డుత్పత్తికాలమ్మునఁ బుట్టువెట్లగు నట్లు నాశకాలమ్మున యథాక్రమంబుగ నందఱకును నాశం బొదవు నిట్లుండ.

గీ. ఎవ్వఁడు నిమిత్తమాత్రమై యెవనిఁ జంపు
నతనిఁ దత్కర్తగా లోకు లందు; విధివ
శమ్మని యెఱుంగఁజాలరు సౌఖ్యమేని
గష్టమేనియు నొక్కఁడేఁ గలుగు టెట్లు! ౪౩౪

ఉ. అందఱకుఁ సుఖప్రదు లటంచు వచించెడి సూర్యచంద్రులే
కుందును జెందరేమొ కనుఁగొమ్ము దినేంద్రునిపుత్రుఁ డిస్సిరో!
మందుఁడు, చంద్రుఁడంకమున గ్రమ్ము క్షయామయబాధఁజెందు నే
మందు! విధి ప్రచారము మహాత్ములకేనియు దాఁటరాదుగా!

ఉ. వేదములన్ రచించిన వివేకి చతుర్ముఖుఁ డాతఁ డాత్మదా
యాద సరస్వతింగని స్మరాతురుఁడయ్యె; హరుండు దక్షదా
యాద మృతింగనంగ మదనాగ్నికిఁ దాళఁగలేక సూర్యదా
యాదజలమ్మునంబడఁగ నానది నల్లవడెన్ దదాదిగన్. ౪౩౬

వ. ఆతం డొక్కనాఁడు క్రీడాసక్తుండై నగ్నభావమ్మున భృగువనమ్మున కరిగిన నమ్మునీంద్రుండు కనలి నిర్లజ్జుండవగు నీలింగంబు పతితం బయ్యెడుమని శపించెఁ బదంపడి యతండు దానవనిర్మితం బగు నమృతవాపీరసంబు పానంబుచేసె నిది యిట్లుండ నింద్రుండు వృషరూపమ్మున నొక భూపతికి నొక్కెడ వాహనంబయ్యె మఱియు. ౪౩౭

క. పరమపురుషుఁడఁట! హరియఁట!
కరము వివేకంబు గల్గు ఘనుఁడొనఁట! బం

గరు మృగము నిజంబెఱుఁగక
త్వరపడి యద్దానివెంటఁ దవ్రులుట తగవే ? ౪౩౮

క. మాయాబల మేరికి దుర్
జ్ఞేయం బక్కటతనఁగాదె (శ్రీ)రాముఁడు కా
మాయత్తుండై సతిఁ గో
ల్పోయిఁ యడుగఁదొడఁగె వృక్షముల నవ్వనిలో. ౪౩౯

ఆ. వె. "నాదు భార్య జనకనందిని సౌందర్య
నిధి సుశీల సీత నిరుపమాన
నెవ్వఁ డపహరించె నే యెడ కరిగెఁ జె
ప్పఁగరాదె పాదపమ్ములార ! ౪౪౦

ఉ. తమ్ముఁడ లక్ష్మణా ! యవితథమ్ముగఁ బ్రాణములం ద్యజింతు నే
నిమ్మెయి నీవు నట్లుత్యజియింతువు నీ యనుజుండునుం ద్యజిం
చు మ్మనతల్లులుం దెగుట చోద్యమె కైకయు నాపెపుత్త్రుఁడుఁ
సమ్మదలీల రాజ్యమును సల్పుదు రక్కట ! సీత పోయెనే. ౪౪౧

ఉ. రాఁగదవే మృగాక్షి ! నను రంజనసేయఁగదే లతాంగి ! నా
రాగ మెఱుంగవే తరుణి ! రాముఁడఁ గానఁటవే నెలంత ! వే
వేగ ననుగ్రహింపఁగదవే మదవేల్లితదంతిగామినీ !
యీగతి నన్ ద్యజింపఁదగవే నగవే యిది నీకు మానినీ !

గీ. నిన్ను విడనాడి బ్రతుకంగ నేర నంచు
నీ వెఱుంగవె నీ యెడ నేమి లోప
మాచరించితిఁ ద్వదధీను నరసి నన్ను
దీను నోదార్ప నిట కరుదేరఁ దగదె. ౪౪౩

ఉ. ఈగతి నవ్వనాంతరము నెల్లను జూచి ధరాత్మసంభవన్
దాఁ గనలేక సర్వజనతాగతి యా రఘురామమూర్తి వే
వేగఁ గపీంద్రునిన్ శరణువేఁడి తదీయసహాయతన్ రయం
బౌగతి వార్ధిఁగట్టి రణమందు జయించె నవధ్యు రావణున్.

ఉ. రావణ కుంభకర్ణులను రాక్షసవీరులఁ జంపి జానకిన్
బావనశీలఁ జూచి యలపాతకుఁ బొందితి వంచుఁ బల్కె నౌ
రా, విధి ! సర్వముం దెలియునట్టి మహాత్మున కెంతవచ్చెఁ ద
ద్భావ మెఱింగి తా నిడియెఁ బావకశోధ ధరాత్మజాతయున్.

క. పిమ్మట నవ్వనితం గొని
సమ్మదమున నుండె రామచంద్రుఁడు మాయన్
సొమ్మసిలి యిట్టు లవతా
రమ్ముల విష్ణుండు మిగుల భ్రాంతిం బొరయున్. ౨౨౬

క. విను శ్రీకృష్ణునిచరితం
బును వచియించెదను నతని పుట్టువునకు నో
జనమేజయనరవర ! య
య్యనిమిషకార్యంబ ముఖ్యమగు ఫలముసుమీ. ౨౨౭

శా. కాళిందీపులినమ్మునన్ విపులశాఖాశోభివృక్షావళీ
హేలాలోలత నొప్పెడి న్మధువనం బిందిందిరానందమై
కాలాభీలబలాధికుండు లవణాఖ్యాకుండు నాజన్మదు
శ్శీలుం డమ్మధుపుత్రుఁ డవ్వనమునం జేయు న్నివాసంబొగిన్.

మ. ధరణీదేవుల బాధ పెట్టుచు నితాంతమ్మున్ వరప్రాప్త దు
ర్భరగర్వమ్మున నిక్క నద్దనుజు సత్త్రాణుండు శత్రుఘ్నుఁ డు

ద్ధురుఁడై త్రెళ్లఁగ నేసి యవ్వనమునందుం బట్టణ మ్మొకఁడుఁ
ధరణీరత్నము నాఁగఁగట్టె మథురానామంబు చెన్నారఁగన్.

వ. అమ్మథురాపురమ్మునకుఁ బదంపడి తన పుత్త్రులఁ బుష్కరాక్షుల
నిరువుర నొడయలుఁగఁ జేసి యరుగుడుఁ గొండొక కాలమ్మునకుఁ
దద్వంశంబు క్షయంబగు కతన సప్పురి యాదవులకు వశమయ్యె.

గీ. ముక్తిదంబగు నప్పురమ్మును యయాతి
తనయుఁడగు శూరసేనుఁ డుద్ధతబలాఢ్యుఁ
డేలు నతనికిఁ బుత్త్రుఁడై యెసఁగెఁ గశ్య
పుఁడు వరుణశాపమునఁ జేసి భూవరేణ్య. ౪౫౧

వ. అతండు వైశ్యవర్తనుండగు కతన నమ్మథురాపురంబు మధువంశ
సంభవుండగు నుగ్రసేనుం డేలుచుండె నతని కొమరుండు
కంసుండు, కశ్యపుభార్యయగు నదితి దేవకతనూజయై దేవకినాఁ
బరఁగి కశ్యపాంశంబున జనియించిన వసుదేవునకు భార్యయయ్యె.

క. దేవకుఁడు దేవకిని వసు
దేవున కిడి పెండ్లిచేసె దేవహితముగా
నావేళ నంబరమ్మున
నావిర్భవ మందె నిట్లు లబ్రిపుఁబలుకుల్. ౪౫౩

క. "విను మీదేవకి కుదయిం
చిన సంతానమున మిగులఁ జేవందగువాఁ
డెనిమిదవ కొమరుఁడాతఁడు
నినుఁ దునుముంజుమ్ము కంస! నిర్దరహితుఁడై". ౪౫౪

వ. అను నయ్యాకాశవాణి పలుకులకుఁ దలరి కంసుండు చింతా
క్రాంతుండై తన మరణం బికొక్కమలిం జంపినఁ దప్పునని
యట్లొనరింప నుంకించి నిజాంతర్గతంబున. ౪౫౫

గీ. చెలియ లుత్తమురాలు నాచేయు మన్న
నలకుఁ దగుఁగాని యిబ్భంగి నఱుకులకును
దగునె యని కొంత యోజించి తన మరణము
కన్న నొక్కింత యిది లెస్సగాదె యనుచు. ౪౫౬

క. కాయము గలిగినఁ బాపము
ప్రాయశ్చిత్తమున నైనఁ బాయందగు నా
త్మీయశరీరము పాపో
పాయంబుననైన నిలుపఁ బాడియకాదే. ౪౫౭

వ. అని నిశ్చయించి,

ఆ. వె. ఎల్లవారుఁ జూచి యిది యేమి యనుచు నా
శ్చర్యమంద రయమెసంగఁ గత్తి
కరమునం దమర్చి కడఁగి యద్దేవకి
కొప్పు వట్టెఁ బెండ్లికూఁతు రనక. ౪౫౮

గీ. చెలియలఁట యించుకేనియుఁ జెట్టదలఁచి
యెఱుఁగదఁట కంసునకుఁ జేతు లెట్లువచ్చె
గడగడ వడంకు నక్కన్నెగళము నఱుకఁ!
గఠినచిత్తుల కెక్కడఁ గరుణ గలదు. ౪౫౯

మ. కరవాలమ్మున నిట్టు లాపెగళముం ఖండించు నాలోన నా
తురుఁడై యవ్వసుదేవుఁ డడ్డపడియెం దోడ్తోన తత్పుత్రులు
స్థిరులై యాదవవీరులెల్ల నకటా, చింతింపు మెందేని ని
క్కరణిం జేయుదురే దురాత్మ! యని సంగ్రామాభి[illegible]

వ. తలఁపడి హాహాకారమ్ము లొనర్చుచుఁ బోరాడునయ్యెడఁ గంసుం
డబ్బాలికఁ బిడిచి వారల మాఱ్కొనియె నంత సంగరం బభంగురం
బగుడు వృద్ధులెల్లరుఁ గంసు వారించి యనునయించి యిట్లనిరి.

చ. లలన వధించు టన్న మొదలం గడుఁ బాతక మంతఁబోక నీ
చెలియలు పెండ్లికూఁతు రొకచెట్ట యెఱుంగదు నీకు నెంతయుం
దలఁపఁగ మాననీయ యిటు దారుణకృత్య మొనర్పఁ జెల్లునే
చెలియలిఁ జంపు దుర్మతులు శ్రేయముఁ జెందుట యొందుఁ గందుమే!

ఉ. అంబరవాణివాక్య మిది యంచుఁ దలంపకు మెవ్వఁడో యస
త్యంబునకుం దలంకక వృథా వసుదేవునియిల్లు గూల్ప నీ
కుం బహుదుర్యశంబు నొడఁగూర్పఁగ మాయలమారియై యిటుల్
పంబినయింద్రజాల మిది పాటిగఁ జూతు రఁటయ్య! ధీనిధుల్.

వ. అవశ్యమ్మునుఁ గాఁదగుకార్యమ్ములు కాకతీర వొకవేళ నిది
నిక్కంబుగ నంబరవాణియ పల్కిన నీకుం దప్పింప వచ్చునే
యని బహుభంగులఁ జెప్పినఁ గంసుండునుఁ జేయునదిలేక మిన్న
కున్న వసుదేవుం డతని కిట్లనియె. ౪౬౪

చ. తలఁకకు మిందఱున్ వినఁగఁ దథ్యముగాఁ బ్రతినం బొనర్తు నీ
లలనకుఁ బుట్టినట్టిశిశులం దగ నీకిడువాఁడఁ దక్షణం
బలమి హరింపు మిట్టి మరియాదకుఁ దప్పితినేని నాదుపూ
ర్వులు నరకాలయంబునకుఁ బోయెడివార లటంచుఁ బల్కినన్.

క. వసుదేవుఁ డాడి తప్పఁడు
వసుధాస్థలి గ్రుంగినన్ విభావసుఁ డస్తా
ద్రిసమీపమ్మునఁ బొడమిన
నసత్యమిది గా దటంచు నందఱుఁ గంసున్. ౪౬౬

వ. తల విఱిచి యొప్పించిన నతం డతనివాక్యమ్ములు విశ్వసించి గత
క్రోధుండై మిన్నకుండె. వసుదేవుండు భార్యతోడఁ దనగృహ
మ్మున కరిగి నిర్భయుండై యుండె. ౪౬౭

క. పిమ్మట నద్దేవకి గ
ర్భమ్మును ధరియించి పూర్ణభరసముపేత
త్వమ్మడరఁ గనియెఁ గొమరుఁ
గమ్మనివిలుకానికన్న ఘనుఁ డగువానిన్. ౪౬౮

—* దేవకీసుతవధ *—

వ. అంత వసుదేవుండు దేవకిం గాంచి తనప్రతిన నెఱపం దలఁచి
యిట్లనియె. ౪౬౯

క. వనితా ! యీబాలునిఁ గం
సునిచేఁ జంపింతు ననుచు శోకింపకు మె
వ్వనివశమగుఁ బ్రారబ్ధ
మ్మును దాఁటఁగ ననుచు నిట్లు పొలఁతి వచించెన్.

క. తనముపు రాకృతకర్మం
బునకుం దీర్థాటనంబు మొదలగు సుకృత
మ్మున నాశ మబ్బకుండునె ?
వినమే ధర్మనిధులైన పెద్దలపలుకుల్. ౪౭౧

క. గురుతల్పగుండు కనకము
హరియించినవాఁడు బ్రహ్మహంతయు మద్యా
దరుఁడును బండ్రెండేఁడులు
కరము వ్రతం బెనసి శుద్ధిగాంచుట వినమే ?

క. మనువు మొదలుగాఁ గలిగిన
మునులెల్లను జెప్పు ధర్మములు వమ్మాలె? శా
స్త్రనియతిఁ బ్రాయశ్చిత్త
మ్మును బొనరుచునరుఁడు పాపముక్తుఁడ కాఁడే? ౪౭౩

చ. అగునది కాకతీర దను టంత వివేకము కాదు యత్న మె
ప్పుగుగతిఁ జేసి తత్ఫలము నందుట కానమె? యిట్లు కాని-చో
నిగమములుఁ మఖమ్ములు మునిప్రవరుల్ పరమాపధమ్ము లా
దిగ నఖిలం బసత్యమ, మదిం దలపోయు ముపాయ మిత్తరిఁ.

క. కేవలదైవాధీనత
భావమ్మున నెంచి చిన్నిపాపని విడువం
గావచ్చునె? ధర్మ్యమ్మగు
త్రోవఁ బ్రదికింపుమింత మందుడు కేలా? ౪౭౫

వ. నాపుడు వసుదేవుండిట్లను. ౪౭౬

క. లలనరో! యత్నం బొనరుప
వలె నను టొప్పితిని దైవవశమగు యత్నం
బులఫల మనియెఱుఁగుము కే
వలయత్నమువలన ఫలము వడయుట కలదే? ౪౭౭

వ. ఈ సంసారమ్మున సంచితప్రారబ్ధవర్తమానభేదమ్మునఁ గర్మంబు మూఁడు తెఱంగు లందు సంచితవర్తమానంబులకుఁ బ్రాయశ్చిత్తంబు నివర్తకం బగుఁ గాని ప్రారబ్ధంబునకుఁ గానేరదు. జీవుండు పూర్వదేహంబు విడిచి శుభాశుభకర్మానుసారంబుగ దివ్యదేహం బొండె యాతనాదేహం బొండె ధరియించి స్వర్గనరకమ్ముల ననుభవించి పదంపడి మరలఁ బుట్టుసమయమ్మునఁ గర్మబద్ధుండై

జనియించి ప్రారబ్ధం బనుభవించుఁ గావున నిబ్బాలుం డవశ్య
మ్మును గంసున కీఁదగువాఁ డని మఱియును. ४२५

క. ఆరయ నసారమగు సం
సారమ్మున సత్య మొకటి సార మ్మగు నె
వ్వా రద్దానిఁ ద్యజింతురు
వారల జీవచ్ఛవములు వనరుహనయనా ! ४२६

వ. కష్టసుఖమ్ములు లెక్కింపక సత్యమ్మునఁ బ్రవర్తించువారలకుఁ
గ్రమమ్మున శుభమ్ములు చేకుఱు నిక్కం బింత యొఱింగి
యిబ్బాలునిఁ గంసున కిడ సమ్మతింపు మనవుడు దేవకి శోకసంత
ప్తయై వేపమానయగుచుఁ గొమరుని వసుదేవున కిచ్చిన నతఁడు
కంసుసదనమ్మునకుం జను సమయంబున, ४३०

క. బాలకునిఁ గేలఁ గొని చిం
తాలేశము లేక కంసు దరి కరిగెడి స
చ్ఛీలుని వసుదేవునిఁ గని
వాలాయము మెచ్చి రెల్ల పౌరులు నధిపా ! ४३१

క. ఇతఁడ మహాత్ముఁడు సత్యం
బితని యధీనంబు సఫల మీతని జన్మం
బితనికి నితరుల కెన్నఁగ
శతాంశ మంతరము సత్యసమ మొకఁడున్నే ? ४३२

క. ఒడలి తడియైన నాఱని
కొడుకుం గంసునకు ఘాతుకున కిడుటకు నీ
తఁడు తడఁబడఁ డక్కట ! యె
క్కడ నేనియు నింత సత్యకర్ములు గలరే ? ४३3

వ. పదంపడి వసుదేవుండు కంసునకు బాలకు నిచ్చిన నతం డతని ధైర్యమునకును సత్యమ్మునకును మెచ్చి నాకీబాలుండు మారకుండుగాఁ "డష్టమగర్భం" బనికదా యంబరవాణి వచియించె; నిర్నిమిత్తంబుగ వీని వధింపనేల ? గృహమ్మున కరిగి వీనిం బోషించుకొమ్ము నావుడు వసుదేవుం డట్లొనరించెఁ, బిమ్మటఁ గంసుండు మంత్రుల కీ యుదంతంబు చెప్పిన వారును లెస్స చేసితి వని సంతసించి యాత్మగృహముల కరిగిరి. ౪౮౪

ఆ. వె. అంత నతనికడకు నరుదెంచె నారదుం
డమ్మునీంద్రునకుఁ గ్రమమ్ముగఁ దగ
నర్ఘ్యపాద్యకృతుల నర్పించి వచ్చిన
కారణంబు నడుగఁగా నతండు. ౪౮౫

మ. పలికెం జిర్నగ వొప్పఁ గంస ! వినుమీ బ్రహ్మాదు లెల్లందగన్
గలయం జేరి నినున్ హరించుటకునై కంజాక్షునిన్ దేవకీ
తలునీపుత్రునిఁగా నొనర్త మని మంత్రిం బాచరింపంగ నే
నెలమిన్ వింటి శిశున్ వధింప వకటా, యేమందు నీ తెల్వికిన్ !

వ. నావుడుఁగంసుం డష్టమగర్భంబుమన్న ప్రతికింగారణంబని యాకాశవాణి నుడివెఁ బ్రిధము వధింపనేల ! యన నారదుండిట్లనియె.

మ. అరయం జాలవు దేవతల్ మిగుల మాయాకోవిదుల్ శత్రువుం
బరిమార్పం దగుఁగాని యల్పుఁ డనుచుం బాటింపఁగారాదు త్వ
న్మరణం బష్టమగర్భజాతవశమైనన్ దక్కువారేడ్గు రొం
డొరులంగూడి సహాయులై నభరమానోకాదొ యూహింపుమా !

వ. అని యతం డరిగె నంతఁ గంసుండు మరల బాలకు రప్పించి యొక పాషాణమ్మునం బడవైచి సుఖం బుండె నావుడు జనమేజయుండు దుఃఖాక్రాంతుండై యిట్లనియె. ౪౮౭

ఉ. పుట్టినతోడనే మరణముం గన నాశిశు వంతలోనఁ దాఁ
గట్టిన పాప మేది ? మునికాంతుఁడు నారదుఁ డిట్టి పాపసం
ఘట్టనకుం దలంక కిటు కంసునిఁ దాఁ బురికొల్పనేల ? యె
ప్పట్టునఁ గర్త, కారయిత, పాపమునన్ సమభాక్కు లేకదా ?

వ. నావుడు వ్యాసుఁడిట్లనియె. ౪౯౧

ఉ. అమ్మునిసత్యవాది కలహప్రియుఁ డంతియకాని దీనఁ బా
పమ్ము గణింప లే దనుచుఁ బల్కఁగరాదు నరేంద్ర ! బాలష
ట్కమ్మిటు కంసుచేత మృతిఁ గాంచెను శాపము కారణమ్ముగా
బమ్మకునైనఁ గర్మపరిపాకము మిన్నక పోవ నేర్చునే. ౪౯౨

వ. స్వాయంభువమన్వంతరమ్మున మరీచికి నూర్ణ యనుభార్య యం
దార్వురు పుత్రులు గలిగిరి వారు కొండొకకాలమ్మునఁ గొమిరె
యగు సరస్వతిం గవియ నుంకించిన విరించిం గాంచి పరిహాసిం
చుడు నతం డలిగి "దైత్యయోనిం బుట్టుం" డని శపించిన నాష
డ్గర్భులును కాలనేమికి సుతులై రెండవజన్మమ్మున హిరణ్యకశిపు
నకుం బుట్టి విజ్ఞానంబుకతన విరించి గుఱించి తపం బొనరిం
చుటయు. ౪౯౩

గీ. అతఁడు ప్రత్యక్షమై వారి కనియె, నాఁడు
కోపయుక్తుఁడనై మీకు శాపమిచ్చి
తిని భవత్తప మిప్డు నామనము గరఁచె
వర మొసంగెదనన గర్భు లరసి యతని. ౪౯౪

క. వర మిడఁగ నీకు నిచ్ఛ య
మరిన నమరదనుజసిద్ధ మానవులు మముం
బొరిపుచ్చలేమి యొసఁగుము
స్థిరజీవుల మగుదు మనుడుఁ జెచ్చెర నొసఁగెన్. ౪౯౫

వ. అంత హిరణ్యకశిపుండు కొమరులంగాంచి నన్ను విడిచి మీరు చతురాననుం గుఱించి తప మ్మొనరించి వరంబు వడసి యవమా నించితిరి కావున మీరు నాకడ నుండఁదగరు. పాతాళమ్మునకుం బోయి యెల్లవేళ నిద్రాధీనులై చిరముండి పదంపడి దేవకీగర్భ మ్మునం బుట్టునది. ౪౯౬

క. వెనుకటి జన్మమ్మున మీ
జనకుండగు కాలనేమి జనియించును గం
సునిరూపముగొని యాతఁడ
జనియించిన యప్డ మిమ్ముఁ జంపెడు మనుచున్. ౪౯౭

వ. శాపం బొసంగె నది కారణంబుగ షడ్గర్భులు దేవకి కుదయించి కంసునిచేఁ జచ్చిరని మఱియు నిట్లనియె. ౪౯౮

గీ. కంసుచెలియలు సప్తమగర్భ మంతఁ
దాల్చె శేషాంశమున, దానిఁ దాఱుమాఱొ
నర్చె నయ్యోగమాయ, జనంబు లాపె
గర్భ మెడలె నటంచు విక్లాంతులైరి. ౪౯౯

వ. కంసుఁడును నైదవమాసమ్మున దేవకికి గర్భపాతంబాదవె నను మాట విని సంతసించె, నా శిశువును రోహిణీగర్భమ్మున వృద్ధి బొందుచుండె, నంత దేవకియు మరలఁ జూలుదాల్చె. ౫౦౦

క. ఎనిమిదవగర్భమున స
త్త్వనిధి సరోజాక్షుఁ డెలమి ధరణీభారం
బును దీర్చి దేవకార్యం
బొనరింప వసించె సంతతోజ్జ్వలదీప్తిన్. ౫౦౧

వ. అట్లు దేవతలందఱును దమతమ యంశమ్ములఁ నుద్భవించి రీ తెఱంగు సంక్షేపమ్ముగ నాలింపుము. ౧౭

క. వసుదేవుఁడు కశ్యపుఁ డ
వ్వసుదేవునిభార్య యదితి పార్థివ! శేషాం
శసముద్భూతుఁడు బలరా
మసమాహ్వయుఁ డింక నొక్క మర్మము వినుమీ.

క. నరుఁడును నారాయణుఁడును
నరయఁగ ధర్ముని కుమారులని తెల్పితి న
న్నరుఁ డర్జునుఁడై పుట్టె
న్నరవర! కృష్ణుఁ డయి పుట్టె నారాయణుఁడున్. ౧౦౪

వ. మఱియు ధర్మాంశమ్మున విదురయుధిష్ఠిరులును ననిలాంశమ్మున భీముండును నశ్వినుల యంశమ్మున నకులసహదేవులును సూర్యాంశమ్మునఁ గర్ణుండును బృహస్పతి యంశమ్మున ద్రోణుండును యమరుద్రకామక్రోధమ్ముల యంశమ్మున నశ్వత్థామయుఁ బుట్టిరి. శంతనుండు సముద్రాంశమ్మునఁ బొడమె.

గీ. శంతనుండు సముద్రాంశ జనితుఁ డైన
కతనఁ బతి గాఁగ వరియించె గంగ యతని
వసువు భీష్ముండు, గంధర్వవరుఁడు దేవ
కుఁడు, మరుద్గణ మవ్విరాటుఁడు, నృపాల! ౧౦౬

వ. కృపాచార్యుండును గృతవర్మయు మరుద్గణాంశసంభవులుగా నెఱుంగునది. అరిష్టనేమిసుతుండగు హంసుండు ధృతరాష్ట్రుండు, కలి దుర్యోధనుండు, ద్వాపరంబు శకుని, సోమప్రరువను యాదవుఁడు సువర్చుండను సోమపుత్రుండు, ధృష్టద్యుమ్నుండనలాంశ

సంభవుండు, శిఖండి రాక్షసాంశసంభూతుండు, ప్రద్యుమ్నుండు సనత్కుమారుండు, వరుణుండు ద్రుపదుండు, లక్ష్మి ద్రౌపది పాంచాలీపుత్రు లేవురును విశ్వేదేవాంశజులు. ౧౦౭

క. కుంతియు మాద్రియు నను నీ
యింతులు సిద్ధియును ధృతియు నృప ! గాంధారీ
కాంత మతి, వేలుపులరో
యింతులు పదియాఱువేలు కృష్ణునిభార్యల్. ౧౦౮

వ. ఇంక నసురాంశజుల వినిపింతు, హిరణ్యాకశిపుండు శిశుపాలుండు విప్రజిత్తి జరాసంధుండు, ప్రహ్లాదుండు శల్యుండు, కాలనేమి కంసుండు, హయశిరుండు కేశి, గోకులమ్మున వధింపఁబడిన కకుద్మి యనువాఁడు బలిపుత్రుండగు నరిష్టుండు, అనుహ్లాదుండు ధృష్ట కేతుండు, బాష్కలుండు భగదత్తుండు, లంబుండు ప్రలంబుండు ఖరుండు ధేనుకుండు, వారాహకిశోరులను నీ యిరువురు రక్కసులును జాణూరముష్టికులను మల్లులు, దితిపుత్రుండగు నరిష్టుండు కువలయాపీడంబను గజము, బలిపుత్రి బకి, తదనుజుండు బకుఁ డిట్లు సురాసురుల యంశమ్ముల ననేకు లుద్భవించిరని వెండియు.

చ. అమరులు బ్రహ్మఁగూడి తను నారసి ప్రార్థనఁజేసి భూమిభా
రము హరియింపు మన్నపుడు రాక్షససూదనుఁ డిచ్చె రెండు కే
శములు సితాసితమ్ములు వెసన్ ; హరి శ్యామలవర్ణుఁ డయ్యెఁ దె
ల్పమరెఁ దదగ్రజాతునకు నయ్యది హేతువుగాఁగ భూవరా.

వ. ఈయంశావతరణం బెవ్వారలు భక్తిభావమ్మునఁ జదువుదు రవ్వారికి సమస్త శుభమ్ములు కరతలామలకమ్ము ; లట్లు దేవకీ పుత్రుల నార్వురఁ జంపి యేడవగర్భంబు పతితం బగుట నెఱింగి యష్టమగర్భమ్మును బ్రియత్నమ్మున హరింపఁ గంసుం డున్నంత.

క. హరి దేవకికడుపున సు
స్థిరుఁడై వసియించె నపుడు దేవహితముగా
నరుదెంచి యోగమాయయుఁ
గర మలరారెన్ యశోదగర్భము నందున్. ౫౧౨

ఆ. వె. గోకులమున రోహిణీకాంత కుదయించె
రాముఁ డంతఁ గాంతిధాముఁ డగుచుఁ
గంసుఁ డతిభయమునఁ గారాగృహమ్మున
నుంచె దేవకిని మదోద్ధతుండు. ౫౧౩

వ. అట్లుంచి భృత్యుల నట గావని యోగించె. వసుదేవుఁడును భార్యా స్నేహాయత్తచిత్తుండై యామెతో నక్కారాగారమ్ముఁ బ్రవేశించి కుమారోదయమ్ము చింతించుచుండె నంత దేవకార్యార్థియగు విష్ణుండు దేవకీగర్భమ్మున నమరసంస్తూయమానుండగుచుఁ గ్రమమ్మున వృద్ధిఁ జెంద దశమాసపూర్తి యయ్యె. ౫౧౪

—* శ్రీ కృ ష్ణో ద య ము *—

గీ. శ్రావణమ్మునఁ గృష్ణపక్షమున రోహి
ణీకలిత మైన యష్టమి నాకులత్వ
మడరఁ గంసుండు దైత్యుల నరసి పల్కె
"నష్టమం బిది గర్భంబు కష్టదంబు. ౫౧౫

ఉ. దీన జనించుబాలకుఁడు తెల్లముగా ననుఁ జంపు నిక్క మె
ల్లైనను వీనిఁ జంపవలె నప్పుడు నిద్దుర పట్టఁగా వలెన్
లేనియెడన్ సుఖమ్ము లిఁక లేవు శ్రమింపడి మీర లందఱున్
బూనికఁ గాచి యుండవలెఁ బుట్టినతోడనె చెప్పఁగావలెన్." "

వ. అని వారల నియోగించి గృహమ్మున కరిగి చింతావిష్టుండై నిద్రాదికం బెఱుంగక యొకభంగి నతఁడుండె. రక్కసు లంద ఱును దమతమ యాయుధమ్ములు ధరియించి జాగరూకులై కాచుచుండి రయ్యెడ దేవకి వసుదేవున కిట్లనియె. ౧౧౭

క. అసహాయ నైననాకుఁ
బ్రసవసమయమాయెఁ జేయుపని యే మిట ర
క్కసులు నలుగడలఁ గాపుగ
నసమానబలాఢ్యులుండి రకట ! మహాత్మా ! ౧౧౮

వ. మున్ను నందునిపత్నియగు యశోదకును నాకును నొక్క సమ యంబు గల దెట్లంటేని " నీకుం బొడము నపత్యంబు మస్మందిర మ్మున కనుపుము. మదపత్యంబు నీగృహమ్మున కనిపెద " నావుడు వల్లెయని యే నొప్పితి నిప్పు డప్పని యెట్లు సేయనగునని చింతించుచు గర్భభరంబాఁగఁజాలమి సిగ్గటి పతికిట్లను. ౧౧౯

క. భరమాయె గర్భవేదన
యరుగుము సిగ్గాయె నిన్ను నరయఁగ నని స
త్వరమున మొగ మటుచేసి కొ
మరునింగనె మరుని నగు కొమరుగలవానిన్. ౧౨౦

ఆ. వె. చెప్పనలవిగాని చెలువున నొప్పారు
చిన్ని బాలుమోము చెలువ గాంచి
పులకితాంగి యగుచు నెలమిని వసుదేవుఁ
బిలిచి శిశువుఁ జూపి పలికె నిట్లు. ౧౨౧

క. కనుఁగొను మాముఖకాంతియుఁ
గనులవిశాలతయుఁ జెలువుగల మృదుకాయం

బును నెన్నఁడేని యిట్టిఁడు
జనియించెనె యేరికేని సదమలహృదయా. ౫౨౨

ఉ. చచ్చెడివానికిన్ మిగులఁ జందము నందముఁ గల్గు నంచు వి
ద్వచ్చయ మాడుమాటలు వృథాయగునే యెటు లీఁగ నేర్చె దీ
విచ్చిలుత్కన్ జగమ్ములఖిల మేలెడి తేజము వొల్చువానిఁ గా
ర్చిచ్చననొప్పుకంసునకు జీవవిఘాతికిఁ జేతులారఁగన్. ౫౨౩

వ. అనవుడు వసుదేవుం డక్కుమరుమొగం బాలోకించుచు నితి
కర్తవ్యతాశూన్యుండై యున్నంత నాకాశవాణి విశదాక్షరంబుగ
నతనిం బిలిచి యిట్లనియె. ౫౨౪

ఉ. అందఱు రక్షకుల్ నిదుర నందిరి నా పెనుమాయకల్మి, దీ
నందగు తల్పులున్ విడియె నా వలనన్, వినుమింక నష్టు లే
దెందును; వేగ నీ శిశువు నెత్తి యురమ్మునఁ బట్టి గోకులం
బందు యశోదగేహమున యందిడు మేటికి సందియంబిఁకన్.

వ. నావుడు వసుదేవుండు బాలకు నెత్తికొని విశృంఖలుండై వివృత
మ్ములగు నా యష్టద్వారమ్ములు దాఁటి యోగమాయాప్రభావ
మ్మున నేరికి నలక్షితుండై జవుజవ్వనఁ గాళిందీతటమ్మున కరిగి
యది యెట్లు తరింపనగునని యెంచు నాలోన నయ్యదియు మొల
బంటి యగుడుఁ జయ్యన గోకులమ్మున కరిగి నిర్జనంబగు మార్గ
మ్మున నందుని మందిరంబు సొచ్చి తద్ద్వారమ్మునఁ బశువిభూతిం
జూచుచుండె. ౫౨౫

గీ. అంత నందుని భార్యయం దవతరించె
యోగమాయాంశసంపన్న యొక్క బాల
దాని వసుదేవునకు నిచ్చి తనయుఁ గొనియె
దాదినెపమున నజ్జగదాదిదేవి. ౫౨౬

వ. పిమ్మట వసుదేవుం డబ్బాలం గొని కారాగారమ్మున నున్న దేవకి పర్యంకమునుంచి తాను సమీపమ్మునఁ జింతావిష్టుండై యుండు నంత. ౨౮

క. ఆ కొమిరె మెల్ల మెల్లన
ప్రాకృతబాలికయుఁ బోలె బహుమధురరస
శ్రీకలితంబుగ నేడువ
వే కళవళమంది లేచి భృత్యులు గడఁకన్. ౨౯

ఆ. వె. కంసుకడకు నేగి కనియె దేవకి పుత్రి
నరుగుదెమ్ము వేగ మనుడు నతఁడు
నరిగి తలుపుఁ దీయు మనుచు నవ్వసుదేవుఁ
బిలిచి యిట్టులనియె నలుక వొడమ. 30

క. ఎనిమిదవ గర్భ మియ్యది
ననుఁ జంపఁగ నెంచి దీన నారాయణుఁడే
జనియించు నంచు వింటిన్
దునుమంగా వలదె యిట్టి దుష్టుని శిశువున్. ౩౧

వ. జాగుసేయక తెమ్మనుడు భయత్రస్తుఁడుంబోలె వసుదేవుండు చింతించుచు నబ్బాలందెచ్చి కంసుని హస్తమ్మునం బెట్టిన నతండు సూచి సంశయగ్రస్తుండై నిజాంతర్గతమ్మున, ౩౨

ఉ. ఏమిది! క్రొత్తపుట్టె మృష యెట్లగు నంబరవాణిపల్కు? మి
థ్యామతి నారదుం డనృతమాడునె! యివ్వసుదేవుమాయ నాఁ
గా మన మెట్టు లొప్పికొనుఁ? గాచెడివారలు చుట్టునుండఁ గ
న్యామణి యేడవచ్చె! సుతుఁడక్కట యెక్కడికేగెఁ జిత్రమా!

క. కాలగతి విషమ మని చిం
తాలోలుం డగుచు బాల సంఘములఁ గొని యా
భీలగతి బిట్టు వైచెన్
దూలి యుపలమందుఁ బడఁగఁ దుందుడుకు మెయిన్.

వ. అక్కులపాంసనుం డిట్లొనర్చిన నబ్బాల కరమ్మునుండి జాఱినంతన యుప్పరమ్మున కెగసి దివ్యరూపధారిణియై మృదుస్వరమ్మున నిట్లనియె. ౧౩౫

క. ననుఁ జంపినంత నేమగు
వినుమో దుష్టాత్మ! మిగుల వీరుఁడు నీకై
జనియించినాఁడు వృద్ధిం
గనుచున్నాఁడతఁడు నిజము గడతేర్చు నినున్. ౧౩౬

వ. అని నుడివి తనంత నరిగెఁ బిమ్మటఁ గంసుం డతివిస్మితుండై తన గృహమ్మున కరిగి బకధేనుకవత్సకప్రలంబముఖులం గాంచి యిట్లను. ౧౩౭

ఉ. గోకులమందుఁగాని మఱి కొంకక యెచ్చటఁ గాని పుట్టు దు
ష్పాకులఁ బాకులన్ విగతసంశయులై వధియింపుఁ డిందఱు
న్నాకయి జాగరూకతఁ గనందగుఁ బూతన బాలహంత్రి దా
నీ కృతియందు నేర్పుగల దెంతయు నయ్యది మీకుఁ దోడగున్.

వ. ఇట్లు నియోగించి చింతావిష్టుండై యతం డుండె నంతఁ బ్రాతః కాలంబయ్యెఁ బదంపడి నందుండు సంతుష్టాంతరంగుండై పుత్రోత్సవం బొనరించె. ౧౩౯

క. నందుఁడు పుత్రోత్సవ మా
నందగతి నొనర్ప నదియు నాలుగు దెసలం

బొందుపడెఁ గింవదంతిగ
నందంద చరించుచారు లతిరభసముగన్, ౫౪౦

వ. కంసుకడ కరిగి నుడివిరి. అంతకుమున్న యతండును నారదునిచే బోధింపఁబడినవాఁడగుట గోకులమ్మువంక నతిక్రోధమ్ముగలఁడై యుండె నంత, ౫౪౧

—* శ్రీ కృష్ణ లీలలు. *—

ఉ. పూతనఁ జంపె, ధేనుకు నపూర్వబలున్ వధియించె, వత్సకున్
బాతకు నబ్బకాసురునిఁ బట్టి యడంచెఁ, బ్రలంబుఁ జెండె, గో
జాతమురక్షసేఁతకు వెసన్ గిరి యెత్తె నటంచు విం చు న
త్యాతురుఁడయ్యెఁ గృష్ణునెడ నాత్మవధంబున నిశ్చితాత్ముఁడై.

వ. పదంపడి కేశియనురక్కసుం గూడ దునుమాడుట యాలించి యుపాయమ్మునఁ గృష్ణు వధింప నెంచి ధనుర్యాగంబు నెపమ్మున బలరామ కృష్ణుల రప్పించువాఁడై యక్రూరుం బనిచిన నతం డరిగి రథం బెక్కించ కొని వారలం దోడికొని వచ్చె నంత,

గీ. ధనువు భంజించి రాజుల దర్ప మడఁచి
గజము వధియించి చాణూరుఁ గసిమసంగి
ముష్టికునిఁ జంపి శలుని నిర్మూలుఁజేసి
తోశలు హరించి రిపువు రుద్ధురత మెఱయ. ౫౪౪

మ. సిగచేతం గొని పట్టి యీడ్చి సమరస్థేమాభిరామత్వ మొ
ప్పుగఁ గంసుం బరిమార్చి లీలమెయి నంబాశృంఖలల్ వాపి బం
ధగతున్ దండ్రి వదల్చి రాజ్యమునకు న్నాథుండుగా నుగ్రసే
నుఁ గడున్ వృద్ధు నలంకరించె హరి తన్ను న్నిర్జరుల్ మెచ్చఁగన్.

వ. పిదప వసుదేవుం డబ్బలరామకృష్ణుల కుపనయనం బాచరించి సాందీపనునొద్దకు విద్యాభ్యాసమ్మున కనిచెఁ బదపడి వారు గురుకుల వాసమ్ము చేయుచు సమస్తవిద్యల నభ్యసించి ద్వాదశాబ్దమ్ములవారయి మధురాపురమ్మున సుఖమ్మున నున్నయెడ నల్లుని మరణంబు విని కలుషితాంతరంగుండైన జరాసంధుండు మధుర నరికట్టి ఘోరంబగుసంగరం బొనర్చి పరాజితుండై యరిగె నిట్లతం డేడుమార్లు కృష్ణునితో నెదిరి యోహటించి మ్లేచ్ఛాధిపతి యగు కాలయవనుం బురికొల్ప వాఁడును యాదవభయంకరుండై మధురపై నెత్తివచ్చినఁ గృష్ణుండు యాదవసమక్షమ్మున బలరామున కిట్లనియె. ౧౪౬

క. పాతకుఁడు జరాసంధుం
డీతని నంపించె వీఁడు నెంతయు బలవి
ఖ్యాతుండు ప్రబలసైన్యో
పేతుం డిత్తులువతోడఁ బెనఁగుట భరమౌ. ౧౪౭

క. ధనమును గృహమును వీడియుఁ
దన ప్రాణము రక్షసేత ధర్మంబగు సా
ఖ్యనియతిఁ జొప్పడు నెయ్యెడఁ
దనకది పితార్జితముగఁ దలఁపఁగ వలయున్. ౧౪౮

వ. పూర్వార్జితంబగు దేశం బెల్లప్పుడుఁ దనకు భయజనకంబేనిఁ గులోచితం బని యట వసించుటకన్న శైలసాగరనికటంబున నేని నిష్కంటకంబుగ వసించుట సమంజసంబని పెద్దలు వల్కుదురు.

చ. హరి శయనించు నంబునిధియం దహితల్పమునన్ భయమ్మునన్
హరుఁడు వసించు రాజతకులాచలగహ్వరమందు నింకఁ ద

క్రూరుల గణింపనేల ? మన మొక్కుమొగిన్ బురి వీడి ద్వారకా
పురమున కేగి సౌఖ్యములు పొందుట లగ్గని నాకుఁ దోఁచెడిన్.

వ. అప్పురవరంబు రైవతాచలంబుకడ సముద్రతటమ్మునఁ గలదనియు నతిమనోహరంబనియును గరుఁడుండు సెప్ప ననుడు యాదవులు సమ్మతించి సకుటుంబమ్ముగఁ దరలి బలరామకృష్ణపురస్సరులై కతిపయదినమ్ములకు ద్వారవతి కరిగి యప్పురమ్మునఁగల జీర్ణ గృహమ్ములఁ బునరుద్ధరణంబొనర్చి సుఖం బుండిరి. పిదప బలరామకృష్ణు లిరువురును నిర్జనమ్మగు మధుర కేతెంచియటవసించుచున్నంత యవనుండు మరల నప్పురంబు ముట్టడించె. ౧౧౨

చ. హరి పురి వీడి వైళ మసహాయతఁ దాఁ బదచారియై వెసం
బరుగిడె నంత వాఁడు నసమానరయమ్మునఁ బాదచారియై
యరిగెఁ బిఱుంద నీవరుస నయ్యదువీరుఁడు రక్కసుండు నో
కురువర ! యేగిరంత ముచికుందుని యాశ్రమపుణ్యభూమికిన్.

వ. హరియు నయ్యెడ నంతర్ధానంబుచేసె నయ్యవనుండునట నిద్రించుచున్న ముచికుందుం గాంచి శ్రీకృష్ణుండని యెంచి తనకాలఁ దన్నుటయు నారాజర్షి మేల్కని క్రోధతామ్రాక్షుండై యవను భస్మసాత్కరించి కెలనఁ గృష్ణుం గాంచి నమస్కరించి సన్నుతించెఁ బిదపఁ గృష్ణుండు బలరామసహితమ్ముగ ద్వారవతికరిగి యుగ్రసేనునిపై రాజ్యభార మ్మునిచి తాను యథేష్టమ్ముగ సంచరించుచుండె. ౧౧౩

క. అసహాయశూరుఁడగు హరి
వెస నా శిశుపాలువలన విడిపించి సమం
జసగుణయగు రుక్మిణి రా
క్షసోపయమవిధి గ్రహించె జగములు వొగడన్. ౧౧౪

గీ. జాంబవతి మిత్రవిందయు సత్యభామ
నాగ్నజితి భద్రయును లక్షణాతరుణియు
చేర్మిఁ గాళిందియును గృష్ణుఁ బెండ్లి చేసి
కొనిన భార్యలు సౌందర్యఖనులు భూప! ౧౧౧

క. ఆ రుక్మిణి శ్రీకృష్ణుని
గారామునఁ గూడి కొంతకాలమ్మునకున్
జారుతరగాత్రిఁ గనియెఁ గు
మారున్ బ్రద్యుమ్నుఁ గాంతిమహితాకారున్. ౧౧౮

వ. అయ్యర్భకునకు జాతకర్మాదికం బొనర్చినపిదప మాయాకోవిదుం డును బలిష్ఠుండునునగు శంబరుండు సూతికాగృహమ్మునుండి యా చిన్నిబాలు హరియించి మాయావతి కొసంగిన హరి చేయు నదిలేక చింతార్తుండై జగదంబ నిట్లు నుతించె. ౧౧౭

క. మును బదరికాశ్రమమ్మున
మనమునఁ దగ నిల్పి భక్తిమై నిన్నుం గొ
ల్చినవాఁడ గానె, నాపైఁ
గనికరమున్ మఱువఁ బాడిగా, జగదంబా! ౧౧౦

ఉ. ఏ నెటు నిల్వనేర్తు జగదీశ్వరి! యెవ్వఁడొ గానరాదు నా
సూనుని సూతికాగృహముచొచ్చి హరించె, మదీయమాన మి
ద్దాన నడంగదే జనని! దాసులదీనతఁ జూచి యోర్వఁ జ
న్నే! నగరే నినున్ జనులు! నీకు నొకింతయు లజ్జ పుట్టదే!

చ. నగరముచుట్టు కోటయఁట! నాగృహ మెన్నఁగ మధ్యమందు నొ
ప్పగునఁట! సూతికాగృహము నారయువార లనేకులుండ నె
వ్వగ హరియించె బాలకు నవారణలీల? మదీయపూర్వక
ర్మగతియు కాక వేఱొకటి గానఁగ రాదు నిమిత్త మియ్యెడన్.

గీ. ఏను బొరుగూరికిం జన నెల్లయాద
వులును గాచుచు నున్నారు తెలివికలిమి
నెవఁడు హరియించె మత్పుత్త్రు నెంచి చూడ
నంబ ! నీమాయ యొక్కింత యమరదేని. ౫౬౧

గీ. మందమతులగు మాబోఁట్లకుం దరంబె
జనని ! నీదుచరిత్రంబు చందమెఱుఁగ
బాలు గొనిపోవు చోరుండు పట్టువడక
యుండఁ గల్పించితివి మాయ యొరుల వశమె ? ౫౬౨

చ. పతి పరదేశవర్తియగు పట్టున రోహిణి నిక్కమా పతి
వ్రత బలరాము నెట్లుగనెఁ ? బాపవిదారిణి యన్యగర్భసం
గతు శిశువుం దగం దిగిచి కాదె తదంగనయందుఁ గూర్చి పెం
చితివి జగత్ప్రసిద్ధము విశిష్టము నీమహిమాం బొకింతయే ! ౫౬౩

చ. సకలము చేసి పెంచి పెలుచన్ హరియించెడితల్లి ! నాకుఁ బు
త్త్రకు నిడి సంతసం బిడినదానవు తక్షణ మిట్టివేదనా
వికలమనస్కఁ జేయఁ దగవే ? పగవాఁడనె ? కాక నీకు ని
ట్టి కృతులు బల్ముదంబును ఘటింపఁగఁబోలు నెవం డెఱింగెడిన్ !

క. దేవి ! తనూజుఁడు సుఖముల
తా వనియును సుతునిచావు తలిదండ్రులకున్
ప్రే వెడలుటయని చెప్పుదు
రే వెఱవున నిల్తు మొదలనే యిట్లైనన్. ౫౬౪

ఉ. ప్రీతిఁ ద్యజింప లేక కురరీగతి రోదన మాచరించు త
న్మాత గతిన్ దలంపు దయమాలినదానవు కాకుమమ్మ ! ప్ర
ఖ్యాతికిఁ జేటు దెచ్చుకొనఁగా మది నెంచకుమమ్మ ! నీవు గా
కీ తరుణిన్ భరింప నిఁక నెవ్వరు దిక్కు ? వచింపు మమ్మరో !

ఉ. జన్న మొనర్తునో? వ్రతము సల్పుదునో? భవదంఘ్రు లెంతయుం
దిన్నని భక్తి సూనములు తెచ్చి యజించి ముదంబు గూర్తునో?
కన్నసుతుం డొకించుకయుఁ గందును జెందక యుండెనేని నీ
కు న్నిఖిలాంబ! యేమి యొడఁగూర్పఁగ నేర నశక్య మేనియున్.

చ. తనయునిఁ దెచ్చి నా కొసఁగి తద్దయు మోదము గూర్చు మమ్మ! నీ
పని యగుఁగాని వేఱొకరు పాల్పడ రింతటిసేఁత కంచు మ
న్ననమెయి గృష్ణుఁ డెంతయు ననాథగతిన్ విలపింప నజ్జగ
జ్జనని కృపానుషంగయయి చయ్యన దర్శన మిచ్చె శౌరికిన్.

వ. అట్లు ప్రత్యక్షంబై యభయం బొసంగి నీకొమరుండు శాపకారణంబున శంబరునిచే హరింపఁబడి తద్గృహమ్మున నున్నవాఁడు మదనుగ్రహమ్ముకతనఁ బడియాఱవయేట నవ్వానిం జంపి నీకడ కరుదెంచు నిఁక శోకింపకు మనవుడుఁ గృష్ణుండును రుక్మిణియు సంతసమ్మునఁ జెలంగిరని చెప్పిన వ్యాసునకు జనమేజయుం డిట్లనియె. ౧౬౯

క. నారాయణాంశమునఁ జె
న్నారెడి హరి కెఱుకపడని యనువున గుప్తా
గారముననున్న బాలుని
నేరీతి హరించె నిక్కమే నిది చెప్పుమా. ౧౭౦

వ. నావుడు వ్యాసుండిట్లను. ౧౭౧

గీ. మనుజులు సురాసురు లొకింత మాయఁ గడవఁ
జాల రది యెంత కేనియుఁజాలు నెట్టి
బుద్ధిమంతునికైనను బొరయొసంగఁ
జేయు శాంభవి యేరికజేయు నిజము. ౧౭౨

—* శ్రీరామాదులు కించిద్‌జ్ఞులనుట *—

వ. క్షుత్తృణ్ణిద్రాతంద్రాభయశోకసంశయమోహాహర్షాభిమాన జరా
మరణాజ్ఞానగ్లానీర్ష్యాప్రీతిమదశ్రమమ్ములను నియ్యవి దేహజమ్ము
లగు భావమ్ములు. ౫౭౩

ఉ. రాముఁ డెఱుంగఁ జాలెనె యరణ్యమునం దన కగ్రవర్తియౌ
హేమమృగమ్ము రాకయు మహీసుతపోకయు నజ్జటాయు వా
లో మృతిఁ జెందు టాదిగ; ఖలుండగు రావణుఁ జంపి రాజ్యసు
శ్రీ మితిమీఱునాఁడు మును చెందిన బాముల నెన్న నేర్చునే.

గీ. మాయ బలవతి గాదేని మనుజనాథ!
యెఱుఁగఁజాలెనె తన తండ్రి మృతిని నాతఁ
డింతయేటికి సీత యున్నెడఁ దెలియఁగ
వనచరుల నలుదిక్కుల కనుపనేల? ౫౭౫

గీ. నాగపాశమ్ములను బడి నవయనేల?
సీత నిర్దోష యనక కార్చిచ్చు నందుఁ
బడుట కొప్పఁగ నేల? యాపై జనాప
వాదకుఁ దలంకి తా విడువంగ నేల? ౫౭౬

వ. పిమ్మటఁ దన పుత్త్రులగు కుశలవులఁ గుశలవులని ముని చెప్పకున్న
నెఱింగెనే? ఇది యిట్లుండ జానకి పాతాళమ్మున కరుగుటయుఁ
దమకుఁ గాలం బాసన్నం బగుటయుఁ దెలియ నేర్చునే? అట్లేని
దమ్మునిం జంప నుంకించునే యని వెండియు, ౫౭౭

క. మానవదేహము గైకొని
మానవరీతులఁ జెలంగె మహిమ మెడలి యా
శ్రీనాథుఁడు సందేహం
బూనఁగఁ బనిలేదు దీని కుర్వీనాథా! ౫౭౮

క. మొదలం గంసునిభయమున
యదుకులమణి యరిగె గోకులావాసంబుం
బదఁపడి ద్వారవతిని దా
నొదిగె జరాసంధుభీతి యొదవినకతనన్. ౧౭౯

గీ. ఎంత యన్యాయ మొనరించెఁ గృష్ణుఁ డకట!
యెఱిఁగి శిశుపాలుచే హరియింపఁబడిన
దాని రుక్మిణిఁ గైకొనె ధర్మవిదులు
మెచ్చికొందురె విని జనమేజయనృప! ౧౮౦

వ. మాయాయుక్తుండగు కతననకదా! శంబరుఁడు హరించిన పుత్త్రు
నెఱుంగఁజాలక దుఃఖించి పదంపడి దేవికతనఁ దెలిసి యానం
దించె నిదియునుంగాక, ౧౮౧

ఆ. వె. సత్య యాజ్ఞఁజేసి స్వర్గమ్మునకు నేఁగి
యింద్రుతోడఁ బోరి యెలమిఁగల్ప
వృక్ష మల్ల సత్యగృహమునఁ బెరటిచె
ట్టుగ నొనర్చె స్త్రీజితగతి నతఁడు. ౧౮౨

వ. సత్యభామయు నానందమ్మునఁ దద్వృక్షంబు తన తోఁట నాఁ
టించి పతియగు శ్రీకృష్ణుని నారదునకు దానం బొసంగి పిదపఁ
గనకమయం బగు కృష్ణ విగ్రహం బమ్మహామహున కిచ్చి విడిపించె.

గీ. అరసి ప్రద్యుమ్నుఁ డాదియైనట్టి సుతుల
జాంబవతి తన్నుఁ బుత్త్రలాభంబు కొఱకు
దైన్యగతి వేఁడఁ గృష్ణుఁడు తపమొనర్పఁ
జనియె నుపమన్యునాశ్రమమునకు నధిప! ౧౮౩

క. శివభక్తుండగు నుపమ్న్యు
ని వలనఁ బాశుపతదీక్ష నెఱిఁ గొని సన్న్యా
సవిధిమెయిఁ దపము సలిపెఁ
బ్రవిమలుఁడై శివుని మదినిఁ బాదుకొలుపుచున్.

వ. ఇట్లు ప్రథమమాసమ్మున ఫలాశియు ద్వితీయమ్మున జలపాయియుఁ దృతీయమ్మున వాయుభక్షియునై పాదాంగుష్ఠాగ్రమ్మున నిలిచి పుత్రార్థియై తనుం గుఱిచి ఘోరతపం బొనర్చు నా హరికి హరుం డాఱవమాసమ్మునఁ జంద్రకళాధరుండై వృషభారూఢుండై యిందాదిసురలు పరివేష్టింపఁ బార్వతితోఁ బ్రత్యక్షుండై, ౫౧౬

ఆ. వె. "వాసుదేవ! నీతపమ్మున కెద మెచ్చి
వర మొసంగ నిటకు వచ్చినాఁడఁ
గోరుకొమ్ము వలయుకోరిక లెల్ల నే
నిచ్చునప్డు కొదవ యొకింత కలదె." ౫౧౭

వ. అనవుడు కృష్ణుండు భక్తినమ్రుండై యద్దేవు పాదమ్ముల కెఱఁగి మేఘగంభీరభాషణమ్ముల నిట్లు నుతించె. ౫౧౮

గీ. దేవదేవ! జగన్నాథ! దివ్యమూర్తి!
సర్వభూతార్తినాశన! సకలలోక
కారక! సురారి హర! నీలకంఠ! శైల
జామనోహర! యజ్ఞఘ్న! శరణు నీకు. ౫౧౯

ఉ. ధన్యుఁడనైతిఁ బావనతఁ దాల్చితి జన్మము గణ్యమయ్యె సా
జన్యముగల్గె నీదుపదసారసముల్ గనుఁగొంటఁ జేసి; యే
నన్యముఁగోర స్త్రీమయమునైన మహత్తరపాశజాలముల్
దైన్యమునొందఁజేసె నివి దాఁటఁగఁ జేయఁగదే! కృపామతిన్.

క. మానవజన్మం బెత్తిన
దానికిఁ గా నాకుఁ గష్టదశ చేకూరెఁ
దీనఁ గృశియించు నాదగు
దీనతఁ బాపంగఁ దగదె దీనశరణ్యా ! గీ౧

ఆ. వె. మొదట గర్భదుఃఖమును బొంది కంసు భ
యమునఁ బిదప గోకులమున కరిగి
గొల్లనగుచు నడవి గోవులఁగాచుట
కన్నఁగష్టమొండు గలదె గిరిశ ! గీ౨

గీ. గోరజస్సంగతిం జేసి కొమరు దఱిగి
యాలఁగాచుచు బృందావనాంతరమున
నుండ భయపెట్టి మ్లేచ్ఛనాథుండు దానఁ
జేసి ద్వారవతీపురిఁ జేరినాఁడ. గీ౩

వ. పితార్జితంబగు మధురవిడిచి ద్వారవతి కేతెంచి యయాతి శాపంబుకతన రాజ్యంబొల్లక యుగ్రసేనునియంద యునిచి యతనికి దాసుండనైతి. గీ౪

క. ఎన్నిటఁ జూచిన సంసృతి
కన్నఁ దుఃఖంబు, స్త్రీలకన్న నధర్మా
భ్యున్నతియుఁ, బారతంత్ర్యము
కన్నఁ బంధం బొకండు గలడే గిరిశా ! గీ౫

గీ. జాంబవతి రుక్మిణీతనూజాతులఁ దగ
నరసి సంతాన మిమ్మనినంత నేను
దనయునికిఁగా నొసర్చితిఁ దపము లజ్జ
వొడమచున్నది దీనిఁ జెప్పుటకు నాకు. గీ౬

గీ. ముక్తినిడఁజాలు నినుఁగాంచి మూఢబుద్ధి
నేఁడు గోరెడిఁ దుచ్ఛమౌ నిట్టి ఫలము
కామినీప్రేరితుండనై గళితలజ్జుఁ
డ నయి కోరెద సంతాన మనఘ! నిన్ను. ౯౭

క. సంసార మెంతకేనియు
హింసాకర మంచు నెఱిఁగి యేను విరతి నా
శంసింపఁ జాల, గర్మ
ధ్వంసము భోగమునఁ గాని వఱలునె యెందుఁ? ౯౮

వ. శాపమ్ముకతన మాయానియంత్రితుండనై నారాయణాంశమ్మునఁ బుట్టిన నాకుఁ గర్మానుభవం బింతతోఁ దీఱునేయని వగచు మాధవున కుమాధవుం డిట్లనియె. ౯౯

క. పదియాఱువేలపైనేఁ
బదిమంది ముదితలు నీకు భార్య లగుదు ర
మ్ముదితల కొక్కొక్కరితకుఁ
బదిమంది కొమరులు గలిగి ప్రబలెదరు హరీ. ౧౦౦

వ. అని నుడివి శంకరుండు విరమించినఁ బార్వతి ప్రీణితుండగు నమ్మధుసూదనున కిట్లను. నీవు లోకమ్మున నున్న గృహస్థుల కెల్ల నొజ్జవై శతవత్సరమ్ములు సుఖమ్ముల ననుభవించి ద్విజశాపగాంధారీశాపమ్ములఁ గులక్షయం బగుడు దేహమ్ము పరిత్యజించి బలరామసహితమ్ముగ దివమ్మునకు రాఁగలవు. ౧౦౧

క. శోకింపఁదగునె? విధిపరి
పాకాగతమైన పనులపట్ల; నవశ్యం
బే కార్యము గానున్నదో
యా కార్యం బడ్డుపెట్ట నగునే యెందుఁ? ౧౦౨

వ. నీ వవతారమ్ము చాలించి త్రిదివమ్మున కరిగినమీఁద నష్టావక్ర
శాపమ్మునం జేసి నీభార్యలు చోరులచేఁ బీడింపఁబడుదురని
చెప్పి యదృశ్యులైరి. పిదపఁ గృష్ణుండును నుపమన్యునకు
సమస్కరించి ద్వారక కరిగి సుఖం బుండె. ౬౦౩

క. నరవర ! బ్రహ్మాదులకును
దర మని యెంచకుము మాయ దాఁటఁగఁ గర్మో
ద్ధురతఁ బురికొల్పుచుండుఁ
బరరూపిణి మాయ ; పక్షపాతము కలదే ? ౬౦౪

ఉ. ఇంతియ కాని యాజగదధీశ్వరి కొక్కఁడఁ బక్షపాత ము
క్కింతయు లేదు "జీవులకు నేగతిఁ గల్గునో ము క్తి" యంచుఁ దాఁ
జింతిలుచుండు లోకము సృజించియు మాయకులోను జేయదే
నంతయునుఁ జడంబగుఁ దదర్థమ యిట్లొనరించు భూవరా !

క. మాయాయత్తులు దివిజులు
మాయామయు లసురులెల్ల మాయాధీన
ప్రాయులు త్రిమూర్తులును స్వే
చ్ఛాయత్తత నొప్పు నొకఁ యంబికయ నృపా ! ౬౦౬

ఆ. వె. దేవికన్నఁ బరము దెలియంగ రాదెందు
నామెపూజకతన నఖిల మొదవుఁ
దత్పదాబ్జభ క్తి దవులని కులమునఁ
బొడమరాదు వినుము పుడమితేఁడ. ౬౦౭

శా. జ్ఞానాసక్తి గురుర్ భజించి నియతిం గావించి వేదాంత ని
ధ్యానం బొప్పఁగ నప్పరాంబిక మనమ్మందుర్ దగ న్నిల్పి సం
ధానంబుం బచరించి నిశ్చలవిధానజ్ఞానసంసక్తిమై
'నేనే దేవియునేన బ్రహ్మ' మను దా నెవ్వండు వాఁడల్పుఁడే!

వ. దీనికిం దక్కినఁవా డెన్ని కర్మంబు లొనర్చినను ముక్తుండుగాఁడు
శ్వేతాశ్వతరమహర్షులందఱు నిట్ల భవబంధవిముక్తులైరి. బ్రహ్మ
విష్ణుమహేశ్వరులును తత్కళత్రమ్ములును సచ్చిదానందరూపిణి
యగు నద్దేవిన యెల్లప్పు డారాధింతు రని చెప్పి మఱియును,

క. నరవర! ప్రశ్నంబుల కు
త్తరమిచ్చితి ; భవభయమునఁ దగ నెయ్యెది నీ
వరసి యడుగం దలంచెదొ
పురాణములు వినుట కన్నఁ బుణ్యము గలదే. ౬౧౦

ఆ. వె. సర్వపాపహరము సకల శుభప్రదం
బనఘ ముత్తమం బహర్నిశంబు
భక్తి వినెడివారి భవబంధములు వాపు
నిది పురాణములకు నెల్ల మిన్న. ౬౧౧

వ. అని వ్యాసుండు జనమేజయునకుం జెప్పిన ట్లకథకుండు శౌన
కాదులకుఁ జెప్పుటయు, ౬౧౨

క. లోహితసగోత్రభవ! వి
ద్యాహితసుమనోమనోజ్ఞతత్త్వజ్ఞ! మృదు
వ్యాహార! హారహారస
న్నిహారయశోవిహార! నిరుపమసారా! ౬౧౩

ఉ. కారుణికాగ్రగణ్య! నృపకాంతశిరోమణికాంతిరంజిత
శ్రీరమణీయపాదయుగసేవనబంభరితాంతరంగ వి
స్ఫారయశోనుషంగపరిచారితసర్వదిగంతతుంగ వి
ద్యారతశిష్యసంగవితతాదర! దుర్గయశాస్త్రి సోదరా! ౬౧౪

విచిత్రవృత్తము. మహీయశ్చరిత్రా! బహుస్తోత్రపాత్రా!
గృహస్థాత్మధన్యా! బృహత్కీర్తిమాన్యా! ౬౧౫

గద్య.

ఇదిశ్రీ—తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబయిన
దేవీభాగవతంబను మహాపురాణంబునందుఁ
జతుర్థస్కంధము.

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

దేవీభాగవతము

పంచమస్కంధము

అసమానతేజ! పాండి
త్యసదృశనిరతాన్నదానతత్పర! విద్యా
ర్థిసమేతపంక్తిభోజన!
కుసుమితసంతోష! బ్రహ్మగురుదోషజ్ఞా! ౧

—* శివకేశవతారతమ్యము. *—

వ. అవధరింపు మనంతరంబు శౌనకాదులు సూతుం గాంచి, ౨

క. శ్రీకృష్ణుని చరితమ్మును
మా కెఱుఁగం జెప్పితివి సమంజసముగ నే
మాకర్ణించితి మాను
శ్లోకుని కథయందు శంక చొప్పడు ననఘా! 3

చ. హరి యవతారమైన జగదాద్యుఁడు కృష్ణుఁ డరణ్యమేగి శం
కరుని యజింప నాతఁ డెసకమ్మునఁ బార్వతితోడ వచ్చి మే
ల్వర మిడె నంటి శంకరుఁడు వారిజనేత్రునికన్న నెక్కుడే !
పరమవిరుద్ధ మియ్యది కృపన్ వచియింపుము మాకు నావుడున్.

చ. మునులు మహామహుల్ ! వినుఁడు మున్ను పరాశరపుత్రుఁ డట్లు చె
ప్పిన చరితన్ గ్రహించి పృథివీపతి యాజనమేజయుండు వ్యా
సునిఁ గని పల్కె " నేల మధుసూదనునంశము కృష్ణుఁ డాచరిం
చెను దపమున్ శివుంగుఱించి చెప్పుము సంశయమయ్యె సన్మనీ.

గీ. సృష్టిరక్షాప్రళయములు సేయఁజాలు
దేవదేవుండు సర్వసిద్ధిప్రదుండు
ప్రాకృతునిఁబోలెఁ గృష్ణుఁ డెప్పాటఁ జేసెఁ
దపము హరుఁగూర్చి యితని కతండు లొచ్చె ?

చ. అనవుడు వ్యాసుఁ డిట్లను జనాధిప ! నీ వనినట్ల కృష్ణుఁ డెం
దును నధికుండు శక్తుఁడు ననూనమహామహిమానుభావుఁ డై
నను మనుజత్వ మందుకతనన్ దన కయ్యావి సంభవించె, నొ
ప్పునె మనుజత్వ మందియును బూర్వపురీతిని సంచరింపఁగన్ ?

మ. గురులం గొల్చుట, వృద్ధసేవనము, మ్రొక్కుల్ విప్రులం, దవ్వియ
చ్చరపూజారతి, హర్షశోకములు, స్త్రీసంసర్గము, న్నిత్యసం
సరణవ్యాప్తియు లోభమోహము లవశ్యమ్మున్ ఘటించున్ గుణో
ద్ధురమా దేహమునందు నిర్గుణత యొందుం జొప్పడంబోలునే.

వ. మఱియు శ్రీకృష్ణు నిధనమ్మునకును యాదవనాశనమ్మునకును
నగ్రిజగాంధారీ శాపమ్ములు కారణమ్ములు, చోరకృతలుంఠన
హరణాదికంబును నయ్యెడ నర్జును నసమర్థతయుఁ బ్రద్యుమ్నా
నిరుద్ధహరణం బెఱుంగమియు నివి మానవజన్మ సంభవమ్ములు.

క. హరి నారాయణముని య
ప్పరముని యంశంబు యాదవశిరోమణి సా
దరుఁడై యీతఁడు శివత
త్పరుఁ డగుటయు నబ్బురంబె! పార్థివముఖ్యా. ౧౦

క. హరికి హరుఁడు కారణ మని
పరమామ్నాయమత మట్టి పరమాత్ము శివున్
హరియంశ మవతరించిన
పురుషుఁడు కృష్ణుండు గొలువఁబోలదె యధిపా! ౧౧

శా. ఓంకారమ్మున నాద్యకారమున వాచ్యుం డౌ నజుం, డయ్యుకా
రాంకుం డాతనితండ్రి విష్ణువు, మకారాంకుండు శంభుండు, త
త్సంకేతమ్మున నుత్తరోత్తరము ప్రాశస్త్యంబు వాటిల్లు ని
శ్శంకన్ బైఁ దగు నర్థమాత్ర చెలఁగున్ శక్తిస్వరూపమ్ముగన్.

వ. దానంజేసి శక్తికి సర్వోత్కృష్టతయు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల
కుత్తరోత్తరాధికతయుఁ గలుగు కతన హరికి హరపూజనం బావ
శ్యకంబ యని వెండియు, ౧౩

గీ. మూలరుద్రుని యంశంబు మూలముగను
బ్రహ్మవక్త్రంబునుండి సంభవము చెందె
నిచ్చమై నింక నొకరుద్రుఁ; డెల్లరకును
బూజ్యుఁ డీతఁడు వరములు పొందుపొంటె. ౧౪

క. ఈ రుద్రుఁడె త్రిజగమ్ముల
కారాధ్యుం డనిన మూలమగు రుద్రుఁడు కాఁ
డే! రాజేంద్రా! యితనికి
సారత దగు శక్తితత్త్వసాన్నిధ్యమునన్. ౧౫

క. హరి యోగమాయకతమునఁ
బరతంత్రుం డగుచు నెత్తు బహుజన్మము ల
ప్పరమాద్భుతమగు మాయకు
హరియు హరుఁడు నజుఁడు దాసు లఖిలామరులున్.

క. కనుఱెప్ప వేయునంతకు
జననము రక్షణము లయము సంధించెడి మో
హిని యోగమాయ యద్దా
నినిఁ గనుఁగొన నేర రెంత నేర్పరులు నృపా ! ౧౭

క. హరి సూతికాగృహమ్మును
దలఁలుట నందునిగృహంబు తనవాసముగాఁ
బొరయుట మథురాపురమున
కరుగుటయును యోగమాయ యలవరిఁచె నృపా. ౧౮

వ. పిదప భీతుండై మధురాపురమ్ము విడిచి ద్వారక కరుగుటయు
నయ్యోగమాయాబలంబని యెఱుంగునది. ౧౯

క. పదియాఱువేలపై యేఁ
బదిమంది లతాంగులకును పై భార్యల కె
న్మిదిమందికి దాసుండై
మధుసూదనుఁ డుంట యోగమాయకతమునన్. ౨౦

చ. నరవర ! యొక్క కాంత తగునైపుణి గల్గినదయ్యె నేని య
బ్బురపువిలాసముల్ గొలిపి పూరుషు బద్ధునిఁ జేయఁ జాలు సుం
దరులు పదాఱువేలకును దక్కినపూరుషుఁ డెట్టిఁడేని ద
త్పరుఁ డయి తత్సతీనికరపంజరకీరముగాక తీరునే. ౨౧

చ. అరయఁగ సత్యభామకయి యాహరి యాహరిధామ మేగి యు
ద్ధురగతి యుద్ధరంగమునఁ దొయ్యలి మెచ్చఁగ దేవనాథు నో
సరిలగఁ జేసి కల్పకము చయ్యనఁ దెచ్చి ముదంబు గూర్చి సు
స్థిరముగ నాటునే పెరటిచెట్టుగ వశ్యుఁడు కాకయుండినన్. ౨౨

చ. అదియుచుగాక చైద్యునకు నంగనగా గురుదత్తయైన య
మ్మదవతి రుక్మిణిన్ గలన మర్దితశాత్రవుఁడై హరించి యా
త్మదయితఁ జేసికోలు నొకధర్మమె ? యన్యకళత్ర మెంత ధ
ర్మదశకుఁ దప్పువాఁడును గ్రమ మ్మొడఁ జేసి హరింపఁ బోలునే ?

గీ. ప్రకృతిజన్యంబు హరిహరబ్రహ్మమూల
మగు నహంకారమున జగ మవతరించెఁ
దద్వశుండయి మోహంబు దవిలి ప్రాణి
చేయుఁ దత్తత్కృతులు మంచి చెడ్డ యనక. ౨౪

గీ. బ్రహ్మమైన నహంకారవశుఁడు కాక
యున్నవేళ విముక్తుఁడై యుండు దానిఁ
దవులుచో సంసరణకృతితత్పరత్వ
మంది తత్తద్విశేషము లలవరించు. ౨౫

చ. అది విడువాఁడె ముక్తుఁడు, మహామహుఁడైనను నయ్యహంకృతిన్
బాదలెడివాఁడె బద్ధుఁడగుఁ బూరుషమాత్రున కంగనాదిసం
ఘదలును గేహముల్ సుతులు బంధము లందురు వీని కెక్కుడై
నది యని చెప్పఁగాఁదగు నహంకృతి నిక్కము పార్థివోత్తమా.

గీ. ఏ నొనర్చెడివాఁడ నాచే నొనర్పఁ
బడియె నింతటికార్యంబు బలియురందు
నధికుఁడను నేనటంచు నహంకృతిం ద
విలి నరుఁడు బంధనమునఁ బొరలు నరేంద్ర. ౨౬

వ. మృద్విహీనంబగు ఘటంబుపగిది నహంకారశూన్యంబగు వస్తువు దుర్లభంబు; కారణవిముక్తంబగు కార్యంబు లేమి శాస్త్రప్రసిద్ధంబకదా! యని మఱియును. ౨౮

గీ. అయ్యహంకారసంపర్క మంది కాదె
యెల్ల జగములు పాలించు నిందిరేశుఁ
డట్లు కాకున్న నతఁడు దుఃఖాబ్ధిమగ్నుఁ
డగునె యవతారముల నెత్తి యవనినాథ! ౨౯

వ. అహంకారనిర్ముక్తులకు మోహంబును సంసారమ్మును లేకుండు మఱియు బ్రహ్మాదులగుపురుషు లెల్లరును సాత్త్వికరాజసతామస భేదమ్ముల మూఁడు దెఱఁగులవారు, వీరియం దెల్లప్పుడును ద్వివిధంబైన యహంకారంబు వర్తించుఁ దద్బద్ధుండై మాయామోహితుండై యనేకావతారమ్ములఁ దవిలి తత్తదనుగుణమ్ముగ హరి గ్రిమ్మరు నట్లు కాదేని యెట్టి మందుండును వాంఛింప నొల్లని పరమసంకటమ్మగు గర్భవాసమ్మున కతఁ డియ్యకొను టెట్లు?

క. అతివిష్ఠాకులతాసం
గతి హేయంబైన దేవకసుతాగర్భ
స్థితికిఁ హరి యాత్మపద
చ్యుతుఁడై రానేల తాన యొడయండైనన్? ౩౦

ఆ. వె. బ్రహ్మమొదలు స్తంబపర్యంతము జగంబు
యోగమాయవశత నొప్పు దాని
నుడిపి యుడుపలేక యూర్ణనాభియుఁబోలె
హరిహరాదులుందు రవనినాథ. ౩౧

క. అనవుడు జనమేజయుఁ డి
ట్లను యోగీశ్వరి మహామహాత్మత నాకున్

మునివర ! చెప్పితి వద్దా
నిన వెండియు వినఁగవలతు నీదగుకరుణన్. 33

ఆ. వె. మూఁడుమూర్తులకును మూలభూతంబయి
యఖిలజగము తానయై వెలుంగు
దేవదేవిమహిమఁ దివిరి వినకయుండు
చెనఁటి యొందుఁగలఁడె చెప్పు మనఘ. 3౪

వ. నావుడు వ్యాసుండిట్లను రాజేంద్రా ! యియ్యది శ్రద్ధగలశాంతు
నకు నుడువఁదగినది యని యెఱుంగుము. మున్ను మహిషుండను
రాక్షసరాజు కాలమ్మున దేవదానవులకు ఘోరంబగు యుద్ధంబు
జరిగె నది యెట్లంటేని. 3౫

క. కనకగిరి కేఁగి మహిషుం
డనిమిషులకు నెల్ల విస్మయము గదురఁగఁ జే
సెను వర్షాయుతము తపం
బును బరదేవతను హృదయమున నిల్పి నృపా. 3౬

—* మహిషాసురోత్పత్తి *—

క. ఆ తపమున కెద మెచ్చి కృ
పాతత్పరుఁడై విరించి వర మిడుటకునై
యేతెంచి కోరుకొ మ్మన
నాతని కమ్మహిషుఁ డిట్టు లనె భక్తి మెయిన్. 3౭

వ. మహాత్మా ! నాకుం గూర్తేని మృత్యువులేమిఁ బ్రసాదింపు మన
వుడు నతం డిట్లనియె. 3౮

క. పుట్టినవారలు గిట్టుట
గిట్టి మరలఁ బుట్టుటయు నిఖిలజీవుల కె

ప్పట్టునఁ దప్పునియది నీ
కెట్టుగ నీవచ్చు మృత్యు వెడఁజేయంగన్. 3౯

వ. భూభూధరసముద్రాదికంబులకైనను గాలవశమ్మున నాశమ్ము దప్ప దట్లుండ నీ కెట్లు మృత్యుభయంబు లేకుండ వరం బొసంగుదు ? నొక్క యుపాయమ్ము సెప్పెద మరణమ్మున కొకింతయేని యవకాశం బునిచి కోరుకొమ్మనవుడు వాఁ డిట్లనియె. ౪౦

క. సురదైత్యమానవులలోఁ
బురుషుఁడు ననుఁ జంపకుండఁ బూరింపుము-నా
వర మాఁడుది నను జంపం
దరమే యద్దాని నొక్కతన్ విడువు మొగిన్. ౪౧

క. అనవుడు నీకెప్పటికే
నిని మానినివలనఁ దొడరు నిధనం బిఁకఁ ద
క్కినవారివలన భీతిం
గొనకుము నీవంచు నేగెఁ గువలయనాథా ! ౪౨

వ. అంత నా రక్కసుండును సంప్రాప్తమనోరథుండై నిజనికేతనమ్మున కరిగె నావుడు "వాఁడన నెవ్వఁ డేకతమ్మున మహిషాకారంబు సంపాదిల్లె, నెవ్వనికొమరుం డెఱింగింపవే" యనుడు వ్యాసుం డిట్లను. ౪౩

క. రంభకరంభులు మహితా
రంభులు నిరువురును సుతులు ప్రబలుఁదు రతి సం
రంభునకు దనువునకు వా
రంభోజాప్తునికి నెక్కుడగుదురు దీప్తిన్. ౪౪

వ. అయ్యిరువురును సంతతిలేమిం జేసి బహువత్సరమ్ములు తపంబొనర్చి
రందుఁ గరంభుండు పంచనదమ్మున జలమగ్నుండయ్యును రంభుం
డొక్క-భూరుహం బారోహించియు ఘోరంబగు తపం బొనర్చు
చున్నంతఁ దత్తపోభీతుండగు నింద్రుం డట కేతెంచి మొసలియై
యప్పంచనదంబు సొచ్చి కరంభుని పాదమ్ములం బట్టి వధించిన
రంభుండు భ్రాతృమరణదుఃఖితుండై, ౪౭

క. మన మెరియఁగఁ దన శీర్ష
మ్మును వహ్నికి నీఁగ నెంచి మొగిఁ దెగనఱుకం
గను దక్షిణకర మాయుధ
సనాథముగఁ జేయుచుఁ గృశానుఁడు పేర్మిన్. ౪౮

చ. ఎదుటికి వచ్చి " శీర్ష మిటు లేటికిఁ ద్రుంచెద వాత్మహత్య చే
యఁదగునె ? చేయుదుఁ బరమునందు సుఖం బెడయౌ భవత్తపం
బెదకు ముదం బొసంగెఁ గొను మిచ్చెద నీకు వరంబు, వచ్చి యె
య్యది గొనువాఁడ వీ " వనుడు నద్దనుజుండు విముక్తశీర్షుఁడై.

గీ. దేవ నాయెడ నీకు సంతృప్తియేని
కామరూపియు నఖిలలోకవిజయియును
అమరదానవమానవాద్యఖిలవీరు
లకు జయింపఁగరాని పుత్రకుని నిమ్ము. ౪౯

వ. నాప్పుడుఁ బావకుం డట్లగుంగాకేమి యిఁక మరణోద్యోగంబు విర
మింపుము, నీ కెయ్యది గూర్చు నద్దానియంద యిట్టి పుత్రుండు
వొడమును ననుడు రంభుం డవ్వీతిహోత్రున కెఱఁగి వీడ్కొని యరు
దెంచువాఁడు ముందట యక్షరక్షితంబగు నొక్క- మనోహర
ప్రదేశమ్ముననున్న మహిషి నతిమత్త నందంబగుదానిఁ జూచి
కామించిన నయ్యదియు రంభుం గలయుట కియ్యకొనియె నంత

భావికార్యవశమ్మున రంభుండద్దానితో రమించి గర్భిణియగు
దానిం గొని యితర మహిషంబులవలని భయము దొలఁగించుచుఁ
బాతాళమ్మునకుఁ దోలికొని చనియె. ౪౯

క. ఒకనాఁ డమ్మహిషిని వే
ఱొకమహిషము చూచి మోహయోగమ్మునఁ దా
ళక పైకొన నుంకించినఁ
బ్రకోపనుఁడు దానిఁ గొట్టె రంభుఁడు కడఁకన్. ౫౦

వ. అంత మహిషంబును దనకు విఘ్నకారియగు నద్దనుజుని శృంగంబులం బొడిచిమొత్తి మృతునిం గావించిన నమ్మహిషియు భర్తృమరణమ్మునకు శోకించుచుఁ దనపూర్వనివాసమ్మునకుం జని యక్షుల శరణుఁ జెందె; నవల దానిపిఱుందన యమ్మహిషంబును గామార్తంబగు కతన నరిగి యయ్యక్షులతోఁ బెనంగి తచ్ఛరతాడితంబయి ద్రెళ్లె. పిదప యక్షులు నమ్మృతదనుజకళేబరముం గొని తెచ్చి యమ్మహిషశవంబుతోఁ జితాసంస్కారంబు చేయనుంకించిన నమ్మహిషియు సహగమనపరాయణయై యక్షనివారితయయ్యు వెనుదీయక యయ్యనలమ్మునం బడియె. మీఁదఁ జితామధ్యంబునుండి మహిషుండును రక్తబీజుండు నను నిరువురు రక్కసు లుదయించి రందు మహిషుండు రాక్షసులచే రాజ్యాభిషిక్తుండయ్యె రక్తబీజుండును సురాసురుల కవధ్యుండై చరియించుచుండె నిట్లు చతుస్సముద్రముద్రితంబగు ధరామండలంబు నమ్మహిషుం డేకచ్ఛత్రమ్ముగ నేలుచుండి మహాబలుండగు చిక్షురుండును సేనాయుతసమావృతుం డగు తామ్రుండును నసిలోముండును నుదర్కుండును బిడాలుండును బాష్కలుండును ద్రిణేత్రుండును గాలబంధకుండును దనకు సేనానాయకులుగా

రాజవర్గంబు లరివెట్టి విప్రుల జన్నమ్ములు కలఁచుచు మదోద్ధ
రుండై యొక్కనాఁడు. ౧౧

మ. వరదానోద్ధతగర్వుఁడై యతఁడు స్వర్వాసంబు వశ్యంబుఁ జే
యురహిన్ సేవకుఁబంచె "నింద్రుఁడునన్ యుద్ధమ్మునన్ గెల్చునో
శరణంబు బంది దివంబు నాకిడునో నిస్సందేహ మారీతి నా
సురనాథుం గని నిశ్చయింపఁ దగు" నంచున్ జెప్పి నిర్భీతిమై.

వ. అంత దూత దివమ్మున కరిగి యింద్రున కిట్లనియె. ౧౩

చ. విను సురనాథ! నే మహిషవీరునిదూత నతండు పంప నిన్
గనుఁగొన వచ్చినాఁడ నీక గర్వము చెందక పీడు పీడి మా
జనపతి సేవకుండ వయి చక్కఁగ నుండెద వొండె యుద్ధముం
బనుపడి చేసె దొండె నొకపద్ధతి సేయుము నాఁగ నింద్రుఁడున్.

ఉ. వానికి నిట్లు పల్కు బలవద్రిపు "నోరి మదాంధ! యిట్లు క
న్గానక నీవిభుం డనిపెఁ గా నిను! మంచిది వానిరోగ మె
ట్లేని యడంతు నామొదుట నిట్లనఁ జెల్లునె నీకు? దూతయా
వానినిఁ జంప రాము విడువంబడి నీపతి కిట్లు సెప్పుమా. ౧౪

ఉ. ఓమహిషీకుమార! నను యుద్ధమునందు జయించు నిచ్చ నీ
కీమెయిఁ బుట్టెనే! తృణము లెంతయు మెక్కుటచేత మిక్కుటం
బై మద మెక్కెనే! జడుఁడ వంచు నెఱుంగుదు నిన్ను నీకు ను
ద్దామత నిచ్చుశృంగములఁ ద్రివ్వి తగం బొనరింతుఁ జాపమున్"

వ. అనవుడు దూత వైళంబ చని మహిషుం గాంచి నమస్కరించి
యిట్లు విన్నవించె. ౧౫

క. నిను గణియింపక సురపతి
పనిచిన పలుకులను జెప్ప భయమొదవెడి వా

నిని విడిచి నీకుఁ బ్రియమగు
నన్నృతము వచియింప నర్హమగునె తలంపన్. ౫౭

క. ప్రియమును సత్యముఁ బల్కుట
య యుచిత మగు భృత్యునకు నృపాగ్రమ్మున నేఁ
బ్రియముగ వినిచితి నేని య
దియు నీకార్యమ్మునకుఁ బ్రతిఘటించు నొగిన్. ౫౮

చ. ఇఁక రిపుఁడెట్లు వల్కె నటులే వచియించెద నన్న నెందు సే
వకునకు శోభనార్థి కిది భావ్యము గాదు రిపుల్ వచించు ఫ
క్కికఁ యన మిత్త్రి పల్కులను గేలి యొనర్చు నెటుల్ వచింతు న
ట్టి కుటిలవాక్యముల్ గలన డీకొను మార్తురమాడ్కిఁ దెంపునన్.

క. అని హేతుగర్భముగఁ జె
ప్పిన పల్కుల యర్థమును సవిస్తరముగఁ గై
కొని పెచ్చు పెరుఁగు కోపం
బున మహిషాసురుఁడు గర్వమూర్ఛితుఁ డగుచున్. ౬౦

శా. లాంగూలమ్మును బృష్ఠదేశమున వాలాయమ్ముఁ గీలించి భ్రూ
భంగం బొప్పఁగ నెట్టనాకనులు కోపం బంతటన్ గ్రమ్మ రిం
పం గై పెక్కుడు మూత్రమున్విడుచుచున్మత్తాత్ముఁడై యింద్రుఁడి
బ్బంగిం బల్కుట వింటిరే యిఁక వధింపం బోలదే దుష్టునిన్.

ఉ. వాఁడన నెంత, వానిబలవైభవ మెన్నఁగ శాంతులందు, మా
రాడనితాపసోత్తములయందుఁ బరాంగనలందుఁ జెల్లుఁ బో
రాడుట కప్సరోంగనల కౌను తపమ్ము లడంచు భంగిఁ? దూ
టాడెదఁ గోటియిందుఁ లోకపై యని నన్నదిరించి రేనియున్.

క. నముచిం జంపెను విశ్వా
సము చొప్పడ సంధిఁజేసి శపథమ్ములకుం
గ్రిమమెడలి; యట్టి దుష్టుఁ
డమింప సజ్జనులకెట్లు సంతసమెసఁగుఁ. ౬౪

వ. ఇదియిట్లుండఁ దత్సహాయుండగు హరియు నిట్టిఁడ యది
యెట్లంటేని, ౬౫

క. కపటాచార్యుఁడు కుహకుఁడు
శపథాకరుఁ డతడు మున్ను చంపఁడె కిటి య
న్నెపమునఁ గనకాక్షుని సిం
గపుమానిసియై హిరణ్యకశిపు బలాఢ్యుఁ. ౬౬

వ. కావున నిందోపేంద్రులయెడ విశ్వాసం బెగ్గగు నా కీ దేవపతి
యన నెంత ! మహాదేవ్వుం డెమురైనను ననికిఁ గడంగుదు.

ఉ. కావున నష్టదిక్పతుల గర్వమడంచి నిలింపసంతతుల్
చేవకుఁదక్కి దైన్యమునుఁ జెంది కృశింపఁగ నాకలోకసు
శ్రీవిభవంబు గైకొని యశేషమఖమ్ముల నిచ్చుభాగముల్
కేవల రాక్షసార్థముగఁ గీల్కొనఁజేసి చరింతు నెంతయుఁ. ౬౮

క. సురనరకిన్నరు లాదిగఁ
బురుషులు ననుఁ జెనకఁ దగరు పూఁబోఁడికి నఁ
బోరిఁగొనఁ దరమే! నాదగు
వర మెఁఱుగరె, యొకఁడు మనకు వశ్యుఁడు కాఁడే. ౬౯

వ. మీరు పాతాళమ్మునకును బర్వతమ్ములకును జని యచ్చటచ్చట
నున్న దానవులం బురికొల్పికొని యనికిఁ గడంగు నది యని
పెండియు, ౭౦

ఉ. ఏ నొకరుండనే సురలనెల్ల జయించెద మత్ఖురాహతిం
బూనియు నాదుశృంగములపోటులు నాటియు నెవ్వఁడేనియుం
బ్రాణములం ద్యజింపఁడె? దురమ్మున బాసట యేల! నిక్కమో
దానవులార! మీరలును దక్కటియోధులు నా కలంకృతుల్.

మ. నవమందారసుమస్రగావళులతో నాకాంగనాసౌఖ్యవై
భవలీలన్ మలఁదూఁగుచున్ నిరతసంపద్ధాత్రియా కామధే
నువు పాల్గ్రోలుచు నాకలోకమునయందున్ మీరు క్రీడల్ పొన
ర్పవలెన్ రక్కసులార! సంగరసమారంభస్థితిన్ నిల్వఁడీ. ౭౭

చ. నిరతము నాటపాటలకు నేర్పరులై గడిఁదేఱినట్టి సుం
దరులగు రంభ యూర్వశి ఘృతాచి తిలోత్తమ మేనకాప్రమ
ద్వరలును విప్రజిత్తియును దక్కటి యచ్చరలున్ బ్రమోదబం
ధురలయి మిమ్ముఁగొల్వఁ దులఁదూఁగుఁడు నందనమందు దానవుల్!

వ. అని చెప్పి సేనాసంరక్షణార్థంబుగాఁ బురోహితుండగు భార్గవుం
బిలిచి పూజించి మహిషుండున్నంత, ౭౮

చ. దివిజవిభుండు సత్వరగతిన్ దిగధీశులఁ బిల్వఁ బంచి వా
రు వినఁగ నిట్లు పల్కె, మదయుక్తుఁడు రంభసుతుండు బ్రహ్మద
త్తవరమహోద్ధతుండు సురధామము గైకొన నెంచి సేవకుం
బవరముసేఁతకై పిలువఁబంచె వినుం డతఁడాడుమాటలన్. ౭౯

చ. ప్రమద మెలర్ప మామహిషరాజునకున్ శరణాగతుండవై
యమరులతోఁ బనిం గొనుచు నాతనిభృత్యుఁడవౌటయొండె యు
ద్ధమునకు వచ్చుటొండె నొకదానికిఁ బూనుము మావిభుండు కో
పమెఱుఁగఁడెప్డు భృత్యులను బాలనసేయు దయాంబురాశియై.

—* ఇంద్రుఁడు విమర్శించుట. *—

వ. అని చెప్పి యమ్మహిషుదూత చనియె నియ్యెడ మనకుఁ గర్తవ్యంబు నిర్ణయింపుఁడు శత్రుండు దుర్బలుండైనను క్షమింపఁదగదు. జయాజయమ్ములు దైవాధీనమ్ములయ్యును యత్నంబవశ్యకర్తవ్యంబు ౭౭

గీ. సంధియోగంబు ముఖ్యమా సంధి యిట్టి
ఖలునియెడ విషమించు నిక్కముగ యాన
మైన యోజింపక యొనర్చు టనభిమతము
తన బలముఁ బరబలమును దలఁప వలయు. ౭౮

వ. కావున వాని సైన్యాదివివేచనం బొనర్ప నొక్కనిం బుచ్చి తెలిసికొనుట యుచితంబని యొక్క ప్రణిధిం బంచిన వాఁడును నతిత్వరితగమనమ్మునంజని మగుడవచ్చి యవ్వాని బలవిశేషమ్ములం జెప్పిన వాసవుండు విస్మితుండై మంత్రవేదియగు పురోహితుం బిలిచి యిట్లనియె. ౭౯

క. దానవుఁడు మహిషుఁ డున్నత
సేనావృతుఁ డగుచు మనకుఁ జెట్ట దలఁచి తా
రా నుండె నిట, కుపాయము
దీనికి యోజించి యొకటిఁ దెలుపుము దేవా! ౮౦

వ. దానవులకు శుక్రునట్ల మాకీవు సర్వకార్యప్రవర్తకుండవు విఘ్నపరిహర్తవు ననుఁడు బృహస్పతి సురేంద్రా! వ్యసనంబు సంప్రాప్తంబగుడు బుద్ధిమంతులు ధైర్యంబు వీడ రట్లగుట నీవు ధైర్యమవలంబింపుము. ౮౧

క. అగునది కాకుండదు దై
వగతికిఁ బ్రతిసేయఁగల్గు వారమె? చేయం

దగునై నను డోఁచిన య
ట్లగణితమగు యత్నమును సురాధిప వింటే. ౮౨

వ. దీని నెఱింగియే కదా మునులు ముక్త్యర్థంబు సంతతధ్యానయోగ మ్మ్గల యత్నింతురు. పురుషకారంబు లేకున్నఁ గేవల దైవం బు కతనఁ గార్యంబు నెఱవేఱ దది యెట్లన్నఁ జీఁకును బిచ్చుకకుం టును నన్యోన్యసాహాయ్యంబు లేమి నకించిత్కరులయ్యు నది గల్గినఁ గృతకార్యులగుదు రొక్కెడఁ బురుషకారంబు గల్గియుఁ గార్యసిద్ధి యలవడకుండు నచ్చోట దూషింపఁదగ, దయ్యది రథసైన్య మం త్రాదికంబుల నుండక దైవాధీనంబై యుండు నెట్లంటేని, ౮౩

చ. బలియుఁడు క్లేశ మందుట యపాస్తబలుండు సుఖమ్ము చెందు టు జ్జ్వలమతిగల్గుధీరునకు సంపద లేమియుఁ దెల్వి లేనివాఁ డలఘుగతిన్ మహావిభవ మందుట శూరపరాభవంబు భీ తులవిజయంబు నన్నది బుధుల్ పరికింతురు దైవికంబుగా. ౮౪

సీ. కాఁదగు దానికి గతి దైవ మని యత్న
మొనరింపు మవల నయ్యుద్యమమ్ము
ఫలియించు నొండె విఫలమగు నొండెఁ గా
కయ్యెడ హర్షశోకాప్తి గనఁగఁ
దగ దదైర్యంబు సంతాపకారణమగు
దుఃఖయోగం బాత్మఁ దొడరు నప్పు
డెయ్యది దుఃఖమే నెవ్వఁడ నిరువది
నాలుగు వీడిన నాకు నిర్గు

ఆ. వె. ణాత్మకునకు దీన నయ్యెడిదేమి ? యాఁ
కలియు దప్పి ప్రాణగతములు సుఖ

దుఃఖములు మనమ్మునతో నుండు జరయు మృ
త్యువు శరీరమునకుఁ దొడరు మఱియు. ౮౬

వ. షడూర్మిరహితుండనగు నేను శరీరంబొండెఁ దత్సంబంధి నొండెఁ గాను, చతుర్వింశతితత్త్వభిన్నుండనగు నేను సదానందుండఁ బ్రకృతివికృతిభిన్నుండ నని తలంచుకొని నిర్మమత్వంబునొందు మియ్యది దుఃఖనాశమ్మునకుఁ బ్రధమోపాయంబని వెండియు,

గీ. మమత దుఃఖమ్ములకు నెల్ల మనికిపట్టు
దాని విడిచినవాఁడె తద్దయు సుఖాత్ముఁ
డమరనాయక ! సంతోష మన్నిగతుల
సౌఖ్య మొసఁగూర్చు దానికి సవతులేదు. ౮౭

ఉ. నీవు మమత్వము న్విడుచు నేరుపు చాలకయున్న భావికా
ర్యాకలనంబునం దగిన యత్న మొనర్పుము బుద్ధియుక్ సురా
నీకము తోడు గాఁగఁ బయి నీవొ రిపుండొ జయమ్ము గాంచి సౌ
ఖ్యాకరులై యొసంగఁగల రయ్యది దైవము సేఁత గాఁ దగున్. ౮౮

వ. ఎవ్వరికిని సుఖంబు పుణ్యక్షయమ్మునియు దుఃఖమ్ము పాపక్షయమ్మునియు నెఱుంగు మింతయేల నీబుద్ధికిం దోఁచి నట్లొనర్పు మన వుడు సురేశ్వరుండు, మహాత్మా ! దుష్టుండగు నమ్మహిషు నశింపఁ జేయుటయ నాకుం దోఁచినవిధం బగుట యుద్ధోద్యోగం బొనరించెద నుద్యమ్మంబు లేకున్నఁ గార్యంబు సిద్ధింపదు. విజ్ఞానంబు యతులకును సంతోషంబు విప్రులకును శత్రుహననంబు ప్రభువులకును భూషణంబులు. ౮౯

క. మును త్వష్టకుమారుని నము
చినిఁ జంపితి నుద్యమంబు చేసి యటుల యి

దనుజుఁ బరిమార్తు నీ మం
త్రినియోగముఁ బవియు విజయదాయకములుగా. ౯౦

వ. నాకు నెల్ల సంగరమ్ముల నీవును వజ్రాయుధమ్మును హరిహరులును సహాయులు. రక్షోఘ్నంబులగు మంత్రమ్ములం బఠించి దీనికి నీ వనుకూలుండవు గమ్మనవుడు స్మితపూర్వకంబుగ నతం డతని కిట్లనియె. ౯౧

క. సురనాథ ! నిన్ను యుద్ధా
దరుసర్తి వలదనియుఁ బోవఁదగు ననియును నే
నిరు దెఱఁగు చెప్పనోప నె
వరికిఁ జయము నజయంబు వక్తవ్యము లే. ౯౨

మ. భవితవ్యంపు విధంబు నాతరమె చెప్ప న్నాకలోకేశ ! యే
ది విధేయం బది యాచరింపు మెవఁడేఁ దీర్పఁ సమర్థుండె దై
వవిధిం బైఁ బడు మంచిచెడ్డల ; ననుఁ వంచింపఁడే మున్ను మ
ద్ధవశాత్మిం గాని చంద్రుఁ; డప్పు డతిచింతం జెందనే యేన్ గిర్.

వ. నన్ను మీర లందఱును బుద్ధిమంతుండని కదా కొనియాడుచుం దు రయ్యెడ నాబుద్ధి యేమయ్యెఁ గావున నోపినకొలఁది నుపా యంబు చింతింపుఁడు. సిద్ధ్యసిద్ధ లు దైవాధీనంబు లనవుడు బ్రహ్మ కడకుఁ జని శరణంబు వేఁడి యిట్లనియె. ౯౪

చ. మహిషుఁ డనంగ నొక్కరుఁ డమర్త్యవిరోధి మదోద్ధతుండు నా
కహితమొనర్చి నాకమున కాపద గూర్పఁగ దైత్యవాహినీ
సహితుఁడు సంగరమ్మునకు సన్నహనం బొనరించువాఁడు వా
ని హతికి భీతి చెందితి గణింపుము నాదురవస్థ నావుడుర్. ౯౫

వ. పితామహుండపు హరిహరులం బురస్కరించుకొని సంగరం బొన ర్చుట కర్జంబగు మనమందఱ మిప్పుడు గైలాసమ్మున కరుగుద మని చెప్పిన నిందుఁడు చతుర్ముఖపురస్సరంబుగాఁ గైలాస మ్మున కరిగి వేదమంత్రమ్ములచే నతని సన్నుతించి ప్రసన్నుం డగు నద్దేవుఁ బురస్కరించుకొని వైకుంఠమ్మున కరిగి యబ్జనాభు శరణంబు వేఁడి మహిషాసురుం డొనర్చుదుర్ణయమ్ములు సెప్పిన నతం డింద్రపురోగముల కిట్లనియె. మనమెల్లఁ గలసి యద్దానవు నిర్జించుట కర్జం బయ్యెడి నాహవసన్నద్ధులరగుఁ డనిన వారు వారివారి వాహనమ్ముల నధిష్ఠించి సంగరాభిముఖులైరి. ౯౬

గీ. అంచ నెక్కె విరించి ఖగాధిపుపయి
హరి వెలిఁగె వృషవాహనుఁడయ్యె శూలి
నెమ్మిపై నుండె గుహుఁడు గజమ్ము దేవ
పతి యధిష్ఠించె సంగరప్రమద మొదవ. ౯౭

వ. ఇట్లు సన్నద్ధులై హరిహరవిరించిప్రముఖనిలింపులు వెడలిన నమ్మహిషుండును దైత్యవాహినీసహితుఁడై యుక్కు మిగిలి ధరణీతలంబు గ్రక్కదలఁ జనుదెంచె, నిట్లయ్యిరువాఁగును గలసి యెదిరిన సంగరంబు బెట్టిదం బయ్యె. ౯౮

మ. గదలన్ బట్టసశూలతోమరములన్ గార్ముచ్చునుం బోని బె
ట్టిదమౌ శస్త్రపరంపరన్ విపులధాటిన్ మేటిగాఁ బోరి రు
న్మదులై యాజి సురాసురుల్ భువనసంపాతంబుగాఁ దారకల్
సెదరన్ దిక్తతి యేకమై పొదల నిస్సీమప్రతాపోన్నతిన్. ౯౯

ఉ. మానితశౌర్యధుర్యుఁ డసమానపరాక్రముఁ డైన వాని సే
నాని గజాధిరూఢుఁ డయి నాకపుఁ జిత్తురుఁ డేసె శస్త్రవి

ద్యానిపుణుండు బాణముల నైదిటు; నింద్రుఁడు వానిబాణసం
తానముఁ ద్రుంచి వక్షమున నాటె నవంబగు నర్ధచంద్రముల్.

వ. చిక్షురుండును దదాశుగమ్మున మూర్ఛవోయి యేనుఁగుపై నొరు
గుడు సురపతి శతకోటిం గొని యక్కరికరంబు ద్రెళ్ల నేసిన
సంగరరంగంబు విడిచి పలాయనం బొనర్చె నంత మహిషుండు
క్రోధతామ్రాక్షుండై, ౧౦౧

శా. కాలాభీలు బిడాలనామకుని సంగ్రామైకవీరుల్ మరు
త్పాలాద్యష్టదిగీశులన్ క్షణములో భంజించి రమ్మంచు దు
శ్శీలుం బంచిన వాఁ "డిదెంత" యని జేజేరాజుపై నేగె నా
భీలోన్మత్తగజంబు నెక్కి సురలున్ బెంపేది యల్లాడఁగన్. ౧౦౨

ఉ. వచ్చెడివానిఁ గాంచి సురవల్లభుఁ డెక్కుడు శౌర్యమొప్ప మే
నుచ్చిచనంగ నేసె నురగోగ్రము లైన శరమ్ములన్ వడిన్
హెచ్చిన తీవ్రకోపమున నింద్రుశరమ్ములు ద్రుంచి వాఁడు పై
పెచ్చుగ నొక్క యేఁబది గభీరశరమ్ములు నించె నేడ్తెఱన్.

చ. నడుమన వాని శస్త్రములు నాకవిభుండు మరల్చి క్రోధ మె
క్కుడుగను వాఁడిమైన శరకోటి వెసన్ బరఁగింప వాఁడునుం
బోడిగ నొనర్చె దేవవిభుపూనిక వమ్ముగ శస్త్రసంతతిన్
దడయక యమ్మరుత్పతి గదంగొని యేసె గజమ్ము నక్కఱన్.

గీ. ఆ గదాఘాతమునఁ గరి యాహవావ
నీతలము పాసె నార్తంపు నిస్వనంబు
చెలఁగ; నవ్వాఁడు క్రోధ మగ్గలము గాఁగఁ
డిగిరి యనిసేసె నేడ్తెఱఁ దేరి నెక్కి. ౧౦౫

చ. సురరిపు తేరు చూచి బలసూదనుఁ డాహవకోవిదుండు దాఁ
గురిసె నుదగ్రమార్గణపుఁగోటుల; దానికి వాఁడు నల్గి మే
దురముగ నస్త్రముల్ గడకతోఁ బరఁగించె ననంతసంఖ్యఁ; ద
చ్ఛరముల కజ్జమైషులకు సంగర మద్భుతమయ్యె నయ్యెడన్.

వ. పిదప నింద్రుం డవ్వానికోల్తలకు శంకించి జయంతుం దన
కగ్రమ్మున నిడికొని బాసటమై తాను బోరుచుండె నట్టియెడ,

మ. కడఁకన్ మార్గణపంచకమ్మున మహోగ్రప్రక్రియాధుర్యుఁడై
వడిమైనేసె జయంతుఁ డయ్యసురు దుష్ప్రారంభు; వాఁడున్ మహో
బడబాగ్నిప్రభలైన తచ్ఛరతతుల్ వక్షమ్మున న్నాటి కీ
డ్పడి యత్తేరున మ్రొగ్గతిల్లఁబడె దుర్వారంపు మూర్ఛాగతిన్.

వ అంత సారథి రథంబు దోలికొని వేఱొక్కయెమ్మున కరిగిన జయ
శబ్దంబు లొక్కపెట్టఁ జెలంగ సురలు తనుజసహితంబుగ సురపతి
నగ్గించిరి. ౧౦౯

ఉ. ఆ జయశబ్దముల్ విని మహాగ్రహవిగ్రహుఁడై హయారి త
త్తేజము సైఁపలేక కడుఁ దెంపరి నస్త్రవిదున్ మహామహో
భాజనుఁ దామ్రి నంపె నతిపాటవమొప్పఁగఁ దామ్రిఁడభ్రవి
భ్రాజనమొప్ప నస్త్రములు వర్షముగాఁగ నిగిడ్చె నింద్రుపై.

వ. అంత,

చ. వరుణుఁడు పాశముం గొని సవాహనుఁడై యెదిరించెఁ బాశికిం
దురమునఁ దోడుగా మిగుల దోర్బల మేర్పడ దండధారియై
యరిగె జముండు వెంటనె మహామహిషార్భటి మిన్నుముట్టఁ దా
నిరుపుర కొక్కఁడయ్యెఁ దనియించె సురారి శరాళిఁ బెంపునన్.

శా. ఘోరంబై విలసిల్లు నారణమునన్ గోపమ్ముమై ధర్మ్మఁ "డో
రోరి! రాక్షస ! పోకుపోకు " మని దండోద్యత్కరుండై బల
స్ఫారున్ దాముని వైచుడున్ జలమునన్ బాటింప కమ్మోటి యు
ద్ధారంభుండయి యిందునిఁదొట్టి సురలాహా ! నాఁగజృంభించినన్.

చ. నిలు నిలు పోకు మంచు సురసేతకుఁ దోడయి దేవతల్ సుని
శ్చలులయి మార్గణమ్ముల ననంఖ్యగతిన్ బరఁగించి రక్కసున్
బల మఱఁ జేసినన్ బడియె వాఁడును మూర్ఛ మునింగి సంగర
స్థలమున రక్కసుల్ మిగుల దైన్యమునొంది కలంగి పాఱఁగన్.

క. తాముద్రఁడటు మూర్ఛఁ జెందిన
నాగ్రేడితకోపఘూర్ణితాక్షుల కాంతుల్
తామ్రప్రక్రియఁ బర్వఁగఁ
దా మిగ్రంగెడి భాతి సురలఁదాఁకె మహిషఁడున్. ౧౧౪

—* దేవదానవ యుద్ధము *—

వ. ఇట్లు గజారూఢుండై గదం గైకొని పోకుమని యదల్చి సుర
నాథునేసిన శతంకును బిట్టలిగి వజ్రమ్మున నగ్గదం బొడిచేసె.

చ. తనుఁ దునుమంగ బెట్టిదపుదండడి మీఁదికి వచ్చు నింద్రు నో
య్యనగని యెక్కుడౌ నలుక నార్చి ఫణీడ్నిభమైన ఖడ్గముం
గొని మహిషుండు దా నెదురుకోలు ఘటించిన నంత నిర్వురున్
గనుఁగొనువారు మెచ్చఁగ నఖండముగా నని చేసి రుద్ధతిన్.

గీ. అంత దైత్యుండు శాంబరి నఖిలలోక
మోహకరి గాఁగ మాయఁ దామొనయఁ జేసె
నధిప ! యెయ్యెడఁ జూచిన నాత్మసదృశు
లొప్పి రొకకోటి యమ్మాయఁ గుప్పలుగను. ౧౧౭

వ. ఇట్లు మాయాప్రభావమ్మున నెల్లెడఁ దానయై మహిషుండు విజృంభించి తమ సేనల రూపడంచుటకు నింద్రుం డత్యాశ్చ ర్యపర్యాప్తుండై చేయునది లేక పుల్లవడియె. ౧౧౮

ఆ. వె. వరుణుఁడును జముండు సరసిజాప్తుండు వ
హ్నియు శశాంకుఁడొట్టి యితరు లమరు
లధికభయము దొడర నఁదఁద మ్రాన్పడి
పాఱఁ జొచ్చి రసురబారి కెడలి ౧౧౯

ఉ. ఈగతి నార్తులై యమరులెల్లఁ ద్రిమూర్తుల నాత్మ నిల్పి మా
కాఁగఁగ రాదు వీని నని యంచు మొఱల్ బచరించుమాత్ర న
య్యాగమవేద్యు లయ్యెడకు హంసఖగేశవృషాధిరూఢులై
మూగురు నేగుదెంచిరి సముద్ధతులై మహిషున్ వధింపఁగన్.

వ. పదంపడి చక్రి చక్రంబు వైచినఁ దత్తేజమ్మున నవ్వాని మాయ పంచబంగాళంబై విరిసె. దానికి సహింపక మహిషుండును, చిక్షురుండును, నుగ్రాస్యుండును, నుగ్రవీరుండును, నసిలోముండును, ద్రిణేత్రుండును, బాష్కలుండును, నంధకుండును, దక్కుంగల రక్కసులును నొక్కటై పరిఘాద్యాయుధమ్ములు ధరించి ప్రతిఘటించినఁ బోరు ఘోరంబయ్యె నయ్యెడ. ౧౨౧

ఉ. రక్కసులెల్ల నుక్కునఁ గరమ్ములఁ జాపము లొప్ప దిక్తతుల్
గ్రక్కదలంగఁ దాఁకి యమరప్రతతిన్ వృకముల్ గడంగి దా
మెక్కటి వత్ససంఘముల నేపునఁ దోలినభంగిఁ దోలి రి
ట్లుక్కటియున్ సురల్ వాడిచి రోడక యోపినవట్టు పోరుచున్.

క. కడు నడరు బాణవర్షము
పుడమియు నాకసము గప్పఁ బోరు భరంబై

దొడరిన నయ్యెడ నంధకుఁ
డుడుసంఘము రాల నార్చి యోధులు తలఁకన్.

శా. ఆకర్ణాంతము చాపముం దిగిచి పంచాస్త్రమ్ములన్ వీఁక నా
శ్రీకాంతుం గుఱిఁజేసి యేసిన విశాలీభమ్ము లా వాని నా
లోకారాధ్యుఁడు బిట్టు దున్మి సుర లాలోకించి యగ్గింపఁ దీ
క్ష్ణాకారమ్ముల నైదు బాణముల దేవారాతిపై నించినన్. ౧౨౮

వ. దానఁబోరు ఘోరంబయ్యె నిట్లు హరితోఁ బెనంగి యంధకుండు
హరుం దాఁకెఁ బదంపడి యిరువురకును నేఁబది దినమ్ములు
సమస్తలోకలోమహర్షణంబగు నాహవంబు ప్రవర్తిల్లె నయ్యెడ
బాహ్కులుం డిందుఁ డిందఁకియు మహిషుండు రుద్రు నదల్చియుఁ
ద్రిణేత్రుండు జము మార్కొనియు మహాహనుండు గుబేరునిపైఁ
గవిసియు నసిలోముండు వరుణుపై నురువణించియు నతిదారు
ణంబుగఁ బిఱుసనక సంగరం బొనరించి రట్టియెడ నంధకుం
డుక్కుమిగిలి, ౧౨౯

క. గదఁ గైకొని యమరులు గ్ర
క్కదలఁగ హరి నురువడించి కటు బెట్టిదమై
యదరిపడ గరుడు నేసిన
మదమఱి యాతండు గొంత మూర్ఛిల్లెఁ నధిపా. ౧౩౦

ఉ. అంత జనార్దనుండు విహగాధిపుమేని నొకింత దువ్వి వి
క్లాంతిఁ దొరంగఁజేసి విశిఖమ్ముల నంధకుఁ గూర్చి యేయ వాఁ
డంతఁ దదీయమార్గణము లన్నియు నుగ్గుగఁ జేసి యబ్ధిజా
కాంతుని నేసె నేఁబది యఖండశరమ్ముల శౌరి పెల్చనన్.

ఆ. వె. వాని బాణములను వమ్ముగాఁ జేసి వే
యంచు లొప్పి దీప్తిమించు తన సు

దర్శనంబు వాని తల గుఱిచేసి వై
చిన సురారి మిగులఁ జేవ దవిలి. ౧౨౮

మ. అనివార్యంబగు శౌరిచక్రమును వార్య మ్మాన నటుల్ చేసెఁ గై
కొని చక్రంబొకఁడేసి; దాని కసురుల్ గోలాహలం బొప్పఁ బెం
పున నగ్గించిరి యంధకుల్ ; సురవరుల్ పొల్పేది 'యేమీ ! సుద
ర్శన మిట్లాయె !' యటంచు నొక్కమొగి నాక్రందించి రత్యార్తులై.

క. సుర లాక్రందించిన నా
హరి కనలి యమర్చి యేసె నయ్యంధకుపైఁ
ద్వరితగతిఁ గౌమోదకి
శిరమునకుం దాఁకునట్లు చేకోలఁది వెసన్. ౧౩౦

వ. పిమ్మట నగ్గద శిరమ్మునకుం దాఁకుడు దిమ్ముగదిరి యమ్మానవా
దుండు సొమ్మసిలిన మ్మహిషుం డమ్మధుసూదనుం దాఁకుటయు.

ఉ. చాపము కేలఁబూని పెలుచన్ గుణనాదము మ్రోయ నుజ్జ్వల
త్కోపపరీతుఁడై యెదురుకోలు ఘటించెడివానిపై మహా
టోపత బాణవర్షము గడున్ వెలయించిన వర్షధారలన్
జోపెడి దున్నపోల్కి మధుసూదనుఁదాఁకె హయారి ధీరుఁడై.

వ. ఇట్లు నిరంకుశుండై మహిషుండు హరికార్ముకనిర్ముక్తశరపరం
పరలఁ గ్రమ్మఱించుచుఁ గదిసిన నిరువురకును సంకులక్రమమ్మునఁ
గొంతవడి ద్వంద్వయుద్ధంబు ప్రవర్తిల్లె. ౧౩౩

చ. హరి గద కేలఁ దాల్చి రయమారఁగ నమ్మహిషాసురున్ రణా
దరు మదమత్తు మొత్తినఁ బదంపడి శీర్షము వ్రయ్య మూర్ఛరా
ధరణిపయిం బడెన్ సురలు దైన్యము దక్కఁగ రక్కసుల్ పర
స్పరవదనమ్ములన్ గళలు జాఱఁగ వంచరి కందు నొందఁగన్.

శా. మాత్రన్ దైత్యుఁడు మూర్ఛఁదేరి హరిపై మాత్సర్యమొప్పారఁగా
నేత్రమ్ముల్ గడు నెఱ్ఱఁగాఁ బరిఘమున్ శీర్షమ్మునన్ వైవ దే
వత్రాణుండును దాని తాఁకునకుఁ దత్పక్షీంద్రుపై మూర్ఛిలెన్
సుత్రామాదులుఁసూడనొంచెడకుఁగొంచుంబోయెఁబక్షీంద్రుఁడున్

చ. అమరుల దైన్యముం గని "భయంపడకుం"డని చెప్పుచున్ మహో
ద్యముఁడయి శంకరుండు మహిషాసురుపైఁ దనశూలము న్నిగు
డ్చ మహిషుఁడేడ్తెఱన్ విడిచెఁ బ్రాకటమైతగు శక్తి వక్షమం
దు; మదనహారి తద్ధతికి నోవక హెచ్చినతామసమ్మునన్.

గీ. తన త్రిశూలమ్ముగొని వాని దాఁకి వేయఁ
దొడఁగె వాఁడును బోరాడఁ గడఁగె నిట్టు
లున్న యెడ హరి మూర్ఛఁదా నుడిగి శంక
రునకుఁ దోడ్పడెఁ జక్రమ్ము గొని కరమున. ౧౩౭

వ. ఇట్లు చక్రశూలమ్ములం గొని హరిహరులు సంగరసన్నద్ధులై
విజృంభించుటయు మహిషుండు పేఁచెత్తిన కోపమ్మున. ౧౩౮

మ. మహిషాకారము దాల్చి పుచ్ఛ మతిసంపాతమ్ముగాఁ ద్రిప్పుచున్
మహిభృచ్ఛృంగసమున్నతంబయి యసామాన్యంబునై భీతిధూ
ర్వహమై దేహమెసంగ శృంగముల భూధ్రమ్ముల్ వెసంగూల్చుచున్
విహృతిందాఁకె హరిన్ హరున్ విపులగంభీరధ్వనం బొప్పఁగన్.

ఉ. దానికి నల్గి యిర్వురును దారుణబాణపరంపరల్ ధను
ర్ధ్వానపురస్సరంబుగ నిదాఘరవిప్రభ లొప్ప నేయ న
మ్మానవఖాది బిట్టలుక మారొక్కని భూధరశృంగ మాత్మపు
చ్ఛానుగతంబుగా విసరె నాహరిపై హరుపై రయమ్మునన్.

క. ఉరవడిఁ బఱతెంచెడి త
ద్గిరిశృంగము గాంచి హరి యొగిఁ దీక్ష్ణముతో
శరముల నుఱుముగఁ జేసి య
సురపైఁ దనచక్రమపుడు జొనిపెఁ జొనిపినన్. ౧౪౧

ఉ. ఆహరిచక్రమద్దనుజు నయ్యెడఁ దాఁకిన మూర్ఛవోయి తా
నాహవరంగమందుఁ బడి యంతన లేచి మనుష్యదేహియై
బాహువు నప్పళించి గదఁ బాణి ధరించి నితాంతసంగరో
త్సాహమునన్ మహాభ్రనినదం బొనరించె గిరుల్ చలింపగన్.

వ. అమ్మహానాదమ్మునకు నమరులెల్లఁ దలంకి రట్టియెడఁ గమలా
క్షుండు పాంచజన్యంబు పూరించిన దానవులెల్లరును సురలంబలె
నిశ్చేష్టులైరి. ౧౪౩

—* దేవతలు పాఱిపోవుట. *—

గీ. పాంచజన్యారవమ్మున భయము చెంది
కుందునసురుల వీక్షించి కోపమడర
మానవాకార మెడలి యమ్మహిషుఁ డంత
సింహరూపమ్ముదాల్చి గర్జించి మించి. ౧౪౪

చ. అమరులనెల్లఁ దీవ్రనఖరాగ్రములం బొడి చేయుచున్ గ్రమ
క్రమమున శ్రీహరిం గదిసి గ్రన్న ఖగేంద్రునిఁ బట్టి చీరి యు
గ్రముగ రమాధినాథుభుజకాండము వ్రయ్యఁగఁ జేయఁ గ్రోధవే
గమున సుదర్శనంబు గొని కంజదళాక్షుఁడు విక్రమించినన్.

క. ఆతనిచక్రము తనపై
కేతెంచిన నంతలోన మృగరాడ్రూప

స్ఫీతి విడనాడి శృంగా
ఘాతమ్ములఁ నతని నొంచెఁ గాఱెనుపోతై. ౧౪౬

వ. హరియును వానికోల్తలకుఁ దలఁకి సంగరరంగమ్ము విడిచి పలాయనం బొనర్చి నిజభువనమ్మున కరిగె. శంకరుఁడును వాని నవధ్యుఁగాఁ దలంచి పిఱుందన కైలాసమ్మున కేగె, బ్రహ్మయు నట్టు లొనరించె. ౧౪౭

చ. కరమున వజ్రముం గొని యొకండును నిల్చె బలారి ; శక్తి దా
వరుణుఁడు దాల్చి యొప్పె, బలవంతుఁడు దండసహాయుఁడై రణ
స్థిరత నెసంగె ధర్ముఁ ; డనిఁ జేయఁ గుబేరుఁడు నగ్నియుఁ బర
స్పరముగఁ దోడు వచ్చిరి వెసన్ బఱతెంచిరి సూర్యచంద్రులున్.

ఉ. వీరలకన్న నెక్కుడగు వీరులతోడ లులాయరూపియై
ధీరుఁడు దానవుం డరుగుదెంచెఁ బరస్పరము క్తమార్గణా
సారపరంపరల్ ప్రబలె జ్యానినదమ్ములు సింహనాదముల్
బోరన భూనభోంతరము బూరటిలంగఁ జెలంగి మించఁగన్.

గీ. శృంగముల చేతఁ బర్వత శృంగములను
నుక్కుమైఁ జిమ్మికొంచుఁ గై పెక్కి మహిషుఁ
డెల్ల యమరులఁ దాడించె నిద్ధబలుఁడు
పుచ్ఛసంఘాతముల ఖురస్ఫోటనముల. ౧౫౦

శా. ఉగ్రుండై పఱతెంచు నమ్మహిషయుద్ధోద్యోగముం జూచి భీ
తిగ్రస్తుండయి పాఱె నింద్రుఁడు ; జవాధిక్యమ్మునన్ బాశియున్
వ్యగ్రుండై చనె ; ధర్ముఁడుం బరుగిడెన్ ; యక్షేశవహ్న్యర్కలా
శాగ్రంథిన్ విడనాడి యేగి ; రరిగెన్ జంద్రుండు సాంద్రత్వరన్.

వ. ఇట్లు మహిషాసురుండు నూఱువత్సరమ్ములు పరమదారుణంబగు సంగ్రామం బొనరించి నిలింపులనెల్లఁ దఱిమి జయాధిక్యమ్మునం బొలిచి దైత్యసహితుండై స్వర్గం బాక్రమించుకొని వలయు దైత్యుల వలనగునెడల నియోగించి యమరపరిత్యక్తమ్ములగు ధనాగారమ్ములును నైరావతోచ్చైశ్శ్రవః కామధేను కల్పవృక్షమ్ములును నాత్మాయత్తంబులుగ నొనర్చి యింద్రాసనమ్ము నధిష్ఠించి యథేష్టంబుగఁ బరిపాలనం బొనర్చుచుండె. ౧౫౨

గీ. వాని ధాటికిఁ దాళక వాఁడి దఱిఁగి
యరిగి గిరిగహ్వరమ్ముల నాశ్రయించి
యచటఁ బెక్కులు వర్షమ్ము లార్తి గూర
నమరులు వసించి కృశియించి రవనినాథ. ౧౫౩

వ. పదంపడి యొక్కనాఁడు దేవతలందఱును బ్రహ్మలోకమ్మున కరిగి వేదవేదాంగపారంగతులగు మరీచిప్రభృతిమహామునులు సేవింపఁ బద్మాసనం బలంకరించియున్న వేదగర్భుఁ జతుర్ముఖు ననంతతేజోనిధి రజోమూర్తిం గాంచి సన్నుతించి యిట్లు చెప్పికొనిరి. ౧౫౪

చ. అమరుల మయ్యు నొక్క మహిషాధముచే నిటు లుక్కడక్కి వి
క్రమ మొనరింప లేక గిరిగహ్వరముల్ గృహసీమలై పొసం
గ మహిమమేది నట్టి మముఁగాంచఁగరాదె మహాత్మ! తండ్రి యే
క్రమమున నున్నఁ బుత్రులఁ గరమ్ము ననుగ్రహబుద్ధిఁ జూడఁడే.

మ. అమరస్థానము వానిరాజ్యముగఁ గల్పాగప్రసూనమ్ము ల
య్యమరారాతి పరమ్ముగా మఖము లయ్యశ్వారి పాల్గాఁగ సం
ద్రమునం బుట్టినగోవు వానిదిగ నద్దైత్యుండు పెంపొంద దై
న్యమునన్ మున్గి సురేంద్రు లిట్లగుటయున్ న్యాయంబె లోకేశ్వరా.

వ. సర్వజ్ఞుండవగుటనీ కెఱుంగ రాని దొండుండదు. మా పడెడి యవస్థ యే మని చెప్పికొందు మట్లు స్వర్గంబు వాని పాలొనర్చి యద్రిగహ్వరమ్ముల నచ్చటచ్చట వసియించు మమ్ముల నెద్దియే నొక నిమిత్తంబు గల్పించి పీడించుచున్నవాఁ డట్లగుటంజేసి రక్షకుండవని నీ పాదమ్ములం బడితిమి. మా కెద్దియేని గతి గలుగం జేయు మని మాటికిం బ్రార్థించు నమరులకుఁ గృతాంజలులకుఁ బితామహుండు ప్రేమార్ద్రుండై యిట్లనియె. ౧౫౭

ఉ. చేసెడిదేమి! దానవుఁ డశేషసురాసురమర్త్యులందుఁ ద
న్నోసరిలంగఁ జేయ నొరుఁ డుండమి మత్తత నిట్లొనర్చు వాఁ
డీసరణిన్ వరమ్ము గొనె నెవ్వఁడునుం బురుషుండు తన్ననిం
జేసి వధింపకుండ నిఁకఁ జేడియ వాని వధింపఁగావలెన్. ౧౫౮

వ. కావున మనమందఱమును గైలాసమ్మున కరిగి కార్యవిశారదుం డగు శంకరుతో యోజించి తత్సహితులమై మాధవునొద్ద కేగి కర్తవ్యాకర్తవ్యమ్ములు నిర్ణయింత మని చెప్పి హంసారూఢుండై దేవతలం గలిసి కైలాసమ్మునకుఁ జనిన నంత నద్దేవదేవుండు ప్రసన్నుండై యెల్లర నుచితసత్కారమ్ముల గారవించి కుశల ప్రశ్నపూర్వకముగ నాగమనకారణం బడిగినఁ జతురాననుం డిట్లనియె. ౧౫౯

చ. తెలియనికార్యమే యిదియు దేవరకున్! మహిషాసురుండు వీ
రల నిరసించి స్వర్గము కరంబు తిరంబుగ నేలుచున్న వాఁ
డలఘుఁడు యజ్ఞభాగముల నన్నిటి దైత్యులతోడ వాఁడ యి
మ్ములఁ గొనుచున్న వాఁడు వనముల్ గతియయ్యె నిలింపపాళికిన్.

వ. వాసవుఁ డొట్టి యీ గీర్వాణులెల్ల నన్ను శరణంబు వేఁడిన నిన్నుం గన వచ్చితి, నీ కార్యభారంబు నీయంద నిలిచినది నావుడు మందహాసకందళితముఖారవిందుండై శంకరుండు విరించి కిట్లనియె.

ఉ. తెచ్చితి వీయనర్థమును దేవతలందఱుఁగూర్చి, వరంబు మును నిచ్చి, యిఁకేమి సేయనగు నెవ్వని కేనియు వాఁ డవధ్యుఁ డౌ నచ్చపలుర్ వధింపఁదగు నంగన లెవ్వరు ? నీ సతీమణిం బుచ్చెదొ ? మత్తలోదరినిఁబుత్తునొ ? పుత్త్రమొ వాసవాంగనన్ ?

క. మనభార్యలందు నొక్కతె
యును యుద్ధమునందు నేరు పొప్పెడి సతి లే
దనఘా ! కర్తవ్యం బ
వ్వనజాక్షునివలన వినఁగ వలయుఁ గడంకన్. ౧౬౩

వ. అతండు బుద్ధిమదగ్రేసరుం డగుట నిప్పట్ల వలనగు నుపాయం బెఱిఁగించు నయ్యెడ కరుగుద మని శంకరుఁడు తత్సహితుండై విష్ణు లోకమ్మున కరుగునెడ ననుకూలవాతమ్ములు వీతెంచె మార్గమ్మున నెల్లెడఁ బక్షులు శుభసూచకములయ్యె నాకాశంబు నిర్మలంబుగాఁ దోఁచె దిక్కులు తెలివొందె నిట్లు శుభోదర్కమ్ముగా వెడలి యమ్మహాదేవుండు ముందట, ౧౬౪

సీ. హంససారసచక్రసంసేవితములైన
కమలాకరమ్ములు గలుగుదాని
మందారవకుళచంపకమల్లికాశోక
వనము లెల్లెడ నొప్ప వఱలుదాని
నవరత్నఖచితసుందరసౌధభాసుర
వీథీశతమ్ములు వెలయుదాని

నిగమముల్ సెప్పు మునివరేణ్యులును గాయ
కులు నచ్చరలు గల్గి కులుకుదాని

గీ. సలఘులు సునందనందనాదులు నితాంత
భక్తిశీలురు నలుగడఁ బరఁగుదాని
విష్ణుభువనంబు గని యందు వెలయు నమ్మ
హాత్ముభవనంబు గనిరొ యనంతరంబు. ౧౬౫

వ. ఇట్లు దేవత లందఱు నయ్యెడ కరిగి ద్వారపాలకుం గాంచి మే
మేతెంచితి మని మధుసూదనున కెఱిఁగింపవలయు ననిన నందో
త్కరుండగు విజయుం డరిగి యమ్మధువైరికిం జెప్పె నంత విష్ణుండు
సదనంబు వెలువడి వార లున్నయెడ కేతెంచిన నందఱును నమ
స్కరించి వేదవాక్యమ్ముల సన్నుతించిరి యద్దేవుండును గరుణా
ర్ద్రహృదయుండై యెల్లరఁ గుశలం బడిగి యాసనమ్ముల నుండ నియో
గించి యాగమనకారణం బేమన వార లిట్లనిరి. ౧౬౬

మ. వరదానమ్మున దృప్తుఁడై మహిషుఁ డాపద్హేతువై మాకు న
ధ్వరభాగమ్ములు ముట్టకుండ దివముం దా నేలుచుఁ మమ్ము భూ
ధరదుర్గమ్ములపాలు చేసెఁ బుమవధ్యప్రక్రియం బోల్చునా
సురవైరిం బరిమార్పఁగా వలను సంశోధింపు మేదేనియుఁ.

వ. మహాత్మా! యవ్వాని వధించు పాటి సామర్థ్యం బుమారమా
సరస్వతీశచ్యాదులం దే యంగనకుం గల్గు నయ్యది విచారింపుము
శరణాగతుల మమ్ము దరిచేర్పు మనవుడు విష్ణుం డవ్వారల
కిట్లనియె. ౧౬౭

గీ. అమ్మహిషుతోడ మనము ఘను న్నాహవం బొ
నర్చితిమి కాదె వాఁడు మనకు నవధ్యుఁ

డెల్ల సురల యంశమ్ములు నేకముగఁ బొ
సంగు నట్లొక కాంతఁ జేయంగవలయు. ౧౯

క. మనమనయంశమ్ములఁ బు
ట్టిన యవ్వామాక్షి వాని డీకొని పోరన్
దునుము నసంశయముగ న
వ్వనితకు మన మాయుధములు వలయు నొసంగన్.

—* దేవీప్రాదుర్భావము *—

వ. అని యతండు వలుకు నయ్యెడఁ జతురాననను మొగమ్ము నుండి యొక్క తేజమ్ము రక్తవర్ణమ్మును గించిచ్ఛ్వేతంబును గించిద్కృష్ణమ్మును శుభాకారమ్మును మరీచిజాలకీలితంబును నై పొడమె నద్దాని నీక్షించి శివకేశవులు పరమాశ్చర్యపర్యాప్తులైరి. ౨౦

గీ. రౌప్యవర్ణంబు మిగుల దుర్దర్శ మధిక
తీవ్రము భయంకరంబునై దేవతలకు
విస్మయం బిచ్చు తేజంబు వెలికి వచ్చె
నది రసమమయి రుద్రదేహంబునుండి. ౨౧

వ. పిదప విష్ణుశరీరంబు నుండి సత్త్వగుణోపేతంబై శ్వేతవర్ణంబైన తేజమ్మును పురందరుకాయమ్మునుండి సర్వగుణాత్మకంబై చిత్రవర్ణంబగు తేజమ్మును వహ్నియమకుబేరవరుణాదులగు తక్కిటి సురల శరీరమ్ములనుండి భిన్నభిన్నమ్ములగు తేజమ్ములునుం బొడమి మహాతేజోరాశియై హిమవత్పర్వతసన్నిభంబగు నద్దానిం గాంచి యెల్లరును విస్మయం బందుచుండి రంత నత్తేజఃపుంజ మ్మొక్క దివ్యసుందరియై పదునెనిమిది భుజమ్ములును దెల్లనగు మొగమ్మును నల్లని నేత్రమ్ములును నరుణంబగు నోష్ఠమ్మును నెఱ్ఱని పాణితు

లమ్ములును గలిగి నానావిధ భూషణమ్ములు దాల్చి సన్నద్ధమై యమ్మహిషాసురుఁ జంప నుంకించె ననుడు జనమేజయుండు మహాత్మా ! యమ్మహాదేవిస్వరూపమ్ము సంక్షేపమ్మున వచించుట గాదు విస్తరించి యేయే దేవతలయంశమ్ము లేయే యంగమ్ములుగాఁ బరిణమించె వినవలతు నావుడఁ బారాశర్యుం డమ్మహాలక్ష్మీస్వరూపం బిట్లు వక్కాణించె. ౧౭౩

శా. ఆరూపం బిదమిద్ధ మంచు మునులున్ హర్యాదులున్ జెప్పఁగా
లే రూహింపఁగ నాకు శక్యమగునే ! లేశంబుగాఁ జెప్పి వా
చారంభం బొనరించితిన్ శుభదమై యజ్ఞానవిధ్వంసమై
సారంబై సతమై చెలంగు నది విశ్వం బెల్లెడన్ వ్యాప్తమై.

వ. నరేంద్రా ! యద్దేవి యేకరూపిణియయ్యుఁ దత్తత్కార్యమ్ములకనుగుణమ్ముగ నటునివడువున నానారూపమ్ముల నెసంగుచుండు నయ్యయిరూపమ్ములకుఁ గార్యకర్మానుసారమ్ముగ నామంబులు దనరు, నయ్యవి సగుణమ్ములును నిర్గుణమ్ములునై యనంతమ్ములుగా నుండు నైనను నా యోపిన తెఱంగున వివరింతు నాకర్ణింపుము. ౧౭౪

క. హరుతేజమ్మున వక్త్రం
బురుహము కడు వెల్లనగుచుఁ బొలిచెన్, గురు ల
భ్రరుచిం జెలువారెఁ బరే
తరాజతేజమ్ము పొలుపు దవిలిన కతనన్. ౧౭౫

వ. అజగన్మాతృక నేత్రత్రయంబు పావకాంశంబగు కతనఁ గృష్ణరక్తశ్వేతవర్ణమ్ములం బొలిచెఁ గనుబొమ లుభయసంధ్యలవలన నగుటం జేసి వక్రమ్ములును గృష్ణవర్ణమ్ములును స్నిగ్ధమ్ములునునై

యొప్పె. నాతిదీర్ఘమ్ములును నాతిహ్రస్వమ్ములుం గాక డోలాస
మమ్ములగు శ్రవణమ్ములు వాయుతేజస్సముద్భూతమ్ములు.

సీ. తిలపుష్పముం బోలి యలరెడునాసిక
ధనదుని తేజంబు, మొనలు గల్గి
తనరారు తెల్లని దంతములు ప్రాజాపత్య
తేజంబు, కావివాతెఱ దినేంద్రు
తేజంబు, మీఁదివాతెఱ కార్తికేయుని
తేజంబు పొల్పారు, దీప్తినలరు
పదియును నెన్మిది బాహువులు విష్ణుతే
జం, బంగుళులు వసుసంభవములు,

గీ. స్తనయుగళ మంబుజారి తేజంబు, త్రివళి
సంయుతము మధ్య మింద్రు తేజంబు, జంఘ
లూరువులు వరుణుఁడు, కటి యుర్వి, యిట్లు
పుట్టె నద్దేవి శుభరూపమున నరేంద్ర! ౧౭౮

క. ఆయమఁ గాంచి సురలు మో
దాయత్తత మించి "మహిషు నడఁచు మనకుఁ దా
నై యిచ్చు స్వర్గరాజ్యం
బీయంబిక" యంచు భయము నెడలిరి తమలోఁ. ౧౭౯

వ. అంత విష్ణుండు సురలం గాంచి యీ యంబికకు మీ మీ భూష
ణంబు లొసంగి మీమీ యాయుధమ్ముల తేజమ్ములవలన
నాయుధమ్ము లుత్పాదించి యొసంగునది, యనిన నిర్జరులు సంతు
ష్టులై యట్లొనరించిరి. ౧౮౦

సీ. పాలసంద్రము మేల్మిచేలమ్ములును మంచి
దైనరత్నపుహారమంబ కొసఁగె

నాపాదమస్తకం బమరఁదాల్పఁగ విశ్వ
కర్మ రత్నపుమేల్ నగల నొసంగె
నుతమున శిరమున ధరియింపఁ దగుమాలి
కలు రెండు వరుణుండు కానుకిచ్చెఁ
దనరారు వివిధరత్నమ్ము లిచ్చుటె కాక
హిమవంతుఁ డర్పించె నేన్గు గొంగ

తే. గీ. హరియు హరుఁడును వరుణుండు నాత్మచక్ర
శూలశంఖమ్ములవలన నొలి సృష్టిఁ
జేసి యొసఁగి రయ్యంబకు శ్రీకరములు
చక్రశూలశంఖమ్ములు జనవరేణ్య. ౧౮౧

వ. మఱియుఁ బావకుండు మనోజవమ్మును శతఘ్నియునగు నొక శక్తియు, వాయువు బాణపూర్ణంబగు నంబులపొదియును జాపంబును, నింద్రుండు దనవజ్రమ్మునుండి యుదయించిన వేఱొక వజ్రమ్మును, నైరావతమున కలంకరించెడి గంటయును, యముండు దనదండమ్మునఁ బొడమిన దండంబును, బ్రహ్మ దివ్యగంగాజల పూరితంబగు నొక్క కమండలువును, గాలంబు ఖడ్గమ్మును పలకయును, విశ్వకర్మ తీక్ష్ణంబగు పరశువును, గుబేరుండు సురాపూర్ణంబగు కనక పాత్రంబును, వరుణుండు దివ్యపంకజమ్మును ఘంటాశతనినాదితంబగు కౌమోదకి యను నొకగదయుఁ ద్వష్ట యభేద్యకవచంబును నానావిధాస్త్రమ్ములును దివాకరుండు స్వకిరణములును నొసంగిన నవి దాల్చి వెలుంగు నజ్జగన్మాతృకం గాంచి వార లందఱు నిట్లు నుతించిరి. ౧౮౨

మ. శివవై శాంతివి పుష్టివై సుఖదవై సిద్ధిస్వరూపంబవై
భవసంహారిణి ! కాళరాత్రి వయి యంబాదేవివై వృద్ధివై

యవనిం బొల్చియు దానిచే నెఱుఁగ రా కంతస్థితిం బొల్చి మా
య వెలింగించుచు దానికిం దెలియ రా వత్యంత గోప్యస్థితిన్.

వ. అట్టి వైష్ణవీరుద్రాణీంద్రాణ్యాత్మికవగు నీకు నమస్కరించెద మెల్లని మమ్ముం బీడించు నీమహాయూరిని రయమ్మునం దునిమి కళ్యాణము లొసంగు మని మాటిమాటికి నుతించి చరణంబులం బడు నయ్యమరుల కయ్యంబిక యిట్లనియె.

చ. వినుడు సురల్ ! సురారి నొకవ్రేల్మిడిఁ ద్రుంచెద దీని కింత భీ
తినిఁ గొనువారె బ్రహ్మముఖదేవత లందఱు ? కాలపర్యయ
మ్మున గడవంగ నేరికినిఁ బోలునె ? యొంతటి వింత యంచు నా
ననము సమంచహాసముగ నాద మొనర్చె రిపుల్ భయంపడన్.

ఉ. మేరువు సంచలించె వడి మిన్నదరెన్ జలధుల్ గలంగె దు
ర్వారతరంబుగా ధరణి గ్రక్కదలెన్ దశదిక్కు లొక్కటై
బోరన మ్రోసె నా రవ మపూర్వగతిన్ విని యూహయూరియున్
ధీరతఁ దక్కి రక్కసుల దిక్కు మొగం బయి యల్కపెంపునన్

వ. ఇయ్యది కడుఁగ్రొత్తయై యున్నయది దీనికిం గత మేమొకో ! యని శంకించి వెండియు, ౧౮౨

ఉ. ఈరవ మాచరించు రిపుఁ డెవ్వఁడొ ! గన్గొని వానిఁ గట్టి దు
ర్వారత నాదుసన్నిధిఁ గరంబు తిరంబుగఁ బొందఁజేయుఁ డ
ద్దారుణు మందబుద్ధి గతదర్పు నొనర్చి యమాలయాతిథిం
గా రచియింతు నెవ్వనికిఁ గాలము చేరువయయ్యె నియ్యెడన్.

క. సుర లిట్లొనరించిరొకో
పరమాపద డస్సి నాదుభయమున గిరిగ

హ్వారములపాలై నిర్భీ
తి రవం బొనరింప నింత తెగువ గలుగునే ! ౧౮౯

వ. అని పనిచిన దూతలు సని సర్వాంగసుందరియు నష్టాదశభుజయు సర్వాభరణభూషితయు నాయుధసంపన్నయు హస్తమ్మునఁ జష కమ్ము గొని సారెసారెకు మధుపానం బొనర్చుచున్నదియునగు నప్పురాంబ నీక్షించి భయత్రస్తులై మహిషుపాలికిఁ జని యిట్లనిరి.

ఉ. సింగము నెక్కి యెక్కుడగు చెల్వునఁ బొల్చెడి యొక్కకాంత స
ర్వాంగసముజ్జ్వలన్మణిమయస్ఫుటభూషణ నిస్తులాయుధా
భంగురహస్త నిత్యమధుపానమదాలస చారుచంచలా
పాంగ గనంగ నయ్యెఁ గనినంతన భీతి యెసంగె మాకొగిన్.

వ. అత్తలోదరి సురకాంతయు నసురకాంతయు నని నిరూపింప రాక యపూర్వప్రక్రియ నొప్పుచున్నయది. తత్తేజంబు దుర్దర్శంబగు కతన నిలువ నోడి యిట కరుదెంచితి మంతరిక్షమ్మున నుండి నిలింపు లాయంగనామణి నెక్కుడుగ సన్నుతించుచుండి రవ్వారా రోహ యేమి కతమున నిట కేతెంచెనో తెలియుట మాకసా ధ్యంబు, తద్దర్శనమాత్రపలాయమానులమై దేవరకు విన్నవింప వచ్చితిమి. ౧౯౨

క. శృంగారాదిరసమ్ము ల
పాంగాధీనములు గాఁగ నంగజశత మా
రంగ సృజియించు చెల్వన
నంగన రంగారు నేమి యనఁదగు నధిపా. ౧౯౩

వ. ఇంక నెయ్యది కర్తవ్యం బానతిమ్ము నావుడు మహిషుండు మంత్రి దిక్కు మొగంబై సాభిలాషమ్ముగ నిట్లను, ౧౯౪

మ. అనురాగిల్లితి నత్తలోదరికి నే, నయ్యంగనారత్నముం
గోని రమ్మేకిరియనైన సామమున నాకోర్కుల్ ఫలింపంగ నే
నోనరింతుఁ బ్రియమారఁ బట్టమహిషీయోగంబు, తత్కన్యకా
జనచూడామణి కింతకన్నఁ గలదే! సంతోష మొందేనియున్.

గీ. సామదానభేదమ్ముల సమ్మతించి
వచ్చెఁగా కేమి రాకున్న మచ్చెకంటి
నిటకు రప్పింపుమీ బలాత్కృతిగ, నొప్ప
నేని రసభంగ మొనరింతువేమొ మొదల. ౧౯౬

ఉ. ఆసరసీరుహాక్షి జలజానన యాతనుమధ్య లేని యీ
వాసవలోకసౌఖ్యములు వ్యర్థము; లచ్చెలిమిన్న విన్న నా
కాస జనించె వైళమ తదంగన నియ్యెడఁ దేవలెన్ రసా
భాసము గాకయుండ నొకపక్కిక నీదగు నేర్పుకూర్పునన్.

వ. అని యనిపిన నమ్మంత్రివరుం డరిగి దౌదవ్వుల నిలిచి వినయా
వనతుండై యిట్లను. ౧౯౭

ఉ. ఎందులదాన! నియ్యెడకు నేమికతమ్మున వచ్చియుంటి! నీ
యందముఁ జందమున్ విని స్మరాతురుఁడై ననుఁబంపె మావిభుం
డందుల కేగుదెంచెదో! రయమ్మున నాతనిఁ దోడి తెచ్చి నీ
కిందు నొసంగువాఁడనో, మృగేక్షణ! యీ తడవేల చెప్పుమా.

మ. సరసీజాసనదత్తమౌ వరమునన్ స్వర్గమ్ము నిర్జించి యె
వ్వరికిన్ వధ్యుఁడు గాక యిచ్ఛ కనురూపంబైన రూపమ్ము దా
ల్చి రసజ్ఞత్వము గల్గి మావిభుఁడు నిస్సీమప్రతాపాదిభా
స్వరుఁడై వర్తిలు వేళ్లకోకందు మహిమస్వామిస్థితిన్ బోలునే.

చ. అనవుడు లేఁతనవ్వు నగి యజ్జగదంబిక పల్కు " దేవతా
జననిగ న న్నెఱుంగుము ప్రశంస యొనర్చితి కాన నంతయున్
విని చెద మీవిభుం డిడెడివేదన కోపక నన్ను వేఁడినన్
బనిఁ గొని వచ్చితిన్ మహిషుఁ బట్టి వధించి సురాళిఁబ్రోవఁగన్.

వ. ఇంతవట్టును నీయందలి వినయవిధేయతలకు మెచ్చి వచించితి
వేఱొక్క తెఱఁగేని యిప్పుడ నిన్ను వధింతు నింకఁ జాగు
సేయక పోయి మీ రాజునకు నారాక యెఱింగించి యిటు వచ్చి
యింపుము. ౨౦౨

—* దేవీ మహిషదూత సంవాదము *—

శా. జీవింపన్ వలతేనిఁ దత్ క్షణమ స్వశ్రీపీడి పాతాళముం
బోవం జూడు మనుగ్రహించి విడుతున్, బో నేరకున్న న్నినున్
దేవప్రీతిగ యుద్ధరంగమున మద్దివ్యాస్త్రపాతమ్ములం
గావింతున్ మృతుఁగా మదగ్రిమున నీగర్వంబు దుర్వారమే.

చ. ప్రతియుగమందు దుర్మదులు పల్వురు నీవలె దేవపీడ సం
తతగతిఁ జేసి మచ్చరశతమ్ముల రూపఱి పోయి రింక నీ
గతియును నట్లకాఁ దలఁచి గర్వము వీడుము ధాత నీకు మె
చ్చి లివిరి యిచ్చునవ్వరము చెల్లదు పొల్లగు మచ్చరమ్ములన్.

ఉ. కావున దేవసద్మమును గర్వముతోడన వీడి పొమ్ము లే
దా, వెలిపేది శస్త్రములు దాల్చి రణమ్మున కేగుదెమ్ము నీ
కావర మింతలో నడఁచి కాలునిపోలికిఁ బంపి స్వర్గ మా
దేవతలందు నిల్పెద విధేయులఁ బ్రోచుట నాకుఁ జెల్లదే ".

వ. అని మహిషునకుం జెప్పుము పొమ్ము నావుడు మంత్రి యయ్యం
బిక కిట్లను, ౨౦౩

ఉ. ఎక్కడిమాట లియ్యవి! మృగేక్షణ! యౌవనగర్వసంపదన్
మిక్కిలి మీఱి పల్కెదు సమిద్ధపరాక్రమశాలి మావిభుం
డెక్కడ! బాల నీ వతని నెక్కటిపోరున నిగ్రహించు లా
వెక్కడ! నమ్మ శక్యమగునే! విను మాతని శౌర్యసంపదల్.

ఉ. ఆతని సైన్య మొక్కవిధమైనది కాదు రథాశ్వనాగము
ఖ్యాతతమై పదాతినిచయాకులమై తగుఁ గామరూప వి
ఖ్యాతుఁ డతండు నిన్నడఁచు టబ్బురమే! లలితాంగి! దుర్మద
స్ఫీతగజంబు మాలతి నశింపఁగఁ జేయుటయుఁన్ భరంబొకో.

ఉ. నీయెడ మావిభుండు గడు నెయ్యము గల్గి చరించునప్పు డే
మో యువతీలలామ! కఠినోక్తులు పల్కి రసంబు భంగముం
జేయఁగ రామి నీకిటులు సెప్పుచునుంటి మఱింత యేల నీ
ప్రాయము సార్థకమ్ముగఁ గృపన్ గనుఁగొమ్ము వరింపు మాతనిన్

గీ. అతనిరాజ్యము ధనమును నఖిలమునుఁ ద్వ
దీయమగు, భృత్యుఁడై సేవఁజేయుఁ బట్ట
రాజ్ఞివై మమ్ముఁబాలింప రాదె! భక్తి
భావమున నీకు మ్రొక్కెదఁ బంకజాక్షి. ౨౧౦

వ. అని బహుభంగుల సామపూర్వకమ్ముగాఁ బోధించు వానికి
నయ్యంబ యిట్లను, ౨౧౧

ఉ. నీదగు తెల్వితేటలును నేర్పును నింతియ నిన్ను మంత్రిగా
నూఁదినవానికిం దెలివి యొప్పునె! యోపశుబుద్ధి! యిద్ద అ
న్నాదులు నిద్దఱున్ హతమనస్కులు నిద్దఱు నిద్దతే వృథా
వాద మిదేల! ధాత తగువారిని గూర్చె జగమ్ము నవ్వఁగన్.

వ. ఏను స్త్రీ స్వభావమ్మునం జేసి వాని బలపరాక్రమంబు లెఱుంగ నని కదా వ్రేలితి వయ్యది నిక్కంబ. ఏను బురుషుండ నొండెం దదనుగుణస్వభావ నగు స్త్రీ నొండెం గాకుందునని వెండియు.

మ. అతిమూఢుండయి మున్ను మాప్రభువు తానాసించె స్త్రీచేతం బం
చత నద్దానతకతమ్మునన్, వినుము తచ్చాతుర్య, "మెంతే జుగు
ప్సితమా నంగనచేతం జచ్చు" టని తాం జిత్తమ్మునన్ రోయండ
మ్మతిహీనుం డిపు డవ్వరం బెదిరెం దామైమెం జనం బోలునే.

చ. "పురుషుని నన్ను నివ్వనిత పోర నెదిర్చి వధించునే" యటం
చరయక మృత్యు వీ నెపము నందినదంచు నెఱుంగునట్లు మీ
నరపతితోడం జెప్పు మొకనాతియ కాదు, తృణంబు వజ్రమై
పొరింగొనుం గాలపర్యయము మూండిన నెంతటివానికేనియున్.

వ. కాలంబు సమంజసం బగునప్పుడు వజ్రంబేనియుం దూలంబగు నట్లగుటం దనకుంగల సైన్యమ్ములును నాయుధమ్ములునుం దక్కటి
సాధనమ్ములును వమ్మగు నిక్కువంబని మఱియును. ౨౧౬

ఉ. కాయము దాల్చువారలకుం గాదొకో మృత్యువు! నిక్కమేరికే
నాయువు నిశ్చలంబె! జలజాసనుం డాదిగ నొక్కండేని ని
త్యాయితుం డున్నె! చావు లరయన్ బలురీతులు, దైవనిర్మితం
బై యిటు తన్ను మృత్యువు రయమ్మున మ్రింగంగవచ్చు దుర్మతీ.

వ. ఎవ్వని కెవ్విధమ్మున విధించి యుండు వాం డవ్విధమునం బొలియు, నిట్లుండం గొందఱు మూఢులు 'మాకు వరమ్ము గలదు మే మెవ్వరికేని నవధ్యుల' మని విఱ్ఱవీంగుదు, రట్లు గర్వించినవా రెవ్వరేని శాశ్వతులై యుండిరే! యింతవట్టు నీ ప్రభువునకు బోధించి జీవింపంగలండేని హవిర్భాగమ్ములును దివమును దేవా

ధీనం బొనర్చి తన వారితోఁ బాతాళమ్మున కరిగి యుంతు సుఖ
మ్మగ నుండునట్లొనరింపుము నావుడు మంత్రి నిజాంతర్గతంబున.

ఉ. ఎక్కువ తక్కువల్ తెలియ కియ్యబలామణి ప్రేలుచున్న దీ
చక్కరబొమ్మయుక్కడఁపఁ జాలియుఁ జాలకపోతి రాజు పె
న్మక్కువఁజేసి దీనిఁ దన మానినిఁగాఁ గొన నెంచి పంపిన
ష్టిక్కమలాక్షి యేమనిన నెల్లిదమై చన దింత నిక్కమౌ. ౨౧౯

వ. కాదని యుత్తరుణితో ననికి సంతనకట్టితి నేని రసాభాసంబగు నట్లు విరసంబొనర్చి ప్రభుసన్నిధి కేగుటెట్లు సమంజసంబగు ! అదియునుంగాక కామాతురుం డగుకతన నతండు నారాక కెదురు చూచుచుండు, నట్టియెడ నే నిద్దాని జయించినను నిద్దాని సమరమ్మున నోడినను నిరుదెఱంగు నతని కప్రియంబ యగుంగా కేమి యాతనికడ కేగి చక్కఁగా బోధించి పిదప నతని యభిప్రాయానుసరణమ్మునఁ గార్యంబు నిర్వహించెద నిదియ లగ్గని యతండు మహిషుపాలికిం జని కృతాంజలియై యిట్లనియె. ౨౨౦

శా. నీ యాజ్ఞం గొని యేగి కంటి నచటన్ నీరేజపత్రాక్షిఁ దే
జో యుక్తిన్ వెలుఁగొందు దాని శరసంస్ఫూర్త్యంచితాస్త్రాదశ
స్ఫాయద్బాహువిలాస సింహగత నబ్బాలాశిరోమాళితో
నీ యందమ్మునుఁ జందముం దెలుపుచు న్నే నిట్లు బోధించితిన్.

ఉ. మావిభుఁ డీత్రిలోకముల మన్నన కెక్కినవాఁడు నిన్ను సు
శ్రీ వెలయంగఁ బట్టమహిషీపదముం దొగి నిల్పి సేవకుం
డై వశవర్తియై మెలఁగు నాతనిఁ బొందుము మూఁడులోకముల్
నీ వయి యేలుకొమ్ము రమణీ ! యెలప్రాయము సార్థకమ్ముగన్.

వ. అను నా పలుకుల కక్కామిని కనలి స్మితం బొనర్చి యిట్లనియె.

మ. మహిషీగర్భసముద్భవుం డులువ నమ్మందుర్ సురప్రీతిధూ
ర్వహు నై నే బలియిత్తు శక్తి కకటా ! పాపాత్మ ! నాకోటికిన్
మహిషుండా పతి ! యెంత హీన యయినన్ మానంబు పెంపేది త
త్సహవాసం బొనరించునే ? మహిషియౌ దద్యోగ్య తుల్యాకృతిన్

చ. సురలకు వైరియై మిగుల సోలుచు మత్తిలి దుష్టుఁడై యహం
కరణమునన్ జరించు జనకంటకు నమ్మహిషాధమున్ వధిం
తు రయము మీఱ దైత్యతతితోడ రసాతల మేగనేనియున్,
గరుణ దలిర్పఁగాతు " నని కావర మెత్తి వచించెఁ బెల్చనన్

వ. అంత సేనాదుర్భాషణమ్ములకు సైఁపక యుద్ధమ్మునకు నుంకింప నెంచి రసభంగం బగు నని యోజించి దేవరకు విన్నవింప నిట కరుదెంచితి. ౨౨౬

ఉ. అంగనయయ్యు నెక్కుడు మదాలసయై బలమున్ జలంబు ను
ప్పొంగ నిరంకుశంబుగ రణోత్సుకయై చెలువారుదానితో
సంగర మాచరించుట యసాధ్యమ కా వగతున్ జయంబుఁ ద
ద్భంగము నన్న వెయ్యెడల దైవవిధేయము లెంతవారికిన్. ౨౨౭

వ. నావుడు మహిషుం డితికర్తవ్యతామూఢుండై వృద్ధులగు మంత్రుల రావించి యీయంగన దేవప్రేరితయై చనుదెంచిన శాంబరి యగుమాయ యగుం గాకేమి మీర లుపాయజ్ఞుల రిందు సామాదులయం దెయ్యది ప్రయోజ్యంబగు విశ్వాసార్హంబుగా వచియింపుఁ డనిన వార లిట్లనిరి. ౨౨౮

గీ. సత్యమై ప్రియమైనవచనము పతికిఁ
దెలుపు టుచితంబు రెంటికిఁ దొలఁగకుండు
మాటదొరకదు రుచ్యమై మందు రోగ
హారి యగు టెందు దుర్లభం బండ్రు బుధులు. ౨౨౯

గీ. అనృతమునఁ బ్రీతి పుట్టించు నతికపటులు
వేనవే లుంద్రు సత్యమ్ము వినుచువాఁడు
వినెడివాఁడును దానిని మననచేయు
వాఁడు మూఁగురు దుర్లభుల్ పార్థివేంద్ర. ౨౩౦

వ. కావున నెడతెగని యిమ్మహాకార్యమ్మునందు నీ కెట్లు ప్రీతికరుల మయ్యెద మదియునుం గాక రాఁబోవు శుభాశుభమ్ము లెవనికి వేద్యమ్ము లనపుడు మహిషుండు మంత్రుల కిట్లను. ౨౩౧

క. తప్పేమి మీకుఁ దోఁచిన
యొప్పున వచియింపుఁ డిందు యుక్తియుతంబై
చొప్పడువానివచనముఁ
గొప్పగఁ జేసి కయికొందుఁ గోర్కె దలిర్పన్. ౨౩౨

—* మహిషుండు దేవికడకు దూతం బంపుట *—

వ. నప్పుడు విరూపాక్షుం డను మంత్రిశ్రేష్ఠుం డతని కిట్లనియె.

చ. అనృతము సాహసమ్మును మృగాక్షులసొమ్మని నీ వెఱింగి యి
వ్వనిత ప్రగల్భవాక్యములఁ బ్రౌఢిమ గొల్పెడఁ జెల్లునే? యొకం
డనక ననున్ వెసం బనుపు మవ్వనితన్ వధియింతు నొండెఁ గా
దనినను నాగపాశముల నంటఁగఁ గట్టిద, నిన్నుఁ జేర్చెదన్.

వ. పిదపఁ జేయునది లేక వశవర్తినియై నీకోరినయట్ల వివిధ భోగమ్ములం దేల్చి నీయం దనురక్తయై యుండు నిది నాకుం దోఁచిన తెఱంగు, త్రిలోకవిజయం బొనర్చిన నీబోఁటి కొక్క బోటికై యింత తలంక వలయునే? యిది బిభీషికామాత్రంబ కాని వేఱొండు గాదు నప్పుడు దుర్ధరుం డనుమంత్రి యిట్లనియె. ౨౩౪

మ. అనుమానమ్మునఁ జూడ నవ్వనిత కామాసక్తగాఁ దోఁచె నం
గనలం దిట్టి బిభీషికల్ గలవు వక్రప్రక్రియం బూరుషుం
గని లోఁగొందురు హావభావవిదు లాకర్షింతు రీచెయ్వి, లి
వ్వనజాక్షీమణి నిన్నుఁ గోరి యిటు పై పై వక్రతల్ సూపెడున్.

చ. "శరముల నిన్ జయింతు" ననె సారసగంధి, తదర్థ మన్యగో
చర మగు నెట్టు! లమ్మదనశాస్త్ర మెఱింగిననాకుఁ దక్క, భూ
వర! శరముల్ కటాక్షములు, వ్యంగ్యవిధిన్ గ్రహియింపు తత్పరం
పరలు నిగిడ్చి నిన్ను వశవర్తిగఁ జేయుతలంపు గాఁ దగున్.

వ. అమ్మగువ వచియించిన వాక్యమ్ముల కెల్ల నర్థం బిట్లని యూ
హింపవలయు నట్లు గాదేనిఁ ద్రిలోకమ్ములం జయించి హరిహరా
దులఁ జీరికిం గొనక నిష్కంటకమ్ముగ రాజ్యంబు శాసించు
నీవయి నొక్క యబల బాణపాతం బొనరించు టది యేటిమాట!
ఇఁక నొక్కటి యవధరింపుము, "బాణప్రయోగం బొనరించి
నిన్నుం బడవైచెద" నని కదా, యత్తలోదరి వలికె! "పడ
వైచెద" ననుటకు వ్యాఖ్యానం బవధరింపుము. ౨౩౮

చ. మొదలఁ గటాక్షపాతమున మోహితుఁగా నొనరించి మీఁద దు
ర్మదమున యుద్ధరంగమను మంజులశయ్య బలాత్కరించి నిన్
జదురుగఁ బండబెట్టి పురుషాయితబంధమునన్ గరంతు నం
తదనుకఁ దాళు" మంట యది తత్త్వము దూతకెఱుంగఁబోలునే.

వ. మఱియు నిన్ను విగతప్రాణుఁగా నొనరింతుననుటకు నర్థంబు
వినుము, ప్రాణం బనఁ దేజంబు దాని నపహరింతు
ననుట, యుత్తమాంగనలు వ్యంగ్యప్రధానమ్ముగాఁ గాముకు వరి
యించుట గామశాస్త్రసమ్మతంబు. నీ వజ్ఞుండగువానిం బంచిన
వాని కీ యర్థంబు గోచరం బగునే యని వెండియు. ౨౪౦

ఉ. సామము దానముం గొలిపి చందనగంధినిఁ బొందు మొందు లే
దీమెయి నీ కుపాయ, మది యెంతటిగర్వము నేనిఁ దాల్చుఁగా
కేమి మఱెంత కోపవతియే నగుఁగా కిటు చేసినన్ వశం
బై మరగున్ గ్రమమ్ముగ, మృగాక్షులభంగులు వక్రవక్రముల్.

క. పలుమాట లేల యచ్చిలు
కలకొలికిం దెచ్చి నీకుఁ గానుక సేయం
గల నన్నుఁ బనుపు మావలఁ
గలపని నేఁ జూచికొనెదఁ గా కసురేంద్రా. ౨౧౨

వ. అని పలుకునతని కడ్డంబై తామ్రుం డిట్లను, "మహాత్మా యియ్యది కామాతురయు వ్యంగ్యార్థచతురయు నీయందనురక్తయుం గామి నిశ్చయంబు. ౨౧౩

ఉ. ఆదర మూఁది నా పలుకులందలి యర్థము సంగ్రహింపు మ
ష్టాదశబాహువుల్ నిశితసాయకముల్ గల దీనివంటి బల్
గాదిలివన్నెలాఁడి నొకకాలమునందును నెందుఁ జూడఁగా
రా దిది యెగ్గియో కడు భరంబుగఁ దోఁచు సరిష్టహేతువై.

వ. దీని కనుగుణమ్ముగ నాకుఁ బెక్కులు దుస్స్వప్నమ్ము లింతకు మున్న ప్రతిదినమ్మును బొడముచున్నయవి, నేఁటి యుషఃకాలమ్మున నొక కాంత కృష్ణాంబరధారిణియై యేడ్చుచు గృహాంగనమ్మునఁ బొడకట్టె నిది యిట్లుండ. ౨౧౪

క. ప్రతిదినము ను వికృతములగు
రుతు లడర విలక్షణంపు రూపునఁ దగు ప
క్షితతులు గృహములపై రా
త్రితటిన్ గూయంగఁ దొడఁగె దేవర! వింటే. ౨౧౫

వ. ఈదుర్నిమిత్తమ్ముల కెద్దియేని నొకకారణం బేర్పడవలయు, నిమ్మెడ యుద్ధరంగమ్మున సన్నద్ధయై యున్నయంగన గంధర్వియు మానుషియు నాసురియుఁ దదన్యయుంగామి తెల్లంబు, దేవప్రేరిత యైన యొకమాయ గావలయు నెట్లని నగుఁగాక సంగరమ్మునకు సంతనకట్టి వెడలుట కర్జంబు జయాజయమ్ములు దైవాధీనమ్ము లగుట బుధుండప్పట్ల నిర్భయుండు గావలయు శుభాశుభమ్ము లేరి కిని వార్యంబులుగావు" నావుడు మహిషుం డతని కిట్లనియె.

ఉ. నీ వచనమ్ము లింత దగునే చను మిప్పుడ యుద్ధమందు బల్
చేవ యొలర్ప నవ్వనిత లీలమెయిన్ వశఁగా నొనర్చియుం
దే వెర వయ్యెనేని యిటు తె మ్మటు దక్కినఁ దీవ్రబాణముల్
ప్రోవులు గా నిగిడ్చి జము ప్రోలికి దాసి నొనర్పు మేత్తెరన్.

ఉ. వీరుఁడవై స్మరాగమవివేకివి నాఁ గర మొప్పు నీదుగం
భీరత నేఁడు చూడవలె వే చని వేగిరపాటు దక్కి యం
భోరుహనేత్రి యిమ్మెడకుఁ బోరఁగ వచ్చెనొ, పొందవచ్చెనో!
నేరుపుమైఁ గనుంగొనుము నిక్కమెఱింగి దొడంగు మాజికిన్.

గీ. కేవలము నిర్దయుండవై కినియ కత్త
లోదరీమణి నెమ్మది నున్న తెఱఁగు
నరసి యప్పటి కనుకూలమైన వలని
ననుసరింపుము పొమ్ము జయమ్ముఁగొమ్ము. ౨౫౦

వ. అని యానతిచ్చినఁ దామ్రుండు కాలవశుండై సైన్యమ్ములు గొలువ మహిషునకు నమస్కరించి వెడలి యెడనెడఁ బొడము దుర్నిమిత్తములు గణింపక చని ముందట. ౨౫౧

క. హర్యక్షముపై నెక్కి య
వార్యాయుధహస్త యగుచు వచ్చిన యుద్య

ధైర్యఁ గని లోకనాయిక
నార్యన్ దివిజావళీసమారాధ్యపదన్. ౨౫౨

వ. ఇట్లు గాంచి దాదవ్వల నిలిచి సయుక్తికమ్ముగ వినయపూర్వక
మ్ముగ నిట్లనియె. ౨౫3

ఉ. శృంగి నెఱుంగుదే ! యతఁ డజేయపరాక్రముఁ డెల్లరూపు లా
రంగొన నేర్చువాఁ డబల ! రాక్షసశేఖరుఁ డావిభుండు నీ
కుం గడు లోఁగి నీదుగుణకోటి గుణించుచు రూపమెంచి పా
ణిం గ్రహియింపఁ గోరెడు గణింపఁ దరంబె భవద్విశేషముల్.

—* తాామ్రముండు దేవితో సంభాషించుట *—

క. మాయేలిక కేలికవై
నీ యిచ్చకు వచ్చినట్లు నిర్జరభువన
స్థాయినివై నందనమునఁ
బాయక విహరించుకంటె భాగ్యము కలదే. ౨౫౫

ఉ. సుందరమైన దేహ మిటు చొప్పడె నీకుఁ బురాకృతంబు మే
లందినదాన వౌట నకటా యిది యెట్లు ఫలించు మావిభుం
బొంది సుఖింపవేనిఁ బువుఁబోణిరొ ! కల్పకసూనవిస్ఫుర
త్కందుకముల్ ధరింప కిటు కత్తులఁ బూనఁగ నేల పాణులన్.

ఉ. మానిని ! యేలొకో, తెలివి మాలి ధరించితి చాప మస్త్రసం
తానముతోడ ? భ్రూలతలు నాణెపుఁజూపులుఁ దత్తదర్థ సం
ధాన మొనర్పఁ జాలవొకొ ! తన్వి ! సుమమ్ములఁ బూని మైన నే
వ్వానికిఁ బ్రీతి గాని యవి పల్లవపాణికి నీకుఁ జెల్లునే. ౨౫౭

వ. అదియునుంగాక నింకొక్కఁడు వచియించెద యుద్ధమ్మునకన్న
సంసారికి వేఱొండు దుఃఖమ్ము లే దైనను లోభాదృతులై యుద్ధా
నికి మదాంధులు సమకట్టుదురు, నీబోఁటిబోటి కియ్యది యేల?
అనుగ్రహించి దేవదానవపూజితుండై లోకమ్ములెల్లఁ దానయై
యతిశయించు నస్మదధిపతి మహిషాసురు వరియించి పట్టమహి
షివై యిష్టోపభోగమ్ము లనుభవింపుము సంగరమ్మున నేరికేని
జయంబు సంశయగ్రస్తం బింతయు నీతివేదిని వగు నీకుఁ దెల్లంబ
యని వెండియు. తిగు

చ. అతని వరించి యౌవనమునందు సుఖమ్ములు గూడఁ బెట్టి ని
ర్జితసురనాథుఁడై మహిషు చేవకు మించెడివాని లోకసం
స్తుతు సుతుఁగాంచె దీవు కడు సుందరుఁ డత్తనుజుండు మీఁద దై
త్యతతికి రా జగుం దనదు ధాటి సురాసురులెల్ల మెచ్చఁగన్

వ. అను తామ్రునివచనమ్మును విని మేఘగంభీరభాషణమ్ముల
నయ్యంబిక యిట్లనియె.

శా. ఓరీ తామ్రి, కటుప్రలాప! విను మీ యుక్తుల్ సహింప న్ననుం
దేరం బంచినవానితల్లిపలె గేడె న్నేను గా, నట్టి దు
ష్ప్రారంభున్ యవసాశి న మ్మహిషుఁ గామార్తున్ వరింపంగ నా
కేకీతిం దగుఁ బుచ్ఛము న్నురుదరం బేలీల నేఁ దాల్చెదన్.

చ. హరిహరనీరజాసనుల నష్టదిగీశులఁ గోర కక్కటా!
సురుచిరమూర్తియంచుఁ దను సూనశరార్తుఁ దృణాశి శృంగి నే
వరునిఁగఁ బొంది లోకమున వారని దుర్యశ మంద వెఱ్ఱిసుం
దరినె! పశున్ వరింపఁదగు తన్వియుఁ గల్గెనె యేయుగమ్మునన్.

వ. అదియునుంగాక నిర్గుణుండును నిర్మముండును సర్వసాక్షియు సర్వ
కర్తయు నకర్తయు సర్వజ్ఞుఁడును సర్వగుఁడునుఁ బూర్ణుండునుఁ

బూర్ణాశయుండును శివుండును శాంతుండును సర్వభావనుండు
నగు పురుషుండు మద్భర్త, అతనిఁ ద్యజించి హేయతాభాజన
మ్మగు దేహమ్మునం బొల్పుమందాత్మ నధముఁ డన్నే మని
వరియింప నుంకింతు నని వెండియు. ౨౬౩

ఉ. శాతశరాళిఁ గాలుమహిషంబుగఁ జేసెద మీవిభుఁ మరు
ద్వ్యాతికిఁ దక్కి భీతిమెయిఁ బోయి రసాతల మంటియున్న స
త్కాతరుఁగాతు నింతయును గ్రక్కునఁబోయి వచించి యుద్ధపుం
జేతకుఁ బిల్వు మత్తులువఁ జెచ్చెర వచ్చినఁ దున్తు వ్రేల్మిడిన్.

శా. భగ్నాశుండు ననున్ వరించునె ! మదపాగ్భారదుర్వారధీ
మగ్నాత్మున్ మహిషాధముం దను నికామప్రోజ్జ్వలన్నామకా
స్త్రాగ్నిజ్వాలలవ్రేల్తు నంచెఱుఁగఁజో రా!తామ్రి!యంచున్ రిపుల్
భుగ్నప్రాభవులై కలంగ రవముం బూరించె ఘోరమ్ముగన్.

శా. స్వర్యాభదుర్భర మైనయారవమునన్ సప్తాంబుధుల్ దూలె నం
తర్భారంబు సహింప కద్రిలు ప్రతిధ్వానమ్ము లిచ్చెన్ భయా
విర్భావమ్మున దైత్యసంఘములు కంపించెన్ దదీయాంగనా
గర్భమ్ముల్ పగిలెన్ దిశావలయ మేకంబాయె నొక్కమ్మడిన్.

ఉ. ఆ రవ మాలకించి భయమంది పలాయనశాలి తామ్రిఁడిం
దే రయ మార నమ్మహిషధీరుని సన్నిధి కేగె, మున్న త
త్ప్రేరులకర్ణముల్ బధిరభావము దాల్చె ననంతరంబు నా
గారియు గర్జిలెన్ ద్విగుణ మయ్యె భయమ్ము సురారికోటికిన్.

వ. పిమ్మట మహిషుండు భయత్రస్తుండై తన కడ కరుదెంచిన
తామ్రిం గాంచి సచివులదిక్కు మొగంబై చింతాదంతురం బగు
చిత్తమ్మున నుత్తలపాటుగదుర నిట్లనియె. ౨౬౪

మ. గరువం బేది రసాతలమ్మునకుఁ బోఁగా నెంతుమో దుర్గ మె
వ్వరికిం భేద్యము గానిరీతి నొనరింపం జూతుమో లేక సం
గరరంగమ్మున నత్తలోదరిఁ గదుర్ గారింతుమో యెంచి మీ
ర్వరబుద్ధుల్ వచియింపుఁ డియ్యెడల శాస్త్రప్రక్రియాధుర్యులై.

గీ. మంత్రమూలంబు రాజ్యంబు మహిపతులకు
నదియు గుప్తమ్ము గావలె నట్లు గాని
చో వినాశమ్ము గలుగు నిచ్చో ననుగుణ
మైనవలను విచారింపుఁ డయ్య మీరు. ౨౭౦

ఉ. వచ్చినకాంత గా దబల, వైళమ పోయి జయింప రాదు తా
నచ్చపలాక్షి యొక్కటిగ నాహవకేళికి నిర్భయమ్ముగా
వచ్చుట కొంత చింత్యమగు వారక పోరితి మేని మీఁద మే
ల్వచ్చునొ ! కీడు వచ్చునొ ! శుభం బశుభం బెవఁడోపుఁ జెప్పగన్.

వ. ఉపాయవాదులు కొందఱు దైవం బన నెద్ది యెవ్వఁ డెఱుఁగు
నోపినవట్టు యత్నం బొనరించుట కర్జం బండ్రు. కొందఱు దైవ
మ్మును నుద్యమంబును గార్యసిద్ధిప్రదంబు లని చెప్పుదురు. మీ
మీ బుద్ధిబలమ్మున నిం దెయ్యది శ్రేయమో వివరింపుఁ డనుడుఁ
బిడాలుండను మంత్రి యతని కిట్లనియె. ౨౭౨

సీ. మహిషేంద్ర వింటె ! యిమ్మహిళ సురప్రేర
ణంబున నిటకు యుద్ధంబొనర్ప
నేతెంచె నిక్కాంత యెల్లసురలయంశ
ములఁ బుట్టుటయు నిక్కముగ నెఱుంగ
నయ్యె, స్త్రీభీతు ని న్నమరులు వంచింప
నిప్పాట యోజించి రిక్కతమునఁ

గాదె పొదవ్వలఁ గదిసి యెల్లరు సహా
యులు గాఁగ నుంకించు చున్నవారు

గీ. మనము రణమున కేగిన వనజనేత్రుఁ
దొట్టి సురలెల్ల నసురుల గిట్టఁ జేయఁ
గడఁగుదురు నిన్నుమాత్రి మక్కంత చంపు
నెఱిఁగి తగుయత్న మొనరింపు మింత నిజము. ౨౭౩

వ. నా బుద్ధికిఁ దోఁచిన విధమ్మునఁ జెప్పితి భవితవ్యం బెఱుంగ నంత సమర్థుండనే! నీ కెయ్యది సులభంబగు నట్లు పచరించునది యేకాకినియై కామిని యుద్ధార్థిని యగుట యెంతకేనియు నక్కజం బగు ననునంత దుర్ముఖుండను సచివుం డిట్లనియె. ౨౭౪

చ. జయ మిఁక నీకు లే దనుట సత్యము నావచనంబు తప్ప ద ట్లయినఁ "బలాయనంబు వర" మన్న సురావళినెల్ల నోర్చి యొ క్కయువతి కిట్లొనర్చుటయుఁ గాదు, రణం బొనరించి చచ్చినన్ బయి నెగడున్ యశంబు జయపక్షమునన్ సుఖ మప్రమేయమౌ. ౨౭౫

వ. అనిన బాష్కలుం డిట్లనియె. ౨౭౬

ఉ. ఏ నొకరుండనే చని జయించి యమాలయ మేగునట్టు ల మ్మానినిఁ జేయు వాఁడ ధృతిమంతుఁడ నయ్యు నధీరుభంగి నీ కౌన భయమ్ము చెంద; నమరాధిపుఁ దొట్టి దిగీశులెల్ల రన్ దీనులఁ జేసి యిక్కరణిఁ దేఁకువ దక్కుదురయ్య! కాంతకున్.

గీ. ఈవు సంగ్రామమునకు రా నేల! నన్నుఁ
బంపు మొక్కంతమాత్రి నప్పడఁతిఁ జంపి
మగుడ నీకడ కరుదెంతు మహిషరాజ!
మామకీనబలంబు సామాన్యమయ్య? ౨౭౮

వ. అంత దుర్ధరుండు వినతుండై యిట్లనియె. ౨౭౯

ఉ. నీ కయి దేవతల్ మిగుల నేర్పునఁ బన్నినయీాలతోఁగి మా
యాకృతి నొక్కట వేల్మిడి శితాస్త్రపరంపరలన్ వధింతు నా
నాకుల కాకులత్వము రయమ్మునఁ గూర్తు బిభీషికార్థ మీా
రాక యెఱుంగు, మింతయుఁ గరంబు తిరంబుగ నిర్వహించెదన్. ౨౮౦

వ. అంతియకాని రాజనీతివిరుద్ధంబగు తెరువునఁ బోవలదు. మఱి
యొక్కటి వినుము లోకమ్మున సేవకులు సాత్త్వికరాజసతామస
భేదమ్మున మూఁడు తెఱంగులవా, రందు సాత్త్వికులు స్వామి
కార్యమ్ములు సాధించుచుఁ దదవిరోధమ్మునం దమ కార్యమ్ములు
నిర్వహించుదురు రాజసులు స్వకార్యతత్పరులై యొకొక్కతఱిని
స్వామికార్యంబులును యదృచ్ఛగా నిర్వహించుదురు, తామ
సులు స్వామికార్యంబు దిగఁద్రొక్కి స్వకార్యతత్పరత్వమ్మున వల
నగునెడ మార్తురం గలసి ప్రభుచ్ఛిద్రమ్ములు వెలిఁజేయుచుఁ
గోశగుప్తంబగు నసివడువున భీతిం గొలుపుదురు. ౨౮౧

క. కావునఁ దాదృశులగు దు
ర్భావుల నమ్మంగఁజనదు ప్రభువులు, మంత్రం
బా ! వెలికిఁ బోవు కార్యం
బా ! విపరీతించు నట్టి యదయుల కతనన్. ౨౮౨

—* బాష్కలదుర్ముఖులు దేవితోఁ బోరుట. *—

వ. అట్లగుట నీవు నిశ్చింతమ్మగ నుండు మేనును బాష్కలుండునుం
గలసి యరిగి యక్కామినిం జయించి నీకడకుం దోడితెత్తుమని
యిద్దరును గృతనమస్కారులై దిక్కులు గ్రిక్కిదలఁ బురమ్ము
వెలువడి దేవింగాంచి యిట్లనిరి. ౨౮౩

ఉ. ఓ నళినాయతాక్షి ! వినుమొక్కఁడు పంచెద మేము నిన్ను, మా
దానవనాయకుల్ మహిషుఁ దత్పరతన్ వరియింపు మాతఁడున్
మానవరూపమంది నిను మన్ననఁజేయు రహస్యమందు ; దు
ర్మానసముస్మై ననిం గడఁగి మానముఁ బ్రాణముఁ గోలుపోదురే.

వ. కామరూపుఁడగు మారాజుతో సకలభోగమ్ము లనుభవించుచుఁ
ద్రిలోకమ్ముల కేలికవై యేలికొమ్ము నావుడు దేవి యిట్లనియె.

గీ. ఎంత కామినియయ్యుఁ దా నేలతాంగి
యధముఁ బశువు వరింపఁగ నాత్మ నెంచుఁ
గులము శీలమ్ము గుణమును గలుగు తగిన
వరుని వరియించుఁ దన కంత వలయునేని. ౨౮౬

చ. వెడవెడ మాటలాడుచు బిభీషిక లియ్యెడఁ జూప కింక మీ
యొడయనియొద్ద కేగి సమరోన్ముఖుఁడై చనుదెంచునో, రయం
బడర రసాతలమ్మునకునై చనునో తెలియంగఁబల్కు యి
య్యెడ కరుదెంచి నోడ్వఁ డీఁక నే సహియింప దురుక్తు లాడినన్.

ఉ. ఆ కఠనోక్తులన్ విని దురాత్ములు దైత్యులు బాణవృష్టి పెం
జీఁకటి గ్రమ్మఁగాఁ గురియఁ జెచ్చెర నజ్జగదంబ సింహనా
దాకులులై రిపుల్ బెదర నంపగముల్ నిగిడించె నంత దు
ర్ధీకుఁడు బాష్కలుండు చనుదెంచెఁ జమూతతి కగ్రగామియై.

క. ధట్టుండై యస్త్రమ్ముల
నెట్టన నద్దేవిమీఁద నిగిడించిన న
ప్పట్టున నయ్యంబయుఁ దా
బిట్టేసె శరములు వేనవేలు గడంకన్. ౨౮౯

వ. ఇట్లు బాణపరిఘాసిఘాతమ్ముల నిరువురుం దుములమ్ముగాఁ బోరుతఱి, ౨౯౦

శా. ఆకర్ణాంతము చాపముం దిగిచి పంచాస్త్రమ్ము లద్దేవి య
స్తోకాహంకృతి వానిపై విడువ నా సోఁ కన్నిటిం ద్రుంచి ని
ర్భీకుండై యొకయేడు బాణముల దేవిం గొట్టి బిట్టార్చె రా
ద్రాకారమ్మున నంబయున్ దశశితాస్త్రావిద్ధుఁ జేసెన్ రిపున్.

ఉ. వానిశరమ్ములం దునిమి వాఁడిశరమ్ముల నొవ నేసి య
మ్మానవఖాదిచాప మసమానరయమ్మునఁ ద్రుంచి సింహనా
దానుగతిం జెలంగె జగదంబ, సురారి గదాత్తహస్తుఁడై
పూనిక నేగుదెంచె నలపుష్పసుగంధినిఁ బిల్కుమార్పఁగన్.

మ. అటు లేతెంచెడి బాష్కలుం గని గదన్ హస్తమ్మునం బూని మొ
క్కటి కయ్యమ్మున మూర్ఛవోనడఁచె నక్కంజాక్షి; వాఁడంతలోఁ
బటువేగమ్మున మూర్ఛఁ దేఱి గదవైవన్ దాని వారించి మి
క్కుటమౌ శూలమున న్నిలింపరిపునక్కంజించె నయ్యంబయున్.

ఉ. శూలముదాఁకి బాష్కలుఁడు సోలి యమాలయగామియైె మరు
జ్జాలమువంత దీర్చె నది సైఁపక దుర్ముఖుఁ డాగ్రహమ్మునం
దూలుచుఁ దేరి నెక్కి 'నిలు తొయ్యలి! యెక్కడ కేగ వచ్చు ని
న్నాలములోఁ బొరింగొనెద' నంచు శరమ్ముల ముంచి యెత్తినన్.

ఉ. వక్త్రము జేవురింప సురవైరులు భీతిల శంఖనాద సం
సక్తములై దిశల్ గలఁగ శక్తి గుణారవ మాచరించి త
న్ముక్తములైన మార్గణసమూహముల్ బొడిచేసి వానిపై
శక్తిముఖాయుధమ్ముల నసంఖ్యముగాఁ బరఁగించె నుద్ధతిన్.

వ. అంత దుర్ముఖుండు తత్తదాయుధమ్ముల నాత్మసాధనమ్ముల మరలించుచు నుక్కు మిగిలి యంబికపై ననేక శరమ్ముల నిగిడించుచుఁ బోరాడు నవసరమ్మున సంగరమ్ము దుర్భరంబయ్యె. ౫౯౬

గీ. అంబచే ననిఁ జచ్చిన యమరశత్రు
నికరముల గాత్రముల నుండి నెగసి రక్త
మేఱు గట్టె శివాకాకగృధ్రసార
మేయముల కెల్ల సంతోషమాయతముగ. ౫౯౭

ఉ. దుర్ముఖుఁడున్ బ్రకోపగతి దోఁపఁగ హస్తము నెత్తి పల్కు దు
ష్కర్ముఁడు "వింటె యోజలజచారువిలోచన ! మాన్నృపాలు నం
తర్మద మేది పొందు మటు దక్కిన నిన్ బరిమార్తు నుజ్జ్వల
ద్ధర్మవిముక్తతీవ్రనిశితప్రదరమ్ముల పాలు సేయుచున్". ౫౯౮

ఉ. దుష్కరమైన కోపమునఁ దోఁగుచు నంబయు వానిఁబల్కు 'మీ
బాష్కలుఁ డేమియయ్యెర యపాత్ర ! యపత్రపఁదక్కి దుర్మదా
విష్కరణంబు సేయఁగలవే యిఁకఁ గాలము డగ్గ ఱయ్యె నీ
శుష్కవచఃప్రసంగములు చూచెదఁ జక్కఁగ నిల్వు మాజికిన్'.

ఉ. శాత్రవుఁ డంబ పల్కులకు సైఁపక కోపకరాళవక్త్రుఁడై
మాత్రిన నించె నెక్కుడగు మార్గణముల్ ధృతిఁబూని యా జగ
న్నేత్రి శరమ్ముల న్నఱకి నీటుగఁజేసి యొకంట వాని దు
ర్గాత్రము గ్రుచ్చి నిక్కరణిఁ గర్కశ మయ్యె రణమ్ము వారికిన్.

ఉ. శూరులు మెచ్చఁ గాతరులు సోలి భయంపడ నొక్కట న్నిలిం
పారి శరాసనమ్ము దునుమాడి శరమ్ముల నేనిటన్ వెసన్
దేరు బడల్పడ న్నఱకి దేవి భయంకరమూర్తి గాఁగ దే
వారి గదన్ గ్రహించి రయమారఁగ సింగముఁ గొట్టె బిట్టుగన్.

శా. తత్త్వాదృక్షుగదాభిఘాతహతమూర్ధంబయ్యు హర్యక్షు ము
న్నత్త్రపక్రియ నీడఁ బోక నిలువ న్మర్త్యారి కోపించి యు
ద్వృత్తిన్వస్త్రితిఁ బైకి రాఁ గని కనత్ఖడ్గంబు చేఁ బూని సం
కృత్తస్ఫీతకిరీటమస్తకునిఁ గా నేసెన్ సురల్ మెచ్చఁగన్. 302

వ. ఇట్లు దుర్ముఖుండు సమసిన హతశేషులైన రక్కసులు పలాయ
మానులై యరిగిన మహిషుండు వారలం గాంచి "యేమి
యయ్యె" నని యడిగి కలతెఱం గెఱింగి క్రోధమ్మును సంతాప
మ్మును బెనంగొనఁ దక్కటిమంత్రులం గాంచి, 303

గీ. అక్కటా! బలవంతులై యమరవరుల
నోర్చి పెం పెక్కినట్టి యీయోధు లిట్లు
సత్తురే యాఁడుదానిచే! శక్యమగునె
కాలయోగమ్ము దాఁట నొక్కనికినేని? 304

—* చక్షురతామ్రముల యుద్ధము *—

వ. అని పనటం గుందు రాజు నాలోకించి చక్షురుండు దేవా! యింత
వగవ నేల నే నేగి యీ క్షణంబ యమ్మానినిం బొరిగొందు నని
యాజ్ఞం గొని తామ్రుండు దనకు బాసటగా దిక్కులు పిక్క
టిల్ల సింహనాదమ్ము లొనర్చి పేర్చు దైత్యచమూసమూహమ్ము
లతోఁ గదలి చను దెంచుచుండె; నవ్వాని దాదవ్వులం గని,

ఉ. అంబిక ఘంటికానినద మారఁగ శంఖరవం బొనర్చి మౌర్వి
యం బిగలాఁగ శింజినియు నద్భుతరావ మొనర్చె దాన భీ
తిం బడి పాఱు దైత్యులగతిం గని చక్షురుఁ డాఁగి పల్కె వై
శంబ వధింతు నియ్యబల లా వఱనేటికి నిల్వఁ దుర్మతిన్. 305

మ. అని చాపమ్మును గేలఁ బూని జనితాహంకారదుర్వారుఁ డ
య్యును సద్దేవినిగాంచియిట్లను మహోద్యోగమ్మునన్ ప్రేమాయు నిం
గని భీతిల్లెడి వాఁడఁ గాను వినుమీ కంజాక్షి ! నిం జంప నె
మ్మన మెంతే వెనుదీయుచున్నయది సంభావించి దోషస్థితిన్.

ఉ. అక్కట ! చారునేత్రిలు గటాక్షములన్ గురిపించి సంగరం
బెక్కటిఁ జేయుటల్ గలుగునెమ్మెయి నో సరసీరుహాక్షి! నీ
వెక్కడ ! కర్కశాస్త్రముల నేయుట లెక్కడ! పుష్పమేనిఁ బై
మిక్కిలి దెచ్చు నీకు నునుమేనిపయిం బడె నేని యుగ్మలీ.

గీ. క్షాత్రధర్మానుజీవుల జన్మ మెంత
నిర్దయాత్మక మెమ్మెయి నెమ్మి గలిగి
పెంచుకొను దేహమును గడుఁ బేశలమ్ము
గాఁ దలంపక ఖండింత్రు ఖడ్గతతుల. ౩౦౯

గీ. ధనలోభమ్మునఁ గత్తులు
గొని పరులం బొడిచి తృప్తి గొందురు లోకం
బున మూర్ఖు, లెంత కేనియుఁ
జొనుపుం దంధనము ధనము సుందరి ! యెందున్. ౩౧౦

చ. తెలిసినదాన వయ్యు నిటు తేఁకువఁ దక్కి లతాంగి ! భోగజ
మ్ములగు సుఖమ్ములన్ విడిచి పో రొనరింపఁగ నేల పేర్మి నా
పలుకులు సమ్మతించి సురపాలుర నొంచి దివంబు గొన్న ధీ
రలలితు మావిభుం గొని కరంబు సుఖింపుము నీకు మ్రొక్కెదన్.

ఉ. కత్తులు హత్తి శస్త్రములు గాఁడి శరీరము భిన్నభిన్నమై
మిత్తికిఁ బాలుగాఁగఁ బయి మిక్కిలి నక్కలు కంకగృధ్రముల్
నెత్తురు గ్రోలి మాంసమును నెమ్మెయిం దిని యాడ్చు నక్కటా!
మెత్తురు సత్కవీంద్రు లని మేటిగ నేమిగుణంబు చూచిరో !

క. అనిఁ దెగినవారలకు నా
కనివాసము గలుగుసంచు ౯ గాకే మది యెం
త నిజమొ తెలియదు నా బు
ద్ధిని విని మారాజు నెనయఁ దివురు మృగాక్షీ. ३०३

చ. అన జగదంబ వల్కెఁ గడు నాఁడికూఁతలు గూయఁబోకు శా
స్త్రనిధివి బోలె నీల్గెదవు రాజులనీతి యెఱుంగుదే? మహా
జనసహవాస మెయ్యెడల సల్పక కాఁతెనుపోతు నేస్త మం
దిన నినుబోఁటికిం దెలియునే! శ్రుతిగమ్యములైన ధర్మముల్.

చ. సురలకుఁ జెట్ట చేసి కడుశూరుఁడుబోలె మదించినట్టి ము
ష్కరు మహిషాధముణ్ జమునిసద్మము చేరఁగఁ జేసి శాసనా
క్షరములతో జయార్థమగు కంబము నెయ్యెడ నిల్పుదాన సు
స్థిరత యెలర్ప నిల్పి యని సేయుము నిన్ మొదలన్ వధించెదన్.

వ. జీవితేచ్ఛాగ్రంథిగ్రస్తుండ వయ్యెదేని నీ రాజునకు బుద్ధి సెప్పి
హతశేషులతోఁ బాతాళమ్మునకుం బోవునట్లు సేయు మనవుడు
దానవుండుఁ గ్రోధమూర్ఛితుండై ఘనాఘనాసారమ్ములు బోని
శరంబులు గురిసిన, ३०६

ఉ. ఆ జగదంబ వానిప్రబలాస్త్రములన్నియు నుగ్గుచేసి స్వా
రాజముఖామరుల్ వొగడ రక్కసుపై గదవైచె దానఁ దా
రోఁజుచు మూర్ఛవోయెఁ గడురోషము గల్గియుఁ జక్షురుండు; పా
త్రేజితశౌర్యుఁడంత నరుదెంచెను దామ్రుఁడు చాపధారియై. ३०८

ఉ. వచ్చిన తామ్రుఁగాంచి రిపుభంజని యజ్జగదంబ "రమ్ము నీ
మచ్చర మేడ నజ్జముని మందిరముం జొరఁజేసి పుత్తు మీ

వచ్చినవార్తఁదా విని వెసం జనుదెంచెడిఁ గాక దుర్మదుం
డచ్చపలుండు మీకుఁ బ్రభువైన హయారి రణంబుసేఁతకున్.

క. మీరెందఱు వచ్చిన నా
కూరిరుఁడు మహిషుండు చావు కూరకయున్నన్
గోరిక తీరదు సురలకు
రా రమ్మను మద్దురాత్మ రణమొనరింపన్. 3౧౯

శా. మా యన్యోన్య పరాక్రమమ్ములపసల్ మా యుద్ధచాతుర్యతే
జోయుక్తుల్ గనుఁగొందుగాక చని తుచ్ఛున్ బుచ్ఛవిభ్రాజితున్
డాయంబంపుము మీవిభున్ జమునిఁగూడం జేసెద న్నాఁగ 'నో
హో' యంచున్ వడినార్చియేసెశరముల్ యుద్ధార్థితాఁమ్రుండొగిన్

మ. శరవృష్టిన్ శరవృష్టి నేర్చి కడఁకన్ శౌర్యం బవార్యంబుగా
నిరుగేల న్నిగిడించె భల్లములు దేవేంద్రాదు లగ్గింప న
య్యరవిందానన, మూర్ఛదేఱి తగఁ దా నయ్యంబికం జక్షురుం
డురుఁడై మార్గణ నిర్వరంజదిపెఁగ్రోధోత్సాహమైయంబయున్.

వ. దానికిం గసలి రక్కసులెల్ల నొక్కపెట్టన చుట్టుకొని పరశుపట్టిస
ఖడ్గముసలభిండివాలాద్యనేకాయుధమ్ము లయ్యంబ పయిం
గీలించినఁ బోరు ఘోరంబయ్యె. 3౨౨

ఉ. తాళసమంబు లోహజము దారుణమై విలసన్మణీఘృణుల్
గ్రాల నెసంగు నొక్కముసలంబు కరంబునఁ బూని తామ్రుఁ డా
భీలత దోఁప సింగమును బిట్టుగఁ గొట్టె శిరమ్ము రక్తధా
రాళము గాఁగ దానికిఁ గరమ్మును నంబిక తీక్ష్ణమూర్తియై. 3౨3

క. అసివెటికి వానిశిరమున్
వెస నఱికిన మొండె మొక్క వ్రేల్మిడిఁగేలన్

ముసలంబడర నటించి ర
ణసరణి నంతంతఁ బడియె నాకు లలరఁగన్. ౩౨౮

వ. అంతఁ జక్షురుండు తామ్రమరణమ్మునకు నవ్వుడుగఅచికొని ఖడ్గమ్ము కేలం బూని సింహనాదం బొనర్చి యురువణించిన జగదంబ కోపాకులయై,

మ. ఒకబాణమ్మున ఖడ్గము న్నఱికె వేఱొక్కంట హస్తంబు భూ
మికి పాత్రించి మఱొక్కటన్ శిరముపేర్మిన్ డొల్లఁగా నేసె ది
క్సికరాభీలముగాఁగ గర్జిలిన భగ్నీభూతమై దైత్యసై
న్యకదంబం బుడివోయె నొల్కెరి ప్రసూనంబుల్ సురల్ దేవిపై

వ. అట్లు చక్షురతామ్రు లిరువ్వురుం జచ్చుట విని శోకించి మహిషుఁడు దురాగ్రహగ్రస్తుండై యసిలోమబిడాలాదుల ననేకుల ననేకసేనలతోడం జతఁజేసి పనిచిన వార లరుదెంచి యష్టాదశభుజాగ్రజాగ్రదాయుధమండలయగు చండికం గాంచి విస్మయాకులులగు నెడ నసిలోముండు వారలకుఁ గన్నాకై సేనాముఖమ్మున నిలిచి వినయమ్మున నయ్యంబ కిట్లనియె. ౩౨౯

శా. దేవీ కొండొక చెట్ట నీయెడల నెందేఁ జేయఁగారాని స
ద్భావుల్ దైత్యులు వీరలిట్లు పోలియం దార్కొలు నీకేల ? వీ
రావేశమ్మున దుఃఖదం బగురణం బాసింతురే ! సంధిమై
నావెంటం జనుదెమ్ము నీవలయు నానావస్తువుల్ గైకొనన్.

సారము లేని సంసరణసాగరమందు సుఖంబు గాన్పు మె
వ్వారికి, శాంతిమై నదియుఁ బొల్పడు, దానికిఁ దక్క మార్దవ
శ్రీ రుచిరంబు కాయము కృశించి నశింపఁగ నేల చెప్పుమా
ఘోరరణమ్మునం దిటులు గోరికచెందితి దుష్కరమ్మునన్.

—* అసిలోమ బిడాలాదు లనికి వెడలుట *—

క. ఆసుఖము రెండు తెఱఁగుల
భాసిలు నిత్యం బనిత్యపదవియు నా, వి
ద్యాసంగతిఁ బరు నెఱుఁగుట
యే సుఖమగు నిత్య మది, తదితర మితరమౌ. ౩౩౦

వ. ఇందు నాశాత్మకంబగు భోగసంభూతసుఖంబు తత్త్వజ్ఞులు త్యజించి నిత్యంబగు నాత్మజ్ఞానంబు వడయనుంకింతు రదియట్లుండె.

ఉ. సౌగతధర్మ మూనుటయు సమ్మతమేని మృగాక్షి! శస్త్ర సం
త్యాగము చేసి జవ్వనము సార్థకమై తగ నిచ్చ కైన సం
భోగములన్ మెలంగు విరిబోఁడిరో! ప్రాయము రేపు నిల్చునే
వ్రేఁగగునిట్టి తాపమున వేఁతురె పుష్పముఁ బోనిదేహముల్!

చ. అదియునుఁ గాక యొడ్లను నిరాగసులన్ బరితాపపెట్టి యి
ట్లదయతమైఁ జరించు టది హాని యగున్, దయకన్న ధర్మము
న్నదియె? తదీయరక్షణమునందు మనం బిడి సత్య మెప్డు చె
ప్పఁ దగదె దైత్యవర్గములఁ బట్టి వధింపఁగ నేమి వచ్చునో.

వ. సత్యంబువలనన కదా ప్రాణమ్ములు నిలుచుట దానికిం దప్పుట కొప్పుమియ ధర్మం బనఁబడు నట్టి ధర్మమునకుం గట్టువడి కల తెఱఁగు చెప్పు మని ప్రాంజలియై యడిగిన నసిలోమునకు నంబ కరుణించి యిట్లనియె. ౩౩౮

ఉ. నీమవినీతి యింత దగునే! కరుణించి వచింతు నాదు యు
ద్ధాదరకారణంబు; జగమంతయుఁ ద్రిమ్మరుదాన దుష్టులం
గాదని చంపి సజ్జనులఁ గావఁగ; నొండు ప్రయోజనంబు నా
కేదియు లేదు దీనికయి యెత్తుదు నే నవతారముల్ మహిన్.

మ. భయభక్తుల్ విడనాడి దేవతల నొంపం బూనె మీరాజు దు
ర్జయుఁడై ; వాని నడంప వచ్చితి యథార్థం బింత ; నీ వేగి దు
ర్నయునిం దన్మహిషీతనూజు నిట నే రమ్మన్న చందంబు దె
ల్పి యనింజేయఁగఁ బంపు మన్యుల వృథా పేరేపఁగా నేటికిన్.

ఆ. వె. జీవితేచ్ఛఁ దనదు చేతమ్ము సొలసిన
బంధుజనులతోడ బయలు వెడలి
యీఁగకాలియంత యేనియు ద్రవ్యంబు
గొన కధోభువనము జనుట యొప్పు. 332

వ. ఆరసాతలమ్మునందు మీకులవృద్ధగు ప్రహ్లాదుండు వసించు వాఁ
డాతనిం గొలిచి యట నుండునది యని చెప్పు మట్లయిన మీర
లందఱును బ్రతికి పోవుదు రనవుడు నసిలోముండు బిడాలు
దిక్కు మొగంబై ప్రీతిపూర్వకమ్ముగ నిట్లనియె. 333

ఆ. వె. వింటివే భవాని వినిచినవిధము ద
యార్ద్రహృదయ సంధి కనుమతించె
నిట్లొ నర్చి బ్రతికి యేగిన నేమగు
నా రసాతలమ్మునందయుండ. 334

వ. నావుడు బిడాలుం డిట్లనియె. 340

ఉ. అంబిక చెప్పినట్టి విధ మందఱకున్ సుఖదంబ రాజు సం
ధిం బడయంగనొల్లఁ డెటు దెల్పఁగ వచ్చు నెఱింగి మూర్ఖ రీ
తిం బడువాని ? మృత్యువది దెప్పర మాఁగఁ దరంబె యుద్ధరం
గంబునఁ జచ్చువారిఁ బొడఁగాంచియుఁ దక్కటివారి నంపఁడే.

గీ. కడఁగి పాంచాలికలరీతిగా నతనికి
వశులమై యాజ్ఞఁ దప్పఁగ వశమె సత్య

ముగ వచించిన పలుకు లెవ్వగఁ బ్రియంబు
గలుగఁజేయు నృశంసులౌ కావరులకు. ౩౮౨

చ. "ధనమును రాజ్యముల్ విడిచి దర్పము నేదియుఁ గట్టుగుడ్డతో
ననికిఁ దొలంగి యేగుము భయమ్మున నీవు రసాతలమ్ము" నా
విని యతఁ డాదరించెడి వివేకము గల్గినవాఁడె! కోపముం
గని మనల్ 'వధింతు' ననుఁగాక దురాత్ములు కీడు నెంతురే.

ఉ. కావున స్వామికార్య మెసకమ్మునఁ బూని చరింత మెమ్మెయిన్
జావది సిద్ధమౌటెఱిఁగి చావఁగ నేల దురాత్ము చేతిలో
నా విని యాతఁ డియ్యకొనినం జెలరేఁగి బిడాలుఁ డేడ్తెఱన్
దేవిని నొంచె సప్తపటు తీవ్రశరమ్ముల నేసి యాసురన్. ౩౮౪

వ. అసిలోముండును ధనుఃపాణియై యంతంత నిలిచి చూచుచుండెఁ బదంపడి యంబిక తన్ముక్తమ్ములగు బాణమ్ముల నడనడుఁ బొడి చేసి, ౩౮౫

గీ. మూఁడు భల్లమ్ములను జాపమున నమర్చి
సింహనాదమ్ము చేసి పేర్చిన రయమునఁ
బఱపె; వాఁడును దద్బాణపాతమునకుఁ
దొడరి మూర్ఛిల్లి పెద్ద నిష్ఠురయుఁ జెందె. ౩౮౬

వ. ఇట్లు బిడాలుండు సమసిన నసిలోముండు సన్నద్ధుండై రణరంగమ్మునకు వచ్చి కరంబెత్తి యయ్యంబిక కిట్లను, ౩౮౭

చ. ఎఱుఁగుదు దేవి! నీకతన మృత్యువు నా కగునంచు; బుద్ధులం
గఱపిన నొల్లనట్టి విభుఁ గాదన లేక రణంబు సేఁత కే
డ్తెఱ నిటు లియ్యకొంటిఁ గడుఁ దెంపరినై; మరణంబు భీతిమైఁ
బఱచుటకన్న లగ్గగు శుభం బశుభంబును దైవలభ్యముల్. ౩౮౮

ఉ. ఇందఱు దానవుల్ చదిసి యేగిరి కాలునిపోలి కింద నే
నెందఱుఁబోలువాఁడ ! విధియెవ్వఁడు దాఁటఁగనేర్చుఁ ! బౌరుషం
బెందును దైవముం గడచి యొచుకయుం బనిసేయ దంచు మి
న్నందఁగ నార్చి యేసె నిశితాస్త్రము లజ్జగదంబ దిక్కగన్.

శా. ఆ బాణమ్ముల నంతరాళమున శాతాస్త్రమ్ములం దుంచి పై
పై బాణమ్ములు గొన్నిటిన్ వెస నిగుడ్పన్ వాఁడు తచ్ఛస్త్రధా
రాబాహుళ్యముచే స్రవద్రుధిరుఁడై రాజిల్లెఁ బుష్పావళీ
లాబాభాసురకింశుకాగమము హేలన్ జూప అగ్గింపఁగన్. 3౫ం

ఉ. పిమ్మటఁ గోప మెక్కుడుగఁ బేర్చి గదంగొని యార్చి సింహమూ
ర్ధమ్మున మొత్త నయ్యది కరమ్ము భరమ్ముగ ఘోరభంగి నా
దమ్మొనరించి శస్త్రములు దాఁటెడి తీవ్రనఖమ్ములన్ దదీ
యమ్మగువక్షముస్ దివిజులందఱు మెచ్చఁగఁ జీల్చె నుక్కునన్.

ఉ. దానికి లోఁగ కయ్యసుర దారుణభంగి నెదిర్చి యార్చి యా
త్మానుచరుల్ నుతింప రయమారఁగ నాహఁటిశీర్షమందుఁ గా
లూని పరాక్రమించి గద నుద్ధతుఁడై జగదంబ నొంచె న
మ్మానిని ఖడ్గధార దునుమన్ దల యూడిపడెన్ సురారికిన్.

ఉ. రక్కసుఁ డిట్టు లుక్కఱ సురల్ గుసుమమ్ములు గ్రుమ్మరింపుచున్
దిక్కులు పిక్కటిల్ల "జయ దేవి" యటంచు నుతించి మించి తా
రొక్కట దుందుభిధ్వనుల నుర్వియు నాకసముం గలంచి రిం
పెక్కఁగ నప్సరోయువతులెల్లరు నాడిరి దేవి మెచ్చఁగన్. 3౫3

క. హతశేషమైన దైత్య
ప్రతతిన్ సింగమ్ము పట్టి భక్షించె సము

స్నుతవేగ మడరఁ గొందఱు
సతికీగతి దెలియఁ బఱుపఁ బఱచిరి కడఁకన్. ౩౧౮

వ. ఇట్లరిగి రోదనపూర్వకమ్ముగఁ గల తెఱఁగు చెప్పిన నమ్మహిషుండు ప్రళయకాల రుద్రుని చందమ్మున మండిపడి దారుకుం డను సారథింజూచి సహస్రఖరసంయుతంబును నానాయుధ సమన్వితంబును బతాకాధ్వజవిరాజితంబును నగు తన రథంబు దోడికొని రమ్మనవుడు వాఁడట్లొనరింపఁ గామార్తుండగు కతన నద్దేవి తన్ను వరించున కాఁ దలంచి హేయంబగు నీ మహిష దేహంబు కా దని త్యజించి స్త్రీలు రూపచాతుర్యమ్ములం జూచి మోహింతురని కృతనిశ్చయుఁడై, ౩౧౧

—* దేవీ మహిష సంవాదము *—

ఉ. మానవరూపముం గొని సమంచితభూషణభూషితాంగుఁడై
దానవసైన్యముల్ గొలువ ధారుణి గ్రిక్కఱదలఁ రథస్థుఁడై
మానినులెల్ల మెచ్చఁదగు మంజులమౌ చెలువొప్ప నేగ న
వ్వానిని దవ్వులం గని రవం బొనరించెఁ బరాంబ డంబుగన్.

వ. ఇట్లు శంఖంబు పూరించిన దైత్యవాహిని కనుకనిం బఱచె వారల నిలువరించి మహిషాసురుం డామె కభిముఖుండై చిఱునగవు మొగమ్మునం దనర నిట్లను, ౩౧౭

గీ. దేవి! సంసారమున యందుఁ దిరుగు పురుషుఁ
డేనిఁ గామినియేని సుఖానుభవము
నొందఁగోరుదు రదియు సంయోగజంబు
గా నెఱుంగు మదియు భిన్నగతి నెసంగు. ౩౧౮

వ. ఎట్లంటేని మాతృపితృలకుఁ బుత్త్రినితో నగునది యుత్తమం, బన్నదమ్ముల సంయోగంబు మధ్యమంబు, వివిధావృతచిత్తులును బ్రసంగపరివర్తులును నగు నావికుల సంయోగంబు సహజంబై యత్యల్ప సుఖదం బగుట నధమంబు. 3౫౯

ఆ. వె. సమవయస్కులైన జంపతులకుఁ దుల్య
రూపశీలగుణనిరూఢిఁ బ్రొప్పు
మిగులు యోగ మది యమేయసుఖోదయం
బొనఁగుకతన నుత్తమోత్తమంబు. 3౬౦

వ. ఇట్లు సంయోగమ్ములు పరస్పరం బుత్కర్షాతిశయమ్మునం బొల్చు కతన, 3౬౧

ఉ. వీరుఁడనైన నామెడ వివేకము గల్గిన దానవై సుధా
సారము వోనిచూడ్కులఁ బొసంగఁగఁ జేసి కరంచి తేని దు
ర్వారసుఖంబు దాననగు బాలరో ! యిర్వర కీసుఖంబుతో
నారయ నేసుఖమ్ములును నంద వనుత్తమ మా కతమ్మునన్.

చ. సురపతిఁ దొట్టి నిర్జరుల సొంపఱఁ జేసితిఁ గామరూపచా
తురి గలవాఁడ నిట్టి ననుఁ దొయ్యలి ! దాసునిఁ గాఁగ నేలి యా
దరముగఁ బట్టరాజ్ఞివయి దానవులెల్ల విధేయులై మెలం
గ రమణ నాదు వైభవము గైకొని పొందఁగరాదె భోగముల్.

ఉ. ఆనతి యిచ్చితేని విను మ య్యమరావళితోడ వైరమ్మున్
మానెద నెద్ది పంచినను మానక చేసెదఁ బ్రేముడించు మె
ట్లేని భవత్పదాంబుజములే శరణమ్ములు సేవకుండ ధ
ర్మానుగతుల్ వచింతు రి శరణాగత రక్షణ మొప్పదే చెలీ. 3౬౪

ఉ. పుట్టినకోలె దైన్యమునఁ బోవ నొకప్పుడు నాజి నెంతయుఁ
ధట్టుఁడ నా విశేషములు తామరచూలి మొదల్ సురోత్తముల్
గట్టిగఁ దా మెఱుంగుదురు కామశరమ్ముల దాడి కోర్వ కి
ప్పట్టున దైన్యమూనితిఁ గృపన్ గను మాయుధముల్ త్యజించితిన్.

క. మరణావధి నెన్నఁడు ద
త్పరత నీకెదురుసెప్పఁ దన్వంగిరో! నీ
గురుకుచము లాన మన్మథ
మరయుము శృంగారభంగితాపాంగములన్. ౩౬౬

చ. అనవుడు దేవి వల్కె మొగ మంకురితస్మితకందళంబుగా
దనుజవరేణ్య! నాకుఁ బతి తత్పరమాత్ముఁడు; వాని యిచ్ఛనై
యొనరుతు సృష్టి; యప్పురుషయోగమునన్ జడనైన నాకుఁ జే
తనము ఘటిల్లుఁ గాంతశిల దాఁకిన యినున్నకుం బలెన్ లలిన్.

వ. ఇట్టి నాకు గ్రామ్యసుఖవాంఛ యెన్నండును లేదు నీవు మూర్ఖుం
డవై నన్నొక సామాన్యాంగనగాఁ దలంచి మత్సంగం బపేక్షించు
చున్నవాఁడ వదియునుం గాక, ౩౬౭

చ. నరునకు బాధనార్థముగ నాతి సృజింపఁ బడెన్ దురాత్మ! య
ప్పరమరహస్యముం దెలిసి భంగురమై కడు హేయమైన సౌ
ఖ్యరసమునం జరింపకుము గల్గు నొకప్పుడు ముక్తి శృంఖలా
స్థిరులకు నేని; వీరలకుఁ దీరదు ముక్తికి నేగ నెన్నఁడున్. ౩౬౮

మ. శమ మిచ్చున్ స్థిరసౌఖ్య; మద్ది హృదయస్థానమ్మునం జేర్చి యీ
యమరావాసము వీడి జీవమును నీ వాసింతువేనిన్ నివా
స మొనర్పంగ రసాతల మ్మరుగు; మీ చందమ్ముగా కొండు చం
దమ యేనిన్ రణమాచరింపుము నిన్నున్ దర్పాంధున్ దున్మాడెదన్.

ఉ. నీ వినయమ్ము నిక్కముగ నెమ్మది కెక్కఁగఁజేసి యింత నీ
కై వచియించితిం గడు దయాపరతన్ ; వలతేని విన్మ లే
దా ! వెనుదీయ కాజి ననుఁ దాఁకుము నన్ బురికొల్పినట్టి దే
వావళి యప్పుదీర్తు నిను నాత్మశరమ్ములపాలు సేయుచున్.

వ. నాపుడు మదనమోహితుం డద్దురాత్ముం డందు మరల నిట్లను.

ఉ. పూలకు మించి మెక్కుడగు పొల్పునఁ బొల్చెడి మేనిదాన ! నే
నాలము సేసి నిన్నడఁచునంతటి సాహస మూన నిస్సిరో !
బేలనె ! నీకృపం బడసి పెండిలిఁ జేసికొనంగ నుంటి ని
న్నోలలితాంగి ! యిట్టి కఠినోక్తులు న న్నన నీకు న్యాయమే ?

చ. హరిహర నీరజాసనుల నాహవభీరులఁజేసి పుచ్చి సుం
దరిపయిఁ జూపువాఁడనె ప్రతాపము లోకులు నవ్వ ? నీయెడం
గర మనురక్తికల్మి భయకంపిత మయ్యెఁ గరంబు పొల్తి ! యి
ర్వ్వరమును మిత్రిభావమును బొందితి మేటికిఁ దక్క సంగతుల్.

క. ననుఁబేర్మిఁ జూచి పెండిలి
యొనరించికొన నొప్పదేని యొప్పదఁ గాదే
నిని వలసినయెడ కరుగుము
నిను నేఁ బ్రహరింపఁ జాల నిశితాస్త్రములన్. ౩౭౫

గీ. సప్తపది మైత్రి యని బుధజనులమతము
గాన నాచెల్మికత్తె నిన్ గసిమసంగి
పై ననుభవింపఁగల్గు నైశ్వర్య మొక్కఁ
డున్నె యింతటి పాపంబు నోపఁగలనె. ౩౭౬

గీ. బాలహత్యయు స్త్రీహత్య బ్రహ్మహత్య
పాతకము లందు నెక్కుడు పాతకములు

గాన నెట్లని నీదయ గాంచి జన్మ
మునకు సాఫల్యమొనరింతు వనరుహాక్షి. ౩౭౭

గీ. నిను బలాత్కృతిఁగొనియేగ నేర్తుఁగాని
దాన నేమి సుఖంబగుఁ దలిరుబోఁడి
స్త్రీపురుషులు పరస్పరస్నేహ మడరఁ
గూటమికి నియ్యకొన దానఁ గుతుక మెసఁగు. ౩౭౮

చ. తెలియవుగాక పూరుషుని ధీరునిఁ బొందని కాంతకుఁ సుఖం
బులు వెలిఁగావె తాఁ దగిన పొత్తికిఁ దక్కనిపూరుషుండునుఁ
వెలియగు, నెవ్వఁ డిక్కరణి వేఁదుఱు పుట్టఁగఁజేసె నీకు; ని
స్తులమగు జవ్వనమ్ము గడుసుందన మక్కట! వమ్మొనర్తురే.

ఉ. వైరి యెవండొ నిన్నిటులు వంచనఁజేసి మరల్చెఁ గాక సం
సారసుఖమ్ము లిక్కరణిఁ జాగము సేయుదె తత్త్రిమూర్తు లం
భోరుహనేత్రలఁ విడిచి పోయిరె యెంతటిబేలవైతి వే
చారుముఖీలలామ పతిసంగతిఁ బాసి సుఖించుఁ జెప్పమా.

చ. ననుఁ బువ్రుఁగోలలం బఱపి నాఁచికొనం గమకించు చండశా
సనుఁడు మరుండు నీయెడలఁ జాలఁ గృపం గలఁడేమొ, కాక యు
న్నను నిటు నిల్వ నిచ్చునె! కనంబడె హేతువు వైరులైన దు
ర్మనసులు దేవతల్ మరు మరల్చిరి నీదరిఁ జేరకుండఁగఁ.

ఉ. ఆదర మేది నన్నిపు డహంకృతి వీడితివేని మున్ను మం
దోదరి సుందరున్నృపుని ద్రోచి పదంపడి ధూర్తు నాథుఁగా
నూఁది స్మరార్తయై వగల నొందిన చందమునం గృశింతు సు
మ్మా! దరిలేని తాపమున, మీఁదటిబాధ గణింప విమ్మెయిఁ.

—* మందోదరీ వృత్తాంతము *—

వ. అనవుడు నమ్మందోదరీవృత్తాంతమ్ము వినవలతుసన దేవికి మహిషుం డిట్లనియె,

శా. దేవీ ! సింహళ దేశ మెల్లగతులన్ దేజమ్మునం బొల్చు స
ద్భావుం డయ్యెడఁ జంద్రసేనుఁ డను భూపాలుండు పాలించుఁ బా
రావారావృత మైన మేదిని కొకండై యేలు నవ్వాని కిం
పై వర్తించుఁ బతివ్రతామణి యొక ర్ధాంగియై యిమ్ములన్.

గీ. ఆమె గుణవతి యనుపేర నలరుఁ దద్గు
ణములు వర్ణింప నలవి యెవ్వ్రటికిఁ గాదు
కనియె నొక యుత్పలాక్షి నక్కాంత మొదటి
చూలుగాఁ బతి సుఖవార్ధి నోలలాడ. 3౮౫

వ. పిదప నమ్మనుజపతి యక్కన్నెకు మందోదరి యని నామకరణమ్ము చేసి తోరంబగుగారమ్మునఁ బెంచుచుండ నబ్బాలికాజన చూళికారత్నంబు శశికలతెఱంగునన్ దినదినప్రవర్ధమానయై పదియేండ్ల ప్రాయమ్మునం బొలుచుటయు నరేంద్రుండు వివాహం బొనరింప నెంచి యనుకూల వరాన్వేషణపరాయణంబగు చిత్తమ్మున నున్న యెడఁ గొందఱు బ్రాహ్మణు లరుదెంచి. 3౮౬

గీ. తనరు మద్రదేశమున సుధన్వుఁడనెడి
రాజవర్యుం డతని కుమారకుఁడు నీదు
కొమరితె కీ డగువాఁడు సద్గుణవిశేష
రూపరేఖావిలాసనిరూఢి నెంచు. 3౮౭

శా. కంబుగ్రీవుఁడు వాని పేరనుడు భూకాంతుండు పృత్రిం దదీ
యంబౌసామ్ముగ నిశ్చయించి తన భార్యం జూచి యిక్కన్నె లో

కం బెల్లం గొనియాడ శీలమున నాకారమ్మునన్ మేటి యా
కంబుగ్రీవున కిచ్చి పుత్త్రమె యనంగా నాపె సంతుష్టయై. 3౮౮

వ. పుత్త్రి యున్నెడకరిగి యాదరమ్మున నమ్మా! నిన్ను నీ జన
కుండు మద్రదేశాధీశ్వరుండగు సుధన్వు తనయునకు సమస్త
లక్షణలక్షితునకుఁ గంబుగ్రీవునకిచ్చి పెండిలియొనర్ప నున్నవాఁ
డనవుడు మందోదరి యిట్లనియె.

శా. కౌమారవ్రత మూని స్వేచ్ఛఁగఁదపఃకాంక్షన్ బ్రవర్తింప నే
నామోదింతుఁ జిరమ్మునుండి, యిఁక నాకన్యన్ వరింపంగ నే
లా! మేలా యొకమానవుం దవిలి వాలాయమ్ము నవ్వానితో
గామాసక్తిని బారతంత్ర్యమున మోక్షప్రాప్తిఁ బోఁ గొట్టుటల్.

క. స్వాతంత్ర్యమ్మున నెప్పుడుఁ
జేతోమోదమునఁ దిరుగఁ జేకూరుట వి
ద్యాతత్త్వజ్ఞులు మోక్షక
లాతాదాత్మ్యమునఁ జూచి లలిఁ బొగడరొకో. 3౯౧

సీ. అత్తమామలయెడ నడఁకువ గొలుపుట
బావలయెడ భక్తిపరతగనుట
మఱఁదులయెడఁ దగు మన్ననఁ జూపుట
తోడికోడండ్రఁ బొత్తున మెలఁగుట
యాఁడుబిడ్డల చిత్త మరసి వర్తించుట
సవతి గల్గిన దాని చన వెనయుట
పతికి నెవ్వేళలఁ బరిచర్య సలుపుట
సంతతి గని పెనువంతఁ బడుట

గీ. అకట ! భానిస యగుటకు నతిశయించుఁ
గాదె యొక్కనివశమునఁ గాలమెల్లఁ
గడపు నిల్లాలి బ్రతుకు నిక్కముగ, నాడు
జన్మ మధమాధమము కాదె జనని యెందు. 3౯౨

వ. మున్నుత్తానపాదాత్మజుండును ధ్రువుని తమ్ముండును నుత్తముం
డును సర్వధర్మజ్ఞుండును నగు నృపాలుం డొకండు పతిభక్తిపరా
యణయగు తనభార్య ననపరాధ నరణ్యమ్మున విడిచెనని వినమె
కావున, 3౯3

చ. తరుణికి భర్త పొందిడు ముదమ్మున కంటెను గష్టమెక్కు డ
ప్పురుషుఁడు కాలధర్మమును బొందినచో విధవాత్వ మెంతయుఁ
భరమగు నారికేగిన నపారమగుఁ విరహాగ్ని యిట్లు వం
దురుటయు నొక్క సౌఖ్యమె మనోగతి చిక్కఁగఁ బట్టుటొప్పదే.

వ. అను నాపె నిశ్చయంబు మరల్ప నేరక జనని చిన్నవోయినమన
మ్మున నృపాలునికడ కరిగి యంతయుం దెలిపిన నతండును నొఁగా
దనక సమ్మతించినవాఁడునుం బోలె మిన్నకుండె నంత నక్కన్నె
మిన్నకుఁ గొండొకకాలమ్మునకు జవ్వనం బంకురించినఁ జెలికత్తె
యలెల్ల మెల్ల మెల్లన వివాహమ్మునంగల సుఖమ్ములు బోధించి
యొప్పింప నుంకింపుడు నప్పడఁతి యెప్పాట నొప్పదయ్యెఁ బదం
పడి యొక్కనాఁడు, 3౯౫

చ. కుసుమిత కుంజపుంజములకు న్నెలవై తగు పూలతోఁట కే
గి సఖులుఁదాను నుయ్యేలలఁ గ్రీడలొనర్చుచుఁబూలుగోయుచుఁ
గిసలయజాలముల్ పుణికి గిటునఁ బుచ్చుచుఁ గేళికూళులఁ
బిసరుహకాండముల్ చిదిమి వేయుచు నిట్లు చెలంగుచున్నెడఁ.

క. కోసల దేశాధీశుం
డా సరణికి నొక్కఁడగుచు నరుదెంచెఁ గళా
భాసురుఁడు వీరసేనుఁడు
దాసజనులు కొందఱు తన దాపున మెలఁగన్. ౩౯౭

వ. రథారూఢుండై దవుదవ్వుల నరుదెంచువాని మదనసుందరు నా
రాజును దూరదూరమ్మున నరుదెంచు సైన్యముం గాంచి చెలి
కత్తెలయం దొక్కరిత యమ్మందోదరి కిట్లనియె. ౩౯౮

క. కనుఁగొంటివె యల్లదె దై
వనియతి నొకరాజసుతుఁ డపరమన్మథుఁడీ
మనయున్న తెరువునకు రా
గ నున్నవాఁ డతని చెలువు గా దనవశమే. ౩౯౯

వ. అని వచించునంతన యంతంత నరుగుదెంచి యన్నృపాలుండు
పుత్త్రడిబొమ్మం బోనిదాని నమ్మందోదరి వీక్షించి విస్మయా
విష్టుండై రథంబు డిగ్గి దగ్గఱకుం జని యొక్కరిత కయ్యంగనం
గేలఁ జూపి యిట్లనియె. ౪౦౦

క. ఈలలితగాత్రి యీమధు
రాలాపిని యెవతె, యెవ్వఁడగు నొకో ధరణీ
పాలుం డీచెలి జనకుఁడు
వాలాయము నాకుఁ దెలుప వలయు మృగాక్షీ. ౪౦౧

వ. అనవుడు సైరంధ్రి 'నరేంద్రా! నీ వడిగినదెల్లఁ జెప్పెదం గాని
మునుమున్న నీవృత్తాంతంబు విన వలతు' నావుడు 'లతాంగీ!
కోసలంబను దేశం బొండు గల దద్దానికి నే నాయకుండ నా
పేరు వీరసేనుండు మార్గ వశమ్మున నరుదెంచుచుఁ ద్రోవ దప్పి

యియ్యెడ కరుదెంచితి దాదవ్వుల సైన్యంబును రాఁగల' దన
వుడు సైరంధ్రి యిట్లనియె. ४०౨

క. మందోదరి యనఁదగు నీ
సుందరియుం జంద్రసేనసుత యీయెడ కా
నందమునఁ గ్రీడసల్పెడి
దందడిఁ జనుదెంచె నాఁగ ధరణిపుఁడనియెన్. ४०౩

క. సైరంధ్రి ! నాకు మీచెలి
పై రాగము పుట్టె ధర్మపత్నిగఁ జేయం
గోరెద నీచాతుర్యో
దారత కిది పెద్ద గాదు తలఁపు వొడమినన్. ४०४

వ. నా కింతకుమున్ను వే ఱొక భార్య లేకుంటం జేసి మీచెలియ పట్టమహిషిగాఁదగుఁ జిరమ్మునుండి యే ననురూపశీలవయో గుణభాసురయగు కన్నియ నన్వేషించుచున్నవాఁడ నేటికి దైవమ్ము సమకూర్చె నని వెండియు, ४०౫

గీ. ఏఁ గకుత్థ్సకులోద్భూతి నింపు గన్న
రాచకొమరుఁడ నిట్టి నా రాణ నెఱిఁగి
తండ్రియైనను నాకిడఁ దక్కువాఁడె
వల నెఱిఁగి చేయు మిందు నుపాయ మనుడు. ४०౬

శా. ఆసైరంధ్రి లతాంగి కిట్లనుఁ జెలీ ! యీరాజుఁ గన్గొంటె ! నీ
కౌ సౌందర్యము పేర్మిఁ బ్రాయమున విద్యాబుద్ధులం దెల్ల నా
రాసూనుండు కరంబు నీయెడలఁ దా రాగిల్లె నవ్వాని వి
శ్వాసార్హుం బతిఁ జేసికొ లుచిత మీ చందంబు నీ కొప్పదే.

క. నీవైరాగ్యపుఁ జందం
బేవము పుట్టింప జనకుఁ డెంతయు వగకుం
దావలమై వందురు నా
భూవిభు నిష్ఫాటఁ దేల్పఁ బోలదె నీకుఁన్. ౪౦౯

వ. అతఁ డెల్లవేళల మమ్ముం గాంచి మీచెలికత్తియకుఁ గలుదలు కలిపి పరిణయమ్మున కియ్యకొలుపుఁ డని విసువక వచియింపు చుండు నింతదనుక నిన్నుం బ్రబోధింప నేర మైతి మియ్యాది తగు వల నగుటంజేసి చెప్ప వలసి వచ్చె నని మఱియును, ౪౦౯

గీ. వ్రతము లెన్నని భర్తృతత్పరతఁ దవిలి
చేరి శుశ్రూష యెడపక చేయుదానిఁ
బోలఁజాలవు విను మట్టి పూవుఁబోఁడి
యరుగు స్వర్గమ్మునకు నిక్క మండ్రు బుధులు. ౪౧౦

వ. నావుడుఁ గోపించి యామందోదరి సైరంధ్రి కిట్లనియె. ౪౧౧

ఆ. వె. సిగ్గు లేక నన్నుఁ జెనఁటిచందమ్మున
నరయ నంతఁ జులుక నైతి నొక్క!
తపము చేసికొనెడి తన్వికి నా కేటి
భర్త! పొమ్మటంచుఁ బలుకు మతని. ౪౧౨

వ. నావుడు సైరంధ్రి మెల్లన నిట్లను నమ్మా! కాలం బెప్పుడు నొక్క చందమ్మున నుండదు, మన్మథుండు దుర్జయుండు, నా పలుకు లంగీకరింపనినాఁడు నీకు నాపద ఘటిల్లక తీర దనవుడు రాజపుత్రి యిట్లను,

ఆ. వె. ఎంతయేనిఁ జెప్పు మేను వివాహ మం
గీకరింప వచ్చుకీడు తొలఁగఁ

జేయ నెవరితరము చెలియరో! దైవ వ
శంబు తప్పఁ జేయఁ జనునె నీకు. ४०४

వ. ఇట్లు వైరాగ్యమ్మున నీడంబోక పుయిలోట దక్కి యీాసడిం
చిన సైరంధ్రి వీరసేనుం జూచి, ४०౫

గీ. ఎన్ని చెప్పిన వినసేర దీ లతాంగి
గుణగణాఢ్యుండు కాకుత్థ్సకులుఁడు మిగుల
రూపసి యటంచు నొక్కి నీసూఢి దెలిపి
విసివితి నిఁ కేమి సేయుదు వెడలు మధిప. ४०౬

వ. నావుడు నృపాలుండు విమనస్కుండై తనయంత నరిగెఁ బిమ్మటఁ
గొంతకాలమ్మున కమ్మందోదరి చెలియ లిందుమతి యనుదానికిఁ
దండ్రి స్వయంవరమ్మునఁ బెండ్లి సేయం దలంచి చాటం బంచిన
నప్పురంబున కఖిలధరాకాంతు లరుదెంచి మంటపమ్మున వలయు
నెడల వసియించి రం దొక్కరునిఁ దనకనుగుణుండగు రాసూను
నయ్యిందుమతి వరియించి కృతకృత్య యయ్యె. ४०౭

క. మందోదరి యాపెండిలి
చందము వీక్షించి యందెసఁగు నృపతులయం
దందమునఁబొల్చు విటు శఠు
నిం దగఁగని కలఁగి దైవనియతి వరించె ४०౮

వ. ఇట్లు కలంగి మదనవేదనాదోధూయమానయై తండ్రికిఁ దన కోరిక
తెలం గెఱింగించిన నతండును సంతసించి తగుఁదగదనక యతనిని
గారవించి యథావిధిగ నక్కూఁతు నిచ్చి పెండ్లి యొనర్చి పారి
బర్హంబొసంగి వీడ్కొల్పె; నాచారుధేష్ణుండును మందోదరీసహి
తుండై సంతసమ్మునఁ దనపురి కరిగి యవ్విలాసినితో వివిధోప
భోగమ్ములం బొద్దుపుచ్చుచు నొక్కనాఁడు, ४०౯

క. తనదాసితోడఁ గామ
మ్మునఁ గ్రీడాగోష్ఠి నున్నపొంకము తదా్రీ
డ్తనయకు నై రంధ్రిఁ గనుం
గొని చెప్పెన్ దాన మిగులఁ గోపన యగుచున్. ౪౧౦

వ. వా రిరువురం బట్టికొనఁదలంచి రంధ్రిం బరయుచు నంత నొక్కెడ నేకాంతమ్మునఁ గ్రీడించువారి వారిం గాంచి యిట్లు చింతించె.

గీ. అక్కటా! శఠుఁడంచు మున్నరయనేర
నైతిఁ గడుఁ జెట్ట చేసి యీయధము వంచ
నం బడితి నిట్టి నిర్లజ్జునిం బతిగ గ్ర
హించి జన్మమ్మునకు హాని నించుకొంటి. ౪౧౧

క. అని యుమ్మలిక మనమ్మునఁ
బెనఁగొన నిఁక నిట్టివానిఁ బెంపేది హృదీ
శునిఁగాఁ గొని ప్రేముడి నిం
చిన కంటె నఘంబు చెట్ట సేఁతయుఁ గలదే. ౪౧౩

మ. పతిసంగంబు పరిత్యజించి వ్రతినై పాటింతునో! దాన సం
గతమౌ నాత్మవధోద్ధితం బయినబల్ కాలుష్య మట్లౌట మ
త్పితృగేహమ్మున కేగుదెంతునొ! సఖుల్ పీడింతు రెగ్గించి దు
ర్మతినై యింతటిచేటు దెచ్చుకొని మైమైఁ బోవఁగా దీటునే.

క. పొరిఁబొరి సంతాపము పొం
పిరివోవఁగ నిట్లు వగలవెల్లునఁ గడు వం
దురి తుదకు నచట నుంటయు
పరమోత్తమ మంచు నెంచి పతిసంసర్గన్. ౪౧౪

వ. విడిచి వ్రతపరాయణవై పశ్చాత్తాపమ్మునం గుందుచుండె నట్లు
గావున, ౪౨౬

—* దేవీ మహిషాసుర యుద్ధము *—

ఆ. వె. ఇపుడు నన్ను నిట్టు లెడఁజేసి పిదపఁ గా
మార్తి దొడరెనేని నధమునొక్క
శఠు వరించి వాని సంసర్గమునఁ బొప్పుఁ
దక్కనేల వినుము తలిరుఁబోఁడి. ౪౨౭

చ. అనవుడు దేవి కోపమున నమ్మహిషాధముఁ జూచి పల్కు దు
ర్నయ! వివేక మేది పలవింపక సంగర మాచరింపు లే
కునికి రసాతలం బరుగు మొండొక రీతి పొసంగ దెంత చె
ప్పిన విననేర కూరకయ పేలెదు వీటిఁడివే తలంపఁగన్. ౪౨౮

గీ. జన్మమెటుఁగని నా కిట్లు జన్మలబ్ధి
రూపమెటుఁగని నా కిట్లు రూపలబ్ధి
గలుగు దుష్టుల వధియించు కారణమున
నిక్క మమరహితమ్ముగ ని న్నడంతు. ౪౨౯

వ. కావునఁ బాతాళమ్మున కరుగు మొండె ధనుర్ధరుండవై సంగరం
బాచరింపు మనవుడు మహిషుం డత్యుగ్రక్రోధరూపాత్ముండై,

ఉ. కర్ణముదాఁకఁ జాపమును గాఁడఁగ లాగి శరమ్ములన్ రయో
దీర్ణత నేయ నంబ వెనుదీయక యంతరమంద యన్నిటిన్
జూర్ణము చేసె నిర్వురకుఁ జూపటు భీతి మునుంగ నిట్లు సం
పూర్ణరణంబు వాటిలె నపూర్వము ఘోరమునై పొరింబొరిన్.

వ. ఇట్లిరువురుం బోరాడుచుండ నంతరమ్మున దుర్ధరుం డరుదెంచి
యుంబం దలపడి, ౪౩౧

క. కొన్ని శరమ్ములు నించినఁ
దన్నిచుని యెడలఁ గనలి దారుణ శరపా
ళి న్నిగిడించిన వాఁడును
దన్నికొనుచుఁ జచ్చి పడియె ధర శృంగ మనన్. ౪౩౩

ఆ. వె. వానిచావుఁ జూచి వగ గూరఁగఁ ద్రిణేత్రుఁ
డరుగుదెంచి దేవి నస్త్రసప్త
కంబుఁ జొనిపి నొంపఁగా వాని నయ్యంబ
యంతరాళమునన యడఁచివైచి, ౪౩౪

వ. త్రిశూలమ్మున వానిం బిల్కుమార్ప నద్దానికి సైఁపక యంధ
కుండు గోపమ్ము పిరిగొనం దాఁకి, ౪౩౫

మ. గద చేఁబూని గజారిమస్తకముపై గాఁడంగ నేయంగ న
య్యాది క్రోధాకులమై వెసం గడఁగి తీవ్రాస్త్రమ్ములం బోని బె
ట్టిదపుం గోరులఁబట్టి చీల్చి కడు గోండ్రింపంగఁ దన్మాంస ము
గ్రదశం దాఁ దినియెన్ సురారులకు భీకంపంబు సంధిల్లఁగన్.

మ. అటు లయ్యంధకుఁ డీల్గఁ గిన్కమెయి నయ్యశ్వారి తీక్ష్ణాశుగా
ర్భటి రోదోంతరమెల్లఁ గప్పుచు రణప్రారంభుఁడై మించు న
ప్పటి యత్యాహిత మాఁగ నజ్జనని యప్పాపాత్ముపై నొక్క మి
క్కుటమౌ పెన్గద వైవ దానఁ బడె సోఁకు న్మూర్ఛమై వ్రేల్మిడిన్.

క. అంతంత లేచి దానవుఁ
డంతకుఁడై గదనుఁ బూని హర్యక్షుం బొ
క్కింత గువలువడ నేసిన
దంతిపయుం గవియునవ్విధం బడరంగన్. ౪౩౮

చ. ఖరనఖరావళిం బొడిచి గ్రక్కదలన్ బడఁ జీల్చె నంత నా
హరిరిపుఁ డార్చి తాను హరియై సరియైన పరాక్రమక్రమో
ద్ధురనఖరాళి నుక్కుఱఁగఁ దోడన వ్రచ్చిన దాని కల్గి శాం
కరి ఫణిరాణ్నిభంబులగు కాండపరంపర నిండఁ జెండినన్. ౪౩౯

మ. హరిరూపంబుఁ ద్యజించి యమ్మహిషుఁ డేన్గై వేగఁ దానొక్క భూ
ధరశృంగంబు కరంబునం బొడిచి క్రోధం బెక్క బిట్టార్చి శాం
కరిపై నేయ శిలాశితమ్ములఁ గనత్కాండమ్ములం ద్రుంచె న
గ్గిరిశృంగం బొకయింత యింతగ సురల్ గీర్తించి యగ్గింపఁగన్.

ఉ. తోడన యార్చి సింగ మెదఁ దోప మెలర్పఁగఁ గుంభపాళి నా
రూఢిగ మించి కీడ్వడిచి రూక్షనఖంబుల వ్రచ్చివ్రచ్చి వేఁ
టాడఁగ రక్కసుండు శరభాకృతిఁ దాల్చి మరల్చినన్ సురల్
పోడిమిఁ దక్కి రంబికయుఁ బ్రోపఱఁ జేసె శితాస్త్రసంహతిన్.

వ. అంత నా శరభాకారుండగు మహిషుండును, ౪౪౨

ఉ. తుండమునం గడుం బొడిచి తోడన పుచ్ఛముఁ జట్టి భూమిభృ
న్మండలముం బెకల్చి యొకమాత్రన బంతులు ఱువ్వపోల్కి న
చ్చండిపయి న్నిగుడ్చుచు హసన్ముఖుఁడై యెలుఁగెత్తి విక్రమో
ద్దండత మిన్ను ముట్టఁగ మదమ్మున నజ్జగదంబ కిట్లనున్. ౪౪౩

మ. మదముం ద్రిప్పఁగలేక నా పలుకుల న్మన్నింప కీరీతి బె
ట్టిదపున్ సంగర మియ్యకొంటివి ననున్ డీకొంట నీబోఁటి యాఁ
డుదియు న్నేర్చునె! యిందుఁదొట్టి సురలాటోపంబు వాటిల్ల ర
య్యెది నీకుం దెలియంగ లేదొ, వినవో యస్మత్ప్రతాపస్థితుల్!

చ. నినుఁ బురికొల్పినట్టి సురనేతృముఖామరులెల్లఁ మేల్మిఁ ద
క్క నని వధించి నాదు భుజగర్వము దుర్వహమై జగమ్ములం
దనుకఁగఁ జేయుదున్ వెనుకఁదారక నిల్వను నాఁగ వానిక
జ్జనని వచించుఁ గోప మొకచాడ్పు మెయిన్ గనుపట్ట నవ్వుచున్.

ఉ. తత్తఱపాటు మాని తగు దర్పమున న్నిలుమిష్ట మాధవిన్
హత్తినవేడ్కఁ ద్రావి సురలందఱునుం గొనియాడ దుర్మదో
న్మత్తుని నిన్నుఁ జంపెద రణమ్మున నంచు సువర్ణపాత్రి మా
యత్తము చేసి త్రావెఁ దగ నాసవముం జల ముప్పతిల్లఁగన్.

క. ద్రాక్షాసవపానం బిటు
లక్షీణగతిం బొనర్చి యయ్యంబిక బల్
దక్షత మెఱయఁగఁ దా హ
ర్యక్షారావం బొనర్చె నసురులు బెగడన్. ౪౪౭

క. జయ పెట్టుచు నమరులు పే
ర్మి యెలర్పఁగఁ బూలు గురియ మేకొని జగదం
బయు మహిషు నెదిరి పోరెన్
హయారియు ననేకమూర్తు లందుచుఁగడఁకన్. ౪౪౮

చ. కపటపుఁబొండిలిన్ మెఱసి కావలుఁడై పలుమైల నంబికో
నపగతభీతిమై నని నహంకృతిఁ జూపఁగ వాని కల్గి చం
డి పెలుచ శూలముం గొని కడిందిగ వక్షము నందు నాట మూ
ర్ఛపడి హయారి యంతట వెసన్ బునరుద్గతుఁడై మహోద్ధతిన్.

శా. చాముండం దన పాదఘాతముల నుచ్చైర్నాదపూర్వమ్ముగా
నామైఁ దన్ని హసన్ముఖుం డగుచు శంఖారావముం జేయ ను

ద్ధామకోధపరీతయై జనని హస్తంబందుఁ జక్రంబు ని
స్సీమారంబు ధరించి యుద్ధతిమెయిన్ సింహారవంబొప్పఁగన్.

ఉ. ఓరిమదాంధ ! చక్రి మిది యోడక నీదు శిరంబు దీసి దు
ర్వారత నయ్యమాలయనివాసము నీకొనరించు నెమ్మెయిన్
బోర నొకింత నిల్వుమని భోరన నెత్తురు మీఁది కొల్క న
వ్వైరిశిరమ్ముఁ ద్రుంచినఁ గబంధము భూధ్రము నా భువింబడెన్.

మ. సురలెల్లన్ జయవెట్ట నమ్మహిషుఁ డచ్చోఁ గూల సింగంబు దు
ర్భరవేగమ్మునఁ బాఱుసేనల వెసన్ భక్షించి నిశ్శేషతం
బోరయం జేసెను గొంద ఱందుఁ జని రేపుం దక్కఁ పాతాళ మి
క్కరణిన్ దేవి యొనర్ప దేవతలు వేడ్కం జేతులన్ మోడ్చుచున్.

—* ఇంద్రాదులు దేవిని నుతించుట *—

వ. అయ్యంబికం గని యిట్లు సన్నుతించి "రో యంబా ! సృష్టి
స్థితిలయకారిణివై కీర్తిమతి స్మృతిగతికరుణాదయాశ్రద్ధాధృతి
వసుధాకమలాజయాపుష్టికలావిజయాగిరిజాతుష్టిప్రమా విద్యా
క్షమాదికంబులు నీవయై మెలంగుదు వీ యీ శక్తుల సాహా
య్యమ్మునం జేసి వారువారు తత్తత్కార్యమ్ములకు సమర్థు
లగుచుందు రది యెట్లనిన, నీవు ధారణవై యుండవేని నాగ
కూర్మమ్ము లిద్ధారుణి ధరించుటయు నీవు పృథివివై చెలఁగ
కున్న నంబరంబు నిలుచుటయుం బొసంగ దిట్లుండఁ గొందఱు
హరిహరప్రముఖులమగు మమ్మెంతయు నారాధింతురు. వారు
మూఢు లనుట కేమి సందియంబు ? జన్నం బొనర్చువారు చేయు
హోమమ్ములెల్ల నీవు స్వాహవై యుంటం జేసియకదా మాకు
ముట్టుచున్నయవి. కావునఁ జరాచరాత్మకంబగు ప్రపంచంబున
కెల్ల భుక్తిముక్తిప్రదాయినివగు కతన నితరులట్ల మమ్మునుం

బాలించుచుందు విది యిట్టిదయేని రక్కసు లి ట్లుక్కు మిగులు చూడ వారల మూలచ్ఛేదం బొనరింపకుంట లోకమ్మున మహా రణ్యంబులం బుట్టిన కటువృక్షమ్ములఁ బలాశరహితమ్ముల నేనియు నుత్తములగు వారు ఖండింపక మిన్నకుండుట వంటిది. కరుణా రసనియతవగు నీ వొక్కొక్కయెడ రణాంగనంబుల శితశర పరంపరలంజేసి యొరుల శిక్షించుటకుఁ గతంబు వారలకు దేహాంతరప్రాప్తింజేసి యందు సురాంగనా కేళీముఖసౌఖ్యం బొడగూర్చుట కని యూహింపనయ్యెడి. దేహరహిత వయ్యును రక్కసుల నుక్కడంప నయ్యాయికాలమ్ముల దేహంబు గై కొంట క్రీడామాత్రంబయగు నిట్టి యమేయప్రభావవగు నీవుండ ధూర్తులును బురాణచతురులును నగు కొందఱు హరిహరాదుల సేవింప వలయునని విధించుట యసమంజసంబు గాకుండు నొక్కొ! జగజ్జననివగు నీకు వశులమై యిట్లు రాక్షసబాధల నీఁగుచునుండు మమ్మెవ్వరు పూజింప నెంతురు వారు కరమ్మున దీపంబు గలిగియుఁ గూపమ్మునఁ బడువారిలో నొక్కరు గాఁ దగుదురు. నీవు విద్యావిద్యాస్వరూపిణి వగు కతన మోక్షార్థులకు గతివై యుండుదు గావునఁ ద్రిమూర్తులును భవత్పాదపంకేరుహంబు భజింతు రిట్టి నిన్నుఁ గొందఱు మూర్ఖులు భజింపనేరక భవసాగరమ్మున బ్రుంగుడువడి నవయుచుందురు. తల్లీ! యింతేల? నీవు వాగ్దేవతా స్వరూపిణివై వక్త్రమ్ముల వసియింపవేని హరిహరాదులగు సురలు గాని మానవులు గాని యెట్లు ముఖరితవక్త్రులగుదురు? ౪౫౩

మ॥ భృగుశాపమ్మున మీనమై కమఠమై పెంపేది కోలాకృతిం
దగి సింగంబయి వంతలంబడి యశక్తప్రక్రియం బొల్చి ధు

ర్భగుఁడై యుక్కువపుంగతిఁ మెలఁగు నప్పుద్మాత్ము సేవింప మృ
త్యుగతంబైన భయంబు రూపబునె, సంతోషంబు వాటిల్లునే ?

క. ఎవఁడు భృగుశాపమున వన
సవిధమ్మునఁ దనకు లింగసంపాతముగా
నవసెనో తాదృశుఁ డగు నా
శివునిఁ సేవింప సౌఖ్యసిద్ధులు కలవే ? ౪౫౫

గీ. అట్టి హరునకుఁ గొమరుఁడై నట్టి గజము
ఖుని గణాధిపు సేవించి కోర్కెవడయ
నెంతు రతిమూర్ఖు లంబ ! నిన్నెఱిఁగి కొలువ
రాదొకో, కార్యసిద్ధిసంప్రాప్తిపొంటె. ౪౫౬

వ. అని వెండియు,

చ. అరిజనతఁ వధించుట కృపాకులతన్ నిరయంబు మాన్పి ని
ర్జరభువనం బొసంగుటయు సమ్మత మంచు వచింతుఁ నంబ ! నీ
చరిత మెఱుంగ లేరు హరసారసలోచనముఖ్యులైన ; నొం
డొరుప్పు లెఱుంగువారె భవదుజ్జ్వల మోహవశంవదాత్ములై.

గీ. వేదముల నెన్నియేని భావింత్రుగాక
కొంద అజ్ఞులు మునులు నీచంద మెఱుఁగఁ
జాలమిని సూర్యుఁ గొల్తు రా జ్వలనుఁ దలతుఁ
రాగమమ్ముల సారంబు నరయఁ దరమె. ౪౫౭

చ. స్వరచితముల్ శ్రుతుల్ గటపి సారససంభవముఖ్యదేవతా
వరుల కనుత్తమత్వము నవారణ బోధ యొనర్చి వ్యాజదు
ర్భరత మెలఁగుచున్ జగము వంచనచేసెడి వారి నీవు పే
ఘరసమునం గనుంగొనెదు మాయికులంచుఁ బ్రసిద్ధిదెచ్చుచున్

క. రాఁదగు కలియుగమున జగ
దాదిన్ నిను డాఁచి సుకవు లంబరో! నీ వా
పాదించిన సురగణముల
నాదరముమెయి న్నుతింతు రయ్యాయి విధులన్.

క. మును లెవ్వరు పరవిద్యన్
జనని న్నినుఁ దలఁతు రట్టి జ్ఞానులు గర్భ
మ్మునఁబడక నిన్నుఁ జెంది సు
ఖనియతి వర్తింతు రెల్లకాలము తల్లీ. ౯౬౧

క. కేవల పరమాత్మయు నీ
తో విరహితుఁడై యొకింత దొడరఁగఁ జాలం
డావిభుఁడు నీదు చిచ్ఛ
క్త్యావిర్భావమునఁగాదె యట్టిండగుటల్. ౪౬౨

వ. అట్లు కాదేని జడమ్ములగు తత్త్వమ్ములును గుణకర్మయుతమ్ము
లగు నిందిరియమ్ములును జిద్విరహితమ్ములై తత్తత్కృతుల కెట్లు
సమర్థమ్ములగు? సర్వమ్మును సృజించి సమయమ్మునఁ బాలిం
చుచు హరించుచుండు నీ మహామహిమంబు మాక కాదు హరి
హరాదులకు సయితం మగమ్యంబై యుండు. ౪౬౩

శా. లోలాత్ముండయి దుష్టుఁడై త్రిజగతీలుంటాకుఁడై యెప్డు దు
శ్శీలుం గాసరరూపు నీ తులువ నిర్జీవుం బొనంగించి మ
మ్మేలంజొచ్చిన నీ మహామహిమ మింకేమంచు వాకుత్తు మం
బా! లీలాజితదుష్టదానవకదంబా! సత్కదంబాలయా. ౪౬౪

క. మాకార్యము సేతయ కా
కాకల్పంబైన కీర్తి యలవడ నీ కీ

లోకాపకారిదానవుఁ
బోకార్చినకతన విపులముగ జగదంబా. ౭౬౫

వ. అంబా! మమ్మెల్లవేళలఁ గృపాకలితవై యిట్లు పాలించుచు నేడు
గడవై యుండం బ్రార్థింతు" మనవుడు మహిషాసురమర్దని
వారల కిట్లనియె. ౭౬౬

క. సురలార! కార్యమొం డిపు
డరయంబడెనే నిఁ దెల్పుఁ డది తీర్చెద దు
ష్కరమేని మీకు నాపద
వారసినయపుడెల్ల నన్నుఁ బోలుఁదలంపన్. ౭౬౭

చ. అనవుడు దేవతల్ ప్రణిహితాంజలులై జగదంబఁ గాంచి యి
ట్లనిరి భవత్పదాబ్జ మనయమ్మును గొల్చెడియిచ్ఛ మాకు ని
చ్చినఁ బదివేలు వేఱొకటి చేయఁ గొలంతయు గల్గెనే రసా
యన మగు నీదుపల్కు మహిషాసురమర్దని! లోకవర్ధనీ. ౭౬౮

వ. ద్విసువర్ణ సంవృతంబగు నీ దేహమ్మున నపరాధసహిష్ణుండు తృతీ
యుండు లేఁడు గావున సఖీభూత వగునిన్ను విడిచి జీవుం డొన
ర్చెడి దించుకయు లేదు. పాపాత్ములు దుఃప్రాపంబులగు సురా
సురమనుజయోనులం బుట్టియును నిన్నెఱుంగఁ జాలరు సుఖ
మ్మున నొండె దుఃఖమ్మున నొండె నీ చరణంబులు దక్కఁదక్కటి
శరణము లే దని మనోవాక్కాయ కర్మమ్ములం ద్రిశుద్ధిగ వచి
యించు మమ్ముం దయాంతరంగవై పాలించుభారమ్ము నీదై
యున్నయది యను నమరులందగుగతి వీడ్కొలిపి యంతర్ధానంబు
చేసె ననుసాత్యవతేయునకు జనమేజయుం డిట్లనియె. ౭౬౯

సీ. దురితంపు సంసృతిఁ దొలఁగించు సదుపాధి
సజ్జనకర్ణరసాయనంబు
పటుతరామయభారపాషాణటంకంబు
భక్తలోకైకకల్పద్రుమంబు
సుఖకరశ్రీలోకసోపానవిశ్రేణి
సంపత్కదంబపర్జన్యఋతువు
కాతరీకృతభూతబేతాళనిచయంబు
సకలరక్షస్సముచ్చాటనంబు

గీ. చారులీలాకదంబసంచారభూమి
తనుతరేతరమోదసంధాయకంబు
హరిహరవిరించిముఖ్యదేవావధృత్య
ధీయమానంబుగాదె! శ్రీదేవిచరిత. ౪౭౦

వ. ఇట్టి చరిత్రంబు కృతజ్ఞుం డెవ్వండు విననోపండని వెండియు,

ఉ. ముందటి జన్మమం దెవఁడు మోదవిధాయిని యైన దేవి కిం
పొందెడి భక్తిఁ బూజలిడునో కృతకృత్యుఁ డతండు భోగి యా
నందియునై ధరాతలము నాల్గుచెఱంగులు నేలఁ జాలు న
స్పందితకీర్తిశాలియగు పార్థివుఁడై జనియించు మీఁదటన్.

ఉ. అంబ నెఱుంగఁజాలువినయంబు వివేకము లేని పెక్కులో
యంబులు వచ్చునట్టి జనవాంతరమందు రుజాభిభూతిమైఁ
బంబిన దుఃఖవేదనలఁ బొల్పడి రిక్తతఁ గాంచి కట్ట వ
స్త్రంబు భుజింపఁ గూడు గొనఁజాలక సంతతి లేక కుందదే.

క. కావున నిఖిలార్థదమై
పావనమై ముక్తిదమయి భద్రప్రదమై

కోవిదమాన్యం బగున
ద్దేవీచరితంబు నాకుఁ దెలుపంగదవే. ౪౭౪

గీ. అమరరిపుఁడైన మహిషుఁ దునిమినమీఁద
నంబ యెచ్చటి కేగె, నే మాచరించె ?
నేవిధమ్మున వర్తించె ? నిదియు విస్త
రించి వలతు నెఱుంగ నా కెంచిచెప్పుమ. ౪౭౫

—* దేవ్యంతర్ధానోత్తరవృత్తాంతము *—

క. అనవుడు సాత్యవతేయుం
డను జనవర ! మున్ను హరిహరాదులు స్త్రీత్వం
బును గాని రెయ్యెడఁ నయ్యెడఁ
జనిరెు మణిద్వీపమునకు జగదంబ వెసన్. ౪౭౬

వ. పిమ్మట నమరులు జగదంబ పీడ్కొలిపి యమ్మహిషురాజ్యమ్మున రవివంశసముద్భూతుండును నయోధ్యాపతియునగు శత్రుఘ్నుం డనురాజు నభిషిక్తుం జేసి తమతమ పొందుపట్లకుఁ జనిరి. శత్రుఘ్నుండును యథోక్తంబుగ రాజ్యంబు శాసించుచుండు నెడ,

సీ. నెల మూఁడువానలు నియతిమైఁగురియుచు
ధనధాన్యములకల్మి తఱుగకుండు
ఫలపుష్ప సంపత్తిఁ దులదూఁగువృక్షముల్
వట్టనిజలముల వఱలునదులు
కుండలకొలఁదిగా గోవులు పాలిచ్చు
ద్విజులు శ్రుత్యుక్తవిధినిఁ జరింత్రు
నృపు లస్త్రవిద్యల నేర్పువాటింతురు
పౌరపౌచ్ఛ్రమఃలు లేవు భూతములకు

గీ. అంకుబొంకులు లేక నిరంకుశగతిఁ
బ్రజలు ధర్మానువర్తులై పార్థివాజ్ఞ
మెలఁగుచుండు రతని భూమితలమునందు
నెల్లరు సుమార్గమునఁ బొల్తురెల్లవేళ. ౪౭౯

ఉ. అన్నరనాథుదేశమున నారసి మెచ్చుటఁ జూచెనేనియుఁ
జన్నపుశాలలా! మఱియు సత్రములా! శుభమంటపమ్ములా!
కన్నులపండువై యెసఁగఁగాఁ దగుచక్కని దేవళమ్ములా!
యెన్నిటఁ జూచినం దనివి యెన్నటికిం గనఁ బోల దేరికిన్.

సీ. పాషండమతము స్వప్నమ్మునఁగనరా ద
ధర్మంబు మొట్టమొదటికి లేదు
మిత్రవియుక్తి యమిత్రవృద్ధియు నప
మృత్యుభయంబు దుర్భిక్షబాధ
మారిమసంగుట మరియాద దప్పుట
రోగంబు దైన్యంబు భోగవిరతి
దాంపత్యవిరహంబు దాంభికత్వంబు చౌ
ర్యంబు పైశున్యంబు రాజకలహ
గీ. మాగమద్వేష మనునవి యరయ మందు
నకును గానంగ రావు తన్నరవరేణ్యుఁ!
డాడితప్పనివాఁడు మహానుభావుఁ
డప్రమత్తుం డతండాత్రిభుఁ డనఁగఁ దగఁడె! ౪౮౦

ఉ. ఆనగరిన్ ద్విజుల్ త్రివిధులై పొలుపొందుదు రందు సాత్త్వికుల్
దానములన్ గ్రహింప రపధర్మములన్ జరియింప రధ్వరం
బేనియు జీవహింసకు సహింపక పిష్టపశుం బొనర్తు ర
మ్మానధనుల్ త్రికర్మముల మన్ననఁ జేయుచు నుందు రాజిటన్.

క. నృపపౌరోహిత్యము క
ర్మపరత విధివిహితమైన మాంసాదనముఁ
గృపణతలేమియు నైశ్వ
ర్యపటుత్వము గలిగి యుందు రాజసులందుఁ. ౪౮౨

గీ. కించిదధ్యయనము నృపకింకరత్వ
మధికకోపము ద్వేషరాగాభియుక్తి
గలిగి యొకభంగి వర్తింతు కర్మబాహ్యు
లగుచుఁ దామసులైన బ్రాహ్మణజనములు. ౪౮౩

గీ. మహిపతులు దానపరులు బ్రాహ్మణనిరతులు
యాగసంసక్తు లవనిరతానురక్తు
లస్త్రశస్త్రవిశేషజ్ఞు లనఘమతులు
తెలివిగలవారు కలిమియు బలిమి గలరు. ౪౮౪

క. విడుమరదోడరని సిరియును
నుడుకువ కెడలేనికృషియు నొగి గోరక్షన్
మడపక చేయుట యనునివి
యెడపక చరియింతురందు నెందును వైశ్యుల్. ౪౮౫

వ. ఇట్లుమహిషవధానంతరమ్మున రామరాజ్యంబై ప్రపంచంబు సుమాళమ్మ్గాఁ గొంతకాలం బుండఁ బిమ్మట జగద్ద్రోహం బొనర్ప సమకట్టిన శుంభనిశుంభులను జండముండులను రక్తబీజ ధూమ్రలోచనులను బరిమార్చి సురపక్షపాతినియై జగదంబ జగమ్ములకు మేలువాటించెనన, వార లెవ్వరేవిధమ్మున వారే కతమ్మున వధించె నుడువుమనుడు రాజునకు ముని యిట్లనియె.

క. మును శుంభ నిశుంభులు నాఁ
జనుదాయాదు లిరువురుఁ రసాతలవాసుల్

జనవర! తపముండి రళన
మున కుదకమునకునుఁ గాక మొరడులభంగిన్. ౪౮౭

మ. పదివేలేం డ్లిటు లాచరించుటయు నప్పద్మాసనుం డేగుదెం
చి దయాంతఃకరణుండు వేడుఁ డన నీచే నొడ్లచే నేరిచేఁ
దుదిలేకుండ నొసంగుడే యనుడు నా దుష్టాత్ములంగాంచి యొ
ప్పుదు వేఱొండువరంబు గోరుఁడన నవ్వా రంజలిన్ మోడ్చుచున్.

మ. జననం బందినవారికిన్ మృతి యవశ్యంబేని మా కొక్క యం
గనచేఁ దక్క నపాయ మొండొరులచేఁ గాకుండఁ గానిమ్ము మ
మ్మునెమర్పంగల కాంతయుం గలుగునేఁ షో! చూతమట్లైన నా
గ నొసంగెన్ వర మట్లుకాక యనుచుం గంజోద్భవుం డొప్పగన్.

వ. అన్నదమ్ము లిట్లు వరమ్ములం బడసి తమకు భృగువుం బురో
హితుఁగాఁ గైకొని రందు జ్యేష్ఠుండగు శుంభుండు శుభదినమ్మున
సుముహూర్తమ్మున సింహాసనాభిషిక్తుండుగా నిశుంభుండు మంత్రి
యై సకల తంత్రమ్ములు నడుపుచుండె. మహావీరులగు చండ
ముండు లిరువురును సేనాధిపతులై వారిం గొలుచు చుండిరి.
ధూమ్రలోచనరక్తబీజు లనువారు పాతాళమ్మున నుండి వచ్చి
రెం డక్షౌహిణులతో నాశుంభుఁ గొలుచుచుఁ దదనుమతులై
రందు, ౪౯౦

గీ. రక్తబీజుం డసాధ్యసంగ్రాముఁ డతఁడు
పోరునెడ నస్త్రహతిఁ జేసి పొడమునల్ల
పుడమిఁ బడి నంతలో వానిఁ బోలఁజాలు
వీరులుదయింతు రొక్కట వేనవేలు. ౪౯౧

వ. కావుననవ్వానికి రక్తబీజుం డనిపేరు సార్థకంబు మరియు ననే కులు రక్కసులు చతురంగబలసమన్వితులై యా శుంభుం గొలువ వచ్చిన శుంభుండును వారల నెల్లర లోఁగొని రాజ్యం బేలుచుండె నంత నిశుంభుం డొక్కనాఁడు, ౪౯౩

చ. అమరపతిఁ జయింప నమరాలయ మేగిన వజ్రి నిర్జరుల్, గుమిగొని తోడురా నెదురుకొ ల్పచరించి దురంబు చేయ లో కము బెగడొందె నంత లయకాలుఁడు వోలె సురేశ్వరుండు వ జ్రముగొనియేసె నయ్యసురరాలెఁ బడల్పడుమూర్ఛపెంపునన్.

క. వారలు తమ్ముఁడు మూర్ఛం
గూరిన విధమెఱుఁగఁజెప్పఁ గ్రోధాకులుఁడై
ధీరుఁడు శుంభుఁడు సంగ్రా
మారంభుండయ్యె నమరు లటునిటుచెదరన్. ౪౯౪

వ. ఇట్లు శుంభుండు విక్రమించి యింద్రాదుల జయించి, ౪౯౫

చ. అమరపదంబు చేకొని సురారిమయమ్ముగ నేలుచున్ గ్రమ క్రమమున నష్టదిక్పతులగద్దియలం దనపాలుచేసి వి క్రమమున మూఁడులోకములు రాజ్యము సేయుచు నందనమ్మునం దు ముదమువిూఱ నచ్చరలతో విహరించె నవార్యచర్యుఁడై.

చ. అనవరతంబు కల్పకసుమాంచితుఁడై, సుధ గ్రోలుచున్ సురాం గనలఁజెలఁగ దవిల్చి కడుఁ గంటకుఁడై మఖభాగముల్ హరిం చి నిఖలదేవతల్ తనదు సేనయకాఁ బచరించి తత్కృతుల్ పొనరుపఁజేయుచు న్నెగడెఁ బొంపిరివోయిన మేటిసంపదన్.

చ. ఒకఁడు జముండు శ్రీదుఁ డొకఁడొక్కఁడు వహ్ని మఱొక్కఁడింక వే ఱొకఁడు దినేశ్వరుండు శశియున్ మఱియొక్కఁడు వాయుదేవుఁడిం

కొకఁడు నొకండుపాశి యిటులొక్కొకఁడొక్కొకరుండుగాఁ దదీ
యకృతులు సేయ నేర్పఱిచె నాత్మకు నచ్చిన దానవేంద్రులన్.

వ. అంత నమరులు నిరాలంబులై దానవుల ధాటికి నోడి యర
ణ్యంబు శరణ్యంబుగా గుహలు గృహమ్ములుగా నలందురుచు
నక్కడక్కడఁ బంచబంగాళమ్ముగాఁ జరించుచు సుఖం బెఱుం
గక విమనస్కులైయుండి రని వెండియు, ౪౯౯

చ. నరవర! కాలపర్యయమనం గడు దుర్భర; మెంతవారు త
త్పరత సుఖంబు దుఃఖమును దాల్తురు భిక్షుకు రాజుఁజేయు భూ
వరు నతిధిం బొనర్చు బలవంతుని దుర్బలుఁ జేయు దుర్బలున్
స్థిరబలుఁజేయు నయ్యది యజేయము దాఁటగరాదు బ్రహ్మకున్.

ఉ. శూరు లశూరులున్ మిగుల సూరు లసూరులనం గలారె? యె
వ్వారికి నెన్నియే న్గతు లవారణఁ గాలముగూర్చుఁ గాక యెం
తే రహిఁ నూఱుజన్మముల నిష్ఠమెయిన్ బచరించి యింద్రుఁడై
పారములేని దుఃఖముల బొల్పడునే? యటు గానిచో నృపా!

క. హరుఁడు కపాలం బూనుట
హరి నానాతుచ్ఛయోనులందుఁ బుట్టయు
న్నరనాథ! కాలగతి దు
ర్భర మియ్యది యిట్టి దనుచుఁ బలుకం గలదే. ౫౦౨

ఉ. ఈగతి దేవతల్ వనములే శరణమ్ముగ నేగ శుంభుఁడు
ద్యోగము చేయుచుండె నటు లొకసహస్రము నిండె వర్షముల్
భోగములేమి నెంతయును బొల్పఱి యింద్రముఖామరుల్ దివం
బేగతిఁ గొందు మెట్లు వధియింతుము వీని నటంచు నెంచుచున్.

వ. ఒక్కనాఁడు బృహస్పతిం గని మహాత్మా! నీవు సర్వజ్ఞుండ వీ సంకటమ్మున నొనర్పం దగునుపాయమ్మొండు యోజించి సురలం బార మేదింప ననుగ్రహింపుము. మంత్రమ్ముల ప్రభావమ్ము లప్రమేయంబులు తద్బలమ్మున నభిచారహోమం బొండె నిష్ఫలనొండెఁ జేయించి మాపదంబు మాకుం జేకూర్పుము నావుడు బృహస్పతి యిట్లనియె. ౫౦౪

ఉ. నల్లవో! మంత్రతంత్రము లనన్ విధిచోదిత రీతిఁ గార్యముల్
చెల్లఁగఁ జేయు నెక్కటిగఁ జేయఁగ నేరవు తత్తదాధిప
త్యోల్లసితుల్ సురేశ్వరు లహో! యిటుమీరలు దుర్దశాహతుల్
పెల్లుగ నున్నవార లెటు పెం పెడ నయ్యెవి కేవలస్థితిన్. ౫౦౫

వ. అదియునుం గాక యవశ్యభావ్యంబులగు కార్యంబులకుఁ బ్రతీకారంబు లేకుండు నైనను దనకొలఁది నుపాయం బొనర్చుట శిష్టానుమతంబు దైవంబు ప్రధానం బని కొందఱు చెప్పినను దాని నుపాయవాదు లంగీకరింపరు కొంద ఱుభయమ్మునను గార్యసిద్ధి యని నుడువుదురు గావున సర్వంబు నేకం బొనర్చి, ౫౦౬

క. కేవలము దైవము యనక
కేవలము నుపాయమన కొగిన్ బ్రతికారం
బేవెంట నెచటఁ దగు నది
యేవచియించెద నొనర్పుఁ డీరు కడంకన్. ౫౦౭

క. మును మహిషాసురునిం జం
పిననాఁ డయ్యంబ సురలఁ బ్రేముడిఁ గని చె
ప్పిన విధము మఱచితిరె చ
య్యన నజ్జననిం దలంపుఁ డాపద దొలఁగున్. ౫౦౮

—* ఇంద్రాదులు హిమాలయమ్మున కరుగుట. *—

వ. కావున హిమాచలమ్మునకుం జని మనోహరంబగు నప్పర్వతమ్మున నప్పరాంబ మాయాబీజపురశ్చరణం బ్రవర్తించినఁ గార్యసిద్ధియగు నయ్యెడ నప్పరశక్తి యెల్లప్పుడు వసియించు ననియుఁ వింటి నావుడు నిలింపులు తద్గిరిశిఖరమ్మునకుం జని మాయాబీజమ్ము జపియించుచు నిట్లు నుతించిరి. ౫౦౯

—* దండకము. *—

శ్రీమన్మహాదేవి ! విశ్వేశ్వరప్రాణనాథే ! సదానందరూపే ! సురానందదే ! తే ! నమో, దానవాంతప్రదే ! మానవానామనేకార్థదే ! భక్తిగమ్యస్వరూపే ! న తే నామసంఖ్యాం న తే రూప మీదృక్తథాకోపి వేదాదిదేవాదిరూపే ! త్వమేవాసి సర్వేషు శక్తిస్వరూపా, ప్రజాసృష్టి సంహారకాలే సదైవ స్మృతి స్త్వం ధృతి స్త్వం త్వమేవాసి బుద్ధి ర్జరాపుష్టితుష్టీ ధృతిః కాంతిశాంతీ సువిద్యా సులక్ష్మీ ర్గతిః కీర్తిమేధే త్వమేవాసి విశ్వస్య బీజం పురాణం యదా యై స్స్వరూపైః కరోషీహ కార్యం సురాణాం చ తేభ్యో నమామోఽద్యశాంత్యై క్షమా యోగనిద్రా దయా త్వం వివక్షా స్థితా సర్వభూతేషు శస్తై స్స్వరూపైః కృతం కార్య మాదౌ త్వయా యత్సురాణాం హతోఽసౌ మహారి ర్మదాంధో హయారి ర్దయా. తే సదా సర్వదేవేషు దేవి ! ప్రసిద్ధాపురాణేషు వేదేషు గీతా కి మత్రాస్తి చిత్రం యదంబా సుతం స్వం ముదా పోషయే త్తోషయే త్సమ్యగేవ ప్రసూస్త్వం యతో నిర్జరాణాం సహాయా కురు ప్వైకచిత్తేన కార్యం సమగ్రం న వా తే గుణానా మియత్తాస్వరూపం వయం దేవి జానీమహే విశ్వవంద్యే కృపాపాత్ర మిత్యేవ మత్వా తథాఽస్మాఁ భయేభ్య స్సదా పాహి పాతుం సమర్థే ! వినా బాణపాత్రై ర్వినాముష్టిఘా

త్రై ర్వినాశూలఖడ్గై ర్వినాశక్తి దండై రిపూన్ హన్తు మేవాసి శక్తా
వినోదా త్తథా పీహ లోకోపకారాయ లీలా ఇమా శ్శాశ్వతం నైవ
జానంతి మూఢా నకార్యం వినా కారణం సంభవే ద్వా వయం
తర్కయామోఽనుమానం ప్రమాణం త్వమేవాసి కర్తా స్య
విశ్వస్యధాతా భవే త్సృష్టికర్తా ముకుందోఽవితాయం హరో
నాశకృద్వై పురాణప్రసిద్ధా నకిం త్వత్ప్రసూతా స్త్రయ స్తే
యుగాదౌ త్వ మేవాసి సర్వస్య తేనైవ మాతా త్రిభి స్త్వం పురా
నాధితా దేవి దత్తా త్వయా శక్తి రుగ్రాచ తేభ్య స్సమగ్రా
త్వయా సంయుతా స్తే ప్రకుర్వంతి కామం జగత్పాలనోత్పత్తి
సంహారకార్యం త్వదీయాంఘ్రి యుగ్మాశ్రియాణ్ శుంభ దైత్యా
ర్దితాణ్ నిర్జరాణ్ దేవి పాయా స్త్వదస్య న్న తే జానతే దేవి
దుర్గే! నమస్తే నమస్తే నమస్తే నమః. ౧౧౦

వ. అని వినుతించి వెండియు, ౧౧౧

గీ. విబుధబృందమ్ము లెల్ల నీ వెంట నంటి
యెల్లవేళ నినుం గొల్తు రెఱుకకలిమి
నట్టి త్వత్పదపద్మమ్ము లరసి భక్తి
మన నెఱుంగని యతు లతిమందమతులు. ౧౧౨

గీ. కమలవై కీర్తివయ్యును గాంతివయ్యు
లజ్జవై స్థితివైన జగజ్జనని ని
ను మది భజియింప కకట దంభమున నుందు
వైష్ణవులు సౌరులును బాశుపతులు దేవి! ౧౧౩

క. హరిహరు లేదుగడగ నీ
బరమాదరమున యజింప వల నెఱుంగమి నీ

చరణములు విడుచు దుర్మతు
లరయఁగ విధివంచితాత్ము లనఁదగు నంబా. ౫౧౪

క. హరి జతురసముం గొని సా
గరజాపదరంజనమ్ము గావించుఁగ శం
కరుఁ డగజాపదపంకజ
పరాగరతుఁ డింక నొరుల వాకొనఁగలదే. ౫౧౫

క. సారవిహీనంబని సం
సారము వర్జించి జన్మసాఫల్యంబుఁగ
గోరి నిను యతులు దలఁతు రు
దారంబగు భక్తి కలిమి దాంతహృదయులై. ౫౧౬

గీ. పలుపలుకు లేల నీ పదభక్తి లేని
చెనఁటులెల్లను రోగులై శ్రీ దొలంగి
సంసరణకూపమునఁ బడి సౌఖ్యలేశ
మెఱుఁగక నశింతు రఖిలలోకైకజనని ! ౫౧౭

గీ. కట్టియలు మోచికొని గడ్డికట్ట లమ్మి
కొనుచు సేవపు గతిని జీవనము చేయు
హీను లందఱుఁ దొల్లి ని న్నెఱుకకలిమి
గొలువని తులువ లింత నిక్కువము తల్లి. ౫౧౮

వ. అని పలువిధమ్ముల సన్నుతించు నమరులఁ గరుణించి జగదంబ
ప్రత్యక్షంబుగా నుంకించి, ౫౧౯

ఉ. చక్కనిచీరఁ గట్టి విలసన్మణిభూషణభూషితాంగియై
యెక్కటి నేగుదెంచె సురలెల్లరుఁ జూచి "యిదేమొ, యిప్పు డీ

చక్కెరబొమ్మ గంగ కిటు చయ్యన నాడఁగ నేగుదెంచు నం
చొక్కమొగి న్నమస్కృతుల నొయ్యనఁజేసి తను న్నుతింపఁగన్.

వ. గిరిగహ్వరమ్మునుండి గంగ కేగునెపమ్మున వచ్చి సురలంగాంచి యిట్లనియె. ౯౨౧

క. ఏమీ దేవతలా! యిం
దేమి పనికివచ్చిరొక్కొ! యీగతిఁ గడుఁ జిం
తామగ్నులగుటకుం గత
మేమొకొ! నా, సురలు జగదధీశ్వరి కెలమిన్. ౯౨౨

ఉ. కేలు మొగిడ్చి యంబ! మముఁ గీడ్వడకుండఁగఁ బ్రోవనెంచు మే
మాలములో సురారులకు నడ్డముగా నిలుపోపలేక మా
చాలమి విన్నవింప నిటు చయ్యన వచ్చితి మేపుదక్కి మా
పాలన నీదికాదె! మును పల్కినపల్కు స్మరింపకుందువే. ౯౨3

మ. జననీ! శుంభనిశుంభులన్ దనుజు లిచ్ఛామాత్రి మమ్మెల్లఁదా
మనిలో గీటడఁగించి యేలుదురు స్వర్గావాస మాదుష్టు లె
వ్వనికిన్ వధ్యులుగారు బ్రహ్మవర మప్పాటన్ బొసంగించె నం
గనచేఁ జచ్చెద రా హయారిబలె, నేకంజాత్మికిన్ శక్యమా.

క. మాపా టిట్టిది యని నీ
కేపాటం జెప్పనేర్తు మేడుగడయు లే
కాపదలకుఁ బ్రాపై దు
ష్ప్రాపంబగు నడవి నిడుమ పడఁగావలసెన్. ౯౨౯

క. మును మహిషుఁ జంపి పిమ్మట
"ననయులు మిము బాధ పెట్టునప్పుడు నన్నున్

మనమునఁ దలఁపుఁడు కార్యం
బును దీర్చెద " నన్నమాట పొల్లగు నంబా ! ౫౨౬

వ. శుంభనిశుంభు లట్లుండ రక్తబీజచండముండు లను వారు గడు మొఱకులై వారికి బాసటగా నున్నవారలు. వేయేల నష్టదిక్పాల కులును నిప్పుడు రక్కసులకా నెఱుంగుము. ౫౨౭

క. అనదలమై నీపాదం
బునఁ బడు మముఁ గరుణఁజూచి పొగరుమిగులు న
ద్దనుజులఁ బరిమార్పక యు
న్నను నిటు లెన్నాళ్లు వనమునం బడుదు మిఁకన్. ౫౨౮

—* దేవి శుంభ నిశుంభుల పురమ్మున కరుగుట *—

వ. ఇట్లు మాటిమాటికి సన్నుతించి వనటంబడు నమరులయెడఁ గరుణ గలిగి యప్పార్వతి తన శరీరమ్మునుండి యిచ్ఛామాత్రమ్మునఁ గౌశికి యను నొక శక్తిం బుట్టించిన నయ్యంబిక నీలవర్ణ యగు కతనఁ గాళిక యనియుఁ గాళరాత్రి యనియుం బరఁగి మహాఘోరాకారంబు గలిగి సర్వకామప్రదయై చెలువారె ; నప్పరాంబయు సర్వభూషణభూషితంబగు రూపమ్మునఁ బరిఢవిల్లుచు నమరుల కానంద సంధాయినియై యిట్లనియె. ౫౨౯

ఉ. శుంభనిశుంభులన్ దివిజసూదనులం బరిమార్చి సంపదా
రంభము మీ కొనర్తుఁ దలరం బని లే దిఁక నాకులార ! దు
ర్దంభమునన్ జగమ్ముల నదల్చెడి దుష్టులయార్తిఁ జేసి వి
శ్వంభర కింత పుట్టెనె యపాయము బ్రహ్మవరంబు పెంపునన్.

వ. అని యభయంబిచ్చి జగదంబ స్వాంశసంభవయగు కాళిక దనకుఁ బార్శ్వవర్తినిఁగా సింగంబు నధిష్ఠించి శత్రుపురంబున కుద్ది విడిఁ జని యుపాంతోపవనమ్మున విడిసి, ౫౩౧

చ. అమరులు మోదమందఁగ మృగావళి మత్తిలఁ బక్షిబృందముల్
గుమిగొని యాలకింపఁగఁ జిగుళ్ళుగురింప జగంబు మోహవా
ర్ధి మునిఁగి దొప్పదోఁగఁ గడుఁ డియ్యదనమ్మున సొంపు పెంపు నొ
క్కమొగిన యంకురింప మృదుగాన మొనర్చె ననేకభంగులన్.

వ. పదంపడి యెడనెడ నుపవనమ్ములఁ గ్రీడార్థంబు గ్రుమ్మరు చండ
ముండు లిరువురును దద్గానరసంబు కర్ణపేయం బగుటఁ గొంతవడి
నాలించి దాదవ్వుల నిలిచి త్రిజగన్మనోహారిణి యగు నంబి
కను దత్సమీపవర్తిని యగు కాళికను గాంచి పెచ్చుపెరిఁగెడి
యచ్చెరువునఁ బురి కరిగి శుంభుంగాంచి మ్రొక్కి యిట్లనిరి.

ఉ. ఎక్కడనుండియో యొక మృగేక్షణ సింగము నెక్కివచ్చె న
మ్మక్క యనన్ వశం బగునె యచ్చెలువంబు వచింప నట్టి బల్
చక్కరబొమ్మ ముజ్జగములన్ గనఁగా వినఁగా నెఱుంగ మా
టక్కరి గానవిద్య నొకటందగుఁ దక్కిన వట్టె యుండఁగన్.

క. మన యుద్యానమ్మున న
వ్వనితారత్నమ్ము గాన వైఖరుల దనం
తన మృగముల మెచ్చించుచుఁ
దన కొక చెలి తోడుగాఁగఁ దనరెడివింటే. ౫౩౫

వ. వెయ్యేల ఘుటిక్యాలికారత్నం బెవ్వతెయ్యో కల దెఱుం గెటింగి
తోడికొని వచ్చి భార్యగాఁ గైకొని సుఖింపు మింతకన్న నీ
సంసారమ్మున సౌఖ్యం బొం డుండునే యని వెండియు, ౫౩౬

మ. సరసైరావత పారిజాతములునున్ సప్తాస్యమా నశ్వ ముం
బరయానోచితమా విమానము సురస్వామిన్ విద్రిచ్చించి నీ

పరముం జేసితి వట్టి బల్మిగల సంపత్కామతఁ మేల్మి పొం
పిరివోవం జనునీకు నీయబల నేవేరిం గొనం బోలదే. ౹౹౩౭

చ. వరుణునిఛత్రి మీవు గొని పాశము తమ్మునికిచ్చి తద్ధనే
శ్వరునిధి చూడకో ల్గొలిపి సాగర మిచ్చిన నిత్యకాంతివి
స్ఫురదురుపుష్పమాలయు నపూర్వపురత్నములఁ గ్రహించి ని
త్యరుచి వెలుంగు నీకిదిగదా! తగు నెచ్చెలి యెన్నిభంగులఁ.

గీ. డంబు మీఱెడి యమునిదండంబు మృత్యు
శక్తియుఁ బరాక్రమమ్మున సంగ్రహించి
కామధేనువుపాల్గ్రోలఁగల యదృష్ట
వంతునకు నిట్టి కాంతతో వలదె పొందు. ౹౹౩౮

గీ. స్వర్గ మర్త్యాది నిఖిలభువనములందుఁ
గలుగు నిఖిలరత్నమ్ముల బలిమిఁగొనిన
యప్సరఃకాముకునకు నీ కమర వలదె
యట్టి రత్నముతోడి పొం దెట్టులేని. ౹౹౪౦

క. నీగృహమునఁ గలరత్నము
లీగజగామినికిఁ దక్కనేనియు రత్న
శ్రీ గొఱఁత చెందు నీతరు
ణీగణరత్నంబు దాని నెగడించుఁజుమీ. ౹౹౪౧

వ. అని కైపెక్కించిన నమ్మదోన్మత్తుండు సమ్మతించి కెలననున్న
సుగ్రీవుం డనువానిం బిలిచి యిట్లనియె. ౹౹౪౨

గీ. దూతవై వేగమిప్పు డత్తొయ్యలికడ
కేగి కార్యంబు పొసఁగించి రాఁగఁదగుదు

వాద్యుపాయద్వయంబ యర్థాంబు దీని
కండ్రు శృంగారరసవిదు లగు రసికులు. ౧౮౩

ఉ. సామము దానముల్ విడిచి చయ్యనఁ గొందఱు భేద మిట్టిచోఁ
గాముకు లాచరింతు రది కర్జముగాదు రసంబు భంగరూ
పామయదూషితంబగు నహంకృతి దండమయేనిఁ దద్రిసం
బేమియుఁ గానరాక మొదలే చెడుఁగాన ద్వయంబు నింద్యమౌ.

క. రా నిచ్చ గలుగు కామిని
యే నది నేరుపున మదికి నింపు గొలిపినన్
దానమున సామమున నొగి
దానై చనుదేరకున్న తక్కినవేలా. ౧౮౧

వ. అని యనిపిన సుగ్రీవుండు సని సింగంబు నెక్కి సర్వ శృంగా రం
బుగ నొప్పు నజ్జగదంబం గని మ్రొక్కి వినయమ్మున నిట్లనియె.

చ. త్రిదశుల జీరికిం గొనక దేవపదమ్మును గొన్న శత్రుదు
ర్మదపరిహారి శుంభుని స్మరప్రతిమాను నెఱింగి యుండుదే
మదవతి ! ద్యూత నే నతని మన్ననకుం దగువాఁడ ; నీదు మే
ల్విధమును విన్కిఁజేసి స్మరపీడితుఁడై ననుఁ బంపె నియ్యెడన్.

వ. అతండు నీయెడల మోహమ్మునతన వినతుండై పలికినపలుకులు
వినుము. ౧౮౮

చ. అమలినగాత్రి ! దేవతల నందఱ గెల్చితి సర్వయజ్ఞభా
గములుమదీయముల్ త్రిదశఘస్మరుఁ డన్బిరు దొంది నాకలో
కమునఁ గలట్టి రత్నములఁ గైకొని ముజ్జగమెల్లఁ జేతిలో
నమరఁగ రాజ్యముల్ వలయున ట్లొనరించుచు నుంటి నుద్ధతిన్.

గీ. ఇట్టి ధట్టుఁడనైన నాకిగురుఁబోఁడి
నీదుచెలువంబు వీనుల నిండి కాము
బారి కోర్చుట పెద్దయు భార మయ్యె
నెరవుచేయక పెర్మి నీవరయ వలయు. ౫౫౦

ఉ. దాసుఁడ నైతి నీమది ముదం బెటులొందు నటుల్ చరింతు నా
సాసలఁ జిక్కుచున్ననను నాఱడి పెట్టక యేలుకొమ్ము నా
వాసి యెఱుంగు మెవ్వరికి వధ్యుఁడగాను నను ర్వరించి నీ
కేసతు లీడులేక చరియింపుము నిత్యసువాసినీగతిన్. ౫౫౧

వ. అతని పల్కుల చందంబియ్యది దీనంగల సారం బరసి ప్రత్యుత్త
రం బొసంగి త్రిలోకీరాజ్యంబు నీవమై యెల్లదానవుల నేలికొనం
దగదే! నావుడు జగదంబ మందహాసం బిగురొత్త నిట్లనియె.

ఉ. జేతగ దాతగా సుగుణసింధునిఁ గాఁగ నఖండలక్షణో
పేతునిఁగాఁగ సుందరుఁగ నే వినియుంటిని శుంభునిన్ యశ
స్ఫీతుఁ దదీయసోదరు నశేష జగమ్ములయందు ; వానిపైఁ
బ్రీతి జనించియే యిటకుఁ బేర్మిమెయిన్ జనుదెంచితింజుమీ.

మ. సురయక్షాసురమానవప్రముఖులం జూడంగఁ జూడంగ నె
ల్లరు మీరాజున కోడియుంటి మని రల్పప్రజ్ఞులం బొందరా
మి రసజ్ఞోత్తరుఁడైన మీ విభునిపై మేల్పట్టి నారాక ; బం
గరు రంగారెడి రత్న మెవ్విధమునం గాంక్షింపదే మేల్మికై.

క. అదిగాన మీవిభుని బలె
మదినను మన్నించి నాదుమాట లతని నె
మ్మది కెక్క నొంటిపాటునఁ
గదిసి వచింపు మిట్టులైనఁ గార్యము పొసఁగున్. ౫౫౫

ఉ. సుందరు లందు మేల్మిగల సుందరుఁ డంచు వదాన్యుఁ డంచు మ
ధ్యందినసీరజాప్తకిరణావళిఁ గాదనఁ జాలు తేజ మిం
పొందెడివాఁ డటంచు నిను నోపినవట్టను బూని వింటి నీ
యందు మనమ్ము పుట్టి వశనై చనుదెంచితి నేమి చేసెదో.

వ. ఇంక నొక్కకొఱంత గలదు వినుమది యెట్లంటేని మున్ను కొం
డికనాఁడు సఖీజనసమక్షమ్మున నొకవ్రతంబు పూనితి. ౫౫౭

క. బలమున నాతో నెవ్వఁడు
గలనం గాలూఁది నాదుగర్వ ముడుపు న
య్యలఘునిఁ బతిగాఁ గైకొన
దలఁతు నన౯ సఖులు నగిరి తద్దయు నన్ను౯. ౫౫౮

క. అది మొదలు నేఁడు తుద నా
మద మడఁచెడి వీరవరుఁ డమరముఖ్యులయం
దొదవఁడు నీ విఁక నిది ప
న్నిదముగ ననుఁ గొనుము ధైర్యనిధి వగుకతన౯. ౫౫౯

వ. ఇట్లంటేనని మీ ప్రభువుతో నేకాంతమ్మునఁ బలికి యెత్తెఱంగున
నైనఁ గార్యసిద్ధిం బొనర్పు మనవుడు సుగ్రీవుండు విస్మయా
విష్టుండై యయ్యంబ కిట్లనియె. ౫౬౦

ఉ. చందనగంధి! యిట్లనుట సాహసమాత్రము స్త్రీస్వభావ మీ
చందము గాక, యెల్ల దివిషద్గణ మెవ్వనిపేరు విన్న నా
క్రందన మాచరించుఁ గడుఁ గావలుఁ డట్టి యఖండు శుంభు నీ
వెందు జయింపనేర్తె! చటులేక్షణపాతము చేతఁ దక్కన౯.

వ. కావున స్త్రీస్వభావమ్మునం దొడరు మూర్ఖత డిందుపఱచి
శుంభు నొండె నిశుంభునొండెఁ బతిగాఁగొని సుఖం బుండు మది

యునుంగాక శృంగారం బెల్లరకును మెత్తదనమ్మున ననుభావ్య మ్మగాని వేఱొండు విధమ్మునఁ బదనుపడదు. నావచనమ్ము లనాదరించి గర్వించితేని యతండు క్రుద్ధుండై దుర్మదులగు భృత్యులం బిలిచి నిన్నుం బలాత్కారమ్మునఁ దన సన్నిధికి రప్పించికొననేర్చు నట్లు కేశాకర్షణాదికమ్మునకు లోనై సిగ్గఱ నుంకించుటది నీబోఁటి బోటికిం దగు పాడియే ! విను మదియునుంగాక,

క. రతిసుఖ మెక్కడ, యుద్ధా
దృతి యెక్కడ, మిగులదవ్వు ! తెలిసి యిరువురం
దతివరో ! యొక్కనిఁ గైకొని
మితిమీఱు సుఖములఁ దవిలి మెలఁగుట తగదే. ౫౬౩

వ. నావుడు జగదంబ యిట్లను, ౫౬౪

క. శుంభనిశుంభులు బలియురు
నంభోధిగభీరులంచు నరయుదు నీవుం
దంభ మెఱుంగక తెలిపెడి
గంభీరత గలవు వ్రతము గాదన దగునే. ౫౬౫

ఉ. సంగరరంగమందు ననుఁ జక్క నెదిర్చి జయించి నాదు పా
ణిం గొను టొప్పు నా ప్రతిన నిక్కమకాక యలంతిఁబోవ ది
బ్బంగి వచించి యొప్పమిని బంధుసమేతముగా రసాతలం
బుం గయికోలు మే లనుచుఁ బూనికఁదెల్పుము మీ యధీశుతో. ౫౬౬

వ. మచ్ఛ్లాఘాతమ్మునకుం బెగడొందు కాతరునిం గొన నేనంత బేలనే ! సంగరమ్మున కియ్యకొనని నాఁడు స్వర్గమ్మును మర్త్యమ్మును ద్యజియించు టొప్పు నీవు భరంబని యెంచక నాపలికిన చందంబు సత్యంబుగా వచియింపుము. ౫౬౭

క. తనరాజు నెడల శాత్రవ
జనులయెడల సత్యరీతి జనదాటక యుం
డినదియ దూతల ధర్మం
బని యెఱిఁగి యథార్థ తత్పరాత్ముఁడ వగుమీ ౯౮

వ. అని యిట్లు నీతియుక్తమ్మును బ్రగల్భమ్మును సహేతుకమ్మును గా నుపన్యసించిన నయ్యంబిక వచనమ్ముల కుత్తరం బీ నేరక సుగ్రీవుండు విస్మయం బంది తన రాజుసన్నిధి కరిగి నమస్కరించి యిట్లనియె. ౯౯

గీ. సత్యము ప్రియంబు నైనవచనము దొరకక
దని యసత్యంపుఁ బలుకు నా కనభిమతము
గావునఁ బ్రియంబు గాకుండుఁగాక నిజము
పల్కెదఁ గృపానుగతి విన వలయు నధిప. ౧౦౦

వ. అక్కన్నియ నివాసం బెద్దియో యెయ్యెడ నుండి యియ్యెడ కరుదెంచెనో నిక్కమ్ముగఁ దెలియదు ; తెలిసినంతవట్టును వివరించెద. ౧౦౧

క. మదమున సంగరమున ని
న్నెదిరింపఁ దలంచియున్న దెంతయు గర్వా
స్పద మక్కమలానన నె
మ్మది యాపె వచించినట్టి మాటలు వినుమీ. ౧౦౨

వ. బాల్యమ్మున సఖీసమక్షమ్మున సంగరరంగమ్మున నెవ్వఁడు నా కెదురై పోర జయించు నవ్వానిం బతిగాఁ గైకొందుఁగాక యని వ్రతంబు పూనినదఁట ! అయ్యది యవంధ్యమ్ముగాఁ దుదముట్టింప నెమకట్టి యున్నదాన ననియు మీరాజు లందులకు సమ్మతించి

యట్లొనరింప వరింతుననియు వచించి నన్నుఁ బుత్తెంచె దేవర
కెయ్యది హితం బట్లొనరింపఁ దగునని వెండియు, ౧౭౩

క. సింగంబు వాహనం బొక
యంగన బోసటయుఁ గాఁ దనంతన కడు ను
ప్పొంగుచు నెంతయు నీతో
సంగర మాసించి యుండె సఖి రాజేంద్రా! ౧౭౪

వ. నావుడు శుంభుం డనుజుని దిక్కు మొగంబై, ౧౭౫

గీ. అబల యొక్కతె తోడఁట! యతివయంట
పోరుటకు వచ్చెనఁట! నీవు పోయి వత్తొ,
యేఁ జనుట యొప్పొ, వచియింపు మేది మేలొ?
నావుడు నిశుంభుఁ డిట్లను నయము మెఱయ. ౧౭౬

గీ. ఈవు చన నేల నే నట కేగ నేల
ధూమ్రలోచనుఁ బంపు మత్తోయజాక్షి
నిటకు నిర్జించి తెచ్చు నొక్కింతతడవు
కాకమున్న వరించు నక్కాంత నిన్నుఁ. ౧౭౭

వ. పిదప వివాహం బొనరించుకొని సుఖం బుండు మనుడు శుంభుండు
వల్లె యని ధూమ్రలోచనుం బిలిచి యిట్లనియె. ౧౭౮

గీ. ఎవ్వఁ డడ్డంబు సొచ్చిన నీడఁ బొక
పట్టి కలఁగించి తత్పార్శ్వవర్తిని యగు
నంగనం జంపి చంచలాపాంగి నత్త
లోదరిని దెమ్ము నాకు నామోద మిమ్ము. ౧౭౯

క. మృదుమార్గణములు నీపై
నది విడిచినఁ గనలి సునిశితాస్త్రమ్ములఁ గొ

ట్టైదుసూ ! యొడ లెఱుఁగక య
మ్మదవతి నా కెంతయేని మాన్యయగుఁ జుమీ. గీ॥౧౦

క. దానికిఁ దోడగువారల
పై నెన రించుకయు లేక పరిమార్పుము నా
ప్రాణంబు ప్రాణమగు న
మ్మానినిఁ గాపాడి యిట కమరఁ దేరనగున్. గీ॥౧౧

వ. నావుడు సేనాసహితుండై ధూమ్రలోచనుం డరిగి దానవ్వల నయ్యంబం గాంచి వినయపురస్సరంబుగా నమస్కరించి మృదు మధురములగు వచనమ్ముల నిట్లనియె. గీ॥౧౨

చ. వినుము మృగాక్షి ! కామశరవేదన కోర్వక మావిభుండు దూ
త ననిపె వాఁడునున్ సరసతన్ గడు సామవిధంబు నీయెడం
జొనిపిన నీవు వానియెడఁ జొక్కపు వ్యంగ్యపు రంగులీనఁ జె
ప్పినవచనంబులెల్ల మది వేఱుగ నెంచె రసం బెఱుంగమిన్.

వ. పిమ్మట వాఁడు మారాజునకుఁ దనయెఱింగిన విధమ్మునఁ జెప్పిన నతండు చింతాతురుండై ననుం బనిచె నీయందుఁ బ్రేమం బగ్గలం బగుకతన నీ వట్లాడుటకు సహింపక విరహాతురుఁడై హృదయ మొక్కింత చేసికొని వందురుచున్నవాఁడు "నన్నెవ్వాఁడు సంగ్రామమ్మున జయించు నవ్వాని వరియించెద" ననునీపలుకుల కర్థం బిట్లుగా యోజించె నెట్లంటేని, గీ॥౧౩

గీ. సంగరం బన రెండు దెఱంగు లందొ
కండు రతిజంబు తక్కొకండు బవర
మొకటి సుఖమిచ్చుఁ దక్కిన దొకటి దుఃఖ
దాయి శత్రుపురస్కృతత్వంబు కలిమి. గీ॥౧౪

వ. అం దనంగసంగరంబున నన్నెవ్వఁడు జయించు నవ్వాని వరియింతు ననుట గాకేమి యని కృతనిశ్చయుండై సకలార్థవేది నగు నన్ను మరల ననిపె. గీ౭౬

క. నీ చాతుర్యమ్మును విని
నీ చనవుం గోరు శుంభునిం బొందుము నీ
ధీచాకచక్యమునకుఁ
వాచానై పుణికి సార్థవై భవ మొదవన్. గీ౭౭

వ. కామశాస్త్రవేత్తయగు మారాజు నీ హావమ్ములకుం దగు భావమ్ము లాచరించి ని న్నెక్కటి జయింప నేర్చు నియ్యెడ నిక్కాళికయ సాక్షిణి యగు నని వెండియు, గీ౭౮

చ. నిను సుఖశయ్యపై శ్రమ జనింపఁ గరంచి నఖక్షతమ్ములన్
దనువున రక్తిమన్ గొలిపి దంతముల న్ననుమోవి నొక్కి గా
సి నొనరఁ జేసి చెమ్మటలు చిమ్మఁగ బేర్మిఁ గలంచుమావిభుం
గనుఁగొన నేగుదె మ్మతఁడు గాంచినతోడన నీకు దాసుఁడౌ.

ఆ. వె. సురతయోగ్యమైన సొలపును మెలపును
బొలుపు గలిగి చెలఁగు పూవుఁబోఁడి
కకట! నీకు సునిశితాస్త్రపరంపర
నైపఁ బాడియగునె చంచలాక్షి. గీ౮౦

—* కాళిక ధూమ్రలోచనునితో యుద్ధముచేయుట. *—

వ. కావున హితంబును రుచ్యంబునునగు నాపలుకు విశ్వసింపు మెవ్విధంబునను సుఖం బీఁజాలని పెనఁకువకుం బోరకుము నావు డుఁ గోపాటోపంబు దీపింపఁ గాళిక వాని కిట్లనియె. గీ౮౧.

క. రోషం బుడిగి వృథా శై
లూషునిగతి బెట్టిదమ్ములుం గొంటగాముల్
భాషింతు వేర, మత్త! వి
దూషక! పోరిత మొనర్పఁ దొడరుము కడఁకన్. గీ-౨

క. విను నిన్నుం బంపిన శుం
భనిశుంభులఁ దునిమి యమునిభవనమ్మునకుం
బనుపఁగ నున్నది మాదే
వి నెదిరిపోరాడు మింత వేరము లేదే. గీ-౩

చ. అనుచితరీతి మాజనని కాకలుషాత్ముల కేటిపెండ్లి! న
వ్వనగునుగాక, నక్కపయి వాంఛ జనించునె సింహి కక్కటా!
యను వగునేమొకో, కరిణి కారయ గర్దభసంగ! మెందు నే
నిని గవయంబు నొందఁ జనునే! మొద వంగజతాపసంగతిన్.

వ. కావున దురాత్మా! నీ దురాలాపమ్ముల కంబిక సైఁచినను నేను సహింపఁజెడిదానఁగాను జీవింప వలతేని వైళంబ చని యాదుర్మదులం గలసి పాతాళమ్మున కరుగుము వేఱొండు బ్రతుకుతెఱవు నీకుం జొప్పడదనప్పుడు ధూమ్రలోచనుండు తామ్రలోచనుండై.

మ. కలహంబన్నను గాలుఁ ద్రవ్వెదవె! నీ గర్వం బడంపంగ నే
వలఁతిం గాకయ యింతవట్టు నిటు సంభాషింతునే! కాళి! కే
వలము న్నిన్ను వధించి సింగమును జావన్మొత్తి యబ్బాలికన్
బలిమిం గైకొని యేగి మా విభునకుం బట్టంబు గట్టించెదన్.

క. రసభంగభయమ్మునఁ గా
దె సహించితి నింతవట్టుఁ దెలియక నాతో

డ సమర మొనరింపఁగఁ దా
మస మూనెద విపుడ నిన్ను మాయింతుఁ దగన్.

క. నావుడుఁ గాళిక కోపం
బావిర్భవ మంద నిట్టు " లనదపగిది నే
లా, వెఱపుమాలుకూఁతలు ?
కావల మడఁగింతుఁ బోరఁగాఁ దొడరు" మనన్. గీ-రా

ఉ. ఆ పలుకుల్ శితాస్త్రములయట్టులు కర్ణములం బగుల్ప న
ప్పాపపురక్కసుం డడరి బాణపరంపరల న్నిగుడ్ప ను
ద్దీపితకోప కాళికయుఁ దీవ్రశరమ్ముల వానిఁ ద్రుంచి దు
ర్లేపుని ధూమ్రలోచను ' బలే ' యని మెచ్చఁగఁగొట్టె నిర్జరుల్.

ఆ. వె. అంతఁ బోక వాని యరదమ్ము నుగ్గుగాఁ
జేసె సింహనాదభాసురముగ
నసుర వేఱుతేరి నాయిత మొనరించి
కాండవృష్టి గురిసెఁ గాళిమీఁద. ౬౦౦

ఉ. ఆశినితాస్త్రసంతతుల నన్నిటి నంతరమంద త్రుంచి బి
ట్టూనిన కోపవేగమున నొక్కటఁ బెక్కులు గాఁగ నస్త్రసం
తానము గుమ్మరింప నొకతండముగాఁ బడి రెల్ల రక్కసుల్
వాని రథంబు రథ్యములు వమ్ముగ సూతునిఁ దున్మి వ్రేల్మిడిన్.

మ. ధనువున్ భగ్నముఁ జేసి దేవతలు మోదంబంద శంఖంబుఁ బ
ట్టినఁ దన్నాదమునం దిశల్ పగులుమార్మ్రోల్ మాఱుఘోషించె న
ద్దనుజుండున్ బరిఘుంబు దాల్చి పటువాగ్దంభమ్మునన్ ' బింగలో
చన ! యోకుత్సితరూప ! నిన్నిపుడ పంచత్వంబు నొందించెదన్'

శా. హుంకారమ్మున నిట్లు ప్రేలుచు జగం బల్లాడ నుంకించి యే
కొంకున్ లేక తటాలునన్ విడువ దిక్కుల్ వ్రయ్య నక్కాళి దా
హుంకారారవమాత్ర భగ్నముగ నుద్యోగించినన్ దైత్యు లే
వంక న్నిల్వక పాఱిరంత సుమముల్ వర్షించి రాదిత్యులున్.

చ. నరవర! ధూమ్రలోచనుఁ డనాథగతి న్నిజసైన్యదానవో
త్కరసహితమ్ముగాఁ బడె నఖండగతిం జెలరేఁగి మాంస మా
దరమున నాహరింప వడిఁ దద్దయు మూఁగిన కాకగృధ్రజా
తిరవములున్ శివారవము దెప్పరమయ్యె రణాంగనమ్మునన్.

వ. తత్సైన్యమ్ము నందలి యశ్వమ్ములయు ఖరమ్ములయు వారణమ్ము
లయుఁ బలలంబు మెక్కి క్రైపెక్కి భూతప్రేతంబులు నాట్యంబు
లొనర్ప దొడంగె నంత నయ్యోవమునకు సైఁపక యంబిక దాద
వ్వగాఁజని. ౬౦౫

ఉ. బిట్టుగఁ జిందముం దిశలు బీఁటలు వాఱఁగ నొత్త శుంభుఁ డ
ట్టెట్టిద మారవమ్ము విని పెర్చినశంక గృహమ్మువీడి యే
మిట్టి విరుద్ధ మంచు నెద నెంచెడిలోనన యేగి సైన్యముల్
గిట్టినవార్త కొంతవడికిన్ హతశేషులు మ్రొక్కి చెప్పినన్.

చ. తెగిన కరమ్ములున్ సగముద్రెళ్ళిన మేనులు నింతలింతలై
పగిలిన మూర్ధముల్ వడిన పార్శ్వము లొక్కెడి నల్ల వట్టులై
మగఁటిమి కోల్పాటించి తనమానము దూలఁగ నేడ్చు సేన నె
వ్వగఁగని శుంభుఁ డిట్టులను వక్త్రమునన్ వెనుఁబాటు దొట్రిలన్.

గీ. ధూమ్రలోచనుఁడేమాయెఁ దోయజాక్షి
యేల రాదొక్కొ మన సైన్యమేష కేగ

భగ్నులై మీర లీగతి బడల నేల
మందమతులార ! వివరించి మాకుఁ జెప్పుఁడ. ౬౦౮

క. కడు బెట్టిదముగ గిరులును
బుడమియు నాకసము సంద్రములు గ్రక్కదలన్
దొడరఁగ శంఖరవ మ్మొ
క్కఁడు వినఁబడు దాని కేమి కతము నుడువుఁడా !

వ. నావుడు రక్కసులు "చెప్పెడి దేమి ? యకాలిక ధూళిగా మన
సైన్యమ్ముల తూళ్ళడంచి ధూమ్రలోచను గిట్టించె. ౬౧౦

క. సురహర్షదాయకంబు న
సురశోకవిధాయి యగుచుఁ జొప్పడు నాభీ
కరశంఖరావ మెఱుఁగుము
పరదేవీరచిత మనుచు భవ్యవిచారా. ౬౧౧

క. మనధూమ్రలోచనుఁడుఁ సై
న్యనికాయముతోడఁ ద్రెళ్ళ నమరులు మోద
మ్మునఁ బుష్పవృష్టి గురిసిరి
మనమున భయ మంది మేము మగిడితి మిటకున్.

క. ఏకాకినియై రూక్షా
లోకమ్ముల నాల్గు దిక్కులున్ బిట్టుగ నా
లోకించుచు సింగముపై
నాకామిని వెలయుచున్న దాహవకాంక్షన్. ౬౧౩

వ. ఇంక సంగరంబొండె సంధియొండెఁ గర్తవ్యంపు తెఱం గెఱింగి
వర్తింపు మయ్యంగనకుఁ దోడుగా నెవ్వరును లేకున్నను సురలు
బాసటగాఁ బ్రహులగ్గుదురో కో ! యని శంకింతు నయ్యాహవసమయ

మ్మైన హరిహరులును, లోకపాలురును, దక్కినయమురులును,
గంధర్వులును, దానవ్వుల నంబరంబునుండి సుమాళమ్మైగ
నీక్షించుచున్నవారని వెండియు. ౬౧౪

గీ. అత్తలోదరిసాహసం బమ్మృగాక్షి
యుక్కునగ్గజగమన మహోద్యమంబు
గనఁగ సురలను గిరలను గొనక తాన
మనలఁ బరిమార్చు నని తోఁచె మాకు నధిప. ౬౧౫

చ. మన మొకలెక్కయే? వినుమ మానుషశక్తి నెసంగు నజ్జగ
జ్జనని చరాచరమ్ములు వెసం బొడి చేసి యొకింతలోన స
ల్పనయినఁ జాలు నీకెటులు పొల్పడు నట్లొనరింపు మింత వ
ట్టును నిజ మింక నీమతిపటుత్వము, దైవము, మాయదృష్టముల్."

వ. నావుడు శుంభుఁడు నిశుంభుదిక్కు మొగంబై. ౬౧౬

క. మనధూమ్రిలోచనుని సై
న్యనికాయముతోడ యమపురాతిథిగాఁ బె
ల్చనఁ గాళి చేసె నాశం
ఖనినాదం బప్పురాంబ గావించెఁజుమీ. ౬౧౭

గీ. తృణము వజ్రమ్ము వజ్రమ్ము తృణము బలవి
హీనుఁడు బలాఢ్యుఁ డిట్టిండు నట్టిఁడగుట
కాలగతి కారణమ్మగుఁ గలుగు నకట!
జ్ఞానులకును దుర్జ్ఞేయముల్ కాలగతులు. ౬౧౮

గీ. ఎట్టులైనను నయ్యంబ నెనయుటొప్పు?
కాక యీనెప మూని రక్కసులఁ జక్కఁ

జేయవచ్చునో ? మన మేమి చేయఁదగునో ?
యెల్లవిధముల యోజించి యె . . .

క. కొండికవయ్యును మతి నా
ఖండలగురు సన్నిభుఁడవు కాల్కొలఁదిగ నీ
మండలము విడిచి పాఱుట
భండనమునకన్న లగ్గ పరికింపు తగన్. ౬౨౧

వ. ఇట్టియెడ తెగని సంకటమ్ముల నీకుమిక్కిలి బుద్ధిమంతులు లేరు
చక్కఁగ నొకదిక్కు విచారించి గ్రక్కున నుడువు మనుడు
నిశుంభుం డన్న కిట్లను. ౬౨౨

క. మన కేటి పలాయన మేఁ
బనివినియెద నిపుడ దైత్యబలములతో న
వ్వనజాక్షి గెల్చి తెచ్చెద
ననఘా ! దైవంబుకతన నట్టిట్లైనన్. ౬౨౩

వ. మన్మరణమ్మునకు శోకింపక తగుగతి యోజించి యప్పుడు నీబుద్ధి
కొలఁది నొనరింపు మనవుడు శుంభుం డియ్యకొనక పలాయనంబు
కన్న భండనంబ వరం బయ్యేనేని, ౬౨౪

క. భండనకోవిదుల మహో
ద్దండులఁ బంపెదను బెక్కుదళములు వేగ్రఁగై
గండు మిగిలి కొలువఁగ మన
చండుని ముండునిని నీవు చనఁబోకు మొగిన్. ౬౨౫

గీ. చండముండులు మిగులఁ బ్రచండు లుద్ద
విడి నరిగి యత్తలోదరి నొడిచి తెత్తు

ఱంత నిక్కము నీకుఁ బోనేల యుడుగు
మెవఁడు శశమునకై కరి నిచ్చునయ్య! ౬౯౬

వ. అని శుంభు నరికట్టి చండముండులం గాంచి, ౬౯౭

ఆ. వె. సిగ్గు లేక యొక్క సింగపుఁగోదమపై
నెక్కి యుక్కు మిగిలి యొక్కటిగ ర
ణంబొనర్ప నున్న యంబికాసహచరిఁ
గాళిఁ ద్రుంపఁ జనుఁడు కడఁక మీఱు. ౬౯౮

వ. పింగళాక్షి యగు నవ్వెంగలి కాళి ముంగలనై బిభీషికల్ చూపినఁ దలరక చెలరేఁగి తల దఱిగి పిదప నయ్యంబికం గొని వచ్చునది, యొడంబడక బెడిదమ్ము లాడినఁ గడుకొని యుడిగించునది, యని యానతిచ్చినఁ జండముండులును, ౬౯౯

క. బడబాగ్ని పిడికిలింతుమొ
పుడమియు నాకసము దెసలు భూధ్రమ్ములు స
జ్జడనిధు లొక్కమ్మడి స
ట్టడవిం గల్పుదుమొ యనుచు నార్పులు సెలఁగన్.

వ. సైన్యసమేతమ్ముగాఁ గట్టాయితంబై యరిగి ముంగల దేవహిత కారిణి యగు నజ్జగదంబం గాంచి సామపూర్వకమ్ముగా నిట్లనిరి.

—* చండముండాసురుల యుద్ధము *—

చ. సురవిజయమ్మునం బొదలు శుంభనిశుంభుల బాహుగర్వదు
ర్భరత నెఱుంగవే యబల! పైకొన నెంచెద వేరికేనియుఁ
దరమె, దురమ్ములో నెదిరి దర్ప మొనర్పఁగ వెట్టివోక్కో? యి
త్తరుణి సహాయఁగాఁగొని వృథాగతిఁ బోరికి మీఱఁబోలునే.

క. తగుఁ దగ దని మతి చెప్పఁగ
నగుపురుషుం డేని యొక్కయుంగన రేనిన్
మగువరో ! లేరొకో నిను దే
వగణము పురికొల్పు, దైవవశ మట్లుండెన్. ౬౩౩

మ. విను మష్టాదశబాహువుల్ గలవు న న్వేధింతు రే యొద్దలం
చును మిత్త్రైకకు శుంభునేడ్తె అకు నీశుండో, సురేంద్రుండో ! నీ
ఘనగర్వమ్మును బాహుసంపదయు నీకాండమ్ములు న్నిహిత
మ్మునకు న్నొక్కి వచించు నాపలుకు లంభోజాక్షి ! పాటింపుమా.

ఉ. ఓ వనజాక్షి ! శుంభుఁ డన నొక్కనిపాటియె యెవ్వఁ డేని వై
రావణపుష్కరమ్మును దురమ్మున దుంచుట వింటిమే ! వృథా
కావలులై సురల్ తనకు గర్వనివర్తకుఁడైన శుంభుపై
నీ వెడఁగుందనంబు గని నిం బురికొల్పిరి యీసుపెంపునన్. ౬౩౫

క. నీవేమియైననున్ భర,
మేవారికి ? స్వార్థపరుల కెంతనుఁ బరకా
ర్యావేక్షణ ముండునె ? యిక
నావాక్యము లిచ్చగించి నడువుము పురికిన్. ౬౩౬

ఉ. సుందరులందు సుందరుఁడు శూరులయందును శూరుఁ డెంతకే
నిందగువాఁడు నేర్పరి మనీషి స్మరాగమవేది మావిభుం
డందఱువంటివాఁడె ? జగదాఢ్యుఁడు నీకుఁ దదీయసంగమా
నందముకన్న వేఱొకటి నాకుఁ గనంబడ దెన్ని భంగులన్.

గీ. హిత మిచ్చగించి దుఃఖ
స్థితికిం జొరఁబడక నీ వశేషజగము లు

న్నతి నేలఁగ మా శుంభునిఁ
బతిగాఁ గొను మింతకన్న భాగ్యము కలదే. ౬౩౮

ఉ. గండున నిట్లు పేర్లుడు జగత్పరిమాత్రి యజాండమెల్లయు
న్నిండఁగ నార్చి యోరి యవినీత! నయస్థితి దెల్పెదేమి! యా
ఖండలమంత్రివే మొ! కడికండలు చేసెదఁ జక్కనిల్వు నీ
చండత వాని ముండతయు సంగరరంగమునం గనంబడున్.

చ. హరిహరులం దృజించి దితిజాధము శుంభు వరింతు నేఁటి? నా
కొరుఁడు ధవుండె? యీ జగము లొక్కట నేలుదు నే ననాదినై
హరిహరులెంద, ఱెందఱు సురారులు, శుంభనిశుంభు లెంద ఱే
గిరి మునుమున్న నాయెదురఁ, గేవలమూర్ఖత మీఁదెఱుంగునే.

క. ప్రతియుగమున నీగతిఁ బం
చత భూతమ్ములకుఁ దొడరు సంరక్షింపం
గతి గలదె మీ కిపుడు సం
హృతికాలము వచ్చె యత్నమే లొనరింపన్. ౬౪౧

చ. మరణము నిక్క, మెట్లయిన మానముఁ గీర్తియు రక్షణీయ తా
శరణము లంచు నన్నులక సంగరరంగమునం దెదుర్పఁ డి
ప్పరుసున శుంభుఁడే కొలఁది! భ్రాంతియుఁగాఁదగునే నిశుంభుఁ! డె
వ్వరితర! మాజి నీలిగి దివమ్మున కేగుఁడు వీరపద్ధతిన్. ౬౪౨

ఉ. వచ్చినవట్టు రక్కసు లవారణఁ బోరుఁడు నాక మేగుఁ డు
ద్యచ్ఛతురంగసైన్యములదండడి శుంభనిశుంభు లంతలో
వచ్చియెదిర్చి చచ్చి సురవర్త్మమునన్ మిముఁ గూడికొందు రీ
మచ్చికమాటలేల శరమండలి నింపుఁడు పొద్దు వోయెడిన్.

చ. తొలితొలి నిన్ను నీయనుజుతో మడియించి సురారిసంఘుని
స్తులులయి వచ్చినట్టి యలశుంభనిశుంభుల రక్తబీజు ని
మ్ముల(గడతేర్చి వ్రేల్మిడిన మూడుజగమ్ముల దైత్యులన్న వే
రొలయక యుండ(జేయవలె నోపినవట్టును(బోరు(డేర్తురా.

వ. ఇంక వృథాలాపమ్ములాడ వలవదని పురికొల్పి ప్రేరేపిన నా
చండముండు లఖండచండిములై, ౬౮౫

శా. జ్యాటంకారము దిగ్గజశ్రుతిభిదాసంపాదకంబై నిరా
ఘాటాటోపము మిన్నుముట్ట నెదురై కాలూ(ద నయ్యంబ స్వ
ర్వాటీవాసులు మెచ్చ నొత్తె దరమప్పాటన్ రిపుల్ గుండియల్
బీ(టల్ వాటి బడల్పడన్ హరియు నాభీలధ్వనిన్ గర్జిలెన్.

ఉ. కాతరభీతిదంబును నకాతరభూతరసోత్తరంగసం
పాతము గా(గ సంగరమభంగురమై తగె(జండచండికా
శాతమహాస్త్రపాతముల సంకులమయ్యె నభోంతరంబు నీ
రీతిగ బీఱువోక యెదిరించిరి రక్కసు లొక్కపెట్టునన్. ౬౮౭

శా. అన్యోన్యప్రవిముక్తశస్త్రతతు లన్యోన్యమ్ము ఖండించుచున్
మన్యుప్రేరితులై పెనంగునెడ సామర్షుండు ముండుం డసా
మాన్యుండై తనయన్న వెన్నడి పరాంబం దొప్పదో(గించె " వీ
రన్యాయంబు బలే " యటంచు సమరారంభాతిసంరంభయై.

మ. కదళీపుష్పవిడంబినేత్రరుచి వక్త్రం బెట్టు(గా(జేయ వై
రిదవాగ్న్యాకృతియై లలాటమును నిర్భేదించి యావిర్భవిం
చె దయాదూరయు వ్యాఘ్రచర్మధర దుస్తేజస్క నాగాజినా
స్పదయై కాళిక ముండమాల్యధరయై పాశాదికోపేతయై.

వ. ఇట్లు ఖట్వాంగధారిణియు నతిభీషణయు శుష్కవాపీసమోదరయు భ్రుకుటీకుటిలేక్షణయు విస్తారజఘనయు విస్తీర్ణవక్త్రియు ఖడ్గాది సంశోభినియునై కాళరాత్ర్యపరావతారమ్మనం బోని ఘోరరూపమ్మున నావిర్భవించి జిహ్వాచాలనమ్మనం బెచ్చు పెరిఁగి, ౬౫౦

ఉ. ఓహారిసాహారిం బెనఁగుచున్న సురారులఁ బట్టి బిట్టు పూ
ర్ణాహుతిఁజేసి వక్త్రమను నగ్నిముఖమ్మున, నందుఁ గొందఱన్
బాహులఁ బిప్పిజేసి యిటుపల్వుర భక్షణఁ జేసి కాళి య
య్యాహవరంగ మొక్కమొగి నాహృతిఁజేసి పరాక్రమించుచున్.

గీ. అట్టహాసంబొనర్చి ఘంటాన్వితముల
గజఘటలఁ గేలఁ గొని వక్త్రగహ్వరమునఁ
బెట్టికొని పిండిపిండిగా బిట్టునమలు
నుష్ట్రతురగాదులకు గతి యొండు గలదె. ౬౫౧

ఉ. ఉర్వియు నాకసంబు కడియొక్కటికై యిటు లెల్ల సైన్యముం
జర్వణ మాచరింపుడును జండుఁడు ముండుఁడు నీడఁ బోక దు
ర్గర్వమదాంధులై శరపరంపరలన్ బరఁగించి యొంతయున్
ధూర్వహులై యొదిర్చి రని "దుండగు లింతటివారు లే" రనన్.

మ. ఇటు లక్కాళిక నేసియేసి యొకఁ డం "దిద్దానఁబో" మ్మంచు బల్
పటువౌ విష్ణునిచక్రముం గరమునం బాటించి బిట్టార్చి యే
యుటయున్ బాణ మొకంటఁదున్మి హతకాయుంజేసె నచ్చండుఁ డం
తట ముండుండు శితాస్త్రముల్ గురిసెఁ దద్దం గాళిపైఁ గేళిమై.

వ. ఇట్లు మూర్ఛితుండగు నన్నపాటున కోర్వక ముండుండు దలకడచుటయు, ౬౫౫

ఉ. చండిక ముండముక్తశరజాలము లోలిన తుంచివైచి బ్ర
హ్మాండము వ్రయ్యనార్చి యొకయర్ధశిలీముఖ మేసి వాని బల్
గండడఁగింప మూర్ఛవడి గ్రక్కున బ్రాలెఁ దదంతరమ్మునన్
జండుఁడు లేచి కాండములఁ జండిమఁ జూపుట మాని యుద్ధతిన్. ౬౫౮

మ. గద కేలం గొని యొంటిమై నడరి యక్కాళీభుజాగ్రంబు బి
ట్టదరం గొట్టిన బాణపాశమున నయ్యంబా మహాదేవి మం
త్రిదశన్ వానిని బద్ధుఁజేసె, మరలం దా లేచి ముండుండు వా
ని దశన్ సైఁప కెదిర్చి శక్తిఁగొని, వానింబోలెఁ గట్టం బడెన్.

గీ. బద్ధులగు చండముండులఁ బట్టి బిట్టు
దిట్టయై యట్టహాసంబు దీటుకొనఁగ
నంబ కట్టెదుటకు వచ్చి 'యరయుమమ్మ
యాజి యజ్ఞపుఁ బశువుల నమరరిపుల'. ౬౫౮

వ. అనుచు నిట్లు వృకములం బోలె ననాయాసమ్ముగఁ గట్టి తెచ్చిన
సంతసించి పరాంబ యిట్లను, ౬౫౯

క. ఇంపలరు నీదు శక్తి ని
లింపారులఁ దెచ్చి తింక లీలన్ జంపీ
చంపక వేణీ ౘక భంగి ని
లింపులకున్ మెచ్చొనర్ప లేవె చతురవై. ౬౬౦

వ. నావుడుఁ గాళిక యిట్లను, నీ దానవపశుద్వితయంబును బ్రసిద్ధం
బగు యుద్ధయజ్ఞమ్మున ఖడ్గయూపమ్మునం గట్టి యాలంభించి
నచో నయ్యది హింసయయ్యు నహింసాప్రియంబగు నని
పల్కుచు, ౬౬౧

క. కరమునఁ గరవాలముఁ గొని
యిరువురి శిరములను నఱకి యీశ్వరి మోదో
ద్ధురత రుధిరమును ద్రావి య
మరవరులఁ మోదవార్ధిమగ్నులఁ జేసెన్. ౬౬౨

వ. ఇట్లతిఘోరంబుగఁ జండముండుల వధియించినకతమున నాయంబి
కకుఁ జాముండ యను బిరుదనామంబు పరాంబవలనఁ గలిగెనని
చెప్పి వ్యాసుండు మరల నిట్లనియె. ౬౬౩

ఉ. పిమ్మట భిన్నకాయములఁ బెల్లుదొరంగెడి రక్తమై గుబుల్
గ్రమ్మ రణావనిన్ విడిచి కాల్గొలఁదిం జని శుంభుఁగాంచి 'మా
యుమ్మలికంబు దీర్పుము మహోదయ! పెందయ' నంచుగాళికా
గ్రమ్ములు చండముండులకుఁ జావుఘటించుట విస్తరించుచున్.

వ. హతశేషు లిట్లనిరి, రాజేంద్రా! యాహవరంగమ్మున నక్కాళి
విక్రమించిన తెఱంగు దలంచుటకును భీతి యేతెంచెడి. రౌద్రా
కారమ్మున నదరి కొందఱ భక్షించియుఁ గొందఱఁ బిడికిలించియు
గొందఱఁ గాలఁ జమరియు నిట్లు సైన్యంబుల రూపుమాపినఁ
దద్రంగస్థలంబు నెత్తురువఱ్ఱుగా మాంసంబు కర్దమంబుగాఁ గేశ
మ్ములు నాచుగా భగ్నరథచక్రమ్ములు చక్రమ్ములుగాఁ ద్రెళ్లిన
బాహువులు మత్స్యమ్ములుగా శీర్షంబులు తుంబీఫలమ్ములుగా
నొక మహానదిచందమ్మునం బొల్చె. ౬౬౪

ఉ. కాళిక చంపఁగా మిగులఁగాఁగల రక్కసులం గడంగి యా
భీలరవమ్మొనర్చి యొకపెట్టున సింగము మ్రింగుచున్న దీ
యాలము మాను మయ్యతివ యల్ప యటంచు దలంతువక్కటా,
కాలము చేరువయ్యె నొకో! కావలమున్ విడజాల వెమ్మెయిన్

క. ఏ లలనఁగోరి నీ విపు
డాలమ్మునఁ గులవినాశ మందించెద వా
లోలాక్షి కాలరూపిణి
గా లోనఁదలంపు మెఱుఁగ గలఁడగు మధిపా. ౬౬౭

గీ. జయపరాజయములు దైవసంగతములు
గాన నల్పార్థమునకు నిష్కారణముగ
నెల్లబంధుల సమయింపఁ జెల్లునయ్య
వెనుక ముందును దెలియుట చనదె యింక. ౬౬౮

వ. రక్కసులకెల్ల నొక్క కాంతచే మృతిగలుగుటకన్నఁ జిత్రం బొం డెద్ది ! లోకపాలుర జయించిన నీబోఁటి నాబోటి యాహవమ్మునకుఁ బిలుచుట కెంతకేనియుం జాలక తూలిపోయెడిదే ! యది యునుంగాక మున్ను పుష్కరమ్మున నీవు తపం బొనరించి యమరత్వంబు ప్రార్థించిన విధాత యీ నోడుటయు నీవు క్రమ్మఱ దేవమనుష్యసర్పకిన్నరయక్షప్రముఖులగు పురుషులచే మృతి గలుగకుండ ననుగ్రహింపు మన నన్నలువ యట్లొసంగె నది కారణంబుగ దేవప్రేరితమై, ౬౬౯

క. జననావన మరణమ్ముల
నొనరించెడి మాయ సంగరోల్లాసినియై
దనుజులతో నినుఁ బోరిగొనఁ
గ నేగుదెంచుట నిజమ్ముగావలె నధిపా. ౬౭౦

వ. మఱియుఁ ద్రిగుణయుఁ దామసయు సర్వశక్తి సమన్వితయు నక్షయయు సర్వజ్ఞయు సదోదితయు వేదమాతయు గాయత్రియు సంధ్యయు సర్వసురాలయయు సగుణయు నిర్గుణయు సిద్ధయు సర్వసిద్ధియు ప్రదయు నవ్యయయు నానందప్రదాయినియు నగు

పార్వతి దేవహితార్థినియై నిన్ను నిక్కువం బడఁపఁగ నేతెంచినదని
యెఱింగి జీవింపవలతేని వైరంబుడిగి పాలివోక శరణంబు గొను
మయ్యంబిక కరుణార్ద్రయై హతశేషులగు రక్కసులతో నిన్నుఁ
జిరాయుష్మంతుఁగా ననుగ్రహింపఁ గలయది నావుడు శుంభుండు
క్రోధాకులుండై వీరోచితంబగుగతి ననుకరించి, ౬౨౧

ఉ. మానము మాని ప్రేలకుఁడు మందులరై యని కోపటించి నా
పై నెనరున్నభంగి నిటు, ప్రాణము తీపగునేని వేగ మీ
మీ నెఱిచుట్టలన్ సుతుల మిత్రులఁ గూడి రసాతలంబుఁ బో
నానతి యిచ్చెదన్ వెడలుఁ డాహవభీతులతోడ నేమగున్.

చ. జయముఁ బరాజయమ్ము మనశక్యమె దైవము కర్తగాక ని
శ్చయముగ బ్రహ్మవిష్ణుగిరిశప్రముఖుల్ తదధీను లన్నచో
బయిఁ బడు మంచిచెడ్డలకుఁ బాల్పడ కోర్వ వశంబె దీనికిం
త యళుక నన్ను బోఁటి కొకదర్పమె, యెట్లగు నట్ల యయ్యెడిన్.

క. భవితవ్యానుగుణం బగు
వ్యవసాయ మొనర్చు జ్ఞానవంతులు తెల్విం
దవిలి యొకప్పుడుఁ జింతా
వివశులుగాకుంద రేను వెఱతునె మృతికిన్. ౬౨౪

వ. మానవంతు లగువారలు మరణభయమ్మువలని యాత్మధర్మపరిత్యాగమ్మున కోపటింతురు. సుఖదుఃఖాయుర్జీవితమరణాదికమ్ము లెల్లరకునుఁ గాలచోదితమ్ములయి యనివార్యమ్ములై పైకొనుచుండు. హరిహరవిరించులును దక్కటివేల్పులును దమతమ యాయురవసానమ్మునం గిట్టువార కాని యుట్టిగట్టికొని యుండువారు కారు. ౬౨౫

శా. దైవాధీనతఁ జేసి యేను జయమో దైన్యంబో వేఱొండో. నేఁ
డీ వామాక్షీకతమ్మునం గొనుమఁగా కేలింత చింతింప, ని
స్సీ! వీరుల్ గడునవ్వఁ బాఱి యెటులే జీవింతునే? యింతకుం
జావే యెక్కుడు, వీరధర్మ మగునే సంగ్రామభీరుత్వముల్.

వ. అది యట్లుండె విద్వాంసులు దైవంబు మిథ్యయనియు నుద్య
మంబు కర్తవ్యం బనియు దానఁ గార్యసిద్ధి యవశ్యంబగు ననియుం
జెప్పుదురు. యుక్తియుక్తం బగుకతన నిత్తెఱంగు బుద్ధిమంతులకు
గ్రాహ్యం, బదృష్టంబ బలవంతంబను కాతరులవచనమ్ములు గ్రా
హ్యమ్ము లయ్యెనేని యదృష్టసత్త్వమ్మునకుఁ బ్రమాణంబేమి?
యదృశ్యం బెన్నఁ డేని దృశ్యం బగునే యని వెండియు, ౬౭౭

గీ. లే దదృష్టపదార్థంబు లేశమేని
బుద్ధిమంతులు దుఃఖసముద్రమగ్ను
లైనవారల నూరార్ప దీనిఁ గల్పి
తంబుగాఁ జేసి రిది సిద్ధదంబుగాదు. ౬౭౮

వ. ఇష్టకారిణియగు *చక్రిసమీపముననున్నను నుద్యమంబు లేకున్న
నిష్టసిద్ధి గాని తెఱంగున నుద్యమశూన్యులు సిద్ధిమంతులు గాకుం
ట ప్రత్యక్షంబ యని మఱియును, ౬౭౯

క. తనబలము నెదిరిబలమును
గని కాలాదికమెఱింగి కార్య మొనర్పఁ
మునుకొను సిద్ధియనుచుఁ దా
ననఁడె బృహస్పతి ప్రయత్న మన్నిట ఘనమా. ౬౮౦

* చక్రియన పిండిసూతిరోను సాధనము.

వ. ప్రయత్నం బొనర్చినను గార్యసిద్ధిగాకుండినచోఁ దన్న్యూనత యుద్యమంబున నిడుట యుక్తి యుక్తంబై యుండునని కృతనిశ్చ యుండై రక్తబీజుం గని నీబలమ్ములతోఁ గట్టాయితంబై సంగర మ్మునకు వెడలు మనుడుఁ వాఁడిట్లను, ౬౮౧

ఉ. ఏఁ గలుగంగఁ జింత మది నించుకయున్ వల దిష్ట యోగి నీ
కాగము చెప్పి యత్తరుణి రా గమకించెదఁ దక్కనేని బెట్
పేర్చఁ గగు వాజిలోనఁ దలరించి జయించి వశన్ బొనర్చి దా
నీగతి నీకు నెల్లపుడు సేవ యొనర్పఁగఁ జేయ నేర్చెదన్. ౬౮౨

వ. అని కృతనమస్కారుండై యాజ్ఞఁగొని హాస్త్యశ్వరథసంకులం బగుబలంబు పరివేష్టింప రథారూఢుండై సంగరమ్మునకు వెడలు టయు, ౬౮౩

క. దాదాదవ్వుల నంబిక
యాదానవుఁ గాంచి శంఖ మతిభీషణరా
వోదారమ్ముగ నొత్తిన
భేదిల్లి రి రిపులు మది దివిజు లలరంగన్. ౬౮౪

—* రక్తబీజయుద్ధము. *—

వ. అంత నద్దరరవంబునకుఁ దలరక రక్తబీజుండు సమీపమ్మున కరిగి మృదుభాషణమ్ముల నిట్లను, ౬౮౫

గీ. శంఖనాదమ్ములకు నేను జంక భూమ్ని
లోచనుఁడఁ గాను వినుము నీపేఁచ మడఁతు
నరయువాఁకొ నన్ను రక్తబీజాభిధానుఁ
బఱచు వారల శక్తి నే బడితినొక్కొ ? ౬౮౬

వ. మున్ను నీబిభీషికలకు జొంకి కాందిశీకులగు రక్కసులలో నొక్కనిఁగా నన్ను విచారింపక సుస్థిరత్వమ్మున రణస్థలమ్మున నిలువుమని. వెండియు, ౬౮౭

గీ. వృద్ధసేవ యొనర్చితి విద్యలెల్ల
నేర్చితి వటంచు వింటి నీనేర్పు చూత
మొక్కమాట వచించెద నువిద ! దాని
తెఱఁగెఱుంగుము యదికదా తెలివికలిమి. ౬౮౮

క. ఋతమై పథ్యంబై సా
హితిగల మానినుల కెల్ల హితమగు ననినేఁ
బ్రీతినం జేసి వచించెద
మతి గలవేని విను మిన్నిమాటలు కలవే. ౬౮౯

గీ. నవరసమ్ముల విద్వజ్జనముల మెచ్చు
గనురసమ్ముల వినుము శృంగారశాంత
రసము ; లందును శృంగార మసమ మగుట
రసములకు నెల్ల నయ్యది రాజసమ్ము. ౬౯౦

మ. సిరితో విష్ణువు గౌరితో శివుఁడు జేజేపెద్ద యవ్వాణితో
సురనాథుండు పులోమజాతరుణితో సూనాంకు సేవింత్రు సుం
దరి ! వృక్షంబు లతన్ గపోతిని గపోతంబున్ మృగం బమ్మృగిన్
గర మాసించుఁ జరాచరమ్ములకు శృంగారాప్తి నేఁడబ్బెనే.

గీ. ఎవ రసంప్రాప్త భోగులై దివులు దవులు
వారలో వారలే దైవవంచితులు య
తీశ్వరులు ; సంసరణసుఖ మెఱుఁగ లేక
వంచకుల వంచనలకు లోఁబడిన నరులు. ౬౯౧

క. మనమునఁ గామక్రోధము
లనయము గిజిగొనుచునుండ నంగజుఁడును లోఁ
గొని యేచుచుండ శాంతం
బును వైరాగ్యమును జ్ఞానమును గలుగునొకో. ౬౯౩

వ. కావున నీయౌవనసంభావనకై శుంభునొండె నిశుంభునొండెఁ బతిగా వరించి సమస్త సుఖమ్ము లనుభవింపు మని బోధించు రక్తబీజప్రలాపమ్ములకు నంబికయుఁ గాళికయు నగిరి. పదంపడి దేవి హాసం బొనరించి మేఘగంభీర భాషణంబుల నిట్లను.

క. మును చెప్పితి రూపాదిక
మున నాకుందుల్యుఁడేని మోహించెద నం
చును మాటిమాటి కీగతిఁ
జనునే వెడమాటలాడఁ జతురునిపగిదిన్. ౬౯౪

వ. నాప్రతిజ్ఞ యిట్టిది యని శుంభనిశుంభులకడ కేగి చెప్పుమొండె నొండె సంగరం బొనరించి నన్నుం జయించి విధిచోదితంబుగ వివాహం బొనరింపుము. ౬౯౬

క. భయ మొదవెనేని నిప్పుడ
రయముగఁ జని పతికిఁ జెప్పి రక్కసులెల్లన్
బయలు వెడలి వెంబడి రాఁ
బయనం బొనరించు టొప్పుఁబాతాళమ్మున్. ౬౯౭

వ. అనవుడు రక్తబీజుండు క్రోధతామ్రాక్షుండై.

శా. ఎట్టెట్టా ! యని యార్చి యుంపగము లెన్నేనిం బ్రయోగించి బల్
ధట్టుండై మృగరాజు నొంచినఁ గనత్తామ్రాక్షియై దేవి పె

స్సుట్టంబోని తదస్త్ర శస్త్రచయముం గూల్చి శితాస్త్రముల
రెట్టింపం దగునట్లు రక్కసుని మర్దించె వెసన్ మూర్ఛిలన్.

వ. ఇట్లు రక్తబీజుండు రథమ్ముపయిం బడిన దైత్యసైన్యముల
హాహాకారంబు విస్తరించె. ౯౯

క. బుంభారవమున సేన ల
హంభావం బుడుగుటెఱిఁగి యసురులఁ గని యా
శుంభుండు దైత్యులను సం
రంభమ్మునఁ బనిచెఁ బోండు రణమున కనుచున్. ౨౦౦

వ. ఇట్లు కాంభోజకాలకేయాదిదానవప్రపంచమ్ము నొక్కట నెస
కొల్పిన భీషణాకారభాషణాడంబరమ్ముల నుద్దవిడి నద్దనుజులు
రణాభిముఖులగుటయు నంతంత నేతెంచు వారలం గని కాళి
ఘంటానాదంబొనరించెఁ బరాంబికయు శంఖంబు పూరించి
జ్యాటంకారం బొనరించి యక్కాళి కుక్కకింప మింటికి మం
టికిఁ దానయై యాపె ప్రబలి సింహారావం బొనర్చిన నంత సింగం
బును గర్జిల్లె. ౨౦౧

ఉ. ఆనినదమ్ములన్ విని మహానినదమ్ములు నింగిముట్ట న
ద్దానవులెల్ల శస్త్రములతండములం బరఁగించి ముంపఁ బో
రీనియతిం దనర్చెనని యెన్న నవ ర్తముగా నిలింపు లం
బానుచరత్వ మందఁ దమయందలి శక్తుల నంపి రంపినన్.

గీ. బ్రహ్మ మొదలుగలట్టి దేవతలశక్తు
లాత్మ దేవోచితమ్ముగ నస్త్రశస్త్ర
భూషణంబులు ధరియించి పోరొనర్ప
నరుగుదెంచిరి జగదంబ ననుసరించి. ౨౦౩

వ. అట్టియెడ వరటారూఢయు శంఖచక్రగదాధరయుఁ బీతాంబర భూషితయుఁ బద్మహస్తయునై వైష్ణవియు నర్ధచంద్రధరయు నహివలయయు శక్తిహస్తయు శిఖివాహనయునై కౌమారియు, శ్వేతగజవాహనయు వజ్రహస్తయునై యింద్రాణియుఁ, బ్రౌఢ ప్రేతాసనయు సూకరాకారయునై వారాహియు,నృసింహసదృశా కారిణియై నారసింహియు, దండహస్తయు భయప్రదయు మహి షారూఢయునై యామ్యయు, వారుణియుఁ గౌబేరియు లోనుగాఁ గలయనేకశక్తులు స్వస్వబలసహితమ్ముగ నరుదెంచిన దేవి యత్యానందభరిత యయ్యె. ౨౦౮

శా. తత్తచ్ఛక్తిపరీతుఁడై హరుఁడు తత్సంగ్రామరంగమ్ము ద
ళ్లోత్త న్నిల్చి పరాంబఁ గాంచి యను "లోకోద్రేకసంపాదనా
యత్తుల్ శుంభనిశుంభు లాదిగల దైత్యానీకముం ద్రుంపు మీ
సత్తుల్ తోడుగ నెల్లలోకములకుణ్ సంతోష మెంతేఁదగణ్.

సీ. యజ్ఞభాగమ్ముల నమరులు మునుపోలె
గతభీతులై పొందఁగాంత్రుగాక
స్థావరమ్ములకును జంగమమ్ములకును
సంతోషమెంతే నెసంగుఁగాక
ఉడుగక వెడలెడి యుత్పాతములు నీతి
బాధలు నేటితోఁ బాయుఁగాక
యయ్యయికాలమ్ములం దనుగుణముగ
మంచి మేఘములు వర్షించుఁగాక
గీ. కృషి బహుఫలప్రదంబయి కెరలుఁగాక
గోద్విజాంగన లభయమ్ము గొంద్రుగాక

పిదప శక్తులు తమతమ వెడలుచోట్ల
కేగ జగదంబ నీ యాజ్ఞ యొసఁగుఁగాక." ౭౦౬

వ. అని శంకరుండు వచియించునాలోనన చండికాశరీరమ్ము నుండి ప్రచండయు నద్భుతశక్తియు శివాశతనినాదినియు భీషణయు ఘోరరూపయు నగు నొకశక్తి యుద్భవించి సస్మితాననయై శంకరుంగాంచి యిట్లనియె. ౭౦౭

ఆ. వె. దేవదేవ ! యీవు దితిజులకడ కేగి
దూతవై వచింపు తొలఁగి యమర
పదము వీడి యిపుడు పాతాళమున కరు
గుండు బ్రతుకుదెలవు గోర్కెయేని. ౭౦౮

వ. పిదప సురేంద్రుండు తనపదమ్ము నందికొని సుఖంబుండ నమరులెల్ల యజ్ఞభాగమ్ము లనుభవించువారు. ౭౦౯

క. మరణంబు గోర్కెయేని బ
వరమునకుం బలము గొలువవచ్చునది పరం
పరలై మాంసక్కలు పిశి
తరసాస్వాదనముచేసి తనియనొనర్తుక్. ౭౧౦

వ. ఇట్లు మద్వచనమ్ములుగా నుడువు మనుడు హరుఁడును శూలపాణి యగుచు శుంభనిశుంభులకడ కరిగి యిట్లనియె. ౭౧౧

ఉ. ఏను బురాంతకుండ జగదీశ్వరి మీకడ కంపె నాపె మీ
దానవులం దనుగ్రహముదాల్చి వచించినచొప్పు చెప్పెదక్
మానము ప్రాణము న్నిలుప మానసమేని దివంబు వీడి మీ
మీ నెఱిచుట్టలం గలిసి పేకొనుఁడేగి రసాతలమ్మునక్. ౭౧౨

క. క్రాదేని౯ బోరితమునకు
రాఁదగునని చెప్పెననుడు రక్కసులు మహో
న్మాదులు మీఁదు నెఱుంగక
యాదేవి నెదుర్చ వచ్చి రనిమొనకు వడి౯. ౭౦౩

వ. రక్కసులకడకు శివు నంపినకతన నయ్యంబ శివదూతినాఁబరఁగె నిట్లుక్కు మిగిలి రక్కసు లొక్కుమ్మడి సంగ్రామరంగమ్మునకుఁ దెగి నిశితమ్ములగు శరశతమ్ములు వఱపిన నక్కాళిక శూలపాతమ్ముల నేలం గలిపియు, బ్రహ్మాణి కమండలుజలసేకమ్మున రూపుమాపియు, వైష్ణవి చక్రగదాపాతమ్ముల నుగ్గుచేసియు, మాహేశ్వరి శూలమ్మునఁ దూలించియు, నైంద్రి వజ్రప్రహారమ్మునఁ గసిమసంగియు, వారాహి తుండఘాతమ్ములఁ జెండియు, నారసింహి నఖనికరమ్ముల వ్రచ్చియుఁ బరాక్రమించునెడ నా శివదూతి బవరమ్మునకుం దవిలి యట్టహాసం బొనరించి భంజించు దానవులం బట్టి కాళికయుఁ జాముండయు భక్షించుచుండఁ దద్బలార్ణవమ్మున నతిఘోరంబగు బుంభారవమ్ము సంభూతంబయ్యెఁ; దదారవంబు విని రక్తబీజుండు తక్కటి దానవులం గలసి సంగరమ్మున కభిముఖుండై జ్యాటంకారం బొనర్చెనని వెండియు. ౭౧౪

గీ. రక్తబిందువు లెన్ని యా రక్కసుని శ
రీరమునునుండి వెడలు నారీతి నంద
ఱుద్భవింతురు రక్కసు లొక్కమొగి న
టంచు వరమిచ్చె వానికి నభవుఁ డధిప. ౭౧౫

క. తాదృశవరదానాయా
తోదారబలంబు కలిమి నుక్కుమిగిలి మాం

సాదనుఁడు వేగమునఁ గా
ళీ దేవులఁ గవిసె వీర్యలీల చెలంగన్. ౨౧౭

మ. గొరటామంతునిపై జగద్వలయభంగిన్ బేర్చు నవ్వైష్ణవిం
బరశక్తిం గని దైత్యుఁడల్కమెయిఁ దామ్రింబైన నేత్రద్వయిన్
బొరిఁ జూపట్టు కృశానుకీలలు జగమ్మున్ మండఁగాఁ జేయు రీ
తి రవుల్వం బొలుపారు నొక్క పటుశక్తిం బైఁ బ్రయోగించినన్.

క. శక్తియు నొకగద గొని యా
శక్తిం దునుమాడి మఱియుఁ జక్రము గొని యా
నక్తంచరుపై విసరిన
రక్తమయశరీరుఁ జేసె రక్కసు నదియున్. ౨౧౮

వ. ఇట్లు చక్రాభిహతంబగు తదీయశరీరమ్మునుండి గిరిశిఖరమ్ము
నుండి సెలయేఱుల వడువున నల్లకాలువలు తండోపతండమ్ములై
వెడలినకతమున ననేకరక్తబీజు లుద్భవించి యొక్కపెట్ట దేవిం
బొదువుడు నైంద్రి వజ్రప్రయోగమ్మునను బ్రహ్మాణి బ్రహ్మ
దండంబునను మాహేశ్వరి త్రిశూలంబునను నారసింహి నఖాఘా
తమ్ములను వారాహి తుండఘాతమ్మునను గౌమారి శక్తిప్రయో
గమ్మునను నద్దానవులఁ దఱిమినఁ దదాయుధాపాతజనితరక్త
బిందుపాతమ్మునంజేసి రక్కసులు వేనవే లావిర్భవించి పెలుస
నక పోరిన నప్పోరు ఘోరంబై దివి వైమానికులగు సురలకు
ఖేదంబు నొనఁగూర్ప వార లిట్లు వితర్కించిరి. ౨౧౯

క. ఇది యేమి వింత! నూఱ్లకొ
లఁది దైత్యులు వొడమి రకట! లావున వీరిం
బొదువుట కష్టం బెవ్వెఱు
వు దలంచునొ దేవి, యేమి పోలునొ చేయన్? ౨౨౦

క. అని కిది సమయం బని శుం
భనిశుంభులు గూడ వచ్చి మార్కొందురు వా
రును బలియు రనుచుఁ జింతా
మనస్కులయి భీతి వడి రమర్త్యులు పెలుచన్ ౭౨౧

వ. దేవియు సంగరరంగం బంతయు రక్తబీజమయం బగుట యెఱింగి
కాళికం బిలిచి యిట్లనియె. ౭౨౨

ఉ. మార్తురనెల్లరం బిలుకుమార్చు నుపాయము చూడు మిట్టి లీ
ధూర్తులు నెత్తు రుర్విఁ బడఁ దోరముగా జనియించుచుండ్రి నీ
నోర్తగ విచ్చి రక్తమదనుం గని వేర్మిడిఁ ద్రావు మేను ని
మ్మూర్తుర నింతలోనఁ బరిమార్చెద నుగ్రరణాంతరమ్మునన్

క. ఇదియ యుపాయం బీరీ
తి దనుజులన్ గసిమసంగి దేవేంద్రుని న
య్యదితిజులం బ్రోచి మదిం
బదిలముగాఁ జేసి సుఖముఁ బడయుట తగదే. ౭౨౪

వ. అని యానతిచ్చిన నక్కాళికయు నట్ల వదనంబు తెఱచి రుధిర
మొక్క చుక్కైన నేలంబడనీక త్రావుచున్నంత నంబికయుఁ
దదాపాతజాతులగు కృత్రిమ రక్తబీజుల నందఱ నొక్క నిముస
మ్మునఁ జక్కడంచి ౭౨౫

మ. అసిచేతంగొని " రక్తబీజ! నిలురా " యంచున్ బలప్రాభవం
బు సురల్ సన్నుతిచేయుచుండ రుధిరంపుం బిందు వొండైనఁద
ద్రిసపై నిన్ బడకుండఁ గాళికయుఁ దత్పార్శ్వమ్మునందుండి త్రా
వ సుధాశీశ్వరు కంఠముం దునిమె రంభాస్తంభ మట్టుల్ వడిన్.

వ॥ హతశేషులగు రక్కసు లొక్కమొగి రణాంగనంబు విడిచి శుంభుపాలికింజని, దేవా ! రక్తబీజుం డక్కాంతచే నిహతుండయ్యె. తదీయంబగు శోణితంబెల్లఁ దత్సహచారిణి చాముండ యనునది త్రావె నింత యక్కజంపుఁ బరాక్రమంబుగల కామిని నెయ్యెడం గాన మింతయేల తదీయ వాహనంబగు సింగంబును ననేకుల రక్కసుల నుక్కడంచె నింక దేవర ప్రమాణంబని చెప్పి మఱియు నిట్లనిరి. ౭౨౭

ఉ॥ కొందఱు కాంతలామెకు సఖుల్ రణసీమ సహాయులైరి వా
రందఱు లావుఁ జేవ గలయట్టిరు చక్కనివారు వారి గె
ల్వందర మౌనె! యో దనుజవల్లభ ! యంతటి రక్తబీజు చా
వుం దలపోయఁ గొందలము వొందదె నెమ్మది నేరికేనియున్. ౭౨౮

ఉ. ఆలము మాని పౌరుషము లాయమ కప్పనఁజేసి మీఁదఁబా
తాళమువంకఁ బోవు టుచితం బని తోఁచెడి మాకుఁ జూడ న
బ్బాలికరూపుఁ గన్గొనఁగఁ బ్రాకృతమాత్రము గామి దోఁచు, దే
వాళినిఁ బ్రోవ మాయ యిటు లాకృతి దాలిచె రాక్షసాధిపా.

చ. అను మొనవారిపల్కులు సురారికులేశ్వరుఁ డాలకించి చ
య్యనఁ గనుదోయి కెంపు జిగి యానన మంతయుఁ బర్వఁ జేసి వె
చ్చ నిగుడఁ బల్కు " భీతిలి రసాతల మేగిన నేగుఁ డీరు కా
మినికిఁ దలంకి యేఁ జనిన మీఁద యశంబు నశింపకుండునే !

గీ. దేవనాయకు నోడించి దేవలోక
మేన పాలించినాఁడ నీ మేనితోడ
నొక్క కాంతకు రణమున నోహటించి
పాఱిపోదునె యింతటి బ్రతుకు బ్రతికి ! ౭౩౦

ఉ. నాదు బహిర్గతాసువులు నాయెడ భక్తి గలారు రక్తబీ
జాదులు నానిమిత్తమొక యంగనచేత రణావనిన్ బలం
బేది గతాసులైన నది యెంచక యయ్యబలన్ జయింపఁగా
రా దని భీతిమైఁ జెనఁటిప్రాణము డాఁచిన నుర్వి మెచ్చునే.

మ. జననం బందినవారి కేరి కయినం జావున్న, దెప్పాటఁ బో
యిన రానున్నది రాక తీఱదు, భయం బేలా వివేకంబు గ
ల్గిన వానిం బెగడొందఁ జేయుఁ? దగు భంగిన్ దెచ్చుకొన్నట్టి కీ
ర్తినిఁ బ్రాణానకు జంకి వ్యర్థముగ వార్ధిం గల్పఁగా వచ్చునే.

చ. బవరమునన్ జయమ్ము లిరువాఁగునకుం గలుగంగఁ బోవు నే
దివి భువియున్ బలమ్మున నెదిర్చి జయమ్మును గొన్ననాఁడు రెం
డవయెడవారునుం జయము నందిరె! కాన మనుష్యయత్నసా
ధ్యవిధి యొనర్పఁగావలయు నావల దైవము చేయుచేఁతకున్."

గీ. అని నిశుంభునివంకఁ గన్గొనుచుఁ బలికె
నీవు సేనానివై వెంట నేగుదెమ్ము
సురనికాయము మనములు క్షోభమంద
నిపుడ యానాతిమిన్న జయించి తెత్తు. ౨౩౦

వ. అని విక్రమించుచున్న యన్నం గని యనుజుం డిం తేల, గడలో
నే నా వనితన్ జయించి తెచ్చెద ననుమానమ్ము విడిచి
సుఖమ్ము లందు మని వెండియు, ౨౩౧

గీ. సకలజగముల నొకసారి జయముగొన్న
మద్భుజాదండబల మేడ మార్దవంపు
ముద్దయగు ముద్దరాలితో మొనసి పోరు
చేయుటేడఁ గటా! యెంత చేసె నజుఁడు. ౨౩౨

ఆ. వె. ఇట్టినీచకృతికి నేనుండ దేవర
గమన మనుచితంబు గడియలోన
మానినిని జయించి మగిడివచ్చెద నన్నుఁ
బనుపు మయ్య పెక్కుభాష లేల. 238

క. అనుచుఁ గృతనిశ్చయుండై
యనికిం గాల్ దవ్వుచున్న యనుజునిఁ గని నె
మ్మనమున ననుమానించుచుఁ
జను మని సెలవిచ్చె దనుజచంద్రుఁడు పేర్మిన్. 239

—* నిశుంభ యుద్ధము *—

వ. నిశుంభుండు జయం బొండె మరణంబొండెఁ గానిమ్మని సేనా
సమేతమ్ముగా నయ్యంబికం జుట్టుముట్టుడు శుంభుండు సహోదర
సంగరసమాలోకనకుతూహలమ్మునఁ దన బలమ్ములతోడ వెను
వెంటం జని యంతంతఁ జూచుచుండె నట్లు నిశుంభుం డయ్యంబి
కం గదిసి శార్ఙమ్మగు చాపమ్మున నారిం బూరించి ప్రళయకాల
కాలాంబుదమ్మువడువున శరాసారమ్ములు గురిసె నంత. 240

క. దేవియుఁ గాళినిఁ గని యా
దేవారులమాద్య మింతదెప్పర మగు నే
చావునకుఁ దలఁకరు జయా
శావలమానాంతరంగసంభ్రమము లగుచున్. 241

క. ఆశాపాశముకన్నను
బాశంబు జగానఁ గలదె ! బలియురు తనవా
రాశమనపురికిఁ జనిన జ
యాశాభూతంబు వదల దారా ! వీరిన్. 242

వ. అని ప్రశంసించుచుఁ గాలమ్ము సమీపించినవారు యుక్తా యుక్తమ్ము లెఱుంగుదురే యని శరాసనంబు సారించి నిశితంబు లగు శరమ్ములు దొడిగి యన్నిశుంభు మేనెల్లం గప్పిన నప్పిశితాశ నుండును బదియాఱు వాఁడితూపుల నమ్మానవతి లలాటంబు గాఁడ నేసె; నిట్లు పరస్పరంబును సమాలోకమానాలోకభీకరం బగుసంగరంబు కరంబు ప్రవర్తిల్లుచుండఁ దద్వాహనం బగు సింగంబును దనయొాపినకొలఁదిఁ గేసరమ్ముల విదుర్చుచు నఖాఘాతమ్ముల గ్రుచ్చియు దంతమ్ములఁ గఱచియు సైన్యసాగరమ్ము నల్లకల్లోలంబుగాఁ బిలుకుమార్చె. ౭౪౩

క. శుంభుండును దేవీసం
రంభము గని యోర్వలేక రణభూమికి సై
న్యాంభోధి గొలువవచ్చి ని
శుంభునకుం దోడువడియె శుంభల్లీలన్. ౭౪౪

వ. ఇట్లువచ్చి, ౭౪౫

సీ. రౌద్రరసమ్మును బ్రథమరసమ్మును
నిరుదెసఁ గాన్పింపఁ, గరుణ యొక్క-
వైపున నలు కొక్క-వంకను దైవారఁ
జూడ్కు-లు కనుదోయి సొగసు దెలుప
జగదతీతంబైన సౌందర్యగరిమఁ గ్రొ
మ్మించు చాడ్పున మిఱుమిట్లు గొలుప
బవరంబు సేయునప్పరశక్తిఁ గన్గొని
విస్మయమ్మున నాపెవిధమునెల్లఁ
తే. గీ. జూచుచును మిన్నకుండ నాసుదతి మోహ
నందుఁజిఱునవ్వు వొలయ దైత్యద్వయంబు

గాంచి, పామరులార! నిక్కముగ నెచటి
కేని యేగుఁడు జయకాంక్షలింక విడుఁడు. 278

క. అభయం బిచ్చెదఁ; గాదే
ని భయము విడనాడి యీయనిశ్ బ్రాణము వా
సి భటస్వర్గముఁ గైకొనుఁ
డుభయులు నన శుంభుఁ డల్క యుదయించి వెసన్.

మ. కని ఖడ్గంబున సింహశీర్షమును మొక్కల్ వోవఁగాఁ జేయఁ ద
ద్ఘనపాతంబు సహింప కద్ది నఖపాతచ్ఛిన్నకాయుం బొన
ర్చిన నాలో గదఁ బూని దేవియును గాసిం జెందఁగాఁ జేసె దై
త్యుని బాహాంతరమందు, మింట సుర లోహో యంచు నగ్గింపఁగన్

వ. అంతం బోక బాహుమూలమ్మును ఖడ్గతాడితమ్ము చేసి
యయ్యంబ విజృంభించిన. 279

క. వ్రేటువడి వాఁడు వేదన
నూటాడక మాటుపఱచి యొకబాణమునన్
గాటముగ నేసెఁ బవిలి ల
లాటము పాలాశసుమవిలాసము దాల్పన్. 280

వ. పిదప నయ్యంబిక నిశుంభవధారంభసంరంభయై పునఃపునః
పానంబునం బొదలి ఘంటానాదం బొనర్చుచు నెదిర్చె; నిట్లు
ఘోరంబుగ సంగరంబు చెల్లునంత. 281

క. కుక్కలొక పెట్టఁ గూసెన్
నక్కలఱచెఁ గాకి గ్రద్ద నాఁజను పక్కుల్
దిక్కులదుర్వఁ బఱతెంచెన్
రక్కసుల యొడలిపలము గరంబు భుజింపన్. 282

వ. అంత నిశుంభుండు దైత్యమారణంబునకు సైంహిక గదం గొని భీషణాకారమ్మున నడరి హరింగొట్టి యట్టహాసం బొనరించి యయ్యంబం దాడించిన. ౭౫౩

ఉ. ఆపెయు వల్గితభ్రుకుటియై మొగమంతయు జేవురింప ' దై త్యాపశదా ! చలింపకు ' మటంచుఁ గరాళతరాసి పూని య ప్పాపుని కంధరంబు తెగవైచెఁ దటాలున, మింటిపైఁ దదీ క్షాపరులైన దైవతనికాయము శోకముతోడ వ్రేల్మిడిన్ ౭౫౪

ఉ. నెత్తురు కాల్వలై పరఁగె నింగి వియచ్చరసంచయంబు పూ ల్మొత్తిరి సోఁకుమూఁకలు నమోనమ యంచును గాల్కొలంది ప ర్వెత్తిరి కొంద ఱాడు బలహీనతఁ బాటుమొన న్మరల్చుచున్ రిత్తకు రిత్త సేయు రజనీచరవల్లభుఁ గాంచి యీసునన్ ౭౫౫

క. దేవా నీయనుజన్ముని
చా వాలోకింతె మెట్టచాడ్పునఁ బడె ! గృ
ధ్రావళి మాంసముఁ బొడువగ
నేవారిఁక ననికిఁ గడఁగి యిటు కారొక్కో ? ౭౫౬

క. అనిలోన నీకు జయ మ
బ్బు ననుట గడు సందియంబు బుధకార్యము సే
యను వచ్చినమాయయ కా
మిని గా దది నిజము చావమికి మనతరమే. ౭౫౭

క. కలకాల మొక్కవిధమున
నిలఁగాలము చనునె తనక హితముగ నొకచో
బలవంతుని దుర్బలు దు
ర్బలునిన్ బలవంతుఁ జేయు రాక్షసనాథా. ౭౫౮

క. ఇంద్రాదినిర్జరులును ను
పేంద్రుఁడుశంభుఁడు విరించి యినుఁడు జముండున్
జంద్రుఁడు మొదలగువా రీ
సంద్రము కాలమ్ము దాఁటఁజాలరు తలఁపన్. ౭౫౯

చ. మును పృథివీశు లందరు సమున్నతిమై నరివెట్ట సర్వమే
దినియు నిరంకుశం బగుగతిన్ బరిపాలన చేసినట్టి నీ
వని నొక కాంత కోడుదె! కటా! యిది కాలమురీతిగాక; త
క్కిన వొనరింపఁ జాలునొకొ! కీడును మేలును బ్రాణికోటికిన్.

క. కావునఁ బాతాళమునకుఁ
బోవుదమిప్పటికి; బ్రతుకఁబోలదె! రాజ్యం
బేవారికి శాశ్వతమగు,
నే! విధిచోదితము గడవ నేర్తురె యెరున్. ౭౬౧

క. అను సేనానులపల్కులు
విని దైత్యవిభుండు కోపవిపులీకృతలో
చనుఁడగుచుఁ గటములదరఁగ
ననలజ్వాలాకరాళ మగుగతిదోఁపన్. ౭౬౨

చ. చెవు లవియంగ నిర్భయతఁ జెన్నటిపల్కులు పల్కువారె! యీ
రవమున జాల్ములార! యని భ్రాతృసుహృద్గణమంత్రిరాజబాం
ధవతతి నొక్కయాఁడుది మదమ్ముమెయిం దెగటార్పఁజూచి యే
బవరము మాని యీకటికిప్రాణము దాఁచికొనంగ నవ్వరే.

వ. శుభాశుభమ్ములు చక్రనేమిక్రమమ్మునం దిరుగు నీ సంసార
మ్మున భవితవ్యాభవితవ్యమ్ములకుఁ దజ్జ్ఞులు చింతింపరు పర్జ
న్యుం డప్పటప్పట యోగ్యకాలంబగు శ్రావణమ్మునఁగురియక

తదితరంబగు మార్గశీర్ష పౌషమాసమ్ములం గురియుట గనుంగొన్నం గాలం బెద్దానికిని గారణంబుగామి తెల్లంబగు, దైవనిర్మితంబగు గతి కెన్నండు నన్యథాత్వమ్ము గలుగదని మఱియును. ౭౬౪

గీ. జగములెల్ల జయించి యశంబు గొన్న
శూరవర్యులు రక్తబీజుండు నిశుంభుం
డోహటించిరి రణమున నొక్క యబల
కకట ! దైవమ కారణమనుట తగదె. ౭౬౫

వ. పదార్థద్వయసమ్మితం బగుకాలంబు సంప్రాప్తం బగుడు విరించియుం దద్ద్విగుణితం బగుకాలమ్మునకు హరియుం దద్ద్విగుణితమగు కాలమ్మునకు శంకరుండును నశింతురు. బ్రహ్మ కొక్క దివసం బగు నంతకుం బదునాల్గురిందులు చెల్లుదురు ; సూర్యచంద్ర మహీమహీధరసముద్రాది సకలచరాచరములకును దైవనిర్మితం బగునాశంబు తప్పదు కావున మృతికిం జింతింపక రణమ్మునకుం బోదుంగా కేమి విధిచోదితంబై జయంబైన నయ్యెడి నని తే రాయితంబు చేయించి చతురంగబలమ్ములు పరివేష్టింపం జని. ౭౬౬

సీ. జగదతీతం బగుసౌందర్య మొప్పార
నఖిలభూషణభూషితాంగియగుచు
దివినుండి ముదమున దేవతల్ మందార
కుసుమవర్షమ్ములు గురియుచుండ
కిన్నరీబృందంబు కిన్నెరల్ మీటుచుం
జిన్నారిగానముల్ సేయుచుండ
శంఖనినాదంబు సల్పుచు ఘంట వా
యించుచు సింగార మెసకమెసంగ

గీ. సింహవాహనయై యున్నచెలువ చెలువ
మారఁ గన్గొని దైత్యుండు మారబాణ
తాడితాంతరుఁడగుచు యుద్ధప్రసక్తి
తిగిచి మనమున నిట్లు చింతింపఁదొడఁగె. ౨౬౮

క. ఒయ్యారం బయ్యారే!
తియ్యందన మౌర! రూపుతేట బళీ! యీ
యొయ్యారి పంచబాణుని
కయ్యానకుఁ గాక పోరఁగాఁ దగినదియే. ౨౬౯

ఉ. చక్కనిచన్నుదోయి యెడఁ జీమకుఁదూఱఁగ రాదు మేనినుం
జక్కని జవ్వనంపురుచి చంచలకుం బయిపెచ్చు వచ్చు న
మ్మక్క గదే! మనోభవునిమానినికన్నను జక్క దీని నా
యక్కునఁ జేర్చుకోలున కుపాయము సేయుదు సేయదేనియున్.

వ. మంత్రాది ప్రభావమ్ములు సర్వమంత్ర స్వరూపిణి యగు నీ
జగన్మోహినియందు విఫలమ్ములు సామదానభేదమ్ములు వమ్ము
లట్లు గాదేని. ౨౭౦

ఆ. వె. వెలఁదిచేతఁ జచ్చె విశ్వైకవీరుండు
వితతకీర్తి శుంభుఁ డతులుఁ డనుచు
గేలి సేయ కుండునే లోక! మకట, దం
డమున మనముఁ జొన్పిన నిది నిజము. ౨౭౧

వ. తన కెనయగు యోధవరు నెదిరించి చచ్చియుఁ బుణ్యలోకమ్ము
దెస కరుగుదు రని పెద్దలు వచింప విందుము గాని యబలా
కర్తృకం బగుమరణం బుత్తమలోకావహంబు గానేరదు. వేయేల
యస్మత్కులనాశమ్మున కివ్వెలఁది యేతెంచె ననియెఱుంగుదు

నైనను మరణంబ యుత్తమంబు కాని పలాయనంబు కర్తవ్యంబు
గా దని నిశ్చయించుకొని యమ్మేటి యద్దేవి కభిముఖమ్ముగ
నరిగి యిట్లనియె. 222

క. అని సేయఁగ మదియే నో
ననబోఁడి ! కడంగు, పోరు నాతికిఁ దగునా !
యనియును నీ యత్నము విత
యనియును మదిఁ గొంకుచుంటి నంతియ తరుణీ. 223

సీ. కనుబొమల్ విల్లు లోచనములె శరములు
హావభావాదులె యాయుధములు
సరసచర్యందు విచక్షణుఁ డగుపురు
షుండె లక్ష్యము మనోజుండె తేరు
గడపు నేర్పరి, భేరికానినాదమె మధు
రంపుఁబల్కులు మనోరథమె రథము
మదనాగమమ్ములె మంత్రతంత్రమ్ములు
వీణానినాదంబె వింటిమోఁత

గీ. మదనయుద్ధంబె యుద్ధంబు మానవతుల
కెదిరి మగసేత సేయుట యేజయంబు
గాని వాలును బలకయుఁ బూని కడఁగి
బవర మొనరించు టది విడంబనము కాదె. 224

క. మందగమనంబు గలనీ
కుం దలమే కేల గదను గొని తఱుముట ! చ
న్నుందోయికి నానందం
బొందించునె ! వింటితాఁటిరొయిలుపులు తరుణీ 225

సీ. అని సేయు తలఁపేని మనమున నోనన
బోఁణి ! లంబోష్ఠంబు పుష్పిగోళ్లు
లంబపాదంబులు లంబస్తనంబులు
కాకిరూపును బిల్లికనులు గార్ధ
భారావమును గర్కశాలాపములుఁ గీర్తి
ముఖమున కెనయగు మొగముగలుగు
చెలువవై యుద్ధంబు సేయుము గాకున్న
నీతోడఁ గడఁగి యనిని బోసంగఁ

గీ. జేయఁగాఁ జేతులాడవు కాయజాత
కామినీతులితాకృతి గలవు నాఁగ,
నగుచు శ్రీదేవి వానియాననమువంకఁ
జూచి యిట్లనెఁ దీయని సూక్తు లలర. ౭౭౬

గీ. పంచబాణహతుండవై వనఁటఁ గుందు,
మందబుద్ధివి నాతో సమరము సేయఁ
గలవె చాముండతో నొండెఁ గాళితోడ
నొండెఁ బోరుము నేను బైనుండు దాన. ౭౭౭

వ. అని కాళివంక గనుంగొని యిద్దురాచారు సంహారింపుమని యాన
తిచ్చిన నాపెయు గదాదండంబు కేలం గొని గిరగిరం ద్రిప్పి
వైచిన వాఁడు తదాఘాతంబు దప్పించుకొని తద్భుజాంతరంబు
గుఱిగా గదాదండంబు వైచిన నసిచేతం దునిమి. ౭౭౮

క. కుడిచేయి నఱికి వానిం
బొడిచిన వెన్నిక రుధిరపుంగాల్వలు మైఁ
దుడిచికొనుచు నావంతయు
జడియక యొకకేలఁ గడఁగి సాహసలీలన్ ౭౭౯

చ. గద గొని యామెవక్షమున గాడఁగ నేయఁగఁజూచి యల్కమై
గ్గుదురునఁ దమ్భుజాంతరముగూడఁ దటాలున ద్రుంచెఁ గాళి; దు
ర్మదుఁడయి వాఁడునున్ రయమున్మైఁ దల దన్నఁగవచ్చినంతఁ ద
త్పదయుగ ముర్విపైఁ బడఁగ వైచెఁ గరాళతరాసిఁ బెల్చనన్.

క. కాళులు జేతులు దెగియుం
జాలింపక వాఁడు కాయజం బగుగతి న
క్కాళికపై కుఱికిన నవ
లీలం దచ్ఛిరము దూఁటలీలం దఱిగెన్. ౭౮౧

క. మించుగతి సురలు దివి వా
యించిరి దుందుభులు పేర్మి యింపారఁగ న
గ్గించిరి విరిసోనలు వ
ర్షించిరి భయ ముడిగి సంతసించిరి మఱియున్. ౭౮౨

వ. హతశేషులగు రక్కసు లద్దేవికిఁ బ్రణమిల్లి యభయంబు వడసి పాతాళమ్మునకుఁ జనిరి. ౭౮౩

క. ఇది శుంభవధ యనం జనుఁ
జదివిన వ్రాసినను విన్న జనులకు సౌఖ్య
ప్రదము సుతప్రదము జయ
ప్రదము ధనప్రదము కడుశుభప్రదము నగున్. ౭౮౪

వ. అన విని జనమేజయుండు మహాత్మా! మహామహిమ యగు నప్పరశక్తి నారాధించి మఱియు మున్నెవ్వరు వరంబులం బడసి రనవుడు సాత్యవతేయుం డిట్లనియె. ౭౮౫

—* సురథోపాఖ్యానము *—

సీ. పుడమివేల్పులయెడఁ బున్నెంపుసేఁతయు
యజనంబు నిత్యసత్యవ్రతంబు
గంభీరభావంబు కరుణాపరత్వంబు
నీతియు నేకపత్నీవ్రతంబు
చాపకౌశలమాది సర్వశాస్త్రప్రవీ
ణత్వ మాశ్రితరక్షణంబు శుచియు
గురుభక్తి మొదలగు గుణములు గల్గు సు
రథుఁడను నొకమహారాజు మున్ను

గీ. నేల నాల్గు చెఱంగులు నేలుచుండ
నద్రివాసులుమ్లేచ్ఛు లత్యధికబలులు
కొంద ఱతనికిఁ బగతురై కొండగుహల
నుండి తమదండుతోడ నుద్దండు లగుచు. ౨౯౧

క. తాఁకిన నాతండును దన
మూఁకలతో నెదిరి కదనమున నాయవనా
నీకమున కోడి దుర్గ
ప్రాకారముఁ జేరి మదికి వగ వాటిల్లన్. ౨౯౨

క. పగతురకుం బ్రిగడలు లో
నగుటయు దైవమ్ము తనసహాయము గామిన్
మగతనము వృథా యగుటయుఁ
దగ నాలోచించి యిట్లు దలపోసె వెసన్ ౨౯౩

శా. పాపాచారులు మంత్రు లక్కట! ననున్ వంచించి యేనాటికే
నాపాపాత్ములబారిఁ ద్రోయుదురు సత్యం బింత యువ్వారిఁ బైఁ

గాపుం జేసి మెలంగ రాదు పిశునక్రౌర్యంబు సంబంధికృ
త్యాపాతమ్మునకుం దలంకునె! శుచివ్యాపార మగ్గించునే!

క. తాతలుఁ దల్లులుఁ దండ్రులు
భ్రాతలు స్నేహితులుఁ జుట్టపక్కాలని తా
మే తాదృశసంబంధము
చూతురె యెందేని లోభశూరులు పుడమిన్. ౭౯౦

చ. పగతురఁ జేరి వారి సదుపాయమె చూచు ప్రధాను లెందు న
మ్మఁగఁ దగువారె? యంచు గతిమత్తురగంబు నొకండు నెక్కి యొం
టిగఁ వనసీమకుం జనెఁ గడిందిగ ధైర్యముపూని యక్కటా,
జగతిఁ గుటుంబవైరము పొసంగిన నెవ్వనికార్తి గూరదే! ౭౯౧

వ. ఇట్లు చని చిమ్మచీఁకటిఁ జీమకుం జొరరాని యయ్యరణ్యానిం
ద్రియుగగవ్యూతిమాత్రంబగు పథంబు గడచి. ౭౯౨

సీ. వలిగాడ్పు విసరు తీవల నల్లిబిల్లిగాం
చిన చెట్లు తటముల జెలఁగు నదుల
నానందముగ రజతాద్రులువోని సై
కతములఁ దిరుగు సింగములఁ బులులు
హరిణంబు లేన్గులు నాదిగ మృగములు
చదువుసంతల బ్రహ్మచారులనెడి
ప్రాఁబల్కులును హోమపక్వసీవారాన్న
గంధంబు పతితపక్వఫలములును

గీ. నింద్రియమ్ముల కెంతయు నింపునింపఁ
దగిన యొకముని యాశ్రమస్థలము గాంచి

సైంధవము నొక్క భూరుహచ్ఛాయ నునిచి
వినయమునఁ జనె నమ్మునివిభుని యెడకు. ౨౯౩

సీ. చని తపఃకృశు మృగాజిననిషణ్ణుని శాంతు
దాంతు నిర్మత్సరు ద్వంద్వరహితు
నఖిలాగమాంతరహస్య మర్మమ్ముల
నొగి శిష్యులకుఁ దెల్పుచున్నవాని
గని కుండజలవోలెఁ గన్నీరు కాల్వలై
పాఱ నమ్ముని పురోభాగమందు
సాష్టాంగ మెఱఁగి దండాకృతి నొందిన
లెమ్ము లెమ్మని ముని లేవనెత్తి

గీ. శిష్యునొక్కరుఁ దగుమృగాజినము దేరఁ
బనిచి పఱిపించి కూర్చుండఁ బనిచి యతని
నుచితవిధిఁ బూజ సేయించి వచనరచన
శాంతి యిగురొత్త నిటు తమదంత మడిగె. ౨౯౪

క. ఎటనుండి వచ్చి తిటకుం
గటకటపడ నేమివచ్చెఁ గల తెఱఁ గెల్లన్
దటుకునఁ దెల్పుము నాచెం
గటి కరుదెంచియును వగవఁగా నీక నేలా? ౨౯౫

వ. నీ మనోవాంఛితంబు దుస్సాధంబైనను సాధింతు ననవుఁడు గద్గది
కతో నతని కతండిట్లనియె. ౨౯౬

క. సురథుఁ డను పేరి ధరణీ
వరుఁడను శత్రులకు నోటువడి వారల దు

ష్పరిభావము కతమున మీ
చరణద్వంద్వమ్ము గొంటి శరణు మహాత్మా! ౭౯౭

క. ఇల్లా లిల్లును రాజ్యం
బెల్లరఁ దనయులను విడిచి యీ వనమున మీ
కాళ్ళఁబడి శరణుఁజెందితిఁ
దల్లియుఁ దండ్రియును నీవదైవము దేవా. ౭౯౮

వ. మీకు దాసుండనై మీ పనిచిన కార్యంబెల్లఁ జేయుచుందు
ననద నగు నన్నుం గరుణించి శత్రుభయంబు వాపి నాకూర్పు
వారిం గూర్పవే యని కటకటంబడు నన్నరపతి కభయం బొసంగి
ముని యిట్లనియె. ౭౯౯

క. వనవృత్తిని నీవారా
శనమున శుచివగుచు హింస సలుపక నీయం
తన యాశ్రమమున విహరిం
పు నృపాల! లభించు సౌఖ్యములు నీకు నొగిన్. ౮౦౦

వ. అను మునివచనమ్ములకు సంతసిల్లి మునివృత్తి నట వసించుచుఁ
గొండొకకాలమ్మున నొక శీతలతరుచ్ఛాయ నాశ్రయించి దైవికం
బగు నాపదకు వందురుచు రాజ్యపరిత్యాగమ్మును దారపుత్ర
వియోగంబును వైరికృత పరాభవమ్మును దలపోయుచున్నంత
దీనుం డగునొక బచ్చుచోటికి వచ్చినం గని యుపవిష్టుం జేసి
నీ వెవ్వండ? వేకతమ్మున నిటరాక? శోకకారణం బేమి?
నావుడు నతం డతని కిట్లనియె. ౮౦౧

ఆ. వె. బచ్చుకొలమువాఁడ బహుధనవంతుఁడ
సత్యరతుఁడఁ గడుదయాశంబు నీను

లేమి యాగి దుఃఖగామియు గల్గిన
వాఁడు నాఁగవినుతి వడయువాఁడ.

వ. ఏను ధనలుబ్ధులును నసాధులును నగు పుత్రదారాదులచే నిర
స్తుండనై యిప్వనమ్మున కేతెంచితి నా పేరు సమాధి యందురు
భవదీయోదంతంబు వినవలయు దేవర యాననంబు గాంచిన
భాగ్యవత్త ప్రకటం బగుచున్నయది యని వినయవినమితుం డగు
నక్కోమటికి సురథుం డిట్లనియె. ౧౦౩

క. సురథుఁ డనుపేరి ధరణీ
వరుఁడను బగతురకుఁ జిక్కువడి నీవలె దు
ర్మరణభయమ్మున నిటఁ గ్రు
మ్మరు నిర్భాగ్యుండ నిరభిమానుఁడ జడుఁడన్ ౧౦౪

వ. దైవయోగమ్మునం జేసి మన కిరువురకుం బరిచయంబు వాటిల్లె
నిఁక శోకంబు విడిచి యిట సుఖమ్ముగ వసింత మనవుడు సుర
థున కక్కోమటియుం డిట్లనియె. ౧౦౫

సీ. భార్య మేన సుఖంబు వాటిల్ల దనియుఁ గు
టుంబంబు గడునిరాలంబ మనియు
నప్రయోజకులయి యాత్మజు లే నువ్వు
లేని యవాగువున్నైనఁ ద్రావి
కూడఁబెట్టిన సొమ్ము కొల్లపెట్టి దరిద్రు
లై యాపదలకుఁ బా లగుదు రనియు
మనము శాంతింపదు మానవనాథ భా
ర్యను బిల్లలను నేమరల బ్రతికియుఁ

గీ. గాంతునో లేదో యంచు దుఃఖమ్ము వార్ధి
భంగిఁ దరఁగలు గట్టి లోపల నిముడక
పొంగుచున్నది నే నేల పొలియ నంచుఁ
గడవల కొలంది కన్నీరుగాఁగ నేడ్చె. ౮౦౬

క. అని యేడ్చుకోమటిం గనుఁ
గొని నీ! ని న్నిల్లువెడలఁ గొట్టినవారిం
దనుజుల దనుజాకారులఁ
గనుఁగొనినను సుఖము నీకుఁ గల్గునె చెపుమా. ౮౦౭

వ. అని యేనును రాజ్యవిహీనుండఁగదా యని చింతింతు. దైవి
కమ్ము లగునాపద లనుభవమ్మునంగాని తీఱ వైనను మనమిరు
వురము నేగి యిటనున్న మునినాథుం గాంచి సవినయమ్ముగా
శోకనాశోపాయం బడిగి తెలిసికొంద మను రాజు మాటల
కక్కోమటియు వల్లెయని యతనిఁ గలిసి యమ్మునికడ కేగి
మ్రొక్కి నిలువం బడి యున్నంత సురథుండు ముని కిట్లనియె.

ఉ. ఐ చ్చోకఁ డీతఁ డివ్వనముపజ్జనె నాకును మిత్రుఁ డయ్యె నీ
సచ్చరితుండు దారతనుజాతులచేత నిరస్తుఁడై గడుం
హెచ్చినశోకవారినిధి నీఁదుచు నిమ్మభయంబు వేఁడఁగా
వచ్చినవాఁ డనాథుఁ డగువాఁడు ననుంబలెఁ గావవే మునీ.

వ. ఏనును భవదీయపాదసేవాసమాసాదితసుఖాతిశయమ్మునం జేసి
కాలంబు గడప నుంకింతు నైనను నాపడ్డయిడుమలు తలం
పునకువచ్చి నిద్రాసుఖమ్ములు దూరమ్ము లగుచుండు మహాత్మా!
మ మ్మనుగ్రహించి శోకనాశోపాయం బానతీవే యను సురథు
నకు మునివరుం డిట్లనియె. ౮౦౯

గీ. హరిహరబ్రహ్మలైన మాయకుఁ దలంకి
మోహవారాశిలోపల మునుగుచుందు
రనుజమాత్రులు మీర లామాయఁ గడచి
యుండనేర్తురె మోహంబు గండడంచి. ౮౧౧

వ. ఇందుల కొక్క యితిహాసంబు దెల్పెద నాలకింపుఁడు ; కృత యుగమ్మున నారాయణుండు సితద్వీపమ్మున ననేక దివ్యవత్సరమ్ములు దపం బొనరించుచున్నంత నచ్చోటన విరించియు మోహ నివృత్తికై తపంబు సేయుచుండె నిట్లు కొంతకాలమ్ము కడచిన పిదప నిరువురు నత్తావు వదలి చనుదెంచుచు నొక్కెడఁ దారసిల్లి పరస్పర జిజ్ఞాసంజేసి యీవెవ్వం డీవెవ్వండ వని యడిగి కొని రందు విరించి చరాచరాత్మకం బగు జగమ్మంతయు నిర్వర్తించినవాఁడ ననుడు నారాయణుం డతని కిట్లనియె. ౮౧౨

—* భువనసుందరీ మాహాత్మ్యము *—

శా. ఏనాఁటం జగమెల్లఁ జేసితిని నేనే యంచు నాయొద్ద నీ
యీనై పుణ్యము గట్టిపెట్టుము బళే! యీ వెంత! యీసర్వముల్
నానిర్మించినవిశ్వ మచ్యుతుఁడ నే; నాఁ డామధుల్ గైటభుల్
ప్రాణాపేతులఁ జేసి నిన్నరసి సంరక్షించుటల్ వోయెనే!

గీ. రాజసుఁడ వేల యింతగర్వమ్ము నీకు
నిన్నుఁ గని పెంచి దానవానీక మనికిఁ
గడఁగిపోదువంగ వారిధాకలకుఁ గొంకు
లైనఁ దలఁపక యిటుపల్క నగునె మూర్ఖ. ౭౧౪

చ. అనిన విరించి యిట్లనియె నౌర! సుధాంశులతోడఁ బోరునాఁ
డెనసి పరాంబ తోడ్పగుట యింపుకథుం దెలియుంగరాదె! యీ

యనువునఁబల్కఁ నీకు నెటులాడెడి నాలుక, యిట్టులిద్దఱుం
బనిఁగొని వాదుసల్పఁ గనవచ్చెను లింగ మొకండు వారికిన్.

క. ఓనారాయణ ! యోచతు
రానన ! మీరిరువురుఁ గలహము మాని వినుం
డేనొకపల్కు వచించెదఁ
బూనికమైఁ బక్షపాతమును గనకుండన్. ౧౧౮

వ. ఈ ద్వీపమ్మున నిపు డుద్భవించిన యీ మహాలింగమ్మున కగ్రి
మ్మొక్కండును నాదియొక్కండును జూచి రయమ్మున నెవ్వఁ
డరుదెంచు వాఁడు మీ యిరువురం దధికుండు నాపుడు వల్లె యని
హరి పాతాళమ్మునకును విరించి యాకాశమ్మునకును జని రందు,

మ. హరి పాతాళము నేగియేగియును లింగాదిన్ విలోకింప శ
క్కరణిం గాంతునటంచుఁ జింత గొనె ; నక్కంజాసనుండుం దదం
బరవీథిం బడి యేగి లింగమునకుం బారంబుఁ బోరామి ను
ద్ధురలజ్జాధికశోక దైన్యముల లోఁతుం గాంచి యత్తాడుచున్.

వ. ఒక్కచో నుపవిష్టుండై దైవికమ్ముగాఁ దదీయశిరమ్మునుండి
భూమిపయిం బడు నొక్క మొగలిపూవుం గాంచి దానిం బరిగ్ర
హించి సంతసమ్మున నయ్యాసురాంతకుపాలికిం జని యేను లింగా
గ్రంబు గాంచి యచ్చట నున్న మొగలిదళంబు గొనివచ్చితినని
చూపిన హరి యక్కేతకి కిట్లనియె. ౧౧౯

క. నిజముగ లింగశిరం బీ
యజుఁడు గనుంగొనెనె ? నీవు నచ్చోట సుర
వ్రజపూజితమవె ? నాపుడు
నిజ మని యమ్మొగలిపూ వనృతము వచించెన్. ౧౨౦

వ. హరియును దానిపలుకు విశ్వసింపక లోకంబునం గొందఱు ధనాశం జేసి కూటసాక్ష్యం బిత్తురని పలికి యివ్విషయమ్మున నాకు మహాదేవుండ ప్రమాణం బనినఁ దిరోహితుం డగుచు శివుం డతని కిట్లనియె.

గీ. అనృతవాదిని కేతకి యకట ! నాదు
మ స్తకమునుండి పడుచు నమార్గమధ్య
మందుఁ గంటఁ బడఁగఁ జతురాననుండు
చేతఁ గొనివచ్చెఁగాని మచ్ఛిరముఁ గనఁడు. ౮౨౨

వ. అని పలికి కోపమ్మునఁ గేతకిం గాంచి యనృతం బాడితివిగాన నిది మొదలు నాకుఁ బూజింపఁదగవని శపించెఁ బిదప వారిరువురును యథేచ్ఛఁ జనిరి. ౮౨౩

క. కావున మోహము జగమున
నేవారును దాఁటలేరు నృపవర ! మిగులన్
బ్రావీణ్యము కలవారి మ
నోవృత్తులనైన మాయ నూలొకొనఁజేయున్. ౮౨౪

గీ. అట్టిమాయకు లోనుగా కంబ యొకతె
సర్వమును సృష్టిఁజేసి రక్షణమొనర్చి
లయము గావించు నాయంబ లక్షణములు
తెలిసికొన్నను మోహవార్ధినిఁ దరించు. ౮౨౫

వ. నావుడు సురథుండు తల్లక్షణంబు నెఱింగింపు మనుడు.

సీ. రాజేంద్ర ! విను శుభప్రదమును గామద
మును నగు నంబికాపూజ చెప్ప

నియతేంద్రియుఁడయి మునిఁగి తెల్లనిమడుంగు
  గట్టి వార్చియు శుభాగారమందు
గోమయలిప్తమై గోముఖాలంకృత
  మై యొప్పుగను మంటపాంతరమునఁ
దనశక్తి కొలఁది నెంతయుఁ బూజకై తగు
  ద్రవ్యమ్ములను గొని భవ్యరీతి

గీ. ధరణి నాత్మను గాలంబుదగ విశుద్ధి
చేసి చిత్తంబు శుద్ధంబు చేసి పిదపఁ
దామ్రమయ మగు నొక్కపాత్రమ్మునందు
ద్విజులతోఁ గూడ వేదచోదితముగాఁగ. ౮-౨౬

వ. షట్కోణం బగుయంత్రమ్ము లిఖయించి దాని కెలన సప్తకోణ యంత్రమ్ము నాసాదించి పదంపడి నవాక్షరమంత్రబీజమ్ములు యథాన్యాసమ్ముగా వ్రాసి ప్రాణప్రతిష్ఠ యొనర్చి షోడశోప చారమ్ములం బూజించి శక్త్యనుసారమ్మునఁ దన్మంత్రజపం బొనర్చి తజ్జపసంఖ్యాదశాంశమ్మున హోమమ్మును దద్దశాంశ మ్మున దర్పణమ్మును దద్దశాంశమ్మున బ్రాహ్మణభోజనమ్మును గావించి చరిత్రత్రయపాఠం బొనరించి విసర్జింప వలయునని చెప్పి వెండియు. ౮-౨౭

క. సువ్రతు లగువారికి ని
త్యవ్రత మాశ్వయుజమాసమందు న్నవరా
త్రవ్రత మది సెప్పెద విబు
ధవ్రజమతముగ నిది విని తనియుఁడు మీరల్. ౮-౨౮

వ. ఆశ్వయుజ చైత్రమాసమ్ము లను నీరెంట నాది యాదిగ నవ రాత్రమ్ములు జితాహారుండై జప్యమంత్రమ్ములచే శర్కరామధు

ఘృతయుతమ్మగు పాయసమ్మునఁగొండె ఛాగమాంసమ్మునఁగొండె బిల్వపత్రమ్ములఁగొండె హోమంబు గావించి ద్విజభోజనం బొనర్చిన వారికి నొకండన నేల సమస్త కామమ్ములును గరతలామలకమ్ములగు నిందుజాతిభేదంబును స్త్రీపుంసభేదమ్మును నకించిత్కరమ్ములు విధిచోదితంబుగ నెవ్వండేని మండలం బొనరించి పుష్పమాలాలంకృతం బగువితానంబు సంధించి కలశస్థాపనం బొనర్చి యంత్రప్రతిష్ఠిత యగునద్దేవిని త్రికాలమ్ములయందు ధూపదీపాదికమ్మున నర్చించుచు గీతాదికమ్ములును వేదపారాయణంబులును విస్తరింపఁ జేయుచు యదామతి యథాశక్తిగ విత్తశాఠ్యంబొనరింపక సుగంధతైలచందనభూషణాదులచేఁ గన్యకల నర్చించుచు నవరాత్రమ్ములు గడపి ద్విజభోజనపురస్కారమ్ముగా దశమినాదినమ్మునఁ బారణం బొనర్చి క్రతుసమాప్తి గాంచిన వాఁ డుత్తమలోకమ్మున కేగి దేవిసాయుజ్యమ్ము గాంచు నని వెండియు, ౧౨౯

క. నవరాత్రవ్రతమున కెన
యగువ్రతము మఱొండు గాన మవనీశ్వర ! యీ
యవనిన్ బంధుల నందఱ
నవశ్య మందెదవు దేవి నర్చింపు మిటుల్. ౧౩౦

వ. అని సమాధిం గాంచి. ౧౩౧

క. ఓ వైశ్యోత్తమ ! నీవును
గావింపుము దేవిపూజ, క్రమముగ నీదుః
ఖావేశమడంగుచు ధని
వై వర్ధిల్లెద వటంచు నానతి యీఁగన్ ౧౩౨

వ. వారలిరువురును హర్షోత్ఫుల్ల లోచనులై మొక్కి దేవరదర్శనంబునఁ జేసి యస్మత్తాపంబు వాసె ధన్యుల మయ్యెద మమ్మం

త్రరాజం బుపదేశింపవే యనుఁడు ధ్యానబీజపురస్సరమ్ముగా నవా
క్షర మంత్రమ్ముపదేశించిన మునిపతి కేఁగి చని యొక్కనదీతీర
మ్మున విజనప్రదేశంబు నాశ్రయించి శుష్కపర్ణాశను లగుచు
రెండు వత్సరమ్ములు జపించి నంత నొక్కనాఁడు స్వప్నమ్మున
రక్తాంబరధారిణియైదేవి పొడగట్టినం గాంచియుఁ దపంబు చాలిం
పక తృతీయవత్సరం బంతయు జలాహారంబుగఁ గడపి పదంపడి
దేవీసాక్షాద్దర్శనంబు గానక. ౮౩౩

మ. ఒకకుండమ్మును దవ్వి పావకుని నందూర్ధాత్ముఁ గావించి పా
యక దేహంబు త్యజింపఁగాఁ దెగువ సేయంబూని మాంసంబు పా
వకునందుం దెగఁ గోసి హోమమొనరింపన్ దాన శ్రీదేవి య
వ్యకలంకాత్ములకుం గనంబడియె ధ్యేయాకార మేపారఁగన్.

వ. ఇట్లు చూపట్టి మీసాహసంబువలన నేను బ్రసన్ననైతి వరంబు
గోరుఁ డనవుడు సురథుం డి ట్లనియె. ౮౩౫

మ. జననీ! మార్తురచేతఁ జిక్కవడి రాజ్యం బేది యీకాననం
బున నిన్నాళ్లు వసించి నాదు వితతంపుంబుణ్యముంజేసి నీ
మనురాజంబు జపించి నీకరుణ సమ్మానంబు గైకొంటిఁ గా
వున నాతొల్లిటిరాజ్య మిచ్చి యశుభంబుల్ వాపుమా నావుడున్

సీ. పగతురు నీచేతఁ బడుదురు బల మేది
నీమంత్రులెల్లరు నిన్నుఁగొల్వ
నేతెంతు రీవు నీయిల వేయి సంవత్స
రములు మహాప్రభవమున నేలఁ
గల వింటి కేగుము కళ్యాణములు సమ
కూరుకాలము నీకుఁ జేరువయ్యె

నని యంబ సెలవీఁగ నవనీపతియు ముద
మంది తొల్లింటిహాయమ్ము నెక్కి

గీ. పగతురను గొట్టి పృథివి చేపట్టి మంత్రి
వరులతోఁ గూడ రాజ్య మవార్యలీలఁ
బాలనమొనర్చి వేయిసంవత్సరమ్ము
లుండి తుది దేవదేవిసాయుజ్య మందె. ౮౩౭

వ. కోమటియు నాపె కెఱఁగి యిట్లనియె. ౮౩౮

క. తల్లీ! ధనధాన్యమ్ముల
నొల్లన్ వేఱొండునొల్ల నుల్లాసములం
దెల్లను నశింప నేరని
యుల్లాసము గోరువాఁడ నుల్లము దనియన్

వ. అనిన దేవియు నతనికి దివ్యజ్ఞానం బొసంగి యంతర్ధానంబు చేసెఁ బదంపడి వాఁడును తీర్థాటనాదిపుణ్యకార్యమ్ములచేఁ గాలయాపనం బొనర్చి ముక్తసంగుఁడై తుదకు దత్సాయుజ్యంబు వడసె నియ్యది భూపవైశ్యుల చరితంబు దేవ్యారాధనఫల ప్రాప్తిదృష్టాంతంబు దీనిం జదివినను విన్నను బురుషార్థమ్ములు గలుగు నని వ్యాసుండు జనమేజయునకుం జెప్పిన ట్లక్కథకుండు మునులకుం జెప్పుటయు.

క. కడియెద్దపురవిరాజిత!
మృడపాదాంభోజచంచరీకహృదయ! ద్రా
విడశాఖాభూషాయిత!
జడవిజ్ఞానప్రదాన! శాస్త్రనిదానా! ౮౪౧

క. నానాతీర్థాటనసం
ధానాపారాన్న దానతతవిద్యాదా
నానూనపుణ్యసంభృత
మానాతీతోరుకీర్తి ! మద్గురుమూర్తీ ! ౪౪౨

—* భుజంగప్రయాతము *—

సదానందచిత్తా ! పరిశాస్త్రార్థవేత్తా !
వదాన్యాగ్రవర్తీ ! శుభఖ్యాతకీర్తీ !
పదాలంబిభూపా ! కృపాధూతపాపా !
నిదాఘార్కకాంతీ ! మునిశ్లాఘ్యశాంతీ ! ౪౪౩

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం బయిన దేవీభాగవతం
బను మహాపురాణమ్మునందుఁ బంచమ స్కంధము
సంపూర్ణము. శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మత్పరదేవతాయై నమః

శ్రీ
దేవీభాగవతము

షష్ఠస్కంధము

వి మలతరహృదయ సరో
త్తమచిత్రచరిత్ర శాస్త్రతత్త్వజ్ఞ కలా
ర్థి మహిత సుమహిత సతత
భ్రమరహిత మనోజ్ఞమూర్తి బ్రహ్మాలయశాస్త్రీ.

వ. అవధరింపు మనంతరంబ శౌనకాదులు సూతుంగాంచి. ౨

గీ. పరమవిజ్ఞానియైన ద్వైపాయనమునిఁ
గొలిచి శ్రమచేసి విద్యలఁ గొంటి వనఘ

నీదు వచనామృతంబుమన్నించి త్రావు
కొలఁది మా కాదరం బెక్కెఁ గొసరికొసరి. 3

చ. మరల నినుఁ మహామహు సమంచితబుద్ధివిశాలు నిమ్మునీ
శ్వరులు శ్రుతిప్రసిద్ధమగు సత్కథనొక్కఁడు గోరనెంచి రా
దరమునఁ జెప్పుమయ్య మును త్వష్టకుమారుఁడు వృత్రుఁడప్పురం
దరునికతమ్మునన్ రణమునన్ మృతుఁడౌట ప్రసిద్ధమేకదా. ४

వ. సురపక్షీయుండగు త్వష్టకుఁ గొమరుండైన వృత్రుని వధించుటకు
సత్త్వగుణోత్పన్నుం డగుశక్రుం డెట్లంగీకరించె? విష్ణుం డీకృత్య
మ్మునకుఁ దోడ్పడి పవిమధ్యమ్మున నెట్లు డాఁగె? నియ్యది
సత్త్వమూర్తియగు నతనికిం దగునే? యని మఱియును, ౫

క. ఇరువురు హరులును సత్యం
బరయక జలఫేనమున మహామహు వృత్రున్
హరియించిరికద, ధర్మ్మపు
మరియాద యొకింత వలదె మహనీయులకున్! ౬

క. కేవలమిషగతి విశ్వా
సావహు నొనరించి వృత్రుహరియించిన య
ద్దేవపతి బ్రహ్మహత్యా
ప్రావృతుఁడై లోకనిందఁ బడయఁగ లేదే. ౭

వ. ఇది యిట్లుండ నీవు వృత్రుండు దేవిచే నిహతుండయ్యెనని నుడి
వితి వదియెట్లనవుడు, సూతుండు మునులంగని యిట్లను; ముని
లారా! సావధానులరై యాలింపుఁడు మీయట్ల జనమేజ
యుండు పరాశర సూతి కిట్లనియె. ౮

క. హరి హరిసాహాయ్యమ్మునఁ
బోరిగొనె వృత్రు నని దేవి పొరిగొనెనను చె
క్కురణి లగియించు ? నొక్కరుఁ
డిరుపురవధ కెట్లు విషయుఁ డెటేఁగింపు మొగిన్. ౯

క. పరమోత్తము లనఘులు స
త్త్వరతు లగణ్యప్రభావధన్యులు లోకో
త్తరులగు పుణ్యాత్ముల స
చ్చరితలు వినుకతన జన్మసాఫల్యమగున్. ౧౦

వ. నావుడు వ్యాసుం డిట్లనియె. ౧౧

క. నరవర ! ధన్యుఁడ వీ వా
క్కరుఁడవె, సచ్చరిత లిట్లు కాంక్షింతువె ! త
త్పరులై వినువారుండినఁ
బరమప్రీతి యగు నొడువువారికి నెందున్. ౧౨

ఉ. వేదములం బురాణముల విశ్రుతమై తగుఁ ద్వాష్ట్రి ధర్మమ
ర్యాదకుఁ దక్కి విష్ణుని సహాయునిఁగాఁ గొని పాకవైరి దా
భేదిలఁజేసి దుఃఖమును బెల్లుగ నందె నటంచు ; మాయఁ బెం
పేది మునీంద్రులే కుటిలకృత్యములం బడ నొల్లశక్యమే ! ౧౩

గీ. ఈతఁ డొక్కరుఁ డన నేల, కృష్ణుఁ డకట !
సత్త్వవిగ్రహుఁ డయ్యు మిమగతిఁ దునిమె
రక్కసులనెల్ల ; జ్ఞానంబు నుక్కడంచు
మాయ భగవతి యేరి కజేయ గాదె. ౧౪

క. వేలకొలఁదియుగముల మా
యాలీలన్ జలచరాదికాకారమ్ముల్

దాలిచి విహితావిహితము
లోలిం దెలియకయ విష్ణు వొనరుచు ననఘా. ౧౭

చ. హరి యన నొక్కఁడేమి! జను లందఱు మాయకతమ్మునన్ బరా
పరము లెఱుంగ లేక సదుపాయము గానక "సాధనంబు నా
తరుణి," యటంచు మోహమునఁదద్దయు మున్గుచుఁదేలుచుం బొన
ర్తురు సుకృతమ్ము దుష్కృతము తుందుడుకొప్పఁ బరీక్షిదాత్మజా.

క. నరుఁ డొక్కరుఁడును మాయా
తరణోపాయం బెఱుంగఁ దగఁడు హరిపురం
దరు లావృతాత్మసురునిం
బోరిఁగొనుటయుఁ దన్మయత్వమునన నృపాలా. ౧౮

గీ. స్వార్థ సాధనతత్పరతాత్ములగుచు
హరిపురందరులు నెపము నలవరించి
పొలియఁజేసిరి వృత్రునిఁ బూర్వవైర
కారణంబు వచించెద ధారుణీశ. ౧౯

గీ. దివిజులకు నెల్ల ఘనుఁడు భూదేవహితుఁడు
కలఁడు త్వష్టప్రజాపతి కడుఁదపస్వి
యతఁడు సృజియించెఁ ద్రిశిరస్కుఁడైన పుత్రు
విశ్వరూపుని నింద్రవిద్వేషమెనయ. ౧౬

—* విశ్వరూపుఁడు తపమ్ము సల్పుట *—

క. వదనమ్ములు మూఁడింటన్
బదపడి వేదైనపనులు పచరించుచు స
ద్వదితగతి వృద్ధిఁజెందెన్
ముదమునఁ దనుఁజూచి యెల్లమునులు నుతింపన్. ౨౦

గీ. ఒక్క మొగమున వేదమ్ము నోగిఁ బఠించు
నొక్కమొగమున సురఁదాగ్రవు నొక్క మొగము
నన్ సమస్త ప్రపంచమ్మునం గలుగు వి
శేషములు చూచు నతఁడు మనీషిహితుఁడు. ౨౧

క. తపమాచరించెఁ బంచా
గ్ని పరీతుండగుచుఁ దగ నకిల్బిషబుద్ధిన్
విపరీతశ్రద్ధా ధ
ర్మపరాయణుఁడగుచుఁ దన్ను మాన్యులు మెచ్చన్.

గీ. పాదపాగ్రమ్ముపై నొకపరి వసించి
ప్రుండువంటి చలిని నీటనుండి మండు
వేసవిని జుట్టు నగ్నుల విసువకునిచి
యతఁడు దపమాచరించు నాహారమెడలి ౨౩

గీ. అట్లు తపమాచరించు నయ్యనఘుఁగాంచి
తనపదవి నీతఁడు హరించుననుచు నెంచి
తపము విఘ్నంబొనర్చెడి తలఁపు మించి
యిందుగ్రఁడు సభాస్థలమునకు నేగుదెంచి. ౨౪

వ. కామమ్మునఁ దపం బడంగు నని రంభోర్వశీమేనకలం బిలువం
బంచి తారుణ్యమదగర్వితలగు నక్కాంతల కిట్లనియె. ౨౫

ఆ. వె. మూఁడుతలలతపసి మునుకొని నాదుసిం
హాసనము హరించు నబలలార !
యెట్టులైన మీరు నెట్టన వాని త
పమ్ము చెఱిచి నిలుపవలయు నన్ను. ౨౬

క. సింగారములూని కన
త్సంగీతరవముల నాట్యసంగతులఁ గలా
భంగుల రంగుల నతని న
నంగుని కొప్పింపవలయు నంగనలారా. ౨౮

వ. అని కనికరం బుట్టిపడఁ దమ్ముం గోరు శచీపతి కచ్చరలిట్లనిరి.

చ. తలరఁగ నేల ? యబ్బురపుఁదళ్కు-లఁ గుల్కు-లఁ బల్కు-లన్ ఝుళం
ఝుళితవిరావనూపురలసత్పదసంగతి నొప్పు లాస్యరీ
తుల మృదుగానపద్ధతులఁ దోరపు నేరుపు గల్గు బెళ్కు-చూ
పుల వివశుం బొనర్చి మునిపుంగవు దాసునిగాఁగ నేలమే ! ౨౯

వ. అనిచెప్పి యమ్ముని యాశ్రమమ్మున కరిగి. ౩౦

క. పాడుదురు సుస్వరమ్ముగ
నాడుదురు లయానుగతుల నభినయమున బల్
పోఁడిమి నెఱపుదురు మునిన్
రూఢిగఁ గరఁగింప వేల్పురోయింతు లొగిన్. ౩౧

క. నాకాంగన లతినైపుణి
మేకొనఁగ నొనర్చునట్టి మేళపుఁగృతులన్.
మూకాంధబధిరపద్ధతి
గైకొని యతఁడించుకేనిఁ గరఁగఁడు వింటే ! ౩౨

వ. అచ్చరలును నచ్చటఁ గొన్ని దినమ్ములుండి యతనిధైర్యమ్మున
కచ్చెరువడి మరలి యింద్రునికడ కరిగి దీనాననమ్ములతో నిట్లనిరి.

ఉ. చేసితి మిన్నినాళ్ల తనిచెంత శ్రమంపడి హావభావవి
న్యాసములన్ రసాభినయనాట్యమృదంగరవానుషంగవీ

ణాసరసస్వరానుమతనవ్యగుణోల్బణగాన మాదిగాఁ
జేసెడి చేష్టలన్నియును ; జెక్కు-చెమర్పదు మౌనికింతయున్.

గీ. ఎన్ని చేసిన నాతనియెడల " బూదెఁ
బోయు పన్నీరు " లాయెమాపోయగములు
శాపహతిఁగందకే నీవు సన్నిధికి న
దృష్టమున వచ్చితిమి దేవదేవ మరల. ౩౫

క. నావుడు దివిజేంద్రుం డ
ప్పావనుఁడగు మౌనివరునిఁ బరిమార్పఁగఁ జిం
తావిష్టుఁడయ్యె నది యశు
భావహమగు కృత్యమనుచు నారయఁ డధిపా ౩౬

వ. ఇట్లింద్రుఁడు దుర్మనస్కుండై గజమ్ము నధిష్ఠించి తపస్సమాధి
దీక్షితుండగు నమ్మునివరు నీక్షించి. ౩౭

చ. తపసి మహానుభావుఁ డతిదాంతుఁ డటంచన కీతఁ డాత్మకున్
రిపుఁ డగు నంచు వజ్రమలరించి కరమ్మున వైచెఁ దద్ధతిన్
వ్యపగతజీవుఁడై పడియె నమ్ముని, మౌనులు శోకమంది " దే
వపతి యిసీ తపస్వుల నపాపులఁ జంపఁగనేల యక్కటా." ౩౮

క. అని యాక్రోశింపుచు ని
య్యనఘునిఁబొరిగొన్న యాతఁ డచిరమ్మున దుః
ఖనియతుఁ డగునని పల్కి-రి
చనియె సురేంద్రుండు తనదు సదనమ్మునకున్ ౩౯

వ. అంత నమ్ముని వజ్రనిహతుండయ్యును జీవసహితుండునుంబోలె
ననర్గళతేజమ్మునన్ బొల్చుడు నింద్రుం డితండు పునర్జీవితుం డగు
నో కో ! యనిశంకించి తన్మునిం బిలిచి యిట్లనియె. ౪౦

ఆ. వె. అనఘుఁ డితఁడు వజ్రిహతుఁడయ్యు జీవన
హితునివడువు చెంది యెసఁగుచున్న
వాఁడు మరల బ్రతుకువడయునిగతి శిర
ములను జెక్కుమనుడుఁ బలికె నతఁడు ౪౧

చ. అకట యితండు వజ్రిహతుఁడై మృతిచెందె మృతుర్ వధించి పా
తకమునఁ బోవనేర్తునె వృథాగతి నిమ్మునిఁ జంపఁజొచ్చి తే
మికతననో యెఱుంగ వినుమీ యిది పెద్దకళేబరంబు మా
మకపరశుప్రచారము సమగ్రతమైఁ దఱుగంగ నేర్చునే. ౪౨

క. మృతుఁడయ్యె నితఁడు నిక్కము
వితగాఁ దలఁ దఱుగనేల వినుమింతకు నీ
వితనికతన భయమందిన
వితముం దెలియంగఁ జెప్పవే? నా కనుడున్ ౪౩

వ. ఇంద్రుండిట్లను నితండు మహానుభావుండగు మునియయ్యును నాకు శత్రువగుటంజేసి యెబ్భంగినైన నరివధ కర్తంబగుట నితని వధించితి. ౪౪

క. హతుఁడయ్యును బ్రతుకుంగను
వితమునఁ గన్పట్టె ధర్మవిదు లగ్నిఋణ
ప్రతివీరశేష ముంచిన
కతనన్ ముప్పాదవు నండ్రు గాదె యెందున్. ౪౫

వ. అనిన నతండిట్లను నిట్టినిరపరాధి యగు బ్రహ్మతేజస్కుఁ దపస్వి వధింప నుంకించిన నీకు బ్రహ్మహత్యాభయంబు లేదె? నావుడు నిందుఁ డిట్లనియె. ౪౬

ఆ. వె. బ్రహ్మహత్య కేను భయపడ శత్రుశే
షమ్ము కతన నామనమ్ము కలఁక
చెందఁ జొచ్చెఁ బాపచేష్టఁ బ్రతిక్రియ
వలనఁ బాపికొనఁగవచ్చు ననఘ ! ౪౭

వ. ఎట్టిపాప్రాయశ్చిత్తం బొనర్చినను శత్రుశేషంబు నశింపదుగాన
బాపపుణ్యమ్ములెంచక యేగతినైన శత్రు ండు వధ్యుండు నావుడుఁ
దత్తుం డిట్లనియె. ౪౮

గీ. ఈవు లోభాభిహతిఁ జేసి యిట్టిపాప
కృత్యమున కియ్యకొంటి వొక్కింత యేని
లోభమెనయని నా కెట్టులు హితమిట్టి
యహితకృత్యంబటన్న నిట్లను బలారి. ౪౯

వ. అట్లేని నీకిది మొదలు జన్నములు భాగంబేర్పఱచెద యజ్ఞార్థంబగు
పశువుశిరంబు నీయది నావుడు సమ్మతించి తత్తుం డతనిశిరమ్ము
లఁ దనపరశువున నఱికె నంతట. ౫౦

క. శిరములు ధరఁబడు నాలోఁ
గరమాశ్చర్యంబు వొడమఁగా వేలకొలం
ది రహి జనించెం బక్షులు
తరతరమ శిరములనుండి ధరణీనాథా. ౫౧

వ. శ్రుత్యధ్యయనమ్మును సోమపానమ్మును నొనర్చు ముఖమ్మునఁ
గపింజలమ్ములును సర్వదిఙ్నిరీక్షణం బొనర్చు మొగమ్మునఁ దిత్తిరి
పక్షులును గలుదాత్రువక్త్రమ్మునఁ గలవింకమ్ములును బొడమె
నంత నిందు్రండు దన్నుం గృతకృత్యునిఁగా నెంచికొని బ్రహ్మ
హత్యం బాపికొన నెంచునంతఁ ద్వష్టృప్రజాపతి తనపుత్రుమర
ణమ్ము విని యింద్రునియెడ నగ్గలపుటలుకవొడమి యిట్లనును.

క. కనుఁగొనుఁడు సురలు నాదగు
తనయు నిరపరాధు మానతత్పరునిం జం
పిన యింద్రుని గీటడఁగిం
ప నొకమహాబలునిఁ బుత్త్రుఁ బ్రసవింతు నొగిన్. ౧౩

వ. అని కృతనిశ్చయుండై యథర్వణోదితమ్ములగు మంత్రమ్ముల నగ్ని నారాధించి వేల్చినఁ దత్కుండమ్మునుండి పావకుండునుం బోని యొక్క జాజ్వల్యమానశరీరుండు సుతుండు పుట్టిన వానిం గాంచి త్వష్ట యిట్లను. ౧౪

క. ఆవిర్భవింప నేమగుఁ
గేవలమింద్రుని బలమ్ము గీటడఁగింపం
గా వైరి వగుచు నిప్పుడ
వే వృద్ధిం జెందు మన దివిజులు వడంకన్. ౧౫

గీ. అంతలోఁ బర్వతాకారుఁడై యతండు
కాలమృత్యువునాఁ దండ్రిఁ గాంచి పలుకు
నాదు పేరేమి? యేకారణమున నన్ను
సృష్టిచేసితి? నీకేల చింత సెపుమ. ౧౬

—* వృత్రాసురోత్పత్తి *—

క. నీమదినిఁ గలుగుకోరిక
సామాన్యము గానిదేని సాధించెద, వాఁ
డేమిటికిఁ దండ్రికింగల
కామము నెఱవేర్పలేని కాపురుషుఁ డిలన్? ౧౭

చ. సురలహరింతునో? జమునిఁ జొప్పడఁగింతునో? యింద్రుఁ ద్రుంతునో?
వరుణు నడంతునో? శశిదివాకరులన్ వధియింతునో? ధరా

ధరముల ముక్కముక్కలుగ దంతునో? యీజలరాసులకా సము
ద్ధురగతిఁ ద్రావనెంతునో? సుతున్ననుఁబంపు మనంగ నాతఁడున్.

వ. కొమరున కిట్లను నీవు వృజినమ్ముకతన రక్షింప నుద్భవించుటం జేసి వృత్రుండనఁ బరఁగి త్రిశిరస్కుండును దపోనిష్ఠాగరిష్ఠుండును వేదవేదాంగతత్త్వజ్ఞుండును నగు నీయన్న ననపరాధు వధించిన బ్రహ్మఘ్ను నిందు్రి వధియింపుమని చెప్పి, గీ॥

గీ. తనయశోకాకులుం డయి త్వష్ట వివిధ
గతుల నాయుధములు చేసి యతులబలున
కాత్మజాతున కిచ్చి యింద్రాదిసురలఁ
బోరిగొనెడి పూన్కిమైఁ బంచెఁ ద్వరయెలర్ప. ౬౦

వ. పదంపడి వృత్రుండు శుభదినమ్మున బ్రాహ్మణాశీరవపూర్వకంబుగఁ బిత్రుదత్తంబగు రథం బధిష్ఠించి తద్దత్తమ్ములగు ఖడ్గశూలగదాతోమరపరిఘపట్టసాద్యాయుధమ్ములును సహస్రారంబై సుదర్శనంబునుంబోని చక్రమ్మును దివ్యంబగు కవచమ్మును నక్షయతూణీరమ్ములును ధనుర్బాణమ్ములును ధరియించి మున్ను దేవతలచే ధిక్కృతులగు రక్కసులుతోడుగా శక్రహననార్థమ్ముగా వెడలుటయు దూతలు వైళంబచని యింద్రునితో నిట్లనిరి. ౬౧

గీ. పుత్రశోకాతురుఁడు త్వష్ట పుట్టఁజేసె
నినువధించుటకై వృత్రుఁ డనెడికొమరు
మేరుమందరతుల్యుఁ డమ్మేటి వచ్చె
బలియురగు రక్కసులు చుట్టు బలిసి కొలువ. ౬౨

వ. ఆలోనన వృత్రసైన్యదర్శనమాత్రపలాయమానులై కొందఱు
దేవత లచ్చటికి వచ్చి యిట్లనిరి, ౬౩

క. దేవా! దేవరపురమున
భావింపఁగరాక ప్రబలభయజనకంబై
యావిర్భవించె దుశ్శకు
నావళి దైవగతి కేమి యనఁదగు నకటా. ౬౪

సీ. కాకగృధ్రమ్ములు కంకముల్ శ్యేనముల్
"చీచికూచి" ధ్వనుల్ సేయఁ దొడఁగె
వాహనమ్ములు నీరు వర్షింపఁగాఁ జొచ్చె
నేత్రాంచలమ్ముల నిశలయందు
భవనమ్ములకుఁ బయిపై నుండి రాక్షసు
లఱవఁ జొచ్చిరి, వాతహతి నెనయక
ధ్వజములు పడఁజొచ్చెఁ దరుణులు గొందఱు
నీలవస్త్రమ్ముల నోలిఁ దాల్చి

గీ. వికృతిమెయి నిల్లిలుఁజరింతు, రకట స్వప్న
మందుఁ గాంతల రక్కసు లడఁచి కొప్పు
లీడ్చినట్లగు, భూకంప మెనయు, నక్క
లఱచు, సరటలు పుట్టు గృహమ్ములందు. ౬౫

వ. అని దివిజులు వల్కిన నింద్రుండు భయాతురుండై బృహస్పతిం
గని యిట్లను. ౬౬

క. ఇల నుల్కాపాతమ్ములు
వొలుచు నభస్థలమునుండి పొరిఁబొరి వాతం
బులు దారుణగతిఁదగు నిఁకఁ
గలతెఱఁగుం దెలిసి శాంతి గావింపఁగదే. ౬౭

వ. నావుడు గురుం డిట్లనియె. ౬౮

గీ. నెట్టపంటఁగఁ జంపితి నిరపరాధుఁ
డైన మునివర్యు నీకు నద్దాన నేమి
ఫలము సమకూరె ! నిప్పు డప్పాపకర్మ
మేల నినుఁగట్టి కుడుపక తేలవిడుచు. ౬౯

క. ఏపని నైనను దగఁ దా
నోపి విచారించి చేయు టొప్పగుఁ, గాదే
నాపదలకు మూలంబై
కాఁపుర మగు వానిబ్రతుకు గష్టమ్ములకున్. ౭౦

గీ. మోహలోభమ్ములం జేసి మొదల బ్రహ్మ
హత్య మెడఁగట్టికొంటి వేమందు నిన్ను
" ఫలము వైళమ కనుపట్టు నలఘుపుణ్య
పాపముల " కను పెద్దల పలుకు వినవె ? ౭౧

క. అరయఁగ విను పరపీడా
పరాయణుఁడు సౌఖ్యములను బడయఁడు నీకుం
బరిభూతికిఁ దఱియయ్యెం
గరము నవధ్యుండు వాఁడఖండుఁడు బలిమిన్. ౭౨

ఆ. వె. త్వష్ట యిచ్చె నాయుధములు వానికి నీదు
వజ్ర మొక్కఁడాని పాటిగాదు
వేయిమాట లేల ? వృత్రుండు మీపాటి
వాఁడు గాఁడు మేటి వానిధాటి. ౭౩

క. దేవేంద్రప్రళయమ్మున
కై వచ్చుచునున్నవాఁ డహంకృతిమై నాఁ

గా విని మునులును యక్షులు
దేవతలును బరుగులిడిరి దిగు లెదఁగదుర౯. ౭౪

వ. సదనమ్ముల౯ విడిచి పలాయనం బొనర్చు నమరులం గని యిం
ద్రుండు చింతాపరుండై సేవకుల కిట్లను. ౭౫

క. పిలువుఁడు రుద్రులను దినక
రుల వసువుల ధనదయమవరుణుల౯ "మీరల్
దలరక విమానములపై
నెలకొని సన్నద్ధులై యనికిరం" డనుచు౯. ౭౬

వ. ఇట్లు నియోగించి యతండు బృహస్పతి పురస్సరమ్ముగా గజా
రూఢుండై సంగరమ్మునకుం జనియె నంత దేవతలును దమతమ
యాయుధమ్ములతోఁ బిఱుందన చనిరి. ౭౭

గీ. వృత్రుఁడును దానవులతోడ వేడ్క మెఱయ
నరుగుదెంచెను మానసోత్తరసమీప
మునకు నప్పర్వతమ్మున మొనసె రెండు
సేనలును, వృత్రవాసవుల్ చెలఁగి యచట. ౭౮

గీ. ఒకరొకరిఁ జంప నుంకించి యుత్కటముగ
బరిఘ పట్టిసకరవాలపాశబాణ
శక్తిముఖసాధనమ్ముల సంగరమ్ము
సలిపి రొకనూఱువత్సరమ్ము లొకరీతి. ౭౯

వ. ఇట్లు మానుషప్రమాణమ్మున శతవత్సరమ్ములు సంగరం బభంగు
రమ్ముగాఁ బ్రవర్తిల్లిన నది సర్వలోకభయంకరం బయ్యెనంత.

చ. వరుణుఁడు పాఱె నాపయిని వాయుగణంబు చలించె వెన్కకుం
దిరిగె జముండు పావకుఁడు దీప్తికిఁ దక్కెఁ గ్రమక్రమమ్ముగా

సురపతికిం బలాయనము చొప్పడె నందఱు నిట్లొనర్చి ని
ర్జరమథనుండు వృత్రుఁడు వెసం జని తండ్రికి మ్రొక్కి యిట్లనున్.

మ. వరుణుం దోలితి వాసవుం గెలిచితిన్ వంచించితిన్ వాయువున్
సరసీజాప్తు నడంచితిన్ జ్వలనుపై సంరంభముం జూపితిన్
సురలన్ రేపితి 'భీతమారణ' మటంచుం జంప నిం దొక్కనిన్
హరిభీతింబడు నేన్గులెరి రిపులుద్యద్భీతి నాథాటికిన్. ౮౨

గీ. ఇంద్రుఁ డరిగెఁ బదాతియై యేన్గుఁబట్టి
కానుకగఁ దెచ్చితిని దీనిఁ గనుము దేవ
యేమి యొనరింతు వివరించి యెఱుఁగఁజెప్పుము
దుష్కరంబేనిఁ జేయుదుఁ దొడరి దాని. ౮౩

వ. అను కుమారునకుఁ ద్వష్ట సంతుష్టుండై యిట్లను. ౮౪

గీ. కన్నవారలలోనఁ బొగడ్తకెక్కి
మానసజ్వరమును వీడి మనుటగల్గె
నీ పరాక్రమమహిమ వర్ణింపఁ దరమె
జీవితమ్ము ఫలించె సుస్థిరుఁడనైతి. ౮౫

వ. ఇంక నీకుఁ గర్తవ్యంబు విను మెప్పటికినిఁ బాకశాసను విశ్వ
సింపఁ దగదు గావున నతని దురుపాయమ్ములకుఁ దలంక చతు
రాననుం గుఱించి తపంబొనరించి యవధ్యుండవై యింద్రు
నడంపుము. ౮౬

గీ. తపము యశమిచ్చు బలమిడుఁ దాపమడఁచు
లచ్చి నొడఁగూర్చు రాజ్యవిలాస మొసఁగుఁ
దప మిడని దొక్కటియు లేదు దాని సలుపు
మయ్య! యవధానివై శక్రు నడఁపుమయ్య. ౮౭

ఉ. కంటికి నిద్ర రాదు సుతఘాతుకుఁ డైన బలారిచేత నా
కంటికి బుద్ధి పో దకట కల్మష మించుక యేని లేక మి
న్నంటుగతిన్ మహాతపము నంది తనంత వసించు పుత్త్రకున్
గంటకుఁ డై హరించె నిఁకఁ గల్గునె శాంతి కుమార నామదిన్.

వ. అను తండ్రి యూఁతంగొని వృత్రుండు క్రోధావేశమ్మున గంధమాదనమ్మున కరిగి. ౮౯

చ. అమరధునిన్ మునుంగుచుఁ గుశాసనమందు వసించి వారిపా
నము మొదలన్నియున్ విడిచి న్యాయగతిన్ బొలుపొందు యోగమం
దు మనము నుంచి యయ్యజునిఁ దోరపుశ్రద్ధమెయిం గుఱించి చే
సె మునులు మెచ్చఁగాఁ దపము చిత్తమునన్ భయమందె నింద్రుఁడున్

వ. అట్లు తనితపమ్మునకుఁ దలంకి దివిజేశ్వరుండు యక్షకిన్నరపన్నగవిద్యాధరసహితమ్ముగా నచ్చరలం బనిచిన వార లొనరించు విఘ్నకృతుల కతండు చలింపక సుస్థిరుండై యుండె నంత వారలును నిందుఁ గడ కరిగి యతండు మాకు వచించుపాటివాఁడుగాఁడని మిన్నకుండి రట్లు తప మొక్క నూఱువత్సరమ్ములొనర్పినఁ బితామహుండు హంసారూఢుండై యతనికిఁ బ్రత్యక్షమై యిట్లనియె. ౯౦

ఉ. నీదు తపోవిశేషమున నెమ్మది సమ్మద మందెఁ ద్వష్టృదా
యాద! సుఖమ్ములం జెలఁగుమయ్య యిఁకన్ దపముం ద్యజించి నీ
కేది యభీప్సితంబు తగ నిచ్చెదఁ గోరఁగదయ్య నా, నతం
డాదరమేదురత్వఘటితాంజలియై రచితప్రణాముఁడై. ౯౧

క. ఇంతకుఁ బూర్వము ముదిత
స్వాంతుఁడనై దేవపదము సాధించితినే

డంతకు . నెక్కుడుగాదే
చింతితఫలదంబు నీదుసేవ లభించెన్. ౯౩

వ. ధన్యుండ నైతి నాకు వరంబు నొసంగ నిచ్చయేని లోహకాష్ఠ శుష్కార్ద్రవంశ నిచయమ్ములచేతను నపరమ్ములగు శస్త్రమ్ముల చేతను మృతి లేకుంటయు సంగరమ్మున మద్వీర్యమ్ము నానాటికి వృద్ధినొందుటయు ననుగ్రహింపుము నావుడు విరించి యట్ల యగుఁ గాక యని తన భువనమ్మున కరిగె. వృత్రుండును సంత సమ్మునఁ దనతండ్రికడ కరిగి కడచిన దెల్ల నుడివిన నతం డిట్లను.

గీ. భద్రమగుఁగాక నీకు నిర్భయుఁడవగుచు
నగ్రజాతుఁ ద్రిశీర్షుని ననపరాధు
నెట్టపంటఁగఁ జంపినయట్టి యింద్రు
బ్రహ్మఘాతుకు వధియించి ప్రబలుమయ్య. ౯౫

గీ. బ్రతికియున్నప్డు మాటను బాటి చేసి
మృతిగనిన తద్దినమున విస్తృతముగాఁగ
నన్నదానం బొసంగి పిండాదికంబు
గయ నొసఁగువాఁడు పుత్రుఁడు కాఁగలాఁడు. ౯౬

క. కావున నాయానతిఁ గొని
వేవేగ వధింపుమీ దివిజవల్లభుఁ బా
పావహుఁడై నీయన్నన్
గేవల సుకృతపరిచారు గీటడగించెన్. ౯౭

వ. ఇట్లానతిచ్చిన వృత్రుండు దుందుభిఘోషమ్ములు సెలంగ శంఖా రావంబు లలర మహాబలసంయుతుండై రథారూఢుండై బయలు వెడలి తనసైనికులఁ గని తప్పక యింద్రుని వధించి సుర

రాజ్యంబు నైకొందునని పల్కుచు నమరావతిం దన సేనానినద నమ్ముల నదల్చుచుఁ జనునంతట నింద్రుండును నెఱింగి యుద్ధ సన్నద్ధుండై లోకపాలసహితమ్ముగా మొగిసి గృధ్రవ్యూహంబు పన్ని నిలిచె. ౯౮

క. ఇరువురకుఁ బరస్పరవిజ
యరమాలోలురకు శస్త్రహతిగళదురుర
క్తరుచిఖచితదేహులకుఁ
బరమాద్భుతరీతి రణము వఱలె నృపాలా. ౯౯

క. దివిజులు దైత్యులు రణవై
భవ మెల్లరు మెచ్చఁ బరశుపరిఘాదుల ను
క్కు వెలయఁగఁ గొట్టుకొని రో
క్క విధమ్మున నక్కజమ్ముగా జయకాంక్షన్. ౧౦౦

—* వృత్రుం డింద్రుని బ్రమింగుట. *—

వ. ఇట్లు సంగరంబు జరుగునెడ వృత్రుండు క్రోధదీప్తుండై యిం ద్రుం బట్టుకొని వక్త్రమ్మునం దిడికొనుటయు దేవతలు పరమా ర్తులై శక్రునికి నాక్రోశించుచు బృహస్పతికడ కేగి తద్విముక్త్యు పాయంబు వచింపుమని వేఁడుడు నతం డిట్లను, ౧౦౧

క. ఏ నేమి సేయఁగల ! న
వ్వానిముఖాంతర మను పెనుబంధనమున స
ప్రాణుండై యిప్పటికిని
దీనుండై యున్నవాఁడు దేవపతి దగన్. ౧౦౨

వ. నాపుడు సురలందఱును యోజించి జృంభికయను నొకశక్తిం బుట్టిం చిన నయ్యది యవ్వానియం దావేశించి యావులింతం గలిగించె.

క. వివృతాస్యుఁ డయ్యె వృత్రుఁడు
దివిజపతియుఁ దత్క్షణంబ తెరలి పయిఁబడెం
గవిసి సురలెల్ల నానం
దవిభవమున మునిఁగి తేలి తనిసిరి మిగులన్. ౧౦౪

వ. నాఁటంగోలె జృంభిక సర్వప్రాణిసంస్థితయై యిప్పటికిం జొప్పడెడిఁ బదంపడి వృత్రుం డొక్కఁ డొకకెలనను నింద్రాదులందఱు నొకవైపునను నిలిచి ఘోరయుద్ధంబొనర్పఁ బదివేలవత్సరమ్ములు గతించె. ౧౦౫

క. వరమదగర్వితుఁడగు నా
సురవైరికి నోడి పాఱి సురపతి చింతా
భర మడర నుండె నంతట
నరుదెంచెన్ దివిజవైరి యమరావతికిన్. ౧౦౬

గీ. వచ్చి ప్రాసాదములు నుపవనము లేన్గు
లచ్చరలుఁ గామధేనువు నది యిదియన
నేల స్వర్లోకమునఁగల యెల్లరత్న
సంచయము తాన కైకొని మించె నెలమి ౧౦౭

వ. వృత్రుం డిక్కరణి దేవపదం బేలుటకుఁ దండ్రి యానందించె సురలు స్థానభ్రష్టులై యజ్ఞభాగమ్ములు లేక తత్తద్గిరివరమ్ముల పాలై యరిగి యచ్చటిమునీంద్రులతోఁ గర్జం బేమని రోజించి తదనుమతమ్మునఁ గైలాసమ్మున కేగి మహాదేవుం బ్రార్థించి ప్రసన్నుఁ డగునాతని కిట్లనిరి. ౧౦౮

గీ. దేవనగరంబు రాక్షసదేశమయ్యె
నప్పురఃకాంత లాదిగ నఖిలమునకు

వృత్రుఁడధినేత యతనికి వెఱచి నీదు
శరణుఁ జొచ్చితి మిఁకఁ గృప సలుపు మీశ ! ౧౦౯

క. స్థానభ్రష్టులమై చిం
తానియతులమైనమమ్ము దరిఁ జేర్చి కృపా
ధీనమతిఁ బ్రోవవే యనఁ
గా నతఁ డిట్టు లను దివిజగణములతోడన్. ౧౧౦

గీ. కంజజపురస్సరమ్ముగాఁ గదలి మనము
హరికడకుఁ బోద మాతఁ డెల్లైన వీనిఁ
జంపుఁ గపటప్రచారవిశారదుండు
కరుణ గలఁడు మహాత్ముఁ డఖండబలుఁడు. ౧౧౧

వ. అని చెప్పి బయలువెడలిన నందఱును వైకుంఠమ్మున కరిగి యద్దేవుం బురుషసూక్తవిధానమ్మున యజించిన భక్తవత్సలుం డతండు ప్రత్యక్షమై వారలఁ దగుగతి మన్నించి యిట్లనియె.

క. ఏమిది ! మీరలు శంకర
తామరసోద్భవులతోడఁ దరలి ననుఁ గనన్
బ్రేమించి వచ్చితి రనన్
దామోదరుతోడఁ బలుకఁ దలఁపఁ డొకరుఁడున్. ౧౧౩

వ. అట్లు చింతాదంతురులై ప్రత్యుత్తరం బొసంగనేరని సురలకు జగన్నాథుండు గరుణార్ద్రుండై యిట్లను. ౧౧౪

గీ. చెప్పుఁడీ మీకు వచ్చినసేగి యెట్టి
దైన నద్దానికి నొనర్తు యత్నమనుడు
సురలు ముకుళితకరు లయి హరికి ననిరి
నీవ యెఱుఁగుదు వన్నియు దేవదేవ. ౧౧౫

గీ. వామనాకారమున బలి బద్ధుఁజేసి
యిందురిని సురాధిపతిఁ జేసి యెల్లలోక
ములును ద్రిపదమ్ములుగఁ జేసి మున్ను మమ్ముఁ
గాచితివి దైత్యులెల్లరు కలఁక చెంద. ౧౧౬

వ. తదపహృతంబగు నమృతమ్ము మరలం గొని సుఖవర్తనులమై నాఁ
టనుండి నాకమ్మున నుంటి మనునంత విష్ణు విట్లను. ౧౧౭

గీ. తెలిసికొంటిని మీదగు కలఁక తెఱఁగు
వాఁడు దెగునదుపాయంబు వంచనాది
కముల యోజించి మీకు హితము నొనర్తు
నెట్లయిన దుష్టుల హరించుటే మతంబు. ౧౧౮

వ. యోగ్యులయెడలనైన సామాద్యుపాయమ్ములు ప్రయోజ్యంబు
లగుచుండ నయోగ్యులకు నివి యనర్హంబు లెట్లగు? నీవృత్రుండు
బ్రహ్మదత్త వరదర్పితుండగు కతన సర్వభూతావధ్యుండై నిరంకు
శమ్ముగ వర్తించుచున్నవాఁడు. ౧౧౯

క. సామోపాయమ్మున మన
మీ మానవభక్షకుని జయింపవలయు లే
దా, మనకీతఁ డవధ్యుఁడు
సామాన్యుఁడె వృత్రుఁడన నసాధ్యుఁడుకాఁడే. ౧౨౦

వ. కావున నెట్లైన నితనితోఁ గపటమైత్రి నొనర్చి విశ్వాస్యమ్ము
లగు శపథమ్ములం జేసికొని పిదపఁ బరిమార్పవలయు. ౧౨౧

గీ. చనుఁడు గంధర్వులార వంచన యొలర్ప
నాతనికి నిందురినకు మైత్రి యలవరింపుఁ

డేను బలిమధ్యముననుండి యేరికిని న
గోచరుఁడ నయి సాహాయ్య మాచరింతు. ౧౨౨

క. ఏకపటం బొనరించిన
నాకుటిలుఁడు మైత్రి కొప్ప నయ్యది మీరల్
గైకొనుఁడు కపటకృత్యము
కాక కుటిలహరణమునకు గతి వేఱున్నే. ౧౨౩

వ. మీర లెవ్విధమ్మునైనను బాపమనక విశ్వస్తుం గావించునది పిమ్మట మతిసాహాయ్యమ్మున శకుని డద్దురాత్ము వధియించుఁ బాపాత్ములయెడ నధర్మవర్తనంబుకతన దోషంబుగలుగ దని చెప్పి మఱియును, ౧౨౪

ఉ. వామనరూపమంది బలి వంచనచేసితి దైత్యులన్ వృథా
కాముల మోహినీత్వమునఁ గాదె ప్రతారితులం బొనర్చితిన్
నేమముగా వధింప నగునే? రిపు దుస్సహతేజు బుద్ధివి
ద్యామహిమమ్మునన్ దగినయట్టియుపాయము పూనకుండినన్.

వ. ఇది యిట్లుండ సర్వకామప్రదాత్రియగు జగజ్జననిం బ్రార్థించిన నాపె యోగమాయాస్వరూపమ్మున సాహాయ్యకం బాచరించుఁ దన్మాయాబద్ధుండై వృత్రుండిందునకు వధ్యుఁడగునని వెండియు.

ఆ. వె. ఆపెకరుణగల్గ నఖిలకామమ్ములు
సిద్ధిచెందు నేరుసు చేసెనేని
గలుగ దేరికేనిఁ గార్యసాఫల్యంబు
గొలువుఁ డంబికను సకుంఠభక్తి. ౧౨౫

క. మును మధుకైటభవధ క
జ్జనని న్నుతియించి యాకె సాహాయ్యమ్మున్

గోని గాదె వధించితి వీా
రును నయ్యంబన్ భజించి తుష్టింపుఁడు వృత్రున్. ౧౨౮

వ. అని విష్ణువు బోధింప సుర లందఱును మందారదుమమండిత
మ్మగు మేరునగమ్మున కరిగి ధ్యానపరాయణులై యయ్యంబ
నిటు సన్నుతించిరి. ౧౨౯

గీ. దేవి ! వృత్రుని బాధచే దీనులైన
దేవతలఁ బ్రోవఁగదవమ్మ దిక్కులేక
నీకు శరణంటిమమ్మ మన్నింపుమమ్మ
పుత్రుల ననాదరించుట పోలునమ్మ ! ౧౩౦

గీ. నీను భ్రూభంగవశమున నిలిచి హరియు
హరుఁడును విరించియును గృతులాచరింత్రు
నిన్ను మించిన దైవ మొందేనిఁ గలదె
శరణమొందిన దివిజుల నరయుమమ్మ. ౧౩౧

ఉ. "ఇమ్మగ మత్పదమ్ము భజియించి మహావిభవమ్మునొంది దా
న మ్మద మెక్కి నాదుభజనమ్ము ద్యజించినమీరు మత్కటా
క్షమ్మున కెట్లు పాత్రు" లనఁగాఁ దగదమ్మ త్వదీయమాయయే
మ మ్మిటు చేసె, లేకునికి మత్తత మా కెటు లబ్బు శాంకరీ !

క. మము బాధించుచు మున్ను గ్రి
మము దప్పి చరించునట్టి మహిషాసురునిన్
జము బారి కనిచి యేలితి
వి మహేశ్వరి ! యొంతనీకు వృత్రుం డనినన్. ౧౩౩

క. శుంభున్ దదనుజుఁడైన ని
శుంభున్ దదనుచరులన్ విసువ కవలీలన్

గాంభీర్య మెసఁగఁ జంపవె
శాంభవి ! వృత్రుండు నీ కసాధ్యుండగునే . ౧౩౪

ఆ. వె. అంబ ! నీ వనాదరం బొనర్చితివేని
దైత్యుకతన దీనదశకు వచ్చి
నట్టి సురలఁ గరుణ నరసి స్వశక్తిచేఁ
గాచువాఁడొకండు గలఁడె యొందు ? ౧౩౫

ఆ. వె. కరుణ యగ్గలమ్ముగా వృత్రునందు నీ
కలరుఁగాక, దుష్టుఁడైనకతన
శస్త్రహతులఁ జేసి జనని ! పవిత్రత
గూర్చుపొంటె వీనిఁ గూల్పుమమ్మ. ౧౩౬

గీ. వెనుక రణరంగమున నీదు విశిఖపాత
ములను జెందియు వృత్రుని బలముకలిమి
దైత్యు లమరవనంబు నుద్దవిడిఁ గొనిరి
నీదుభయమేని వారు మన్నింపరొక్కొ. ౧౩౭

క. వృత్రుఁడు నీకును మిగులన్
శత్రుఁడ, భక్తుండయేని జనని, త్రిజగతీ
నేత్రి ! మము నీదుభక్తికిఁ
బాత్రుల నిప్పాట బాధపాల్సేయునొకో. ౧౩౮

క. నినుఁ బూజింపఁగలేదని
యనుకొనకుము పూలు మేము నఖిలము నీచే
తనకాదె యుద్భవించుట
పరిణతుల మమ్మేలుమమ్మ భవభయహంత్రి ! ౧౩౯

క. వారలు ధన్యులు విను మె
వ్వారు భవాంభోధిపోతవైఖరిఁ దగి ము
న్యారాధితమగు త్వత్పద
నీరేజాతమ్ముఁ గొల్చి నెగడుదురో వెసన్. ౧౪౦

గీ. యాజ్ఞికులు వేదవిదులు స్వాహాస్వధాస్వ
రూపముల నొప్పు నిన్నుంత్రు రూఢిమీఱియు
హోమకాలమ్ములందు నీయోగమునన
సురలుఁ బితరులు ముక్తిని బొరయుచెటేఁగి. ౧౪౧

ఆ. వె. తల్లి మేధ వీవ దయ వీవ శాంతివి
నీవ కాంతి వీవ నిఖిల మీవ
సకల మీవొనర్చి సద్భక్తులకు నను
గ్రహముకల్మి నీఁగఁ గడఁగుచుందు. ౧౪౨

చ. అని సురలెల్లఁ దన్నుఁ గొనియాటకు మెచ్చి విభూషితాంగియున్
ద్రిణయనయున్ జతుర్భుజయు దివ్యతరాయుధయున్ సురక్తచం
దనవసనాఢ్యయున్ గుసుమదామసమంచితయున్ బ్రసాదశో
భినియునునై పరాంబ మృదువేషిణి దాఁ బొడకట్టె వారికిన్.

గీ. సర్వవేదాంతరూప యజ్ఞనని ప్రీతు
లైనసురలకు నిట్లను నమరులార
యేమి కార్యమ్ముగల్గె మీ కెల్లరకును
సుఖమకద వచ్చుటేమి నం జూచుపొంటె ? ౧౪౪

వ. నావుడు దేవత లిట్లనిరి. ౧౪౫

శా. అంబా ! వృత్రనిబాధ కోర్వఁ దర మౌనా ! పాని సెల్లన వే
గం బాలోకము చేర్చి మమ్ము సుఖులం గావింపు మేరీతి శం

కం బాటింపక విశ్వసించి హితులంగాఁ జూచి మాతోడ మై
త్రిం బూనుఁ సురవైరి యట్టివిధ మేదేనొండు గల్పింపుమా.

క. ఏబలమున వృత్రుఁడు మా
చేఁబడుఁ దత్తాన్నృశంపుఁ జేవ గొలిపి బల్
ప్రాబల్య మాయుధములకు
రాఁ బాటింపఁదగదే యరాతినిహంత్రీ. ౧౪౭

వ. అనవుడు జగదంబ యంగీకరించి యంతర్ధానంబు నందె సురలును సంతుష్టాంతరంగులై ఋషిసహితమ్ముగా నరిగి త్రిలోకమ్ముల నదలించువడువునఁ దమ్ము నందఱ భ్రమింగుభంగిఁ దీక్ష్ణతేజమ్మునం బొల్చు వృత్రుం గని సామార్థంబు మునుల నతనియొడకుం బని చినఁ జని వారలిట్లనిరి. ౧౪౮

—* మునులు వృత్రవాసవులకు మైత్రిఁగొలుపుట *—

ఉ. వృత్ర ! త్రిలోకభీతికరవిక్రమ ! శక్రముఖామరావళీ
జైత్ర ! యజాండమెల్లను వశంబయి యొప్పెనునీకు, యోగ్యతా
పాత్రుఁడ వీవు శక్రుఁడును బండితమాన్యచరిత్రుఁ డిర్వురకు
మైత్రి నెసంగినక భయము మాను జగమ్ముల, కింత యొప్పదే !

ఆ. వె. నీకు నిదుర లేదు నిర్జరపతిభీతిఁ
జేసి, నీదుభీతిఁ జేసి యింద్రు
నకు సుఖమ్ము లే, దనారతమును మీఁదు
సంగరమ్ము లోకసంకటంబు. ౧౫౦

సీ. యుద్ధమొనర్చెడి యోధుల కింతయు
సుఖము గల్గదు దీని శూరవరులు

మెచ్చికొందురు గాని మేటిగ శృంగార
భావజ్ఞులగు మహాపండితులు ర
ణమ్మునఁ బెక్కుదోషమ్ములు నొడువుదు
రాయాస మవసరమందు స్నాన
పానముల్లేమియు భార్యాసుఖవియుక్తి
యింద్రియార్థగ్లాని యిది యిటుండ

గీ. జయముచు దైవానుకూలత జరుగుఁ బూల
చెండ్లతోనైన యుద్ధంబు చేటునకగు
ననిన శితశరముల బాధ లడుగవలెనె
సంసృతిసుఖాపహరణంబు సంగరంబు. ౧౫౧

చ. అని మొనఁ జచ్చువారలకు నబ్బుఁ దుదిన్ ద్రిదివం బటందు రీ శ
స్త్రనిహతి నొచ్చి నేలఁబడి తాపము చెందుచు నక్క లంగముం
దినఁ గనువారు లేక కడుదీనతఁ జచ్చినమీఁద స్వర్గ మె
క్కనికిఁ బ్రియంబె? ప్రేరణకుఁ గా కిది నిక్కపు ధర్మవాక్యమే!

ఆ. వె. నీకు నింద్రుతోడ నీతోడ నింద్రున
కెలమి సఖ్య మింక నెసఁగుఁగాక
దాన మీకు సుఖ మొదవు యక్షగంధర్వ
కిన్నరాదులకును గీడు దొలఁగు. ౧౫౩

చ. శపథములం బొనర్చి దివిజప్రభుఁ డిప్పుడ నీదు చెల్మి ని
ష్కపటముగా నొనర్చు నటు కైకొను మీవును; మధ్యవర్తులై
తపసులు గూర్చువారఁట ప్రతారణ మిం దొడఁగూడు టెట్లు స
త్యపరతఁ జేసి కాదె జగమంతయు నిల్చుట యెన్నిభంగులన్.

చ. ధరణి భరించు నత్తరణి దాఁ దపియించు సుఖప్రచారియై
కరువలి వీచు సంద్రములు కట్టునకుం జవదాఁట కుండు స

త్యరతిన కాదె మీరలు యథార్థ పరత్వము నంది మైత్రి ని
ర్వరును సుఖమ్ములం గొనఁగఁ బోలదె మాను లసత్యవాదు లే.

వ. కావున మీరలు బద్ధసఖ్యులరై శయనాసన క్రీడాదికమ్ముల
నొక్కెడన సలుపుచు వర్తించునది నావుడు వృత్రుండు మునులం
గాంచి మీర లవశ్యమును నాకు మాననీయుల రెల్ల భంగులను
మీమాట పాటింపందగు నైనను శత్రువునందును శఠునియం
దును గాముకునందును నిర్లజ్జునందును విశ్వసింపఁ దగదు గాన
నిందుండు పాపాత్ముండును బ్రహ్మఘ్నుండును నగుట నా
కవిశ్వాస్యుండు నావుడు మునులు మరల నిట్లనిరి.

గీ. ఎవఁ డొనర్చిన ద్రోహంబు నెవఁడు గుడుచు
బ్రహ్మహత్యయుఁ గలుదాని పాతకంబు
నిష్కృతిం బోవ నేర్చు, నెందేని మిత్ర
ఘాతుకుని పాతకమునకుఁ గలదె శాస్తి!

వ. అట్లగుట మిత్రద్రోహంబొనర్చి యతఁ డెందుఁబోయెడి? నీ యభి
మతంబగు శపథమ్మున కతండియ్యకొను, నయ్యది మా కెఱిఁగించి
యిందురకు మైత్రి నొసంగుము నావుడు వృత్రుం డిట్లను.

గీ. ఆర్ద్రమున శుష్కమునఁగాని యశ్మమునను
గాని దారువుచేఁగాని కఠినవజ్ర
నిహతిచేఁగాని పగటఁగాని నిశిఁగాని
నను సురలుఁ దత్పతియుఁ జంపఁజనదు వినుఁడు. ౧౫౯

వ. ఇందులకు సమ్మతంబేని మీ చెప్పినచొప్పున నొనర్తు ననుడు
మునులు సురపతి కాచందం బెఱింగించిన నతండు వల్లె యని
యతనికడకు వచ్చి. ౧౬౦

గీ. అగ్నిసాక్షిగ మునులెల్ల నరయుచుండ
నొప్పితిని నీదుపల్కుల కుభయులమును
మిత్రులమటంచుఁ బల్క నావృత్రుఁ డతని
మాటలకు విశ్వసించుచు మైత్రిఁగొలిపె. ౧౬౧

క. వారలు మిత్రు లనందగు
వారలు సహచర్య సలుపువార లుదధిరా
ట్తీరమ్మున నందనమునఁ
గూరిమిఁజరియింతు రిచ్చ గొలిపినయెడలన్. ౧౬౨

వ. ఇట్లిరువురకు మైత్రి గలుగుటకు వృత్రుండు సంతసించె నింద్రుండు
తద్వధోపాయమ్ము చింతించుచు రంధ్రాన్వేషణతత్పరుండై యుండె
నిప్పాటఁ గొంతకాలమ్ము గతించె. ౧౬౩

గీ. తన కుమారుండు వృత్రుండు దనుజవైరి
యైన యింద్రునితో మైత్రి నాచరించె
ననుచుఁ ద్వష్టృప్రజాపతి వినికికతన
వృత్రుకడ కేగుదెంచె నివ్వెఱఁగు గదుర. ౧౬౪

వ. వచ్చి మంతనమ్మునఁ గొడుకున కిట్లనియె. ౧౬౫

చ. అరి పరదారలంపటుఁ డహంకృతిశాలి పరప్రతారకుం
డరయుచునుండు రంధ్రముల నన్యులసేగికి సంతసించు దు
ర్భరమగు మాతృగర్భమును భంగము సేయఁడె లోనఁజొచ్చి నీ
తిరహితుఁ బాకశాసను మదిం గన కేమని విశ్వసించెదో. ౧౬౬

గీ. అందఱును మనయట్టిరే యనఁగరాదు
విశ్వసింతురె వైరుల వెఱ్ఱులైన

సందు దొరకినయేని విశ్వాసఘాతు
కుం డితఁ డధర్మవర్తి గాకుండు టెట్లు ! ౧౬౭

వ. ఇట్లు నానావిధముల బోధించిన నాసన్నమరణుండగు కతన
వృత్రుఁ డప్పలుకులు చెవిఁబెట్టఁ డంత నొకనాఁడు సముద్రతీర
మ్మున నిరువురుం జరించుచుండ సంధ్యాకాలమ్ము సంప్రాప్తం
బగుడు నియ్యది రాత్రిగాని పగలుగాని కాకుంట నిప్పుడ వధిం
చుట పోలు, నదియునుంగాక యేకాకియై యున్న వాఁడని యెంచి
యింద్రుండు హరిం దలంచిన. ౧౬౮

—* వృత్రుండు చచ్చుట *—

గీ. అరుగుదెంచి యగోచరుఁడై పవిం బ్ర
విష్టుఁడై యుండె, నంత దివిజపతియుఁ ద
నమది నేలీల వీని వినాశమంచుఁ
జింతగొనువాఁడు ఫేనమ్ముఁ జెంతఁ గాంచె. ౧౬౯

వ. సముద్రమ్మునఁ బర్వతోపమమ్ముగాఁ బెచ్చుపెరుఁగు నురుఁగుం
జూచి యిది శుష్కమ్మును నార్ద్రమ్మునుం దక్కంగల శస్త్రమ్ము
లును గానేరదని నిశ్చయించి దేవిం దలంచుకొని యద్దానిం
గ్రహించునాలో నాపెయుఁ దనయంశమ్మందు నిమిడ్చె. ౧౭౦

క. హరిసంయుత మగువజ్రము
హరిహయుఁడు నురువునఁ బొదివి యసురపయి మహో
ద్ధురగతిఁ బఱపిన వృత్రుఁడు
గిరినాఁ బడె దాని హతికిఁ గీటడఁగి నృపా. ౧౭౧

వ. ఇట్లింద్రుండు విగతశత్రుండై మునులు సన్నుతింప నమరావతి
కరిగి శోకహారిణియగు నజ్జగదంబ కుత్సవం బొనరించి పూజించి

దేవోద్యానమ్మున నొకప్రాసాదమ్ము నవరత్నకుట్టితంబుగ నొనర్చి పద్మరాగమయమ్మగు దేవీ విగ్రహంబు నిర్మించి యందుం బ్రతిష్ఠించె. ౧౭౨

క. అలరెడు వేడుక నదియు మొ
దలుగఁ ద్రికాలములయందుఁ దద్దయుఁ బేర్మిన్
గొలుతురు సుర లాయంబన్
గులదైవతముగ నొనర్చి కువలయనాథా. ౧౭౩

క. "అరి యగు వృత్రాసురునిన్
హరియించెన్ బవిని డాఁగి హరి" యని హరి యా
హరిఁ బూజఁ జేసె నానం
దరసాబ్ధి మునుంగు వేల్పుతండమ్ములతోన్. ౧౭౪

గీ. దేవియును హరియును హరి తివిరి ముగురు
వృత్రు నడఁచిరి శ్రీదేవి వృత్రహంత్రి
యయ్యె నక్కారణమ్మున ; నమరపతి ప్ర
ధానుఁడగుఁగానఁ గీర్తి యతనికి వచ్చె. ౧౭౫

వ. పదంపడి విష్ణుండు దనపురమ్మున కరిగె నింద్రుండును మిత్రద్రోహభయమ్మున దందడిఁ గొనుచు నొకభంగి నుండ మును లీద్రోహంబు తమకతనఁ గలుగుటం జేసి పాపభయత్రస్తులై. ౧౭౬

గీ. అకట విశ్వాసఘాతుకుండైన యింద్రు
సంగతిం జేసి మనము విశ్వాసఘాతు
కులమ మునిశబ్దమునకుఁ బంకిలత గలిగె
హరియు మన యట్టిఁడాయె నే మనఁగవచ్చు. ౧౭౭

వ. మంత్రికృత్తును బుద్ధిదాతయుఁ బ్రేరకుండును బత్తుకర్తయు నను వీరలు పాపకారులతో సమఫలభోక్తలని చెప్పంబడుదురు.

గీ. అలరు నాల్గు పదార్థమ్ము లందు నాది
యంతము నశించి నడిమి రెండలరుచుండె
ధర్మమనుమాట కేవలదంభ మకట
యెంతమహాసీయులందేని యింత నిజము. ౧౭౯

గీ. హరి హరినిఁగూడి పాపకృత్యంబటంచుఁ
దలర కీద్రోహ మొనరింపఁదగునె యెఱిఁగి
వంచనఘటించు టేరికి మంచిపనియె
యరయ రవివేకమును స్వార్థ మరయువారు. ౧౮౦

వ. ఇట్లుపశ్చాత్తప్తులై మునులు తమతమ యాశ్రమమ్ముల కరిగిరి. పిదప వృత్రునిమృతికిఁ ద్వష్ట శోకించి యతని కుత్తరక్రియలు నిర్వర్తించి "సురపతి వంచనం జేసి మత్పుత్రకు హరించెఁ గావున దుఃఖమొందెడి" నని శపియించి మేరుశిఖరమ్మునకుఁ దపమ్మున కరిగె నావుడు జనమేజయుం డిట్లనియె. ౧౮౧

క. తాతా! యింద్రుం డీగతిఁ
బాతకకృత్యం బొనర్చి ప్రబలెనొ దుఃఖా
న్వితుఁడయి వన్నె దఱిఁగెనొ
చేతము రంజిల్ల నాకుఁ జెప్పఁగదవే. ౧౮౨

వ. నావుడు వ్యాసుం డిట్లనియె. ౧౮౩

గీ. చెప్పనేటికిఁ దా నెంత శ్రేష్ఠుఁడైనఁ
గృతశుభాశుభకర్మముల్ గెంటఁగలఁడె
కొంచెమో గొప్పయో తాము గొలుపుకర్మ
మనుభవింతురు మనుజులు నమరవరులు. ౧౮౪

గీ. శక్రునకు నిట్టి దుర్బుద్ధి సంతరించి
హరి సహాయము చేసె మున్నార్తి వేళఁ
దా నెచటి కేగె సమయమ్ము దవ్వులునపుడు
స్వజను లందఱు సంసారసరణి యిదియ. ౧౮౫

ఉ. దైవబలమ్ము లేనితఱిఁ దల్లియుఁ దండ్రియు భార్యయున్ సుతుల్
సేవకులున్ సహోదరులు స్నేహితు లొడ్లు నొకించు కేని సం
భావనచేయ రాఫలము పాల్పడుఁ గర్తకు, వృత్రుఁ జంపి య
ద్దేవవిభుం డొకండ తనతేజము గోల్పడె నెన్నిభంగులన్. ౧౮౬

వ. తక్కంగల దేవత లందఱును నింద్రునిఁ గృతఘ్నుం డని గేలి
చేసి నిందింపం జొచ్చిరి. ౧౮౭

మ. ప్రతినం జేసి యథార్థతత్పరత విశ్వాసమ్ము గైకొన్న స్నే
హితు నెవ్వాఁడు వధించు నింద్రుఁడిటు దుష్కృత్యమ్ము చేసెన్ బ్రహ్మా
ణత వేదమ్ముల నుజ్జగించి మునులన్ దాదవ్వులన్ డించి సా
గత సిద్ధాంతము పూను నే, తనకు వేడ్కల్ సేయు నే యాకృతుల్ !

ఆ. వె. హరికిఁ దక్క నొక్క హరిహయునికిఁ దక్క
గపటకృత్య మిట్లు గడలుకొల్పి
మిత్రుఁ జంపఁ గల్గు మేటి జగమ్ములఁ
గానరాఁ డటంచుఁ గథలు బలిసె. ౧౮౯

క. నరపాల ! దేనికతమున
నరులునుఁ దనుఁ గాంచి నగుదు రట్టి యపయశ
స్స్ఫురణం బింద్రుని మానము
హరియించె నపయశ మెంతకైనం జాలున్. ౧౯౦

సీ. కీర్తిక్షయమ్మునఁ గొరలి యింద్రద్యుమ్నుఁ
డఘు మెఱుఁగకయును నాక మెడలె
స్వల్పాపరాధి యయాతియుఁ బతితుఁడై
కర్కటత్వమ్మును గాంచెఁ బదియు
నెనిమిదియుగములు ; భృగుపత్ని తలఁ ద్రెళ్ళ
నేసిన హరియుఁ బెంపేది తుచ్ఛ
యోనులఁ బడె మఱియును వామనుం డయి
తిరిపమెత్తుకొనె నెందేని యొండు

గీ. కలదె యింతకుఁ గష్ట మక్కట ! దశరథ
రాముఁడై భార్యవీడి దుఃఖామయమునఁ
గుంగెఁ వృత్రాసురునిఁ బోరిఁగూలినకతన
నింద్రుఁడును బ్రహ్మహత్యఁ బెంపేదె నిపుడు. ౧౯౧

వ. అట్లు తేజోహీనుండై కొలు వుండక యేకాంతమ్మునఁ జింతించు
తనపతికిఁ బౌలోమి యిట్లను. ౧౯౨

గీ. రిపునిఁ బ్రబలుని వృత్రు హరించి యింక
వంత గొననేల ? సుఖములఁ బడయకున్న
కారణం బేమి ? మఱియు నొక్కరుఁడు రిపుఁడు
ప్రబలుఁ డెందును లేఁడుగా, భయము గొనఁగ ! ౧౯౩

గీ. అనుడు శచి కిట్టులను హరి వనజనయన
శత్రుఁడును లేఁడు సుఖమును శాంతి లేదు
బ్రహ్మహత్యాభయమ్మున బడలుచుంటి
నిట్టి నా కింక నిశ్చింత యెట్లు గలుగు. ౧౯౪

వ. అని వెండియు. ౧౯౫

గీ. నందనవనమ్ము సుధయు గంధర్వగాన
మచ్చరలనృత్యములు నీవు నన్యయువతి
చేష్టలును గామధేనువు శ్రీ నెసంగు
కల్పవృక్షమ్ము నాకు సుఖమ్ము నిడవు. ౧౯౬

వ. అని చింతావిష్టుండై మానససరోవరమ్మున కరిగి భయంబు పెంపునఁ బద్మనాళమ్మం బ్రవేశించి ప్రచ్ఛన్నుండై పరాభూతుండగుకతన నెరికిం గనుపడక నీటిపాముచందమ్మున నజ్జలమ్మునఁ జరించుచుండె సురలును దమపతిం గానక శోకకర్శితులైరి మఱియును. ౧౯౭

గీ. జగ మరాజక మయ్యె వర్షములు దక్కెఁ
బాఁడిపంటలు నశియించెఁ బ్రబలమైన
నదులు కృశియించె వృక్షముల్ నవక మెడలె
రాజు లేకున్న నొక్కటి రాణ గనునె. ౧౯౮

వ. అంత మునులును సురలును యోజించి నహుషునిఁ దమకుఁ బతిగా నొనర్చికొని సుఖ మ్ముండిరి. ౧౯౯

—* నహుషుండు స్వర్గమ్ము నేలుట *—

గీ. ధర్మమతియయ్యు నహుషుఁ డత్తఱిని రాజ్య
మత్తుఁడై యచ్చరలఁ గూడి చిత్తజాత
కేళులం దేలి సొక్కుచుఁ గింవదంతి
గా వినియె నింద్రభార్య చక్కందనంబు. ౨౦౦

వ. విని తద్గతహృదయుండై యొక్కెడ ఋషులం గాంచి యిట్లను.

గీ. దేవపతి నైతిఁ గద యేను దివిరి నాదు
సేవ కింద్రాణి రాదేల ? చెచ్చెర సుర

వరుల నంపించి పిల్పింప వలయు నిపుడ
హితము నా కిచ్చగింతురయేని మీరు. ౨౦౨

వ. అనవుడు దేవర్షులును దేవతలును జింతాక్రాంతులై శచికడకుం
జని వినమ్రులై యిట్లనిరి. ౨౦౩

క. వినుమమ్మ నహుషు నమరుల
కినుఁగా నొనరించికొంటి మే, మాతఁడు నిన్
దనమనమునఁ గామించెన్
"గొని రం" డనె నెదురుచెప్పఁ గోపించు నిఁకన్.

వ. నావుడు శచి చింతించి బృహస్పతిం గాంచి "మహాత్మా నహు
షునికతన భయంపడి నిన్ను శరణంబు సొచ్చితిఁ గాపాడు"
మనవుడు నతం డభయం బొసంగి యిట్లనియె. ౨౦౫

ఉ. కేవలకామమోహితుఁ డకించనుఁ డున్మదుఁ డట్టివానికై
దేవి! మహాపతివ్రత నధీనగ ని న్నొనరింతునే? భయం
బీవు త్యజింపు మన్నిటికి నేఁ గలుగన్ నహుషుండు దుష్టుఁ డిం
కేవిధి నిన్నుఁ బొందు? మద మెక్కెనె రాజ్యముకల్మి వానికిన్.

వ. పదంపడి యింద్రాణి బృహస్పతి శరణంబు చెందె నని విని
నహుషుండు కోపించి సురలంగాంచి, ౨౦౭

క. సురలార చంపవలె న
గ్గురునిన్ దుష్టాత్ము నాదుకోరికయు వృథా
గ రచించునె? నావుడు ముని
వరులు సురలు గలిసి యిట్లువలికిరి కడఁకన్. ౨౦౮

క. కోపము విడువుము దేవా!
పాపమునన్ బుద్ధిచొనుపఁ బాడియె? వినలే

దా ? పరదారాగమనం
బాపదలకుఁదా వధర్మ్మ మనియును శ్రుతులఁ. ౨౦౯

ఆ. వె. శక్రిపత్ని మిగుల సాధ్వి మహాభాగ
తనదుభర్త జీవితగతినుండ
నిన్నుఁ బొందు టెట్లు నీవు త్రిలోకవి
భుండ వయ్యు ధర్మము విడఁ దగునె. ౨౧౦

గీ. రాజు ధర్మమ్ము విడిచినఁ బ్రజల ధర్మ
వర్తనులు గారె శాస్త్రముల్ వమ్ము గావె
శచికిఁ దలదాఁటఁగల్గిన చక్కఁదనము
గల్గువేశ్యలు లేరె నీకామమునకు. ౨౧౧

క. రతి శృంగారమ్మునకుఁ
గతి రతియన భోగకాంక్ష కాంతకుఁ బతికిఁ
మతిగల్గిన రసము, బలా
త్కృతియైన విరసము దాని నెనయరు రసికుల్. ౨౧౨

గీ. ఉత్తమపదంబు గైకొనియున్న నీకు
బాపములకెల్లయగు లాఁతిపడఁతిపొందు
తగద యాయుఃక్షయం బగుదానికతన
గలుగు నధమాధమమ్ముగుగతి నరేంద్ర. ౨౧౩

ఉ. నా, నహుషుండువల్కెఁ బరనారులఁ బొందఁగ రాదె ! గౌతమ
స్త్రీ నెటుపొందెనింద్రుఁడు?హరించెఁగదా,గురుభార్యఁజంద్రుఁ! డ
ప్టీనియమమ్ములం బలుకు నెల్లరు మీరెటఁబోతి ? రొడ్లకుఁ
దా నెటుపల్కె నప్పగిదిఁ దానయిచేయఁగఁ జాలఁడొక్కఁడుఁ

క. మతినొప్పకయున్న బలా
త్కృతి నైనం జెందు పొందు దేవపతిసతిన్
బ్రతిచెప్పకుఁ డిట్లయినన్
హితమగు నిరువురకు సుఖములెసఁగుఁ గ్రమమునన్.

వ. ఇట్లు మదనాతురుండగు నన్నహుషునికి మాఱాడ నోడి మంచి
దని వారలు బృహస్పతిపాలికిం జని కృతాంజలులై యిట్లనిరి.

క. అనఘ ! నిను శరణుఁ జెందిన
దని యెఱుఁగుదుమైన నీపె నాతనికడకున్
గొనిపోవలె నిందుఁ గ్రిగా
నొనరించి తదాజ్ఞదాఁటుటొప్పునె మనకున్. ౨౧౭

ఆ. వె. ఇంద్రుఁడైన యతని కెల్లరయట్ల యి
త్తరుణి ధనముకానఁ దనకుఁదాన
యగుచు వలచెనేని యది సరసంబగు
నట్లొనర్పఁజేయుమయ్య నీవు. ౨౧౮

ఆ. వె. అనుడు గురుఁడు పల్కె నతిపతివ్రత నన్ను
శరణుఁజెందె నిట్టి సతిని విడిచి
పాపమంద నాకుఁ బాడియె శరణాగ
తుల విడుచుటకన్న దోసమున్నె ? ౨౧౯

క. అనవుడు దేవత లిట్లని
రనఘా ! యేదేని నొక యుపాయమ్మున నా
తనికోప మడఁపఁగావలె
నన గురుఁడిట్లనియె దేవతావళితోడన్. ౨౨౦

వ. అట్లేని యీమె యతనిసన్నిధికి వచ్చి యొక సమయంబొనర్చి "నాపతి మృతుండయ్యెనని తెలిసిన యపుడ నిన్ను వరింపంగల దాన నట్లు కానినాడు జీవద్భర్తృక నగు నే నిన్నెట్లు వరియింతుఁ గావున మత్పతి నన్వేషించుపొంటెఁ జనియెద" నని యీగతి నతని వంచించి నా యనుమతి నింద్రాన్వేషణమునకుం గడఁగు ననుడు బృహస్పతిపురోగములై దేవతలందరు నహుషునికడ కరిగిన నా కృత్రిమవాసవుండు వారింగని సంతసించుచు శచి నుద్దేశించి యిట్లనియె. ౨౨౧

క. తక్కు సురలెల్ల నన్నుఁ
మక్కువ నాథునిఁగఁజూచి మన్నింతురు నీ
విక్కృతికి సమ్మతించిన
నిక్కపువాసవుఁడ నగుదు నీరజనయనా. ౨౨౨

ఉ. నావుడుఁ గంప మంది లలనామణి యిట్లని పల్కె నార్తయై
"దేవ, సురేంద్ర! మత్పతిగతిం గనరామిఁ గృశించి యుంటి స
ద్భావ మభావముం దెలియవచ్చెడిదన్కను దాళుమయ్య నా
కీవర మి"మ్మనంగ నతఁ డియ్యకొనెన్ విడిచెన్ శచీసతిన్. ౨౨౩

వ. ఇట్లతనిచే విడువం బడి యామె సురలం గాంచి యిట్లను మీరం దఱును మదాజ్ఞం జేసి ప్రయత్న పూర్వకమ్ముగ నింద్రునిగతి నన్వేషింపుఁ డనవుడు వారలందఱు నొక్కెడఁ గూడి యోజించి విష్ణులోకమ్మునకుం జని యతని సన్నుతించి యిట్లనిరి. ౨౨౪

ఆ. వె. దేవ! బ్రహ్మహత్యఁ దేజమ్మునకుఁ జెడి
యెల్లభూతముల కదృశ్యుఁడగుచు
నేడనో యడంగె నింద్రుఁ డాతనికి మా
కును మహాత్మ! గతివగుము కడంగి. ౨౨౫

క. నీ యానతిఁగొని మాయో
పాయమ్మున వృత్రుఁ జంపి బ్రహ్మఘ్నుండై
యేమొడ డాఁగెనో సురపతి
పాయక కనఁజేసి మమ్ముఁ బాలింపు హరీ. ౨౨౬

వ. నాఁపుడు విష్ణుండు హయమేధం బొనర్చితిరేనిఁ దత్పుణ్యమ్మునఁ బావితుండై యిందుఁడు మీకుం బతియగు. ౨౨౭

గీ. అశ్వమేధమ్ముచే జగదంబ ప్రీతి
నంది హరియించు బ్రహ్మహత్యాద్యఘముల
శచియుఁ బరశక్తిపూజలు సలుపుఁగాక
లబ్ధభర్తృక యగుఁపొంటె లలితగతుల. ౨౨౮

వ. నహుషుండును మాయామోహితుండై స్వయంకృతాపరాధమ్మున వైళమ పదభ్రష్టుండగుఁ బొండనిన సురలు బృహస్పతి సమేతమ్ముగా నతని చెప్పినచొప్పున నరయుచు నింద్రుఁ డున్నెడ కరిగి వానిం గాంచి హయమేధం బొనర్పఁ జేసిన నంతఁ బావితుండై యతండు బ్రహ్మహత్యాపాతకమ్మును విభజించి నదులయందును వృక్షమ్ములయందును స్త్రీలయందును బృథివియందును గిరులందును జొనిపి సమయమ్ము నరయుచుఁ దజ్జలమ్మునన వసింపుచుండె నంత దేవతలును దమతమ పొందుపట్ల కరిగిరి పిదపనొక్కనాఁడు.

క. విరహాకుల యయి శచి య
గ్గురువరుతోఁ బల్కు "నేలొకో రాఁడు సురే
శ్వరుఁడు హయమేధ మొనరిచి
పరిపూతుండయ్యుఁ జెపు ముపాయము నాకున్". ౨౩౦

వ. నాఁపుడు బృహస్పతి యిట్లను భక్తిమై జగదంబిక నారాధించితివేని నీపతి యచిరంబ నీకుం బొడకట్టు నంతియ కాక నహుషుండు

తన్మాయామోహితుండై పదభ్రష్టుండును నగునని మంత్రం బుప
దేశించిన. ౨౩౧

క. తాపసివేషము గొని స
ర్వాపద్ధారిణిఁ బరాంబ నర్చించినఁ దా
నాపడఁతి కొక్కనాఁడు ద
యాపరతన్ దర్శనంబు నాపె యొసంగెన్. ౨౩౨

సీ. కోటిసూర్యులఁ బోలి కొమరారుకాంతితోఁ
జంద్రకోటుల నేలు శైత్య మొలయఁ
గోటివిద్యుత్తుల మీఁటుబల్ తళ్కుతో
వేదముల్ నాలుగు వెంటరాఁగ
స్వచ్ఛముక్తాదామసంభూషితాంగియై
కనులు మూఁడును గాంతి గడలుకొనఁగఁ
బాశాంకుశాదులు బాహులఁ దనరఁ బ్ర
సన్నవక్త్రాంభోజశాలిని యయి
గీ. జనని ప్రత్యక్షమై శచీసతికిఁ బల్కె
నబల నీపూజ నానందమబ్బె నాకు
వరము గోరుము నా, నామె పతిసమాగ
మంబు నహుషునికిన్ వినాశంబుఁ గోరె. ౨౩౩

వ. అనిన జగదంబ యొక్క దూతికం జూపి దీనివెంబడి నరుగు
మియ్యది నీపతిం జూపు నని వెండియు. ౨౩౪

గీ. విశ్వకామాఖ్యచేతను వెలయు నాదు
మూర్తి వొల్చెడి మానసమున సురేంద్రుఁ
డున్నవాఁ డట కేగు మీ యువిదతోడఁ
గనుఁగొనుము మోద మందుము కమలనయన. ౨౩౫

—* శచి యింద్రునికడ కరుగుట *—

వ. నహుషుండును మన్మాయామోహితుండై స్వల్పకాలమ్మునఁ బద
భ్రష్టుండు కాఁగలఁ డని చెప్పి యాపె యంతర్ధానమ్ము నొందె.

ఆ. వె. అంబదూతి శచిని నంగనఁ గొనిపోయి
మానసాంతరమున మగ్నుఁడైన
యింద్రుఁజూపె ; శచియు నింతింతనఁగరాని
సంతసమ్ము నొందె జనవరేణ్య. ౨౩౭

వ. ఇట్లు సంతసం బందియుఁ బతి దుర్గతికిం జింతించు నక్కమలా
క్షిం గని యింద్రుం డిట్లను. ౨౩౮

క. కమలేక్షణ యిచ్చటి కే
క్రమమున వచ్చితివి భూతగణములకు నదృ
శ్యమగుగతినున్న నావా
సము నీకెట్లెఱుఁగనయ్యె జయ్యనఁ జెపుమా. ౨౩౯

వ. అనిన శచి యిట్లను జగజ్జననికరుణంజేసి నిన్నుం జూడఁగంటి నీక
నొక్క విశేషంబు వినుము. ౨౪౦

క. సురలందఱు నహుషుని దే
వర యాస్థానమున నిల్పి వైభవమెసఁగఁ
బరిచర్యసలుపుచుండిరి
మరియాదకుఁ దక్కి వాఁడు మమతయొలర్పన్. ౨౪౧

క. 'వరియింపుము ననుఁ బతిగా
సురేశ్వరుఁడ నే' నటంచు సొలవక కామా
తురుఁడై ప్రతిదినము ననుం
బరిపరి మోమోట పెట్టి బాధించు నొగిన్. ౨౪౨

క. నావుడు దేవేంద్రుం డను
దేవీ వగవకుము నేఁ బ్రతీక్షించెద మో
దావహమగు కాలమునకు
నేవానికి దాఁటఁజెల్లునే కాలగతుల్ ! ౨౮౩

వ. నీవును ననుకూలకాలంబు ప్రతీక్షించుచు స్వస్థచిత్తవై యుండు
ము పొ మ్మనవుడు శచి దీనాననయై యతని కిట్లను. ౨౮౪

చ. ఎటు నిలువంగ నేర్తు ? సురలెల్లరు మౌనులఁ గూడి రాగలం
పటు వరదానగర్వితు నపాస్తనయుఁ బతిగా వరించి య
క్కట! నను వానిఁ బొందుమనఁ; గాచెడివాఁడు గురుండుదక్క లే
కిటు చనుదెంచితిఁ మరల నేఁ జనిన న్నను బల్మిఁ బట్టఁడే.

క. ఆరయఁ బాఱుఁడు విమలా
చారుఁడు విద్యాధికుండు సత్తముఁడు గురుం
డేరీతిఁ గావఁ గలఁ డక
టా ! రాజగు నహుషు బారి కందక యుండన్. ౨౮౬

ఆ. వె. కులటనైన వానిఁ గొని సుఖమ్ముల నంద
నిచ్చగింతు, నకట ! యీ పతివ్ర
తాత్వ మెంత దీనదద దెచ్చె ! నని వగ
నగడుచెందు సతికి ననియెఁ బతియు. ౨౮౭

వ. నీ కుపాయం బొండు చెప్పెద నాలకింపుము. ౨౮౮

క. శీలమున మానరక్షణ
మేలలన యొనర్చు నద్దియే సతి, భర్తల్
పాలింపఁ బతివ్రతలగు
లీలావతు లెందఱేని లేరె జగమునన్ ! ౨౮౯

క. కావున శీలము తోడుగ
నీ వృందుము పొమ్ము వాఁడు నిన్ను బలిమిమై
నేవేళఁ బట్టఁ దివురునో
యావేళం బలుకు మిట్టు లామూర్ఖునితోన్. ౨౫౦

వ. "నీవు ఋషియానమ్మున నా యెడకు వచ్చితేని నీయందు బద్ధానురాగనై యే నిన్ను వరించెద" నంటివేనిఁ గామాంధుం డగువాఁడును మునుల నియోగించి క్రోధాకులు లగు వారి శాపమ్మునఁ బదభ్రష్టుండగు నిదియునుగాక. ౨౫౧

ఆ. వె. నిర్నిమిత్తకరుణ నెగడెడిజగదంబ
భక్తి మీఱఁ గొల్చి భద్రదాత్రి
యైన యాపెకతన నందుము సంసిద్ధి
గురుని వాక్యమందు గుఱుతుగలిగి. ౨౫౨

వ. అను నాతని పల్కుల కియ్యకొని శచియు నహుషునిపాలికింజనఁ గామాంధుం డగునాతఁ డాపె కిట్లను. ౨౫౩

చ. కుశలమె నీకు ? సత్యమునకుం జవదాఁటని దాన ! నీయెడన్
వశు నను దాసు సత్యగతిఁ బాలన చేయఁగ వచ్చితే ? చతు
ర్దశభువనమ్ము లేలినముదం బొకపా లిదియొక్కపాలు దు
ర్దశఁ దొలఁగించి నన్ మదనదగ్ధునిఁ జల్లనిదృష్టి నేలుమా. ౨౫౪

ఆ. వె. నీ యభీష్టమెద్ది ? నే నిర్వహింతు ని
క్కమ్ము నోడువు లజ్జగాంచ నేల ?
యనుడు దేవదేవి "యఖిలంబు సిద్ధంబ
లేదు కోర నొండు లేశమేని. ౨౫౫

వ. ఐనను నాకొక్క మనోరథమ్ముగల దయ్యది నిక్కువమ్ముగ నెఱవేర్చెదేని నోడివెద" నావుడు నహుషుండెంత యసాధ్యంబేని నిర్వహించెద నోడుపుమన శచి యాతనికిట్లనియె. ౨౫౬

ఉ. చెప్పుటకేమి ప్రత్యయము చేకుఱ దేమన రాజు లాడియే
తప్పుదు రెయ్యెడన్ విను వృథా వచియింపఁగనేల? నామసం
బొప్పెడియంతయొట్టునకు నొప్పితివేని వచింతు నా; నతం
డప్పగిదిం బొనర్ప మనమందు వినిశ్చయ మంది యిట్లనున్.

వ. తరుణీ! నే నాడినదానికిఁ దప్పితినేని యజ్ఞదానతపోజన్యం బగు మత్సుకృతమ్ము వమ్మగు ననుడు నాపె యిట్లనియె. ౨౫౮

సీ. వాహనమ్ములు దేవపతికి గుఱ్ఱమ్ము లే
నుఁగు రథమ్మును, హరికి గరుడుండు
యమునకు మహిషంబు హరునకు వృషభంబు
హంస బ్రహ్మకు నెమ్మి హరసుతునకు
నెలుక విఘ్నేశున కలరు; నీ కిప్పు డ
పూర్వవాహనము నద్భుతము గాఁగ
వాంఛింతు నిను మునివరులు శిబిక నుంచి
యేగింపఁజూచి దేవేంద్రుకన్న

గీ. నధికునిఁగ నెంచి నీ వృద్ధి ననుమతించి
పొందఁ గోరెద నావుడు మందబుద్ధి
యంబికామాయకతన మోహాంధుఁ డగుచు
నగుచు నయ్యబ్జముఖి కనె నహుషుఁ డెలమి. ౨౫౯

గీ. సత్య మగుమాట చెప్పితి జలజనయన!
సదృశమగు వాహనము నాకు సంతరించి

తనఘులు మునీశ్వరులు మోయునంతకన్న
ఘనత గల్గునె యొందు లోకముల నెందు. ౨౬౦

క. మును లేడ్వురు మోయఁగఁద
క్కిన ఋషులుం దోడ రా నొగిన్ శిబికారూ
ఢుని నన్నుఁ జూడఁ గలవో
వనజానన నిన్నుఁ బొందవచ్చినవేళన్. ౨౬౧

వ. అని శచికిం బ్రియంబు వల్కి యచ్చోటు విడిచి మునులంగని
స్మరాతురుండు నహుషుం డిట్లనియె. ౨౬౨

ఉ. ఏను సురేంద్రుఁడన్ శచియు నింతటిదక్కను నన్నుఁ బొందదో
మానివరేణ్యులార యవమానముగాదె? యనుగ్రహించి నా
మానము నిల్పఁగాఁ దగినమాన్యులు మీర లోకించుకేని య
మ్మానిని మానిసం దులువ మారుఁడు నిల్వఁగనీఁడు నన్నిఁకన్.

క. ఆ నెలఁతపొందు యుష్మద
ధీనంబై యున్నయది విధించె న్నను స
న్మానివరేణ్యులు మోసెడి
యానముపై నెక్కి పొందనరుదె మ్మనుచున్. ౨౬౪

వ. ఇయ్యది మీర లనుగ్రహింపకున్కి నెట్లు సమకూరు మీకు
శరణాగతుండ నన్నిమదనభూతంబువలన రక్షింపవలయునన నగ
స్త్యప్రముఖులగు మునులందఱును భావికార్యానుసరణమ్మున
దయామతులై యంగీకరించుటయు నహుషుండును చాలో మీఁగ
తమానసుండగుకతన దివ్యమునివాహకంబగు శిబిక నధిష్ఠించి.

చ. స్మరపరిపీడితుం డతఁడు చయ్యన నచ్చెలిఁ జూచువేడ్క న
త్వరమతియై యగస్త్యమునివర్యు సముద్రము మ్రింగినట్టియు

ద్ధురుఁ దనకాలఁదన్ని కశతో నదలించుచు "సర్ప సర్ప" నాఁ
గరము కశాహతిం గనలి క్రుక్కున సర్పముగా శపించుచున్.

—* ఇంద్రుఁడు స్వర్గమ్ము నొందుట *—

క. మరల నిటుపల్కె "బహువ
త్సరము లరణ్యముననుండి సత్త్వముకల్మిన్
దిరుగుచునుండ యుధిష్ఠిరుఁ
డరుదెంచున్ శాపముక్తి నతఁ డిడు నీకున్. ౨౬౭

వ. ధర్మపుత్రుండు నీ ప్రశ్నంబుల కుత్తరంబిచ్చువాఁడు తచ్ఛ్రవణమాత్రమ్మున నీ శాపమ్ము దొరఁగి స్వర్గమ్మునకు రాఁగల" వని నొడివె. ౨౬౮

ఆ. వె. నహుషుఁడంతఁ బడియె నాకమ్మునుండి తా
నహియు నగుచుఁ గాననాంతరమున
నుండె; వాసవుం డఖండ ముదమ్మును
జెందె దీని వినికిఁ జేసి యధిప. ౨౬౯

వ. అంత సురలును మునులును నింద్రునికడ కరిగి మానపూర్వకమ్ముగా నాశ్వాసించి యథాప్రకారమ్ముగ స్వస్థానమ్మున నిలిపి యభిషేకమ్మొనరింప నతండును జిరవిరహిణి శచింగూడి నందన వనమ్మున విహరించుచు సుఖంబుండె. ౨౭౦

చ. అనఘుని విశ్వరూపుని మహాత్ము,మునిన్ దనుజున్ వధించి దుః
ఖనియతుఁడయ్యె నింద్రుఁ; డిటుక్రమ్మఱ దేవి యనుగ్రహింపఁగై
కొనె ముదమున్; సమస్తమునకున్ దనకర్మమె కారణంబు దా
నిని విడఁజెల్ల దేరికిని నిక్క మెఱుంగుము భూప! నావుడున్.

చ. నరవరుఁ డిట్లువల్కు మునినాథ శతక్రతుకర్తయై సుఖో
ద్ధురమగు స్వఃపదంబుగొని దుఃఖితుఁడయ్యె సురేశుఁడంటి త
క్కొరులకు నస్మదాదులకు నొక్కెడ సౌఖ్యము చిక్కునే! కృతా
దరునకు నాకు శిష్యునకు దాఁపక సర్వము దెల్పు నావుడున్.

—* కర్మ విశేషములు *—

గీ. వ్యాసుఁ డిట్లనుఁ గర్మము వర్తమాన
మనియు సంచితమనియు నో యవనినాథ
తెలియఁ బ్రారబ్ధమని మూఁడుదెఱఁగులగును
గారణం బియ్యదియ సర్వకార్యములకు. ౨౭౩

వ. అందు నానాజన్మ సంపాదితంబు సంచితంబు, మఱియు సాత్త్వక
రాజస తామసభేదమ్ముల నాకర్మంబు త్రివిధంబు. ౨౭౪

క. వినుము శుభాశుభరూప
మ్మునఁ దగు సంచితము భోగమునఁ దీఱు నొకిం
తన పో దనేక జన్మము
లనుభవమున కెత్తవలయు నది ఘనమగుటన్. ౨౭౫

గీ. జననమందినదాదిగ సలుపుకర్మ
మరయ నది వర్తమానవిఖ్యాతి నెసఁగు
సంచితమ్ముల నడిమికి సగము సేయ
నమరుఁ బ్రారబ్ధమై జననాది కదియ. ౨౭౬

గీ. వీరు వారననేల యెవ్వారికేని
జనదు ప్రారబ్ధ మనుభవమునకుఁ దక్కి
కర్మమున్నంతదనుక నిక్కమ్ము జన్మ,
మది యడఁగుమీఁద జన్మంబు నడఁగు నిజము. ౨౭౭

క. హరియును హరుఁడును సురలును
విరించియును గర్మవశులు వితయేని నరే
శ్వర ! దేహధారులై యి
క్కరణి శుభాశుభము లందఁగా నేమిటికిన్. ౨౭౮

వ. దేహి తనకు సుఖదుఃఖానుభవ కారణంబగు కాలపరిపాకమ్ము
వలన సంచిత కర్మానుభవావసరమ్మున సుకృతంబొండె దుష్కృతం
బొండె సలుపుచుండు నట్లు దేవతలును నని యెఱుంగుము. ౨౭౯

క. నారాయణాంశజులు నర
నారాయణ మునులు ధర్మనందనులు భువిన్
ధీరులు కృష్ణార్జునులై
పేరందుట దీనఁగాదె పృథ్వీరమణా. ౨౮౦

వ. ఇయ్యది పురాణపీఠిక యని మునులచే వ్యవహరింపం బడునని
మఱియును. ౨౮౧

గీ. అధిప ! విభవాధికుండు దేవాంశభవుఁడు
కవిత గలవాఁడు ఋష్యంశ కలితుఁ, డెవఁడు
రుద్రు నర్చించు నవ్వాఁడు రుద్రునంశ
మవని పాలించువాఁడు విష్ణ్వంశభవుఁడు. ౨౮౨

వ. మఱియు నన్నదాతయు దేవాంశభవుండగు నింద్రాగ్నియమ
విష్ణుధనదుల వలనఁ బ్రభుత్వప్రభావకోపపరాక్రమంబులను
సంగ్రహించి శరీరంబు నిర్మింపంబడెడి. ౨౮౩

క. బలవంతుఁడు ధనవంతుఁడు
కలావిదుఁడు భోగశాలి ఘనభాగ్యము లం

దులఁదూఁగువాఁడు వీరలు
తెలియుము దేవాంశభవులు తెల్లముగ నృపా. ౨౮౪

వ. పాండవులును నిట్టిరగుట విఖ్యాతులైరి దేవాంశజుండగు కతన
వాసుదేవుండును నారాయణసముండై వఱలె. ౨౮౫

గీ. ఏది యొల్లినఁ బ్రాణులకెల్ల దేహ
మమరు సుఖదుఃఖములకుఁగానట్టిదేహి
స్వవశుఁడొక్కరుఁడును లేఁడు జననమరణ
కష్టములు దైవవశమునఁ గాంచుచుండు. ౨౮౬

వ. మఱియుఁ బాండవులు వనింబొడముటయుఁ బిదపఁ బురమ్మున
కరుగుటయు బాహుబలమ్ముకలిమి రాజసూయం బొనర్చుటయుఁ
గ్రమ్మఱ వనవాసదుఃఖం బనుభవించుటయు నర్జునుండు తపంబు
చేసి సురలవలన వరమ్ము గొనుటయు ననునివి యన్నియుఁ గర్మ
జంబులకా నెఱుంగునది. ౨౮౭

క. నరదేహమ్మున మున్ను బ
దరికాశ్రమమందుఁ జేయుతప మర్జునతం
బొరసిన యప్పుడు ఫలదం
బరయఁగఁ గాకున్కిఁ గర్మ మతిగహనంబా. ౨౮౮

వ. అని వెండియు. ౨౮౯

సీ. కారాగృహమ్మునఁ గంజాక్షుఁడుదయించి
యంతట గోకులమందుఁ జేరి
యేకాదశాబ్దమ్ము లెలమి నచ్చటనుండి
మధురకు నేగి దుర్మార్గుఁగంసు

నడచి యాతనితండ్రి నధిపునిఁగాఁ జేసి
తల్లిఁ దండ్రులకు బంధనమువాపి
మ్లేచ్ఛాధిపునిభీతి మేకొన ద్వారవ
తీపురమ్మున కేగి కాఁపురమ్ము

గీ. చేసి సకుటుంబముగను బ్రభాసమున ధ
రాదితిజశాపమునఁ దెగి యంత మందెఁ
గర్మగతి యెట్టిదేనియుఁ గాకయున్న
వ్యాధుఁడా కృష్ణుఁ జంపెడివాఁడు తలఁప! ౨౯౦

వ. నావుడు జనమేజయుం డిట్లను మునీంద్రా! భూమి భారమ్ము సహింపక గోరూపధారిణియై కమలజు శరణమ్ము వేఁడిన నతఁడు జనార్దనుఁ బ్రేరేపించి భూభారహరణమ్మునకు వసుదేవగృహమ్మునఁ బుట్టు మన విష్ణుండును నట్ల జనియించి బలరామసహితుండై యర్జునుండు తోడ్పడ ననేకుల దుర్మతుల నడంచెనని చెప్పితివి దానం జేసి భూమికేమి భారంబు దఱిఁగె? ఇది యిట్లుండ భీష్మ ద్రోణవిరాటద్రుపద బాహ్లిక సోమదత్త కర్ణాదులం జంపెఁ గాని తన యనంతరమ్మున భార్యలంగొట్టి దోఁచికొన్న దొంగల మునుమున్న యేల వధింపఁడయ్యె? ఆభీరశకమ్లేచ్ఛనిషాదులు కోట్లకొలఁది మిగుల నేల? వారలు భూమికి నేల భారకారులు గాకుండి? రని వెండియు, ౨౯౧

క. కలుషావృతమై తగునీ
కలియుగమున నొక్కఁడేనిఁ గలఁడే యోగ్యుం?
డిల కిది భారముకాదే
తెలుపుమునా మాని భూపతికి నిట్లనియెన్. ౨౯౨

గీ. ప్రజలు యుగములఁ బట్టి పాపమ్ముఁ బుణ్య
మాచరింతురు యుగధర్మ మాఁగఁగలరె
ధర్మమున రెంట మూటఁ దత్పరతగలరు
క్రమముగా మూఁడుయుగములఁ గలుగు ప్రజలు. ౨౯3

వ. కలియుగమ్మున నర్థకామరసికులు దక్క నొండొరులు జనియిం
పరు; ధర్మాధర్మములకుఁ గర్త కాలంబ యని యెఱుంగుము
నావుడు నృపతి యిట్లనియె. ౨౯౪

క. కృతమున ధర్మము త్రేతఁ
మితిమీఱినదానముఁ యమితులై నానా
వ్రతములు ద్వాపరమున స
మ్మతిఁ జేసినవారికేది మనికి యిపుడగుఁ ? ౨౯౫

క. ఈ కలియుగమునఁ బాప
వ్యాకులులై దేవనింద యాదిగఁదగు నా
నాకృతు లొనర్చుదుర్జను
లాకృతయుగమందు నెచటి కరుగుదురు మునీ. ౨౯౬

వ. నావుడు వ్యాసుం డిట్లనియె. ౨౯౭

క. కృతయుగమున మనుజులు వి
స్తృతముగఁ బుణ్యము లొనర్చి దివిజనగరసు
స్థితిఁ గాంతురు వర్ణాశ్రమ
గతు లించుకయేనిఁ జ్యుతినిఁ గనకున్కి నృపా. ౨౯౮

గీ. దయయు సత్యంబు దానంబు తనదుభార్యఁ
గూడియున్కియు ద్రోహమ్ము గొనమి సర్వ

భూతసమబుద్ధియును సతమ్ములు సమస్త
జంతువులకుఁ గృతమ్మున జనవరేణ్యా. ౨౯౯

వ. రజకాది వర్ణమ్ములును నయ్యుగమ్మున స్వధర్మనిరతిం జరించు టంజేసి స్వర్గమ్మున కరిగెడిఁ ; త్రేతాద్వాపరమ్ములను నట్లకా నెఱుంగునది. ౩౦౦

క. నయహీనులు మానవులు క
లియుగమ్మున సుకృతబుద్ధిలేమిన్ యుగప
ర్యయ మలవడుదన్కను ని
శ్చయముగ నరకమున నుందురు జననాథమణీ. ౩౦౧

క. కలికృతసంధిన్ స్వర్గ
స్థులు పుడమి జనింతురు మిగుల దుష్టులు నరక
స్థులు జనియింతురు ద్వాపర
విలయమ్మునఁ గలియుగంబు వెలయం జేయన్. ౩౦౨

క. కలియుగమున సుజనులునుం
గలిగిన నవ్వారు సుకృతకర్మానుగతిన్
వెలయుదురు ద్వాపరమ్మున
నలత్రేతన్ గృతమునందు నధిపవతంసా. ౩౦౩

క. విను మట్టుల కృతయుగమున
ననయతఁ బాపములు సేసినట్టి జనులు దు
ర్జనహితమగు కలియుగమున
జనియించి యపాత్రకృతులు సలుపుదు రెందున్. ౩౦౪

—* యుగ ధర్మములు. *—

క. యుగరీత్యనుసరణమ్మునఁ
దగు ధర్మజ్ఞులకుఁ బాపతత్పరత, పవిత్ర
స్తగుణుండగు నీ తండ్రికిఁ
దగునే మునియతుఁ బాము దగులంజేయన్ ? 30౫

వ. యుగబలంబ కాదేని యయాతికులసంభవుండగు రాజన్యున కిట్టి
బుద్ధి యెట్లు పొడము నని చెప్పి వెండియు. 30౬

చ. కృతయుగమందు బ్రాహ్మణులు కేవల వేదరతుల్ పరాంబికా
మతులు దయాయుతుల్ శుచిసమన్వితు లట్టులె క్షత్రియుల్ సుసం
గత పరిపాలనాదరు లఖండయశుల్ మఱి వైశ్యులున్ సమం
చితకృషిగోగణావనవిశిష్టవణిక్కృతినిత్యతత్పరుల్. 30౭

వ. మఱియు శూద్రులు సేవాతత్పరులై యుండిరి సకలవర్ణమ్ముల
యందును దేవీపదభక్తి విశేషించి యుండెఁ బ్రతిగ్రామమ్మున
జగదంబాలయమ్ములు మెండుగనై యుండె. 30౮

క. కృతయుగముకన్నఁ దేత్రన్
మితమగు ధర్మమ్ము మిగులమితమగు ధర్మ
స్థితి ద్వాపరమునఁ గలియుగ
గతి సెప్పఁగ నలవి కాదు కలుషిత మగుటన్. 30౯

క. మును రక్కసు లిక్కలియుగ
మున విప్రులుగా జనించి మూర్ఖు లసత్యం
బున ఘనులును బాషండులు
జనవంచకు లనఁగఁ బరఁగి చరియింతు రొగిన్. 3౧౦

గీ. వేదనిందాపరులు లోకవిదులు శూద్ర
సేవనాసక్తులు నధర్మజీవనులును
భ్రష్టులును గాఁగలరు క్రమక్రమమునఁ గలి
వృద్ధిచెందిన కొలఁదిగ విప్రవరులు. ౩౧౧

క. కలియుగము వృద్ధిఁ జెందిన
కొలఁది ఋతోద్భవము ధర్మగుణము నశించున్
గలుషమ్ము వృద్ధి నొందుఁ బ్ర
బలమగు నన్యాయరీతి ప్రజలందు నృపా. ౩౧౨

గీ. క్షత్రియులు వైశ్యులును శూద్రసంతతులును
ద్విజులయట్ల స్వధర్మముల్ దిగవిడుతురు
ద్విజులు శూద్రులరీతి వర్తించి దుష్ప్ర
తిగ్రహమ్ము లొనర్తురు తేజ మెడల. ౩౧౩

చ. అనృతము వల్కుదుర్ పరులనంటుదు రిచ్ఛకు వచ్చినట్లు వ
ర్తన మొనరింతు్ర ధర్మములు తారయి చెప్పుదు రాత్మభర్తృవం
చన మొనరింతు రంగనలు సాధ్వి యొకర్తుక గాని కానరాఁ
జనదు కలిన్ జగమ్ము కడు సంకరరీతినిఁ బొల్చు భూవరా.

గీ. శుద్ధ మాహార మైన విశుద్ధమగు మ
నంబు దాన నెసంగు ధర్మంబు వృత్తి
సంకరతఁజేసి ధర్మంబు సంకరమగు
దాన వర్ణసాంకర్యం బొదవు నృపాల. ౩౧౪

క. కలియుగమున నివ్విధమునఁ
దొలఁగున్ వర్ణములపద్ధతులు విజ్ఞానం

బలవదు మహాత్ములును జం
చలులై దుష్కృతులు సేయఁజాలుదు రనఘా. ౩౧౬

వ. ఇయ్యది యుగస్వభావం బగుట నేరికిని నవార్యం బనుడు జనమే
జయుండు. ౩౧౭

క. కలుషప్రధానమై తగు
కలియుగమునఁ బొడముప్రజకు గతికలదే నిన్
సొలవక చెప్పు మనఁగ న
య్యలఘున కిట్టులను వ్యాసుఁ డాదర మెనయన్. ౩౧౮

చ. కలిఁ గలుషంబు వాపికొనఁగా మదిఁ గోరునరుండు సర్వమం
దొలఁగఁగఁ ద్రోచి శక్తిపదతోయజ మెప్పుడు సంస్మరింపఁగా
వలయుఁ దదీయనామరసపాన మొకప్పుడుఁ గాని చేయువా
రల కగు సౌఖ్యముల్ హరిహరప్రముఖుల్ గనలేరు భూవరా.

క. తగుపుణ్యక్షేత్రమ్మున
నగణితమహిమాఢ్యమైన యంబాపద మొ
ప్పుగఁ దలఁచెడివారలు పా
పగతిం గన రిది రహస్యపద్ధతిసుమ్మా. ౩౨౦

క. పాయక యజపాఖ్యం బగు
గాయత్రి జపింతు ద్విజులు గనఁజాలరుగా
మాయావిభవము వారలు
ధ్యేయం బంబాపదంబ తెలియుము నీకున్. ౩౨౧

వ. యుగధర్మవ్యవస్థయందు నీ వడిగినప్రశ్నంబున కుత్తర మిచ్చితి
నింక నీకభీష్టం బెద్ది యనవుడు దేవమానవులకు గమ్యమ్ములును
బుణ్యమ్ములును నగు క్షేత్రమ్ములును నదులును స్నానదానాది

విశేషమ్ములును విస్తరించి నా కెఱింగింపు మన వ్యాసుం డిట్లనియె. రాజేంద్రా! యెల్ల నదులలో జాహ్నవి యుత్కృష్టంబు మఱియు యమునా సరస్వతీ నర్మదా గండకీ సింధు గోమతీ తమసా కావేరీ చంద్రభాగా వేత్రవతీ సరయూ ప్రముఖమ్ము లగు నదులు నూర్లకొలఁది గలవు. ३౨౨

—* తీర్థ విశేషములు. *—

గీ. ఈ నదులలో సముద్రమ్ము నెనయునవి వి
శేషపుణ్యప్రదమ్ములు సింధుగతము
లందు జల మెప్పుడును గలయవి ప్రశస్త
ములు నదులు వర్షముల రజస్వలలు భూప. ३౨३

వ. శ్రావణ భాద్రపదమాసమ్ముల నానావిధ కలుషిత ప్రవాహమ్ములకలిమి రజోదోషమ్ము వాటిల్లునని యెఱుంగునది. వెండియుఁ బుష్కరమ్మును గురుక్షేత్రమ్మును ధర్మారణ్యమ్మును ప్రభాసమ్మును బ్రయాగమును నైమిశారణ్యమ్మును నర్బుదారణ్యమ్మును నివి పుణ్యక్షేత్రమ్ములు; శ్రీశైలమ్మును సుమేరుపర్వతమ్మును, గంధమాదనమ్ము నను నివి పుణ్యధరాధరమ్ములు; మానసమ్మును బిందుసరస్సును నచ్ఛోదంబును నను నివి పుణ్య సరోవరమ్ములు.

క. నరనారాయణ మును లా
దరమున నెవ్వేటఁ దపము దాల్చిరి దానిం
బరమోత్తమ మనఁదగదె బ
దరికాశ్రమ మనఁగ విశ్రుతంబది యధిపా. ३౨४

వ. మఱియు వామనాశ్రమమ్మును శతయూపాశ్రమమ్మును మొదలుగఁ బుణ్యాశ్రమమ్ము లనేకమ్ములు గలవు. ३౨౫

క. మునిజనములు తపములు తా
మొనరించినచోటు లెల్ల నోగిఁ దన్నామం
బున విశ్రుతి గని పుణ్యా
మ్మునకుం దానకము లగుచుఁ బొదలె నృపాలా. 3౨౭

వ. నా చెప్పిన స్థానమ్ములలోఁ గొన్ని దేవీస్థానమ్ములు గల వయ్యవి దర్శనమాత్రఫలదంబులు వాని నగ్రిమ్మునం జెప్పెదఁ దీర్థమ్ములును దానమ్ములును యజ్ఞమ్ములును దపమ్ములును వ్రతమ్ములును లోనగు పుణ్యకర్మమ్ములు సాపేక్షమ్ములని యెఱుంగు మది యెట్లంటేని, 3౨౮

క. శుద్ధంబగు ద్రవ్యమ్మ వి
శుద్ధంబగు మనము శుద్ధిఁ జొప్పడు క్రియ స
న్నద్ధంబు గాక యున్న న
బద్ధం బగు నిందుఁ జెందు ఫలము నృపాలా. 3౨౯

క. క్రియయును ద్రవ్యము శుద్ధా
శ్రయముగ నొక్కప్పడెనయుఁ జంచలము మనం
బయవిఘ్నకారణముల వి
షయములఁ బడుకతన శుద్ధి చన దెప్పట్లన్. 330

వ. కామక్రోధలోభమదాహంకారమ్ములు తీర్థాధ్వరవ్రతపోనియమమ్ములకు నంతరాయప్రదమ్ములు మఱియు నహింసయు సత్యాస్తేయశౌచేంద్రియనిగ్రహ స్వధర్మ పాలనమ్ములును దీర్ఘఫలప్రదంబులు 331

గీ. దారి సంసర్గదోషమ్ము దవిలి నిత్య
కర్మ మెడలినకతన నిక్కముగఁ దీర్థ

గమన మది వ్యర్థమగు స్నానకలన దేహ
శుద్ధి దగుఁగాని మనమును శుద్ధమగునె. 33౨

క. విను తీర్థస్నానమ్మున
మనమును శుద్ధంబయే సమరనదికిం దా
పున వసియించి తపంబును
బొనరించెడి మునులు ద్రోహబుద్ధులగుదురే. 333

వ. చిత్తశుద్ధిమయంబగు గంగాదితీర్థసేవనం బతిపావనంబగుకతన నాం తరమలక్షాళనంబు నొనరింప సమర్థంబయ్యెనను నంతశ్శుద్ధికి నొక్క సత్సంగంబుదక్కఁ దక్కఁగల యజ్ఞదానాదికర్మములు నిమిత్తమ్ములు గాఁజాలవు. మున్ను బ్రహ్మపుత్రుండగు వసిష్ఠునకును విశ్వామిత్రునకును నాడీబకంబను ఘోరయుద్ధమ్ము నిరర్థకమ్ముగ హరిశ్చంద్రు కతమునఁ గలిగె నందు వసిష్ఠశాపమ్మున విశ్వామిత్రుండు బకంబును విశ్వామిత్రశాపమ్మున వసిష్ఠుం డాడియునైరి.

క. వా రాడీబకరూపము
లీరీతిం దాల్చి రణము నెనసిరి మిగులన్
దారుణగతి వర్షాయుత
మారయ మానససరస్తటారూఢిఁదగన్. 33౪

వ. అన జనమేజయుం డక్కత వినవలతు ననుడు సాత్యవతేయుం డిట్లనియె. 33౫

క. రవివంశజుండు రఘురా
మవిభునకుం బూర్వుఁ డనఘమతియున్ స్వర్నా
థవిభవుఁ డయిన హరిశ్చం
ద్రవిభుండు త్రిశంకురాజతనయుం డలరున్. 33౬

వ. అతం డనపత్యుం డగుకతన వరుణుం గుఱించి తనకు సంతానం బొదవిన నరమేధం బొనర్చెదనని ప్రతిజ్ఞ యొనర్చె నంత. 338

—* ఆఱీబక యుద్ధము *—

క. ఆతని సుందరి గర్భో
పేత యయి కుమారుఁగాంచెఁ బ్రియమంది తనూ
జాతునకు జాతసంస్కృతి
నాతం డొనరించి చేసె నధికోత్సవముల్. 339

వ. పుత్రోత్సవ సమయమ్మున బ్రాహ్మణులకు నపారంబగు హిరణ్య మ్మును గోవులనునొసంగి తనిపె నట్టియెడ వరుణుండు విప్రవేషమ్మున నటవచ్చి కృతసత్కారుండై యాగమన కారణం బడుగు నృపతిం గాంచి యిట్లను. 340

ఆ. వె. సుతునిఁ బశువుఁజేసి సొలవక యాగంబు
సలిపి నీదుప్రతిన నిలుపుమనుడు
విహ్వలాత్ముఁడగుచుఁ బృథ్వీశ్వరుండు ధై
ర్యంబు కొంత గాంచి యతనికనియె. 341

క. ఓ సదయ ! యి త్తలోదరి
మాసమునకు శుద్ధిఁజెందు మానక నీకై
చేసెద యాగంబప్పుడు
నా సత్యము చూడు మనఁ దనయెడకు నరిగెన్. 342

వ. పదంపడి హరిశ్చంద్రుండు సంతుష్టుం డయ్యును గించిచ్చింతా భరమ్మున నుండె. 343

క. మాసము పూర్ణంబగుడు ధ
రాసురరూపమునఁ బాశి రాజేంద్రుఁ బరీ
త్రాసముపేతు నొనర్పఁగ
నాసించి రయమున రాఁగ నా నృపవరుఁడున్. ౩౮౪

వ. ఉచితసత్కారం బొనర్చి యాతని రాకకుం గతం బెఱింగినవాఁడు గావున వినయమ్మున నిట్లనియె. ౩౮౫

క. బాలుం డసంస్కృతుం డిఁత
డేలా యజ్ఞార్హుఁడగు ? సహింపు మాపనయ
శ్రీలక్షితుఁడగు దనుఁ గృ
పాళుఁడవై యనుడుఁ బలికె వరుణుం డలుకన్. ౩౮౬

క. కొడుకుపయి నడరు నీ ప్రే
ముడి నా కెఱుఁగంగ నయ్యె మును పలికి యిటుల్
దడఁబడఁ జెల్లునె నన్నుం
గడుకొని వంచింప నెంచఁగాఁ దగునె నృపా. ౩౮౭

వ. అయినను నీవచనగౌరవమ్మున నిప్పటి కరిగి సమావర్తన కర్మానంతరమ్మున నేతెంచువాఁడ సత్యమ్మునకుం దప్పితివేని నిన్నప్పుడవశ్యము శపింతు నని యతఁడరిగెఁ బిమ్మట హరిశ్చంద్రుండు గొమరునకు లోహితాక్షుండను నామమ్మునిచె; నా రాజసుతుం డును దినదినప్రవర్ధమానుండై సర్వవిద్యావిశారదుండై,

గీ. తనకు జన్మంబు కతన నంతంబు గలుగు
టెఱిఁగి పరుగిడి యేరికి నేగరాని
యద్రిగహ్వరమున డాఁగె నధికభీతి
లోహితాక్షుండు బ్రదుకంగ లోఁదలంచి. ౩౮౮

వ. పిదప వరుణుం డరుదెంచి జన్నం బొనర్పుమనుడు నరవరుండు ప్రమ్లానవదనుండై మహాత్మా, మత్పుత్రుం డదృశ్యుండై యెట కేనియుఁ బోయె నేనేమిసేయుదు ననుడు వరుణుండును. ౩౧౦

క. నను వంచించి యసత్య
మ్మునకుఁ లోనైతి కాన భూవర నీకుం
బనుపడు జలోదరంబను
ఘనతరమగు వ్యాధి యనుచుఁ గనలి శపించెన్. ౩౧౧

వ. ఇట్లు శపించి యతండరిగెఁ బదంపడి హరిశ్చంద్రుండు వ్యాధి పీడితుండై పుత్రాదర్శనమ్మునకు వగచుచున్నంత. ౩౧౨

క. ఒక పాంథుండు హరిశ్చం
ద్రకుమారుం గాంచి పలుకు "దయమాలి కటా
ప్రకటవ్యాధిపరీతు జ
నకు విడిచి యిటుండ నీకు న్యాయ్యంబగునే. ౩౧౩

క. నీకై కుందెడి జనకుని
శోకము గణియింపలేని సుతుఁడవు నీకుం
గా కొరుల కిట్లు చెల్లునె
తేఁకువ యొక్కింత వలదె ధీరున కెందున్. ౩౧౪

క. జనకునకుఁ గాఁగఁ దన జీ
వనమైనఁ ద్యజించునట్టివాఁడు కుమారుం
డనఁదగుఁగాని నినుంబలెఁ
దనప్రాణము డాఁచికొనినఁ దనయుం డగునే." ౩౧౫

వ. ఇట్లు ధర్మసంయుతంబుగ బోధించు పాంథుని వచనమ్ములఁ ద్వరితుండై తండ్రిం గన నరుగ నుంకించు నాతనికడకు నింద్రుండు విప్రవేషమ్మునవచ్చి కృపాళుండునుంబలె నిట్లనియె. ౩౧౬

చ. చన మది నెంచఁబోకు కడు సాహసివై తనరోగబాధ దీ
ర్పఁ నెదఁ దలంచి నిన్నుఁ దగఁబట్టి మఖమ్మునఁ బెట్టి చంపు, ము
న్నినుఁ గనుపొంటె నవ్వరుణుని వెస నిట్లు యజింతు నంచు నీ
జనకుఁడు నేమమూనె విను చావఁగ నేటికి నాదుపల్కులన్.

వ. ఇట్లతని వచనమ్ముల నిషిద్ధగమనుండై లోహితాత్ముండు మాయా మోహితుండై యటఁ గొండొక కాలంబుండి మరల నొకని కతనఁ దండ్రి దురవస్థ విని గమనోన్ముఖుండగుడు నింద్రుఁడెప్పటి యట్ల వారించె; నిట్లతం డెప్పుడు చననుద్యమించు నప్పుడు తప్పక యింద్రుండు వచ్చి వారించుచుండుఁ బదంపడి యొక్కనాఁడు హరిశ్చంద్రుండు దుఃఖార్తుండై కులగురుఁడగు వసిష్ఠుం గాంచి మహాత్మా! జలోదరవ్యాధిపీడితుండ నగుననుఁ గరుణింపుము నావుడు వసిష్ఠుండు కరుణార్ద్రుండై యిట్లను. ౩౫౮

గీ. కల దుపాయం బొకండు పుత్రులు త్రయోద
శవిధముల నొప్పుదురు ధర్మసమ్మతులయి
యందుఁ గ్రీతుని గొని జన్నమాచరించి
వరుణుని యజించి వ్యాధిని బాపికొనుము. ౩౫౯

ఉ. నావుడు మంత్రులం గని జనప్రవరుం డిటు పల్కె, నెవ్వఁడే
నీ విధికిం దనూజు నిడునేని ధనాశమెయిం గొనుండు భూ
దేవకుమారునిన్ వెదకి తెండు ధనం బది యెంతయేనియున్
బ్రోవిడుఁ డిందు లోభమును బూనకుఁ డేగుఁడు శీఘ్రగాములై.

క. అని యనుపన్ సచివులు సని
జనపదములు పట్టణములు సదనం బొక్కం
డునువదలక కనునెడ ని
ర్ధనుఁడు నజీగర్తుఁ డను ధరాసురుఁ డొకటన్. ౩౬౦

క. కనుపట్టి ధనాశమెయిం
దనమూఁగురుతనయులందుఁ దా మధ్యము న
జ్జనవరుమంత్రుల కొసఁగెఁ
ధనలుబ్ధుల కెట్టిపనులు తగవు నృపాలా! ౩౬౨

వ. మంత్రులును దత్ప్రార్థితం బగుధనం బొసంగి శునశ్శేఫుండను నవ్విప్రకుమారుం గైకొని హరిశ్చంద్రునకుం జూపిన నతండు సంతసించి యజ్ఞార్థంబగు సంభారం బొనరించి ఋత్విక్కుల రావించి జన్నమ్మున కారంభించె; నంత యూపబద్ధుం డయి రోదనం బాచరించు నాశునశ్శేఫుఁ గాంచి విశ్వామిత్రుండు కరుణాకరుండై హరిశ్చంద్రుని కిట్లను. ౩౬౩

చ. జనవర! సాహసించి ద్విజసత్తముఁ జంపఁగ నేల? విప్ర రో
దన మొనరింప నామనము తద్దయు నీరయిపోయె మున్ను మీ
జనవరు లాత్మదేహమును జయ్యన నిచ్చి పరాంగరక్షణం
బును బొనరింతు రిట్టిపని పోలునె స్వాంగము రక్షసేఁతకున్.

గీ. నీకు సౌఖ్యంబు గల్గఁగా నే నొనర్తు
దయగలిగి దీను నీ విప్రతనయు విడువు
మందఱకు నొక్కటే దేహమందుఁ బ్రీతి
బాలకుం జంపె దీ వెంత పాపమతివో! ౩౬౪

వ. అని పలుతెఱంగుల నొత్తిచెప్పిన నత్తాపసుపలుకులు చెవిఁ బెట్టక వ్యాధిపీడితుండగుకతన హరిశ్చంద్రుండు క్రతూద్యముండై శునశ్శేఫు విడువనొల్లఁడ. దానంజేసి గాధిజుండు క్రోధాకులుండై యవ్విప్రకుమారునకు వరుణదేవతా ప్రీతిదంబగుమంత్రం బుపదేశించె. ౩౬౫

క. అతఁ డమ్మంత్రోత్తమముం
బ్లుతస్వరముగా జపింపఁ బూర్ణకృపాసం
గతుఁడై వరుణుం డయ్యెడ
కతిరయమున వచ్చి విడిచి యధిపున కనియెన్. ౩౬౭

వ. రాజా! నీ కిఁక వ్యాధిబాధ లేకుండెడిఁ గృతప్రతిజ్ఞుండ వైతివని యరిగె దాన హరిశ్చంద్రుండును సంతసించె. ౩౬౮

క. మునిసుతు నిటువిడిపించియుఁ
దనమాటన్ వినని నృపు నెదన్ మఱవక స
న్ముని గాధిపుత్రుఁ డున్నం
త నరిగె నొకనాఁడు వని కతఁడు వేఁటకునై. ౩౬౯

వ. అట్లరిగి కౌశికీతటమ్మున నొక్క సూకరముం బడనేయఁ గ్రమ్మరువాఁడు మధ్యాహ్నకాలమ్మున వృద్ధబ్రాహ్మణాకారుండగు కౌశికుచే వంచింపఁబడి తన రాజ్యంబాది నిఖిలంబును గోల్పోయె.

క. అంత నొకనాఁడు కౌశికుఁ
గాంతారమ్మున యదృచ్ఛగాఁగ నిరుద్ధ
స్వాంతుండు వసిష్ఠుం డను
నంతయు నృపువలన విన్న యట్టిండగుటన్. ౩౭౦

ఉ. నా యజమానుఁడైన నరనాథు వృథా కపటంబు పూని నీ
వేయపరాధముల్ గనక యే కడు వంచనచేసి తక్కటా
నీయవినీతి కేమి యన నేర్తు బకక్రియ నీతపంబు దం
భాయిత, తాపసాధమ! యహంకృతి వమ్ముగ నేల తాల్చెదో.

క. ఆ నరనాయకుని బక
ధ్యానపరత నిట్లొనర్చి తనిసితివి బకం

బై నెగడుమింక నని శా
పానుగతిఁ బలుక నాతఁడలుక వాడమరఁ. 323

వ. వసిష్ఠుం గాంచి యే నెంతదనుక బకంబనై యుండుదు నందాఁక
నీ వాడివై యుండుమని ప్రతిశాపంబిచ్చె; నిట్లన్యోన్య శాపమ్ముల
నిరువురు నాడీ బకమ్ములైరి. 324

క. ఇరువురును మానసతటీ
తరువుల వేర్వేఱయుండి తఱుఁగని కోపం
బురహిఁ నఖచంచుపుటో
ద్ధురప్రహారములఁబోరుదురు ప్రతిదినముఁ. 325

గీ పక్షిరూపమ్ముగొని మునివరు లిరువురు
రుధిర ముట్టిపడంగ నీ రూఢి నెదిరి
పోరుసల్పుచు బహువర్షములు చెలంగి
రఖిలలోకమ్ములును భయమందుచుండ. 326

వ. నాపుడు జనమేజయుండు వారికి శాపం బెటు తొలంగె ననుడు
ముని యిట్లనియె. 322

క. నరులు సురలు భయ మందఁగ
నిరువురు నిట్లుండ బ్రహ్మ యేతెంచి పర
స్పరశాపమ్ములు తీర్చి త
గురహిఁ మిత్రతను గొల్పి గొనకొని యరిగెఁ. 32౮

వ. పిమ్మట వారలును దమ తమ యాశ్రమమ్ముల కరిగి సుఖం
బుండి ; రెట్టిమహర్షులేనియు నహంకారంబు విడనోపరు; తద్దోష
మ్మునన కదా మైత్రావరుణికిఁ గాశికునితో నిట్లు చిరకాలంబు
పోరుగల్గె. 32౯

క. మానవుల సురల నరులన్
దానవులం గాని యెంతదనుక నరసినం
గానంగరాఁ డొకండును
మానససంశుద్ధి గల్గు మాన్యుం డధిపా. 3౮౦

ఆ. వె. మనము శుద్ధిలేని మనుజుం డొనర్చు తీ
ర్థమ్ము జపముఁ దపము దానయజ్ఞ
ముఖ్యకృతులు వ్యర్థములు వాసనారహి
తునకుఁ దత్ఫలంబు దొరకు నిజము. 3౮౧

క. శ్రవణాదికమున మానస
ము విమలముగఁ జేసి తీర్థముననుండి సదా
భవహర మగు దేవీనా
మవిభవముజపించువాఁడు మాన్యుండుకలిన్. 3౮౨

వ. నాపుడు జనమేజయుండు మహాత్మా ! మిత్రావరుణియని చెప్పితి
వీనామంబు వసిష్ఠునకు గుణప్రయుక్తమో కర్మప్రయుక్తమో
నొడువు మనుడు వ్యాసుం డిట్లనియె. 3౮3

—* వసిష్ఠునికి దేహాంతరప్రాప్తి. *—

క. నరనాయక నిమిశాపము
బొరసి వసిష్ఠుండు దేహము విడిచి మిత్రా
వరుణులకుఁ బొడిమి మిత్రా
వరుణియనం బరఁగెనన నృపాలుండనియెన్ 3౮౪

క. ముని ననపరాధుఁ జతురా
ననతనయు వసిష్ఠు భూమినాథుఁడు శపియిం

చిన నెట్లు తవిలెఁ గారణ
మును వచియింపు మన మౌని భూపతి కనియెన్. ౩౮౫

క. కారణము మున్న చెప్పితిఁ
గా రాజవరేణ్య! యెట్టి ఘనులైనను సం
సారమున గుణపరీతులు
ప్రేరేపించు నవి యెట్టి పెనుదుష్కృతికిన్. ౩౮౬

గీ. రాజు లొనరించునట్టి ధర్మములుగాని
పరమమును లాచరించు తపములుగాని
యమరు మాయాగుణప్రేరణమునఁ జేసి
కామలోభమయమ్ము లోకమ్ము నిజము. ౩౮౭

క. మొదల వసిష్ఠుం డానిమి
కదయుండై శాప మిచ్చె నాభూపతియున్
బదపడి మునిని శపించెన్
విధి దాఁటఁగ నేరితరమె పృథ్వీనాథా. ౩౮౮

వ. ఆజగజ్జనని యనుగ్రహమ్ము వడయరేని హరిహరాదులైనను విముక్తులు గాఁజాలరు. తదనుగ్రహంబు గల సత్యవ్రతాదులు పామరులయ్యును విముక్తులగుట తెల్లంబ యని మఱియును.

క. ఆ యంబిక హృదయం బది
యేమెవ్వారలును గాన రిది నిక్కము కా
నీ యాపె భక్తజనుల న
పాయవిముక్తుల నొనర్చి భరియించు నృపా. ౩౯౦

వ. కావున నయ్యంబ యందలి భక్తి దోషనిర్మూలనకారణంబగు, నది రాగదంభాదియుక్తంబగునేని బహిత్వాయదాయకంబని యెఱుంగుము. ౩౯౧

క. అమలతరవర్తనుండు
త్తముఁ డిక్ష్వాకుతనుజుండు ధర్మాత్ముఁడు భూ
రమణశిరోభూషణ మన
నిమి యను నొకచక్రవర్తి నెగడు నృపాలా. ౩౯౨

గీ. అతఁడు బ్రాహ్మణహితము దా మతిఁ దలంచి
గౌతమాశ్రమమునకుఁజక్కటి జయంతు
పుర మనెడిపేర నొకపురమును నఖండ
సంపదల కాకరముగ నిర్మింపఁజేసె. ౩౯౩

వ. పదంపడి యొక్కయెడ నానృపతివరుండు దీర్ఘకాలంబగు నొక జన్నంబు సేయఁదలంచి తండ్రియగు నిక్ష్వాకునాజ్ఞఁ గొని మహామున్యుపదిష్టప్రకారంబున సంభారంబులు సంగ్రహించి భృగ్వంగిరోగౌతమపులస్త్యఋచీకపులహాక్రతుప్రముఖులగు మునుల నామంత్రించి కులగురుండగు వసిష్ఠుం గాంచి యిట్లనియె. ౩౯౪

గీ. ఐదువేలవత్సరము లయ్యంబ నర్థి
గుఱిచి జన్నం బొనర్చెద గురువరేణ్య
సకలయజ్ఞసంభారంబు సంగ్రహించి
నాఁడఁ జేయింపు మన నృపున కతఁ డనియె. ౩౯౫

వ. అంబామఖం బొనర్ప నుద్యుక్తుండై పాకశాసనుం డింతకుమున్న నీవలె నన్నుం బ్రార్థించె; నాజన్నంబును బంచశతవర్షాత్మకంబ దానినెఱవేర్చి పిదప నీజన్నమ్మున కరుదెంచువాఁడ నంతదనుకఁ దాళుమనుడు నిమి యిట్లను. ౩౯౬

క. మునులం బిలిచితి జన్న
మ్మునకుఁ సంభారమెల్లఁ బూరించితి మా

యినకులమునకున్ గురుఁడవు
నను వంచన చేసి యరుగ న్యాయ్యమె నీకున్. ౩౯౭

వ. ధనలోభమ్మునం జేసి నీ విట్లొనరింపఁదగదని మాటిమాటికి నివారితుండయ్యు వసిష్ఠుండు గణియింపక సురపతి మఖమ్మునకుం జనియె. ౩౯౮

ఉ. పిమ్మట వైమనస్యమున వేగ మెలర్ప నిమిప్రభుండు స
త్సమ్మతు గౌతముం గురుపదమ్మున నిల్పి తుషారభూధ్రపా
ర్శ్వమ్మున దేవికిన్ మిగుల సమ్మతిగాఁగ మఖంబొనర్చి పే
మమ్మున నెల్ల ఋత్విజుల మాన్యులఁ జేసె నపారదక్షిణన్. ౩౯౯

వ. ఇంతకుమున్న వసిష్ఠుం డింద్రమఖంబు సంపూర్ణంబొనరించి తత్కృతపూజలందనిసి యజ్ఞదీక్షామధ్యమ్మున నిమిం గనవచ్చిన నతండు నిద్రావశుండై దర్శనం బొసంగఁడాయె దానం గోపించి వసిష్ఠుండు. ౪౦౦

చ. కులగురు నన్ ద్యజించి మదిఁ గొంకక వేఱొకనిన్ వరించి నా
యలఘుపదమ్మున న్నిలిపి యాగ మొనర్చుచు నంతఁబోక యి
వ్వల నినుఁజూడ రాఁగ నిటు వంచన చేసితి నీదు దేహ మీ
యిలఁ బడెడిన్ విదేహగతి నిప్పుడ చెందుము శాపమిచ్చితిన్.

వ. అను నమ్ముని వచనమ్ములకుఁ దలఁకి భృత్యులు నృపుని లేపిన నతండును జనుదెంచి శాపంబిచ్చుట యెఱింగినవాఁడు గావున గురున కిట్లను. ౪౦౨

శా. పంకేజాసను నాత్మసంభవుఁడవై పాపమ్ము లెక్కింపకే
హంకారమ్మున శాపమిచ్చితివి నాయందింతయున్ లేదుగా

పంకం ; బక్కట లోభబుద్ధివయి భూపాలు న్ననుర్ శిష్యు ని
శ్శంకన్ వీడితి సిగ్గెఱుంగవు ధనాశాలోలుపత్వమ్మునన్. ౮౦౩

క. నీదోషము నాయందా
పాదించి శపించి తింతపాపపుఁగోపం
బూఁదిన నీ దేహమునకు
నాదశయ ఘటిల్లు నిదియు న్యాయ్యమ్మగుటన్. ౮౦౪

వ. ఇట్లిరువురును బరస్పర శాపోపహతు లైరి. పదంపడి వసిష్ఠుండు చతురాననుకడ కరిగి యిట్లనియె. ౮౦౫

క. నిమి యను రాజన్యుఁడు కా
యము వడఁగ శపించె దేహ మన్యము జ్ఞానా
దిమహిమ మియ్యది పోకుం
డ మహాత్మ యనుగ్రహింపు నావుడుఁ బేర్మిన్. ౮౦౬

క. చతురాననుఁ డిట్లను స
మ్మతి మిత్రావరుణదేహమహితాంశసమ
న్వితుఁడ వయి పొడమి జ్ఞాన
స్థితి గని పూజ్యత్వ మంది చెలఁగెదు తనయా. ౮౦౭

వ. నావుడుఁ దండ్రికి నమస్కరించి తత్క్షణము వరుణాలయమ్మున కరిగి దేహత్యాగం బొనరించి జీవాంశమ్మున మిత్రావరుణుల యందుఁ బ్రవేశించె నంతఁ గొండొక కాలమ్మునకు, ౮౦౮

క. అచ్చటికి నరిగె నూర్వశి
యచ్చపలాక్షిఁ గని వార లతికాముకులై
యచ్చర కిట్లని రెంతయుఁ
బొచ్చెమునకుఁగాని కూర్మి పొసఁగి మెసంగన్. ౮౦౯

చ. చెలి నినుఁజూచి మామనము చిక్కెను జక్కెరవింటిజోదుకో
ల్తలకుఁ; దలంకుమాన్చి దయదాఁపక యిచ్చకు వచ్చినట్ల దా
సుల మముఁగూడి కేళికలఁ జొక్కుము నావుడు వారియందు ని
శ్చలమతియై వసించె నటఁ జారువిలోచన కూర్మి పెంపునన్.

మ. కో. వారితేజము కుంభమందు నవారణన్ బడె నంతలోఁ
జారుదేహులు మాను లిర్వురు సంభవించిరి దాన న
వ్వారిలోఁ బ్రథముం డగస్త్తి ప్రభావశాలి వసిష్ఠుఁడున్
ధారుణీశ! ద్వితీయుఁ డింతయు దైవపాక మెఱుంగుమీ. ४०౧

వ. అం దగస్త్తి బాల్యమ్మునన తపమ్మునకు వనంబున కరిగె వసిష్ఠుని
నిక్ష్వాకుండు గైకొని కులార్థమ్ముగాఁ బాలించుచుండె నిది వసిష్ఠ
దేహాంతరప్రాప్తి నావుడు జనమేజయుండు నిమి యేమయ్యె
నుడువుమన వ్యాసుం డిట్లను. ४०౨

క. కనియె మఱియొక్క దేహం
బును వైళమ యవ్వసిష్ఠముని; నిమిభూపా
లున కట్లు కలుగదాయెన్
విను జనవర దీని విధము విస్తృతఫణితిన్. ४०3

వ. అట్లు వసిష్ఠుండు నిమికి శాపంబిచ్చినఁ గ్రత్వర్థం బేతెంచిన
ఋత్విజు లెల్లరుం గలసి యిట్లు యోజించిరి. ४०४

క. విపరీతమయ్యెఁ గార్యం
బపూర్ణదీక్షుండు నృపతి యన్యాయముగా
శపియింపఁబడియె దేహం
బపగత మగు నింక దీని నాఁగఁదరంబే. ४०౫

వ. అవశ్యమ్ముగాఁ గాఁదగు కార్యమ్ముల నొకం డాఁగనేర్చునే ? యని చింతించి మంత్రశక్తిచే నతని దేహంబు కించిచ్ఛ్వాసన యుక్తంబగునట్లు కాపాడి క్రతుసమాప్తి యొనరించుటయు.

—* నిమికి దేహాంతరప్రాప్తి *—

ఆ. వె. క్రతుసమాప్తి యందుఁ గ్రతుభుక్కు లరుదెంచి
జీవమాత్రశిష్టు భూవరేణ్యుఁ
గాంచి పలికి "రధిప కావించె నీజన్న
మెంతయేని మాకు సంతసంబు. ౪౧౭

క. వరమీఁగ వచ్చినారము
నరదేహమునందు వాంఛ నాటునొ లేదే
సురదేహము వాంఛింతువొ
నరవర తెల్పు" మన నిమియు నాకుల కనియెన్. ౪౧౮

క. కాయం బెన్నఁటికేని న
పాయముఁగను దాని గోర; నఖిలజగద్ద్ర
ష్ట్రాయతనమ్ముల నెప్పుడు
వాయువనై యుండుపొంటె వాంఛింతునొగిన్. ౪౧౯

వ. అని పలుకు నిమి యాత్మం గుఱించి దేవతలిట్లనిరి. రాజా ! సర్వేశ్వరి యగు జగదంబం బ్రార్థించితివేనిఁ ద్వత్కృతమఖసంతుష్టయగు నప్పరశక్తి నీ వాంఛితం బొసంగు. ౪౨౦

చ. అని సుర లానతీఁగ నిమి యాత్మ జగజ్జననిన్ విశేషభ
క్తినెగడ గద్గదస్వరము గీల్కొన సన్నుతి చేయఁ గోటి సూ
ర్యనిభసురూప మొప్పు జగదంబిక గోచరమై వరంబు గై
కొను మన నెల్లదేవతలకున్ ముద మబ్బురముం జెలంగఁగన్.

వ. అంత నిమియు వినయమ్మున నిట్లను ౪౨౨

క. ఈ నెంచెదేని వరమును
జ్ఞానం బప్రతిహతమ్ముగా నొసఁగియు దృ
గ్స్థానమ్ములు వాసమ్ములు
గా నిడుమీ సకలభూతగణముల యందున్. ౪౨౩

వ. నావుడు జగదంబ యిట్లను ౪౨౪

ఆ. వె. జ్ఞాన మబ్బునీకుఁ గర్మావశేషప
ర్యంత మఖిలభూతరాశి నేత్ర
వాస మొదవు నిమిషవర్తన నీనిమి
త్తముగ నేత్రములకుఁ దగు నృపాల. ౪౨౫

క. విను పశుపక్షులు మనుజులు
సనిమిషు, లనిమిషులు సుర, లొసంగితి నీ కో
రిన వరమని జగదంబిక
చనియెం దనయంత నిమియు సంతసమందెన్. ౪౨౬

వ. పదంపడి మునులందఱును నిమిదేహ మొక్కెడ నునిచి పుత్రోత్పత్తికై యొక్క యరణిం దెచ్చి మథించిన నవ్వారి మంత్రబలమ్మున సమస్త లక్షణముల నిమి కెనయగు నొక్క కుమారుండుద్భవించి యతం డరణి మథనమ్మున నుద్భవిల్లుటం జేసి మిథియనియు జనకునివలనఁ బొడముకతన జనకుండనియు నెగడె.

క. నిమి దేహంబెడలు నిమి
త్తముగఁ దదన్వయమునందుఁ దగియె విదేహా
ఖ్య మనుజపతుల కనూచా
నముగ నసార్థకముగాక నరపాలమణీ. ౪౨౭

వ. పిమ్మట నిమిసుతుండగు జనకుండు ప్రథితుండై గంగాతీరమ్మున
మిథిల యను నొక పురంబు ధనధాన్య గోపురాట్టాలాది నిఖిల
సంపత్సమృద్ధంబు రచింపంజేసి యందు సుఖంబుండె. ౪౨౯

క. జనకుని యన్వయమందున్
జనన మ్మందిన యశేషజనపాలకులున్
జనకులనఁ బరఁగి జ్ఞాన
మ్మునకుం దానకములగుచుఁ బొలిచిరి పేర్మిన్. ౪౩౦

వ. ఏతద్వంశజుల కెల్లరకును విదేహజనకనామంబులు చెల్లుచుండు
నిది నిమిచరిత్రం బనవుడు జనమేజయుండు వ్యాసుం గాంచి
మహాత్మా! వసిష్ఠుండు గురు వగుటకతనఁ దన్ను శపించినం జెల్లుఁ
గాక తాను శిష్యుండును శుభప్రదమ్మగు దేవీమఖమ్మునకుఁ గర్త
యునై క్షమ దలంపక బ్రహ్మపుత్రునకు వసిష్ఠునకు శాపం
బీఁదగునే యనుడు సాత్యవతేయుం డిట్లనియె. ౪౩౧

క. తెలిపితి నజితేంద్రియులకుఁ
గలుగదు దేహులకు శాంతి, క్షమగల మహానీ
యులు దుర్లభు లిల సన్న్యా
సులయందేనియును శాంతి చొప్పడ దనఘా. ౪౩౨

ఉ. ఆఁకలి దప్పియు న్విడిచి యన్నిసుఖమ్ములు వీడి యోగియై
తేఁకువ నొప్పఁగాక తెగఁద్రెంపఁగ లేఁడు మనోగతంబులౌ
ప్రాకృతశత్రువర్గములఁ బార్థివసత్తమ! యట్టివాని నీ
లోకమునంద కాదు సురలోకమునందును గానరాదుగా. ౪౩౩

వ. బ్రహ్మపుత్రులైన మహామునీంద్రులును గుణత్రయావిద్ధులై
యున్నపు డన్యుల నెన్న నేల? మున్ను యోగాభ్యాసరతుండును

సాంఖ్యవేత్తయు నగు కపిలుండు దైవయోగమ్మున సగరాత్మ
జుల దహించె; నొక్కండన నేల ? హరిహరబ్రహ్మ లాదిగ సక
లమ్మును నహంకార కలితంబని యెఱుంగు మహంకారోత్పన్నం
బగు జగమ్మునఁ దద్వియోగమ్ము దుర్లభమ్ము. ౪౩౪

క. ఒకవేళ సత్త్వవృద్ధియు
నొకవేళ రజోధికతయు నొకవేళఁ దమః
ప్రకటతయుఁ గలుగు గుణముల;
కకలంకత నొక్కరీతి యలవడ దనఘా. ౪౩౫

వ. అగుణుఁడును నవ్యయుఁడును బరముఁడును నిర్లేపుఁడును సర్వ
భూతాలక్ష్యుఁడును నగువాఁడొక్క పరమాత్మ, మఱియుఁ బర
శక్తియు నట్టిద. ఈ యిరువురకు నెల్లప్పుడు నైక్యంబని
యెఱుంగునది. ౪౩౬

క. పరమాత్మకుఁ బరశక్తికి
నరయు నభేదంబు నెవ్వఁ డాతఁడు ముక్తిం
బొరయు నఖండజ్ఞాన
స్థిరుఁడగు నిది యెఱుఁగు వేదసిద్ధాంతముగా. ౪౩౭

క. జ్ఞానంబు రెండుదెఱఁగులు
గా నెఱుఁగు మొకండు శాబ్దిక మ్మది వేదా
దీనమ్మును శాస్త్రార్థా
దీనంబునునై జనించుఁ దెల్లం బధిపా. ౪౩౮

వ. శాబ్దజ్ఞానమ్మున మతికల్పితమ్ములగు వికల్పమ్ము లనేకమ్ములు
వొడము నీక రెండవది యనుభవం బనంబడు నిట్టిజ్ఞానం బేరికి
దుర్లభంబు. ౪౩౯

క. ఘనుఁడైన వేత్త దొరకిన
జనునకు ననుభవముగలుగు సకలతమమ్ముల్
మునుకొని యడంచు నయ్యది
జనవర ! తమ మడఁపలేదు శాబ్దమ్మొందుల్. ౪౪౦

ఆ. వె. అదియు కర్మ మెద్ది యడఁచు బంధమ్ముల
నదియ విద్దె ముక్తి కమరునెద్ది
శాబ్దికంబు తమము సంహరింపదు దీప
మన్నమాత్రిఁ దిమిర మడఁగు నెట్లు ? ౪౪౧

క. పరహితమును గోపమ్ముల్
బొరయమి ధృతి యోర్పు శీలమును సంతోషం
బరయఁగ విద్యకు ఫలములు
నరవర ! ఫల మనఁగరాదు నైపుణి యొందుల్. ౪౪౨

వ. యోగాభ్యాసమ్మున నొండె విద్యాభ్యాసమ్ముననొండెఁ గా
మాదినాశం బలవడ దయ్యవి మనోజాతంబులగుటఁ దజ్జయ
మ్మునఁ గాని లోఁబడవు. ౪౪౩

క. మనసు జయింపని కతమున
మునిపై నిమిభూవరునకు మొనయదు శమ మ
య్యనఘుఁడు యయాతి మును శు
కునకుల్ బ్రతిశాప మీఁడు క్రూరుఁడు గామిల్. ౪౪౪

క. భృగుపుత్రుని శాపమ్మునఁ
దగ జర గ్రహియించె నెంత ధార్మికుఁడో యయా
తి గణింప నొక్కఁ డొక్కం
డగపడు సౌమ్యుండు, క్రూరు లందఱు జగతిల్. ౪౪౫

—* హైహయకృతవిప్రవధ. *—

చ. ఒకనిస్వభావ మొక్కగతి నొప్పెడి దీనికి నింతయేల ? ము
న్నకరుణులై ధనాశమెయి హైహయు లాత్మపురోహితుల్ కలా
పకటితు లుత్త మోత్తములు భార్గవులన్ బరిమార్ప లేదె ? పా
తకములు క్రోధమూర్ఛితు లెదన్ గణియింప రొకించు కేనియున్.

వ. నావుడు జనమేజయుం డిట్లనియె. ౭౭౭

గీ. బ్రహ్మహత్య గణింపక భార్గవులఁ బు
రోహితుల నుక్కడంచిరి హైహయు లని
పలికితివి వార లెవ్వనికులమునందుఁ
బొడమి, రేకారణము కోపమునకుఁ ? జెపుమ. ౭౭౮

క. కారణము లేనికార్యం
బారయ మగ్రజుల రాజు లఘుమెన్నక సా
ధారణముగఁ జంపుదురే !
వైరం బెంతేని నుండవలయు మహాత్మా ! ౭౭౯

క. బలవంతులయ్యు రాజులు
బలహీనులఁ బూజ్యులైన బాడబవరులన్
గలుషభయమ్మును జెందక
తలదఱుగుట పాడియగునె ధర్మము చెడదే ! ౭౮౦

వ. నాకీ సందియం బెడఁబాపు మనుడు వ్యాసుండు పురాతన కథ
స్మృతికిం దెచ్చికొని యిట్లు సెప్పందొడంగె. ౭౮౧

చ. కలఁడు సహస్రబాహుఁ డధికంబగు శౌర్యము వొల్చువాఁడు ని
స్తులబలశాలి హైహయుఁడు దుర్జయతేజుఁడు కార్తవీర్యభూ

తలపతి ధర్మతత్పరుఁడు దానమునన్ గడుమేటి యాతఁడ
గ్గలముగఁ జేసె జన్నము లగణ్యముగాఁ దగు భూరిదక్షిణన్.

వ. అతండు హరి యపరావతారంబగు దత్తాత్రేయుని శిష్యుండు; భృగువులకును నట్ల యాజ్యుండగు కతనఁ దా నొనర్చిన జన్నమ్ము లం దొసఁగిన ధనమ్మున వార లతిధనికులై హయాదిసంపన్నులై చెలంగుచుండిరి. పదంపడి కార్తవీర్యార్జునుండు కొండొక కాలమ్మునకు దివంబేగుటయుఁ దద్వంశ్యులగు హైహయులు ధనహీనులై తదర్థంబు తమ గురువులగు భృగువుల యాచింపం జనిన వారలు ధనలుబ్ధులగుకతన నీ నొల్లక కొందఱు పాఁతిపెట్టియుఁ గొందఱు బ్రాహ్మణుల కొసంగియు మఱికొంద ఱెచ్చటేనియు డాఁచియు రాజభయమ్మునఁ బలాయితులై యొక్కపెట్ట దుర్గమంబులగు గిరిగహ్వరమ్ము లాశ్రయించి; రంత హైహయులు వారల గృహములన్నియు వెదకి యొక్కరు నేనిం గానక ధనార్థంబు భూఖననం బొనర్చుటకు నుంకించిరి. ౨౫౩

క. భృగువులయుఁ జుట్టుపట్లన్
దగు విప్రులయు సదనములు త్రవ్విన ద్రవ్యం
బగణితముగఁ గన్పడె భీ
తగతిన్ శరణంబు గొనిరి తద్గత విప్రుల్. ౨౫౪

ఆ. వె. శరణుఁ గనినవారిఁ, జని గిరిగహ్వర
మ్ములను డాఁగువారిఁ బొలియఁజేసి
రెల్ల భార్గవుల నహీనకోపమ్మునఁ
బట్టి దొరకినంతపట్టు నధిప. ౨౫౫

శా. ఆగర్భమ్మును ధారుణిం డొలిచి ద్రవ్యం బంతయుంగూర్చి భూ
భాగంబెల్లెడ గర్తముల్ గొలిపి చంపంజొచ్చి రాబాలమున్

స్త్రీగర్భమ్ములు పాడుచేసి భృగులన్ దీవ్రాస్త్రముల్ చొన్పి రం
తే గర్గోలుగ నేడ్చి రంగనలు కన్నీ రేఱులై పాఱఁగన్.

వ. అట్టి ఘోరకృత్యమ్మునకు సహింపక సమీపతీర్థవాసు లగు
మును లేతెంచి హైహయుల కిట్లనిరి. ౨౫౭

చ. విడువుఁడు బ్రహ్మజాతి నిటు వీరులరై, పొలియింపఁ జెల్లునే ?
యుడుకుమొయిన్ గటా ! వనిత లూరక తల్లడిలంగ గర్భముల్
వొడుచుట పాడియే? నృపులపోఁడుము లే యివి! యింత పాపముం
దడఁబడ కాచరించెదరు తప్పక తత్ఫల మిష్ట కన్పుడున్. ౨౫౮

వ. అను మునులకు హైహయు లిట్లనిరి. ౨౫౯

ఉ. మీరు మహానుభావులరు మిన్నక వీరలు మాదుపూర్వులం
జేరి ఛలమ్మునన్ ధన మశేషము గైకొని డాఁచిపెట్టి రీ
చోరులఁజంపఁ బాతకము చొప్పడునే బకవృత్తులన్ ? ఋణం
బీరఁట పాదవృద్ధి ? కిపు డేమొక కార్యము చేయఁగోరినన్.

క. దాత యగు కార్తవీర్యుఁడు
పాఁతులు వైచుకొన ధనము పంచి యిడెనె ? మీ
కేతాదృశ మగు కృత్యము
చేతఃప్రీతికర మగునె ? చెప్పుఁడు మౌనుల్. ౨౬౧

చ. క్రతువు లొనర్చి యొక్కుడగు కార్యములం బొనరించి నిత్యరి
క్తతలికి నిచ్చి సౌఖ్యముగఁ దా భుజియించి ధనంబు విప్రుఁ డీ
గతిఁ దగ వెచ్చఁబెట్టవలెఁ గాకునికిన్ నృపచోరవహ్నిసం
గతమయి వమ్మగున్ ; విడుచుఁగా యది రక్షకు నెన్నిభంగులన్?

గీ. అట్లు కాదేనిఁ దాఁ దాఁచినట్టిధనము
నొరుల కీక భుజింపక యున్న కతనఁ

జచ్చి పరలోకమున కేగి జముని యాజ్ఞ
నరకసంగతుఁ డగు ధననాయకుండు. ४౬3

క. దానము భోగము నాశము
నా నెగడుఁ మూఁడు గతులు నరు లా రెంటిఁ
మానిన మూఁడవగతిచేఁ
దా నడఁగు ధనం బదెంత దాఁచినయేనిఁ. ४౬४

గీ. ఏము పాదవృద్ధి నీ నెంచి మాపురో
హితుల వినయమెసఁగ ఋణము నడుగ
నీఁ దలంప రిట్టిహీనులు రాజుల
మైన మాకు దండ్యులగుట తప్పె! ४౬౫

క. కృపణు లదాత లభోక్తలు
నెపమున నార్జించువారు నేల నిడెడివా
రుపకారశూన్యులుఁ భూ
మిపతులకుఁ దండ్యులనుట మీ రెఱుఁగనిదే. ४౬౬

వ. అట్లగుట వంచకులును బ్రాహ్మణాధములును నగు వీరల దం డించుటకు మహాత్ములగు మీరలు క్షమియింప వలయునని యమ్మాన్యుల నెట్టకేలకు నొప్పించి భృగుపత్నుల గర్భమ్ములు పగుల్చుచుండ నయ్యంగన లందఱును దుఃఖార్తలై హిమవత్పర్వ తమ్మున కరిగిరి. ४౬౭

గీ. హైహయులచేత ధనలోభ మమర విప్రు
లిట్లు హతులైరి, యెవ్వారికేని లోభ
మెక్కుడగుశత్రు, వద్దాని నెనయువాఁ డొ
నర్పఁగారాని పనులు భూనాథ! లేవు. ४౬౮

చ. కులము నడంచు ధర్మమునకుం జెడుఁ దల్లినిఁ దండ్రి నాత్మజా
తుల హితులన్ గురూత్తములఁ దోఁజనియించిన యన్నదమ్ములన్
లలనలఁ జుట్టలన్ మది దలంకక చంపఁగఁజాలు లుబ్ధుఁడౌ
తులువకుఁ జేయరానిపని దోఁపదు ముజ్జగమందుఁ జూచినన్.

గీ. కామమునకన్నఁ గ్రోధమ్ముకన్న నెక్కు
డైనశత్రు వహంకృతికన్న లోభ ;
మదిగలుగువాఁడు ప్రాణమ్ములైన విడుచు
నన్న నవ్వాఁ డొనర్పని దన్య మున్నె ! ౪౭౦

ఉ. నా జనమేజయుండను ఘనమ్మగు నీవచనామృతంబు నెం
తేఁ జవిగొన్న నించుకయుఁ దృప్తి యొసంగదు భార్గవాంగనల్
రాజభయమ్ము వీడుటయు బ్రాహ్మణవంశము వృద్ధియున్ మునీం
ద్రా ! జనవంద్య, నాకుఁ గృప నానతి యిచ్చి కృతార్థుఁ జేయవే.

వ. నావుడు వ్యాసుండిట్లను, రాజేంద్రా ! హైహయపీడితలై భృగు
వనితలట్లు హిమవంతమ్మున కరిగి యచ్చట మృణ్మయంబగు గౌరీ
విగ్రహం బొనర్చి సరిత్తటమ్మున నిల్పియు పోషణపూర్వకమ్ముగఁ
దత్పూజల నొనర్చుచు మరణమ్మునకుఁ గృతనిశ్చయలై యున్నంత,

క. ఒక రాత్రికాలమున దే
వి కృపావతి యగుచుఁ జారువేషిణియై వా
రికి స్వప్నమందు " మీలో
నొకతెకు నూరుజుఁడు పురుషుఁ డుద్భవమందున్. ౪౭౩

క. వినుఁ డతఁడు మామకాంశం
బునవాఁ డగుకతన శక్తిపూర్ణుండై మి

మ్మను బ్రోవఁగలఁడు నమ్ముం”
డని చెప్పి తనంత నరిగె; నంతట వారల్, ౪౭౪

వ. మేలుకాంచి సంతోషదంతురితాంతరంగులై యున్నంత నందొక్క వనిత యూరువుచే గర్భమ్ము ధరియించి క్షత్రియభయమ్మున నెందేఁ బోఁ దలంచి పలాయనం బొనర్చుచున్న యది రాజులచేఁ జూడంబడి నష్టప్రాణులై తన్ను వెనుకొనువార్వారికిఁ దలంకి గర్భరక్షణార్థం బాక్రోశించుచు నిరాధారయై సింహగృహీతయు గర్భిణియు నగు హరిణింబోలి కుందుచున్నంత, ౪౭౫

—* ఔర్వోత్పత్తి. *—

క. తనతల్లి దీనదశఁ దాఁ
గని సైఁపక యూరువుం బెకల్చుకొని తటా
లున శిశువు వెలికి వచ్చెన్
దిననాథుంబోని మేటి తేజము వెలయన్. ౪౭౬

క. ఆ చిన్ని శిశువు తేజము
చూచినతక్షణమునంద చూడ్కులు సెడి యా
రాచజనమ్ములు గిరులన్
ధీచెడి జన్మాంధు లనఁగఁ దిరిగిరి భూపా. ౪౭౭

వ. అట్లు తిరుగుచు వార లందఱు నొక్కెడకుఁ జేరి తమమనమ్ముల నాశ్చర్యంబును దైన్యమ్మునుం బొడమ నిట్లు యోజించిరి.

క. బాలకుఁ జూచినయంతన
యేలొకొ నేత్రములు పోయె నిందఱకుం ద
ద్బాలకు మహిమమొ లేకా
లీలావతివ్రతముపెంపొ లేక మఱేమో. ౪౭౮

వ. అని చింతించి బ్రాహ్మణపరిభావం బగణ్యం బనియెంచి హైహయులు
మెల్ల మెల్లన నామె యున్నెడకరిగి తమభయమ్మున వడంకు
నాబ్రాహ్మణికిఁ గృతాంజలులై శరణంబు వేఁడుచు నిట్లనిరి.

ఉ. అమ్మ ! నినుం గనుంగొనినయంతన కన్నులు వోయె నీచరి
త్రమ్ము నుతింపఁగా వశమె గ్రక్కున మమ్ము ననుగ్రహించినే
త్రమ్ముల నీఁగదమ్మ దయ దప్పుట పాడియటమ్మ దృగ్విహీ
నమ్మగుజీవనమ్ము మరణమ్మున కెక్కుడు గాదె యెరికిన్.

ఆ. వె. ఇంక నిట్టికర్మ మేమొనర్పము భార్గ
వులకు సేవకులము తెలిసి తెలియ
కాచరించినట్టియఘము క్షమించి క
న్నుల నొసంగు మమ్మ యెలమి మాకు. ౪౮౨

వ. ఇది మొదలు భృగువులయెడ హైహయు లందఱును వైరంబు
విడిచి వర్తించునట్లు శపథం బొనరింతుము, నీవును బుత్రుండును
సుఖం బుండం గలరు మ మ్మనుగ్రహింపు మనుడు వారలకు
నాబ్రాహ్మణి విస్మయంబు గదుర నిట్లనియె. ౪౮౩

ఉ. మీనయనమ్ము లే నెఱుఁగ మీపయిఁ గోపము లేదు నాకు మ
త్పూనుఁడు బంధుఘాతుకుల దుష్టుల మి మ్మిటు చేసె నక్కటా !
కానక మంచిచెడ్డల నకారణ మర్థపరత్వ మూని వి
ద్యానిధు లైన తాపసుల నట్లొనరించిన రిత్త వోవునే ? ౪౮౪

క. గర్భగతు లైనశిశువుల
నర్భకులన్ వృద్ధులన్ దయాశూన్యత సం
దర్భ మెఱుంగక చంపిన
నిర్భాగ్యుల మి మ్మడఁప జనించె నితఁడొగిన్. ౪౮౫

ఆ. వె. ఊరుగర్భుఁ డగుచు నుండెను శతవత్స
రమ్ము లీతఁ డాగమమ్ములెల్ల
నపుడు సంగ్రహించె నంబాకటాక్షమ్ము
కతన నాకుఁ గొడుకుగా జనించె. ౪౮౬

గీ. పితృవధమ్మున మిగులఁ గోపించియున్న
వాని మత్సుతు నౌర్వు నవంధ్యభక్తి
వేఁడికొని వేఁడి మాన్పఁడు వేగ మీకు
నేత్రములు గల్గు నింతయు నిక్క మనుడు. ౪౮౭

వ. వార లందఱును వినయసంభ్రమమ్ము లిగురొత్త మునివరుండగు నాయౌర్వు సన్నుతించినఁ బ్రసన్నుండై యతం డంధులగు హైహయుల కిట్లనియె. ౪౮౮

గీ. దేవనిర్మితములు తప్పిపోవు టెట్లు
వాని కొక్కింత తజ్జుఁడు వగవఁబోఁడు
ఋషుల కీఁక సౌఖ్య మబ్బెడి, దృష్టు లెప్ప
టిగతి మీకుఁ జెలంగు, నరుగుఁడు కదలి. ౪౮౯

వ. అని యౌర్వుం డనుగ్రహించుటయు, ౪౯౦

ఉ. ఆతనియాజ్ఞ నొంది నృపులందఱు నెప్పటియట్ల లోచనో
పేతత నేగి, రక్కొమరు నెంతయుఁ బేర్మి గడల్కొనంగఁ ద
న్మాత గ్రహించి యాశ్రమమునన్ దగఁబెంచుచునుండె, నర్థకా
మాతురులైన హైహయులకైనపరాభవమున్ గ్రహించితే.

వ నావుడు జనమేజయుం డిట్లనియె. ౪౯౧

గీ. భారతులకెల్ల భరతునిపగిది యాద
వులకు యదునృపునట్ల వీరల కులమున

హైహయుం డనునొక్క రాజలరెనే? యము
నీంద్ర! లేకున్న హైహయు లెట్టులైరి? ౪౯౩

వ. నాపుడు వ్యాసుం డిట్లనియె, రాజేంద్రా! సూర్యపుత్రుం డగు
రేవంతుఁడనువాఁ డొక్కనాఁ డుచ్చైఃశ్రవమ్ము నధిష్ఠించి భగ
వద్దర్శనాకాంక్షియై వైకుంఠమ్మున కరిగె. ౪౯౪

—* హైహయవంశము *—

క. లచ్చియు నన్నయయినయ
య్యుచ్చైఃశ్రవముఁ గుమారు నూరక కోర్కెల్
పెచ్చుపెరుఁగ సంస్తంభన
మచ్చుపడం జూచుచుండె నాలో హరియుఁ. ౪౯౫

ఆ. వె. హయము నెక్కి వచ్చునతిమనోహరుని రే
వంతుఁ గాంచి విస్మయాంతరంగుఁ
డగుచు భార్య కిట్టు లనియె "నో చార్వంగి!
యెవ్వఁ డొక్కొ గుఱ్ఱ మెక్కి వచ్చె! ౪౯౬

వ. భువనత్రియ మోహనుండగు నివ్వాని నెఱుంగుదే" యని మాటి
మాటికి నడిగినఁ దన్మయచిత్త యగు నక్కమలి ప్రత్యుత్తరంబీ
నేరదయ్యె; నంత నతండు మోహితఁగా నాపె నిశ్చయించి కోపా
కులుండై యిట్లను. ౪౯౭

చ. వినుమింక నేమి చూచెదవు? వేఁదుఱువట్టినదానిభంగి; నీ
మన మవశత్వముం బొరసె మానిని! యీ హయదర్శనమ్మునన్;
జనువున నెల్లెడన్ రతి నెసంగుటచే రమవై చలత్వ మూ
నినకతనన్ జలాఖ్యవయి నెట్టన నీ వపకీర్తి నొందుమా. ౪౯౮

గీ. ప్రాకృతాంగనవోలె ధైర్యమ్ము విడిచి
హాయముఁ గామించి చంచలవైతి కాన
బడబవై మర్త్యలోకసంభవము చెందు
మనుడు శాపమ్మునకు భీతినంది రమయు. ౪౯౯

ఉ. శోకము పెల్లుగాఁగ మధుసూదను పాదయుగంబు శీర్షమున్
సోఁకఁగ మ్రొక్కి దీనదశ చొప్పడ నిట్లను "దేవదేవ! న
న్నీకరణిన్ శపింతె? కృప యించుక లేదె? స్వభావసిద్ధమై
నాకడ నుండుపేర్మియు వినాశము చెందెనె? యింతమాత్రలో.

క. ఎన్నండుఁ గోప మెఱుఁగక
వెన్నవలెఁ జెలంగునీదువిధ మింతట్లో
సన్నగిలి క్రొత్తయగునే?
చన్నె? న న్నిట్లు శాపసంగతఁజేయన్. ౫౦౧

క. నిను విడనాడి బ్రతుక నే
ర్తునె ప్రాణము లిపుడ దొరఁగుదు న్నీశాప
మ్మున కంతమ్ము గృపామతిఁ
గని చెప్పు" మనంగ నతఁడు కరుణార్ద్రుండై. ౫౦౨

ఆ. వె. వినుము నీదుగర్భమున నాకు నెన యగు
పుత్రుఁ డొక్కరుండు పుట్టునెప్పు
డపుడ శాపమోక్ష మగు నన్నుఁబొందంగ
నబ్బు నీకు నిక్క మబ్జవదన. ౫౦౩

వ. అనవుడు జనమేజయుం డిట్లనియె. ౫౦౪

గీ. కాలయోగమ్ముకతన నిక్కరణి శాప
మంది ప్రోషితభర్తృక చంద మొంది

బడబ్రైయె యెంతదనుకఁ దా నిడుమవడసె
నెట్లు సంతానమును గని యేగెఁ బిదప. ౧౦౧

క. నావుడు వ్యాసుండిట్లను
రేనంతుం డబ్జనాభురీతిం గని కో
పావిష్టుండని భయపడి
వేవేగ నమస్కరించి వెలువడి యంతన్. ౧౦౬

క. తనతండ్రి సన్నిధికిఁ జని
వినయమునన్ గడచినట్టి వృత్తాంతమ్మున్
మునుకొని నుడివె రమయు న
వ్వనరుహాలోచనుని యాజ్ఞ వడసి వగఁదగన్. ౧౦౭

సీ. చని మున్ను రవిభార్య ఘనతపమ్మున నున్న
చోటునఁ దమసయు సూర్యపుత్రి
గలిసినయెడ సర్వకామప్రదస్థాన
మున సుపర్ణాక్షు సంజ్ఞను బొగడ్త
దవిలిన దానికుత్తరమున శోభన
కాననమ్ముల నొప్పుగన్న యెడల
బడబ్రైయె శంకరుఁ బంచాస్యు దశభుజుఁ
జంద్రశేఖరు గజచర్మవసను

గీ. నీలకంఠుఁ ద్రిలోచను నిఖలకామ
దాత నవదాతవిగ్రహు ధరసుతార్ధ
దేహుఁగుఱిచి తపమ్ము సుదీర్ఘవృత్తి
దివ్యవర్షసహస్రమ్ము దివిరిచేసె. ౧౦౮

వ. తత్తపమ్మునకు మెచ్చి యద్దేవుండు పార్వతీసహితమ్ముగ వృషభారూఢుండై ప్రమథగణమ్ములు గొలువఁ బ్రత్యక్షుంబై బడబాఋూపిణియగు హరివల్లభ కిట్లనియె. ౫౦౯

ఉ. ఏల తప మ్మొనర్తు జగదీశ్వరి నన్ను గుఱించి దేవి ని
న్నే లెడివిష్ణు వన్నియును నీఁదగునట్టి సమర్థుఁ డక్కటా
చేలవె ? భర్తఁ దక్కియు వివేకిని కింకొకదైవ ముండునే
స్త్రీలకు నెట్టిఁడైనఁ బతి సేవ్యుఁడ కాఁడె త్వదీశుఁ డల్పుఁడే ?

చ. అనవుడు లచ్చి యిట్టులను నంతయు దథ్యము, శాప మిచ్చె న
వ్వనరుహనేత్రుఁ డయ్యది కృపామతివై యెడఁజేసి యుద్ధరిం
ప నిను యజించితిన్ దగఁ దపమ్మునఁ; "బుత్రుఁడు గల్గుమీఁదఁ బో
వు" ననియె శాప, మెక్కరణిఁబుట్టు సుతుండు మహాత్మ! చెప్పవే.

క. వైకుంఠమ్మున నాపతి
యీకాననమందు నేను నిరువురకును నే
లా కల్గుఁ గూడియుండుట
యేకత లేకున్నఁ బుత్రుఁ డెట్లుదయించున్. ౫౧౩

ఉ. నాదు తపమ్ము నేఁతకు మనమ్మున మెచ్చితివేనిఁ గామితం
బీఁదగు నీకు నాపతికి నించుక భేదము లేదు దీని ము
న్నాదరరీతి నాదయితుఁ డానతియిచ్చెఁ దదాది మీకు నే
భేదము చూడ నిట్టి నిను వేఁడుట యాతని వేఁడుటే కదా.

గీ. అతఁడ నీవు నీవ యతఁడని యెఱిఁగిన
దానఁ గాక నిన్నుఁ దలఁతునేని
నా సతీత్వమునకు దోసమ్ము గల్గు న
నంగ మెచ్చి యయ్యనంగరిపుఁడు. ౫౧౫

ఉ. జ్ఞానులు వేదవేదులు నకల్మషులౌ మునులున్ నిలింపులున్
గానఁగ లేక తర్కములఁ గాలము వ్యర్థమొనర్తు రేకి్రియం
దీని నెఱింగి తీవ్రు వినుతింపఁ దగున్ గడు నీ వివేక మెం
దేనియు నంగనాజనుల కింతటి బుద్ధివిశేష మొప్పునే. ౫౧౫

క. హరిభక్తులు నను నిందిం
తురు మద్భక్తు లతినిందితుం జేయుదు రా
హరి; నించుకేని మాయం
తర మెఱుఁగఁగరా దదెట్టి తత్త్వజ్ఞులకున్. ౫౧౬

గీ. కలియుగమ్మున మాయుభయులకుఁ గల్గ
నేకత నెఱుంగ లేక దుర్ధీకు లజ్ఞు
లింతకన్నను వాదమ్ము లెనయుచుందు్రి
తెలియుమురు మేటివిజ్ఞాన మొలయువారు. ౫౧౭

వ. నీ కీయభేదజ్ఞానం బెట్లు చొప్పడె నెఱిఁగింపు మనుడు శంకరునకు
లక్ష్మి యిట్లను, మహాత్మా మున్నొకనాఁడు మన్నాథుండు మం
తనమ్మున ధ్యానపరుండై పద్మాసనగతుండై యున్నయెడ విస్మి
తనై యే నిట్లంటి. ౫౧౮

ఉ. మున్ను సురాసురుల్ దగ సముద్రము ద్రచ్చునెడన్ జనించి నే
నెన్ని నినున్ వరించితి సురేంద్రులకెల్లను మేటి వంచు; నీ
కు న్నళినాక్ష! ధ్యాన మొనఁగూడుట కేమి నిమిత్త, మెందు నే
ని న్నినను దాఁటువేల్పులు గణింపఁగ లేరుకదా వచింపుమీ.

చ. అనవుడు నాథుఁ డిట్టులనె, నంబుజనేత్రి యొకప్పు డేను న
య్యనిమిషవంద్యుఁడైన గిరిజాధిపుఁ గొల్తు నొకప్పు డాతఁడు

న్నను గొనియాడు నాతఁడు మనఃప్రియుఁడెంతయు నాకు నేను నా
తనికిని నట్టివాఁడ విను తత్త్వము భేదము లే దొకింతయున్.

గీ. ఎవ్వఁడేనియు నా భక్తుఁ డెఱుక లేక
శంకరుని నిందఁ జేయు నాజడుఁడు నరక
మందుఁ బడువాఁడు తద్భక్తుఁ డట్ల నన్ను
నిందఁ జేసిన నగు నింత నిక్కమనుచు. ౧౧

వ. నాకు బోధించెదదాదిగ నేను మీ యిరువుర యభేదంబు
నెఱుంగుదాన నన్ననుగ్రహించి నాకు మద్వల్లభుతోడి కూడిక
యెట్లొనఁగూడు నట్లొనర్పుమని ప్రార్థించు లచ్చికి మహేశ్వరుం
డిట్లనియె. ౧౨

క. చింతింపనేల ? నీ తప
మెంతే సంతోస మొసఁగె నిఁక నీయెడ సు
స్వాంతుం డగు నీపతి యో
దంతిగమన నీకు నొక్క తనయుఁడు పుట్టున్. ౧౩

క. హయరూపమ్మున శ్రీహరి
దయగలఁడై యిటకు వచ్చి తన్వరో ! నీకుం
బ్రియుఁడగు నాప్రేరణ న
మ్మ యథార్థమ్ముగను నీకుఁ బుత్రుఁడు పుట్టున్. ౧౪

ఉ. ఆకొమరుండు లోకులకు నందఱకుం దలదాఁటి భూపుఁడై
యేకముగా జగం బఖిల మేలెడివాఁ డయి యేకవీరుఁడన్
ప్రాకట మైననామమునఁ బ్రాభవ మొప్పఁ జరించు హైహయా
ఖ్యాకము వంశము న్నెగడఁగాఁ గల దాతఁడు కారణమ్మగన్.

వ. పిమ్మట నీవును భర్తంగూడి వైకుంఠమ్మున కరిగి సుఖం బుండఁ
గల వని చెప్పి మఱియును, గీ౨౮

గీ. హృదయగతమైనపరశక్తి నెఱుకకలిమిఁ
గొలువ నేరక మత్తతఁ గొనినకతన
నీకు నిట్లబ్బె శోకంబు నిజము దీని
శాంతి కిప్పుడ యద్దేవి శరణు సొరుము. గీ౨౯

చ. అని వరమిచ్చి శంభుఁడు తనంతఁ జనెన్, గడుభక్తి నజ్జగ
జ్జననియు నంతరాత్మవిలసత్సురదైత్యశిరోవిరాజినూ
తనమణికాంతిరంజితపదద్వయభాసినఖన్ మహేశ్వరిన్
వినయమునం దలంచుచును వేడ్క-మెయిం బతిరాక గోరుచున్.

వ. ఉన్నంత శంకరుండు కైలాసమ్మున కరిగి ప్రమథులయందు
నొక్క-రుండగు చిత్రరూపునిఁ జూచి యిట్లను. గీ౨౯

క. వైకుంఠమ్మునకుం జని
శ్రీకాంతునితోడ నిట్లు చెప్పుము "పత్నీ
శోక మ్ముడుపు" మనుచు మై
త్రీకలనం దనకు నేను దెలిపితి ననుచున్. గీ౩౦

చ. అని యనుపంగ నేగె నతఁ డంచితవైష్ణవభాసురంబు సు
స్వనశుకహంససంయుతము చారుసరఃకలితంబు నృత్తగీ
తనినదవాసితంబు వితతద్రుమభూషిత మప్రమేయసా
ధనిచయమండితంబు నగు తామరసాక్షుపురంబు వేడుకన్.

క. హరిసదనద్వారమ్మున
స్థిరులై వర్తించు సుప్రసిద్ధుల వేత్రో

ద్ధరపాణుల జయవిజయుల
నరసి హరికిఁ జెప్పఁబనుప నంతట జయుఁడున్. ౫౩౨

ఆ. వె. హరినిగాంచి యిట్టులనుఁ "చిత్రరూపుఁ డన్
దూత శంకరాజ్ఞ చేత వచ్చి
తివిరి దర్శనము ప్రతీక్షించి యుండె రాఁ
దగునొ తగదొ" యన నతండు పేర్మి. ౫౩౩

క. వైశమలోనికి రమ్మని
కాలగళునిదూతఁ బిలువఁగాఁ దగునన స
చ్ఛీలుఁడతఁ డట్లొనర్పఁగ
నాలో నా చిత్రరూపుఁ డంజలిగొనుచున్. ౫౩౪

క. ఎదుటికిఁ జని మ్రొక్కిడఁ బే
ర్మిదగ "గిరీంద్రునకు సేమమే? నీ విటకుం
గదలి యరుదెంచు టెందుల
కొదవదుగా దేవకార్య మొక్కం? " టనుడున్. ౫౩౫

క. దేవా! సంసారమ్మున
నీ వెఱుఁగని దొకఁడు గల్గునే! నన్ను మహా
దేవుం డనుపఁగ వచ్చితి
దేవరతో నొక్క మనవి దెల్ప చనంగన్. ౫౩౬

వ. అతఁడు చెప్పుమనిన తెలుఁగు విన్నవించెద నాకర్ణింపుము. ౫౩౭

క. సీతరుణి లచ్చి కాళిం
దీతమసాసంగమమున నేమమ్మొయిన్
జేతము ధ్యానాయత్తం
బై తగ నున్నది తురంగమాకారమునన్. ౫౩౮

చ. సురముఖసేవ్యయై సకలశోకవినాశినియైన యేసిరిన్
నరుఁడు త్యజించి దుఃఖకలనం బడు నట్టిచెలిం ద్యజించు నీ
కరయఁగ సౌఖ్యమున్నె ? సతి నల్పుఁడునున్ విడ నిచ్ఛగింపఁ డె
క్కరణి నదోషయంచు మదిఁ గాంచియు భార్యను వీడితో హరీ.

ఉ. ఎవ్వనికాంత కస్తిపడు నగ్గగు నాతనిజీవితం బిసీ
నవ్వదు రెల్లశత్రువులు ; నాపలుకుల్ విని వైళ మద్విజన్
నెవ్వగఁ బాపి కైకొనుము నెమ్మది సమ్మద మంద నక్కటా
జవ్వనిఁ బాయుదుఃఖ మదె శక్యమె యిట్టి దటంచుఁ దెల్పఁగన్.

మ. మును నామానిని దక్షుయాగమున వమ్ముం జేసె దేహమ్మునో
వనజాతాక్ష ! తదంగనా విరహసంప్రాప్తంబు దుఃఖంబు నా
కనుభూతంబగుటన్ మఱొక్కనికి భార్యాఽయోగమన్నన్ మనం
బనుమోదింపదు కష్ట మింతకును నన్యం బేది సంసారికిన్.

ఉ. పిమ్మట నద్రిజం దపముపెంపునఁ గొంటి నగాత్మజాతయై
సమ్మతి దక్షపుత్రికయె జన్మమునందుటఁ జేసి ; మేటి క
ష్టమ్ములకెల్లఁ గష్టమకటా తరుణిం ద్యజియించి యెట్లు ప్రా
ణమ్ముల నిల్పితో యెఱుఁగ! న్యాయమె నీకిటు లొంటినుండుటల్.

గీ. వేయి సంవత్సరములాయె వెలఁది వీడి
యేమి సౌఖ్యమ్ము గొంటి నీ వింతకాల
మరుగుమింక జాగుసేయక యశ్వరూప
మమర నీ కాంత వసియించునట్టియెడకు. ౫౪౩

వ. అట్లు చని కొమరుంగని భార్గవీసహితుండవై స్వస్థానమ్మున సుఖం
బుండుమని శంకరుండు విన్నవింపుమనియె నను చిత్రరూపుని
పలుకులఁ బ్రేరితుండై యశ్వరూపమ్ము దాల్చి. ౫౪౪

గీ. బడబ యగు సింధుజాత యున్నెడకు నరిగి
కని మనమ్మున విస్మయమ్ము నతఁడొందె
నతని హయరూపుఁ గని విస్మయంబు నందె
లచ్చి; సంగతి యిరువుర కచ్చుపడియె. ౪౩౪

—* ఏకవీర జననము *—

క. మదనార్తు లగుచు నిరువురు
పడపడి యిటు లెనయ గర్భభర మడరఁగఁ బే
ర్మిఁ దనూజుఁ గనియె రెండవ
మదనుం డనఁ దగిన వాని మది ముద మెనయన్.

వ. పిదప బడబాకృతి యగు సిరికిఁ దాదృశుఁడగు హరి యిట్లనియె.

క. బడబారూపం బిప్పుడ
విడువుము వైకుంఠమునకు వేగమ చనఁగాఁ
గడఁగుట యొప్పదె విడువం
బడుఁగాక తనూజుఁ డిచటఁ బంకజనయనా ౪౩౭

వ. నావుడు లచ్చి కరుణంబున నిట్లను. ౪౩౮

క. తనువునఁ బుట్టిన కొడుకున్
వనమున విడువంగ మనము వచ్చునె యేయం
గన కైన? నిన్నదితట
మున నీ శిశువునకు దిక్కు ముందెవ్వరొకో. ౪౪౦

క. అనునాలో నిరువురకును
ననువయ్యెన్ దివ్యదేహ మంతవిమాన

మ్మును నేగుదెంచె దానిం
గని సిరి హరి కిట్టు లనియెఁ గడుఁ గరుణమునన్. ౧౧౧

గీ. సర్వలక్షణముల నీకు సదృశుఁడైన
శిశువు నిట డిగవిడువ నేఁజెల్ల నెత్తి
కొనుము మూఁగురమును నేగు టనువుగాదె
యనుడు హరి యిట్టులనె సింధుతనయ కెలమి. ౧౧౨

వ. ఇక్ష్వాకులకు నే నొక్క-కార్యార్థంబు నిర్మించితి నది యెట్లం టేని, యయాతికిఁ దుర్వసుం డనునొకపుత్త్రుండు గలఁ డతనికి హరి వర్మ యని పితృదత్తంబగు నామాంతరంబు విశ్రుతంబగు నా రాజన్యుండు పుత్త్రకాముఁడై తపం బొనరించుచున్నవాఁడు మత్ప్రేరణమ్మున నతం డిత్తనయుఁ బరిగ్రహించి పోషింపఁగలఁ డతఁడు వచ్చుదనుక నాయానతిం జేసి యీతని కొండు భయంబు లేకుండు నని యాపె నాశ్వాసించి తత్సహితుండై వైకుంఠమ్మున కరిగె నావుడు జనమేజయుండు వ్యాసున కిట్లనియె. ౧౧౩

గీ. జాతమాత్రునిఁ గొమరుని శంకఁ దక్క-
విజన మగు కాననమ్మున విడిచి చనిన
పిదప సింహాదిమృగముల పీడ యతని
కబ్బకుండునె ? గతి యెవ్వరైరి చెపుమ. ౧౧౪

వ. అనిన వ్యాసుం డిట్లనియె నట్లు లక్ష్మీనారాయణులు విమానం బధిష్ఠించి చనిన పిమ్మట మదాలస యను తన భార్యంగూడి ముచ్చటించుచుఁ జంపకుండను నొక విద్యాధరుఁడు విమాన యానమ్మున దైవవశమ్మున నచ్చటికి వచ్చి నిరుపమాన తేజఃపుంజంబై యొప్పు నా శిశువు నాలోకించి విమా నమ్మడిగ్గి మదనసదృశుం డగు నక్కొమరుఁ గైకొని

మదాలస కిచ్చిన నత్త న్వియు నిధి గన్న పేదంబలె నమందానం దంబు నంది శిరంబు మూర్కొని యాలింగనంబొనర్చి కన్నవానిం బలె నెంచి యుత్సంగమ్మున నిడికొని పతి కిట్లను నాథా! యీతం డెవ్వండు? నీకెట్లు దొరకె? నిక్కాననమ్మున నెవ్వరు డించి చనిరోకో? యనుడుం జంపకుం డిట్లనియె. ౧౧౧

క. వనితా! యీతం డెవ్వఁడొ
చని యడిగెద శకుని; నతనిసమ్మతి యేనిం
దనయునిఁగాఁ బెంపందగు
నని వైశమ యింద్రునొద్ద కాతం డరిగెన్. ౧౧౨

గీ. అరిగి సంతోషదంతురితాంతరంగుఁ
డగుచుఁ బుత్త్రినిఁ జూపి యిట్లను మహాత్మ
యెవనిబాలకుఁడో యితఁ డెఱుఁగ రాదు
దొరకెఁ దమసాతటంబునందు వనమందు. ౧౧౩

క. తమసాకాళిందీసం
గమమున నేవనిత డించి కానుపుపైఁ బ్రే
మము వీడి చనియెనో ని
క్కము నీసమ్మతినిఁ బుత్త్రిఁగాఁ గై కొందున్. ౧౧౪

వ. ధర్మశాస్త్రమ్ముల నిట్టిందు గృత్రిమతనయుండుగాఁ జెప్పంబడుఁ గాదే యనుచంపకునకు నింద్రుం డిట్లనియె. ౧౧౫

చ. ఇతఁడు హయస్వరూపు లగునిందిరకున్ హరికిన్ జనించె న
ప్రతిముఁడు హైహయుం డనఁగఁ బాటిలునీశిశువున్ సృజించె శ్రీ
పతియు యయాతి పుత్త్రునకుఁ బంపొనరింపఁగ; వేగ విద్వ భూ
పతి హరిప్రేరణంబు గొని బాలునిఁ గై యటకేగు నింతలో.

వ. అతఁ డరుగునంతకు నీ విబ్బాలు నచ్చట విడువవేని యారాజు దుఃఖితుండగు నిబ్బాలుం డేకవీరుండను నామమ్మునఁ బృథివీతలమ్మున నెగడువాఁ డగునని యనిపినఁ జంపకుం డచ్చెలుతపాఁపని యథాస్థానమ్మున డిగవిడిచి తనయెడ కరిగె నంత హరి యయాతి పుత్త్రునకుం బొడసూపిన నతండు హర్షితస్వాంతుండై నమస్కరించి వినయమ్మున నిట్లను, ౫౬౧

గీ. విషయసంసక్తి దొరఁగి వివేకవంతు
లైన వారికిఁ గాఁదగునట్టి నీదు
దర్శనము కల్గెఁ బేరాసఁ దవిలి తపము
చేయుచున్నట్టి నా కిది చిత్ర మనఘ. ౫౬౨

వ. అని భక్తిపరవశుండై నానావిధమ్ముల నుతియించుచున్న నృపాలునకుఁ గృపాలుండు హరి "నీ కోరికయే" మన నతండు 'పుత్రప్రాప్తి' యనుడుఁ గమలాక్షుం డిట్లనియె. ౫౬౩

క. తమసాకాళిందీసం
గమమున సిరియందుఁ గొమరుఁ గంటివి నీకై
యమలుం డబ్బాలుని గొను
ము మహీశ! యనంగ నతఁడు మోదము పెర్మిన్. ౫౬౪

క. అటఁ జని నోటం దనకా
ల్బొటవ్రే లిడి యాడికొనెడి పుత్త్రుంగని దు
ర్ఘటమగు తత్సౌందర్యపుఁ
బటిమకు నక్కజము నంది ప్రబలిన కూర్మిన్. ౫౬౫

చ. కరముల నెత్తిపట్టి యొసకమ్మున శీర్షము మూర్కొనన్ "సుదుష్కరమగు మత్తపమ్మునకుఁగా నిను శ్రీహరి యిచ్చె"నంచు నా

దరమునఁ గౌఁగిలించుకొనుఁ "దద్దయు సంసృతి వారిరాశికిన్
దరణివి గమ్ము నా"కను"సుతా!నినుఁగన్నది లచ్చియే?"యనున్.

క. శతవత్సరములు నీకై
యతితప మొనరించు నన్ను నానందింపన్
గతి వైతివి నీ నగుమొగ
ము తగం గని పెంచు నతివపుణ్యము మితమే. ౧౬౭

మ. అని మోదించుచు బాలకుం గొని పురం బమ్మోటి తానేగ గా
యనకుల్ వాఁడగ వందిమాగధులు నవ్వస్తోత్రముల్ సేయ నె
క్కొని మంత్రుల్ సపురోహితప్రముఖులై కూర్మిన్ దనుంజూడ లా
జనికాయంబు పురాంగనాజనమణుల్ చల్లన్ ధ్వనుల్ గొల్లఁగన్.

క. హరివర్మ యిట్లు తనపురి
కరిగి కొమరు నొసఁగె భార్య కాసాధ్వియుఁ బ్రే
మరసాకులయై కైకొని
"నరవర యితఁడెట్లు దొరకె" నా నతఁడనియెన్.

చ. హరికిని నంబుజాలయకు నాత్మజుఁ డీతఁడు నాకుఁ దత్కృపన్
దొరకెఁ దపంబుకల్మి; ననఁ దొయ్యలి సమ్మదమందె మీఁద న
న్నరవరుఁ డక్కుమారునకు నామము వెట్టె మహోత్సవంబు మే
దురముగ నేకవీరుఁడని; తోరపువృద్ధి నెసంగె నాతఁడున్.

వ. ఇట్లు మహానందరసమగ్నుండై యక్కుమారుకతన ఋణత్రియ
ముక్తుఁగాఁ దన్నుఁ దలంచికొని యాఅవమాసమ్మున నన్నప్రాశ
నంబును మూఁడవయేటఁ జూడాకర్మమ్మును బొనరించి విప్రుల
ననేకవిధదానమ్ముల సంతుష్టులంజేసి. ౧౬౮

క. ఏకాదశాబ్దమందు శు
భాకారున కాసుతునకు నా నృపవరుఁడ
స్తోకము మౌంజీబంధ
శ్రీకము సంస్కార మొప్పఁ జేసి కడంకన్. ౫౭౨

వ. వేదమ్మును ధనుర్వేదమ్మును నభ్యసింపఁజేసి పట్టాభిషేక యోగ్యుండగు నాతనికిఁ బుష్యార్క యోగసంయుక్తంబగు శుభ దినమ్మునఁ దదనుకూలసంభారంబు లొనరించి వేదశాస్త్రతత్త్వ జ్ఞులగు విప్రుల రావించి సాగరమ్ములయుఁ దీర్థమ్ములయుఁ బవి త్రజలమ్ములు దెప్పించి స్వయముగా నభిషేకం బొనరించి విప్రు లకు ధనంబు లొసంగి స్వర్గకాముండై భార్యాసహితమ్ముగ నరణ్యమున కేగి మైనాకశిఖరమ్మున వానప్రస్థుండై యుండి పత్రఫలాశాహారనియతిం బార్వతిం గుఱించి తపం బొనరించుచుఁ జిరకాలం బటనుండి దైవికమ్మున నిరువురును దేహత్యాగం బొన రించి యింద్రలోకమ్ము నొంది సుఖం బుండిరి. పదంపడి యేక వీరుం డీ యుదంతంబు విని యౌర్ధ్వదైహికమ్ములు నిర్వర్తించె.

క. పితృదత్తమ్మగు రాజ్యము
హితగతి నొనరించి భోగ మొనయుచు నొకనాఁ
డతఁ డరిగె మంత్రిపుత్రా
న్వితముగ నమరాపగకు సమీహాపేక్షన్. ౫౭౪

వ. కోకిలాలాపముఖరితమ్ములును బుష్పఫలభరితమ్ములును షట్పద విరాజితంబులునునగు పనసచంపకవకుళతిలకతాలతమాలజంబూ చూతకదంబకంబులును వేదధ్వనిమనోహరమ్ములును హోమ ధూమావృతగగనమ్ములును మృగశాబసమన్వితమ్ములునునగు బుష్యాశ్రమమ్ములును గోపికాసురక్షితమ్ములును శాలిసంపన్న

మ్ములును బ్రఫుల్లపంకజారామమ్ములునగు కేదారమ్ములును,
మనోరంజకమ్ములగు నికుంజమ్ములును వేర్వేఱ యఱయుచు
నన్నదియొడ్డునఁ దిరుగువాఁడు ముందట, ౧౨౧

ఉ. ఆ యమరాపగాజలమునందు శతచ్ఛదమైన యబ్జము
త్తోయజదక్షిణమ్మున విధుప్రతిమాననఁ గాంచనాంగిఁ బ
ద్మాయతనేత్రి దీర్ఘకచ నద్రికుచ న్నవకంబుకంఠి నే
దో యొకచింతమై నొగులు నుగ్మలి నొంటరిఁ గాంచె నొక్కటన్.

క. కని శోకకారణం బడి
గి నరేంద్రుం డిట్లు వల్కెఁ గేవలమనుజాం
గనవో ? గంధర్వవొ ? నీ
వనిమిషసుందరివొ ? తెల్పుమా పే రెవరో ! ౧౨౨

క. ఏకాకినివై రోదన
మేకతమునఁ జేయుదాన ? వెవ్వఁడు జనకుం ?
డీకాఱడవి న్నిను నెవఁ
డీక్రియఁ ద్యజియించె నాథుఁ డెవ్వఁడు నీకున్ ? ౧౨౩

ఆ. వె. చోర బాధ గాని క్రూరమృగమ్ముల
బాధ గాని నాదుపాలనమున
లేశమాత్రమైన లేదు శోకనిమిత్త
మేమొ తెల్పు దాని నేనడంతు. ౧౨౪

క. మానవులో, దేవతలో,
దానవులో, పేరు గ్రుచ్చి తరుణీ ! నాతో
మానక తెల్పుము నీదుః
ఖానుగతికి మూల మనిన నచ్చెలి యనియెన్. ౧౩౦

క. విను నృపవర నాదుఃఖ
మ్మునకు నిమిత్తము విపత్తి మొనయనిచో నె
ట్లనువగు శోకము ప్రాణికి
మునుకొని వచియించు దీనిమూలం బెల్లన్. గి ౧

వ. భవద్దేశమ్మున కన్యం బగుదేశమ్మున రభ్యుఁడను మహీనాయకుండు గలఁ డతం డతిధార్మికుం డయ్యనఘుభార్య రుక్మరేఖ యనఁబరఁగు నాపె సంతానహీన యగుకతన దుఃఖితయై యొక నాఁడు తన కాంతున కిట్లనియె. గి ౨

—* ఏకావళీవృత్తాంతము. *—

క. తనయరహితమగు మజ్జీ
వనమువృథా యని తలంతు వంధ్యాత్వముక
న్నను నంగనలకు దోసం
బనఘా! వేఱొండు గలదె యరయఁగ నెందున్. గి ౩

వ. ఇట్లు భార్యచేఁ బ్రేరితుండై యానృపాలుండు బ్రాహ్మణుల రప్పించి సంతానార్థం బగుక్రతు వొనర్చునెడ. గి ౪

ఉ. చారుశరీర శీతకరసామ్యముసం దగుమోము వొల్చు భ
వ్యారుణనేత్రి రక్తచరణాంచిత శోభనకేళి కాంచన
శ్రీరుచి నొప్పుకన్నె మృదురీతి నెసంగెడివన్నెలాఁడి యిం
పారఁగ నగ్నికుండమునయం దుదయించె నఖండితప్రభన్.

వ. పదంపడి హోత యక్కన్నియఁ దనకరమ్మున గ్రహించి నృపునకుం జూపి యిట్లను నిబ్బాల *యేకావళినా జనించుటఁజేసి యేకావళీనామమ్మున నెగడుఁ బుత్త్రతుల్యయగు నీపుత్త్రికం గొని

* ఏకావళి, ముక్తావళి.

సుఖితుండవగుము విష్ణుఁ డిద్దాని నొసంగె నావుడు రభ్యుం దత్తలోదరిం గొని సంతుష్టాంతరంగుండై తనభార్య యగు రుక్మరేఖ కొసంగిన నాపెయుఁ బుత్రింగన్న దానిచందమ్మున నామోదించె నంత నృపతి జాతకర్మాదికం బొనర్చి జన్మంబు సమాప్తి నొందించి బుత్విక్కులంబూజించి తన గృహమ్మున సుఖంబుండె.

గీ. పుత్రివృద్ధి నెసఁగుచు నప్పువ్వుబోఁడి
తల్లిదండ్రుల కతులముదమ్ముఁగూర్చు
నానృపు నమాత్యునకు నేను నాత్మజాత
పేరు వినుము యశోవతి ధారుణీశ. ౫౭

గీ. మా యిరువురకు నీడు సమాన మగుట
నృపుఁడు నన్నొనరించె నచ్చపలనేత్రి
కనుఁగునెచ్చెలి గాఁగ; మే మదియుఁగోలె
నొక్కటిగ నాడికొనుచుండు మొప్పిదముగ. ౫౮

క. పరిమళవాసితములు మేల్
సరసీజము లెచట నుండు సమ్మతి నచటన్
నరవరపుత్రికిఁ గ్రీడా
దర మెక్కుడు దానఁజేసి తద్దయు నెమ్మిన్. ౫౯

వ. ప్రతిదినమ్మును నన్నుంగూడి తక్కుఁగల నెచ్చెలులు గొలువ గంధవంతంబులగు పంకజంబులం బొల్చు గంగానదికిం జని యయ్యేకావళి క్రీడించు నియ్యది యతిదూరంబని యే నెంత వారించిన నాపె చెవిఁబెట్టకునికి నొక్కనాఁడు తజ్జనకునితో నిట్లంటి. ౬౦

క. నీకొమిరె ప్రతిదినము కమ
లాకరములయందు వాంఛ నంది సఖులతో

నేకతమ వనములందు ని
రాకులతం దిరుగు నదుల కరుగు నృపాలా! గీ. ౧

వ. నాపుడు రభ్యుండు తననగరున భ్రమరమనోహారములును బుష్పితమ్ములునునగు కమలంబులం బొల్చుతటాకమ్ము లనే కమ్ములు పొందుపఱచి యేకావళిం గాంచి బుజ్జగించి యిట్లను.

క. అమ్మా! నీకుం గమలవ
నమ్ములయం దిచ్చయేని నవసారసయు
క్తమ్ములగు నిచ్చటి తటా
కమ్ములఁ గ్రీడింపు మరుగఁగాఁ బోకు మెటన్. గీ. 3

వ. అని తండ్రి నియమించినను గమలాసక్తచిత్తయగు నక్కన్నియ యథాపూర్వమ్ముగ దూరస్థమ్ములగు నదులయెడఁ గ్రిమ్మరు నయ్యది వీక్షించి నృపాలుండు పుత్రికయెడఁ గల్గు కూర్మి పెంపున శస్త్రపాణులగు భృత్యుల రక్షార్థంబు నియోగించె. గీ. ౪

క. ప్రతిదినముం బితృసమ్మతి
నతివలతో నన్నుఁ గూడి యబ్బాలిక ని
ర్గతయై గంగానదికిం
గతాగతములం బొనర్చుఁ గౌతుక మెనయన్. గీ. ౫

వ. అంత నొక్కనాఁడు ప్రాతఃకాలమ్మున సఖీసమేతయై రక్షకులు వెంటనరుదేరఁ గ్రీడాపరాయణయై యియ్యెడ కరుదెంచి యింతకు మున్న యచ్చరలతో వచ్చియున్న కామపత్నితోఁ గమలక్రీడ నొనర్చుచుండె, నయ్యెడఁ గాలకేతుండను నొక్క రక్కసుండు బహురక్షోగణపరివృతుండై యరుదెంచువాఁడు పంకజక్రీడ నొనర్చుమత్సఖి నేకావళింగాంచి తద్రూపమ్మున కచ్చెరువడి హరింప నెంచి దగ్గఱకు వచ్చునాలో నాలోకించి యే నిట్లంటి.

క. రక్కసుఁ డెవ్వఁడో యిచ్చటి
కుక్కుమెయిన్ వచ్చి నన్ని యువతియుఁ దా నా
దిక్కు మొగంబై యెద భయ
మెక్క నన్నుం గలసి చొచ్చె భృత్యులనడుమన్. ౯౮

వ. పదంపడి కాలకేతుండు గదం గైకొని సత్వరగతి నేతెంచి రక్షకులం దతిమి జగన్మోహినియగు మత్సఖిం గైకొని యరుగుచుండ వేపమానయు భయత్రస్తయునగు నానెచ్చెలి రోదనంబు విని చేయునది లేక యేను వాని కిట్లంటి. ౯౯

క. అక్కట ! మత్ప్రాణంబగు
నిక్కలికిం గొనఁగ నేల ? యే వచ్చెద నీ
విక్కమలాక్షిఁ ద్యజింపుము
చక్కఁగ నన్ గొనుము కరుణ సల్పుము పేర్మిన్. ౯౯

వ. అను నావచనమ్ములు గణింపక యరుగు నారక్కసున కడ్డుపడి రక్షకులు సంగరం బొనర్ప వాని పరిచారకులగు రాక్షసులు స్వామికార్యతత్పరులై యెదిరి యోడించిరి. ౭౦౦

ఆ. వె. కాలకేతు విట్లు గండున రక్షకా
వళినిఁ దున్మి నాదు ప్రాణసఖిని
గొనియు సేన దన్నుఁ గొలువఁగఁ దనపురి
కరుగునంత నేను నతనివెంట. ౭౦౧

వ. తీవ్రగమనమ్మున రోదనం బొనర్చుచు నరుగునంత నన్నుంగాంచి యేకావళి కొంత స్వస్థచిత్త యయ్యెఁ, బదంపడి యెట్టకేలకు దగ్గఱ కరుగుడు నన్నుం గాఁగిలించికొని స్తంభస్వేదసమాకు

లయ్యె కన్నీరు కాలువఁగా నేడ్చుచుండఁ గాలకేతువు ప్రీతిపూర్వ
కమ్ముగ నాకిట్లనియె. ౬౦౨

గీ. నాకలోకమ్మునకు సరి నాఁగవచ్చు
మత్పురం బయ్యదియ కనుమా మృగాక్షి
బెగడుమానె నగడుపడు నీ ప్రియసఖియు
ణికి వచింపుము ధైర్యమ్ము నెమ్మిఁగ్రమ్మ. ౬౦౩

క. ప్రీతిమెయి మీకు దాసుఁడఁ
గాతరతం గుందనేల ? కడు మోదమునన్
జేతము స్వస్థముగాఁగ ని
రాతంకత నుండుఁడని సమాదరమెసఁగన్. ౬౦౪

వ. నన్ను నమ్మృగాక్షి కెలన రథమ్మునఁ గూర్చుండఁ బెట్టికొని
శీఘ్రగమనమ్మునఁ దనపురి కరిగి సంతసం బెసఁగ నొక ధవళ
గృహమ్మున మమ్మిరువుర నుంచి చుట్టును ననేకుల రక్కసులఁ
గావ నియమించి మఱునాఁ డట కరుదెంచి మంతనమ్మున నన్నుం
గాంచి యిట్లనియె. ౬౦౫

క. శోకముఁ ద్యజించి నీ చెలి
నాకుం బత్ని యగునట్లొనర్పుము రాజ్య
శ్రీ కధికారిణి తా నను
మేకోరికయైనఁ దీర్తు నే సేవకుఁడన్. ౬౦౬

వ. నాపుడు వాని కే నిట్లంటి నీకుం బ్రియం బొనర్చునంత సమర్థత
లేని నన్ననుగ్రహించి నీవై యిక్కన్నె బోధింపుమనుడుఁ
గామాతురుండు కాలకేతుండు మత్సఖి కిట్లనియె. ౬౦౭

ఉ. మానిని నన్ గలంచుటకు మంత్రము నొక్కఁడు పంచి దాన మ
న్మానసమున్ గ్రహించి నిను నమ్మిన దాసుని నీనిఁ బ్రోవఁగాఁ
బూనక యుంట పాడియె ? సముజ్జ్వల మీ నవయౌవనంబు ని
త్యానుగతంబు గామి వినవా ? సఫలం బొనరింపఁ జెల్లదే.

వ. నావుడు "మజ్జనకుండు నన్ను రాజపుత్రున కీ నెంచె మన్మనంబున హైహయుండను రాకొమరు వరించి యున్నదాన సనాతనమగు ధర్మమ్ము వమ్ముఁజేసి తక్కొరుల నెట్లు కైకొందుఁ దలిదండ్రు లిచ్చు కనుగుణుండగు వరు వరింపఁదగువారలు గాని కన్యకలు స్వతంత్రలే !" యను నక్కలికియందుఁ గరుణింపక పాపాత్ముం డగు నద్దానవుం డయ్యుద్యమంబు విరమింపఁడ, అవ్వాని పురంబు పాతాళవివరమ్మున ననేక రక్షోగణరక్షితంబై యేరికిఁ జొరరాకుండ ననుడు నేకవీరుండు యశోవతి కిట్లనియె. ౬౦౯

క. నిను నీ నెచ్చెలితోడం
దనపురమున నుంచె నంటి దానవుఁడు మనం
బున సంశయంబు దోఁచెడిఁ
జనుదెంచితి వెట్టు లిటకుఁ జంచలనయనా. ౬౧౦

గీ. హైహయుండను రాజన్యు నాత్మఁ గోరి
యున్నదాన నటంచు మీ వన్నెలాడి
పలికె నంటివి ననుఁ దక్కి పార్థివుండు
హైహయుఁడు లేఁడు ననుఁ గోరెనా లతాంగి ? ౬౧౧

క. మీ నెచ్చెలి జనకుండగు
మానవనాథుండు నన్ను మన్నించి యిడం
గా నీ కన్నియఁ గనియెనె ?
మానక నాతోడఁ జెప్పుమా వెతపేలా. ౬౧౨

వ. అట్లేని యా రక్కసు నడంచి యిప్పుడ యప్పుడఁతిఁ దోడ్తెచ్చి నీవంతం బాపఁగలవాఁడ నప్పట్టణంబునకు మార్గమ్ము నాకెఱిం గింపుమని వేఁడియు, ౬౧౩

ఉ. దానవుఁ డాత్మజాత నిటు దారుణరీతిని గొన్న సంగతిన్
మానవ నాయకుండు వినెనా? యటులేనిఁ బ్రయత్నమేమియుం
దానొనరింప కుండునె? సుతాహరణమ్మునకన్న దైన్య మెం
దేనియుఁ గల్గునే? యతఁడు హీనబలుండె? మృగాక్షి! తెల్పుమా.

వ. నీ వక్కన్నియ గుణమ్ములు చెప్పినదిగోలె మన్మనంబు తదధీనంబై యెప్పు డయ్యతివ విడిపింతునని సంరంభమ్మునఁ బొదలుచున్న యది. నాకుం గమనోపాయమ్ము నొడివి నీవెట్లు వానిఁ గికురించి వచ్చితో తెలుపుమను నయ్యేకవీరునకు యశోవతి యిట్లనియె.

గీ. చిన్నతనమున నొక మంత్రసిద్ధుఁ డిచ్చె
నాకు మంత్రంబు నరనాథ ! వ్యాకులత్వ
మడర నా రక్కసుని పురమందు నుండు
నెడలఁ దన్మంత్రరాజంబు స్మృతికివచ్చె. ౬౧౬

క. ఆ మంత్రమ్మున దేవిన్
గామప్రదఁ గొలుతునేనిఁ గలుగును మోక్షం
బీమెయి నని యోజించి స
దా మనమున నంబ నిలిపి తత్పర నగుచున్. ౬౧౭

వ. రక్తాంబరయు రక్తనయనయు సృష్టిస్థిత్యంతకారిణియు సౌమ్యయు విశ్వేశ్వరియు నగు నప్పరశక్తి గుఱించి మంత్రంబు జపియించిన నాపై యనుగ్రహించి నాకు స్వప్నమ్మునఁ బొడకట్టి యిట్లనియె.

ఉ. వైళమ లెమ్ము పొమ్ము సురవైరిభయమ్మును వీడి గంగ కో
బాలరో ! యేగుదెంచెడి నృపాలుఁడు హైహయుఁ డేకవీరుఁ డెం
తే లలితుండు మచ్చరణనీరజబంభరితాంతరంగుఁ డీ
లో లలి నన్నదీతటికి లుంఠితశత్రుఁ డతండు పేర్మిమై. ౬౧౯

క. దత్తాత్రేయమహాముని
దత్తంబై యెంత కేనిఁ దగియెడిదానిం
జిత్తమున మహావిద్య న
మత్తుండై పఠన చేయు మత్ప్రీతికినై. ౬౨౦

వ. లక్ష్మీపుత్రుండగు నన్నరవరుండు విహారం బొనరించుచు నిన్నుం గాంచి శరణంబై రాక్షసుం జంపి యేకావళి విడిపించుఁ బిమ్మట నీ నెచ్చెలి కారాజసుతుం బతిగా నీ వొనరించునది యని చెప్పి యాపె యంతర్ధానం బగుడు మేల్కాంచి స్వప్నవృత్తాంతంబు వచించిన నేకావళి ప్రసన్నవదనయై నా కిట్లనియె. ౬౨౧

గీ. అప్పరాంబిక వచనంబు తప్ప దిష్ట
యేగు మతిరయమున గంగ కీవు నాకుఁ
బ్రీతి యొనరింపు మనిన నాపె వచనమున
నిటకు వచ్చితిఁ బరశక్తి కృప నృపాల. ౬౨౨

వ. జగజ్జననియ నాకు శీఘ్రగమనంబును మార్గజ్ఞానంబును నొసంగె నియ్యది యస్మదీయోదంతం బింక నీ వృత్తాంతమ్ము నుడువుమను నయ్యశోవతి కేకవీరుం డిట్లనియె. ౬౨౩

గీ. సంపదలనిచ్చు చెలి నాకు జనని, హైహ
యుండ న న్నేకవీరుఁ డటండ్రు, మన్మ

నంబు పరతంత్రిమయ్యె ననంగజనక
మైన మీా చెలి వృత్తాంత మానుకతన. ౬౨౪

చ. మొదల సమస్తలోకముల మోహము గొల్పెడి దాని యంద మిం
పొదవ వచించి తంత మదనోదయ మయ్యె, గుణమ్ములన్ వచిం
ప దొరఁకొనన్ మనంబు వశవైఖరి నొప్పె "నినున్ వరించె నా
సుదతి " యటంచుఁ జెప్పి నను సుందరి? దాసునిఁజేసి తింతికిన్.

ఉ. ఏమి యొనర్చువాఁడఁ గమలేక్షణ! మీా కుపకార; మెట్లు నా
కా మహిళాజనాభరణ మాయనవద్యవిలాస యాకన
త్కోమలగాత్రి యున్న యెడకుం జననౌ? నెటు వానిఁ జంపి యా
సామజయానఁ దేరనగు? జన్మము సార్థకమై చెలంగఁగన్. ౬౨౬

క. ఆపురిమార్గము సెప్ప ద
యాపరు లెవ్వారు? నీవ యనుకంపన్ సం
తాపపరీతుని నను సౌ
ఖ్యోపేతు నొనర్చు మింత యొప్పదె నీకున్. ౬౨౭

చ. నుడివితివేని సైళమ మనోగమనమ్మున నేగి రక్కసుం
బొడిచి నృపాలపుత్రిక సముజ్జ్వలతేజ మెసంగఁ దెచ్చి పెం
పడరఁగ నిన్నుఁ గూర్చి రయమారఁగఁ దత్పురిఁజేర్చి పేర్మిమీా
యొడయనికిం బ్రమోద మిడ నోపుదు నొక్కతుటిన్ దలోదరీ.

వ. ఇట్లు సల్పుట నీకును నాకును మనఃప్రియంబగుఁ బిమ్మటఁ దజ్జన
కుండు వివాహం బొనర్చి నన్నాదరించుఁ బరదారాపహర్తయగు
నవ్వాని వధించు నుపాయంబు నీయధీనంబై యున్నయది తత్పు
రంబుచూపి మత్పరాక్రమంబు గనుఁగొందుగాక నావుడు యశో

వతి ప్రియకారియగు నన్నరేంద్రువచనంబులకు సంతసించి
గమనోపాయం బిట్లు వచించె. ౬౨౯

క. జననాథ! మంత్రి మిచ్చెదఁ
గొను మాపై సేనతో నకుంఠితవృత్తిన్
జని యా రక్కసు ననిలోఁ
దునిమెను తేనేర్తు వా విధువదన నెలమిన్. ౬౩౦

వ. అని యత్తలోదరి దత్తాత్రేయునికతనఁ దనకు లభించిన త్రిలోకీ
తిలకంబను మంత్రం బుపదేశించినఁ దత్ప్రభావమ్మున సర్వజ్ఞత
యు సర్వాంతశ్చారితయుఁ గలిగిన నన్నరవరుండు సైన్యసమే
తుండై యయ్యంగనతోఁ బన్నగావిష్టంబగు పాతాళంబుపగిది
రక్షోగణరక్షితంబగు తత్పురమ్మున కరుగుటయు, ౬౩౧

గీ. వచ్చుసైన్యమ్ము నీక్షించి పెచ్చుపెరుఁగు
దుడుకుమైఁ గాలకేతుని దూతలెల్ల
నరిగి యేకావళీకన్యకాంతికమున
వినయము లొనర్చు తమపతిఁ గని భయమున. ౬౩౨

వ. ఇట్లనిరి. ౬౩౩

ఉ. సైన్యము చుట్టురా నెగడు చక్కని రాచకొమారుతోడ ని
క్కన్యకుఁ దోడునీడయగు కామిని వచ్చుచునున్న దన్యరా
జన్యభయంకరుం డతఁడు శక్రతనూజుఁడో! కార్తికేయుఁడో!
యన్యుఁడొ! చెప్పఁ జొప్పడ దహంకృతి కాకృతి నాఁగఁదోఁచెడిన్.

వ. యోజనత్రయమ్ములోఁ దత్సైన్యం బున్నయది, యిటకు వచ్చు
నంతలో సన్నద్ధుండవగుము కాదేని యియ్యబ్జాక్షి విడిచి శరణ
మ్మనిఁ గొనుము నావుడుఁ గాలకేతుండు క్రోధమూర్ఛితుండై

సబలంబుగా రక్షోవీరులం బనిచి మరల నేకావళీనికటమ్మునకు వచ్చి ప్రియమ్మున నమ్ముదిత కిట్లను. ౬౩౫

ఉ. వచ్చెడివానిఁ దెల్పు మనవద్యచరిత్రుఁడు నీదుతండ్రి దాఁ
బొచ్చెములేనికూర్మిఁ గనుపొంగు వెసం జనుదెంచె వేని నే
హెచ్చుగుపేర్మి నిష్ఠ యెదురేగి రణం బొనరింప కింటికిం
దెచ్చి బహూకరించెద ననిం దెగటార్చెద నన్యుఁడైన చోఁ.

వ. నావుడు నేకావళి యిట్లను, నీబంధనమ్మున నున్న నా కతం డెవ్వఁడో యెఱుంగ రాదు. మజ్జనకుండొండె మత్సహోదరుం డొండెఁ గామి నిక్కంబు, మఱియెవ్వఁడో మహాబలశాలియై యుండనోపు నిందుల కతం డేమిటికతమ్మున వచ్చెనో యని శంకింతు నావుడు దైత్యుం డిట్లను. ౬౩౭

క. దూతలు "యశోవతియ యిట
కేతెంచెఁ సేనగొలువ నెవ్వఁడొ తనతోఁ
బ్రీతిమెయి రాఁగ" ననిరి య
రాతులు నాకితరు లెవరు ? రాకేందుముఖీ. ౬౩౮

వ. ఆతండు నీజనకుండకా యని తోఁచెడి. యశోవతి యిటనుండి యెట్లరిగె ? నీ వెఱుంగుదే ? యని పలుకునాలో మరల దూత లేతెంచి యిట్లనిరి. ౬౩౯

క. డగ్గఱకు వచ్చె సైన్యము
నుగ్గగు నిఁకఁ బురము వే గనుంగొని చనుమీ
పెగ్గడలతో రణమ్మున
కెగ్గగుఁ దడ వాచరించితే నిఁక మనకున్. ౬౪౦

వ. నావుడుఁ గాలకేతుండు తూర్ణంబుగ రథ మెక్కి సేనాయుతుండై చనునంత నేకవీరుండును హయారూఢుండై కామినీవిరహాసంజనితక్రోధుండై తలపడియె, నిట్లిరువురును దలపడి వృత్రవాసవుల విధమ్మున ఘోరంబగు సంగ్రామం బొనర్చునెడ, ౬౪౧

గీ. అస్త్రశస్త్రములెల్ల దిగంతరముల
నాక్రమించెఁ, దమంబు భూచక్రమెల్లఁ
బొదివెఁ, గాతరులకు భయం బొదవె నంత
నేకవీరుండు గదఁగొని యేసె నతని. ౬౪౨

క. వ్రేటువడి రక్కసుఁడు శత
కోటి హతిం దెగిన మేటికుధరంబన ను
త్పాటితజీవనుఁడై పడె
నాటోపతఁదక్కి సైన్య మటునిటుఁ జెదరెన్. ౬౪౩

వ. పదంపడి యశోవతి సత్వరమ్మున నరిగి యేకావళికిట్లను. ౬౪౪

చ. పనిగొని యేకవీరనరపాలకుఁ డుక్కడఁగించి రక్కసుం
దునిమె లతాంగి! నెవ్వగలఁ దొల్గుము వే చనుదెమ్ము నిన్నుఁదా
విని నకతమ్మునన్ గనఁగ వేడుక చెందు నృపాలునిం గృపా
ఖని సదయాంతరంగమున లోఁగొని యాతని యప్పు దీర్పుమా.

క. మున్ను నిను విన్న ■ాదిగఁ
దన్నెఱుఁగక విరహావార్ధిఁ దవిలిన నృపునిన్
మన్ననఁ జేయుటకన్నను
బున్నెముఁ బురుషార్థ మొకఁడు పుడమిం గలదే. ౬౪౬

వ. నావుడు లజ్జితయై యే నస్వతంత్రనై యాతని నెట్లు వీక్షింతుఁ
గామార్తుండగు కతన న న్నతం డెట్లు గ్రహింపకుండునని చిం

తించుచు యశోవతీసహితమ్మున నరయానమ్మున నేకవీరు నిక
టమ్మున కరుగుటయు, ౬౪౭

క. మలినాంబరధారిణి న
న్నళినాక్షిం గాంచి పలుకు నరపతి "నేత్రం
బుల తృష్ణదీఱ నొకపరి
తలిరుంబోఁడిరో! యొసంగు దర్శన" మనుడున్. ౬౪౮

వ. సిగ్గున బ్రమ్మగ్గు నగ్గజగమనవైఖరియుం గామార్తుండగు నన్నరనాథు
తత్తఱమ్మును గాంచి నీతికోవిదయగు యశోవతి యిట్లనియె.

ఉ. ఈ నళినాక్షిఁ దండ్రి తగ నీదలఁచెన్ మదినీకుఁ; ద్వద్వశం
బై నెగడున్ లతాంగి హృదయం; బోకయించుక నైఁచితేని శా
స్త్రానుగతిన్ వివాహమగు నందఱకున్ హృదయంగమంబుగా
నా, నతఁ డిర్వురంగొని ఘనమ్ముగఁ దత్పురమేగ నేగినన్. ౬౫౦

వ. నృపాలుం డెదురేతెంచి కుమారిక నాలోకించి సంతసించి యశో
వతిని వేదితవృత్తాంతుండై యేకవీరుం గలసికొని గారవించి
గృహమ్మున కరిగి విధివిధానమ్మున దైవజ్ఞనిర్ణీతంబగు నొక్క
సుముహూర్తమ్మున నతనికి గన్యాదానమ్ముచేసి వివాహంబొనర్చి
పారిబర్హం బొసంగి యశోవతీసమన్వితమ్మున నత్తింటి కనిచె.

గీ. అట్లు భార్యాసమేతుఁడై యరిగి పురికి
నేకవీరుండు భోగమ్ము లెనయుచుండె
నతని తనుజుండు కృతవీర్యుఁ డతనికొడుకు
కార్తవీర్యుండు వంశ మిక్కరణి నెగడె. ౬౫౨

వ. నాపుడు జనమేజయుం డిట్లనియె. ౬౫౩

చ. అనఘ ! భవన్ముఖాంబుజమునం దుదయించెడి సత్కథామృతం
బును దగఁ గ్రోలునాకుఁ దుదముట్టదు తృష్ణ; విచిత్రమై మనం
బెనసెను హైహయాధిపుల యెల్లచరిత్రము, దేవదేవుఁ డ
బ్జనయనుఁ డన్నియుఁ గలుపువాఁడు స్వతంత్రత లేక యశ్వమై.

వ. కొమరుంగన్నవార్త యత్యాశ్చర్యం బయ్యెడినని వ్యాసుం
డిట్లనియె. ౭౫౫

—* వ్యాసుని పశ్చాత్తాపము *—

సీ. విను జనమేజయ ! మును నారదుఁడు బ్రహ్మ
పుత్రుఁడు దా నెల్లపుడమిఁ జూచు
వాంఛనై సామముల్ వాయించికొంచు వీ
ణానినాదమ్ము మోదానుభవము
నొసఁగంగ నొకనాఁడు వెస సరస్వతి యాశ్ర
మంబును మునినివాసంబు శర్మ
దంబు పావనమునై తనరు శమ్యాప్రాశ
మునకు నేతెంచిన మొనసి యేను

గీ. నర్ఘ్యపాద్యాది సత్కృతు లాచరించి
యాసనస్థితుఁడైన యయ్యనఘునొద్ద
భక్తిమై నుండి యిట్లంటి "భవ్యతేజ !
కలదె ! సంసారమున నించుకయు సుఖంబు. ౭౫౬

ఉ. ద్వీపమునన్ జనించితిని దెంపరినై యట పీడెఁ దల్లి య
య్యాపదకోర్చి కర్మమున నయ్యటవిం బెనుపొంది యాత్మజా
శాపరిపూర్తికిన్ దపము సల్పితి నెక్కుడు కాలమంత న
త్తాపసగమ్యుఁడిచ్చె సుతుఁ దత్త్వవిదుం గిరిశుండు నాకొగిన్.

గీ. వాఁడు వేదంబు పఠియించి పండితప్రి
వరుఁడయి యశంబుగొని నీదు వచనము విని
సంసృతిఁ ద్యజించి నాదు విచార మెన్న
కరిగె లోకాంతరంబు నేమనఁగవచ్చు. ౭౫౭

చ. పదపడి హా! శుకా! యనుచుఁ బావనుఁడౌ తనయుంగుఱించి దుః
ఖదశ నడంగి మేరుగిరిఁ గాతరతం ద్యజియించి మాత నె
మ్మదిఁ దలపోసి యేగి యట మజ్జననిన్ దగ శంతనుండు మే
లొదవ గ్రహించెనంచు విని యుంటి నిటం దపమాచరించుచున్.

వ. అంతఁ గొండొకకాలమ్మునకు శంతనుండు దివం బరుగుటయుఁ బుత్రద్వితయసంయుతయగు మజ్జనని విధురయై భీష్మునిచే రక్షింపఁబడు చుంటయుఁ జిత్రాంగదుండు రాజగుటయుఁ బదంపడి యతండు మృతుండగుటయు విని పుత్రదుఃఖమ్మునఁ గుందుతల్లి నూఱార్పనేగి భీష్మసహితుండనై యోదార్చితి, మీఁద భీష్ముండు విచిత్రవీర్యునకు రాజ్యం బొసంగి కాశిరాజతనూజల నిరువురం దెచ్చి సత్యవతికి సమర్పించిన శుభకాలమ్మున వారి నిరువురఁ దన చిన్నకొమరునకుఁ బెండ్లిచేసె, నియ్యది విని యేను సంతుష్టుండనైయుండ నంతట నతండును మత్కర్మవశమ్మున ననపత్యుండై రాజయక్ష్మవ్యాధికతన మృతుండయ్యె, దాన సత్యవతి దుఃఖాతురయై యున్నెడఁ గోడండ్రైన యంబాంబాలికలా పెంజూచి సహగమనంబున కాజ్ఞ యిమ్మని ప్రార్థించిన నాపె యొసంగక నన్ను స్మరియించిన నాకె మనోభావంబు గుర్తెఱింగి యే నటకరిగి యాపిన్నతమ్ముని కౌర్ధ్వదైహికమ్ము లొనర్చి తల్లి నోదార్చి హాస్తినగరమ్మునన యుండి యొక్కనాఁడు కృతాంజలినై తల్లీ! న న్నేలరప్పించితి వచింపు నావ్వుడు సత్యవతి "పుత్రా! నీసహోదరు లిర్వురును ననపత్యులై పరలోకమ్మున

కరిగిరి. వంశచ్ఛేదమ్మునకుఁ గొంకి నిన్నుఁ దలంచితి, మదాజ్ఞం
జేసి గాంగేయు ననుమతమ్మునఁ గురుకులాభివృద్ధికై కడంగి కాశి
రాజసుతలయందు సంతతిం బడయు మిద్దాన దోషంబు వాటిల్ల”
దన నేను జింతాలజ్జామగ్నుండనై యమ్మహాభాగ కతివినయ
మ్మున నిట్లంటి. ౬౬౦

ఉ. ధర్మ మెఱింగి యేను బరదారసమాగమ మెట్లొనర్తు? దు
ష్కర్మ మొనర్చి వంశమును గాచిన దానఁ దరించి యెంతయుఁ
శర్మగతిం బితృప్రతతి సంతస మందునె? న్యాయశాస్త్రి స
న్మర్మములుం బురాణములు మత్కృతముల్ జననీ యెఱుంగవే.

ఉ. నాపుడు నన్నుఁ జూచి వదనమ్మున విన్నదనమ్ము దోఁపఁ బు
త్రా! విను పుత్రశోకము కతమ్మున దైన్యము నందియున్న నా
భావ మెఱింగి యిట్లొనరుపంగదవయ్య! తమంతఁ బెద్ద లే
యేవిధులాచరింతు రవియే మన కుత్తమధర్మశాస్త్రముల్.

క. ఈవిధి దోషం బయ్యును
నావచనంబునను నీకు న్యాయ్యంబగు దో
షావహమయ్యును బెద్దల
చే విహితంబైన దానిఁ జేయుదు రనఘుల్. ౬౬౩

క. అని పలుకునంత గంగా
తనయుఁడును దదనుసరణము దగ నిట్లను నో
యనఘా! జననీవాక్యము.
గొని విహరింప కిటులేల కొంకెదు చెపుమా. ౬౬౪

క. అని యాతండును జననియు
ననుఁ బురికొల్పిన విచారణంబుడిగి జగ

జ్జననింద్యమైన యీ కృతి
కనుమోదించి రతిఁగొంటి ననుజాంగనతో. ౬౬౫

వ. అంత నయ్యంబిక నాయెడల విముఖత్వమ్మునం బొదలి కనుమూ యుటకుఁ గనలి "నీ కంధుం డుద్భవించు" నని శపియించి మఱునాఁడు రహస్యమ్మున శాపకారణంబు తల్లి కెఱింగించిన నాపె కోపించి నన్ను శిక్షించి మరల నిట్లానతిచ్చె. ౬౬౬

ఆ. వె. కాశిరాజతనయ కడుజవ్వనమ్మునఁ
బొలుచు మగువ యంబచెలియ లనఘ
దానిఁ గొని మఱొకక్షతనయునిఁ గను మంధుఁ
డగు నె రాజ్యమునకు నర్హుఁడనుడు. ౬౬౭

వ. జననియానతిం జేసి విచిత్రవీర్య ద్వితీయభార్య ఋతుమతియగు దనుక నట వసించి యుక్తకాలమ్మున లజ్జితాననయై శయనాగార మ్మున నున్న నాకడ కరుదెంచిన యత్తన్విం గలయ నుంకించితి.

క. రసహీనుని జటిలునిఁ దా
పసుఁ గేళీలోలు నన్నుఁ బరికించి రసం
బెసఁగమి స్వేదవదనయై
యసమంజసబుద్ధిఁ బాండుతానుగయగుడుఁ. ౬౬౮

వ. పార్శ్వమ్మున వేపమానయగు నామఱఁదలిం జూచి కోపించి "గర్వమ్మున నన్నుఁగాంచి పాండురవైతి గాన నీకొమరుండు పాండుండగు నని శపించి యా రేయి నెట్లో యాపెతోఁ గడపితిఁ బిమ్మట యుక్తకాలమ్మున నిరువురకును నంధుండును బాండుం డును గ్రమమ్మున నుద్భవించి ధృతరాష్ట్ర పాండునామమ్ములఁ బ్రసిద్ధులైరి, వారలం జూచి సత్యవతి వైమనస్యమ్మున మొద మెడలి సంవత్సరాంతమ్మున నన్నుంజూచి యిట్లనియె. ౬౭౦

క. పాయక నా యాసతిచే
దాయాదులఁగంటి వంధతాపాండుత్వా
పాయసముపేతు లేగతిఁ
జేయఁగనగు రాజ్య మేమిసేయుదుఁ బుత్రా. ౬౭౧

వ. కావున రాజ్యార్హుండగు తనయు నొక్కరుఁగని నన్నానందింపఁ జేయుమని యంబాలికం గని మరల నా పొందున కియ్యకొల్లుటయు నాపె యత్తరుత్తరంబీక శయనాగారసంగతుండనగు నా యొద్దకు రూపయౌవనసంపన్నయు విచిత్రాంబరాభరణయుఁ జందనదిగ్ధగాత్రియుఁ బుష్పమాలాలంకృతయు సుకేశియు హంసగామినియు హావభావసంయుక్తయు నగు తనదాసిం బనిచె.

ఉ. నారద! యేమి సెప్పుదు, మనంబున కాఁచెలి నచ్చె దాని బల్
నేరుపుఁ జెయ్వులున్ సురతలీలలు నా కనుకూలరీతిఁ జె
న్నారెఁ దదీయసంగతు లనంగకలానుమతమ్ములయ్యె సా
ధారణరీతి నిర్వురకుఁ దారసమై తగెఁ గూర్మి యొప్పఁగన్.

వ. దానికిఁ బ్రీతిం జెంది పరవశంబైన చిత్తమ్మున. ౬౭౪

గీ. సత్యవాది కలాశాలి సర్వలక్ష
ణములఁ బొల్చెడివాఁడు విన్నాణమైన
రూపెసఁగువాఁడు నీ కొక్కరుఁడు సుతుండు
కలుగునని వరమిచ్చితిఁ గాంత కంత. ౬౭౫

వ. విదురుం డుద్భవించె నిట్లు మాయావశమ్మునఁ బరక్షేత్రమ్మునఁ మూగురఁ గొమరులం గని శుకవిరహజనితమ్మగు శోకమ్ము వాసి సంతుష్టాంతరంగుఁడనైతి; నరూపయు నిరాలంబయు జ్ఞానులకు సయితము మోహకారిణియునగు మాయ యకృతాత్ముల కేరికిం ద్యజింపరాదు. ౬౭౬

గీ. తల్లియెడఁ గల్గు బంధంబు దవ్వులఁజేసె
నాత్మజాతులయందుఁ దదాది నాకు
మనము డోలాయమానమై కనదు శాంతి
యనఘ యొక్కెడ నిశ్చయం బాదకుండు. ౬౭౭

చ. కరినగరాధివాస మొక కాలమునందు; సరస్వతీ తట
స్థిరత యొకప్డు; వేఁశోకగతిఁ జరియించుట యొక్క వేళఁ; గా
ని రహి నొకప్డు నిశ్చలత నెక్కొనువైఖరి గాన రాదు జ్ఞా
నరతి నొకప్డు డెప్పుడో మనమ్మున నీ గతిఁ దోఁచు నారదా.

చ. కొమరులఁ గంటి మూగు రను గొంకక; యొక్కనిఁ గాని నాకు శ్రా
ద్ధము నొనరింప నర్హునిఁగ ధర్మము లొప్పవు పారదారసం
గమమునఁ బుట్టు పుత్రకులుగర్మమొనర్పఁగ యోగ్యులే? వృథా
క్రియమున మాయలోఁ బడితిఁ గర్మవిదుల్ బహిపెట్ట కుందురే.

వ. అని మంతనమ్మునఁ బశ్చాత్తాపమునఁ గుందుచుందుఁ బదంపడి
మత్పుత్రిండగు పాండుండు బలవంతుండగు భీష్మననుమతమ్మున
రాజ్యము వడసె; దానంజేసి యానందించితి. ౬౮౦

గీ. శూరసేనుని యాత్మజ సుగుణ కుంతి
మద్రరాజకుమారిక మాద్రి వీర
లిరువురును నాత్మపత్నులై యొసక మెసఁగఁ
బాండుభూపాలకుఁడు రాజ్యభారమూని. ౬౮౧

వ. ఒక్కెడ ద్విజశాపమ్ము నంది నిర్విణ్ణుండై రాజ్యమ్ము విడిచి
యరణ్యమ్మున కరిగె నవ్వార్త వినుకతన నాకు . మరల దుఃఖం
బనుసరించె. ౬౮౨

క. సతులిరువురు గొలువఁగ నా
సుతుఁడున్నెడ కరిగి కొన్ని సూక్తుల మోదా

న్వ్రతుఁ జేసి కరినగర సం
స్థితు ధృతరాష్ట్రుఁ గని యరుగుదెంచితి నిటకున్. ౬౩

వ. పిమ్మటఁ బాండుండు సతీయుగ్మమ్మునందు ధర్మానిలేంద్రాశ్వినుల కతన ధర్మసమ్మతమ్ముగ క్షేత్రజులఁ బంచపాండవుల యుధిష్ఠిరభీమసేనార్జుననకులసహదేవు లనువారిం గనియెఁ; బదంపడి యాతండొక్కనాఁడు రహస్యమ్మున మాద్రిం గౌఁగిలించినకతన శాపదగ్ధుండై మృతుండై పరలోకమ్మున కరిగెఁ బదంపడి మాద్రియుఁ బతిపరాయణయై యగ్నిముఖమ్మునఁ దదనుగత యయ్యెఁ; బిదప శోకమగ్నయగు కుంతి నూఱార్చి యచ్చటి మునులు సుతసహితమ్ముగ గజపురమ్మునకుఁ దోడ్కొని వచ్చి భీష్మునకును ధృతరాష్ట్రునకును నొప్పఁ జెప్పి; రీవృత్తాంతమ్ము విని యేను హర్షశోకమ్ముల కాధారంబ నైతి. అంత నప్పాండవులు భీష్మవిదురధృతరాష్ట్రులచేఁ బ్రీతిపూర్వకమ్ముగఁ బోషింపం బడుచుండఁ గ్రూరమానసులగు ధృతరాష్ట్రు కొమరులు దుర్యోధనాదులు వీరలతోఁ బరస్పర వైరమ్ములఁ బొదలుచుండిరి. పిదప ద్రోణాచార్యుం డేగుదెంచి భీష్మునిచే సన్మానితుండై యక్కుమారులకు విద్యలఁ గఱపుచుండె. ౬౪

గీ. మున్ను గనినష్ట కుంతిచే ముక్తుఁడైన
కర్ణుఁడును సూతునింటఁ జక్కఁగను వృద్ధి
నంది దుర్యోధనప్రియుఁడై యెసంగె
దాన దుర్యోధనుండు తద్దయుఁ గడంగి. ౬౫

వ. భీమాదులయెడ నధికవైరమ్ము గనుటకుఁ జింతించి ధృతరాష్ట్రుండు విరోధశమనమ్మునకై పాండవులకు వారణావతమ్మున నివాసం బేర్పఱిచె నంత నప్పట్టణమ్మున. ౬౬

గీ. కుటిలుఁడు సుయోధనునియాజ్ఞఁ గొని పురోచ
నుండు నిర్మించె జతుగృహామండలంబు
నచటఁ జిచ్చునఁ బాండవు లడఁగి రనుచు
విని మనుమలై నకతన దుఃఖనిధి నైతి. ౬౮

వ. అట్లు దుఃఖించుచు వనమ్మునఁ గుంతీసహితమ్ముగఁ బాండుపుత్రులు గన్పట్టిన నఖండానందభరితుండ నైతి. ౬౯

క. పిమ్మట మత్ప్రీతులై
సమ్మతి ద్రుపదునిపురంబు చని రేపురు పొం
కమ్మగు భూదైవతవే
షమ్ముల నప్పార్థు లతికృశత్వము దొడరన్. ౭౦

చ. నరుఁడు పరాక్రమక్రమమునన్ ద్రుపదాత్మజ గెల్చి తెచ్చె నే
పురకును సాధ్వియయ్యె నలపుష్పసుగంధియు గొంతియాజ్ఞఁ; ద
త్పరిణయముం గనుంగొని ముదంబు నెదం గనినాఁడ మీఁద న
త్తరుణియుఁ బార్థులుం గలసి దంతిపురమ్మున కేగి రిమ్ముగన్.

వ. ధృతరాష్ట్రుండును వారలకు ఖాండవప్రస్థమ్ము నివాసమ్ముగాఁ గల్పించె నటఁ గృష్ణసహాయుండై యర్జునుండు పావకు సంతృప్తుఁ జేసె. ౭౧

క. వారలు లోకోన్నతులగు
శూరులు పాండవులు రాజసూయ మొనర్పం
గా రహిఁ దద్వైభవమును
నారసి యెంతేని మోద మందితి నాత్మన్. ౭౨

వ. మయనిర్మితంబగు తత్సభావిశేషంబు వర్ణింప నలవిగాదు తద్వైభవమ్మునకు సైఁపక దుర్యోధనుం డసూయాగ్రస్తుం డై

వారలతో దురోదరం బొనర్చి దుర్ద్యూతకుశలుండగు శకునికతన ధర్మజు నోడించి రాజ్యమ్ము గైకొని యంతఁ బోక ద్రోవది నవమానించె. ౬౫౩

క. వనమునఁ బండె్రండేడులు
మనుమలు పాండవులు ద్రుపదమహిపాత్మజతో
నెనసిరి కష్టమ్ముల నా
మన మది హేతువుగ దుఃఖమగ్నతఁ గాంచెన్. ౬౫౪

క. ఈక్రియ సుఖదుఃఖమ్ముల
కాకరమగు భవమునందు నడుగంటితి ధ
ర్మాకలన మెఱిఁగి భ్రాంతిం
జేకొనునా కొక్క తెరువు సెప్పు మహాత్మా. ౬౫౫

—* నా ర ద వి వా హ ము *—

క. ఎక్కడిసతు లెక్కడిసుతు
లెక్కడితలిదండ్రు లకట ! యే నిక్కరణిం
జిక్కితి సంసారమ్మున
మక్కువమొయి భ్రాంతి మిగుల మఱపించుట చేన్.

క. డోలారూఢంబై మది
వాలాయము ముదము దక్కి వంతంబడు నా
కేలీల సౌఖ్యమబ్బు.? జ
టాలాగ్రణి దెల్పవే ! కటాక్షము పేర్మిన్. ౬౫౭

వ. ఇట్లు మాటికిం బ్రార్థించునాకు నారదుం డిట్లనియె. ౬౫౮

క. పారాశర్య ! పురాణా
ధార ! యిటుల్ సారెసారె దర్కింపకు సం

సారమున మోహరహితుం
డారయ లేఁడొక్కరుండు నని యెఱుఁగవొకో. ౯౯

గీ. హరిహరవిరించులును గపిలాదిమునులు
మాయలోఁ బడి సంసారమార్గమందుఁ
బొరలువారల నన్ మునుల్ పొగడుచుందు
జ్ఞాని యని; నేను నట్టిఁడఁ గను మొకింత. ౨౦౦

గీ. మోహసంగతిఁజేసి యోమునివరేణ్య
భార్యకై మును నాపడ్డపాటులెల్ల
విస్తరించి వచించెద వినుము దాన
నడఁగు నీసంశయములెల్ల ననఘచరిత. ౨౦౧

వ. ఒక్కనాఁడు నేనును బర్వతుండును గలసి భరతఖండంబు చూడం జని యందంద తిరుగుచుఁ బుణ్యక్షేత్రమ్ము లాలోకించుచు మున్యాశ్రమమ్ములు దిలకించుచు నొక్కసమయమ్మున నొక సమయం బొనర్చికొంటిమి. ౨౦౨

క. మంచియుఁ జెడ్డ యనుచు లో
నెంచక మనయాత్మఁ బొడమునిచ్ఛల మనలో
నించుకయు దాఁపఁగాఁ జన
దంచితగతి నొక్క రొకరి కది చెప్పఁ దగున్. ౨౦౩

వ. ఇట్లు పరస్పరమును సమయం బొనర్చికొని మైత్రి యెసంగ స్వర్గలోకమ్ము విడిచి భూలోకమ్మునఁ గ్రుమ్మరునంత గ్రీష్మాంతం బరుగుదెంచె. ౨౦౪

క. చాతుర్మాస్యవ్రతమును
బ్రీతిన్ సంజయుఁడను నొక పృథివీశుపురం

జేతెంచి సలుపుకొంటిమి
యాతని సదనమ్మునఁ గృతావాసులమై. ౨౦౫

ఉ. నాలుగుమాసముల్ దగు ఘనం బగువర్షము లానెలల్ సుఖ
శ్రీ లలిఁ గోరుమానవులు సేయఁగ రాదు ప్రవాస; మాపయిన్
బోలునొనర్ప నంచుఁ దలపోసి సుఖమ్ముగ సంజయుండు స
చ్ఛీలుఁడు గొల్వఁ దత్పురి వసించితి మెంతయు సంతసమ్మునన్.

వ. అన్నరనాయకుండు మాకుఁ బరిచర్య యొనర్పఁ దనకూఁతు దమ
యంతి యనుదాని నియోగించె. ౨౦౭

గీ. స్నాన మొనరింప జలము భోజన మొనర్ప
నిష్ట మగువస్తువులు శయ్య యొద్దియేని
గోర నయ్యవి మా కిడుఁ గొసరి కొసరి
హెచ్చుతగ్గులు లేకుండ నిగురుఁబోఁడి. ౨౦౮

వ. ఇట్లక్కన్నియ మమ్మిరువుర సేవింప వేదాధ్యయనమ్ములను గాన
వినోదమ్ములను గాలంబు పుచ్చుచుంటిమి. ౨౦౯

మ. అనుకూలమ్ముగ వీణ సుస్వరయుతం బొనట్లు సారించి నె
మ్మన మానందరసామృతార్ణవమునన్ మగ్నమ్ముగా సామవే
దనినాదం బొనరింప దాని విని యత్తన్వీశిరోరత్న మె
క్కినమోహంబునఁ బేర్మి నాయెడలఁ దాఁగీలించెఁ గామార్తయై.

క ఆతరుణీరత్నం బిటు
చేతోభవుబారిఁ దవిలి చేసెడిచెయ్వుల్
ప్రీతి గలిగించె నాకుఁ బు
రాతనకర్మములు దాఁట రావెవ్వరికిన్. ౨౧౧

వ. ఇట్లు నాయందు లబ్ధానురాగ యగుకతన నక్కలికిమిన్న స్నాన
పానాద్యుపచారములయందు మాయిరువుర కొక్కింత భేదంబు
సల్పుచుండు. ౭౧౨

సీ. స్నానమొనర్ప నుష్ణజలంబునాకిచ్చు
శీతలోదకమిడుఁ జెలియయతని
కింపైనపెరుఁగు నా కింతి వడ్డనసేయుఁ
దక్రంబువోయు నత్తపసి కతివ
శయ్య గల్పించుఁ బ్రశస్తమ్ముగా నాకు
నాతని కొకభంగి నలవరించు
సొగసుమేల్ చూపులఁజూచు నన్ బేర్మిమైఁ
జూడ దారీతిగా సుదతి యతని
గీ. నెల్లయుపచారముల నిట్లు లేకరీతి
మాని తనుఁ గొంచెపఱుచుట మాని గాంచి
సందియము నెమ్మనమ్మునఁ బొందుపడఁగ
నన్నుఁ గని యిట్టులను మంతనమ్మునందు. ౭౧౩

ఉ. భోజనమజ్జనాదుల నపూర్వపుఁగృత్యములన్ మనోభవ
శ్రీ జనియింపఁజేసెడి విశిష్టవిలాసముల న్నినుం గనున్
రాజతనూజ యక్కరణి నన్ గనకుండెడి నిన్ వరింపగాఁ
నాజలజేక్షణామణికి నాస్థ జనింపఁగఁ బోలు నద్దిరే. ౭౧౪

వ. నీ మనమ్మును నత్తలోదరియందు లగ్నంబకాఁ గనుపట్టెడి.

క. మనమనములఁ గలసంగతు
లనయము చెప్పికొనవలయు నం చప్పు డొన
ర్చినసమయము మఱవంగాఁ
జనునే! సత్యము వచింపు సందియమేలా? ౭౧౬

ఉ. నావుడు లజ్జమెంపు వదనమ్మును వంపఁగ నెట్టకేలకుఁ
భావము డాఁపరామి నిటు పర్వతుతో వచియించితిఁ మునీం
ద్రా! విను మీలతాంగి నను నాథునిఁగా మదిఁగోరె నట్లనా
కీనళనాక్షియందు రమియించె మనం బిఁక డాఁప నేటికిఁ.

వ. అనుమాటలకుఁ బర్వతుండు గోపాకులుండై నన్నుం గాంచి సమయోల్లంఘనం బొనర్చి నన్ను వంచించితివి గాన వానర వక్త్రుండవు కమ్మని శపించె ననుపదంబ యేనును నోర్పు లేమిఁ దాదృశుండనై యిట్లు ప్రతిశాపం బిచ్చితి. ౭౧౮

గీ. స్వల్పమగు నపరాధంబు సైఁప కిట్లు
శాప మిచ్చిన నీ కిఁక స్వర్గవాస
మెడలి మర్త్యమ్మునన వసియించుటబ్బు
ననుడు శాపోపహతి నేగె నతఁడు దరలి. ౭౧౯

క. వానరవక్త్రుఁడనై పీ
ణానినదం బొప్పఁ జేయు నన్నుంగని యా
మీనేక్షణ గానాదర
మూనుటఁ దా వైమనస్య మూనదు వింటే. ౭౨౦

గీ. అనిన నిట్లంటి నేను నో మునివరేణ్య
సుందరాస్యుండ వెల్లితి సుదతి నిన్ను
నేగతి వరించెఁ బర్వతుఁడేడ కేగె
సంగమం బెట్లుచెల్లెఁ జెప్పంగఁదగదె. ౭౨౧

క. నావుడు నారదుఁ డను వ్యా
సా! విను మాయాచరిత్ర మతిగహనము కా

దే వారింపఁ దరంబే
యేవారికినైన నెందు నేనియుఁ దలఁపన్. ౭౨౨

వ. అట్లు మద్భాగినేయుండగు పర్వతుండు శప్తుండై యరిగిన నే నత్యంతదుఃఖితుండనై యటనుంటి; నక్కన్నెమిన్న యథాపూర్వ మ్మగ మత్సేవాపరాయణయై యుండెఁ బిదప నత్తలోదరికి వివాహంబొనర్ప నెంచి సంజయుండు మంత్రి కిట్లనియె. ౭౨౩

ఆ. వె. వరుని రూపవంతు వరగుణసంపన్ను
సుకులజాతు ననఘు శూరునొకని
జూడు మీ లతాంగి సొగసున కనుగుణుఁ
డైన వానిఁ బెండ్లి యాచరింతు. ౭౨౪

వ. నావుడు మంత్రి "రాజా! తాదృశులగు రాకొమరు లనేకులుగల రందు నీ కెవ్వండు నచ్చు నక్కుమారుం దెచ్చి కన్యాదానంబు విధిచోదితంబుగ నొనర్చి కృతార్థుండవగు" మనుడు సంజయుండు తదన్వేషణాయత్తచిత్తుండై యున్నంత దమయంతి యంతయు ధాత్రీముఖమ్మున విని తనమనోరథం బద్దానికిఁ దెలిపిన నయ్యది నృపాలు పాలికిం జని తద్వచనమ్ములుగా నిట్లనియె. ౭౨౫

మ. జనకా! నారదునిన్ వరించి యితరేచ్ఛాశూన్యనై నన్ను న
న్యుని కీ నెంచకు నక్రిశూన్యమయి సంతోషప్రదంబై రసం
బున నక్షారత నొప్పి మీనముల కిమ్ముం గాక నిర్దుష్టతం
దనరున్ దన్మహతీనినాద మనుసంద్రిం; బొందు నే మున్గితిన్.

వ. అని దమయంతి విన్నవింపఁ బనివిని నను నృపాలుండు సమీపమ్మున నున్న తన భార్యయగు కైకేయిం జూచి, ౭౨౬

గీ. ధాత్రి చెప్పినమాటలు తరుణి వించె
వరునిఁగా నెట్లుగోరె నవ్వానరాస్యుఁ
గోరెఁగా కెట్టు లీఁదగుఁ గుటిలరూపుఁ
డాతఁ డెటుదగు మన దమయంతి కకట. 228

వ. బుద్ధిహీనతం జేసి కన్నియలకుఁ గార్యాకార్యమ్ములు తెలియ కుండిన వారించుట మనకుఁ గర్జంబగుట నీవు భిక్షుకుం డతఁడని చెప్పి బోధింపు మనవుడుఁ గైకేయి మంతనమ్మునఁ బుత్రి కిట్లనియె. 229

చ. లత కెనవచ్చి యెక్కుడు తళత్తళఁబొల్చెడి నీదుమేను, రూ
క్షతనుఁ డతండు భస్మమును సారెకు మెత్తుటఁజేసి సుందరం
బతివ! భవన్ముఖం, బకట! యాతఁడు గోతిమొగమ్మువాఁడు స
మ్మతుఁడెటులాయె నారదుఁడు? మాటలపొందిక కోతికొప్పునే.

క. నరులకు వానరులకు నె
క్కరణిన్ మాటలు పొసంగుఁ? గాకతఁడు సదా
తిరుగన్ భిక్షుకుఁడై యా
దర మెటు నీ కబ్బె నిట్టి తాపసు మీఁదన్. 231

ఉ. అందము గోరుఁ గన్నె; నృపులందరి పోల్చ లతాంగి యిట్టి నీ
మందత కేమి యందు! మతిమాలిన నీకయి కుందె రాజు, సొం
పుందగు మాలతీలత బబూలనగోపరి లగ్నమైన దా
నిం దిలకించి ఖేదములు నెక్కొనకుండెడి వార లుందురే. 232

క. మృదుతాంబూలీదళముల
నెద నుష్ట్రమ్మున కొసంగ నెవఁ డొప్పెడి? నా
రదుచేతఁ బడ్డ నిరుఁగని
ముదితలు నవ్వరె వివాహమున నాతల్లీ. 233

వ. అని పలుతెఱఁగుల బోధించు తల్లికి గానరసకోవిదయగు నద్దమ
యంతి నాయెడఁ గృతనిశ్చయయై యిట్లనియె. ౭౩౪

క. మొగమును సామ్రాజ్యమ్మును,
సొగసును ధనమేల శుద్ధశుంఠకుఁ దల్లీ!
మొగమును సామ్రాజ్యమ్మును
సొగసును ధనమేల రసవశుం డీతనికిన్. ౭౩౫

క. గానరసమ్మున హరిణులు
మే నెఱుఁగక ప్రాణ మిచ్చి మేల్ వడయ నిసీ
మానవులు గొంద ఱీరస
మానంగాలేరు జన్మమది యెందులకో. ౭౩౬

గీ. అరయ సప్తస్వరాత్మిక మైనవిద్య
నెఱుఁగు నారదముని చంద్రుఁ, డెఱుఁగు హరుఁడు
వ్రేలు మడఁచి వచింపఁగ వేఱొకండు
గానఁగా రాఁడు మూఁడులోకముల నెందు. ౭౩౭

చ. ధనమును రూపమున్ మిగుల దర్పము గల్గి రసజ్ఞభిన్నుఁడౌ
జనవరు గర్వధూర్వహు వెసన్ వరియించి తదీయమైత్రి నె
క్కొను చెలికిం బ్రతిక్షణ మగున్ మరణంబు, రసజ్ఞుఁడైన ని
ర్ధనుని వరించి తాఁ బ్రతిపదమ్ము ముదమ్మున నుండ నయ్యెడిన్.

గీ. మూర్ఛనాజ్ఞాన భేదమ్ము మొట్టమొదటి
కరసి స్వరవేదియై గ్రామ పరిచితిఁ గని
యష్టరసవేత్తయగు నరుం డంగవికలుఁ
డయ్యు నానంద మొనఁగూర్చు నంగనలకు. ౭౩౮

క. స్వరవేత్తయైన గాయక
వరుఁ డిడుఁ గైలాససుఖము వమ్మగ మూర్ఖుల్
సురనదికి సరస్వతికిం
దిరుగుదు రీరస మొకింత దెలియనికతనన్. ౭౮౦

క. స్వరభేద మెఱిఁగి నేనియు
నరుఁ డయ్యును నతఁడు దేవనాథుఁడ దానిం
బరిశీలింపఁడయేనిన్
సురనాథుం డయ్యుఁ బశువుసు మ్మతఁ డంబా. ౭౮౧

గీ. మూర్ఛనాతానసమ్మోహమున మనమ్ము
గరఁగు హరిణులు పశువులు గావు సూవె
దాని విని సంతసంబునందని నరుండు
తల్లి ! ప్రత్యక్షపశువు తథ్యముగ వినుము. ౭౮౨

క. వినఁ జెవులు గలిగి మోదం
బెనయని యరసికులకన్న నెంతే మోదం
బును గానరసముకతనన్
గను నశ్రోత్రములు మేలు కాకోదరముల్. ౭౮౩

క. గానంబువినికి పశువుల
నానందరసాబ్ధి నోలలాడించెడి న
ద్దాని వినఁ బెద్ద లాదర
మూననిచో వారిజన్మ మొకజన్మంబే. ౭౮౪

చ. తెలియఁడు గాక నారదు నుదీర్ణగుణమ్ములు రాజు ; ముజ్జగం
బులఁ గలఁడే యొకం డతనిఁ బోల్పఁగ గానమునందుఁ? బూర్వమే
వలచినదాన నమ్మునిని ; వానరవక్త్రము శాపకారణం
బలవడి నేఁడు వచ్చె నెటులైన నతండు ప్రియుండు నాకగున్.

క. తురగాస్యులు గారే కి
న్నరులెల్లరు వారిఁగాంచి నరుఁడెవ్వఁడు గా
నరసజ్ఞుఁ డాదరింపఁడు!
మురువందియు విద్దెలేని మొగమేమిటికిన్. ౭౮౬

వ. అమ్మునిమెట్టిదైన నాకుం బ్రియుం డతనిఁదక్క వేఱొక్కని మదనుండైన నే నొల్ల ననియు నాగ్రహమ్ము ద్యజియించినన్న మ్మునికిచ్చి వివాహం బొనర్పు మనియు నీ వరిగి మజ్జనకునకు బోధింపు మనుడుఁ గైకేయి భర్తకడ కరిగి కడచిన వృత్తాం తమ్ము విన్నవించిన నతండును నా కొసఁగ నంగీకరించి వివాహ సంభారమ్ము లొనర్చి విధివిధానంబుగఁ బెండిలియొనర్చెఁ; బిమ్మట వానరవక్త్రుండ నగు కతన దండహ్యామానంబగు మన మ్మతో నచ్చటన యుంటి నక్కన్నియ నన్ను సేవింప నేతెంచి నప్పుడెల్ల మన్మనంబు శోకమగ్నంబగు, నా వైరూప్యమ్మునకు దమయంతి యించుకేనియు శంకింపక సంతసమ్మునం బొదలు నిట్లు కొంతకాలం బరుగుమీఁదఁ బర్వతుండు నానాతీర్థమ్ములు సేవించుచు ధరణినెల్లెడఁ గ్రుమ్మరి మగుడ నన్నుఁ జూడ నేతెంచి నాచే సన్మానితుండై యాసీనుండై నన్నుం గృతదారు వానరాస్యుఁ జింతావిష్టుఁ గాంచి యత్యంతదుఃఖితుండై మేన మామనగు నాయెడ దయ గలిగి యిట్లనియె. ౭౮౭

గీ. కోపమున మున్ను శాపమ్ము గొంక కిడితి
నిపుడు నిష్కృతి నొనరింతు నీ నృపాల
పుత్రికై కరుణించితిఁ బూర్వరీతి
సుందరాస్యుండ వగుము మత్సుకృతపటిమ. ౭౮౮

వ. అంత నేనును నతని కిట్లంటి నీ శాపమ్మునఁ గలుషితచిత్తుండనై శపించితి నిపుడు ప్రసన్నుఁడనై నీకు శాపమోక్షం బొనర్చెద నెప్పటియట్ల నీకు స్వర్గగమనం బలవడుఁగాక నావుడుఁ బర్వతుండు సంతుష్టుండై తనంత నరిగెఁ, బదపడి రాజపుత్రి పట్ట రాని సంతోషమ్మునఁ దల్లికడ కరిగి యిట్లు విన్నవించె. ౨౪౯

గీ. మాత ! నీదుజామాతకు మగుడ సుంద
రాస్యత ఘటిల్లెఁ బర్వతుం డాగ్రహంబు
విడిచి శాపమ్మునకు ముక్తి నుడువుకతన
ననుడు భర్తకుఁ జెప్పె నయ్యతివ యరిగి. ౨౫౦

వ. పిమ్మట సంజయుండు తద్వచనశ్రవణంబున సంతుష్టుండై సమంత్రి పురోహితమ్ముగా నాకడ కరుదెంచి పారిబర్హంబొసఁగి మద్భాగినేయునకుఁ దగుధనం బిడి గారవించె. ౨౫౧

క. ఏరికినైనఁ గలదె సం
సారమ్మున సౌఖ్య మెట్టి జ్ఞానులకుఁ మా
యారచన దాఁట శక్యమె
యూరయు మిది యెల్ల నాకు ననుభవమయ్యెన్. ౨౫౨

గీ. కామమును గ్రోధమును నహంకారము మద
మత్సరంబులు లోభంబు మమత యివి య
హీనబలములు వీని జయించు నెవఁడు
త్రిగుణహేతుకమై యొప్పు దేహ మొంది. ౨౫౩

వ. వినుము మున్నొక్కనాఁడు విష్ణువుతో వనమ్మున నేగుచు హాస్య వినోదమ్మున నమ్మహాత్ముకతన నేను స్త్రీరూపమ్ముగని మాయా బలమోహితుండ నగుటంజేసి యొకరాజునకుఁ బత్నినై యనేకులఁ గొమరులఁ గంటి నావుడు నే నిట్లంటి. ౨౫౪

ఉ. నారద సందియంబు వోఁడు నామదిఁ దోఁచెడి జ్ఞాని వైన నీ
వే రహిఁ నారివైతి ? సుతు లేన్నృపుసంగతి నుద్భవించి ? రీ
పూరుషభావ మెక్కరణిఁ బొందితి పిమ్మట ? మాయ యెంతకు
న్నేరదె ! తన్మహాత్త్వము గణింపఁ దరంబె వచింపు నావుడున్.

—* నారదుడు స్త్రీ యయి సంతతిం గనుట *—

వ. నారదుండిట్లను దేనికతన బ్రహ్మాదిస్తంబపర్యంత మీజగంబు పరిభ్రమించుచుండు నమ్మాయ దుర్విభావ్యయు నజయు యోగి దుర్జ్ఞేయయు నని యెఱుంగుము. ౨౫౬

గీ. సత్యలోకమ్మునుండి సుస్వరము సామ
గానము నొనర్చికొంచు నేఁ గదలి విష్ణు
దర్శనాకాంక్ష నెమ్మదిఁ దవిలి యరిగి
సకలలోకమ్ములును జేర్మి సంచరించి. ౨౫౭

శా. శ్వేతద్వీపమునందుఁ గౌస్తుభమణిశ్రీరాజితోరస్థ్సలున్
బీతద్యోతిపటున్ మహాత్ము గరుణాబ్ధిన్ శంఖచక్రాదికో
పేతున్ బాహుచతుష్కభాసురు జలస్ఫీతాంబుదశ్యాము ల
క్ష్మీ స్మేతస్వసహాచారిఁ గంటి నతులక్రీడాఫరున్ శ్రీహరిన్.

ఉ. ఆతనిభార్య రూపవరయౌవనగర్వితసింధుజాత భూ
షాతతిభాసమాన ననుఁ జక్కటిఁగాంచి గృహమ్ములోనికిన్
వే తరలెన్ బదంపడి కవిప్రవరేడ్య రమేశు మ్రొక్కి శం
కాతిగమైన చేతమున నమ్మధువైరికి నిట్లు వల్కితిన్. ౨౫౮

క. విటుఁడనొ ధూర్తుండనొ నే
జటిలుఁడ జితమాయుఁడన్ బ్రశస్తహృదయుఁడన్

దటుకున నను(గని చనె నీ
కుటిలాలక యిట్లొనర్ప(గూడునె యెందున్. ౭౬౦

వ. నావుడు గర్వధూర్వహమ్ములగు మద్వచనమ్ములకు(గనలక వీణాలాపమధురమ్ములగు వచనమ్ముల నద్దేవుండిట్లనియె. ౭౬౧

క. పతి(దక్క నన్యసన్నిధి
సతి నిలువందగదు నీతిచందం బిది యే
మతిమంతులైన మాయా
గతికిన్ లో(బడక యుండ(గా(గలరె మునీ. ౭౬౨

క. జితమారుతులున్ సాంఖ్య
స్థితివేత్తలు నైన మునులు దేవతలును ద
ద్గతులగుచు నుండ, మాయా
గతి గీతజ్ఞునకు నీకు(గడవ(దరంబే. ౭౬3

గీ. ఏను బ్రహ్మయు శివుడును నిద్ధతేజు
లైన సనకాదులును దదధీను లకట
దేవతిర్యఙ్మనుష్యాది దేహధారు
లం దెవ్వడు(దా(టు సమ్మాయ నజ నమేయ. ౭౬౪

వ. వేదవిదులొండె యోగవిదులొండెo ద్విగుణమయదేహధారుల కాని యన్యులుకారు. తాదృశుల కేరికిని నయ్యది జయింప వశము కాదని యెఱు(గుము, మఱియు రూపహీనమ్మును స్వరూపకారియునగు కాలమ్ముగూడ(దదాత్మకమ్మౌ నెఱుంగునది.

ఉ. కాలవశమ్మునన్ వఱలు జ్ఞానియు మూర్ఖు(డు మధ్యముండు న
క్కాలము సేయు ధర్మరతు(గా వికలాత్ముని(గా(దదన్యు(గా

శీలమొ కర్మమో యిటులుచేయుటకుఁ మఱి యన్య మెద్దియో
మూల మెఱుంగరా దఖిలమోహనమై తగుఁ గాల మెయ్యెడన్.

వ. అని చెప్పి యమ్మహామహుండు విరమించుటయు నేను విస్మయా
విష్టుండనై మహాత్మా! మాయ యనంగ నెట్టిది? దాని బలం
బెంత? రూపం బెట్లుండు? నది యెట వసించు? దేనికాధారం
బగు? నానతిచ్చి నాకు సద్దాని నగుపడంజేసి యనుగ్రహింపు
మనవుడు రమేశుం డిట్లను, "సయ్యది త్రిగుణయు నఖిలాధారయు
సర్వజ్ఞయు సర్వసమ్మతయు నజేయయు ననేకరూపయునై జగం
బఖిలంబును వ్యాపించియుండు. ౭౬౭

ఆ. వె. దానిఁ జూడ నభిమతంబేని గరుడు నా
తోడ నెక్కి యిపుడ తొలఁగి చనుద
మజతనూజ! మాయ నరయంగఁ జేసెద
దానిఁ గాంచి ఖేద మూన వలదు." ౭౬౮

వ. అని వినతాసుతుని సంస్మరించిన నతండు సన్నద్ధుండై యరుగు
దెంచెఁ, బదంపడి యిరువురమును నతని నధిష్ఠించిన నాగరుత్మం
తుండు వాయువేగమ్మునఁ గదలి హరిప్రేరితుండై వైకుంఠమ్ము
విడిచి, ౭౬౯

క. పురములు వనములు నదులున్
ధరములు మునిపల్లెలున్ హ్రదమ్ములు మాకుం
గర మానంద మొసంగఁగఁ
దిరిగితిరిగి యాతఁ డొక్కదేశము చేర్చెన్. ౭౭౦

మ. అటఁ గన్గొంటిమి కాన్యకుబ్జ మనుపేఁ; డాపోలికిం జేరువన్
దటరాజద్వివిధాగమంబు కమలాధారంబు నానావిధో

తకటవర్ణస్వరభాస్వరాండజసముద్యన్మధ్యభాగంబు సం
ఘటితానందము స్వచ్ఛనీరము తటాకం బొండు గానంబడెన్.

వ. అయ్యెడ శ్రీహరి నా కిట్లనియె. 222

క. నారద ! కనుఁగొంటివె క
ల్హారచ్ఛన్నంబు సారసారావరసో
దారంబు స్వచ్ఛనీరం
బై రంజిలు నీతటాక మపరిమితమై. 223

వ. అని పలుకుచు మందస్మితకందళితముఖారవిందుండై నా చిటికెన
వ్రేలు పట్టికొని స్నిగ్ధచ్ఛాయంబగు తత్తటమ్మునకు డిగి సరోవ
రంబు పొంత దృష్టి నిగుడ్చి మరల నిట్లనియె. 224

క. అరసితె సాధులచిత్తము
కరణిన్ స్వచ్ఛమ్ము లగుచుఁ గ్రాలెడిఁ గంజా
తరజస్సారభపరిచితి
సురుచిరములు జలము లిందుఁ జూపఱు వొగడన్.

వ. ఈ సరోవరమ్మున స్నానం బొనర్చి పిదపఁ గాన్యకుబ్జపురమ్ము
వీక్షించి యరుగుదము, మొదల నీవు స్నాతుండవు గ మ్మను
పదంబ యేనును నొనర్చెద నావుడు వీణయు మృగాజినమ్మును
నొక్కెడ నుంచి తీరమ్మునకుం జని పాదప్రక్షాళనం బొనర్చికొని
కరంబులు గడిగి శిఖాబంధం బొనర్చి కుశలు ధరించి కృతాచమ
నుండనై లోనికిండిగి స్నానంబు సలుపునంత, 226

క. హరి చూచుచుండ నాకుం
బురుషాకారంబు వోయి భామణకాంత్యు

ద్ధురమై స్త్రీరూపము కర
మరుదుగ సంప్రాప్తమయ్యె నదియే నెఱుఁగన్. ౨౨౭

వ. అంత హరి నాకృష్ణాజినమ్మును వీణయుం బుచ్చికొని గరుడు
నెక్కి యొక్క క్షణమ్మునన తనభవనమ్మున కరిగె. ౨౨౮

క. వ్యాసా యేమని చెప్పుదు
నాసంగతి వీణయున్ మృగాజినమున్ శ్రీ
వాసుఁడును స్మృతికిఁ దగులరు
కాసారము వెడలి తటము గనుఁగొను నాకున్. ౨౨౯

శా. ఆలీలన్ జెలినై సరోవరతటంబందుండి నల్దిక్కులున్
బోలం జూచెడివేళ భృత్యులు గజమ్ముల్ గుఱ్ఱముల్ తోడ రా
నాలస్యం బొకయింత లేక యరదం బాదిక్కు రా నిచ్చి నన్
దా లౌల్యం బడరన్ గనుంగొని యనున్ దాలధ్వజుం డొప్పుగన్.

క. నరసుందరివో ? సురపం
కరుహాక్షివొ ? నాగకన్యకామణివో ? కి
న్నరమత్తకాశినివొ ? యెం
టరివై యిట్లుంటి వక్కటా ! గజగమనా. ౨౩౧

క. బాలవు యౌవనరూపవి
శాలవు నినుఁజూచి మనము చంచలమై రా
గాలోలమయ్యెఁ బెండిలి
కాలేదే నీకు నిజముగాఁ దరళాక్షీ. ౨౩౨

ఉ. ఏమిటి కీ సరోవరము నెల్లెడఁ గన్గొనె దోలతాంగి ? నీ
కై మరు లూనినాఁడ నను నారసి చేకొని పెర్మి మీఱ ని
స్సీమసుఖమ్ములం బడయఁ జెల్లదె యింత యనాదరంబె నా
గా మహిపాలసూను నటఁగాంచి వచించితి లజ్జపెంపునన్.

క. నీ యిచ్ఛవచ్చినట్టుల
న్యాయగతి న్ననున్నుఁ జూడు నావుడు నృపుఁ డ
త్యాయతమగు ప్రేమమ్మున
నాయనురాగం బెఱింగి నరయానమ్మున్. ౭౮౪

వ. తెమ్మని భృత్యుల నియోగించిన వారలు చతుర్వాహ్యమ్మును మృద్వాస్తరణ సంయుతమ్మును కౌశేయాంబర వేష్టితమ్మును ముక్తాజాలవిభూషితమ్మును చతురశ్రమ్మును సువర్ణఖచితమ్మును విశాలంబును మనోహరంబునునగు శిబికం దెచ్చిన నద్దాని నధిరోహించి యా రాజమన్మథు వెనువెంటఁ దత్పురమ్మున కరిగి శుభలగ్నమ్మున నగ్నిసాక్షికంబుగ నతనిచే వివాహితనై సౌభాగ్యసుందరి యను నామమ్మున నొప్పి యతనికిఁ బ్రాణమ్ముల కెక్కుడై సంభోగసుఖమ్ము లొనఁగూర్చుచుంటి. ౭౮౫

ఉ. ఆ నృపుఁ డెల్లకార్యములయం దపరక్తి వహించి మించి యు
ద్యానములందు దీర్ఘికలయందు గృహమ్ములయందు వారుణీ
పానమనస్కుఁడై రతులతోఁ దులఁదూఁగుచు రాత్రియుం బవల్
తా నెఱుఁగంగలేక పరతంత్రిత వర్తిలు నా కధీనుఁడై. ౭౮౬

శా. వ్యాసా! యేమనిచెప్పవచ్చు విను మాయాచాకచక్యంబు క్రీ
డాసక్తిన్ దగులొందునా కడఁగె బ్రహ్మజ్ఞానపుంభావవి
శ్వాసంబుల్ మఱి "యేన పట్టమహిషిన్ సర్వంబు నాసొమ్ము నా
కేసాధ్వీమణు లీ" డటంచు మది నెంతేఁ దాల్తు గర్వాంధతన్.

గీ. ఇటు లహర్నిశ మాభూపు నెనసి ద్వాద
శాబ్దముల్ కామకేళీవిహారములను
గొనఁగ నంతట వేఁకటి యనుఘటించె
పార్థివోత్తముఁ డానంద వార్ధి మునుఁగ. ౭౮౭

క. చూలాలినైన నను భూ
పాలుఁడు దగ బుజ్జగించి " బాలరో ! నీ కెం
దే లోలత" నాఁ జెప్పం
జాలక లజ్జాభరం బశక్యమ్మగుటన్. ౭౮౯

క. పదినెలలు నిండఁ గంటి శు
భదినమ్మున నొక తనూజుఁ బార్థివుఁ డానం
దదశఁ దగి యుత్సవం బ
భ్యుదయంబునఁ జేసె నింగి భూమియు ముట్టన్. ౭౯౦

వ. బ్రాహ్మణానుమతమ్మున నక్కుమారునకు వీరవర్మ యనునామమ్ము వెట్టి యానందసాగరమ్మున నోలలాడుచుండఁ బిదప రెండు సంవత్సరమ్ముల కిం కొక్కరుఁ గంటి, భూపాలుండు వానికి సుధన్వుండను నామం బిడియె. అట్లు క్రమక్రమమ్ముగ ద్వాదశ పుత్త్రులం గని మోహావశమ్మున వారల లాలించుచున్నంత మరల నెనమండ్రు కొమరు లుద్భవించిరి. ౭౯౧

క. నృపతికి నాకును గార్హ
స్థ్యపదవి సఫలంబటంచు దానం దోఁచెన్
రిపుశాసకు లీ కొమరుల
కుపయమ మొనరించె భూపుఁ డొక్కొక్కరికిన్. ౭౯౨

క. కొడుకులు కోడండ్రు న
క్కొడుకుల కొడుకులును వారి కులకాంతలు నే
ర్పడ నధికమై కుటుంబపు
గొడవ విశేషించె మదికిఁ గుతుకంబొదవన్. ౭౯౩

గీ. అంత నొకయెడ నైశ్వర్య మమరు, దుఃఖ
మొకక్కయెడఁ గల్గు సౌఖ్యంబు నొక్కయెడల

నెసఁగు, నొకఁడు గృశించుఁ బెంపెనయు నొకఁడు
పెద్దగేస్తుల కియ్యది విహితమకద. ౭౯౪

ఆ. వె. కొడుకులందు నట్ల కోడండ్రందు మ
నుమలయందు వారి ప్రమదలందుఁ
గలుగు నొక్కతఱిని గలహంబు లయ్యవి
తీర్పలేక నాకు దిగులు దగులు. ౭౯౫

క. బలవంతులు నాపుత్త్రులు
కులసంభవలెల్ల నాదుకోడండ్రు నా
కలిమికి వేఱొక కలుకుల
కలుములు సరియే యటంచు గర్వము ప్రబలెన్. ౭౯౬

గీ. ఇట్లహంకారమున మున్గి "యేను నార
దుండ నన్నిట్లు చేసె నప్పుండరీక
లోచనుం" డని యొక్కింత లోనఁ దలఁప
కెలమి సంసారసాగర మీఁదుచుంటి. ౭౯౭

అంతఁ గొంతకాలమ్మున దూరదేశంబునుండి యొక్కనృపాలుండు సైన్యసమేతమ్ముగ నక్కాన్యకుబ్జపురం బరికట్టిన నాకొమరులును మనుమలును రథవారణతురంగమపదాతిసమేతమ్ముగ రాజుతోడ నతని నెదుర్కొనినఁ దుములంబగు సంగరంబు ప్రవర్తిల్లె. ౭౯౮

క. ఆసంగరమున శత్త్రుల
చే సమసిరి కొమరులెల్లఁ జేయునదియులే
కాస మొదలి నరపాలుఁడు
తా సదనమ్మునకు వచ్చెఁ దద్దయు నార్తిన్. ౭౯౯

వ. నన్నుం గాంచి పుత్త్రపౌత్త్రులెల్ల శత్త్రునిహతు లగుటఁ దెల్పిన నేనును శోకంబు పట్టఁజాలక రణభూమి కరిగి, ౧౦౦

ఆ. వె. "కొడుకులార నాదుకడుపునఁ జిచ్చిడి
యడవి నిల్లుగట్టి యాత్మజాతు
లెల్లఁ దోడరాఁగ నేగంగఁ దగునె దు
ర్వారమైన దైవవశముకతన." ౧౦౧

వ. ఇట్లొడలెఱుఁగక నానావిధమ్ముల విలపించు నాకడకు మధుసూదనుండు వృద్ధవిప్రవేషమ్మున వచ్చి నన్నుం గాంచి యిట్లను.

ఉ. ఏల విచారమంద వినుమీ! భ్రమ గాక మఱెవ్వ రీసుతుల్
పోలఁగఁ జూడు నీవెవతెవో! యొక రొడ్లకు నేమిగావలెన్!
గాలవశమ్మునన్ మృతిని గాంచినవారల కింత యేల? యీ
జాలము మాని స్నానమును సల్పి నివాపకృతిం బొనర్పుమా.

క. పరలోకగతులకొఱకె
వ్వరు నింటం దానమాడవలవదు తీర్థం
బరిగి యటఁగ్రుంకులిడుటయు
మఱియాద సమస్తధర్మమార్గములందున్. ౧౦౪

వ. అని పలికి బంధుసహితమ్ముగా నన్ను వెంటఁ బెట్టికొని యమ్మహామహుండు పుంతీర్థంబను నొక్క సరోవరమ్మునకుఁ జేర్చి యోదార్చి యిట్లనియె. ౧౦౫

ఉ. స్నాన మొనర్పు మిచ్చట మనమ్మున నెవ్వరి కేడ్చుదాన వో
మానిని! యెన్నిజన్మములు మాటికి నెత్తితొ! భర్త లెందఱో!
సూనులుఁ దండ్రులున్ మఱియు సోదరు లన్యులు నెందఱైరో! స్వ
ప్నానుగతిం జెలంగు భవమందిటు భ్రాంతి వహించు టొప్పునే.

వ. అను నాతని ప్రేరణమ్మున నప్పురుషతీర్థమ్మున మునిఁగి తల యెత్తునంతకుఁ బురుషాకారుండనై తటంబున మహతియుఁ గృష్ణాజినంబును బూనియున్న కమలలోచనుం గాంచి, ౮౦౭

క. "ఏనారదుండ నన్నుఁ
శ్రీనాథుం డిట్లొనర్చె స్త్రీగా" నని నా
లోఁ నను కొనియెడి యాలోఁ
దా నిట్లను "రమ్ము నారదా తడవేలా." ౮౦౮

క. అను నాతని పలుకుల నో
డ్డునకుం దగ వచ్చి చూచుడుఁ వెనుకటి య
వ్వనితాత్వం బప్పటి పుం
స్త్వనిరూఢియు మఱపువచ్చె సకలము ననఘా. ౮౦౯

వ. అట్లు స్వస్వరూపంబు ప్రాపించి బ్రాహ్మణుండనై యున్న నన్నుం జూచి యానృపాలుండు విస్మయావిష్టుండై నాభార్య యిట్లు ముని యగుట కేమికతం బని యోజించుచు, ౮౧౦

ఉ. హా! యను, నన్ను వీడఁ దగవా పగవాఁడనె యోమృణాలబా
హా! యను, నెట్టులాఁగఁదగుఁ బ్రాణములిమ్మెయిఁ గాంచనాభదే
హా! యను, రాజ్య మేల నిను నందక వాక్యజితాంగజాతవా
హా! యను, మాట కుత్తరమునైన నొసంగవు నిస్పృహా? యనుఁ.

చ. వెనుకటిప్రీతి నాయెడల వెక్కసమాయెనె యిష్టు? లేక యి
వ్వనమున మున్గి మత్స్యములపాలయితో? వరుణుండు నాయదృ
ష్టనియతి నిన్ గ్రహించెనొ? విశాలవిలోచన! కృత్రిమంబు గా
దనఁదగు నీదుపేర్మి సుతులం; దటుగామి నిటుల్ ఘటించునే.

క. దీనుఁడగు పతిని విడిచియు
సూనులమెడఁ బేర్మి మిగులఁ జొప్పడుకతనన్
దానేగతి భార్యాపు
త్రానుగతికిఁ జెడితి నేమి యనుకొందు నిఁకన్. ౮౧౩

క. ఇటులైనను మృతి నాకున్
ఘటియింపద, దుఃఖ మెవరికడఁ జెప్పుదు న
క్కట! రాముఁడైన లేఁడు
ద్భటభార్యావిరహదుఃఖభర మతఁడెఱుఁగున్. ౮౧౪

క. సమచిత్తులు దంపతులొ
క్కట మొగిన్ మృతిఁబొందునట్లుగా నల్పుఁడ దై
వము; మునులొనర్చి రుపకా
రము శాస్త్రములందు సహమరణము సతులకున్. ౮౧౫

వ. అని బహుప్రకారంబుల విలపించు తాలధ్వజునకు మధుసూద
నుండు సయుక్తికమ్ములగు వచనమ్ముల నిట్లనియె. ౮౧౬

గీ. ఏల దుఃఖించెదవు నరపాల? నీదు
భార్య యేమాయె ధర్మంపుఁ బద్ధతులను
వినవె? బుధసేవ లేదె? యా వెలఁది యెవ్వ?
రీ వెవరు? యోగము వియోగమెట్లు మీకు. ౮౧౭

గీ. అధిప సంసారమను ప్రవాహంబునందు
నెవరి కెవ్వరు? రోదన మింతయేల
యింటికరుగుము నౌకపై నెక్కి దాఁటు
వారి చందంబుకాదె సంసారరీతి. ౮౧౮

క. నీకా లతాంగితోఁ దగ
నేకతమున రోగ, మెఱుఁగుదే నీవు నృపా!

యా కలికి తల్లిదండ్రిల,
శోకింపకు దైవచర్య చోద్యముకాదే. ౮౧౯

గీ. కాకతాళీపప్రసంగ మక్కలికిపొందు
గాన శోకంబువిడిచి వేగ గృహమేగి
కాలచోదితమైన భోగంబు గొనుము
వచ్చినట్టులయేగె నవ్వనరుహాక్షి. ౮౨౦

క. రోదనమొనర్చి నీ వీ
మోదం బేఁగలవె దాని; మేకొను యోగం
బేదియు దైవాధీనతఁ
గాఁదగు నద్దాని నాఁగఁగా శక్యంబే? ౮౨౧

గీ. కాలవశమునఁగల్గు భోగంబు దాని
కతనన యడంగు నద్ది యొకానొకప్డు
నిష్ఫలంబగు సంసార నీరనిధి ము
నింగి శోకింతురే? యిది నీక తగనె. ౮౨౨

క. ఘటికాయంత్రము వడువున
నటు నిటు సుఖ దుఃఖములకు నగుభ్రమణ మ్మొ
క్కట నునికి చొప్పడదు సం
కటపడకుము పురికి నేఁగగాఁదగు నింక

కాదేని రాజ్యమ్ము దాయాదాధీనం బొనర్చి వనమ్మున కరుగుము ప్రాణులకు మానవదేహంబు దుర్లభంబు క్షణభంగురంబగు నద్దాని నొందినవానికి నైట్లైన నాత్మసాధనం బావశ్యకంబగు.

క. పరికింపఁగ జిహ్వోప
స్థరసంబు సమస్తజంతుసాధారణమా

నరుల విశేషం బేమిఁక
సురుచిరమగు జ్ఞానగరిమ చొప్పడదేనిన్ ?

క. కాంతావిరహోద్భవమగు
వంతల్ విడనాడి గృహము చేరుము జగ మ
త్యంతము మాయామోహిత
మింతయు నద్దానికతన నే నీ కబ్బెన్. ౮_౨౬

వ. అను శ్రీహరి వచనంబుల నతండు గృహంబరిగి జ్ఞానసంపన్నుండై
సుఖంబుండె. నట్లు నృపాలుండేగిన పిదప నన్నుంగాంచి మాటి
మాటికి మందస్మితం బినుమడించు మధుసూదనున కే నిట్లంటి.

క. దేవా వంచన చేసితి
వీ వమ్మాయాబలంబు నెఱిఁగితి, నిపుడున్
భావమునఁ దోఁచు వనితా
భావమ్మున నే నొనర్చుపను లవియెల్లన్. ౮_౨౮

చ. మునిఁగితి నత్తటాకమున మున్గినయంతన యెట్లు నాకుఁ గ
ల్గెనో వచియింపు విస్మృతి ; మృగీనయనాకృతి చెందినప్పుడున్
మనమును దేహలింగములు మారెనె, యయ్యవికారక జ్ఞాననా
శన మగునెట్లు ! నాకుఁ గల సందియమియ్యది వాపు మచ్యుతా.

చ. నృపవరునిన్ వరించి యొకనేమము లేక యనేకభోగముల్
తపయు నహం బటం చెఱుఁగఁ జాలక పొందుచు మీఁద మద్యపా
నపుఁ గృతి సల్పుచున్ మెలఁగినాఁడ సతీమణినై మహాత్మ ! నేఁ
దపసిని నారదుండ నను తత్త్వ మొకింతయుఁ దోఁప దక్కటా.

క. ఇయ్యెడ సర్వము తెలియఁగ
నయ్యెడిఁ, గత మేమి యప్పు డటు లౌటకు ? నేఁ

దొయ్యాలినై సలిపిన కృతు
లయ్యారే! తలఁచికొనిన సత్యద్భుతమా. ౮౩౧

నావుడు జగదీశ్వరుం డిట్లను, మునీంద్రా! యిది యంతయు మాయావిలాసంబు గాఁ దెలియుము. సర్వజంతువులకును జాగ్రత్స్వప్నసుషుప్తితురీయంబు లను నాలుగవస్థలు కలవు; దేహాంతరప్రాప్తి యగునపుడు పూర్వజ్ఞానంబు నశియించుట కేమి సందియము. ౮౩౨

క. నిదురం జెందిన మనుజుఁడు
పదపడి యొక్కింత యెఱుక వడయఁడు పలుకం
డేది వచియించినఁ దెలియం
డది యెడలినమీఁద నెఱుఁగు నఖిలం బనఘా. ౮౩౩

మఱియు నిద్రావస్థయందు మనోభావమ్ము లనేకగతుల మాఱుచుండు నెట్లంటేని, ౮౩౪

గీ. మృతుఁడయిన తాత తనయింటి కేగుదేర
నతనితోఁగూడి భోజనం బాచరించి
తగు ప్రసంగం బొనర్చు నిద్ర నొకయప్డు
స్వప్నవశమున నిది యెంత సత్య మగునొ. ౮౩౫

ఆ. వె. స్వప్నమందుఁ దనకు జరిగిన దంతయు
మేలుకాంచి నుడువు మిథ్యయనుచు
నెవఁడుగాని యప్పు డెఱుఁగంగ నేర్చునే
భ్రమ యటంచు నింత పలుకుమయ్య. ౮౩౬

క. మాయాగుణవిలసన మది
యేమే యయ్యాల కెఱుఁగవచ్చు? నిది దుర్ఘట మ

శ్రేయజభవుఁ డేనును దు
ర్జ్ఞేయమ్మగుఁ దలఁతు మగ్గిరిశుఁడుఁ మానీ. ౮౩౭

గీ. తలఁప జగమంతయును గుణత్రయకృతంబు
లేదు సంసారమునఁ లవలేశమేని
గుణవిహీనపదార్థంబు గుణివరేణ్య!
యేను సత్త్వప్రధానుఁడ నెఱుఁగు మింత. ౮౩౮

వ. తక్కిన రెండును నాకు నుపసర్జనమ్ములుగాఁ దెలియు మొకప్పు
డును గుణవిరహితుఁడనై యుండ; నట్ల బ్రహ్మకు రజంబు
ముఖ్యంబు, సత్త్వతమము లప్రధానంబులు; హరునకుఁ దమంబు
ప్రధానంబు సత్త్వరజంబు లముఖ్యమ్ములని చెప్పి వెండియు,

చ. అగుణుఁడు నాకు నెయ్యెడల నారయరాఁడుమునీంద్ర! మోహముం
దగులకుమయ్య నాదుకతనన్ గనుఁగొంటివి కాదె మాయ, దా
ని గణనచేయ శక్యమగునే? యది చేసెడి వింతచేష్ట లో
కగతి నెసంగ కద్భుతముగాఁ గనుపట్టు ననేక భంగులన్. ౮౪౦

గీ. అని హరివచించె నని చెప్పె ననఘ నాకు
నారదుం డంత నేను నానంద మెసఁగ
మరల నాతని నడిగితి మాధవుండు
మగుడ నీకేమి చెప్పి యరిగెనో చెపుమ. ౮౪౧

వ. అనవుడు నారదుం డిట్లను నట్లు బోధించి గరుడు నెక్కి తన
నివాసమ్మున కరుగుచు నన్నుం గాంచి యిట్లనియె. ౮౪౨

క. నాతో వైకుంఠమ్మున
కేతెంచెదొ? లేక నీ యథేచ్ఛ నరిగెదొ?

వే తెలుపుమన్న నరిగితి
నాతని యాజ్ఞ గొని సరసిజాసనుకడకున్. ౮౪౩

గీ. అరిగెఁ దనయంత వైకుంఠ మబ్జనేత్రుఁ
డేను జరిగిన వృత్తాంతమెల్ల దలఁచి
కొంచుఁ జింతాతురతఁ దలవంచియుండఁ
దండ్రి యిట్లనె ననుఁగాంచి దయఁ దలిర్ప. ౮౪౪

క. ఎక్కడి కేగితి ? చింత
న్నెక్కొనఁ గతమేమి ? తెల్పు నీ కస్వాస్థ్యం
బెక్కడిది ? యెవరి వంచనఁ
దక్కితి ? వేయద్భుతం బొదవె నేమార్గున్. ౮౪౫

వ. నావుడు నే నిట్లంటి, మహాత్మా ! విష్ణునిచే వంచింపంబడి స్త్రీత్వం బంది యందు ననేకవర్షములు పుత్రశోకాదిదుఃఖమ్ము లనేకమ్ము లనుభవించి మరల నతనిచే బోధింపఁబడి సరోవరస్నానం బొనరించి పురుషుండ నైతి నిమ్మాయాబలం బెట్టిదో యెఱుంగ నలవి కాకున్నయది. తజ్జన్మమ్మున నాకుఁ బూర్వజన్మవిజ్ఞానం బింతయుఁ గనుపట్టకుండె, దీని నెట్లు జయింపనగు నని యోజింతు నీ వెట్టిదాని జయించి మించితో నా కాయుపాయంబు తెలుపుము నావుడుఁ జతురాననుం డిట్లనియె. ౮౪౬

వ. హరిహరులున్ సురాసురులు నన్యులు మానులు నేను మాయనై ఖరి నొకయించుకేనిఁ గనఁగాఁ దగువారము కాము శోకముం బొరయకుమయ్య యయ్యది విమోహితులం బొనరించు నందటన్ గరము సృజించి పెంచును జగం బడఁగించు నొకింతలోపలన్.

క. జనకుండిటు బోధించినఁ
జనుదెంచితిఁ దీర్థయాత్ర నలుపుచు నిట కీ

వును గౌరవనాశన సం
జనితము దుఃఖంబు మఱచి స్వస్థతఁగనుమా. ౮౪౮

క. కృతకర్మము లనుభవగతి
న తఱుఁగు నీ కేల మనమునఁ జింతఁగొనన్
ధృతిఁ గాల మిచటఁ గడపుము
గతమునకుం జింత సేయఁగాఁ దగ దేరన్. ౮౪౯

వ. ఇట్లు నాకు బోధించి నారదుం డరిగెఁ; బిమ్మట నే నాసారస్వత కల్పమ్మునఁ దత్సరస్వతీతీరమ్మున నుండి యీ భాగవతమ్ము గాల క్షేపార్థం బొనర్చితి. ౮౫౦

క. ఇది నానాఖ్యానయుతం
బిది సంశయనాశకారి యియ్యది మోక్షా
స్పద మిది వేదప్రామా
ణ్యదమై తనరారు వినుము నరనాథమణీ. ౮౫౧

గీ. దారుమయమైన పాంచాలిఁ దనదుకరము
నందుఁ గొని యైంద్రజాలికుం డద్భుతముగ
నర్తనంబొనరించుచందమ్మున జగము
నెల్ల నాడించు మాయ యో నృపవరేణ్య. ౮౫౨

వ. సదేవాసురమానుషంబగు నీ జగంబు బ్రహ్మాది స్తంబపర్యంతమ్మును బంచేంద్రియయుక్తమ్మును మనశ్చింతానువర్తనంబును నని యెఱుంగునది. సకలమ్మునకును మాయాసముద్భవమ్ములగు గుణమ్ములు కారణంబు లయ్యవి భిన్నభిన్నస్వభావమ్ములు. కారణగుణమ్ములు కార్యమ్మున సంక్రమించుట శాస్త్రసమ్మతం బగుటఁ బురుషుం డెల్లప్పుడును దద్యుక్తుండ కా నెఱుంగుము తంతు

రహితంబగు పటమ్మును మృద్విరహితంబగు ఘటమ్మునుంబోలె దేవతిర్యఙ్మనుష్యాదుల నొక్కెడ నేనిఁ ద్రిగుణరహితుండు కల్డు.

క. శ్రీనాథహరవిరించులు
భూనాయక ! త్రిగుణయోగమునఁ బ్రీత్యప్రీ
త్యానందశూన్యతలఁ దా
మూనుదు రెల్లప్పు డింతయును నిక్కముగన్. ౬౭౪

వ. బ్రహ్మ సత్త్వగుణసంపన్నుండగు నెడ శాంతుండై సమాధిమంతుండై సర్వభూతములయెడఁ బ్రీతిగలిగి వర్తించు, నంత సత్త్వం బెడలి రజం బావరించిన నెల్లెడలఁ బ్రీతిమాని ఘోరరూపుఁడై యుండు, నట్ల తమోగుణావిష్టుండై విషాదయుక్తుఁడును మూఢుఁడును నగు; హరిహరులును నిట్టిరయని యెఱుంగుము. ౬౭౫

ఆ. వె. చంద్రసూర్యవంశసంభవులగు రాజ
వరులు మనువు లెల్లసురలు నరులు
గుణము లనుసరించి గొనకొని చరియింతు
మాయఁబడనివాఁడు మహిని లేఁడు. ౬౭౬

క. భూనాథ ! దేహి మాయా
ధీనతఁ బరతంత్రుఁడగుచుఁ దిరుగున్ సంవి
త్తై నెగడెడి పరతత్త్వం
బే నెల వమ్మాయ కనుచు నెఱుఁగుము పేర్మిన్. ౬౭౭

వ. సంవిదూపిణియగు పరమేశ్వరి స్వాయత్తంబగు నమ్మాయ నెల్లప్పుడు జీవంబులపైఁ బ్రేరేపుచుండు. ౬౭౮

క. కావున మాయాయుత న
ద్దేవిన్ ధ్యానించి మ్రొక్కి తేఁకువకలిమిన్

భావించి పూజ చేసిన
కోవిదులకు ముక్తి గల్గుఁ గురుకులతిలకా. ౧౯౯

క. తనుఁ గొల్చెడివారలపై
నెనరునఁ దనమాయ నడఁచి నిఖిలేశ్వరి ము
క్తి నొసంగఁ జాలు శుభదృ
ష్టినినిగుడఁగఁజేసి ప్రోచు శీఘ్రముగ నృపా. ౨౬౦

క. భువనంబు మాయ దానికి
శివదాయిని శక్తి రాజ్ఞి, చెల్లుం దానన్
భువనేశి యనెడి నామం
బవితథముగ నప్పురాంబ కాగమహితమై ౨౬౧

ఆ. వె. ఆపెయందుఁ జిత్త మమరినవానికి
నవనినాథ సదసదాత్మకంబు
మాయకతన నేయుపాయంబు గల్గు న
ద్దాని నడఁపవలయుఁ దవిలి మొదల. ౨౬౨

గీ. సచ్చిదానందరూపిణి సకలజనని
దక్క, మాయ నడఁప నితరులు గారు
సూర్యచంద్రవిద్యుత్ప్రభాశుచులఁ దక్కఁ
దమ మడంగునె తమముచేత నరనాథ. ౨౬౩

క. మాయేశ్వరివై సంవి
త్తై యలరుచు స్వప్రకాశ మలవడునంబన్
బాయక కొలువందగు న
మ్మాయాగుణ మాగుపొంటె మానవనాథా. ౨౬౪

క. ఇది వృత్రాసురహరణము
మొదలుగ నీ వడుగు ప్రశ్నముల కుత్తర, మి
య్యది యీ పురాణమునకుం
బొదలుఁ బూర్వార్థమగుచు భూపవతంసా. ౮౬౫

క. ఇందెల్లయెడల నప్పర
సుందరి మహిమమ్ము వొలుచు సొలవక దీనిన్
మందుల కిడఁ దగ దియ్యది
విందగుఁ బరశక్తి భక్తి వివశులకెల్లన్. ౮౬౬

వ. ఇయ్యది భక్తునకును శాంతునకును శిష్యునకును జ్యేష్ఠపుత్త్రున కును నొసంగఁదగు రహస్యమ్మును వేదతుల్యమ్మును సకలకథా సారమ్మును సత్ప్రమాణానువిద్ధమ్మునునగు పురాణంబు దీని భక్తి యుక్తుండై పఠించు నరుండు జ్ఞానియు ధనియుం గాఁగలఁ డని వ్యాసుండు జనమేజయునకుఁ జెప్పెననుటయు.

—* ఆశ్వాసాంతపద్యములు *—

చ. అనుపమశాస్త్రవిత్త్వవినయాదివిభాసుర ! భూసురాగ్రగ
ణ్యా ! నమదనేకశిష్యజననందనచందనవృక్ష ! ధర్మవ
ర్ధనచరితాలవాల ! విబుధప్రకరస్తవనీయకీర్తిభా
జన! జననాథమౌళివిలసద్పదపద్మ ! మహామహోన్నతా ! ౮౬౭

క. అంగజవైరిశిరస్సం
సంగిధునీభంగభంగసంధానచణా
భంగురవాగ్విజితప్ర
సంగికజనసార్వభౌమ ! సన్నుతనామా.

మాలిని. వితరణగుణశాలీ ! విద్వదంభోజహేళీ !
కృతసుకృతవిశేషా ! కేవలాద్వైతభూషా !
నతదురితవినాశా ! నవ్యకీర్తి ప్రకాశా !
ధృతిసతతశరణ్యా ! ధీరవారాగ్రగణ్యా !

గద్య.

ఇది శ్రీ......తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బయిన దేవీభాగవతంబను మహాపురా
ణంబునందు షష్ఠస్కంధము
సంపూర్ణము.
శ్రీమత్పరదేవతార్పణమస్తు

శుద్ధపత్రిక

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
5	2	చీకు	చీఁకు
19	1	ర్గురు	ద్గురు
12	16	నగాథ	నగాధ
24	14	ప్రిధిత	ప్రథిత
30	8	బేల్లకో	బెల్లకో
41	22	దత్తగపాటు	దత్తఅపాటు
43	2	చంపఁదొరకొండు	చంపవొరఁకొండు
45	7	లేడని	లేఁడని
50	5	వీరలజంపు	వీరలఁజంపు
59	16	నినుబోటి	నినుబోఁటి
64	8	గాఁని	గాని
70	17	మండెడి	మఱదెడి
78	2	మతిఁదప్పి	మతిదప్పి
85	12	డవ్వాఁడె	డెవ్వాఁడ
87	6	మీాదఁ	మీాఁద
87	17	నెంతఁ	నెంత
92	12	శ్లోకాబ్ది	శ్లోకాబ్ధి
97	5	శ్లోకార్థం	శ్లోకార్ధం
97	20	నరయము	నరయుము
100	23	యిచ్చోటు	నిచ్చోటు
110	18	మజేయబు	మజేయంబు
111	21	ద్యుతిఁ	ద్యుతి
1`:4	11	మీాబోట్లిం	మీాబోఁట్లిం
·41	11	నర్వజ్ఞ	సర్వజ్ఞ
154	22	నాలుహేడు	నాలుగేఁడు
ɜ59	21	గలుఁగఁగ	గలుగఁగ

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు
164	2	గూఁతుఁ	గూఁతు
165	6	కలికిఁ	కలికి
166	18	ధాత్రియు	ధాత్రియు
176	12	మఱునాఁడుఁ	మఱునాఁడు
179	14	యందుఁగతుం	యందుగతుం
181	2	సమాధిఁ	సమాధి
181	2	వలుకడఁయొ్య	వలుకఁడయొ్య
189	14	థనంబు	ధనంబు
195	4	దేశమ్ములు	దేశములు
195	16	గలఁదాన	గలదాన
198	8	జన్మమునకు	జన్నమునకు
200	23	దుఁఖంబు	దుఃఖంబు
204	10	వూజ	పూజ
216	2	జూఁడ	జూడ
223	14	గలుఁగు	గలుగు
225	2	దృటుల్	దు్రటుల్
225	4	వచింతుల్	వంచితుల్
227	22	చేకూఱె	చేకూరె
229	2	న నే	నేన
235	14	కరఁయుగ	కరయుఁగ
236	13	పాయుపస	పాయూపస్థ
237	7	దృఢికృత	దృఢీకృత
248	7	తద్దులు	తద్జ్ఞులు
249	14	నేడు	నేఁడు
266	17	శత్రజిత్తు	శత్రుజిత్తు
269	13	నిఁజాంగ	నిజాంగ
269	17	వీరు ! డిట్టు	వీరుఁడిట్టు
276	12	కెతింగింపు	కెఱిఁగింపు
277	1	యతండు	నతండు
288	23	డగుచు	డవగుచు
291	18	బొవర్చి	బొనర్చి
302	12	తల్లిఁదండ్రి	తల్లిదండ్రి

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
305	1	పలువురితో°	పలువురతోఁ
322	18	నిత	నింత
344	18	ఢీర	ధీర
347	12	మన్నిఁటికి	మన్నిటికి
354	21	నిశీథమ్ము	నిశీధమ్ము
416	14	రసకున్	రలకున్
423	14	శిఁవుడు	శివుఁడు
428	6	దురతఁత	దురతఁద
467	9	దటిగి	దటీఁగి
487	21	ద్దైర్య	ధ్థైర్య
488	18	దద్దైర్యం	దధ్థైర్యం
520	8	లింతద	లింతత
537	14	మూడు	మూఁడు
544	8	యెన్నఁటికి	యెన్నటికి
558	13	చించుఁ	చించు
559	10	యొకింప నొడ	యొకింత తోడ
561	21	కుంద దే	కుంద వే
572	15	బ్రిహ	బ్రిహ్మ
585	15	శిని	నిశి
588	20	దుర్జే	దుర్జ్ఞే
616	9	యుఁతద్వి	యుఁదద్వి
631	9	యదా	యథా
643	22	బ్రిహ్మ్య	బ్రహ్మ
667	12	వథిం	వధిం
677	17	దద	దళ
716	12	గృవ	గృప
759	7	దమ	మద
763	4	దమ	మద
766	14	దమ	మద

ఇంకను, థ, ధ ; ఱ, ర ; వ్యత్యయములు పడియుండవచ్చును. 'పడఁపడి' పొర్లబిందుకముగా గొన్నిచోట్ల పడినది.